
18823

మా హృదయపూర్వక ఉగాది అభినందనలు



ఇండియాలో తయారైన మొదటి లాంపు "బెంగాల్" లాంపులు, 1932 నుండి తమ శ్రేష్ఠతను స్థిరపర్చు కొనటమే, ఉత్పత్తిలోని ప్రతి దశలో నిశిత పరీక్షలకు గురిచేయబడి, మీకు ఎక్కువ కాంతి, ఎక్కువ మన్నిక యివ్వగలుగు చున్నవి. బెంగాల్ లాంపులందు మీకు నచ్చినవి ఎన్నుకొనటకు వీలుగా అనేక రకములైనవి గలవు. ప్రస్తుత దేశావసరముల దృష్ట్యా, ప్రతి ఏటా [illegible] లాంపుపై ఆధారపడవచ్చు.

బెంగాల్

ఇండియాలో తయారైన మొదటి లాంపు


ఆంధ్ర ప్రదేశానికి సోల్ ఏజెంట్లు:

జి. ఏ. పరశురాం అండ్ కో.,

నిలోఫర్ హాస్పిటల్ రోడ్, లక్‌డికాపూల్, హైదరాబాద్-4.

తప్పక చూడండి!

జీవంలేని శిల్పాలకు
ప్రాణదానం చేయవచ్చు,
వర్షించని మేఘాలనుంచి సైతం
కుంభపోతలు కురిపించవచ్చు
అంతేగాని, స్త్రీ మనసు
మార్చటం అసంభవం!







డి.వి.యస్. ప్రొడక్షన్స్

తిక్కశంకరయ్య

దర్శకత్వం: డి.యోగానంద్ నిర్మాత డి.వి.యస్.రాజు

ఆంధ్ర-సీడెడ్: విజయ • నైజాం: ఉషా • మైసూరు సదరన్ మూవీస్

VIJAYA

ఆంధ్రపత్రిక

కీలక సంవత్సరాది సంచిక

[ఏబది ఎనిమిదవ సంచిక]

[1968-69]



సంపాదకులు:

శివలెంక శంభుప్రసాద్




వెల రూ. 3

ఆంధ్రపత్రికా కార్యాలయమున ముద్రితము.

Supplement to Andhra Patrika issue dated 29 3 1968 (Regd No M1118)

జలుబులను నివారించే మరో దివ్యమైన శక్తి



అనోలియం

ఇతర ఔషధాలకంటె బహుధా ప్రయోజనకరమైనది.

శీఘ్రగతిన విముక్తి
శరీరంలోకి వేగంగా ప్రవేశిస్తుంది.
బాధాకరం కాదు
ఎక్కువగా అంటదు.
మెత్తనిది
పసిపిల్లల సుతి మెత్తని చర్మానికికూడా ఉపకరిస్తుంది.

అనోలియం ఎలా వాడాలి ?

1. గుండెమీద రాయటం
2. ముక్కుకు అటూ, యిటూ రాయటం
3. మెడమీద రాయటం
4. అనోలియంను వేడినీటిలో కరగించి, దాని ఆవిరి పీల్చటం,

జలుబు చేసేవరకు ఆగకండి— నేడే అనోలియం కొనండి

సంచిక 58

కీలక సంవత్సరాది సంచిక

సంవత్సరము 1968–69


విషయానుక్రమణిక

త్రివర్ణ చిత్రములు :

Advertisers' Index

ఆబాలగోపాలాన్నీ

అత్యంతంగా ఆనందింప చేస్తున్న ఉత్తమ చిత్రం!



ఓమ్

ప్రస్తావన

ఒక సంవత్సరం గడిచి ఇంకో సంవత్సరం వచ్చేసింది. ప్రకృతి కూడా హేమంత శిశిరాలలో ఆకు రాల్చుకొని, కొత్త ఆకు తొడిగి, పుష్పించి, ఫలోన్ముఖం అవుతోంది. వసంతం ప్రవేశించింది. అది ఆ ప్రకృతి సహజగుణము, నిసర్గలక్షణము.

మానవుల విషయంలో ఇటువంటి పరివర్తనం వర్తమానం కావడానికి రెండు కలిసిరావాలి. ఒకటి పురుషకారము; రెండవది దైవము.

ఈ పురుషకారాన్ని, ఈ దైవాన్ని ఇంకోవిధంగా చెప్పినప్పుడు, ఒకదానిని వ్యుత్పన్నత, రెండవదానిని ప్రతిభ అని చెప్పుకోవచ్చు.

ప్రతిభ వ్యవసాయంవలన రాదు. వ్యుత్పన్నతకు వ్యవసాయం ఒక్కటే పద్ధతి. వ్యుత్పన్నత వున్నప్పుడు ప్రతిభ రాణిస్తుంది. తీక్ష్ణం అవుతుంది.

ఈ ప్రతిభ అన్నది అందరిలోను నిద్రాణంగా వుంటుంది. అవ్యక్తస్థితిలో వుంటుంది. దైవం కలిసి వచ్చినవారిలో అది వ్యక్తస్థితిలోవుండి, ప్రయోజనకారి అవుతుంది.

అవ్యక్తప్రతిభులే సహృదయులు. వ్యక్తప్రతిభులు సాహిత్యకారులు మొదలైన సృష్టికర్తలు, జిజ్ఞాసువులు — (Intellectuals)

ప్రతిభతోపాటు వ్యుత్పన్నత కూడా వుండాలి అది పరిశ్రమైక లభ్యం. ఇచ్చట విలోకనం, వివేచన పద్ధతులు.

ఈ లక్షణాలు, ఈ మార్గాలు లేనిచోట ప్రతిభ వుండి, అది దరిద్రుని గృహంలాగా శోభలేక కృశించి, జాడ్యగ్రస్తం అవుతుంది.

తెలుగు ప్రపంచం యీ స్థితిలో వున్నదన్నప్పుడు ఎవ్వరికీ కష్టం కలగవలసిన అవసరం కన్పించదు. ఆత్మ అధ్యయన రిరంసువులకు అందరికి ఇది తెలుసు. తెలిసి కూడా బుకాయిస్తామంటే, అది ఇంకో దారిద్ర్యం.

ఇందుకు కారణం మన జిజ్ఞాసువర్గం జడను పడి, ముందుగతి కానలేని స్థితిలో వుండటం. అనగా అప్రతిభము, అవ్యుత్పన్నము అయిపోవడము. విచిత్రం ఏమంటె, ఈ జాడ్యానికి మతము, సంప్రదాయము, పురాసభ్యతలేగాక, అధునాతనభావ ప్రపంచాన్ని అవగతం చేసుకోలేక, పురాతత్వాన్నిగురించి మన్ననలేక, ఈ రెంటికి జరుగుతున్న సంఘర్షణలో వుండికూడా, దానిని అనుభవించి, మథించి, సమ్యక్పద్ధతిని,—సముద్ర మథనంలోంచి అమృతాన్ని సృష్టించుకున్నట్లు—సృష్టించుకోలేక, నిష్ప్రయోజకమైన తిరుగుబాటు తత్వమే నాగరక లక్షణము, అభ్యుదయము అనుకునే వృథాతత్వం కూడా ఇందుకు కారణం కావడం.

అదే విచిత్రం, ఇచ్చట ప్రతిభకు జాడ్యాన్ని పట్టించి, త్రిశంకుస్వర్గాన్ని అటూ ఇటూ కూడా సృష్టిస్తున్నది. ఈ త్రిశంకు స్వర్గాన్నే వైజ్ఞానిక వైభవంగా భావించేవాళ్ళు వుంటే, అది వాళ్ళు చేసుకున్న పురాకృత కర్మఫలం అని వూరుకోవలసిందే.

శ్రీ నీరదచౌధురి ఇట్లా వ్రాశారు: "పాశ్చాత్య సంస్కృతి సభ్యతలయొక్కయు, భావ ప్రపంచం యొక్కయు ప్రభావం భారతదేశంయొక్క సభ్యతతో, నాగరికతతో కలిసి ఒక రకమైన మానసికమైన అభివృద్ధిని, సాంస్కృతిక అభ్యున్నతిని తెచ్చిపెట్టింది. ఇది ఏదో బలవంతంమీదవచ్చిన, తెచ్చిపెట్టుకున్న పద్ధతి క్రింద తయారైంది తొలుత ఇది బలుపుగానే కన్పించింది; హఠాత్తుగా వచ్చిన బలుపు వాపుక్రింద పరిణమించవచ్చు పరిణమించింది. భారతదేశంలో జిజ్ఞాసువర్గం సాధించింది ఏమన్నావుంటే, అది గారడే; అక్కడికి అక్కడ మామిడిచెట్టును మొలిపించి, అక్కడికి అక్కడ కాయలను కాయించినట్లు తయారైంది ఈ పద్ధతి వలన బలుపునకు బదులు అలుపు పుట్టి, అంతా చెడిపోవడానికి మార్గం మాత్రమే ఏర్పడింది......పాశ్చాత్య సాంకేతిక విజ్ఞానం వున్నదంటే, దానిని పాశ్చాత్య ప్రమాణాలతో చూస్తే, అది భారతీయులను మరింత జిజ్ఞాసువులనుగా దిద్దలేదు......భారతీయులకు సంబంధించినంత వరకు ఈ సాంకేతికవిజ్ఞాన ప్రభావాలు ఆ తత్వరహితాలై, పిండిలేని రొట్టెలవతుగా తయారైనాయి భారతదేశంలో, అవి, వానివియైన శాస్త్రీయ ప్రాతిపదికను విడాకులు ఇప్పించిననతుగా పరిణమించాయి. అనగా శాస్త్రీయ విచారణకు దూరమైపోయినవైనాయి."

NIKETANAM

ఈ లక్షణాలను ఇప్పుడు దేశంలో సర్వత్రా చూస్తున్నాము. జిజ్ఞాసు జీవితానికి సంబంధించిన సర్వ రంగాలలో ఇవి విద్యమానం అవుతున్నవి. ప్రతిభకు ప్రతిభ ఎండిపోతూ, అకృతపరిశ్రమత్వమే శ్రేయం అయి, అను వాదతత్వం ప్రబలమై, సహజస్థితిలేక, నిసర్గలక్షణం పెంపొందక, కృత్రిమ భావ జగత్తులు ఏర్పడి, గడ్డి ధట్టించిన వ్యక్తులను, ఏవో అదృశ్యశక్తులు ఆడిస్తున్న వతుగా జిజ్ఞాసువులము అనుకునేవాళ్ళు, వారిచేత ప్రభావితు లవుతున్నవాళ్ళు కూడా వ్యవహరిస్తున్నారు.

పాతకాలపు విజ్ఞాన సంపత్తే సార్వకాలికమైనట్టి దన్న పిడివాదంతో సమాజంయొక్క, జనజీవితంయొక్క సహజఅభ్యున్నతిని అరికట్టుతున్నవాళ్ళ వున్నట్లే, ఏదో సిద్ధాంతాన్ని పట్టుకొని, దాన్ని తర్జుమాచేసుకొని, ఆ తర్జుమా సిద్ధాంతంవల్లనే లోకానికి పూర్తిమరమ్మతు జరిగిపోతుందన్న పిడివాదంతో సహజ అభ్యున్నతికి భంజకంగా వ్యవహరిస్తున్నవాళ్ళూ వున్నారు. ఈ రెండు వర్గాల సంఘర్షణ, సమన్వయానికిగాక జడిమకు దారితీయడం, మేధాసంబంధమైన దారిద్ర్యానికి గుర్తు.

పిడివాదాలు, పురస్సిద్ధాంతాలు నిజమైన తాత్విక విజిజ్ఞాసకుగాని, మానసిక అభ్యున్నతికిగాని మార్గాలు కావు. పాతపిడివాదాలు ఏవిధంగా అచ్చమైన విజిజ్ఞాసకు విరుద్ధాలో, కొత్తపిడివాదాలుకూడా అదేవిధంగా విరుద్ధాలు. ఈ రెంటి నడుమ బుద్ధి, జ్ఞానం, సమ్యక్ దృష్టి నలిగిపోతున్నాయి.

ఇదీ ఇప్పుడు దేశంలోవున్న పరిస్థితి. దీనివలన వస్తూవున్న బాధ ఏమిటో దేశం చూస్తూనే వుంది; అనుభవిస్తూవుంది. దేశం అంతటా ఒకరకమైన అవ్యవస్థ వ్యాపిస్తూవుంది. ఇచ్చట వసంతంలేదు. ఆకు తొడగడము, పూవు పూయడము, ఫలించడము అన్నది లేదు. ఇచ్చట వ్యుత్పన్నులము అవుదాము, ప్రతిభను పండించుకుందాము అన్న ఆలోచనా, కృషీ లేవు. ఆ ప్రతిభ అన్నది ఏమన్నావుంటే అది వ్యక్తిస్తున్నది. అది పండటంలేదు. నీటివసర్నులేని పంట పొలంవలె అయిపోతున్నది. ఈ స్థితి ఎందుకు సంప్రాప్తమైంది అని ఆలోచిస్తే ముందు దారి ఏమిటో కన్పించవచ్చు. ఆ ఆలోచనచేసే ఓపిక కూడా ఇచట వున్నట్లులేదు.

కొందరు ఈ అవ్యవస్థలోంచి నిర్మాణం జరుగుతుందన్న పద్ధతిలో ఆలోచిస్తున్నారు. వైక్లబ్యాన్ని ప్రోత్సహిస్తున్నారు. లయంలోంచే సృష్టి అన్నవాదం కలవాళ్ళుగా వీరు గోచరిస్తారు. ఇచ్చట పురుషకారము, ప్రతిభా కూడా దుర్వినియోగం అవుతున్నాయి.

దేశం నావికుడు లేని నౌకలాగా అయోమయ సముద్రంలో పడి నడుస్తున్నది.

ఈ స్థితినుంచి ఆ నౌకను రక్షించాలంటే జిజ్ఞాసువర్గం మేలుకొని, ఆత్మప్రబోధం చేసుకొని, అసహజ స్థితినుంచి సహజస్థితిలోనికివచ్చి, తల క్రిందపెట్టికాక, కాళ్ళు నేలమీద ఆన్చి, ఆలోచన అనే నడకను సాధించాలి అంతా వేదంలోనే వుంది అనే పద్ధతి ఎంత మూఢమో, అంతా ఏదో ఒక సిద్ధాంతంతోనే వున్నదనడం కూడా అంతే మూఢం కళ్ళకు కన్పిస్తున్న పరిస్థితులు ఆధారంగా సమ్యక్ పద్ధతిలో ఆలోచన చేయగల్గితే, అప్పుడు ప్రతిభకు ప్రతిభా రాణిస్తుంది; వ్యుత్పత్తి సాధనయందు నిష్ఠ అధికం అవుతుంది.

ఇది అన్నం తిని అన్నం అరిగించుకొనడంవంటిది. ఇది కానిది అసమఆహారాన్ని భుజించి, అజీర్ణం తెచ్చుకొనడంవంటిది. ఒకటి స్వాస్థ్యము; రెండవది జబ్బు. ఒకటి ప్రతిభావ్యుత్పత్తుల వికసనానికి వసంతము; రెండవది విరుపులేని గ్రీష్మము; ఎడతెగని అనావృష్టి.

మన జిజ్ఞాసులోకం ఈ విషయాన్ని గ్రహిస్తుందా? విచారధారా ప్రపంచంలో వసంతశోభ ఆవిర్భావానికి దోహదకారి అవుతుందా?

ఇదే ప్రశ్న, ఇదే కీలకం.



అహల్యాశాప విమోచనం — శ్రీ కొండపల్లి శేషగిరిరావు.

షష్టిపూర్తి

శ్రీ శనగన నరసింహస్వామి

హేలగఁ బూర్తియయ్యెఁగద యిప్పటి కీవరుదెంచి షష్టి వ
ర్షాలపు డీ వొసంగినది సౌఖ్యమొకాక దురంతదుఃఖమో
తేలిచి చెప్పరాదిపుడు దీనతఁ జెందిన విశ్వధాత్రికిన్
గీలక! వత్సర ప్రవర! కేవలభద్ర మనుగ్రహింపుమా!

మల్లిగ నిష్క్రమించినది
మిశ్రఫలం బొసగూర్చి కించి దు
త్ఫుల్లవిషణ్ణ వక్త్రరుచి
తోడఁ బ్లవంగము విప్లవంబులన్
దల్లడమందఁజేసి జన
తామతిఁ దచ్చరణాంకితోర్విపైఁ
జల్లఁగఁ గాలు మోపితివి
సర్వశుభంబులు గుమ్మరింతువే!

కోకిల కాకలీధ్వనులకున్ జెవియొగ్గక దక్షిణానిల
స్వీకృతికోస మంజలి రచింపక కష్ట చతుష్పథంబునన్
మూకత నిల్చి దిక్కులు కనుంగొన సాగిన మానవాళికిన్
నీ కనుదోయి వెన్నెలల నిక్కపుమార్గ మెఱుంగఁజెప్పుమా!

అరువదిమంది సోదరుల
అట్టి కుటుంబమువాడవైన నీ
పరువును సంశయించుటకు
భావము సమ్మతిఁ జూపఁజాల ద
బ్బురమగు నీ వయస్సు నను
భూతి విశేషములెంచి నీకు మా
కొఱకయి మేమె స్వాగతముఁ
గూర్చితి మెట్లు దయన్ వెలార్తువో!

సభ లొనరించి సత్కృతులు సల్పి యధావిధిగాగ నీకు మే
మభిరతి "షష్ఠ్యబ్దపూర్తి" సుమహంబు ఘటించితి మింకముందు
విభవము సెల్లుగాక! పృధివీతలమందు క్షణక్షణంబు మా
కభయ మొసంగుగాక! భవ దప్రతిమాన గుణప్రతానముల్

ఉగాది గీతావళి

డా. బొడ్డుపల్లి పురుషోత్తం

శ్రోతలకున్ మిన్నగా జాతి హితముగూర్చు
సార సారస్వతమ్ము ప్రశస్తి నందఁ
గాంక్ష చేసె మహాకవి కాళిదాసు
చిర తపస్సుగ దాని రక్షింప నోపు.

కుల మతమ్ముల పేర సంక్షుభిత మగుచు
ఆత్మ నాశమ్మునకును ఆయత పడిన
భరత జాతికి విశ్వభావమ్ము, ప్రగతి
ఎపుడు చేకూర్చునదియు సాహితియె సుమ్ము!!

ఎవఁ డనుద్వేగకరమును, హితము, ప్రియము,
సత్యమై న వాక్యము నుపాసన మొనర్చి
సతము స్వాధ్యాయ నిరతఁడౌ, అతఁడెయగును
వాఙ్మయ తపస్వి, గీత చెప్పంగ వినరొ!'

శూన్యమతులైన కవుల వాఙ్మయము సొగసు;
జనుల వాడుకలోని భాషా విశేష
మహరహమ్ము నేకాగ్రత నరయు విబుధ
మండనుఁడు నాదు దృష్టి వాఙ్మయ తపస్వి.

నరు డధీతి బోధాచరణ ప్రచార
ములను గ్రమముగఁ గల్గి సంపూర్ణుఁడగుట
కుద్యమింపంగ వలయు సత్యార్జితముగ,
అపుడె జీవిత మానంద యాత్ర యగును.

సకల ప్రకృతితోడ సామరస్యంబును
గలిగి బ్రతుక నేర్వవలయు నరుఁడు,
అవసరమ్ము పట్ల నఖిల విజేతగా
చాటి చూపవలయు శౌర్యమహిమ.

కళల కన్నిటం దలమానికముగ నెగడు
కళ జగమ్మున జీవితకళయొ గాన
దాని సంతత మేకాగ్రతను భజించి
తత్కళాపూర్ణులై ప్రజల్ తనరవలయు.

చేతనా చేతనముల సంస్థితి వహించి
ప్రకృతి సర్వమ్ముం బులకాంకురముగం జేయు
ప్రణవ మంత్రమ్మునే యుపాసన మొనర్చి
యమృత పుత్రులు కావలె నఖిల జనులు.

అఖిల భోగానుభవ సమగ్రానుభూతి
భవ్య వాత్సల్య జనితమౌ ప్రమదమంది
చరమ జీవితమందు వాంఛల జయించి
స్వీకరింపంగ నొప్పు నివృత్తి సుఖము.

బుద్ధదేవుండు, శంకర పూజ్యపాదుం
డేసుక్రీస్తు, మహమ్మదు నేకరీతి
మాననీయులె యీ నాటి మానవులకు.
భావభేదమ్ము కూడ దెవ్వారిపట్ల.

ఆర్యఋషికున్న విమల విశ్వాత్మదృష్టి,
శాక్యముని కున్న కరుణావిశాలహృదియు,
శంకరజగద్గురుని సూక్ష్మశక్తి యుక్తి
యున్న వాండెపో!! భారతీయుం డనంగ.

కర్మ భూమి యంచు కాంచె ప్రఖ్యాతిని
భరతభూమి యీ ప్రపంచ మందు,
అట్టి పుణ్యభూమి నావిర్భవించిన
[illegible] భాగ్యశాలి వీవె.

స్వచ్ఛమైన వాక్కు, అచ్ఛమౌ హృదయమ్ము.
తిన్ననైన నడ, ప్రసన్నమతియు,
నీతి, నియమములును, పూత చరిత్రమ్ము
[illegible] తెలుగుజాతి మానత నిల్పు.

ఉత్తరాదివార లుద్రిక్తులు, మనీష
వాడి దక్షిణాది వారలందు,
నిశిత మేధతోడి నిర్మల హృదయమ్ము
కల తెలుంగు వారి కలిమి, కలిమి.

శిల్పి, గాయకుండు, చిత్రలేఖకుడును,
కవియు, తత్త్వవేత్త గాగ నీవె,
సకల శాస్త్ర మహిమ సమకూరె నీకునై
ఆక్రమింపుమీ! త్రివిక్రముడుగ!!

ద్వైతి వగుదువు దేహ భావమ్ము చేత,
జీవిగా నీశ్వరాంశ విశిష్టుఁ డగుదు,
ఆత్మభావన నద్వైతి వగుదుకాన
ద్వైత మద్వైతముల నిట్లె వలయు తెలియ.

వలయు నద్వైత సిద్ధి భావమ్ము నందె,
తగదు పాటింపగా క్రియాద్వైత మెపుడు,
ద్వైత మద్వైతములఁ గల్గు ప్రాభవముల
వ్యక్తి గుర్తించి ధన్యత బడయు టొప్పు

విశ్వభావనమ్ము, విశ్వజనీనమౌ
నిశిత దృష్టి, తీర్పు, నేర్పు, వడసి
అఖిల మతములందు, అన్ని ధర్మమ్ముల
గౌరవ గల్గి సత్య మరయు మోయి!!

ఆ మహాత్ముఁడు గాంధి సత్యమ్మునందు
చిరతర తపస్వి యరవిందు శివమునందు
అల రవీంద్రుని సుందర విలసనమున
భక్తి విహరింపు స్వేచ్ఛగా భరతపుత్ర!!

అరయ సత్యమ్మె, శివము, సుందరము నగును:
సుందరమునె, సత్యము శివ మందు రార్య
లట్లె, శివము, సుందరము, సత్యమ్ముగాగ
సత్య శివ సుందరములు నిజాని కొకటె.

మనసు, వాక్కు, కర్మలను త్రికరణముల
మనసు, సత్య భావమయముగాగ
కర్మ, శివమయమ్ముగా సాగవలయును;
వాక్కు, సుందరముగ వరల దగును.

జ్ఞానశక్తి యఖండమై సత్య మొసఁగు
స్థిరతరమ్ము క్రియాశక్తి శివముఁ గూర్చు
సురుచిరేచ్ఛానుశక్తి సుందరత నిచ్చు
నీవెగా త్రిమూర్తివి! త్రివేణివి!! యెఱుంగ

మాదు ధీశకి దేవా! ప్రచోదితమయి
భద్ర భావాళితో జగద్వ్యాప్త మగుత!!
సకల మానవ మానస సరములందు
సత్య శివ సుందరాబ్జ ప్రశస్తి యగుత!!

మాకు తేజస్సు గూర్చు, నమస్కరింతు!
మాకు నోజస్సునిమ్ము నమస్కరింతు!!
మాకు వీరమ్మొసంగు నమస్కరింతు!!!
ఏడుగడ వౌచు మమ్ము కాపాడు దేవ!!

కీలక స్వాగతము

శ్రీ బెళ్ళూరి శ్రీనివాసమూర్తి

ఎన్ని పరివర్తనములొందె ఋతు వితాన మెన్ని సుఖదుఃఖముల నటియించిపోయె
కాలచక్ర భ్రమణ లీల కనులువిప్పి కాంచుచున్నాడు మనుజు డగాధ సృష్టి!

నీకున్ స్వాగతమిచ్చెడిన్ మధురవాణిన్ బిల్చి వాసంత శ్రీ
లాకౌతూహలవృత్తి కోకిలము — నీ లావణ్యమున్ జల్లి యీ
లోకంబెల్ల హసన్ముఖోజ్జ్వలముగా రూపొందగా జేతువో
వీకై వేచెను డెందముల్ ముదమునన్ విందింపవే కీలకా!

అది నిరుపేద యేడ్పు, హృదయ ద్రవమై స్రవియింపసాగె నే
కొదవలు వానియింట కనుగూర్కగ నీయవొ — పూరిపాకల
భ్యుదయ వికాసమున్ బొరయవో నవమోహనతావకీన దృ
ఙ్మధు కలశమ్ము జల్లి యొక మంజుల శోభ వెలార్పు కీలకా —

అదిగో కర్షకమూర్తి — దీప్తిదిగు సాయాహ్నంబుగా దోచుచున్
చదలన్ చూడ్కినిగుడ్చు మేఘము నిరాశావహాలగా తూలగా
నెదలో గ్రుంగు — విలంబ మేమిటికి రానిమ్మింక కారుణ్య సం
పదకున్ తావలమైన నీ సుముఖభావ ప్రావృడంభోదమున్!

కనుగొలకుల్ విషాద జలకమ్ముల నార్చు జగద్ధితైక శ్రీ
లిని దిలకింపు మెన్నడు చలింపని స్వీయహృదంతరమ్ము కా
ల నియతి దూల — దుర్భర జరాభర దూషితమైన జీవిత
ధ్వనుల లయింప, శిష్యతతి దాపునజేర్చి సుబోధ సల్పెడిన్

అతి విస్తరముగ లోకపు గతి దెలుపగనేల కీలకా, సర్వము ని
మతి కెఱుకపడిన విషయమె బ్రతికింపుము, తుదిని జూచు బ్రదుకులనెల్లన్

లేదు, నిజమ్ము నిన్నడుగ లేదు మహత్తర రాజభోగ వాం
ఛాదులు — పూర్వ సంస్కృతి తనంతనజారి యధర్మవృత్తి లో
కాదర పాత్రమైన చెడుకాలము గన్గొన ఘోరతోర్వరా
శ్రీ దురితాత్మకుల్ చెఱచు రీతి సహింపనిదయ్యె కీలకా!

వినబడె కీలకా, చెవుల విందుగ నీ రథ నిస్వనమ్ము తద్
ధ్వనులు దిశాముఖంబులకు దాకిన, ప్రాణము లేచివచ్చె, నీ
యనుపమ వత్సలత్వమున కాత్మసమర్పణ మాచరింత్రు, క
మ్మని గళమెత్తి పాడి నిను మార్గమునన్ గని సత్కవీశ్వరుల్
నిను నవాబ్ద మటంచు మన్నించి కొల్చి ప్రజలు నీరాజనముబట్టి భక్తి నరతి
స్వాగతము వల్కువారు — ప్రక్షాళనమ్ము సేయవే పాపపంకిల క్షితి —యశస్వి!

ఉగాది

శ్రీ ఇంద్రగంటి భానుమూర్తి

శ్రీ న్యయౌవనావతరణంలో లావణ్య దీపం
గప్పున వెలిగిన క్షణానికీ,
మింటి చీకటి నడుమలో ఎత్తుగా, చల్లగా చాంద్రీతోరణం
ప్రేలిన సమయానికీ,
నిరాశా శూన్య నీరవ ప్రపంచంలో మధు కంఠరవం
మ్రోగిన తరుణానికీ,
ప్రొద్దు ముంగిట పచ్చని ముగ్గు పరిచిన నిమిషానికీ,
వ్యధిత హృత్ శిరస్సుల మీద అదృశ్య దేవతలు
పూల దీవెనలు వర్షించిన దినానికీ,
రెక్క విప్పిన వెచ్చని వెలుగుకీ,
దివ్వె పట్టనక్కరలేదు—
వర్ణించి చూపించ నక్కర లేదు—
పసి మనస్సుకీ ఇదిగో ఇదియని విప్పి చెప్పనక్కరలేదు—

* * *

అశోకు డెక్కడ చెట్లు నాటించిందీ
ఎన్ని శాసనాలు వేయించిందీ,
స్వర్ణయుగాలు ఎవరెవరు వెలిగించిందీ,
చరిత్ర ఏమి బోధించిందీ,
సైన్స్ ఏమి సాధించిందీ,
మనది పురోగమనమా, లేక తిరోగమనమా,
మన దేశం మన గొప్పతనం, మన శిల్పాలు, మన శిధిలాలు,
నీతీ, నిజాయితీ, న్యాయం, ధర్మం
వీటి వేటిని గురించీ ఉపన్యసించ నక్కరలేదు—
ఇప్పుడు—

* * *

ఇది చెప్పు
ప్రతి మనిషి మనస్సులో ఉత్సాహం పచ్చని కొమ్మై
ఊగుతుందెప్పుడు?
ఇది చెప్పు

అడుగడుగునా వాడుమొగంతో తగిలే సాదామనిషి కళ్లల్లో
హాయిగా చిరునవ్వుమువ్వ టింగున మోగుతుందెప్పుడు?
ఇది చెప్పు
ఏ మంచి ఉషస్సులో, ఈ మిన్నంతా నిండి మానవతాపతాకం
మెత్తగా మెరుస్తుందెప్పుడు?
ఆనాడు పువ్వు పువ్వుగా తోచిన రోజు—
ఆనాడు నువ్వు నువ్వుగా విడిచిన రోజు—
అది కొత్త పాటకి పునాది
అది మానవజాతి తలపై ఆహ్లాద మణికిరీటం, వికసించిన యుగాది
అది ప్రతి ప్రాంగణంలోకి వాసంత సమీరం ప్రసరించిన ఉగాది!

కీలకమ రమ్మ రమ్మ మమ్మేలుకొనంగ!

శ్రీ అయ్యగారి నరసింహమూర్తి

కల్లు త్రావిన మత్త మర్కటము రీతి
వికృత చేష్టల జనులను వెతలఁబెట్టి
పరిహసించెను, వఱచె ప్లవంగ వత్స
రమ్ము సార్థక నామధేయమ్ముతోడ

నీదు రాకను గనినంత మోదమంది
వింత సోయగములతోడ విరిసె ప్రకృతి
కూర్మితో గీతికలు పాడె కోకిలమ్మ
కీలకమ రమ్ము రమ్ము మమ్మేలుకొనఁగ.

కీలకమా! నీదు వాలకమ్మునుజూచి
నడవడి యిది యని నుడువలేము
కీలకమ్మును బట్టి వా డిట్టి వాఁడని
కలియుగమ్మున బల్కవలనుపడదు
పోవు మనుచుఁ బ్రాత, హాయినిచ్చును గ్రొత్త
యనియెంచి పులకించి నినుఁదలంచి
ముందు వారికి పోలె మోదమ్ముతో నీకు
స్వాగత వచనాలు సలిపినాము
మమ్ముచేరి మాకు నిమ్మగ భాగ్యమున్
తెచ్చి యిత్తువో మరి ముచ్చువోలె
ఉన్నదంత మ్రింగి యూరకే పోదువో
చూడవలయు నీదు జాడలింక.

కూఁతుగం బోదల్లి కొద్దియో గొప్పయో
మంచి దనెడి యొఱుక మాకుఁ జేసి

లోలకమ్ము రీతి కీలకవ్వా, నీవు
తల్లడిల్లఁజేసి తరలిపోదా!

ఏది యేమైనగాని నీ యిచ్చతోడ
కలసిరావలె మా భాగ్య కలన — ఇంక
మేలు గలిగిన మనములు హేలతోడ
శ్వాస విడుచును హాయిగా శ్రాంతినొందు

వసంతోదయము

శ్రీ రేవూరు సుబ్బారావు

ప్రశమిత విహారకాంక్షన్
శిశిరర్తువు సనియె, నద్రి శిఖరాగ్ర తుషా
ర శిలాకర్కశ పల్యం
కశయన విశ్రాంతిఁ గోరి, కదిమిన ముదిమిన్!

ముసురుగఁ బైపయింగురిసి మూఁగియలంచెడి మాఁడమంచుచే
వసమఱి వాడివత్తలయి వన్నెలఁ బాసిన పండుటాకులన్
విసుఁగున రాల్చుచున్ గృపణ వృత్తతఁ దోఁచు లతాద్రుమాదు లు
ల్లసిల వసంతుఁ డద్భుతకళాకుశలుం డరుదెంచె నల్లనన్.

వచ్చి వసంతుడు లోకము
నచ్చెరువునఁ జూడఁ గిసలయంబులుఁ బూవుం
గుచ్చులు శుభసూచనలై
యచ్చువడన్ నింబతరువులందు సృజించెన్.

చాంద్ర సంవత్సరాది ప్రశస్త పర్వ
దివసశుభలాంఛనములయ్యె ధవళ కుసుమ
మాలికాశ్రేణు లరుణాంశుజాల భరిత
పల్లవము లొప్పఁ బిచుమంద పాదపములు.

నవ గోమేధిక పద్మరాగచయ వర్ణస్నిగ్ధ వాసో గృహ
ప్రవితానంబులమర్చి ముత్తియపుఁ జేర్లంగప్పె నొక్కో వసం
త విభుం డుత్సవకేళి నెల్లెడఁ బ్రమోదంబారఁ గ్రీడింప నాఁ
జివుళుల్ గ్రొవ్విరులొప్ప నింబతరువుల్ జెన్నారఁ దోఁచెన్ ధరన్.

చిగురుటాకులు ననలుఁ గ్రొంజిగురుతెలర్పుఁ
బొదలుఁ దీవెలు మ్రాకులుఁ బొటకరించె

పెరుగుతున్న అవసరాలకు
ఉత్పత్తిశక్తి అధికం
కావలసినప్పుడు

Kirloskar కిర్లోస్కర్
మోటార్‌లు


వ్యవసాయాభివృద్ధికి తోడ్పడుతాయి!

10 హార్స్‌పవర్ వరకూ కిర్లోస్కర్-ఆసియా డైరెక్ట్-ఆన్-లైన్
స్టార్టర్‌లు, 60 హార్స్‌పవర్ వరకు స్టార్/డెల్టా స్టార్టర్‌లు మరియు
70 హార్స్‌పవర్ వరకు స్లిప్‌రింగ్ మోటార్
స్టార్టర్‌లు సిద్ధముగా నున్నవి.



కిర్లోస్కర్ ఎలక్ట్రిక్ కంపెనీ లిమిటెడ్
పోస్టుబాక్సు నెం. 1017, బెంగుళూరు-3-ఇండియా

సోల్ డిస్ట్రిబ్యూటర్లు: పారీ & కంపెనీ లిమిటెడ్
పోస్టుబాక్సు నెం. 12. మద్రాసు-1. పోస్టుబాక్సు నెం. 208 కలకత్తా-1.
పోస్టుబాక్సు నెం. 506 బొంబాయి-1 BR. పోస్టుబాక్సు నెం. 172 న్యూఢిల్లీ-1.



నుజ్జ్వలంబైన యవ్వసంతోత్సవమున
కెలిమిఁ గైసేసికొనియున్న చెలువుదోప

మత్తుగొనఁ జిత్తమానంద మధువుఁగ్రోలి
కనులఁ గాంచని దివ్యలోకములఁ దిరుగఁ
జేయునెత్తావులెగయు బూచె రవి గ్రుంకు
సంజలం దాగి వనమహోరంజనములు.

సీతనుగూడి తాను మునుజేసిన కీడునకేవగించి రో
షాతిశయంబునన్ దన సహాయముఁగోరని ప్రాణులన్ బ్రవో
దాతతమైత్రి దన్పఁ బ్రియమారఁ బ్రసన్నతనూనెనో యనన్
వీతహిమాణుభారమున వెల్వడె గంధవహుండు సౌమ్యుడై!

పోకడ - రాకడ

శ్రీ చర్ల సత్యనారాయణ

ఓ ప్లవంగమ! యీ భరతోర్విమీద
నీవు గడపిన పదిరెండు నెలలుగూడ
నరుల నెల్లర బలిమి వానరులజేసి
పేరు నిలబెట్టుకొంటివి వెళ్లిరమ్ము.

భారతదేశ మెల్లెడ బ వంగ యొనర్చిన చేష్టలెల్ల దు
ర్వారములయ్యె, నేతలు పరస్పర మత్సర పూర్ణచిత్తులై
పౌరుల నెన్నడుంబడని పాటుల పాల్పడజేయుచుండి రీ
దారుణ చర్య కంతకు ప్రధానపు గీలక మింక వెల్వడున్.

దేశమును తప్పు తోవకు ద్రిప్పజూచు
గోముఖ వ్యాఘ్రములబట్టి కూలద్రోసి
ఘనత వహింపదగు కీలకంబు దెలుప
వచ్చె కీలక నామ సంవత్సరంబు.

పాలకులు, బాలకులుగూడ పట్టుదప్పి
దేశదౌర్భాగ్యమును గోరితెచ్చినారు
వారి యాటలు కట్టించి వారి వారి
కీలెరిగి వాత పెట్టు విహా! కీలకంబ!

నా టి క

సుహృత్సుదామము

శ్రీ నోరి నరసింహ శాస్త్రి

ప్రథమ రంగము

[సుదాములవారి కుటీరము-ఆవల పలువురు పిల్లల ఆక్రందనాలు--హీనస్వరాలతో వేదపాఠాలు వల్లెవేస్తున్న విద్యార్థుల కంఠాలు. సుదాములవారు ఆనందం విరిసిన ధ్యానముద్రతో తెర ఎత్తేప్పటికి ప్రత్యక్ష మౌతారు.]

(కాపులు ప్రవేశము)

కాపులు అంతా ఒక్కసారి : దణ్ణాలు బాబులూ, దణ్ణాలు.

సుదాములు (ధ్యానభంగమై తలఎత్తి) ఏం నాయనలారా ?

పెద్దకాపు : వరసగా నాలుగేళ్లబట్టీ భూములలో ఒక్క గింజ కూడా పండడంలేదు, బాబూ !

సుదాములు భగవదిచ్ఛ ! మీకు ప్రాప్తంలేదు.

చిన్నకాపు : పండిన రెండుగింజలూ ఖర్చులకు కూడా చాలడం లేదు బాబయ్యగారూ !

సుదాములు : అయ్యో, పాపము ! మీ రెంత బాధపడుతున్నారో గదా !

చిట్టికాపు : అదే బాబయ్యగారూ!—అమ్మగోరు—

సుదాములు : ఏమిటీ ?

బుల్లికాపు : అమ్మగారే, బాబుగారు ఇబ్బంది పడుతున్నారు, ఈయేడు పండిన పంటలో సగమైనా ఇయ్యమని కబుర్లు పెట్టింద్రు బాబయ్యా !

సుదాములు . అయితే సగమియ్యలేక పోయినారా, పోనీ.

పెద్దకాపు: అయ్యయ్యో—సగమా, అయ్య బాబయ్యో? చూడండి మా పిల్లలంతా అన్నానికి కరువు వాచి ఉన్నారు. గంజి కూడా తాగడానికి లేదు బాబయ్యా ! — సగము ఎట్లా ఇచ్చేము ?

సుదాములు : పోనీ పాతికైనా ఇయ్యక పోయినారా ?

చిన్నకాపు : (పెద్దకాపుతో రహస్యంగా) ఒప్పుకోరా, ఒప్పుకోరా, అమ్మగారు వస్తున్నదేమో !

చిట్టికాపు : (పె కా.తో రహస్యంగా) ఒప్పుకొందాము. పాపము, బాబయ్యగారికి ఇల్లు గడవడం లేదు. లేకపోతే అమ్మగోరు కబురంపదు.

బుల్లికాపు : (పె.కా.తో రహస్యంగా) ఒప్పుకోరా, బాబయ్యగారు అడిగితే బగమంతుడే అన్నీ ఇస్తాడు, ఒప్పుకోరా !

చిన్నకాపు : (పె కా.తో రహస్యంగా) అప్పనురా. బాబయ్య ఇంత కబురుచేస్తే కిష్టయ్య పెబువుసేనలు మన ఇళ్లవిూదికి పంపించి మనము దాచుకున్నదంతా ఒయట పారేయిస్తాడుర్రోయి, ఒప్పుకో !

పెద్దకాపు : (కాపులతో రహస్యంగా) ఊరుకోండిరా, వీరాకేం తెలియదు కాని—(సుదాములతో) బాబయ్యా, ఖర్చులకే చాలకపోతే పాతిక ఎట్లా ఇస్తాము ! పరకకూడా ఇయ్యలేము— పొలాలు వదిలి లేచిపోదా మనుకుంటున్నాము.

సుదాములు : అయ్యో, పాపము, మీ కెంతకష్టము వచ్చింది!

పెద్దకాపు : అదే బాబయ్యా, మేముగనక వదిలి పెట్టిపోతే పొలాలు బీళ్లయి పోతవి. దేవుడంటి బాబయ్యగారి పొలాలు అన్నీ పాడయిపోతవి, అని విడిచి పోలేకుండా ఉన్నాము. బాబయ్యా !

చిన్నకాపు : (రహస్యంగా) అమ్మగారు వస్తుండదిరా, ఏదో పాతికకో పరకకో ఒప్పుకోరా !

చిట్టికాపు : (రహస్యంగా) ఒప్పుకోరా !—అదుగో రావే వచ్చిందిరా అమ్మగోరు !

బ్రాహ్మణి . (ప్రవేశించి) ఇస్తామన్న ధాన్యం తెచ్చారా ?

[కాపులు ఒకరి ముఖాలు ఒకరు చూచుకుంటారు]

బ్రాహ్మణి : ఏం, మాట్లాడరేం ?

సుదాములు వాళ్లు పంటలు పండలేదంటున్నారు, పాపము !

బ్రాహ్మణి : పంట తరిగినమాట నిజమే కాని పండలేదనేమాట అబద్ధం— పండిన పంటలో సగమిస్తామని చాలామంది ఒప్పుకున్నారు.

పెద్దకాపు . ఎవరమ్మా తల్లీ ఆ వెధవలు ?

[చిన్నకాపు చిట్టికాపు నెమ్మదిగా జారుకుంటారు]

సగంపంట ఇస్తే మా ఖర్చులు ఎట్లా గడవవి? చేసిన అప్పు లెట్లా తీరుతవి ? మళ్లీ పంటవచ్చేదాకా మేమూ మా పిల్లలూ బతికేదెట్లా ?—అయ్యో !

బ్రాహ్మణి : ఇదుగో, మీ దొంగమాటలు కట్టిపెట్టండి ఇస్తే మర్యాదగా ఇయ్యండి ఒప్పుకున్నట్టు. లేకపోతే, శ్రేష్ఠికి మీ బాకీలన్నీ అప్పజెపుతా. అతనే పిండి ఏసూలు చేస్తాడు అంతా !

[కాపులంతా గోడుగోడున ఏడుస్తారు]

ఒకరు : అయితే మేమీ ఊరువిడిచి పోతామమ్మా! మీ పొలాలు మీరే పండించుకోండి తల్లీ!

ఒకరు : మా పిల్లా బిడ్డలం పై గుడ్డలతో లేచిపోతాం!

ఒకరు : ఆ శ్రేష్ఠివే పండించుకో నివ్వమనండి.

సుదాములు : పాపము, వాళ్లను వేధించడం మంచిదా ?

[మళ్లీ కాపులంతా బావురుమని ఏడుస్తారు]

బ్రాహ్మణి : వీళ్ల ఏడుపులు నమ్మబోకండి—సగంపంట ఇస్తామన్నవాళ్లు ఇందాక ఉన్నారు ఇప్పుడు జారరే, ఏరీ?

పెద్దకాపు: ఎవరమ్మా, ఏరీ వాళ్లు? నేనుగదా పెద్దకాపును! నేను ఒప్పుకొన్నానా తల్లీ, చెప్పండి!

బ్రాహ్మణి : నీవుకాదు. (ఒప్పుకున్న వాళ్ల కోసము కలయ చూస్తుంటుంది.)

పెద్దకాపు : ఎవరో మమ్మల్ని అల్లరిచేయటానికి, నాశనంచేయటానికి, అని ఉంటారు! వాళ్లు అసలు పొలాలుచేసే కాపులేనా? — కూలీలయ్యుంటారు. మేము పొలాలు వదిలిపెడితే తాము చేసుకుందామని కాచుకు కూచున్నవాళ్లు!

సుదాములు పోనీ పాపము, మీకు నష్టంగా ఉందిగా, వదలండి. పాపము, ఆ పేదకూలీలే కష్టపడి వ్యవసాయం చేసుకుంటారు!—వాళ్ల ప్రాప్తం బాగుంటుందేమో!

[పెద్దకాపు తెల్లబోయి కాసేపు నిశ్శబ్దము. కాపు లతనితో గుసగుసలు]

ఒక కాపు : ఒరే, పాపము సగమిద్దామురా!

ఒక కాపు : ఒరే, నిన్ను పెద్దకాపును చేసుకొన్నందుకు ఇంత తెలివితక్కువగా వ్యవహరించావేమిరా ?

బుల్లికాపు. అరే అంత చదువుకొన్న జ్ఞానికే, నీ దొంగవేషము కనిపెట్టడము ఒక కష్టమటరా ?

బ్రాహ్మణి: ఏమిటా గుసగుసలు! దొంగ పోకడలు పోక, ఒప్పుకొన్న ధాన్యం తీసుకురండి!

పెద్దకాపు అమ్మా—అయ్యా—అట్లా అనుకోవాకండి.

బ్రాహ్మణి : ఏం ?

పెద్దకాపు : కట్టిన ఇంట్లో, నా కట్టుకున్న పెళ్లాం సాక్షిగా, నా పిల్లలు సాక్షిగా చెబుతున్నాను నేను అబద్ధమాడితే-నా పిల్లలంతా నాశనమైపోవాలి!—

బ్రాహ్మణి : (బాధతో) అంతంత ఒట్లు వద్దురా, నాయనా!

పెద్దకాపు : పిల్లలు నాశనమైపోవాలె అబద్ధమాడితే ఆ వెధవ కూలీవాళ్లకే అప్పగించి మా దారిన మేము పోతే, వాళ్లేమి చేయగలరు తల్లీ, వ్యవసాయము! గొడ్లా, గోదా ? అరకలుకూడా లేవు. విత్తనాలు ఎక్కడ తెస్తారు? వాళ్లకు, తాడగా బొంగరం లేనివాళ్లకు, అప్పు పెట్టేవాళ్లుకూడా ఉండరే!—అయ్యో, నిక్షేపంలాంటి మీ భూములు పాడైపోతవే!—బంజర్లయి పోతవే—ఎందుకూ పనికిరాకుండా చవుడేసి పోతవే—పాపము, రాజులు రాణులు లాంటి మీ పిల్లలు అలో లక్ష్మణా అంటూ ఘోష పెడితే—మా కేమి వృద్ధిం ఉంటుంది తల్లీ—అందుకు బాధ పడుతున్నాము తల్లీ!

[అతనితోపాటు కాపులంతా లబ లబా ఏడుస్తూ మొత్తుకుంటారు.]

బ్రాహ్మణి (ముఖంలో జాలి చూపుతూ మెత్త పడుతుంది.) శ్రేష్ఠిం మీ మాటలు నమ్మవద్దన్నాడే, మీ దొంగ ఏడుపులకు మోసపోవద్దన్నాడే.

పెద్దకాపు : అవునమ్మా, ఆ శ్రేష్ఠిం అట్లాగే అంటాడు అసలూ అతను తినేదంతా నెత్తురుకూడాయె—మిమ్మల్నికూడా మా నెత్తురు పిండుకుని తా మంటాడు—(కన్నీళ్లతో) అయ్యో, చూడండమ్మా, కోసినా నెత్తురుకూడా రాదు

[కొడవలి తీసుకొని పదునువైపు చేతిమీద పెట్టుకుంటాడు.]

బ్రాహ్మణి. (తెల్లబోయి) ఆ పాపము మాకు వద్దు నాయనలారా—వద్దు, ఊరుకో తండ్రీ!—నా కన్నబిడ్డలు అన్నంలేక మాడుతూఉంటే చూడలేక, మిమ్మల్ని పిలిపించాను నాయనా!-(కన్నీళ్లతో) ఏమన్నా ఇయ్యగలిగితే, ఉంటే నాలుగు గింజ లియ్యండి-మీకు పుణ్యముంటుంది!

[కాపులు గుసగుసలు]

బుల్లికాపు : పాపము సగమిద్దామురా !

మరొక కాపు : వాళ్ల ఘోష మనకు కొడుతుందిరా!

మరొక కాపు అమ్మగారు కన్నీళ్లు పెడుతుంటే లంకలో ఉన్న సీతమ్మవారల్లే ఉందిరా.

మరొక కాపు ఏదో కొంత పంటైనా ఇయ్యకపోతే ఎట్లారా ?

పెద్దకాపు : (కాపులతో రహస్యంగా) నోరు మూయండి, మీ జాలీ మీరూను—నాకు నామర్దా తెస్తారా? (ప్రకాశముగా) అమ్మా, ఎంతమాటన్నారు! మీ పొలాలలో పండితే గింజలు మీకు ఇయ్యడమే మహాపనమా? అయ్యో, కావలెనంటె మీరే వచ్చి మా పాడు ఇళ్లు చూచుకోండమ్మా! ఒక్క గింజఉంటే—నా పెళ్లాం తోడు, నా పిల్లలు నాశనం కావలె—ఉంటే ఇయ్యమా?—అంత పాపిష్ఠులమా?

సుదాములు : (ఇంతసేపూ పరధ్యానంగా భగవద్ధ్యానం చేస్తూఉండి ధ్యానభంగమై) బ్రాహ్మణీ, వీ రంతా ఎందుకో ఏడుస్తున్నారు చూడు!

[కాపులంతా మరింత ఏడుస్తారు. ఏడుపులు.]

ఒక్క రూపాయి పొందేచోట రెండు రూపాయలు పొందండి !

మీరు యూనిట్ హోల్డరు అయినట్లయితే, మీ పెట్టుబడిని ద్విగుణీకృతం చేసుకోవటానికి మంచి అవకాశం

పునః పెట్టుబడి

ప్రతి సంవత్సరం మీకు వచ్చే ఆదాయాన్ని పునః పెట్టుబడిగా పెట్టమని మమ్మల్ని మీరు అడిగితే చాలు. అప్పుడు క్రొత్త యూనిట్లు ప్రత్యేకమైన ధరలకు మీరు పొందుతారు—మీ పెట్టుబడి పది సంవత్సరాలు లేక ఆలోపే రెండింతలవుతుంది.

ఇందుకై మీ దరఖాస్తు జూన్ 30, 1968 లోపల సకాలానికి అందేటట్లు పంపండి.

యూనిట్లలో పెట్టుబడి అభివృద్ధికి రాజమార్గము.

పూర్తి వివరాలకు మీకు దగ్గరలోవున్న యూనిట్ ట్రస్టు ఆఫ్ ఇండియా కార్యాలయానికి వ్రాయండి.



యూనిట్ ట్రస్టు ఆఫ్ ఇండియా

46, వీర్ నారిమన్ రోడ్డు, బొంబాయి-1.

ఆఫీసులు : 2, ఫెయిర్లీ ప్లేస్ కలకత్తా-1 ■ రిజర్వు బ్యాంకు బిల్డింగు, పోర్టు గ్లాసిస్, మద్రాసు 1 ■ 6, పార్లమెంటు వీధి, న్యూఢిల్లీ-1.

dAvp 67/509

బ్రాహ్మణి : పోనీయండి, నాయన్నారా—మిమ్మును ఏడిపిస్తే మీ పెళ్ళాం బిడ్డల ఘోష మాదికాదా! మా పిల్లలవంటి వాళ్ళే మీ పిల్లలూను—అంతేకదా!

పెద్దకాపు : అరె అరె శ్రేష్ఠి వస్తున్నా డ్రోయ్, పదండీ, ఏడవండి, ఏడవండి!—

[అంతా ఏడుస్తూ అడావిడిగా నిష్క్రమిస్తారు.]

శ్రేష్ఠి : (ప్రవేశిస్తూ) దణ్ణాలు బాబయ్యగారూ, దణ్ణాలు తల్లీ!—కాపులు వచ్చినట్టున్నారు. ఏమిస్తామని ఒప్పుకున్నారు తల్లీ!

బ్రాహ్మణి : (కళ్ళనీళ్ళు పెట్టుకుంటుంది) నాయనా శ్రేష్ఠీ! వాళ్ళంతా కరువుతో మలమల మాడిపోతున్నారు, చూడు. ఏమిస్తారు!

శ్రేష్ఠి : ఇంతకూ ఎంతకు ఒప్పుకొన్నారు? సగము పంట ఇస్తామన్నా రంటిరిగదా!—సగమిచ్చినా మీ అప్పులన్నీ తీరిపోయి మీకీ సంవత్సరము ఏదోవిధంగా గడిచిపోతుంది

[సుదాములు బ్రాహ్మణి కొంతసేపు మౌనము.]

సుదాములు : వాళ్ళేమి ఇయ్యగలరు, నిరుపేదలు!

శ్రేష్ఠి. ఏమా, కావలసినదంతా ఇయ్యగలరు

బ్రాహ్మణి. అట్లాకాదు శ్రేష్ఠీ! అసలే కాలుతున్న వాళ్ళ పొట్టలు కొట్టితింటే మాకు మాత్రము కడుపులెట్లా నిండుతవి!—పాపము!—

శ్రేష్ఠి : అమ్మా, అమ్మా, వాళ్ళంతా దొంగలు—మీరుకూడా గ్రహించలేదా?

బ్రాహ్మణి. వాళ్ళమీద మనము దయ చూపవలె. అట్లా ఏడుస్తుంటే జాలివేసింది అడగడానికి కఠినాత్మురాలికి నాకే నోరు రాలేదు—ఎట్లా?

శ్రేష్ఠి : అయ్యో, అయ్యో, అదంతా దొంగఏడుపు, తల్లీ!

బ్రాహ్మణి. ఎవరుమాత్రము ఊరికే ఎందుకు ఏడస్తారు, శ్రేష్ఠీ! నీ ఋణాన పోములే—ఎట్లాగో ఎప్పటికో నీ ఋణము తీర్చుకోక పోము, భయపడకు!

శ్రేష్ఠి : అయ్యో తల్లీ! మీరుకూడా నా బాకీకి తొందరపడుతున్నాననేనా? నా ధనమంతా మీ పొలాలలో ధాన్యాలతో వ్యాపారం వల్లనే వచ్చింది. మీదొక గింజైనా ఈ ఏడు కలవ నందువల్లనే నా వ్యాపారమూ మందగించింది. నా సంపద అంతా మీకు సమర్పించుకున్నా కృతార్థుణ్ణి అవుతాను!—

బ్రాహ్మణి: నాయనా, శ్రేష్ఠి, నీకు మా మీదఉన్న భక్తిచేత అట్లా అనిపిస్తుంది కాని, పాపము, వాళ్ళగోడుచూస్తే కడుపు తరుక్కుపోయింది— నా కన్నబిడ్డలు ఆకలితో అటమటిస్తుంటే ఎట్లా కడుపు తరుక్కుపోతున్నదో, వాళ్ళను చూసినా అట్లాగే ఉన్నది నాయనా!

శ్రేష్ఠి : అమ్మా, మీరుకూడా అట్లా అంటే ఏమి చేసేది, చెప్పండి.

సుదాములు : (ఆనందము విరిసిన ముఖంతో) కృష్ణా, గోపాలకృష్ణా, బలరామకృష్ణా!—

శ్రేష్ఠి. (తక్కువ కంఠంతో) అమ్మా, మాట్లాడ బోకండి. బాబుగారిని చూడండి వారి ముఖమేమిటి, ఆపాదమస్తకము ఆనందం వెల్లివిరిసింది భగవంతుణ్ణి కాబోలు తలుచుకుంటున్నారు.

బ్రాహ్మణి : అవును శ్రేష్ఠీ! వారికి చింతే లేదు. ఆ గోపాలకృష్ణుణ్ణి తలుచుకుంటే, మరీను

సుదాములు (నవ్వుతూ) బ్రాహ్మణీ, ఒకనాడే, గోపాలకృష్ణుడే, ఏమి చేశా డనుకున్నావు?—వాళ్ళ అన్న తొందరపాటు మనిషి! ఎందుకో కోపంవచ్చి నన్ను కొట్టవచ్చాడు. గోపాలకృష్ణుడు చప్పున అడ్డమువచ్చి ఆ దెబ్బ తాను తిన్నాడు. దానితో వాడి వీపు అంతా వాచిపోయింది—బుస్సున కుడుమువలెనే పొంగింది—అది చూచి, వాళ్ళ అన్న పాపము కన్నీళ్ళు కారుస్తూ కృష్ణుణ్ణి ఓదార్చపోగాడు—ఎంత పాడు పని చేశాను నాయనా, ఎంత దెబ్బ కొట్టానురా కృష్ణా, అంటూ— అప్పుడు కృష్ణుడేమన్నాడో తెలుసా?—అన్నా, నేను కాబట్టి సరిపోయింది. ఆ మహానుభావుడికే ఆ దెబ్బ తగిలి ఉంటే మనకు బ్రహ్మహత్య దాపురించేది కాదూ? మన గురువులు సాందీపనుల వారికి ఎంత కష్టమయ్యేది? మన యాదవ వంశమే నాశనమయ్యేది కదా!—అప్పటికి గాని బలరాముడు తన తొందరపాటు తెలుసుకోలేదు అతను నా రెండు కాళ్ళూ గట్టిగా పట్టుకొని వదలలేదు. నాకూ కన్నీళ్ళువచ్చి అతన్ని కౌగిలించుకున్నాను— కృష్ణా, ఏమిటి ఇట్లా వీపు వాచిందేమిటి అంటూ, నా కన్నీళ్ళతో ఆ వాపు తుడిచాను— బ్రాహ్మణీ, అప్పు డేమి అద్భుతం జరిగిందో తెలుసా?—వెంటనే ఆ వాపంతా పూర్తిగా మాయమయింది. కృష్ణుడు నవ్వాడు—దొంగ!

బ్రాహ్మణి : చూచావుగా—అదీ నాయనా, వారి తీరు!

శ్రేష్ఠి. ఏకృష్ణుని సంగతమ్మా, వారు స్మరణచేసేది?—నిజమా, కలా, తల్లీ?

బ్రాహ్మణి. నిజమే కాని కలవంటిది—వెనక ఎప్పుడో సాందీపనుల వారి గురుకులంలో వారి సహాధ్యాయుల సంగతి.

శ్రేష్ఠి : ఆ యాదవకృష్ణుల సంగతేనా తల్లీ!

బ్రాహ్మణి. అవును శ్రేష్ఠీ!

శ్రేష్ఠి. అయితే నేను విన్నది నిజమే అన్నమాట! మరయితే మీకీదారిద్ర్యము ఎందుకమ్మా, తల్లీ?

బ్రాహ్మణి : నీవెంత అమాయకుడవు శ్రేష్ఠీ!—ఆ మహారాజుకు జ్ఞాపక ముంటుందా?

శ్రేష్ఠి జ్ఞాపకం లేకపోతే జ్ఞాపకం చేసేది అటువంటి వారి కింద వేలూ లక్షలు జీవనంచేస్తూ ఉంటే, మీవంటి

పుణ్యరాసుల కుటుంబానికి ఈ మాత్రం సహాయం చేయలేరా ?

బ్రాహ్మణి : శేషీ, అట్లా కాదు రాజులకు ఐశ్వర్యమదము సర్వసాధారణము—జ్ఞాపకం లేదా ద్రోణాచార్యుల వారిదీ ద్రుపదరాజులదీ కథ? దేశమంతా మోగిపోయింది కదా, అప్పుడు! సహపాఠియైన ద్రోణాచార్యులవారు పాపము తన కుమారునికి పాలులేక ద్రుపదరాజును చూడబోతే, ఆయన పరాభవించలేదా! పైగా తాను రాజైన తర్వాత తన రాజ్యానికి వస్తే గొప్ప పదవి ఇస్తానని ప్రతిజ్ఞచేసి ఉన్నవాడు కూడాను.

శేషి. అవును గాని తర్వాత ద్రుపదరాజులకు ఆచార్యులుచేసిన పరాభవంతోనైనా రాజులకు మతి తిరిగి ఉండదా?

బ్రాహ్మణి : ద్రోణులు ధనుర్వేదము నేర్పిన ఆచార్యులు వీరో బ్రహ్మవిద్య నేర్పినవారు వీరికి కోపమేరాదు, శేషీ!— వస్తేనా, పాప మా కృష్ణుడూ యాదవులూ అంతా నశిస్తారు నాయనా! అంత పాతిత్యము కట్టుకోవడం మా కెందుకు!—ఏదో విధంగా నాలుగురోజులు కళ్ళు మూసుకుంటే, కాలము వెళ్ళిపోదా! ఎప్పటికైనా మంచి రోజులు రావా?—రావే అనుకో! మన మెవరమూ శాశ్వతంగా జీవించము గదా!

సుదాములు : బ్రాహ్మణీ, ఇవ్వాళ ఎందుకో మా కృష్ణయ్య తండ్రి మనస్సంతా నిండివాడే. వాడు ఎంత చక్కటివాడనుకొన్నావు! ఆ నలుపులో చిత్ర మేమో కాని సహస్ర సూర్యుల తేజస్సూ కాంతీ, కోటిచంద్రుల చల్లదనమూ వెన్నెలా ఉన్నవే—ఎన్నాళ్ళయిందే వాణ్ణి కళ్ళారా చూచి?— వాడు నా ఒళ్ళు తాకితే ఎంత చమ్మగా ఉండేదే — ముక్తి కాంత తాకినట్లేనే కృష్ణా, గోపాలకృష్ణా, ఎక్కడున్నావురా, తండ్రీ?

శేషి : స్వామీ, అయితే తమరు గోపాలకృష్ణులవారి దర్శనానికి వెళ్ళి రారాదూ?

సుదాములు : నేనా, గోపాలకృష్ణుని దర్శనానికి వెళ్ళడము!— అయ్యో, ఆ సముద్రమధ్యంలో ఉన్న ద్వారకాపట్టణంలోకి నన్ను కావలివాళ్ళు పోనిస్తారా ?—ఆ మహాపట్టణంలో అతని యింటి జాడ నా కెవరు చెబుతారు? కాశీనగరంలోనే అడుగుపెట్టి ఎరగము మేము గురువులవారివద్ద బ్రహ్మచర్యవ్రతం నడిపేటప్పుడు. నగరంలో మనము అడుగు పెడతామా ? పెట్టినా ఆ మహాజనసమ్మర్దంలో మనకు దారి తెలుస్తుందా ?—నాయనా, కృష్ణా, నాకొకసారి కనబడరాదటోయీ— ఎందుకు కనబడుతావు!—నేను జ్ఞాపక ముంటానా? ఎనిమిదిమంది మహిషులూ, పదహారువేల పైన వందమంది ఇతరభార్యలూ, వాళ్ళపిల్లలూ, పిల్లల పిల్లలూ ఉన్న నీకు జ్ఞాపకముంటానా ?

బ్రాహ్మణి : చూచావా శేషీ, అదీ వారి తీరు!

శేషి : అమ్మా, గోపాలకృష్ణులవారు, ద్రుపదమహారాజులవంటి వారు కాదటమ్మా, ఆర్తులను రక్షించే భగవంతు డంటారమ్మా!

సుదాములు : ఓరి కోతికృష్ణా! నా ఉత్తరీయము నడుముకు చుట్టుకొని చెట్టెక్కి ఆకులు కోస్తూ ఉంటే, నడుముకు బిగించిన ఉత్తరీయపుకొంగు కొంచెము జారింది. వాడు దాన్ని పట్టుకొని వేళ్ళాడాడు ఏముంది! దానితో ఆకాశానికి అంటి ఉన్న చెట్టు చిటారుకొమ్మమీదనుండి ఇద్దరమూ జారి కిందపడ్డాము! నే నతన్ని గట్టిగా కావిట వేసుకొన్నాను. ఎట్లా గనుకొన్నావు, పావురాళ్ళు ఆకాశంలో పిల్లిమొగ్గలు వేస్తవే, అట్లా పల్టీలు కొడుతూ పడ్డాము. తలకాయలు పగిలిపోవలసింది—ఇద్దరమూ సరిగ్గా కాళ్ళమీద తిన్నగా నిలబడ్డాము. వాడేదో గారడీ చేశాడు. నాకు భయముకూడా వేయలేదు వాడి కౌగిటిలో.

శేషి : శ్రీకృష్ణులవారు అకతాయిగా ఉండేవారా ?

సుదాములు : అకతాయా, అకతాయా?—ఐతే ఏమి, నా కింత బాధ కలగనిచ్చేవాడు కాదు. కాని కొంతమంది రాజపుత్రులను నానాహింసలూ పెట్టేవాడు. మరీనూ ఆ పౌండ్రకుణ్ణి, శిశుపాలుణ్ణి, దంతవక్త్రుణ్ణి!—

శేషి : గురువుల దగ్గరకూడా అల్లరి చేసేవారా ?

సుదాములు : అమ్మో, గురువులవద్దనే ? అల్లరే ? సాందీపనులవారివద్ద భగవంతుడు కూడా అల్లరి చేయలేడు. పిల్లిపిల్లే ఉండేవాడు. వారో, మమ్ములను తమ పిల్లలుగానే చూచేవారు!—మరీ వారికి పుత్రవియోగము కలిగిన తర్వాత, వారికి విద్యార్థులే పుత్రులూ, విద్యలే పుత్రికలూను.

బ్రాహ్మణి : మన విద్యార్థులుకూడా తిండిలేక చాలా బాధపడుతున్నారు.

సుదాములు : నిజంగానా, బ్రాహ్మణీ ?

బ్రాహ్మణి : నిజంగానే చూడండి—వస్తున్నారదుగో!

[విద్యార్థుల ప్రవేశము]

ఏం నాయనలారా, ఇట్లా వచ్చారు?

బ్రహ్మచారులు : ఇవ్వాళ ఊళ్ళోకి భిక్షకు వెళ్ళినా భిక్ష ఎక్కడా పుట్టలేదు. ఏ ఇంట్లోనూ పొయి రాజలేదు.

సుదాములు : మీకెంత ఆకలివేస్తున్నదోగదా !— భిక్ష కెందుకు వెళ్ళినారు? బ్రాహ్మణీ, వీళ్ళందరికీ వెంటనే వంట చేసిపెట్టు !

బ్రాహ్మణి : అయ్యో! (ఇంట్లోకి నిష్క్రమించును.)

బ్రహ్మచారులు : స్వామీ, మాకేమీ ఆకలి లేదు. మన యింట్లో బియ్యము నిండుకొని ఉన్నవి – భిక్షాన్నము తెచ్చి సమర్పిద్దా మంటే, ఊళ్ళో బ్రాహ్మణ్యమంతా ఇట్లాగే ఉపవాసమున్నది— ఎవరింటనూ పొయి రాజలేదు— బ్రాహ్మణుల ఇళ్ళన్నీ ఒకే తీరుగా ఉన్నవి—

సుదాములు: నాయనలారా, త్వరగా భోజనాలకు సిద్ధంకండి— వంట ఐ ఉంటుంది

బ్రహ్మచారులు: స్వామీ!— స్వామీ — స్వామీ!

[అంతా సందేహిస్తూ ఉంటారు.]

సుదాములు: ఏమిటి నాయనలారా, అట్లా సందేహిస్తున్నారు? ఏమిటి?

బ్రహ్మచారులు: ఏమీలేదు—ఏమీలేదు—ఇంట్లో—ఏమీలేదు

సుదాములు: (వినిపించుకోకుండా) వెనక కృష్ణుడు ఏంజేశాడో, తెలుసునా, ఒకసారి? మరే, నేను భిక్షచేసి తెచ్చుకొన్న భిక్షాన్నమున్నదే అంతా వెతుకులేకుండా మెక్కి పారేశాడు నాకు కోపము తెప్పించవలె ననుకున్నాడు. వాడు తింటూ ఉంటే చూస్తూ ఉన్న నాకు, నేను తిన్నకంటె కూడా అప్యాయంగా ఉన్నది—నా కారోజు విందు భోజనం చేసినకంటెకూడా కడుపు నిండింది—ఆకలే లేదు అందుకే సాందీపనులవారు చెప్పేవారు గదా, "వాడు విశ్వాత్ముడురా, లీలగా మనలను అనుగ్రహించడానికి ఇట్లా వచ్చాడురా" అని అప్పుడప్పుడు! ఇప్పటికీకూడా నా కానాటి కృష్ణుణ్ణి తలుచుకుంటే ఆకలే ఉండదు

బ్రహ్మచారులు: స్వామీ, మీ రాకథ చెబుతూ ఉంటేనే మా కడుపు లిప్పుడు నిండినవి నిస్సత్తువలు మాయమైనవి-ఉపాధ్యాయులవారు వంటతో శ్రమపడ నక్కరలేదు — మాకు ఆకళ్లులేవు—వారిని వంటచేయవద్దని చెప్పివస్తాము స్వామీ!

శ్రేష్ఠి: ఏమిటో అంతా చిత్రంగానే ఉన్నది వీరికి ఆకళ్లు లేవు. అమ్మవారికి అసలే ఆకలిలేదు ఎటువచ్చీ ఆ పిల్లలే పాపము ఆకలితో సొరసొరలాడుతున్నారు- వీరికా వేద పాఠాలు వల్లిస్తుంటే అమృతం కురుస్తుంది బాబో!

బ్రహ్మచారులు: సెలవు తీసుకుంటాము పాఠాల చింతనలకు వెళుతున్నాము.

[నమస్కరిస్తూ నిష్క్రమిస్తారు]

శ్రేష్ఠి: గురుదేవులను ఎట్లా ఐనా శ్రీకృష్ణులవారి దర్శనానికి వెళ్లేట్లు చేయవలె!

బ్రాహ్మణి: (కళ్ళ నీళ్ళతో ప్రవేశిస్తూ) స్వామీ—

సుదాములు: ఏ మట్లా బేలవై ఏడుస్తున్నావు! ఒకసారి భగవంతుణ్ణి తలుచుకో!—

బ్రాహ్మణి: ఆ భగవంతుణ్ణి తలుచుకొనే ఏడుస్తున్నాను.

సుదాములు: ఏమిటి విశేషము?

బ్రాహ్మణి: మన కా భగవంతుడు ఇంత దారిద్ర్యము ఎందుకు తెచ్చి పెట్టినాడా అని ఏడుస్తున్నాను.

సుదాములు: దారిద్ర్య మేమిటి?

బ్రాహ్మణి: మీకేం తెలుస్తుంది! వేళకు యింత వండి పిలిస్తే వైశ్వదేవానికి వస్తారు - ఇవ్వాళ వండేందుకు ఇంట్లో గింజ లేదు ఛాత్ర బ్రహ్మచారులలా పాపము ఆకలితో సొరసొర లాడుతున్నారు — ఇక మన పిల్లలు చూడండి —అదుగో, అన్నమో రామచంద్రా అని ఎట్లా ఏడుస్తున్నారు.

(తెరలో పిల్లల ఏడ్పులు)

పిల్లలు: అమ్మా, ఎక్కడికి వెళ్ళావే? ఆకలేస్తున్నదే! ఇప్పుడే వంటచేసి వడ్డిస్తా ఆకులు కుట్టుకోమంటివి కాదుటే?— మూడు రోజు లైందమ్మా అన్నం పెట్టి మాకు నీవు!— ఈ కాస్త దొన్నెలో నైనా గుప్పెడు ఉడికిమెతుకులైనా వడేయమ్మా! ఆకలితో చస్తున్నామే! కడుపులో ఆకలి మండిపోతున్నదే — అయ్యో, అమ్మా, అన్నమే!—

బ్రాహ్మణి: వింటున్నారా?

శ్రేష్ఠి: (కళ్ల నీళ్ల తుడుచుకుంటూ తల వంచుకుని ముఖ మావలకు తిప్పుకుంటూ) అమ్మా, గురుదేవులను శ్రీకృష్ణులవారి దర్శనానికి వెళ్లమని చెప్పండమ్మా!

బ్రాహ్మణి: తమరు శ్రీకృష్ణ భగవానులను దర్శిస్తే ఈ మా క్షామ దారిద్ర్యము పోగొట్టలేడా?

సుదాములు: శ్రీకృష్ణుణ్ణా, నేనా? యాచకుణ్ణిగా అడగుతానా?—మనకేం కరువొచ్చిందని? — నన్నెవడు ఎట్లా కాపాడేవాడో తెలుసునా? దేవుణ్ణిగా పూజించేవాడు, తెలిసిందా? నేను దేబిరిస్తూ యాచిస్తానా? ఎంత మాట?

బ్రాహ్మణి: శ్రేష్ఠి, ఇంత అమాయకులకు నేనేమి చెప్పగలను నాయనా! నీవైనా చెప్పి చూడు!

శ్రేష్ఠి: గురుదేవా, ఉపాధ్యాయులవారు చెప్పేది యాచన చేయమని కాదు ఎప్పే, శ్రీకృష్ణ భగవానులవారి దర్శనానికి వెళితే వారే మిమ్ములను కుశలప్రశ్న చేస్తారు. అప్పుడు ఇక్కడి సంగతి సందర్భాలు చెబితే - అడగకుండానే వారంతట వారే చిక్కులు తీరుస్తారు.

సుదాములు: ఎంతమాటన్నావు శ్రేష్ఠీ! శ్రీకృష్ణుడంటే రాజ మాత్రుడనుకొన్నావు వాడు భగవంతుడు! భగవంతుడంటే తెలిసిందా! వాడికి ఒకరు చెప్పవలెనా, సర్వజ్ఞుడు కాదా?— అంతా తెలియదా? ఏదో లీల! వెనక నన్ను ఉడికిద్దామని ఎన్నెన్ని వేషాలు వేశా డనుకున్నావు! ఇప్పుడు ఇదేదో వేషమే, పరీక్షే! వాడి మాయలోపడి పొమ్మంటావు ఎన్నా?— భలే చెప్పావు, శ్రేష్ఠీ!

శ్రేష్ఠి: గురుదేవా, నేను మనవిచేసేది, అదే!—శ్రీకృష్ణదేవుల వారికి మిమ్ములను చూడవలెనని కోరిక కలిగి ఇటలా నాటకంవలె కల్పించారు, అందే!—వారి దర్శనానికి వెళ్లండి!

సుదాములు: బాగా చెప్పావు శ్రేష్ఠీ! నా చదువు చట్టుబండలు కాను! నా కింతమాత్రము తోచనేలేదు. చిన్ననాటి స్నేహి

తుణి ఒకసారి చూడాలని అనుకున్నాడంటావా, మా కృష్ణయ్య తండ్రీ? అయితే వెంటనే బయలుదేరుతాను!— కృష్ణా, కృష్ణా, ఇదుగోరా వస్తున్నాను! — బ్రాహ్మణీ, నా గోపాలకృష్ణుడు మహారాజ తెలిసిందా?—రాజాధిరాజు!— వాడికి కానుకగా ఏమి తీసుకువెళ్ళడి?

బ్రాహ్మణి · (కళ్ళనీళ్ళతో స్వామీ, ఇవిగో ఈ అటుకులు! ఇవి నాలుగిళ్ళలో అడిగితెచ్చి తమకు వాడబెట్టి ఇద్దామను కొంటున్నాను—ఇంతకంటే ఏమి లేవు

సుదాముడు తే, ఏదుంటే అదే! నేను తులసీదళ మిచ్చినా త్రిలోక రాజ్యంకంటే ప్రియంగా తీసుకొంటాడు. తే!—మూట కట్టుకొంటాను!

[అటుకులు చినిగిన కొంగున మూటకట్టుకుంటూ]

యః శ్శివో నామరూపాభ్యాం యాదేవీ సర్వమంగలా
తయోః సంస్మరణా త్పుంసాం విఘ్న స్తత్ర సజాయతే.
—ద్వారకానగరానికి వెళ్ళివస్తానని బ్రాహ్మణీ, బ్రహ్మచారు లకు ఏమి భోజనం లోపము చేయబోకు సుమా! శ్రేష్ఠి, నాచేత శ్రీకృష్ణదర్శనం చేయిస్తున్న నీకు సర్వశుభ లూ కలుగుగాక!

[అంతా నిష్క్రమణం]

రంగము రెండు

[ద్వారకానగరంలో దేవకీదేవి మందిరము. ప్రవేశము దేవకీదేవి—శ్రీకృష్ణుడు]

దేవకి : ఏం నాయనా?

శ్రీకృష్ణుడు · అమ్మా, ఏమో కడుపులో మంటగా ఉన్నదమ్మా!

దేవకి : ఆకలేమో రా!

శ్రీకృష్ణుడు ఉదేనమ్మా!

దేవకి : నా కోడళ్ళు ఎనిమిదిమంది ఉన్నా, ఒక్కరూ కడుపు నిండా అన్నమే పెట్టలేదా?

శ్రీకృష్ణుడు · లేదమ్మా!

దేవకి : అయితే కాళ్ళూ చేతులూ కడుక్కో, ఇక్కడ తిందువుగాని.

శ్రీకృష్ణుడు · ఏమి వండావమ్మా?

దేవకి : అయితే కనుక్కుంటూ ఉండు!—ఏమే, ఇవ్వాళ ఏమి వంట చేశారే?

[తెరలో]

చేటి : గోఘృతంతో నివ్వరి ధాన్యం వండి—

[ఇంతలో కలకలంగా అష్టమహిషులూ ప్రవేశము]

రుక్మిణి : అత్తా, శ్రీకృష్ణదేవులకు కడుపునిండా భోజనం పెట్టారా? మా యింట్లో ఏమి ముట్టలేదు

సత్య అత్తా, నా చేతిలో ఏది వడ్డించినా ఆప్యాయంగా ఆర గించేవారు, ఒక్క మెతుకు ముట్టుకో లేదివ్వాళ.

లక్షణ : అత్తా, ఎన్నడూ ఇట్లా నా చేతిపెట్టు నిరాకరించి ఎరుగరే.

భద్ర · నా కర్మము, నాచేతిపెట్టే పనికిరాకపోయిందా అని నాకు కోపముకూడా వచ్చిందత్తా, ఎంత మతిలేనిదాన్ని!

సుదంత . ఏదేమైనా జబ్బు కాదు గదా అత్తయ్యా.

జాంబవతి . ఏ రాక్షసునితోనైనా యుద్ధముచేసి వచ్చారేమో, అత్తయ్యగారూ!

మిత్రవింద : నాకు తలుచుకుంటే ఇదంతా ఏదో అయోమయంగా ఉన్నది, అత్తయ్యా!

కాళింది · నా హృదయంలో ప్రవిభూతమై ప్రవహించే సురలు త్రావే లమృతము కలిపిపెట్టినా వద్దన్నారు ఏమిచేయ గలను, అత్తా!

దేవకి నాయనా, ఏమిరా కృష్ణా, ఇది ఏమైనా అమాయకు రాళ్ళు నా కోడళ్ళనందరినీ అల్లరిపెట్టే ఎత్తు కాదు గదా, తండ్రీ!

శ్రీకృష్ణుడు : అయ్యో, కాదమ్మా, నీ చేతి పెట్టున్నా తింటే కడుపు మంట తీరుతుందేమోనని యిట్టు వచ్చానమ్మా!

[ముఖము బాధతో చిట్లిస్తాడు.]

దేవకి · అయ్యో, నాయనా — త్వరగా లే తండ్రీ భోజనానికి!

శ్రీకృష్ణుడు : ముందు, ఏమి చేశారో చెప్పు, మీ ఇంట్లో?

దేవకి · చేటి, ఏమి చేయించావో చెప్పు.

చేటి · గోఘృతంతో నివ్వరిధాన్యం వండి దానిలో ఘుమఘుమ లాడే సుగంధ ద్రవ్యాలతో పాటు శొంఠి, సైంధవ లవ ణం చల్లి అజీర్ణ హరంగా చేసి వున్నది

రుక్మిణి . సరిగ్గా మా యింట్లోనూ ఇదే చేయించా నత్తా.

[అది విని తక్కిన మహిషులు ఇంతేనా అన్నట్లు కనబడీ కనబడకుండా మూతులు విరుస్తారు——ముందు తక్కిన మహిషులు చెప్పేప్పుడు కూడా రుక్మిణి తప్ప మిగిలిన వాళ్ళు అట్లాగే చేస్తారు.]

శ్రీకృష్ణుడు : దాని మాట వింటేనే కొరపోతున్నది.

[దగ్గుతాడు. శ్వాస కష్టంగా ఆడుతున్నది.]

[తక్కిన మహిషులు సంతోషిస్తారు. ముందుకూడా రుక్మిణి తప్ప తక్కినవారు అంతే]

దేవకీదేవి ఏమినాయనా, అట్లా దగ్గుతున్నావు! పోనీ, అట్లా అయితే అది వద్దులే ఇంకా ఏమి చేయించావే చేటీ?

చేటి . వరాహమాంసము సెనగపప్పుతో కలిపి వండి మిరియాలు కుంకుమపువ్వు కస్తూరి ఇంగువ ధనియాలు దాచినచెక్క ఇత్యాదులలో కమ్మగా పోపువేశానమ్మా!

జాంబవతి మా నాయన ఈ ఉపాయమే పోతువరాహాన్నివేసి వెంటనే భగవానునిమీద భక్తిచేత పంపించాడు అత్తా!

ఆప్యాయంగా ఆరగిస్తారని ఎన్నెన్నిరకాలుగానో చేయించాను భక్ష్యాని ఉడుగర అని ఎక్కువ ఇష్టపడతారని ఆశించాను

శ్రీకృష్ణుడు: అబ్బబ్బా, ఆ భల్లూకపు పట్టూ దెబ్బలూ వెనక నాతో యుద్ధము చేసిన రోజు మళ్లా జ్ఞాపకము వచ్చి గొంతుపట్టినట్లవుతున్నది, తలుచుకుంటేనే!

(శరీరమంతా కుంచిస్తాడు.)

చేటి: పోనీ, అది కాకపోతే మానె కృష్ణ మృగమాంసము సన్న సన్నని ముక్కలుచేసి పెసరపప్పుతో వేయించిన పొతా ళింపు కూరకూడా ఉంది.

సత్య. సరిగ్గా ఇదే మాయింట్లోనూ చేయించా.

శ్రీకృష్ణుడు: కృష్ణ మృగమాంసమా నాకు సయించేది, అబ్బబ్బా!

[సత్య చిన్నబుచ్చుకుంటుంది. తక్కిన మహిషులు ఆమెవైపు విడ్డూరంగా చూస్తారు.]

చేటి: గోదధి వడగట్టి శర్కర కలిపి కస్తూరి కుంకుమపువ్వు పచ్చకర్పూరం ఏలకులు లవంగాలు ఇత్యాది సుగంధి ద్రవ్యాల చూర్ణాలు కలిపి శ్రీఖండం చేశము.

భద్ర: నేనూ ఇదే చేయించాను

శ్రీకృష్ణుడు శ్రీఖండం తలుచుకుంటేనే డోకు వస్తున్నది.

చేటి: ఇవ్వాళనే దాశరాజులు సముద్రపు అగాధజలాలలో పట్టిన అపూర్వమత్స్యాలు తెచ్చి సమర్పించారు. వాటితో రక రకాల కూరలూ చప్పలూ చేశాము

మిత్రవింద. మా మహానసంలోకూడా అవే చేయించాను.

శ్రీకృష్ణుడు: ఛీ, ఛీ! మత్స్యాహారమంటేనే ఓకిలింత వస్తున్నది, పాడు వాసన.

చేటి: ఆవుపాలూ, చెరుకురసమూ, తేనె కలిపి ఘాటైన మిరియాలతో తీయని పానీయముచేసి ఉన్నది.

కాళింది: నేనూ అట్లాగే చేయించాను.

శ్రీకృష్ణుడు: ఆ పానకం తీపి మొహంమొత్తుతున్నది

చేటి: కీచకులు సింధుభూముల అరణ్యాలలోనుంచి రంగురంగుల కపోతాలు పట్టి తెస్తే వాటితో ముద్రాహారము బహు మృదుల మధుర మనోజ్ఞంగా చేసినాము.

సుదంత: మా యింటనూ ఇదే చేయించి స్వామిని ఆరగించ మన్నాను.

శ్రీకృష్ణుడు: అది తలచుకుంటేనే అసహ్యంగా ఉన్నది

చేటి: అమ్మా, మన యింట్లో గోక్షీరముతో ద్రాక్ష పండ్లు, జీడిపప్పు కలిపి చక్కెర పొంగలి చేసి హయ్యంగవీనము కుమ్మరించినాము దానితో వంట యిల్లంతా ఘుమ ఘుమ లాడుతున్నది.

దేవకి: నాయనా, నీకు చక్కెర పొంగలి అంటే యిష్టమే గదా! తిందువుగాని పద!

లక్ష్మణ: అత్తా, నేనూ అదే చేయించి ఆరగించమన్నాను గదా!

శ్రీకృష్ణుడు: దాని పేరు చెబితేనే ఇవ్వాళ వెళ్లిపొయ్యేటట్లు ఉన్నది

దేవకి: చేటీ, నా కోడళ్లు చేయించినవే కాని మన మహానసంలో మరేమీ చేయించలేదుటే?

చేటి: చేయించకేమి తల్లీ! గోదధితో దధ్యోదనము అల్లము మిరియాలతో కమ్మగా చేయించాను నిమ్మకాయల పులుసుతో అప్పుడు గనగాడిన స్వచ్ఛ తైలంలో తిరుగ మాత పెట్టిన పులిహోర, చూపులకే ఎంతో ఆకర్ష కంగా ఉన్నది. గారెలు, లడ్డూ, జిలేబి, హల్వా, బాసంది, గులాబుజాము.

శ్రీకృష్ణుడు. చాలు, చాలు, వాటిపేర్లే వినలేకుండా ఉన్నాను.

దేవకి. మరేమి కావలె నాయనా?

శ్రీకృష్ణుడు: ఏవీనా అక్కరలేదమ్మా, ఆకలివేస్తున్నది వీళ్లకేమి తెలుసునమ్మా నా రుచులు, కన్నతల్లివి నీకు కాకపోతే!

దేవకి (కంట తడిపెడుతూ) నాయనా, నిన్ను కనడమే కాని పెంచనైనా పెంచలేదుగదరా నేను. ఒక్కచుక్కపాలైనా ఇచ్చి ఎరగనుగదా తండ్రీ! పాప మా యశోద వస్తే, దానికి తెలియవచ్చు! దూరాన ఉన్నది గదా. కబురంపినా రావాలంటే వారమురోజులైనా పడుతుంది

చేటి చిత్రము తల్లీ! అదుగోనమ్మా, యశోదమ్మగారు రానే వస్తున్నారు, చూడండి

దేవకి నిజంగా? దానికి తెలుసు, మా కృష్ణయ్య తండ్రికి ఏవేళ కేది కావలెనో!

[యశోద, కొందరు గోపికలు పాలు పెరుగుల దుత్తలతో ప్రవేశము]

యశోద: (ప్రవేశిస్తూనే) నా కృష్ణయ్య తండ్రీ!

[అంటూ పసివాణ్ణివలె కౌగిలించుకుంటుంది; ముద్దాడుతుంది.]

ఇదేమిటి నాయనా! నీ నిండుబొజ్జ, నీ పొన్నారిబొజ్జ, ఢోరుమంటూ లక్కళించుకొనిపోయి ఏడుస్తున్నది! అయ్యో, పేగు లట్లా అరుస్తున్నవి.

శ్రీకృష్ణుడు: ఆకలి వేస్తున్నదమ్మా, ఆకలి!

యశోద: దొంగా, నీకు ఆకలా? ఇంతమందీ ఉండి వీళ్లు నీ ఆకలే తీర్చలేకపోయినారూ? అక్కరు వేషాలు.

దేవకి: మాకు తోచినవన్నీ చెప్పామమ్మా! ఏది చెప్పినా డోకు అంటాడు, మరేమి కర్మమో ఇది.

యశోద : అవు పాలు ఇచ్చారా ?

దేవకి : ఒక్క పాలేమిటి, ఎన్నో కలిపినవి ఇచ్చినా, వద్దంటాడు.

యశోద : గోపి, ఆ పాలిట్లా తేవే. (వ్రజంలోనుంచి తెచ్చిన తాజా పాలు !

[అందుకొని అవు పాలిస్తుంది. శ్రీకృష్ణుడు ఆ పాలు త్రాగుతాడు. పొట్ట నిండుతుంది. అంతా సంతోషిస్తారు. ఇంతలో ఒక్కసారి తాగిన పాలన్నీ వెళ్ళబోసుకుంటాడు.]

యశోద : అయ్యో నాయనా — ఆ పాలు విరిగినవిరా. విరిగిన పాలు తెచ్చారుటే ! — అయితే ఈ పెరుగు తాగు !

[అని గోపిక దగ్గర పెరుగు తీసుకొని ఇస్తుంది.]

శ్రీకృష్ణుడు : (చప్పరిస్తూ) ఎంత ఆప్యాయంగా ఉందమ్మాఈ పెరుగు !

[మహిషులంతా చిన్నపుచ్చుకుంటారు. అకస్మాత్తుగా అదికూడా వికారపెట్టుతున్నట్లు ఐ వెళ్ళబోసుకుంటాడు.]

యశోద : అయ్యో, కర్మమా! పులిసిన పెరుగు తెచ్చారు కాబోలునే అయితే పోనీ ఈ వెన్న తిను! నీకు ఇష్టముగా! మాయింటి వెన్నరా!

[శ్రీకృష్ణుడు నోట్లో పెట్టుకొని ఉమ్మిస్తాడు అసహ్యపడుతూ.]

యశోద : దొంగ కుంకయ్యో కృష్ణయ్యా! దొంగ వెన్న కాని రుచించదు కాబోలు వెన్నదొంగలుగారికి! ఎక్కడ దొంగిలించేను?

శ్రీకృష్ణుడు : ఆకలమ్మా !

రుక్మిణి : స్వామివారు యశోదమ్మగారివద్ద ఐదేళ్ల పిల్లవాడుగా కనిపిస్తున్నారేమి?

[అంతా ఆశ్చర్యపోతున్నారు]

యశోద : అయ్యో నా తెలివిమండా!— నా పాలు తాగవలెనని వీడికి మనసయింది కాబోలునే. నా రొమ్ముల అందుకే పాలు నిండినవి.

సత్యభామ : అక్కా, స్వామివారు సంవత్సరం పసిపాపడుగా కనిపిస్తున్నారేమి !

[అంతా ఆశ్చర్యపడుతుండగా యశోద శ్రీకృష్ణుణ్ణి ఒళ్ళోకి తీసుకొని పాలు కుడుపుతుంది.]

దేవకి : యశోద ఎంత ధన్యురాలు !

భద్ర : అయ్యో, మన కృష్ణస్వామిని యశోదమ్మగారు హరించింది.

సుదంత : అయ్యో, స్వామి ఏడమ్మా ?

తక్కిన మహిషులు : యశోదమ్మ తల్లీ, నీవు వచ్చి మమ్ములను రక్షించావమ్మా! శ్రీకృష్ణులవారి ఆకలి తీర్చావమ్మా! బ్రదికినామమ్మా !

[యశోద రెండు రొమ్ములలో పాలూ ఐపోతవి. పైటతో మూతి తుడిచి వెన్ను రాస్తుంది. శ్రీకృష్ణుడు తృప్తిపడ్డట్లు ఒక్క క్షణము కన్నుమూస్తాడు. యశోద ఒడిలోనుంచి లేవగానే యథాప్రకారము పెద్దవాడవుతాడు.]

శ్రీకృష్ణుడు : అమ్మా, ఆకలే!

యశోద : నాయనా, నా రొమ్ములలో ఒక్కచుక్క పాలు మిగలకుండా తాగినావు గదా, ఇంకా ఏమిచ్చేది తండ్రీ ?

[కంటనీరు పెడుతుంది]

శ్రీకృష్ణుడు : ఆకలే ! — ఆకలే !

[తెర పడుతుంది.]

మూడవ రంగము

[ద్వారకానగర ద్వారప్రదేశము]

సుదాములు : నాయనా, ఇదేనా ద్వారకానగరం?

1 ద్వారపాలకుడు : చిత్తము, స్వామీ!

సుదాములు : నాయనలారా, మీరెవరు, చేతుల్లో గదలు పట్టుకున్నారెందుకు ?

2. ద్వారపాలకుడు : మేము ద్వారపాలకులము, శత్రువులు లోపల ప్రవేశించకుండా కాపలా కాస్తున్నాము.

సుదాములు : నేను శ్రీకృష్ణుణ్ణి చూడడానికి వచ్చానుగాని మరి నన్ను లోపలికి పోనిస్తారా ?

1, 2. ద్వారపాలురు : చిత్తము ! (నమస్కరిస్తారు)

సుదాములు : ప్రభువుల ద్వారపాలకులకు ఏమైనా బహుమానమిస్తేగాని లోపలి కెవరినీ పోనీయరంటారు. మీకు నా ఆశీర్వచన మిస్తాను మీకు సర్వశుభాలు కలుగుతవి.

[ఇద్దరు ద్వారపాలకులూ ఆయన కాళ్ళకు మ్రొక్కుతారు]

1. ద్వా. పా.: పెద్దల ఆశీర్వచనంకంటె మాకేం కావాలె! ఇతర బహుమానాలు తీసుకునే ద్వారపాలకులు ద్వారకానగరాన లేరు.

2. ద్వా పా : మీబోటివాళ్లను అడ్డగిస్తే మా ప్రాణాలు నిలవవు శ్రీకృష్ణప్రభువులు సహస్రాక్షులు !

సుదాములు : ఎంత మంచివాళ్లు నాయనా మీరు? నాకూ తెలుసు అతడు సహస్రాక్షుడని అనుభవం వల్ల చిన్నప్పుడు మా గురువుల గురుకులంలో ఏమయిందో తెలుసునా ?

1 ద్వా పా : చిత్తము, సెలవీయండి.

సుదాములు : సమిధలు తీసుకురావడానికి అడవిలో ఆ రోజు ఒంటరిగా దూరము వెళ్ళాను, గంగాతీరాన. అక్కడ ఇసుకమీద పెద్ద మొసలి పాకుతూ నన్ను చూచి నోరు తెరిచింది. నేను చూడనేలేదు ఎక్కడినుంచివచ్చాడో మా కృష్ణయ్య తండ్రి, దాని నోరు రెండు దవడలూ రెండు చేతులతో పట్టి చీల్చి అవతల పారేశాడు—అప్పుడు మొదలు నేను ఆనాడతను నా వెంట రానుకూడాలేదు ఎప్పుడూ నన్ను వెయ్యికళ్ళతో కనిపెట్టి ఉండేవాడు.

1 ద్వా. పా. చిత్తము, తమరు వారి సహాధ్యాయులన్నమాట. తమరు చాలా అలిసి ఉన్నారు బాబూ!

సుదాములు: శ్రీకృష్ణుని ఇల్లు ఎక్కడ ఉంటుంది నాయనలారా?

1 ద్వా. పా. వారి భవనమా? నగరిమధ్యలో వారి భవనము తెలియనివాళ్ళెవరు? అయినా తమరు అలిసి ఉన్నారు, నడవలేరు కాని మా చేతులమీద ఎక్కించుకునివెళతాము

[ఇద్దరూ చేతులు చాపి కుర్చీగా చేసి ఆ చేతుల కుర్చీమీద సుదాముని కూచోబెట్టుకొని శ్రీకృష్ణ భవనానికి బయలుదేరుతారు.]

[శ్రీకృష్ణభవన సమీపంలో శ్రీకృష్ణుడు పరుగెత్తుకుంటూ ఎదురౌతాడు. రుక్మిణీ సత్యభామాదులు వెనకాల ఉదుర్దాగా వస్తూంటారు వీడివెంట.]

సత్యభామ : స్వామికి ఇవ్వాళ పిచ్చి ఎత్తలేదు గదా!

శ్రీకృష్ణుడు : ఎన్నాళ్ళకు కనిపించావు స్వామీ! నీ కోసము కలవరిస్తున్నాను.

రుక్మిణి : ఈయన ఎవరోనే, నారదుడు కాడు, దుర్వాసుడు కాడు—ఎవరో ఇంత మహాపుణ్యశాలి!

[శ్రీకృష్ణుడు సుదాముల రెండు పాదాలూ భక్తితో రెండు చేతులతో మృదువుగా గ్రహించి శిరస్సున పెట్టుకుంటాడు.]

రుక్మిణి : (సుదాముల రెండుపాదాలూ నెత్తిన ధరిస్తూ)

అది భిక్షువు సదాశివుడమ్మా వీరు!

[అది చూచి తక్కిన మహిషులు ఒక్కొరొక్కరే సుదాముల పాదాలు శిరస్సున ధరిస్తారు]

సుదాములు : (ఆనందబాష్పాలతో) నీకు తగినవాళ్ళేరా నీభార్యలంతాను! ఏమో ఏమో అనుకున్నాను.

రుక్మిణి : మేమంతా ధన్యురాళ్ళము

శ్రీకృష్ణుడు : దింపండి నేలమీదికి. (ద్వారపాలకులు దింపుతారు)

[అంతట రుక్మిణీ సత్యభామలు ఒక పాదమూ, మరి యిద్దరు ఇంకొక పాదమూ, ఇద్దరిద్దరు చేరి ఒక బుజమూ పట్టుకొని సుదాములను ఎత్తగా శ్రీకృష్ణుడు నడుమూ మెడా పూని దేవతామూర్తినివలె మందిరంలోకి తీసుకొనిపోయి శ్రీకృష్ణుని తల్పంమీద కూచోబెడతారు. రుక్మిణీ ఒంగారు కలశంతో జలము తెస్తుంది. సత్యభామ బంగారు పళ్ళెము పాదాల్రకింద ఉంచుతుంది. రుక్మిణిపోసే గంగతో శ్రీకృష్ణుడు పాదప్రక్షాళన చేస్తాడు. తక్కిన పత్నులు తాము కట్టిన పట్టుపుట్టాల చెరగులతో తడి ఒత్తుతారు. శ్రీకృష్ణునితోపాటు అంతా పాదోదకం శిరస్సులపై చల్లుకొంటారు]

శ్రీకృష్ణుడు ఈ మహానుభావుడు దూరప్రయాణాలతో చాలా బడలి ఆకలితో ఉన్నాడు. వెంటనే అభ్యంజనస్నానము చేయించి భోజనము ఏర్పాటుచేయండి.

సుదాములు నీవు తాకేతేనే అమృతస్నాన మయిందిరా, ఎంత చల్లగా ఉన్నదిరా, నీ చేను స్పర్శ! నీ దివ్యమంగళవిగ్రహం చూస్తుంటేనే కడుపు నిండుతున్నదిరా కృష్ణయ్య తండ్రీ!

[మహిషులంతా అడావిడిగా అభ్యంజనాదులకు పరుగెత్తుతారు.]

[తెర]

నాల్గవ రంగము

[ప్రవేశము ద్వారకానగరపౌరులు—వీధిలో]

1 పౌరుడు ఇంత విచిత్రం ఎన్నడూ చూడలేదే! కృష్ణస్వామిని అన్నీ లీలలే.

2 పౌరుడు : ఆ రుక్మిణి అమ్మవారు ఆ చినిగినబట్టల బాపనయ్యకు బానిసకత్తెవలె ఉపచారము చేస్తున్నది.

3 పౌరుడు ఆ సత్యభామమ్మగారు కట్టిన చీరె ఇంత మాయి నీయదే, అట్టువంటి ఆమెగారుకూడా ఆ బాపనయ్యపాదాల కంటిన ఎర్రటిమట్టి చీరెచెంగుతో తుడిచి ఆ ఎర్రటి మృత్తిక ముఖాన తిలకంగా ధరించింది.

4 పౌరుడు . ఒకరేమిటి, అష్టమహిషులూ ఆయనకు వంతులు పడి ఉపచారాలు చేస్తున్నారు. ఎవరైయుంటాడు చెప్మా, ఈన ?

1 పౌరుడు : నారదుడా ?

2 పౌరుడు మహతి ఏదీ? దూర్వాసుడేమో!


1 పౌరుడు : అయితే జడలేవీ? ఈ చిరుగుగుడ్డలు కడతాడా ఆయన, వల్కలాలుగాని!


3 పౌరుడు : ధర్మరాజులవారైయుంటారు.

4 పౌరుడు : ఓరి బుద్ధిహీనుడా! అరణ్యవాసంచేస్తూ ఉంటే మాత్రం ధర్మరాజులవారి కేమి కొదవ! ఇంత చిక్కి ఉంటారా? అసలు వారు నియమభంగంచేసి నగర ప్రవేశం చేస్తారా?


LEADING ENGINE MANUFACTURERS

Prefer CLEVITE Bearings






Babbitt for moderate loads



Straight copper alloy for intermediate loads




Overlay-plated copper alloy for heavy loads.



BEARINGS

Offer you the Six Stupendous Advantages:-



- **MAXIMUM LIFE**
- **IDEAL SURFACE ACTION**
- **EFFICIENT EMBEDDABILITY**
- **BEST CONFORMABILITY**
- **EXCELLENT RESISTANCE TO CORROSION**
- **HIGH TEMPERATURE STRENGTH.**

BIMETAL BEARINGS LIMITED

(in technical collaboration with Messrs. Clevite Corporation, Cleveland, Ohio, U.S.A.)

Sembiam Madras-11

3 పౌరుడు : మరి ద్రోణాచార్యులో, కృపాచార్యులవారో ?

1 పౌరుడు. వాళ్ళయితే సమర్పించా లుండవద్దూ?

2 పౌరుడు : ఎవరో ఋషీశ్వరులు రా!

3 పౌరుడు : కాదురా, ఆదిభిక్షువు, సాంబసదాశివుడు !

4 పౌరుడు : శివుడైతే ఈ చింపిరిగుడ్డ లేమిటి? భుజగభూషణా లేవి? గజచర్మాంబర మేదీ? త్రిశూల మేదీ? నెత్తిమీద గంగ ఏది? శిరిలో నెలవంక ఏది? ఇంత చిక్కి శల్యమై ఉంటాడా ఆయన ?

3 పౌరుడు : ఐతే ఎవరో పేదబ్రాహ్మడు.

1 పౌరుడు. చిరుగుగుడ్డలవాడు.

2 పౌరుడు . కుచేలుడు !

3 పౌరుడు : అవును కుచేలుడే !

4 పౌరుడు . ఈ కుచేలుని పుణ్యము చూచారో లేదో ఇంతమందీ ఇట్లా ఉపచారాలుచేస్తూ ఉంటే, ఏదన్నైనా వారిం చడే ! అష్టమహిషులు కూడా కందిపోతున్నవి

1 పౌరుడు . ఆయనకు పాపము ఆ ఉపచారాలు ఎవరు చేస్తున్నారో గమనిక కూడా లేదు శ్రీకృష్ణ ప్రభువులవారి వంకే ఆప్యాయంగా చూస్తూ ఏదో ఏదో మాట్లాడుతూ ఉన్నాడు.

[నిష్క్రమణము]

ఐదవ రంగము

[ప్రదేశము - శ్రీకృష్ణ మందిరము]

రుక్మిణి (చిరునవ్వుతో) స్వామీ, ఇప్పుడు మీ ఆకలి తీరిందా?

శ్రీకృష్ణుడు లేదు సగము పొట్ట నిండింది ఇంకా తృప్తి కలగలేదు

సుదాములు . కృష్ణా, ఆకలిగా ఉందా నీకు? నాకు చెప్పలేదేమి? నీకోసమని బ్రాహ్మణి అడుకులు మూట కట్టిందిరా. అవిగో తీసుకొని తిను

శ్రీకృష్ణుడు : నిజంగానే! చెప్పవేమి? ఏదీ, ఆ మహాతల్లి చేతి ప్రసాదము !

[మూట సవరించి అడుకులు రెండు గుప్పెళ్ళు బొక్కుతాడు.]

రుక్మిణి : (వారించి) స్వామీ, చాలు చాలు! మీకు తృప్తి అయింది మీ నటన ఇప్పటికి అర్థమయిందిలెండి కాస్త. మీ భక్తులు మీకంటె మీకు ప్రియులు ఈ మహాను భావుడు ఎన్నాళ్ళయిందో బయలుదేరి అన్నము తిని! ఆయనకు ఆకలివేస్తుంటే, మీకూ వేసింది. ఆయన ఆర గిస్తే మీకూ కడుపు నిండింది.

[శ్రీకృష్ణుడు ప్రేమతో రుక్మిణివంక చూస్తాడు. మళ్ళీ అడుకులు గుప్పెట పట్టబోతుంటే రుక్మిణి శ్రీకృష్ణుని చేయి గట్టిగా పట్టుకొని అడుకులువిడిపిస్తుంది.]

[తెరలో]

"కలలోనం దను మున్నెఱుంగని మహాకష్టోత్కర్షుడై నట్టి దు ర్బలుఁ డాపత్సమయంబునన్ నిజపదాబ్జాతంబు లుల్లంబులోఁ దలఁప న్నంతన వెచ్చి యార్తిహరుఁడై తన్నేసనిచ్చున్ సువి శ్వలభక్తిన్ భజియించువారి కిడఁడే సంపద్విశేషోన్నతుల్"

రుక్మిణి . ఆ బ్రాహ్మణి ఎంత పుణ్యరాశో కాని ఆపదలో ఉండి సంపద అర్థించి ఈ అడుకులు స్వామివారికి ఉపాయ నంగా పంపింది - మీ పుణ్యదంపతులకు ఈ లోకంలో ఐశ్వర్యమంతా ఇయ్యదలచినా తిన్నది చాలు! - ఇంకా తిన్నారా అంటే వారి ఋణం తీర్చుకోలేరు స్వామీ !

[శ్రీకృష్ణుడు రుక్మిణి ముఖం చూస్తూ గుప్పిట పట్టిన అడుకులు మూటలో వదలి తృప్తిపడ్డట్లు త్రేణుస్తాడు]

సత్యభామ . శ్రీకృష్ణ దేవులవారి చర్యల రహస్యాలు అక్కగారి వల్ల మనమెన్నో తెలుసుకోవలె !

జాంబవతి . అక్కగారు మనలను రక్షించింది. ఇంకా ఆ పుణ్య సాధ్వి పంపిన ద్రవ్యము ఆరగిస్తే, ఆ పుణ్య దంపతు లకు మనలను ఎనిమిదిమందినీ బానిసలుగా పంపినా ఋణం తీరేది కాదు

భద్ర . రుక్మిణి అక్కా! వారిద్దరూ సహాధ్యాయులు ఏకాం తంగా ఏమయినా మాట్లాడుకొంటారు మన మిక వెళ దామా ?

[అష్టమహిషులు నిష్క్రమిస్తారు.]

సుదాములు కృష్ణా, నిన్ను చూడకుండా ఇన్నాళ్ళా ఎట్లా ఉండగలిగానో, తలచుకొంటే ఇప్పుడు ఆశ్చర్యంగా ఉన్నది

శ్రీకృష్ణుడు . దేవా, మిమ్ములను మరీ వాలుగేళ్ళబట్టి ఇదే పదే ధ్యానిస్తున్నాను

సుదాములు మాడవలెనంటే రాలేకపోయినావా ? దారుకుడు రథం తోలుకు రాడా ? మా గృహం పావన మయ్యేది గదా !

శ్రీకృష్ణుడు . మీ సన్నిధికి రథమెక్కి వస్తావా ?

సుదాములు భగవంతుడివి, మమ్ములను ఎట్లా ఆడిస్తావురా కృష్ణా ! నీకే చెల్లుబాటయిందిరా ఈ లీలలు !

శ్రీకృష్ణుడు మీ రాకవల్ల మా ద్వారకానగరమూ, మా మంది రమూ కృతార్థ మయినవి మీ సేవ చేసి నా మహిషులు ధన్యురాండ్రయినారు వేనక్కడికి వస్తే మాకీభాగ్యం ఎట్లా ప్రాప్తించేది ?

[తెర]

ఆరవ రంగము

[ప్రదేశము: గురుకులములో: ప్రవేశము బ్రాహ్మణి, శేషి]

శేషి: అమ్మా, మీ పొలాలలో నాలుగేళ్ళుగా పేరుకొన్న పాప మంతా వదలిపోయింది.

బ్రాహ్మణి. ఏమిటా పాపము నాయనా?

శేషి: మీకు గింజ కొలవకుండా పండినదంతా హరిస్తున్న ఆ కాపులు!

బ్రాహ్మణి: వాళ్లేమి చేస్తారు, పాపము, వర్షాలు లేక పంటలు పండకపోతే

శేషి. ఎంత అమాయకులమ్మా మీరు? ఆ పాపిష్ఠులు ఉన్నందువల్లనే వర్షాలు లేవు.

బ్రాహ్మణి మరి యిప్పుడు వర్షాలు పడుతున్నవిగా!

శేషి: అదే విశేషము తల్లీ! వాళ్లంతా ఊరు వదలిపోయిన రోజే వర్షాలు పడడ మారంభించినవి.

బ్రాహ్మణి. ఇదేమిటి, వాళ్ళు పాపము గ్రామము విడిచి పోయినారా? — ఎందువల్ల?

శేషి పాపము కూడానా?

బ్రాహ్మణి. అయితే మా యింటికి పుష్కలంగా ధాన్యమూ ఇతరగ్రాసాలూ పంపినది ఎవరు? వాళ్లు కాదూ?

శేషి. కాదు కాదు, కానేకాదు వాళ్ళు పండిన ధాన్యమంతా ఇళ్లలో దాచుకున్నారు. ఉపాధ్యాయులవారివద్ద, తమ దగ్గిరా, ధాన్యము ఏమీ లేనేలేదని చెప్పరాని ఒట్లు పెట్టుకున్నారు గదమ్మా!—వాళ్ళ ఇంటికిపోయి చూచుకుంటే, ఇళ్లల్లో దాచుకొన్న ధాన్యము గింజలేకుండా ఎన్నడూ కని విని ఎరగని కృష్ణవర్ణపు పురుగులుపడి తినివేసి ఉన్నవి

బ్రాహ్మణి. అయ్యో, పాపము!

శేషి ఇంకా వినండమ్మా పిల్లలమీద ఒట్లుపెట్టుకొన్నారు గదా!—వాళ్లపిల్లలకందరికీ మహావ్యాధులు వచ్చినవి

బ్రాహ్మణి: అయ్యయ్యో, నాకు చెప్పకపోతివేమి! తెలిస్తే ఏదో తీర్థమో ఔషధమో పంపేదాన్ని కదా!

శేషి: మీ తీర్థౌషధాలుకూడా పనిచేయలేవమ్మా, భగవంతుడికి ఆగ్రహము తెప్పించిన వారిమీద!—ఉపాధ్యాయులవారు శ్రీకృష్ణస్వామివారి దర్శనానికి బయలుదేరినారని తెలిసింది వాళ్లకు! ఇదేసోత, వాళ్ళు గజగజలాడుతూ ఎవరిదారిన వాళ్ళు పారిపోయినారు పెళ్ళాం బిడ్డలనికూడా వాళ్ల కర్మానికి వాళ్లను వదిలేశారు. ఆ రోగిష్ఠి పిల్లలనువేసుకొని పెళ్లాలు ఊళ్లమీద అడుక్కుతింటూ పెనిమిట్లను వెదుక్కుంటూ ఏడుస్తూపోతున్నారు

బ్రాహ్మణి (కంటతడితో) పాపము, వాళ్లను భగవంతుడనుగ్రహించుగాక!

శేషి. అమ్మా, మీ కృపాతిశయానికి అంతులేకపోవచ్చునుగాని భగవంతుడు దుష్టశిక్షణచేయక ఊరుకోడమ్మా!

బ్రాహ్మణి: కాదు కాదు నాయనా! భగవంతునికి ఉండే దయ కంటె మనుష్యమాత్రులము మనకెక్కువ దయ ఉంటుందా? కాకపోతే కఠినంగా కనబడుతుంది మధ్య మధ్య అసలు శిక్ష అంటే ఏమిటి? బాగుచేయడమే కదా! నాట్యశిక్షణపొందేవాళ్ళ చూడు, ఈ వేలువంచి, ఆ నడుము వంచి, ఈ కన్ను తిప్పి, ఆ చేయి తిప్పి, కాలివేలుమీద నిలిచి ఎంతెంత శ్రమపడతారు! నాట్యాచార్యులవంటి వాడే భగవంతుడుకూడాను మన కాపని చేతవాడు.

శేషి. అమ్మా—ఏదో అసందర్భంగా అడిగినానని కోపించవద్దు. ఉపాధ్యాయులవారు నాట్యశాస్త్రంకూడా అధ్యయనంచేశారా?

బ్రాహ్మణి: ఇందులో తప్పేమీలేదు నాకు నేర్పారుకూడా నాయనా. వారితో సమానంగా నృత్యంచేయగలవారు శ్రీకృష్ణ లొక్కరేనట. బలరాములుకూడా అలిసిపోయేవారట.

శేషి అమ్మా, ఇంత బక్క చిక్కి ఉన్నారుగదా, ఆ విద్య మరుపు రాకుండా ఉన్నదా!

బ్రాహ్మణి. వారికి మరపా? వారిది మహాయోగుల శరీరము, ఎటుబడితే అటు మైనమువలె ఒదుగుతుంది. వారి జవసత్వాలు నీ కెట్లా తెలుస్తవి! అవి ఆత్మశక్తిలో నుండి ఉద్భవించేవి కనుక విశ్వవ్యాపకమైనవి—సరేగాని మరి చెప్పకపోతివి, మా కీ ధాన్యాదులంతా ఎవరిచ్చారు?

శేషి. నేనే! మీ పొలాలన్నీ స్వయంగా కూలీలనుపెట్టి చేయిద్దామని ప్రారంభించానమ్మా!

బ్రాహ్మణి. ఇప్పటికే నీవిచ్చిన ఋణము తీరకపోతే, ఇంకా ఈ ఋణమంతా ఎట్లా తీర్చగలము నాయనా!—అయ్యో, మళ్లీ ధాన్యమెందుకు పంపినావు!

శేషి: మీరు నాకేమీ బాకీ లేదు.

బ్రాహ్మణి. ఇదేమి మాట! మమ్మును నీఋణాన పొమ్మంటావా?

శేషి కాదు కాదు వినండమ్మా! దుక్కికట్టించి దున్నడం ప్రారంభించిన రోజునే, నాగలికి నిధి తగిలింది. దానితో నేను మునుపిచ్చిన అప్పంతా తీరిపోగా, వ్యవసాయ ఖర్చులకూ, మీకు పంపిన ధాన్యాదులకూ సరిపడి, మీ పేర నా లెక్కలో ఇంకా చాలా నిలవవున్నది—ఒక్కదానికే నేను చాలా బాధపడుతున్నాను తల్లీ!

బ్రాహ్మణి: ఏమి టది?

శేషి ఏమీ లేదు తల్లీ! మీ పిల్లలు బాధపడితేగాని మీరు ఉపాధ్యాయుల వారిని ద్వారకకు పొమ్మనరు — అందుకని నాలుగైదు రోజులు మీకు కావలసిన ధాన్యం పంపక బాధ పెట్టినాను, పాపిష్ఠినాడను.

బ్రాహ్మణి నీ తప్పేమిటి ఇందులో? మాకు నీవు ధాన్యం పంపవలసిన బాధ్యత ఏమున్నది?

శ్రేష్ఠి: కాదు కాదు, మీ పిల్లల బాధ మాది కాదా? మా సంపద ఏకొంచెంవున్నా మీ ఆశీర్వచనం వల్ల వచ్చిందే— అదీ కాక కులపతులను ఆహారం కూడా తీసుకోకుండా ఉన్నవారిని ఉన్నట్లుగా పై గుడ్డలతో ద్వారకకు పంపి నది తలచుకుంటే — ఒంటరిగా ఉన్నప్పుడు ఏడుపు కూడా వస్తుంది తల్లీ!

బ్రాహ్మణి: నాకూ అట్లాగే ఏడుపు వస్తున్నది, పొట్లో అన్నకణము పెట్టుకున్నప్పుడల్లా! అయినా జ్ఞానం వల్ల మనకే కాని, వారికి ఆకలే ఉండదు నిత్య తృప్తులు. వారు పిలిచి పెడితే తింటారు, లేకపోతే అడగరు వారికి బ్రహ్మచారుల పాఠాలూ, శ్రీకృష్ణ ధ్యానమూ ఉంటే ఆకలీ దప్పీ ఉండవు

శ్రేష్ఠి: వారీ పాటికి శ్రీకృష్ణ ప్రభువుల దర్శనం చేసి ఉంటారు మళ్లీ ఎన్నాళ్లకు వస్తారోనమ్మా?

బ్రాహ్మణి: ఏదేమీ తెలియదు నాయనా! వారు ఎన్నడో శ్రీకృష్ణ దర్శనము చేసి ఉంటారు. భగవత్సమక్షంలో వారికి యుగమొక క్షణంగా గడిచిపోతుంది. శ్రీకృష్ణ భగవానులు వారిని అనుక్షణమూ కనిపెట్టే ఉంటారు, మన అజ్ఞానమే వదలక ఆదుర్దా పడుతుంటాము.

శ్రేష్ఠి: పొలాలలో మూడునెలలకే వచ్చే పంటలువేయించానమ్మా! ధాన్యం విరగబండింది వారు తిరిగి వచ్చేటప్పటికి మీ తపోవనమంతా రాజమందిరమువలె ఉండే ఏర్పాట్లు చేస్తున్నానమ్మా!

బ్రాహ్మణి: ఎందుకు నాయనా, అట్లా మాకోసం మళ్లీ అంత ఖర్చుపెట్టబోకు! మళ్లీ నీ ఋణమెట్లా తీరుతుంది?

శ్రేష్ఠి: కాదమ్మా, నా ద్రవ్య మిందులో నీసంకైనాలేదు మీకిచ్చిన ఋణమూ, పెట్టినపెట్టుబడీ అంతా తీరిపోయి బోలెడు సువర్ణం మిగిలి ఉన్నది

బ్రాహ్మణి: మాకీ కుటీరాలే చాలు నాయనా! మిగిలినది పేదవాళ్లకు, పాప మా కూలీలకు పంచిపెడదాము!

శ్రేష్ఠి: కులపతులవారు శ్రీకృష్ణులవారి మందిరంనుండి ఇక్కడికి తిరిగివచ్చేప్పటికి ఇక్కడ సరిగ్గా అట్లాగే ఉండవలె. శ్రీకృష్ణులవారి మందిరం చూచి రావడానికి స్థపతులు వెళ్లినారు—మనము మందిరాలు కట్టిస్తే ఆ కూలీలకు మాత్రము చాలా భాగము ముట్టదా తల్లీ!

బ్రాహ్మణి: రాజులసొమ్ము రాళ్లపాలంటారు, మనకెందుకూ అది?

శ్రేష్ఠి: మీకు తెలియదులెండి గాని అదంతా నాకు వదలివేయండమ్మా—ఆ పెత్తనమంతా.

బ్రాహ్మణి: అయితే నీ యిష్టం!

[తెర]

సప్తమరంగము

[ప్రదేశము: ద్వారకానగరవీధి—ప్రవేశము పౌరులు]

1వ పౌరుడు: నగరంలో అంతా సందడిగా ఉన్న దేమి!

2వ పౌరుడు: ఆ దివ్యసుందరవిగ్రహుడెవరు, శ్రీకృష్ణప్రభువులతో నృత్యము చేస్తున్నాడు ఎవరో కొత్తవాడుగా ఉన్నాడే!

3వ పౌ. ఎవరో మునీశ్వరుడురా, భరతమును లేమో!

4వ పౌ. ప్రభువులు కాసేపు వారిని కౌగిలించుకుంటారు, కాసేపు వారికి మొక్కుతారు.

1వ పౌ ఆ దివ్యపురుషుడెవరోగాని శ్రీకృష్ణప్రభువుల స్పర్శతో శరీరమంతా గగుర్పొడిచి ఆనందమూర్తిగా కనబడుతున్నాడు.

2వ పౌ ఆ పురుషునిది వేషమే పురుష వేషము కాని, రాసనృత్యముచేసే గోపికలవలెనే సాత్త్విక భావోదయంతో ముగ్ధమనోహరంగా ఉన్నాడు.

3వ పౌ ఏ మాటని దివ్యాంబరాభరణాలు! దేవేంద్ర వైభవాన్ని మించి ఉన్నది.

1వ పౌ (ఆకస్మికంగా నవ్వుచు) ఒరే, ఒరే, గుర్తువచ్చిందిరా!

2వ పౌ ఏమి టేమిటిరా, అట్లా నవ్వుతావు?

1వ పౌ (నవ్వుతూనే) జ్ఞాపకం లేదా? ఆమధ్య ఆరునెలలనాడు చింపిరిగుడ్డలతో బిక్కబిక్కున బ్రాహ్మడు శ్రీకృష్ణదర్శనానికి వచ్చాడు—కుచేలుడని పేరు పెడితివే, నీవే!

2వ పౌ ఆ కుచేలుడే ఇతడు!

3వ పౌ ఆ, నిజంగా?—అవునవునురోయి!

4వ పౌ నిజమేరోయి భగవంతుడికి అనుగ్రహము కలిగితే తృణము వజ్రాయుధ మవుతుంది.

3వ పౌ కాదురా, అనుగ్రహము కలగడానికి ఏదో విశేషకారణ ముండకపోదు.

4వ పౌ ఆ బ్రాహ్మడు విప్రదేహంగా ఎవరో మహానుభావుడు! అప్పుడు చింకిబట్టలతో ఉంటే, వేషమున్నా ఆమే చూడగల మనకు తోచలేదు

3వ పౌ. అవును భగవంతుడు సర్వజ్ఞుడు!

[తెర]

ఎనిమిదవ రంగము

సుదాముడు కృష్ణా! ఇవ్వాళ నిన్ను చూస్తుంటే, నా విద్యార్థులు జ్ఞాపకము వస్తున్నారు.

శ్రీకృష్ణుడు: వాళ్ళు, పాపము, మిమ్ము స్మరిస్తున్నారేమో!

సుదా నే నిక్కడికి వచ్చి ఎన్నాళ్లయింది?

శ్రీకృ. ఆరువారాలేగా!

సుదా: ఆఁ, ఆరునెలలా? రెండురోజులుకూడా ఐనట్లు లేదే. నిజంగా ఆరునెల లయిందా? నిజంగా?

(శ్రీకృ): మీతో అబద్ధ మాడతానా?

సుదా. ఎవరితోనూ అబద్ధమాడవు, సత్యస్వరూపుడవు!

యశోద: నమ్మబోకు నాయనా, వాడు పట్టి అబద్ధాలపుట్ట!— నేను వచ్చిన రోజేకదా నీవూ వచ్చినది—మొన్ననే నాయనా!

సుదా: శ్రీకృష్ణుడు ఆరునెలలంటున్నాడు గా. వాడన్నమాటే న్యాయమై ఉండాలె!

యశోద: అయ్యో తండ్రీ, వీడు వట్టి మాయగాడు. ఊళ్లో అందరి ఇళ్లల్లో వెన్నలు మింగివచ్చి నాదగ్గర దాక్కుని, వాళ్లు మొరపెట్టుకుంటూ ఉంటే, ఏమీ ఎరగనివే వాడు నేనూ వాడిమాట నమ్మి ఆ గోపికలతో పోట్లాడేదాన్ని!

సుదా: మన కృష్ణుడు అబద్ధ మాడడమ్మా! ఆ గోపికల పిల్లలే కృష్ణవేషములో వెన్నలు మెక్కేవాళ్లేమో!

యశోద. ఆహా మంచి సావాసగాడివే నయ్యా, నీవు కిష్టయ్యకు!— అయితే పోనీ, బలరాముడుకూడా అబద్ధాలకోరేనా? అతడే ఒకనాడు కిష్టయ్య మన్నుతిన్నాడని చెప్పినాడు. ఈ కిష్టయ్య మన్నుతినలేదని నోరుతెరిచి చూడమన్నాడు—అందులో బ్రహ్మాండంలో మట్టి అంతా నేను కళ్లారా చూశాను! ఏం చేసేది? ఈ దొంగటక్కరిని కొట్టలేకపోయాను!


సుదా: యశోదమ్మ తల్లీ, నీ వేమన్నా చెల్లుబాటు అవుతుంది కాని, నాకు కృష్ణునికంటె సత్యము లేదు—బలరామునితో సహా అంతా అసత్యమే!

యశోద: వాణ్ణి నమ్మకు కూచుంటే నిలవాక ముంచునట్లే, తండ్రీ! నాకు కొడుకునని నమ్మించి, నా పాలు తాగి, రేపల్లె అంతా ఒక కొలికికి తెచ్చి, ఇప్పుడీ దేవకీ దేవుల వారి కొడుకునని ఈ దివ్యభవనాలలో చేరాడు. మళ్లా, నన్ను అమ్మా అంటూనే ఉంటాడు (కళ్లనీళ్లు పెట్టుకుంటుంది)

సుదా. మీ రిద్దరూ ఎంతపుణ్యము చేసుకున్నవారోనమ్మా! ఇద్దరూ అమ్మలే, అబద్ధ మేమున్నది?

సత్యభామ: స్వామీ, మీకెంత స్నేహాభిమాన మున్నా, శ్రీకృష్ణులు అబద్ధమాడరంటే నే నొప్పను.

ఇదిగో!
ఈ క్రొత్త
సాటిలేని
బుష్
బారన్!



పోర్టబుల్
ట్రాన్సిస్టర్

మీ యింటికి ఒక గొప్ప అవసరం!

మీ యింట్లో ఒక రేడియో ఉన్నా ఇంకొక గదిలో, భార్య, పిల్లలు, సంతోషంగా వినడానికి, ప్రయాణాలకు, కరెంటులేని సమయాలల్లో వాడటాన్కి, విహారయాత్రలకు, బహుమతులుగా యిచ్చుటకు, పుచ్చుకొనుటకు, ఆలోచిస్తె ఈ ముచ్చటైన చక్కటి రేడియో అవసరం ఎంతైనావుంది.

అన్నిస్టేషన్లు బాగాఅందుకొనే చక్కని శబ్దం! చౌకధర!! ఇతర రకముల అన్నిరేడియోలకంటే హెచ్చుగా కొనబడుచున్న ట్రాన్సిష్టర్! ఈరోజుననే మీకు దగ్గరగానున్న బుష్ డీలరువద్దచూచికొనండి!

ఆంధ్రజిల్లాల డిస్ట్రిబ్యూటర్లు
నారాయణ్ రేడియో స్టోర్సు
విజయటాకీసు సెంటర్ - ఫోను 6489 - విజయవాడ-2

సుదా : ఎందువల్ల తల్లీ?

సత్య వినండి. మీస్నేహితుడు, ఈయనగారున్నారే, రోజూ నాతో "నీ కంటె నాకు ప్రియురాలు లే"దని అంటూ ఉంటారు. మిగిలినవారిని అడగండి, వారితో ఏమంటూ ఉంటారో?—రుక్మిణీ అక్కయ్యా, దాచక చెప్పండి!

రుక్మిణి : ఎప్పుడన్నా ఒక్కొక్కప్పుడు, 'నీకంటే నాకు ప్రియురాలు ఎవరూలేరు సత్యా' అంటారు నాతో.

జాంబవతి : 'నీవే మహిషు లందరిలో భక్తురాలవు రుక్మిణీ' అంటారు నాతో!

భద్ర : 'నీ వివ్వాళ ఎంత బాగున్నావు జాంబవతీ' అంటారు నాతో ఒక్కొక్కసారి! (పక్కున నవ్వుతుంది)

మిత్రవింద : స్వామీ, మీ మిత్రులు శ్రీకృష్ణస్వాములవారి సత్యసంధత చెబుతా వినండి, అయితే! ఒక్కొక్కనాడు నన్ను రుక్మిణీ అని పిలుస్తారు ఒకనాడు, 'నీవు సత్యభామవై కోపిష్ఠివి కావే, సుదంతా' అంటారు నాతో—ఇంకా ఇంకా ఎన్నో ఎన్నో ఉన్నవి మీ మిత్రులవారి సత్యవాక్యాలు!

[అంతా నవ్వుతారు.]

సుదంత : 'నీవు అమృతస్వరూపిణివి కాళిందీ' అంటారు నాతో!

కాళింది : 'నీ కంటె నా కెవరూ ప్రియులు కారు మిత్రవిందా' అంటారు నాతో!

లక్షణ ఒకనాడు స్వామివారు—ఎప్పుడోకాదు నిన్ననే- 'సుదామా నీమీద నాకెంత ప్రేమ రా' అన్నారు.

[అష్టమహిషులంతా పగలబడి నవ్వుతారు.]

సుదా : (అరమోడ్పు కన్నులతో) ఆహా, ధన్యుణ్ణి నేను!—మా చెల్లెళ్లకు అతిపరిచయమువల్ల శ్రీ కృష్ణస్వరూపము తెలియదల్లే ఉంది—అతనికి అన్నిరూపాలూ నామాలు ఒక్కటిగానే ఉంటవి. అజ్ఞానులమైన మనకే నమ్మా, ఈ నామరూపభేదాలు! అతన్ని వదలండి, నావంటి అజ్ఞానికే, మీరు ఎనిమిదిమందీ ఒక్కటిగానే ఉన్నారు.

సత్య : ఇద్దరూ సావాసగాళ్లు కాదూ? స్వామీ, మీకుకూడా ఈ సత్య కోపిష్ఠురాలుగానే కనబడుతుందా?

శ్రీకృ : అమ్మ నాయనా, ఆ సత్యకు నీవైనా సమాధానము చెప్పు స్వామీ, నన్ను చంపుకు తింటుంది.

యశోద : సత్యభామమ్మా! వాడు నిన్ను కోపిష్ఠిది అని ఎవరితోనైనా అన్నాడే అనుకో! అంతమాత్రానికే కోపమైతే ఎట్లా తల్లీ?

దేవకీదేవి సత్యా, వాడొకవేళ నీవు కోపిష్ఠిదానివని అన్నాడే అనుకో! ఇట్లా మాట్లాడినావంటే, వాడన్నది నిజమే నని మా కందరికీ అనిపిస్తుంది.

సత్య . ఇంతా ఎన్నవేవాళ్లే (ఏడుపు సాగిస్తుంది.)

సుదా : చెల్లీ, ఎంత అజ్ఞానురాల వమ్మాయీ, నీవు!

సత్య అవును. అజ్ఞానురాలిని వట్టి మూఢురాలిని. కనుకనే అంతాకలిసి నన్ను కోపిష్ఠిదాన్నని వేలుపెట్టి చూపి పలుగురిలో ఇట్లా అల్లరి చేస్తున్నారు

శ్రీకృ : నాయనా, సుదామా! నీవు అమాయికంగా నాకెంత చిక్కుతెచ్చిపెట్టావు! ఎప్పటికి ఈ సత్యకోపము తీరేట్లు!

సుదా : మా సత్యమ్మ తల్లి కోపిష్ఠిదే ముమ్మాటికీ!—సత్యమ్మా!—అసలు కోపిష్ఠి—కోపన అంటే ఏమిటో తెలుసా?—అమాయికురాలు అని, ముద్దరాలు అని అర్థము!—మరి నీవు అమాయికురాలివి అవునా, కాదా?

సత్య : అవును, అమాయికురాలనే, కాని కోపిష్ఠి నంటే?

సుదా ఉన్న సంగతి అంటె కోపమెందుకు చెల్లీ! వాణ్ణి అబద్ధమాడమంటావా, సత్యసంధుణ్ణి! తన సత్యసంధత నిలుపుకోడానికే నిన్ను కట్టుకున్నాడు. నిన్ను కట్టుకోబట్టే ఇతను సత్యేశ్వరుడైనాడు,-లేకపోతే అసత్యేశ్వరుడే!

సత్య (కళ్లనీళ్లు తుడుచుకుంటూ) నేను కోపిష్ఠురాలినే, అని సుదాములవారు, సాక్షాత్తు కులపతులవారు, కితాబు ఇచ్చారుగా! ఎంత కష్టము కలిగిస్తున్నానో ప్రభువులకు?

సుదా : అదుగో, సత్యమ్మ చెల్లీ, అదేనమ్మా నీ పొరపాటు! నీ స్వామికి ఎవరు ఎటువంటివారో వాళ్ళు అట్లా ఉంటేనే ఇష్టము! నీకంటే ప్రియులు లేరని అతను చెప్పేది నిజమే!

లక్షణ : మా అందరిలోనూ అదే అంటారు గదా! అదికూడా నిజమేనా!

సుదా అహో, అక్షరాలా!

యశోద : ఈ విరుద్ధాలన్నీ నిజ మనడానికి, మా కృష్ణుడి స్నేహితుడికి నీకే తగిపోయినదయ్యా!

సత్య బాగా అన్నావమ్మా, అత్తయ్యా! ఈ బ్రాహ్మణోత్తముణ్ణి మేమే మనగలము! అందులో శ్రీకృష్ణప్రభువుల వారి సాన్నిధ్యములో!

సుదా : శ్రీ కృష్ణా!-వీళ్ల శంకలన్నీ గురుకులములో బాల విద్యార్థుల కుశంకలవలెనే ఉన్నవి. వీళ్లనందరినీ మా గురుకులానికి పంపరాదూ—విద్యాశిక్షణకు!

శ్రీకృ. బతికించావు! — వీళ్లందరినీ నీ గురుకులములో విద్యాబుద్ధులు చెప్పి పంపించి రక్షించు నన్ను, సుదామా!

సుదా : అంతకంటేనా?

శ్రీకృ : అయితే వస్తారేమో అడుగు.

సుదా . కులపతులు విద్యార్థులను రమ్మని అర్థిస్తారా?

శ్రీకృ: అవునవును—రుక్మిణీ, సత్యా—మీరంతా గురుకులానికి విద్యాభ్యాసానికి వెళ్తారా?

రుక్మిణి, సత్యా—అష్టమహిషులు, వెళుతాము—వెళుతాము—వెళుతాము!

శ్రీకృ: అయితే కులపతి సుదాములను అర్థించండి

అష్టమహిషులు. స్వామీ, మీ పాదాలు ఆశ్రయించాము. మాకు బ్రహ్మవిద్య ఉపదేశించండి!

సుదా. సంతోషము ఇక్కడనా? గురుకులములోనా?

అష్టమహిషులు: మీ చిత్తము వచ్చినచోట!

సుదా: న్యాయంగా గురుకులానికి రావలసినదే కాని మీరక్కడ ఉంటే శ్రీ కృష్ణస్వామి బెంగపెట్టుకుంటాడేమో! ఇక్కడే ఉపదేశిస్తాను.

దేవకీదేవి: నాకుకూడా ఉపదేశించు, స్వామీ!

సుదా: అంతకంటేనా!

యశోద: నాకుకూడా ఉపదేశించు, స్వామీ!

సుదా. తప్పకుండా!—శిష్యురాండ్రల్లారా, వినండి శ్రద్ధగా! శ్రీ గురువులవాక్యాలు శ్రద్ధగా వినాలి శ్రీ గురువులు ప్రత్యక్షంచేసే ఉపదేశము పరమప్రమాణంగా గ్రహించవలె సుమా!

అందరు: చిత్తము—చిత్తము—చిత్తము.

సుదా: 'సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ' అని శ్రుతి చెబుతున్నది. ఆ పరబ్రహ్మ మీ కళ్ల ఎదుట ప్రత్యక్షంగా ఉన్నాడు కృష్ణస్వరూపముతో—మీ చర్మచక్షుస్సులు మూసుకొని అంతరంగదృష్టితో దర్శించండి!—కనబడుతున్నదా?—

అందరూ: (ఆనంద తన్మయులై) ధన్యురాండ్రము!

సుదా: మీ కళ్లకేమి కనబడుతున్నది?—చెవులకేమి వినబడుతున్నది?—

రుక్మిణి: అంగనా మంగనా మంతరే మాధవో

సత్య: మాధవం మాధవం చాంతరేణాంగనా

జాంబ: ఇత్థ మాకల్పితే మండలే మధ్యగః

కాళింది: సంజగౌ వేణునా దేవకీనందనః

లక్షణ: క్వాపి వీణాభి రారావిణా కంపితః

సుదంత: క్వాపి వీణాభి రాకింకిణీ నర్తితః

మిత్రవింద: క్వాపి వీణాభిరామాంతరం గాపితః

భద్ర: సంజగౌ వేణునా దేవకీనందనః

దే. దేవి: బాలికా తాళికా తాళలీలాలయా సంగసందర్శితభ్రూలతావిభ్రమః

యశోద: గోపికాగీతదత్తావధానః స్వయమ్ సంజగౌ వేణునా దేవకీనందనః

సుదా: చాలు—చాలు!—మీకు బ్రహ్మవిద్య అనుభవానికి వచ్చినది!

అందరు: కృతార్థులము స్వామీ!

సుదా: అమ్మల్లారా, అమ్మాయిల్లారా!—చిత్రమదేనమ్మా!—ఎప్పుడూ ప్రత్యక్షంగా ఉన్న సత్యాన్నే చూడకుండా కళ్లు మూసుకుంటాము!—నేను వచ్చి ఆరునెలలయినదని శ్రీ కృష్ణయ్య చెప్పేవాడు—ఇన్నాళ్లూ మీరు నాకు చేసిన ఉపచారాల ఋణము తీర్చుకున్నాను.

రుక్మిణి: మాకు గురుదక్షిణ ఇచ్చే ప్రసక్తిలేకుండా ఉపాయము చేస్తున్నారు

దేవకీదేవి: తన సుహృత్తుకు ఖర్చులేకుండా చేస్తున్నాడు, స్వామి!

సుదా: అమ్మా, మీకు ఉపదేశించడమువల్ల నాకూ ఈనాడు బ్రహ్మవిద్య ప్రత్యక్షమైనది. కృతార్థుణ్ణి! కృష్ణా! నా విద్యార్థులు పాపము బెంగపెట్టుకుంటారు. పాపము మా బ్రాహ్మణి కూడా దిగులుపడుతున్నదేమో—ఆరునెలలయిందా వచ్చి! అనుజ్ఞ యియ్యి, శ్రీకృష్ణా!—నిన్ను విడిచిపోలేకున్నాను!—అయినా తప్పదు గదా!

శ్రీకృష్ణుడు: సుదామా, అట్లాగే!—నన్ను మరచిపోకుసుమా!

సుదాముడు: (ఆనందబాష్పాలతో) వెళ్లలేక వెళ్లలేక వెళుతున్నాను అమ్మా మరచిపోకండి మమ్ము!

దేవకీదేవి. చిత్తము కృష్ణా, దారుకుణ్ణి రథము తెమ్మను!

సుదాముడు: కులపతులు రథాలు ఎక్కుతారా, తల్లీ!—వద్దు! (బయలుదేరుతాడు)

[అంతా నిర్విణ్ణులై చూస్తూ ఉంటారు.]

తొమ్మిదవ రంగము

[ద్వారకానగరవీధి: నలుగురు పౌరులు ప్రవేశము]

1వ పౌరుడు కుచేలస్వామివారు తిరిగి వెళుతున్నట్లున్నారు.

2వ పౌరుడు: శ్రీకృష్ణప్రభువులు విచిత్రపురుషులు.

3వ పౌరుడు స్వామి సన్నిధిలో వీరు ధరించినవి దివ్యాంబరాభరణాలు. ఇప్పుడు మళ్లీ యథాప్రకారము కుచేలవేషమే!

4వ పౌరుడు: ఈ కుచేలస్వామి ఎంత మహానుభావుడో గమనించండి! ఆ దివ్యాంబరాభరణాలతో కంటె, ఈ కుచేలాలతోనే ఈయన ఎక్కువ శోభిస్తున్నాడు! ఆయన శరీరమంతా ఆనందముతో పులకరించి ఉన్నది; అంతరంగమంతా శ్రీకృష్ణతరంగితమై నాట్యముచేస్తున్నట్లున్నది—ఆయన నడచడమే లేదు.

1వ పౌరుడు : ఆహా, ఆయన నాట్యముతోనే ముందుకు పోగుతున్నాడు ఈ మహానుభావుని దర్శనమువల్ల మనము కృతార్థులము !

[తెర]

పదవ రంగము

[గురుకులములో వీధి]

సుదాముడు : (ఆనందతన్మయుడై) కృష్ణా, రుక్మిణీప్రియా, సత్యేశ్వరా, దేవకీనందనా, యశోదాతనయా !—నా హృదయంలో వేణుగానం చేస్తూ నృత్యము చేస్తున్నావా?

ఛాత్రులు : (సంభ్రమముతో నలువైపులనుంచి ప్రవేశించి) కులపతులవారు వేంచేశారు ! గురుదేవా, నమస్కారాలు !

సుదాముడు : నాయనలారా, అంతా క్షేమమా !

ఛాత్రులు : చిత్తము, తమ అనుగ్రహమువల్ల !

సుదాముడు : ఈ భవన మెవరిది?

ఛాత్రులు : తమదే గురుదేవా !

బ్రాహ్మణి : (పరిచారికలతో సంభ్రమముతో ప్రవేశించి, పరిచారిక అందించిన కనకపాత్రలోని జలముతో భర్త పాదాలు కడిగి తన శిరస్సునా ఛాత్రుల శిరస్సులనూ చల్లి) స్వామీ, ఎన్నాళ్ళకు మాకు దర్శన మిచ్చినారు !

సుదాముడు : మొన్న ఆ శ్రీకృష్ణుడు చెప్పేవరకూ వెళ్ళి ఆరునెలలయినదని తెలియదు అంతా రెండురోజు లనుకున్నాను.

బ్రాహ్మణి : స్వామీ, తమరు వెళ్ళి ఆరునెలలు కాదు, సంవత్సరమయింది.

సుదాముడు : నిజంగా ?

బ్రాహ్మణి : నిజము—ఆరునెలల క్రిందట ద్వారకానగరానికి మనుష్యులను పంపితే, స్వామివారు విద్యార్థులమీదను బ్రాహ్మణిమీదను బెంగపెట్టుకొని గురుకులానికి బయలుదేరి వెళ్ళినారని సెలవిచ్చినారు !—దేశదేశాలకూ మీరెక్కడ ఉన్నారో అని మనుష్యులను పంపినా మీ జాడ తెలియక దిగులుపడిపోతున్నాము, ఈ ఆరునెలలూ !

సుదాముడు : నిజంగా ?—మొన్ననేగా నేను ద్వారకానగరంలో బయలుదేరినది !—శ్రీకృష్ణస్వామి నా అంతరంగమంతా నిండి ఉన్నాడు ! చెప్పలేదూ నేను ! వాడికి నామీద ఎంత ప్రేమ ! రుక్మిణి, సత్య, కాళింది, భద్ర—ఒక్కరేమిటి వంతులువడుతూ నాకు సమస్తోపచారాలు చేసేవాళ్ళు !—బ్రాహ్మణీ, ఈ భవన మెవరిది ?

బ్రాహ్మణి : మీరు శ్రీకృష్ణ భగవానుని దర్శనానికి వెళ్ళిన ఫలము !—మాకెందుకు ఈ భవనాలని అంటూఉన్నా, మన శ్రేష్ఠి, కాదు కూడదు – శ్రీకృష్ణప్రభువుల ఆదేశము అంటూ కట్టించినాడు !—అడుగో శ్రేష్ఠి వస్తున్నాడు వారినే అడగండి !

శ్రేష్ఠి : (ప్రవేశించి) కులపతులకు దణ్ణాలు !

సుదాముడు : కుశలమా, శ్రేష్ఠీ !—ఏమిటి ఈ భవన నిర్మాణము! ధనమెక్కడిది ?

శ్రేష్ఠి : అంతా శ్రీకృష్ణులవారి కటాక్షము !—మీరటు శ్రీకృష్ణులవారి దర్శనానికి బయలుదేరిందే మొదలు—కొత్త రయితులు వచ్చి మన పొలాలు సుక్షేత్రాలు చేశారు. సకాలములో వర్షాలు కురిసినవి. కరువు పోయినది. అప్పులు తీరినవి ఊరంతా సుభిక్షంగా ఉన్నది. రయితులంతా మేడలు కట్టినారు మీ శిక్కలో డబ్బు మూలుగుతున్నది.

సుదాముడు : నిజం ?

శ్రేష్ఠి : మూడు రాత్రులు శ్రీకృష్ణులు స్వప్నములో దర్శన మిచ్చి ఆ ధనము ఈ భవనాలు కట్టించమని ఆదేశించారు. అమ్మగారు వద్దంటున్నా నేనే శ్రీకృష్ణాదేశము వల్ల పట్టుపట్టి కట్టించాను గృహప్రవేశము చేయండి తమరు అమ్మగారితో !

సుదాముడు : (అందరూ దారి చూపుతూ ఉండగా గృహప్రవేశము చేస్తూ) ఆహా, ఇప్పుడు తెలిసినది. శ్రీకృష్ణుడు పట్టి మాయలాడు ! అప్పుడు సత్య అంటుంటే కాదన్నాను కాని శ్రీకృష్ణుడు పట్టి అబద్ధాల పుట్ట ! సత్యవాక్కే సత్యము ! ఈ సంపద చూసి తనను మరుస్తానేమో పరీక్షించదలచినాడు !—బ్రాహ్మణీ, శ్రీకృష్ణుణ్ణి మరిచేవు సుమా, ఈ ఐశ్వర్యంలో !

[తెర]

ఇంద్రచాపము

శ్రీ వజ్ఝల కాళిదాసు

భావి!.... కలల విన్న భావసంగీతంబు,
పుటలు విప్పబడని పుస్తకంబు,
కాలరాక్షసి లయకాలగర్జాధ్వని,
ఉల్లమలర విచ్చు మల్లెమొగ్గ!

ఈ దరిద్ర మార్గమ్ముల నిందుకిరణ
జాలములు ప్రాకనేమొ యుగాల నాటి
ముసలి ముడుతలతో — శల్యములను కొరికి
విరుచు చలిమంచు గాలులే వీచు నిచట!

గిరి గుహా ముఖమ్ములనుండి పరుగు పెట్టి,
భూజముల ద్రోసుకొని వచ్చి, పూలతోట
లం బరిభ్రమించి, సరోవరంబు లందు
జలకముల నాడి, దక్షిణానిలము వీచు.

ఆత్మ బట్టలేని యాక్రందనోద్ధతి
నే నెలుంగు నెత్తి యేడ్చుచుండ
దిక్కులన్నియును ప్రతిధ్వని రూపాన
కసరు కొనుచు ద్రిప్పి విసరి కొట్టు!

పట్టుమీద నద్దబడిన లేతగులాబి
రంగు బుగ్గలందు పొంగు లురల
పాలకడలి తల్లి వక్షమ్ముపై నాడు
పాప నవ్వు లమృతభాండములగు!

తారకా మల్లికా కోరకమ్ములకు
ప్రతిరాత్రి జననమ్ము ప్రత్యుదయ మృతి!

నీలాంబరంబున నిల్చిన శశికి
కన్పించెనా సరోగర్భాన ముఖము,
పూర్వ మెన్నడులేని మోహన గతుల
నవ్వుచున్నాడు విన్నాణమ్ము నిండ!

నీవు నేను నిచట నిల్చిన యంతనే
గాలి యేల నిల్చు గదలకుండ;
మనము చెప్పుకొనెడి మాటల పాలింప
నెమ్మదిన్ గుతూహలమ్మొ యేమొ?

సంజదారులందు జక్కగా నేతెంచు
లలితమైన లే గులాబి కన్నెఁ
బట్టి వెనుక కీడ్చి వైచుచు నున్నవి
కారు నలుపు రంగు కరము లెవియొ!

ఈ రజని మోముపై నీలి యురులకురులు
ముడులువడును విరియబారు కడల నెల్ల;
అక్కడక్కడ పోగైన చుక్కలేల
విరగబడి నవ్వు నిదియేదొ వింతయట్లు.

కొసరి కొసరి పాడు కోయిల యొచటికో
కదలి చనిన వెట్టికారురేయి
ఆకు సందులందు నావంత గుసగుస
లాడుకొనవు గాలులైన నేడు!

ఈ మహాకాళరాత్రికి నెన్ని కనులో
ఆ సహస్రాక్షుడే వెరగందుఁ జూచి
రెప్ప లల్లార్చు మిణుగురు, లుప్పరమున
దళుకు మనుచు జారిపడుచు దార కాళి!

కనులు చెదరగొట్టు ఘనవల్లికాతతి,
గుండియలను బెదరగొట్టు పిడుగు,
లవని ముంచువర్ష, మైన నేమాయెను?
క్రొత్త ముదము లిచ్చు రోహితమ్ము!

ఉదయ సుందరి వచ్చుచున్నది మిటారి
కులుకు కెందమ్మి పువ్వుల కొలనులందు
జలకమాడి లే బంగరు వలువ మెల్ల
జార విడుచుచుఁ గ్రొత్త యొయ్యార మొలుక!

వెన్నెలల నీను నీ చంద్రబింబమింక
కదల వీలులే దీగీత గడచి యనుచుఁ
జిహ్వ మొక్కటి ప్రకృతి రచించె ననగఁ
గనబడును పరివేష మాకసమునందు !

ఇన్ని మెరపులు మెరయు నీ చిన్నిమెయిలు
తునుక కురియలే దేమొక్క చినుకునైన?
ఏక భావమె రగులు నా హృదయమందు
బోడము నేటికో, బాష్పాంబువులు తడబడి!

రామాయణ కథాగానము - అధ్యాత్మరామాయణ విశిష్టత

కుమారి యం. యస్. రాణీ ప్రమీలాదేవి

భారతీయ సంస్కృతికి వేదము ఆధారమైనను అది పుష్పఫల వంతమై చల్లని నీడనిచ్చే వృక్షరూపముగా ప్రసరించినది రామాయణ, మహాభారతాలవలననే ఒక్క భరతఖండములో నేకాక భారతీయ సంస్కృతి వ్యాపించిన విస్తారభారతము (Greater India) అని పిలువబడే బర్మా, సయాం, కంబోడియా, మలయా, బలి, జావా, సుమత్రా, బోర్నియో-ఇత్యాది దేశాంతర, ద్వీపాంతరాలలోకూడా ఈ రెండు ఇతిహాసాలు విస్తరించి అక్కడ స్థిరనివాస మేర్పరచుకొన్నవి. ఆ రెంటిలోనూకూడా ఆది కవి రచించిన రామాయణకథ ఎక్కువ అభిమానపాత్రమైనది.

రామాయణము ఇంతగా అభిమానపాత్రము కావడానికి ప్రధాన హేతువు దాని రచనావిశేషములోనే ఉన్నది స్వయముగా వాల్మీకియే దానినిగురించి 'పాఠ్యే గేయేచ మధురమ్' అని చెప్పుకొన్నాడు అంటే నేటి సంగీతవిద్వాంసుల పరిభాషలో మాతు, ధాతువులలో మాధుర్య మున్నదన్నమాట! వాక్కుకు మాతువని, గేయమునకు ధాతువని సంజ్ఞలు ఈరెండూ చేయువాడే వాగ్గేయ కారుడు ఈ దృష్టితో విచారిస్తే వాల్మీకి ఆదికవి మాత్రమే కాడు, ఆది వాగ్గేయకారుడు కూడా నేడు వాల్మీకమునకు పాఠ్యముగానే ప్రచారమున్నదిగాని గేయముగా లేదు దురదృష్టవశాత్తుగా దాని గేయసంప్రదాయము అంతరించి పాఠ్యముగనే నిలిచి ఉన్నది కాని బాలకాండ నాల్గవసర్గము చదువునపుడు వాల్మీకి తన కావ్యములోని పాఠ్యతకుకంటే గేయతకే ఎక్కువ ప్రాధాన్య మిచ్చినాడా, అనిపిస్తుంది ఆయన రామాయణ రచన పూర్తి చేసిన తరువాత దానిని కుశలవులకు ఉపదేశించిన సందర్భంలో --- ఉన్నది-

"పాఠ్యే గేయే చ మధురం ప్రమాణై స్త్రిభి రన్వితమ్
జాతిభి స్సప్తభి ర్బద్ధం తంత్రీలయ సమన్వితమ్
రసై శ్శృంగార కరుణ హాస్య వీర భయానకైః
రౌద్రాదిభి శ్చ సంయుక్తం కావ్య మేత దగాయతామ్.
తౌతు గాంధర్వ తత్త్వజ్ఞౌ మూర్ఛనాస్థాన కోవిదౌ
భ్రాతరౌ స్వరసమ్పన్నౌ గంధర్వావివ రూపిణౌ
రూపలక్షణ సమ్పన్నౌ మధురస్వర భాషిణౌ"

కుశలవులు రాజమార్గములలో రథ్యలలో అది పాడి- వినిపించుచుండగా తెలుసుకొని స్వయముగా శ్రీరాముడే వారిని తన సన్నిధికి పిలిపించి తమ్ములు మొదలైన ఆప్తులతో పరివేష్టితుడై కూర్చుండి, వారలను వినమనిచెప్పి ఆ గాయకులను చోదన చేసెనట! అప్పుడు

"తౌ చాపి మధురం రక్తం స్వంచితాయత నిస్స్వనమ్
తన్త్రీలయవ దత్యర్థం విశ్రుతార్థ మగాయతామ్
హ్లాదయ త్సర్వ గాత్రాణి మనాంసి హృదయాని చ
శ్రోత్రాశ్రయ సుఖం గేయం తద్బభౌ జనసంసది...

* * *

తతస్తు తౌ రామవచః ప్రచోదితౌ
అగాయతాం మార్గ విధాన సంపదా-"

వారానాడు పాడినదే నేడు మనకు వాల్మీకి రామాయణ రూపముగా ప్రత్యక్షమై నిలిచి ఉన్న ఆదికావ్యము!

ఇందులో ఆశ్చర్య మేమీ లేదు లోకములో ఎక్కడనైనా కవిత్వము ఆదిలో గేయ రూపములోనే ఆవిర్భవించింది. గ్రీకు కవి 'హోమరు' తన రెండు ఇతిహాసాలు — 'ఇలియడ్, ఒడిస్సీ' లను — ప్రభువుల ఆస్థానాలకు పోయి స్వయముగా 'లైరు' అనే తంత్రీ వాద్యము తోడుగా వినిపించేవాడని ప్రసిద్ధి. మన దేశములోనో, ఋషియైన ఆదికవి తన శిష్యులచేత తన్త్రీలయ సమన్వితమైన గానము చేయించినాడు. అంతే భేదము!

మన గాన సంప్రదాయము ఎన్నెన్నో పరిణామాలు చెందినది. కాని మొదటినుండి మార్గ, దేశి విభేదాలున్నట్లే తోస్తుంది. రామాయణ రచన నాటికే 'మార్గ విధాన సమ్పదా' అన్న దానిని బట్టి ఈ భేదమును అనుమేయింపవచ్చును కాని ఒకనాడు దేశిగా ఉన్నదే సహృదయులకు నచ్చి లక్షణవేత్తలు గ్రహించి లక్షణము నిర్వచింపగా, అదే మార్గ విధానముగా పరిగ

పింపబడుట మన సంగీత సంప్రదాయ చరిత్రగా తోస్తుంది. కుశ లవులు రామాయణ గానము చేసిన మార్గవిధాన సంపట ఎట్టిదో ఛాయామాత్రముగానైనా నేడు మనము ప్రవర్తించేందుకు సాధ్యము కాకుండా విస్మృతమై పోయినది. అందువలన వాల్మీకి రామాయణము ప్రస్తుతము పాఠ్యముగానే నిలిచిపోయినది. అయి నను రామకథయందు ప్రీతి గలవారు 'పాఠ్యే గేయే చ మధురమ్' అనే మాట ఎన్నడూ మరచిపోరు ఈ కారణము చేతనేయేమో మన దేశభాషలలో పుట్టిన రామాయణాలు విస్తారంగా పఠన గానములను పోషించుటకే ప్రయత్నించినవి

భారతీయ భాషలన్నిటియందు అప్పుడు పుట్టిన రామా యణాలన్నిటిలో ముందు ప్రశంసింప దగినది మన ఆంధ్రదే ములో పుట్టిన రంగనాథ రామాయణము అది 12 వ శతాబ్ద ములోనిది పాఠ్యమూ గేయమూ అయిన ద్విపదలో రచింపబడి నది. తెలుగు దేశములో తోలుబొమ్మలాడించెవారు కథకథనా నికి తెరలోనుండి రంగనాథ రామాయణమే ప్రధానముగా గానము చేస్తారని గుర్తుంచుకొనవలెను.

ఆ తరువాత తమిళములో 13 వ శతాబ్దములో పుట్టిన కంబరామాయణము చెప్పదగినది. అది కూడా పాఠ్యమే కాక గేయము కూడా. అది పుట్టినప్పటినుండి నేటివరకు తమిళ, కేరళములలో తోలుబొమ్మలాడేవారు పటంగా దానినే ప్రయో గిస్తున్నారట

ఆ తర్వాత 15వ శతాబ్దములో వంగభాషలో, మొత్తము మీద వాల్మీకి ననుసరించి కృత్తివాస కృత రామాయణము పుట్టినది అదికూడా మాత్రాచ్ఛందస్సులో పాదాంత్య ప్రాస నియమముతో నడిచిన గేయమే 15, 16 శతాబ్దాలలో వంగ భాషాకవులు అధ్యాత్మరామాయణానువాదాలుకూడా చేసినారు. అన్నీ గేయకవితలే

తరువాత ప్రసిద్ధిపొందిన రామకథాకావ్యము 16వ శతా బ్దములో గంగాతీరములో పుట్టిన తులసీదాసుని రామచరిత మానసము అదికూడ పఠనగానములకు అనువైనది దానిలో సామాన్యముగా వరుసగా 4 చౌపాయిలు (చౌపాయి అనగా నాలుగు పాదములు కలది) దాని తరువాత దోహా (ద్విపది) సోరఠా, ఛందస్సు — ఈ మూడింటిలో ఒకటిగాని రెండుగాని ఉండును. తులసీదాసు వాల్మీకి కథకు ఇతర కథలెన్నో చేర్చినాడు అతడు సంస్కృతములోని అధ్యాత్మరామాయణమునుండి 'శ్రీరామ హృదయము'ను గ్రహించి రాముని మానవ మాత్రునిగా గాక పర

తంతి : "WRITING" ఫోన్. 24881

ఎ. ఎస్. అణ్ణామలై చెట్టియార్ & కం.,

పేపర్ మర్చంట్స్ అండ్ స్టేషనర్స్

నెం. 15, ఆండర్సన్ వీధి, మద్రాసు-1.



బ్రాంచీలు :

56, బిగ్ స్ట్రీట్,
మద్రాస్ - 5.
ఫోన్ 85890

6/7, బద్రయన్ వీధి,
మద్రాస్ - 1.
ఫోన్: 21467

డిస్ట్రిబ్యూటర్లు :

* గాంజెస్ ప్రింటింగ్ యింకులు *





నాట్యం —శ్రీమతి దామెర్ల సత్యవాణి

ప్రత్యక్షముగా చిత్రించినాడు. రామకథను పార్వతికి శివుడు చెప్పినట్లుకూడా అధ్యాత్మరామాయణము ననుసరించే చేసినాడు.

దానితో సరిగా ఆ శతాబ్దములోనే, ఆధునిక మలయాళ భాషకు పిత అనదగిన ఎళుత్తచ్చన్ రచించిన రామాయణము గణింపదగినది. అతడు అందులో ప్రధానముగా వాల్మీకి రామాయణమునుగాక అధ్యాత్మరామాయణమునే అనుసరించెను. అది పుట్టినప్పటినుండి నేటివరకు కేరళదేశీయులు అబాలగోపాలము గానము చేస్తున్నారు దాని అవిర్భావముతో మలయాళములో తక్కిన రామాయణములన్నియు విస్మృతప్రాయములైనవి

ఆ శతాబ్దములోనే నరహరి కన్నడభాషలో తొరవెయ రామాయణమును రచించెను అది భామినీ షట్పదిలో నున్నది కావున గేయముకూడ అందులో అతడు వాల్మీకినే అనుసరించెను మరల కన్నడములోనే 18వ శతాబ్దములో శంకరనారాయణ షట్పదిలోనే అధ్యాత్మరామాయణమును అనువదించెను.

ఆ పిమ్మట ప్రశంసింపదగినది 16, 17 శతాబ్దములలో ఓఢ్రములో పుట్టిన బలరామదాస రామాయణము ఆంధ్రములో పుట్టిన స్త్రీల రామాయణపు పాటలలో ఆంధ్రుల ఆచారవ్యవహారములు ప్రతిబింబించునట్లుగనే ఓఢ్రుల ఆచారవ్యవహారము లందు ప్రతిబింబించును అదికూడా గేయాత్మకమే.

ఇక మరాఠీభాషలో పదిహేడవ శతాబ్దములో సమర్థ రామదాసస్వామి రామాయణ భాగములను, 18వ శతాబ్దములో మోరోపంతు లనేక రామాయణములను రచించినారు. అన్నీ గేయాత్మకాలే

రంగనాథ రామాయణము తరువాత ఆంధ్రభాషలో పుట్టిన రామాయణాలు అసంఖ్యాకములైనవి శ్రీరాముని జన్మస్థానమయిన అయోధ్యనుండి ఆయన పర్ణశాల నిర్మించుకొన్న భద్రాచల సమీపము వరకు గీత గీయగా దానిని చుట్టివచ్చే ప్రదేశమంతా రామభక్తి వ్యాపించినట్లు తోస్తుంది. ఆ పరిధిలోనిదే ఆంధ్రదేశము

2

ఆంధ్రదేశములో ఎన్నో మతములు వెలసినవి ఎందరో దేవతలు ప్రీతిపాత్రములైనారు. ఇక్కడ వెలసిన రామాలయాలు కూడా తక్కిన దేవతల ఆలయాలతో పోల్చి చూస్తే అధికమే కాని ఆంధ్రుల ఇష్టదైవము శ్రీరామచంద్రుడే అని చెప్పటకు సందేహములేదు ఇందులో పండితులు, పామరులు అన భేదము లేదు కులభేదములేదు శ్రీరామచంద్రుడు ఆంధ్రుల హృదయమునే మందిరములుగా ఆవేశించి అధిష్ఠించినాడనవచ్చును. ఏమి వ్రాయుటకు ఉపక్రమించినను ఆంధ్రులు శ్రీరామ పెట్టి కాని వ్రాయరు. తల్లులు పిల్లలకు స్నానముచేయించిన పిమ్మట రోజూ శ్రీరామరక్షణే చేస్తారు ముష్టికి వచ్చినవారంతా "శ్రీ సీతారామాభ్యాం నమః" అనే కేకవేస్తారు ఆశ్చర్యార్థకముగా 'అయ్యో, రామా!' అనీ, నిశ్చయార్థకముగా 'రామ, రామ, నేనేమి ఎరుగనని రామస్మరణ పూర్వకముగనే అంటారు. ధర్మరక్షణకు ప్రజలు ప్రచారము చేయవలసివచ్చినపుడు రామదండులే ప్రచలితమయ్యేవి

'అడుగుదాటి కదలనీయను, నా కభయ మిచ్చాయక నిన్ను విడువను' అని, కుశలవుల ముద్దుకూడా ఎరుగని శ్రీరాముని కన్నబిడ్డవలె నిలబెట్టి, 'పలుకే బంగారమాయె, పిలిచిన పలుకవేమి?' అని ధాష్ట్యకముగాకూడా ప్రశ్నించగలిగిన రామభక్తాగ్రేసరుడు ఆంధ్రుడైన భద్రాచల రామదాసు అతని కైంకర్యమువలనే భద్రాచలక్షేత్రము అనాది ప్రసిద్ధమైన శ్రీశైలక్షేత్రముతో సమానమైన ఖ్యాతి గడించినది తమిళదేశములో నివాసముచేసి కొన్నా ఆంధ్ర కుటుంబములో జన్మించిన శ్రీత్యాగరాజస్వామి 'తారకరూపుని నిజతత్త్వార్థమ తెలిసి రామచింతనతో నామము' గానము చేసి తరించిన నాదతపస్వి ఆంధ్రదేశములో రామప్రతిష్ఠ చేసిన దేవాలయాలు తక్కువే అయినా రామ మందిరాలు, భజన కూటాలు వేలకు వేలున్నవి రామకోటి వ్రాసేవారు కోకొల్లలు. దేవతార్చనచేసే స్మార్తులలో చాలమంది శ్రీరామ పంచాయతనమునే అర్చిస్తున్నారు

శ్రీరాముడు సీతాలక్ష్మణసహితుడై అరణ్యవాసముచేసిన 14 సంవత్సరములలో సుమారు 13 సంవత్సరాలు ఆంధ్రదేశములోనే పర్యటించినాడు అప్పటి దండకారణ్యము ఎక్కువ భాగము ఆంధ్రదేశములోనే ఉండేది అందులో అక్కడక్కడ ఉన్న ఋష్యాశ్రమాలలో ఎక్కువ కాలము గడిపినాడు 14వ సంవత్సరములో సీతావియోగము ప్రాప్తించినది. ఆయన సీతాన్వేషణము చేస్తూ వియోగదుఃఖముతో గోదావరిని, కృష్ణను దాటి వినుకొండ దగ్గర జటాయువును చూచి సీత వార్త విని, పశ్చిమంగా ప్రయాణము చేసి, కబంధ శాప విమోచనముచేసి తుంగభద్రాతీరమందలి పంపాక్షేత్రము చేరుకొన్నాడు అక్కడ సుగ్రీవ సఖ్యము, వాలివధము చేసి, తుంగానదికి దక్షిణతీరమందున్న మాల్యవంతములో కొన్ని నెలలు గడిపి సీతాన్వేషణముచేయించినాడు అక్కడినుండే లంకమీద దండయాత్రకు బయలుదేరి సరాసరి రామసేతువు సమీపమునకు చేరుకొన్నాడు శ్రీరామ పాదవిన్యాసముతో ఆంధ్రదేశమంతా పవిత్రీకృతమైనది ఏ మారుమూల పల్లెపట్టుకు వెళ్ళినా, స్థానికులు 'ఇక్కడ శ్రీరాముడు ఈ పనిచేసినాడు. ఇక్కడ సీతమ్మ స్నానముచేసింది—ఇక్కడ ఈ పని జరిగినది' అని మొదలుగా సీతమ్మ తమ ఇంటి ఆడుపడుచు అయినట్లుగనే ఎన్నెన్నో చెప్పగా వింటూ ఉంటాము అవి నేటి నవనాగరికులు మరచిపోతున్నా, ముదుసలుల నాలుకలమీద ఇప్పటికీ కొంత కొంత ఆడుతూనే ఉన్నవి. అవి ప్రత్యేకముగా సేకరింపదగినవి.

కాళిదాసు మేఘదూతములో వివాసితుడైన యక్షుని నివాసముగా చేసిన 'రామగిర్యాశ్రమములు' ఆంధ్రదేశములోనివే అవి 'జనకతనయా స్నానపుణ్యోదకము'లని విశేషించి వర్ణించినాడు.

ఈ విధముగా శ్రీరాముడు ఇలవేలుపైన ఆంధ్రభూమిలో

రామాయణము చెప్పనిదీ. రామస్మరణముచేయునిదీ జిహ్వకు పవిత్రత చేకూరదనే భావము ఆంధ్ర కవులలో స్థిరపడుట సహజమే. అందువలననేయేమో దేశభాషలన్నిటిలో చక్కని రామాయణ కావ్యము ముందు వెలసినది ఆంధ్రభాషలోనే! అది రంగనాథ రామాయణము అది పాఠ్యమూ గేయమూకూడా!

ఆ తరువాత ఆంధ్రములో పాఠ్యరామాయణములే వెలయ సాగినవి. దానికి ముందు దారి చూపినవాడు ఉభయకవిమిత్రుడైన తిక్కనామాత్యుడు నిర్వచనోత్తర రామాయణముకూడా పాడుకొనవచ్చునేమో కాని అది గేయప్రబంధ మనలేము గదా! అట్టిదే ఎఱ్ఱయ ప్రోలయ వేమారెడ్డికి అంకితముగా రచించిన రామాయణము. ఆ దారినే నడచినది భాస్కరాదులు రచించిన రామాయణము మొల్లరామాయణమూ అంతే అయ్యలరాజు రామభద్రుని రామాభ్యుదయము, పింగళి సూరన రాఘవ పాండవీయము, కంకంటి పాపరాజు ఉత్తర రామాయణము, రఘునాథ రామాయణము, కూచిమంచి తిమ్మకవి అచ్చతెనుగు రామాయణము, గత శతాబ్దిలో పుట్టిన గోపీనాథ రామాయణము,వట్టాభి రామాయణము,అద్భుత రామాయణము—అన్నియు పాఠ్యప్రధానములే ఈ శతాబ్దములోపుట్టిన, పుట్టుచున్న వాసుదాసురచించిన ఆంధ్ర వాల్మీకి రామాయణము, మానికొండ రామాయణము, కవిసార్వభౌమ శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి కృష్ణరామాయణము, తాడేపల్లి వెంకటప్పయ్యశాస్త్రి రామకథామృతము, విశ్వనాథ సత్యనారాయణ రామాయణ కల్పవృక్షము, ధర్మవరపు సీతారామాంజనేయులు సాహితీ సమితిపేర అచ్చువేయుచున్న ధర్మవరపు రామాయణము—ఈ విధముగా అచ్చయినవీ కానివీ శతసంఖ్యలలో రామాయణాలు పుట్టినవి. ఆంధ్రదేశములో పుట్టినన్ని రామాయణాలు ఇతరప్రాంతాలలో పుట్టినట్లు తోచదు. ఇవిగాక భారత భాగవతాలలో సందర్భవశాత్తుగా వచ్చిన రామకథలు, ఎఱ్ఱయ అరణ్యపర్వములోను, పోతన నవమస్కంధములోను వ్రాసినట్లుగానే శ్రీదేవీ భాగవత కర్తలు తృతీయస్కంధములో రామకథ వ్రాసినారు. అందరూ ప్రసిద్ధులైనకవులే. అన్నీ కావ్యాలుగా రమణీయమైనవే కాని గేయములు కావు. పాఠ్యములైన రామాయణ రచనకు దారి చూపినవాడు ఉభయకవిమిత్రుడే.

రంగనాథరామాయణమువలెనే పాఠ్యగేయోభయముగా ద్విపదలో వరదరాజు, ఏకోజీ మొదలైనవారు వ్రాసినారు. కాని వారికి రంగనాథరామాయణానికి వచ్చిన ప్రచారము రాలేదు.

3

ఇవిగాక పండితులు గానివారు ఎందరో రామకథను ముఖ్యముగా గేయఫణితులలో, రచనలు చేసినారు. అట్టివి మొన్న మొన్నటివరకు ముఖ్యముగా వేదమువలెనే ఆ నోటినుండి ఆ నోట స్త్రీలు చెప్పుకొని వల్లించుటచే నిల్చినవి ఎన్నో ఉన్నవి. గుజిలీ పుస్తకములుగా ఎన్నో అచ్చుపడినవి. వాటిలో కొన్నిటిని సేకరించి హైదరాబాదులో ఆంధ్ర సారస్వత పరిషత్తువారు 'కృష్ణశ్రీ' సంపాదకత్వాన 'స్త్రీలరామాయణపు పాటలు' అనే పేరుతో చక్కగా 1950 లో ప్రచురించినారు.

వీటిలో ఎక్కువ భాగము స్త్రీలు వ్రాసినవని చెప్పవచ్చును. కొన్ని పురుషులు వ్రాసినవికూడ కావచ్చును. కాని వ్రాసిన వారైనను, అటు ధాతువులో కాని, ఇటు మాతువులో కాని అంత పాండిత్యము కలవారు కారు వ్యాకరణలక్షణాలు లెక్కచేయరు. పాట నడక కోసము పదాలలో అక్షరాలు సాగిస్తారు, కోస్తారు. ఇది వైరి సమాసమని, ఇది వ్యాకరణ విరుద్ధమనీ ప్రయోగించుటకు సందేహించరు. ఏది ఏమైనా వాటి మాధుర్యము హృదయానికి సూటిగా నాటుకుంటుంది. సహజసుందరమైన అమాయకపు తేటరచన వాటిది వీటిలో రామకథ తెలుగునాటి ఆచారాలతో నిండి నిబిడీకృతమైనది. సీతాదేవి వామనగుంటలు, సీత దాగుడు మూతలు, ఊదర కుప్పీలు, శ్రీరాముల వారి అలక, సీత అప్పగింతలు, సీత సమర్త, సీతమ్మ వేవిళ్లు, కుశలవుల తొట్టె—ఈ మొదలైన పేర్లనుబట్టి రామాయణ పాత్రలు ఎంతగా తెలుగుదనము కూర్చుకొన్నారో స్పష్టపడుతుంది. ఈ కథలు చదివితే మన ఇళ్లలో రోజూ జరిగే నవ్వులు, పరిహాసాలు, మాటి పోటీలు, కోపతాపాలు ఆ పాత్రలకు అంటగట్టబడి ఉన్నట్లుండును. ద్రావిడములోకూడ ఇట్లే రామకథ స్త్రీ ఆచారాలు పొదువు కొన్నదట!

ఈ కథలలోని నిసర్గమైన అవ్యాజ మాధుర్యమే వీటి విశిష్టత. ఈ విశిష్టత ఎట్టిదైనా అది శాస్త్రవేత్తల లక్షణానికి నిలవలేదు ఒక్కమాటలో చెప్పవలెనంటే వాటి పాఠ్యము, గేయత్వమును దేశయములేగాని మార్గపద్ధతులు కావు. అవి భాషా విద్వాంసులకుగాని, సంగీత విద్వాంసులకుగాని లక్షణమునకుగాని తృప్తి కలిగించవు.

4

13వ శతాబ్దమువాడైన శార్ఙ్గదేవుడు వాగ్గేయకారవరుల లక్షణమును మొత్తమువిగాద ఈ విధముగా నిర్వచించాడు.

'శబ్దానుశాసనజ్ఞానము, అభిధాన ప్రవీణత, ఛందోభేదజ్ఞానము, అలంకార కౌశలము, రసభావ పరిజ్ఞానముతో పాటు అశేషభాషా విజ్ఞానముకూడా ఉండవలెను.' తౌర్యత్రిక చాతుర్యము, హృద్యశారీరము, లయ, తాళ కళా జ్ఞానములతో పాటు, ఉచితజ్ఞతయేకాక రోష ద్వేష పరిత్యాగముకూడా కావలెనట. ఇట్టి లక్షణాలు ఇంకను ఎన్నో ఉన్నవి.

శార్ఙ్గదేవుడు చెప్పిన లక్షణాలు అన్వయించుటకు అర్హత గలవాడు లోకములో మనుష్యమాత్రు డుంటాడని తోచదు. ఋషియైన వాల్మీకికీ ఈ లక్షణాలన్నీ పట్టించలేము ఈ లక్షణ నిర్దేశమువలన లక్షణకర్త ఎంత ఉన్నతాదర్శముతో వాగ్గేయకారకుని భావించినాడో తెల్లమగుచున్నది

అపాధ్యమైన ఈ లక్షణాలెలా ఉన్నా, ఉత్తమ మధ్య మాధమ భేదాలు తెలిపి వాటిని వర్ణించినాడు. రెండు మూడు

విధాలుగా వివరించినాడు. అందులో ఒకదాని ప్రకారము వస్తుకవి ఉత్తముడు వర్ణనకవి మధ్యమము. ఇతరుల సంగీతానికి సాహిత్యము కూర్చేవాడు అధముడు. వస్తుకవి అంటే తాను సృష్టించిన సంగీతానికి వర్ణనము చేర్చుటే కాక కథ కథనము చేయగలవాడన్నమాట బహుశః పాఠ్యగేయేచ మధురముగా రసవత్తర కావ్యరచన చేసిన వాల్మీకిని మనసులో భావించి ఉత్తమ వాగ్గేయకారకుని లక్షణము ఆయన ఆ విధముగా చెప్పిఉంటాడు. ఆయన కావ్యములోని గేయత్వము మన కిప్పుడు తెలియదు గదా! కథా కథనములో రసవత్తరమైన పాఠ్యముగ రచించే సామర్థ్యము వాల్మీకితో సమానముగాగల కవి ఇంతవరకు పుట్టలేదు కాని తన సంగీతమునకు వర్ణనలేకాక కథనము కూడా జోడించినవాడే ఉత్తమ వాగ్గేయకారకుడౌతాడని మనము సామాన్య లక్షణముగా గ్రహించవచ్చును. మనము ఇలా విచారణచేస్తే ఆ కోటిలో నిలవ తగినవి సంస్కృతములో జయదేవుని గీతగోవిందము, శ్రీ నారాయణతీర్థుల కృష్ణలీలా తరంగిణి మాత్రమే మిగులును ఆంధ్రములో సుబ్రహ్మణ్యకవి అధ్యాత్మ రామాయణముకూడా ఆ కోవలోనిదే శ్రీ త్యాగరాజ స్వామి కూడా ప్రహ్లాద భక్తివిజయము, నౌకా చరిత్రములు రచించి తన అతిశయమును ప్రకటించినాడు.

పై విధముగా విచారిస్తే రంగనాథ రామాయణము, తిక్కన ద్విపద రామాయణాలు పాఠ్యగేయాత్మకములైనను, వానిలో పాఠ్యమునకే ప్రాధాన్య మున్నది కాని గేయమునకు అంత లేదు అందువలన అవి పైవాటితోపాటు ఉత్తమస్థానమును పొందలేవు ఆంధ్రమున పుట్టిన ద్విపద రామాయణములకే కాక ఇతర దేశభాషలలో పుట్టిన కంబ, తులసీదాసు, ఎళుత్తచ్చన్, బలరామదాసుల రామాయణాలకుకూడ పై వాక్యములు అన్వయిస్తాయి అవి అన్నీ గేయాలైనా వాటిలో గేయత్వము అప్రధానము, పాఠ్యము ప్రధానము

మరి తిక్కనాదుల కావ్యములలో గేయత్వము సమకూర్చవలెనను ప్రయత్నమే లేదు కదా!

పై వాగ్గేయకార లక్షణానికి నిలబడగల రామాయణ రచనలు ఆంధ్రములో రెండే ఉన్నవి. వానిలో ఒకటి సుబ్రహ్మణ్యకవి అధ్యాత్మ రామాయణము, రెండవది నారాయణ కవి మోక్షగుండ రామాయణము. ఈ రెండింటిలో మోక్షగుండ రామాయణము పాఠ్యముగాగాని గేయముగాగాని అధ్యాత్మ రామాయణమునకు తీసికట్టే అది రెండింటిలో దేశికి దగ్గరగా ఉంటుంది. 'మార్గవిధాన సంపద' అధ్యాత్మ రామాయణములోనే పాఠ్యగేయములలో పరిణతి పొంది కనిపిస్తుంది.

5

ఈ అధ్యాత్మ రామాయణకర్త శ్రీ సుబ్రహ్మణ్య కవి ఆయనను గూర్చి శ్రీ తిమ్మావజ్ఝల కోదండరామయ్య ఖర సంవత్సర (1951) భారతిలో 'దామెరవారి విరాది పదములు' అనే వ్యాసములో పరిశోధకులకు ఆధారమైన విషయము లెన్నో తెలిపినారు అందులో వారు చేసిన కాల నిర్ణయము నిర్దుష్టమైనది కాదు. అందులో వారు ప్రకటించిన దామెరవారిమీద పదములు సుబ్రహ్మణ్యకవి కృతములని వారూహించిరి. కాని శ్రద్ధగా పరిశీలించినవారికి ఆయన వ్రాసినవి కావనటానికే ఎక్కువ అవకాశ మున్నది. కాని రెండు పత్రములలో ఉన్నట్లు ఉదాహరించిన ఈ క్రింది వాక్యములు స్పష్టముగా అధ్యాత్మ రామాయణ కర్తకే అన్వయించుననడానికి సందేహము లేదు.

"మునిపల్లె రామలింగార్య పుత్రులైన సుబ్రహ్మణ్య కవితా చాతుర్యంబుగా రచియించిన అధ్యాత్మ రామాయణ కీర్తనలు తమ ప్రియశిష్యులైయున్న రాజశ్రీ దామెర కృష్ణ స్వామివారికి కృపచేసి యిచ్చిన పుస్తకం"

'మునిపల్లె రామలింగార్య పుత్రులైన సుబ్రహ్మణ్య కవితా చాతుర్యంబుగా రచియించిన అధ్యాత్మ రామాయణ పద్య కావ్యం తమ ప్రియ శిష్యులైయున్న రాజశ్రీ దామెర కృష్ణ స్వామి వారికి కృపచేసి యిచ్చిన పుస్తకం—'

పై రెండింటి వలన సుబ్రహ్మణ్యకవి ఇంటిపేరు మునిపల్లె వారనీ, తండ్రి రామలింగార్యుడనీ, ఆయన కాళహస్తి ప్రభువైన దామెర కృష్ణస్వామికి పూజాపాత్రుడైన గురువుగా ఉండెనని మాత్రము నిస్సందేహముగా భావింపవచ్చును. ఆ తరువాత ఉండవలసిన అధ్యాత్మ రామాయణమునకు బదులు ఏవో కీర్తనలున్నందున అవి సుబ్రహ్మణ్య కవివి అనుటకు వీలులేదు వాని రచనకూ అధ్యాత్మ రామాయణ రచనకూ ఏ మాత్రము పోలిక లేదు

ఈ కవి కాళహస్తి వాసుడనటానికి అధ్యాత్మ రామాయణమందు కొంత అంతరంగిక సాక్ష్యముకూడా లభిస్తున్నది. ఇందులోని కీర్తనలన్నీ 'శేషాద్రీశ'— మొదలైన ముద్ర కలిగి శేషాద్రి విభునికి అంకితము చేయబడినవి కాని శివస్తుతి పరమైన మొదటి కీర్తన 4 వ చరణములో 'భవహరణాయ శ్రీ కాళహస్తీశ్వరాయ' అనిచేర్చి చివరి చరణములో ముద్రా భంగములేకుండా 'శేషశైలాధీశ మిత్రాయ' అని నేర్పుగా చేర్చినాడు మరల గ్రంథాంతమందలి చివరి రెండు కీర్తనలలో మొదటి దానిలో ఫలస్తుతి చెప్పుచు 'శ్రీ జ్ఞాన ప్రసూన వినతే' అని పల్లవిలో చెప్పినాడు. మంగళము చెప్పిన చివరి కీర్తనలో "శ్రీ కాళహస్తి నగరీ శంభు మిత్రునికి సౌకర్య శాలికి జయమంగళం—సు॥ శ్రీ కుకుల్స్థాన్వయ సింహాసనస్థునికి వివేక కార్య శేషగిరి॥ వేంకట సుబ్రహ్మణ్యునికి ॥మంగళం శుభమంగళం—" అని పూర్తి చేశాడు ఈ విధముగా ఆద్యంతములలో శ్రీ కాళహస్తీశ్వరునీ, చివరి కీర్తనకు ముందు కీర్తనలో జ్ఞాన ప్రసూనాంబను

స్మరించి తనకు జ్ఞానప్రసూనాంబయందును, శ్రీకాళహస్తీ శ్వరుని యందునుగల అభిమానము చూపినాడు.

మరియు దామెర కృష్ణభూపతియందు తనకుగల అభిమానము చూపుటకేమోగాని యదుకాంభోజము 44 వ కీర్తన చివరి చరణమును 'శేషగిరి కృష్ణానుమతిచెంది' అని పూర్తి కానించెను. దాని తరువాత గ్రంథములో మూడు కీర్తనలే గలవవి, అందులో నొకటి మంగళమును, దానికి పూర్వపుకృతి ఫలశ్రుతిని చెప్పేవని గుర్తుంచుకొన్నచో 'కృష్ణానుమతి' అన్న పదము సాభిప్రాయముగా ప్రయోగించినాడని ఊహించుట సత్యదూరము కాదు.

చివరన్న మంగళగీతము పరిసమాప్తి చేస్తూ—

"శ్రీకరుకొండాన్వయసింహాసనస్థునికి వివేకధార్య శేషగిరి వేంకట సుబ్రహ్మణ్యానికి మంగళం" అని పరిసమాప్తి చేయుటలో 'శేషగిరి వేంకట సుబ్రహ్మణ్యానికి' అనుటలో శేషగిరి నామముతో కవి కేదో సంబంధమున్నట్లు స్ఫురించి శేషగిరి శబ్దము ముద్రలలో ఎన్నిమార్లు వాడినాడో లెక్కింపగా 104 కీర్తనలలో 40 కీర్తనలలో శేషగిరి శబ్దమే వచ్చినట్లు తేలినది కావున ఈ కవి పూర్తిపేరు శేషగిరి వేంకట సుబ్రహ్మణ్యుడా లేక వారి ఇంటిపేరు శేషగిరివారా? ఇటువంటి వెన్నో సందేహములు కలుగుచున్నవి ప్రస్తుతమవి పరిశీలింపదగిన ఊహాద్యములుగానే భావించి పరిశోధకులు పరిశీలింపదగినవి. ప్రస్తుతమునకు బహుశః కవి పూర్తిపేరు శేషగిరి వేంకట సుబ్రహ్మణ్య (అయ్య, అర్య, శాస్త్రి శర్మ) అయివుంటుందని భావించుట సత్యదూరము కాదే!

శ్రీ తిమ్మావజ్ఝలవారి వ్యాసములో బహులాక్ష్య చరిత్రకర్తయైన వెంగళభూపాలుని తండ్రి వేంకటేంద్రునికి కేసమాంబికయందు జన్మించిన కృష్ణభూపాలు డొక డున్నాడుకాని అతనే సుబ్రహ్మణ్యకవి శిష్యుడని నిర్ణయించుటకు చిక్కులున్నవని తెల్పిరి. ఆ చిక్కులంత ప్రబలమైనవి కావు బహులాక్ష్య చరిత్రకర్త 1500—1600 మధ్యకాలమువాడు సుబ్రహ్మణ్యకవి శిష్యుడైన కృష్ణభూపాలుని 1780 ప్రాంతములకు సరిపుచ్చుటకు దామెర వంశావళి ప్రకారము బహులాక్ష్య చరిత్రకర్తకు 25 వ తరమువాడైన తిమ్మభూపాలునితోడను, అతని కుమారుడగు కుమార వేంకటప్పనాయనితోడను కృష్ణభూపాలుని తాత తండ్రులను సరిపుచ్చ చూచినారు శ్రీ తిమ్మావజ్ఝలవారు ఈ విధముగా 200 సంవత్సరములు 27 తరములకు లెక్కించినారు. ఇది అంత సందర్భశుద్ధి కలది కాదని మాత్రము సూచించి, అప్రస్తుతము కనుక దీర్ఘవిచారణ ఉపేక్షించడమైనది కేసమాంబిక కుమారుడైన కృష్ణభూపతియే సుబ్రహ్మణ్యకవి శిష్యుడైనచో ఈ కవి 16 వ శతాబ్దమువాడు కావలెను. శ్రీ బాలాంత్రపు రజనీకాంతరావుగారు ఆంధ్ర వాగ్గేయకార చరిత్రములో శ్రీ తిమ్మావజ్ఝలవారి ననుసరించి తాత్కాలికముగా శ్రీ సుబ్రహ్మణ్య కవి కాలము 1780 ప్రాంతమని తెలిపినను ఆయన ప్రయోగించిన రాగములనుబట్టి క్షేత్రయ్యకు పూర్వుడును అన్నమాచార్యులకు దగ్గరవాడును కాగలడేమో అనిపిస్తుందనిరి.

అదిగాక భద్రాచల రామదాసు 17 వ శతాబ్దమువాడు. వీరికి తరువాత కాలమువాడైన శ్రీ త్యాగరాజస్వామివారు తమ ప్రహ్లాద భక్తివిజయమను సంగీత నాటక ప్రారంభమున భద్రాచల రామదాసును సన్నుతించినారు రామకథను వ్రాస్తూ రామదాసుకాలమునుండి ఆంధ్రదేశమంతటా విస్తారప్రశస్తికి వచ్చిన భద్రాచల నామమును సుబ్రహ్మణ్యకవి స్మరింపకుండుట ఒక విశేషము కాబట్టి ఆయన రామదాసుకు పూర్వుడనియే భావించుట సమంజసము అయినా శ్రీ తిమ్మావజ్ఝలవారు 'ఈ పదముల యందలి రచనము అంతపూర్వపుదని తోచుట లేదు' అన్నమాటలుగూడ భాషాశాస్త్రవేత్తలు ఆలోచించి నిర్ణయము చేయవలసి యున్నది ప్రస్తుతము సుబ్రహ్మణ్య కవి కాల నిర్ణయము సంతృప్తికరముగా జరుగలేదని విన్నవించి దానిని భావి పరిశోధకులకు వదలివేయుట మంచిదని తోచుచున్నది.

6

లక్షణవేత్తలు ఉత్తమ వాగ్గేయ కారకుని లక్షణాలుగా నిర్ణయించిన వాటినిబట్టి అధ్యాత్మ రామాయణ విచారణ చేదాము ఆ విచారణచేసే ముందు ఆ లక్షణాల స్వరూపము మరింత స్పష్టముగా ఎరిగించుట యుక్తము

పాఠ్యములో ప్రావీణ్య మంటే, ముందు భాషా విజ్ఞానమే కాక కావలసి వచ్చినపుడు శబ్దాలు వాచో విధేయముగా ఉండవలెను. దానితోపాటు అలంకార కౌశలము, రసభావ పరిజ్ఞానము కావలెను. లక్ష్మణసేన మహారాజు ఆస్థానకవుల ప్రత్యేక లక్షణాలు వర్ణిస్తూ, జయదేవుడు తనసుగూర్చి 'సందర్భశుద్ధిం గిరాం జానీతే జయదేవ ఏవ' అని చెప్పుకొన్నాడు కనుక సందర్భశుద్ధి తెలిసి, అనగా ఔచిత్య మెరిగి, రచనచేసే సామర్థ్యము ఉండవలెను అంటే ఏ సందర్భములో ఏది విస్తరింపవలె, ఎక్కడ ఆపవలె ననునది తెలిసి ఉండవలె నన్నమాట. ప్రకారాంతరముగా చెప్పినచో కల్పనా సంపదతో పాటు ఆత్మనిగ్రహముకూడా ఉండవలెను

ఇక గేయములో లయ తాళ కళా జ్ఞానము, రాగ విస్తృతి, స్వతంత్రముగా హృదయంగమమైన సంగీత కల్పన చేయగల చాతుర్యము కావలెను. ఏ సందర్భములో ఏ రాగము ప్రయోగింపవలెనో మొదలైన వాటి లక్షణముకూడా బాగుగా ఎరిగియుండవలెను.

ఈ రెండింటికి తోడు వస్తుకవితలో చాతుర్య ముండవలెను. అంటే వర్ణనలు వచ్చినపుడు వర్ణనలు, సంభాషణలు వచ్చినపుడు సంభాషణలు, కథాకథన సందర్భ

మీ సరుకులను
మా సంరక్షణకు ఒప్పగించండి



సిజిటి తగు సమర్థతతో పనిచేయుచు మీ సరుకులను భద్రముగా మరియు శీఘ్రముగా మీ సౌకర్యము ననుసరించి గమ్యస్థానమునకుచేర్చగలరు. ఇది నిపుణులయిన తమ ఉద్యోగులచే జాగ్రతతో నిర్వహించబడుచున్న సంస్థ. ఇందులోని ప్రతి ఒక్కరు తన పనిలో సుశిక్షితుడైన నిపుణుడు.

కమర్షియల్ గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్స్ (Regd.)

హెడ్డాఫీసు :	అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసు :
కొత్తపేట, పి. బి. నెం. 89,	107, తంబు శెట్టి వీధి,
	పోస్టు బాక్సు నెం 1254,
గుంటూరు.	మద్రాసు - 1.
ఫోన్. 560	ఫోన్ నెం. 24485 & 25748

:— సిటీ బ్రాంచీలు :—

మౌంట్ రోడ్ :	11-బి, అత్తిపట్టాన్ వీధి.	ఫోన్: 88594
గిండీ :	ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఎదురుగా.	ఫోన్: 801069
బుకింగ్ ఆఫీసు : (మద్రాసు-1)	304, తంబు శెట్టి వీధి.	ఫోన్: 22648
అంబత్తూర్ :	ఇండస్ట్రియల్ ఎస్టేట్.	



మరియు బ్రాంచీలు:

తిరుచి, బెంగుళూరు, ఆంధ్రప్రదేశ్ యందంతటా గలవు.

ములో కథాకథనమూ నేర్పుగా చేయవలెను వీటికి తోడు లోషద్వేష పరిత్యాగము- ఇత్యాది సుగుణసంపత్తి కావలెనని లక్షణవేత్తలు చెప్పిన మాటలను పాత మాటలలో అనువదించి చెప్పినచో ఉత్తమ వాగ్గేయకారకుడు లౌల్యమేమి లేని ఋషి కావలెను.

7

పైన విస్తరించిన మూడు ప్రధాన లక్షణములలో ముందు సుబ్రహ్మణ్యకవి స్వభావము, కథనాదికములయందలి దక్షత విచారింతము.

కవి తాను అధ్యాత్మరామాయణము తెనిగించినట్లు ప్రతి కాండాంతములోను చెప్పుకొన్నాడు కాబట్టి ఇది సంస్కృతములోని అధ్యాత్మ రామాయణమునకు భాషాంతరీకరణమనుట నిస్సందేహము. ఎళుత్తచ్చన్ మొదలగు ఇతర భాషా కవులవలెనే, కావ్యము మంగళాంతము చేయుటకు కాబోలు, ఇతడును ఉత్తరకాండమును వదలి పట్టాభిషేకాంతముగా మాత్రమే రచించెను. సంస్కృత- అధ్యాత్మ రామాయణమును విశ్వామిత్ర మహర్షి రచించెను. దాని మాహాత్మ్యమునుగూర్చి బ్రహ్మాండ పురాణములో బ్రహ్మ మార్కండేయ మునికి చెప్పినట్లుగా 'అధ్యాత్మ రామాయణ సంకీర్తన శ్రవణాదికం, ఫలమ్ వక్తుం న శక్నోమి కార్త్స్న్యేన ముని సత్తమ—' ఈ ఫలశ్రుతిని మనసులో పెట్టుకొనియే ఆంధ్రములో అధ్యాత్మ రామాయణ సంకీర్తనమునకు సుబ్రహ్మణ్యకవి పూనుకొనెనేమో!

ఇందులోని రామాయణ కథ మొత్తమువిూద వాల్మీకినే అనుసరించినా, వాల్మీకి రచనలోవలె శ్రీరాముడు, సీత ఆదర్శ మానవమాత్రపాత్రలు కారు. 'శ్రీరామ హృదయ'మనే నామము గల బాలకాండములోని మొదటి సర్గలోని మూలము ననుసరించి సుబ్రహ్మణ్య కవి రచనలో—

'రాముడు పరమానందమయుడు, సర్వచరాచర పరిపూర్ణుడవ్యయుడు, సామగానలోలు డచలుడాద్యుడు సర్వసాక్షి... పరమాత్ముడు నే మూలప్రకృతిని, ఈ మహాత్ముని సన్నిధాన మాత్రను ఈ మహాద్భుతము లొనర్తు రాముడై దశరథునకు నితడు పుట్టుటయు... దండకాటవికేగుట, ప్రాకట మాయా సీతాహృతి అందుచేత రావణుని భీకరాజి దునిమి నన్నుగైకొని, సాకేతము జేరు పెల్ల మత్కృతి' అంటుంది సీతాదేవి, రామాజ్ఞచే మారుతికి ఉపదేశము చేస్తూ ఆ తరువాత స్వయముగా శ్రీరాముడే మారుతికి ఆత్మానాత్మ పరాత్మల స్వరూపము, ఐక్య జ్ఞానము కలుగగా నవిద్య మాయమయ్యే విధము ఉపదేశిస్తాడు.

ఈ వేదాంత విజ్ఞానము మూర్తీభవించినద అధ్యాత్మ రామాయణములో. ఈ కావ్యమును ఈ సంశయము వారింపవే అనిన్నీ, జగదాధార మూర్తియైన శ్రీరామునియందు సారసద్భక్తి నాధూఢమై ముక్తికారణమై యలరారు సౌక్యయుక్తి నాదిశక్తి ఏరా తరసి ధీర రసికాళికి సార కళలూర బలుకుమని పరమేశ్వరి శ్రీ సదాశివ ప్రశ్న చేసెద వివరింపుమని కోరగా, శ్రీరామునకు నమస్కారముచేసి, అజ్ఞాన హారి, జితారి శ్రీవిహారి, మాయాధారి, తారక కీర్తి సత్యజ్ఞాన స్ఫూర్తి, విదారితార్తి, దేవతా చక్రవర్తి, చిదానందమూర్తియై రాజిలు శ్రీ శేషశైలాధిపుడగు రఘుపు చరితము సుధావర్షమై చెవుల పండువుగా సదాశివుడు వినిపించిన దీ కథ.

'వినవే పల్లవమృదు చరణా, కరుణా విభరణ గుణాభరణ' అనీ, 'సఖీమణి వినవే నీ వీసచ్చరితము, సలలితానంద దాయక మనవే'—అనీ, 'చానరో వినవే శ్రీరామ చంద్రుని చరితము రసభరితము' అనీ, 'శ్రీ రాజరాజేశ్వరీ, ఈ చరిత్రము ఆర్యనుతి పాత్రము' అనీ, 'పావనము, జ్ఞానోదయము, నిత్యాభ్యుదయము నధిక పుణ్యామ్నాయము అధ్యాత్మ రామాయణం బెవరు విన్న, నుడివిన వారనఘులై నారాయణుని కరుణను ధన్యులగుదు రంద మున' అనునట్లు ఆదిదంపతుల సంవాద రూపమగ పవిత్రమైన శ్రీరామ కథ శాంత రసాత్మకముగా నడుస్తుంది కరుణ వేదియై కవిత్వ మారంభించిన వాల్మీకి రామాయణము కరుణరస ప్రధానముగా సాగినది అధ్యాత్మ రామాయణము బ్రహ్మ విద్యా ప్రతిపాదకమైనది కనుక శాంతరస ప్రధానముగా నున్నది.

ఆది దంపతుల సంవాద రూపములో సాగిన అధ్యాత్మ రామాయణములో వేదాంతము మూర్తీభవించినది సుబ్రహ్మణ్యకవి వేదాంత విద్యోపదేశకాక అనుభవములోకూడ ఆత్మనిష్ఠగల యోగిగా అఖండచిదనుభవిగా కనిపిస్తాడు అందువలన ఇందులో క్షేత్రయ్య ఛాయలుకూడా కానరావు మహాభక్తుడైన జయదేవుడు కూడా అందుకోలేని తాత్త్విక స్థితి ఇందులో గోచరిస్తుంది. వాగ్గేయకారకులలో సుబ్రహ్మణ్యకవి కూడా శ్రీ నారాయణ తీర్థులు, శ్రీ త్యాగరాజస్వాముల కోవలోని వాడు.

ఆయన వర్ణనచాతుర్యమునకు ఉదాహరణముగ శ్రీరామ జనన ఘట్టమే చాలు.

పల్లవి - శ్రీరాముని గాంచెను పార్వతి వినవే
మన కౌసల్య ఆత్మారాముని గాంచెను॥

అనుపల్లవి.—తోరమై హర్షాశ్రు పూరము కన్నుల
జార భయ సంభ్రమాశ్చర్యము లైనగొనగ॥ శ్రీ॥

చరణము.—అల నల్లకలువరేకుల చాయ మేనిచే
జెంగువాని పసిడి, చేల గట్టినవాని
వెలయు నాల్గు భుజముల వాని కను గొ
ల్కుల నరుణరేఖలు, కలవాని స్వర్ణ కుం
డల లసిత గండమండలముల వాని న
స్థలిత రవికోటి ప్రకాశకుని రత్నో
జ్జ్వల కిరీటము వాని, అలిసీల కుటిల కుం
తలములచే ముద్దు, కులుకుచుండెడివాని॥

భాగవతములోని శ్రీకృష్ణునివలెనే అధ్యాత్మరామాయణము లోని శ్రీరాముడుకూడ నిజరూపముతోనే అవిర్భవించినట్లు కవి కల్పించినాడని ఈ సందర్భములో మనము గుర్తుంచుకొనవలెను కన్నులకు గట్టినట్లు ముద్దులొలికే తేటమాటలతో ఎంత మనోజ్ఞముగా కవి శ్రీరాముని వర్ణించినాడు!

రావణ వధానంతరము సీతను అలంకరించి రాముని వద్దకు తెచ్చిన వర్ణనము అనుపమానమైనది. 'పట్టుచీరె గట్టి, బంగారు రవిక దొడిగి, బొట్టు కస్తూరిబెట్టి, కాటుక కన్నుల బెట్టి' ఇత్యాదిగ ఉన్నది ఇట్లే రామరావణ యుద్ధ వర్ణనలు ఎంతో మనోజ్ఞముగా ఉన్నవి రాగతాళాల నిర్బంధముతో వర్ణనలు చేయుట కొంతతేలిక కావచ్చునుకాని. కథా కథనము రసవంతముగా చేయుట అసాధ్యమనదగినంత కష్టసాధ్యమైన కార్యము సుబ్రహ్మణ్యకవి పట్టాభిషేకాంతమైన శ్రీరామ కథను హృద్యముగా రసవత్తరముగా కథనము చేసినాడని అనడానికి కావ్యమంతా ఉదాహరణ భూతమగును సీతావివాహము, రామ పరశురామ సంవాదము, శ్రీరామ వివాసనము, భరతుని సమాగమము, అత్రిముని దర్శనము, సీతాహరణము, జటాయువునకు కైవల్య మిచ్చుట, వాలి పరిదేవనము, సీతాన్వేషణము, హనుమంతుడు సీతను దర్శించుట, విభీషణుని శరణాగతి, సంజీవిని తెచ్చుటలో కాలనేమి విఘ్నము, రావణాది రాక్షసులతో యుద్ధములు, శ్రీరామ పట్టాభిషేకము—అన్నీ సందర్భోచితముగా మధ్య మధ్య మంచి సంభాషణలు కలిపి, రసవంతముగా కథనము చేసినాడు.

ఈ విధముగా వర్ణనమందు సమర్థత, సంభాషణలో చాతుర్యము, కథా కథనములో రసవద్రచన—అన్నీ కలిపి శాంత రస ప్రధానమైన ఉత్తమ కావ్యముగా అధ్యాత్మ రామాయణమును సుబ్రహ్మణ్యకవి తీర్చిదిద్దినాడు.

8

కార్యము చక్కగా నిర్వహించుటకు కవి భాషావేత్త కావలెను. సుబ్రహ్మణ్య కవికి సంస్కృతాంధ్రములలో నిర్దుష్టమైన పాండిత్యమున్న దనటానికి వీరి మొదటి కీర్తన రచనమే చాలు. నన్నయ భారతము, తిక్కన ఉత్తర రామాయణమును సంస్కృత శ్లోకములతో ప్రారంభించినట్లే, సుబ్రహ్మణ్యకవి తన కావ్యమును సంస్కృత కీర్తనతోనే ప్రారంభించినాడు ధన్యాసి రాగము, ఆది తాళములో చెప్పిన ఈ ఒక్క కీర్తనే చాలు, ఎవరి పేరైనా శాశ్వతముగా నుండటానికి!

పల్లవి :—నమ శ్శివాయ తే నమో భవాయ

అనుపల్లవి:—సమానాధిక రహితాయ శాన్తాయ స్వప్రకాశాయ
ప్రమోద పూర్ణాయ, భక్తౌఘ పాలనాయ॥ నమ॥

4 వ చరణము—నిరుప మానంద ఘన నిశ్చలాయ శాశ్వతాయ!
వరదాభయంకరదాయ గిరీశాయ!
తరుణేన్దు శేఖరాయ, పరమ పురుషాయ భవ!
హరణాయ శ్రీ కాళహస్తీశ్వరాయ॥ నమ॥

ఈ విధముగా ఎత్తుగడలోనే శివకేశవులందు అభేదమైన భక్తి పాఠకుల హృదయాలలో ఆవిర్భవింపచేసినాడు పల్లవిలో పంచాక్షరిని స్మరించి, అనుపల్లవిలో పరబ్రహ్మ స్వరూపము ప్రదర్శించినాడు. సంస్కృతభాష ఎంత ఉదాత్తముగా నడుస్తూ కవికి వాచోవిధేయముగా నున్నదో తెలుస్తూనే ఉన్నది. అప్రయత్నముగా యమకము, అనుప్రాసలు, అంత్యప్రాసలేకాక ఆంధ్రభాషకు విశిష్టమైన ద్వితీయాక్షరప్రాస, అక్షరమైత్రి రూపమున యతి ప్రాసయతులుకూడ ఇందులో ప్రత్యక్షమైనవి.

శివస్తోత్ర రూపమైన సంస్కృత కీర్తనతో గ్రంథారంభము చేయటానికి కారణాలు చాల ఊహింపవచ్చును. గీర్వాణభాషయందు అభిమాన మొకటి. సంగీత లక్షణవేత్తలు వాగ్గేయకార వరునికి అనేకభాషలు వచ్చియుండవలె ననుట రెండవది మూడవది ప్రాచీన వాగ్గేయకారులు తమ లక్షణము లేకాక లక్ష్యమునుకూడ సంస్కృతములోనే చెప్పియుండుట. వీని అన్నిటికి తోడు ఇది గేయాత్మకమైన గ్రంథము కాన గానమునకు, నాట్యమునకు ప్రథమాచార్యుడైన శివుని స్తోత్రము చేయుట సమంజసముకదా! అందుకనే చివరి చరణములో 'సంగీతలోలాయ' అనే విశేషమును ప్రత్యేకముగా వేసినాడు. కవి తన గ్రంథమును శేషగిరీశునకు అంకితము చేసినను తాను భేదములేని శివభక్తికలవాడని, శ్రీ కాళహస్తివాసుడని కూడ రమ్యముగా సూచించినాడు. ఈ కవి భావించిన శివుడు సమానాధిక రహితుడు—అందుచే శ్రీరామ స్వరూపుడే!

సంస్కృతములో ఇదేగాక మరి ఐదు కీర్తనలు, ఒక చూర్ణికనుగూడ చేర్చినాడు. అందులో ఒకటి సేతుబంధ సమయములో చేసిన శివస్తోత్రము. దానితో 'తాంకిట తక తకిట రిమరిన—' అను జతులను చేర్చి ఆ స్తోత్రమునకు పరిపూర్ణత చేకూర్చినాడు.

సురటిరాగము—ఆదితాళములో చెప్పిన 'రామలింగా వృషభ తురంగా రాజితాంగా' అనునది వీరి సంస్కృత కీర్తనలలో నొకటి. మరియొకటి కుంభకర్ణవధ సందర్భములో నారదుడు చేసిన రామస్తుతి. మూడవది, నాలుగవది సీత అగ్నిశుద్ధియైన వెంటనే బ్రహ్మ, ఇంద్రుడు చేసిన శివస్తుతులు. ఐదవది శ్రీరామ పట్టాభిషేక సమయములో బ్రహ్మాదిదేవతలు చేసిన స్తుతి. గ్రంథ ప్రారంభమును పంచాక్షరితో చేసినట్లే 'నమోఽస్తు శ్రీ రామాయ నారాయణాయ' అనే ఘంటారాగ రూపక తాళ పల్లవిలో నారాయణాష్టాక్షరి ధ్వనింపజేయుట గమనింపదగిన విశేషము.

'గద్యం కవీనాం నికషం వదంతి' అని అభియుక్తోక్తి. కందు 'శివదగణిత గుణ మణి గణాలంకృత రుచిరతర శుభ స్వరూపం, సకలజన భయావహ మహదజ్ఞానజనిత కలి కలు'

షి ధ తామిస్ర నివారక భవతారక దీపం...' ఇత్యాదిగా అర్యా కాండములో జటాయువుచేత చక్కని చూర్ణికతో రామస్తుతి చేయించాడు.

ఇంతవరకు సంస్కృత పాఠములో కవికున్న సమర్థత వివరింపబడినది. వీరి ఆంధ్ర భాషా పాండిత్యము దానికెంత మాత్రము తీసిపోదు ఆంధ్ర భాషలో ఈ కవి పూర్తిగా నన్నయాది పురాణ కవులయు, పెద్దనాది ప్రబంధ కవులయు మార్గమునే అవలంబించినాడు ఆంధ్రగేయ రచయితలు సర్వ సామాన్యముగ ప్రయోగించే వ్యాకరణ విరుద్ధ ప్రయోగాలు అధ్యాత్మ రామాయణములో కానరావు. తద్భవ దేశ్యశబ్దములలో ఉన్నా భాష నిర్దుష్టముగా ఉంటుంది భాషా విషయములో ఇట్టి విశిష్టత పాటించిన ఆంధ్ర వాగ్గేయకారకులు ఇంకెవరూ లేరనియే చెప్పవచ్చును సంస్కృత శబ్దాల కూర్పులోనూ, తెలుగు శబ్దాల కూర్పులోను సౌలభ్యము నేర్పు కనబడును చక్కని పలుకుబడి ఉన్నది వీరి రచనలు గేయములైనను అందలి భాష చక్కని జాతీయములతో గూడి కావ్యమునకు పరిపూర్ణత కూర్చుచున్నది యుద్ధకాండములో రావణుడు విభీషణుని హితోక్తులు పెడచెవిని పెట్టు సందర్భమున 'ఔషధము రోగి మెచ్చునా?' అని సందర్భోచితముగ ప్రయోగించినారు వీరి రచనలు సుందరమైన సమాసములతో కూడి యుండును. వ్యర్థపదములు చాల అరుదు యతిప్రాసలు, అంత్యప్రాసలు, యమకాదులు కవి అలవోకగా కూర్చగలడు. మాయలేడిని వర్ణించు ఫరజురాగ, అటతాళ కీర్తనలో—

పల్లవి:—ఇంతి చెంగల్వబంతీ చెలువల మేల్
బంతి గుణముల దొంతీ వినవే॥

1 వ చరణము:—

పదియారు వన్నియ బంగారువలె దనువు।
పొదల మేనిపై వెండిపువ్వులవలె చుక్కలు
గుదిగొన మణిరుచుల గొమరారు కొమ్ములు।
కొదమరత్నములనగా, గొరిసెలు దనరగ
నుదుట నీలములవలె గన్నవ యొప్ప మారీచుండు లేడియై
కదలి శేషగిరీ ఒడగు రాఘవుడున్న
పంచవటి చేరెను ॥ఇంతి॥

ఆ తరువాత కీర్తనలో 2 వ చరణము—

సర్వపూర్ణుడయ్యు నచలుడయ్యును
సాక్షియయ్యు లోకానుసారియై
పర్విడి మాయామృగమువెంట దగిలె
భక్తసేషణుం డనెడి నుడివి విదితముగా
మర్త్యతనూజ కోరిక దీర్చగ
నద్దండాటవి రఘువీరుడు చని
దుర్వారావర్ణనాడై మృగంబు
మర్దింబడవేసె విశితాస్త్రమున॥

3 వ చరణము:—

త్రుళ్ళడంగి కపట రూపువీడి మారీచు
డొరలుచో హా లక్ష్మణా
చెల్లరే నన్ను బ్రోవుమని చక్కి
చిరిసటుల దోచ వార్తరవమున నిలపై
త్రెళ్ళుచు మహీశు సన్నిధిచే ముక్తిం
జెండె నచట వార్తధ్వని విని
తల్లడపడి భూమిజ రాము డాపదం
బొందెను జను లక్ష్మణా యనెను ॥దీనభక్తజన॥

ఇతర సందర్భాలలో ఈ వ్యాసంలో ఉదాహరించిన కీర్తనల భాషనుకూడ గమనిస్తే సుబ్రహ్మణ్య కవి పాఠములో మార్గపద్ధతినే సమర్థతతో నిర్వహించాడని విదితమౌతుంది.

9

అధ్యాత్మ రామాయణ గేయత్వము కూడ మార్గమే. ఇందు ప్రతికీర్తనకూ రాగము, తాళము నిర్ణయింపబడి ఉన్నవి. స్వర సహితముగ ఈ గ్రంథము ఇంతవరకు ప్రకటింపబడి యుండలేదు కాని సంగీతాభిమానులచేత ఇందలి కీర్తనలు పరంపరగా గానము చేయబడుచు వీటి గేయఫణితులు ఇంకను భక్తగాయకుల నాలుకలవిూద స్థిరముగా నిలిచియే ఉన్నవి. అధ్యాత్మ రామాయణమంతయు పాఠము చేయకున్నను కనీసము రెండుమూడు కీర్తనలైనను పాఠముచేసి, గానము చేయనివారు ఆంధ్రదేశమున అరుదు

ఇందు మొత్తము 104 కీర్తనలు కలవు. ఇందలి ప్రతిఒక్కకీర్తనా ఒక కథాఖండమే

కీర్తన సర్వాంగ సంపన్నముగా నుండుటకు పల్లవి, అనుపల్లవి, చరణము అను మూడు భాగములు ఉండవలెను. అట్టి కీర్తనలకే కృతులను నామము నేటి కాలమున రూఢి ఐనది వీరి కృతు లన్నిటియందును పల్లవి, అనుపల్లవి, చరణములను భాగములు కలవు పల్లవి, అనుపల్లవి, చరణములు—ఈ మూడును మూడు వేరువేరు ధాతువులలో ఉన్నవి. కావున అధ్యాత్మ రామాయణ రచన అంతా కృతులలోనే సాగినదనదగును. వీరి కృతులకు 3, 4 నుండి 10 11 వరకు చరణములు కలవు చరణములన్నియు ఒకే ధాతువులో పాడబడును. అయినను చక్కని కథాకథనముతో ఈ చరణముల రచన సాగి శ్రోతలకు విసుగు కలిగించవు.

చరణములలో మరియొక విశేషముకూడ కలదు దీని చివరి భాగమందలి సాహిత్యము మధ్యమకాలములో గానము చేయబడును. ఇట్టివానినే నేటి సంగీత విద్వాంసులు మధ్యమకాల సాహిత్యము అనుచున్నారు. కృతి రచన యేర్పడుటకు పల్లవి, అనుపల్లవి, చరణములు చాలును కాని, సుబ్రహ్మణ్య కవి చరణాంతములందు మధ్యమకాలసాహిత్యములను రచించి వాటి ప్రాశస్త్యమును ఇనుమడింప చేసినాడు మధ్యమకాల సాహిత్యములకు సృష్టికర్త అని ప్రసిద్ధిపొందిన కర్ణాటక సంగీ

శ్రీమూర్తులలో నొకరైన శ్రీ ముత్తుస్వామి దీక్షితుల మధ్యమ కాల సాహిత్యమున కేమాత్రము ఇవి తీసిపోవు. శ్రీ ముత్తుస్వామి దీక్షితులకు సుబ్రహ్మణ్యకవి పూర్వుడగుటచే వారి కిందులో మార్గదర్శి యనుట అతిశయోక్తికాదు.

యుద్ధకాండమందు సురటిరాగము—ఆదితాళములో చెప్పిన 'రామలింగా వృషభతురంగా రాజితాంగా రామా' అను కృతి వివరమున్న—

> తాంకిట తక తకిట రిమరిస రీ, తహత ఝం రిమపద
> తఝంద ఝంతారి తధంమప॥
> తాహత కిటతక ఝంతారి సరిమరీ సనిస రీ సనిదప
> తాం తకిట పదమనిద పను ధళాంగు ధిమితక
> తధి గిణతోం ॥రామ॥

అనుటదియు, సీతారామ కల్యాణ సమయమున అప్సరసలు ఆడిరని తెల్పు సమయమున కూర్చిన జతులును వీరి స్వర లయాది పాండిత్యమును ప్రదర్శించుచున్నవి.

ఈ వాగ్గేయకారుడు లక్ష్యలక్షణములందు సామర్థ్యము కలవాడు. ఈ కావ్యమునందు వారు వాడిన రాగముల వైవిధ్యమునుబట్టియే అది స్పష్టపడుతున్నది. ఇందుగల 104 కృతులు 58 రాగములలో చెప్పబడినవి. శ్రీ నారాయణతీర్థులు 153 కీర్తనలుగల శ్రీ కృష్ణలీలాతరంగిణిని 37 రాగములలో గానముచేసి ఉండిరి. ఇప్పటికి లభించిన 334 క్షేత్రయ్య పదాలలో 39 రాగములు మాత్రమే ఉపయోగింప బడినవి.

బాలకాండములో ఒక విశేషముకూడ గమనింపవచ్చును. ఇందలి 17 కృతులు 17 వేరువేరు రాగములలో రచింప బడినవి. ఒక రాగమందు ఒక కృతి రచింపవలెనంటే ఆ రాగముపై పూర్తిఅధికారము ఉండవలెను గదా! ఇట్లు ఒక్కొక్క కృతిని ఒక్కొక్క రాగములో గానము చేయుటవలన ధాతువులో ఈ వాగ్గేయకారకునకుగల అనితర సామాన్య ప్రజ్ఞ వెల్లడియగుచున్నది. బాలకాండములో ప్రత్యేకముగా ఇంత వైవిధ్యము చూపుటనుబట్టి ఆ కాండమునందు కవికి ఎక్కువ అభిమానమని భావింపవచ్చును. ఈ కాండమును సురటి రాగముతోనే అంత్యము చేయుట ఈ ఊహనే బలపరచుచున్నది. 'అంత్యసురటి' అను అభియుక్తోక్తి ప్రసిద్ధముకదా!

నేడు ఎక్కువ ప్రచారములో లేని ఘంటా, రేగుప్తి, గుమ్మకాంభోజి, మారువ, ఆహిరి, హిందూఘంటా, మంగళకైశిక, పూరిరాగములవంటి ప్రాచీన రాగములు ఇందులో పలవు. అవి అన్నమాచార్యుల కీర్తనలలోను, ప్రాచీన యక్షగానములలోను ఎక్కువ వాడుకలో ఉన్నట్లు చెప్పవచ్చును.

సుబ్రహ్మణ్యకవి ప్రయోగించిన అపూర్వ రాగములలో లలితపంచమి, యమునవంటి రాగములను పేర్కొనవచ్చును. అవియేకాక ఫరజు, కాఫీవంటి హిందూస్థానీ రాగములను కూడ వాడియుండిరి. క్షేత్రయ్య పదాలతో ప్రచారము పొందినవే హుసేని రాగమును సుబ్రహ్మణ్యకవి కూడా ఉపయోగించినాడు. దీనినిబట్టియు ఈయన వాడిన ప్రాచీన రాగములను బట్టియు ఈ కవి క్షేత్రయ్యకు పూర్వుడై ఉండుననుటకు ఎక్కువ అవకాశము కలదు.

యుద్ధకాండమున ప్రథమ యుద్ధారంభమున ఘన రాగములైన నాట, ఆరభి, శ్రీ, గౌళ అను నాలుగు రాగములను వరుసగా ఉపయోగించినారు. వరాళి రాగము వాడలేదు. నేటి విద్వాంసులు వరాళి రాగముతో కలిపి వీటిని 'ఘనరాగ పంచకము'ని వ్యవహరిస్తూ ఉన్నారు. ఆ కాలమున వరాళి రాగమును వదలి తక్కినవానినే 'ఘనరాగ చతుష్టయము'గా పరిగణించేవారేమో అని ఊహింప నవకాశమున్నది.

అదికాక మరియొక కారణముకూడ ఊహింపవచ్చును. నేటి ఘనరాగ పంచకమందు వరాళి రాగమును వదలి, నాట, గౌళ, ఆరభి, శ్రీ అను తక్కిన నాలుగు రాగములు మాత్రమే గురువు శిష్యుడు వరుసగా పాఠము చెప్పచున్నారు. వరాళి రాగమును మరియొక గురువువద్దకాని లేక స్వయముగా కాని నేర్చుకోవలసినదే. ఈ ఐదు రాగములు వరుసగా నేర్పుట గురువుకు ప్రమాదము కలిగిస్తుందనే విశ్వాసమున్నది. సుబ్రహ్మణ్యకవినాటికి కూడా ఇటువంటి భావ మున్నదేమో! ఇది గృహస్థ విషయము. సన్యాసాశ్రమము స్వీకరించిన శ్రీ త్యాగరాజస్వామి మాత్రము వరాళి రాగముతో కూడిన ఘన రాగములందు పంచరత్నములు రచించినాడు.

రాగరసమును, కావ్యమందలి సందర్భము ఎరిగి రాగములను ప్రయోగించినపుడే ఆశించిన ఫలము చేకూరగలదు. సుబ్రహ్మణ్యకవి కావ్యమునందింతట ఇట్టి విజ్ఞతయే చూపినాడు. సీతారామ కల్యాణ ఘట్టమందలి కృతిని కల్యాణిరాగమందే రచించి తన ఔచిత్యమును ప్రదర్శించినాడు. శ్రీ నారాయణ తీర్థులవారును కృష్ణలీలాతరంగిణియందు రుక్మిణీకల్యాణ ఘట్టమందలి కీర్తనను కల్యాణి రాగమందే రచించిరి.

ఈ కవి రచనలలో కొన్ని విశేషమైన అలంకారములు కూడ కానవచ్చుచున్నవి. మాయామృగమును తెమ్మని సీత అడిగిన సందర్భములో రచించిన 'నాయకిరాగ' కీర్తన పల్లవిలో, 'దీనభక్తజనసౌఖ్యదాయకి ప్రాణనాయకి వినవే' అని నాయకి శబ్దము కూర్చినాడు. ఈ సందర్భములో మాత్రము నాయకి శబ్దము వ్యాకరణరీత్యా సాధువో కాదో లెక్కచేయక 'ప్రాణనాయకి' అని ప్రయోగించినాడు. ఇది సంగీత విద్వాంసులు నిర్వచించు దశముద్రలలో నొకటియగు 'రాగముద్ర' యనునది. ఈ రాగముద్రను వాడినట్లే ఆలంకారికులు ప్రత్యేకముగా అలంకారముగా గణించు ముద్రాలంకారముకూడ ప్రయోగించినాడు. ఇటువంటిదే సీతాకల్యాణ సందర్భములో కల్యాణి రాగములో రచించిన కీర్తన. దానిలో 'కల్యాణము వినవే' ఇత్యా

దిగా కల్యాణ శబ్దము పల్లవిలో రెండు మారులు, అనుపల్లవిలో మూడు మారులు ప్రయోగించి సీతాకల్యాణముతో తాదాత్మ్యము పొందినాడు.

సుందరకాండములో వానరులు మధువనము భంగము చేసిన కథను గానముచేయు సందర్భములో రచించిన కృతి పల్లవిలో సుబ్రహ్మణ్యకవి రఘుపతి లేవెలానిన ఆనందముతో పొంగిపోవుచున్న వానరవీరులను పరిగా సచ్చరిత్రము వినువారి కరయ నెవ్వా రిలను గౌరీ' అని వ్యాకరణములను అర్థవంతముగ కూర్చి వేగ వేళ్ళను ప్రకటించినాడు

కొన్ని పల్లవులలో చిత్రమైన విశేషములుకూడ కానవచ్చినవి కేవలము రెండే పదములు నాలుగు లఘువులు మాత్రమే కల 'విగచెలి' అను చిన్న పల్లవి ఒకచో కూర్చినాడు మరికొన్ని చోట్ల గగ వినవే ఈ చరిత్ర దళత్కంజ దళ మంజుల నేత్రా, నగ విభేదన వరేణ్య కాంతి స్ఫుట సుగాత్ర సులిపాత్రా' వంటి దీర్ఘమైన పల్లవులును కలవు.

అనుపల్లవియు చరణములను పాడిన తరువాత పల్లవి అందుకొనుటలో వైవిధ్యము చూపుటకు అనువుగా చక్కని రచన కొన్నింటిలో సాగినది ఇది గానముచేయు గాయనీ గాయకులకు ఎక్కువ సమ్మోదదాయకము అట్టివానిలో ఈ క్రింది దొకటి.

పల్లవి — ఆనందముగ నీ వట వినవే రజతాచలనటనా
పరిహసిత వినీల తారకేశ వదనా కుంద
బృంద సుందర రదనా॥

అనుపల్లవి : మందయాన దశరథ వసుధేశుడు
మాన్యయశు డయోధ్యా కాంతుడు
పొందుగ తనయులు లేనందుకు వగ చెంది
వశిష్ఠుని జేరి బల్కెపా ॥ఆనందముగ॥

4. చరణము అలి వలరిరి.. సుమిత్రకు దమ
యంశములం దెలమి సగము సగమొసంగిరి నిరతా॥
॥ఆనందముగ॥

వీరి కృతులన్నిటిలో పల్లవులు మిక్కిలి సమర్థతతో రచింపబడినవి వానిలో ప్రారంభములోనే రాగ సంచారము ప్రారంభమై అనుపల్లవిలోను, చరణములోను సంపూర్ణత చెందును. వాటి విశేషములు గానముచేసి వినిపించి ప్రదర్శించినపుడే కాని కేవలము మాటలతో వర్ణించుట సాధ్యముకాదు

తాళ విషయమునగూడ ఈ కవికి మార్గవిధానమందే అభిమానము కనబడుచున్నది ఇతడు దేశీతాళములను వాడక అట, రూపక, జంపె, త్రిపుట, ఆది తాళములను మాత్రమే వాడినాడు వానిలో విస్తార ప్రచారమందిన ఆదితాళమును నామాంతరముగల చతురశ్రజాతి త్రిపుట తాళమును 58 కృతులకు ఉపయోగించిరి. ఇందువలన ఆఖ్యానాత్మకమైన ఈ కృతులు భావప్రధానముగా పాడుటకు వీలుగా నున్నవి. సంగీత విద్వాంసులు యథాశక్తిగా ప్రస్తరించుటకును, సామాన్యులు భక్తితో కథాగానము చేసి ఆనందించుటకును అనువుగ కుదిరినవి.

'సంగీత విద్యా ప్రవీణ వినవే' 'వీణా వాదనాభిరయుత మస్తా వినవే సంగీత భారతి వినవే — ఇత్యాది సంబోధనల యందును 'సంగీత లోలాయ' 'నాదబిందు కళాతీత'— మొదలగు విశేషణములందును ఈ కవికి జంత్ర, గాత్ర సంగీతములందును, అభినయమునందును నాట్యమునందును గల అభిరుచి అత్యంత స్పష్టముగా వ్యక్తమగుచున్నది

చివరి కృతిలోని అనుపల్లవిలో 'సంగీత లోలునికి శృంగార శేఖరునికి నంగజాత కోటి రూపాంగునికి మంగళం' అని చెప్పి తన కావ్యమును సంగీత లోలుడైన శ్రీరామచంద్రున కంకితముచేసి నవవిధ భక్తులనందరిని శ్రీరామ స్వరూపులుగానే భావించి మంగళము చెప్పినాడనిపించును.

ఈ గ్రంథము ఫలశ్రుతిలో చెప్పినట్లు ఇది 'పావనము జ్ఞానోదయము నిత్యాభ్యుదయము నధిక పుణ్యామ్నాయము అధ్యాత్మ రామాయణం బెవరు విన్న నుడివినను వారనఘులై నారాయణుని కరుణన్ ధన్యులవం దగుదురు—' అనుటకు సందేహము లేదు.

అధ్యాత్మ రామాయణములో శ్రీరామ హృదయమని ప్రసిద్ధికల బాలకాండ ప్రథమసర్గలో ఉద్ఘోషింపబడినట్లుగా సుబ్రహ్మణ్యకవి రచనయు, "పురారి గిరి సంభూతా శ్రీరామార్ణవ సంగతా, అధ్యాత్మరామ గంగేయం పునాతి భువనత్రయమ్."

మంత్రకూటము - పరిసరములు

శ్రీ ముప్పిడి రవీంద్రారెడ్డి

"మంత్రకూటం సహస్రాణాం
లింగానాం స్థానముత్తమం...'
(మొదటి ప్రతాపరుద్రుని గయా శాసనము)

అను శాసనప్రసిద్ధిగల మంత్రకూటము ప్రాచీన భారత వర్షమునగల విద్యాపీఠములలో ప్రముఖస్థానము వహించి అశేషప్రజ్ఞాధురంధరులగు పండితమాన్యుల ధీసంపదలకు నిలయమై ప్రాచీన భారతీయ సంస్కృతికి ప్రతీకయై ప్రకృతిసహజసంపదల కాలవాలమై యొప్పారినది. 'వింధ్యాద్రి దక్షిణప్రాంతే విలసద్గౌతమీతటే'...ఉన్న ఈ మంత్రకూటము ఆంధ్రదేశమున గల విద్యాపీఠములలో కెల్ల తలమానికమైనది. వైదిక పద్ధతినే జీవయాత్ర సాగించుచు



కళింగదేవి

మహాకాళ సంహారమూర్తి (శివుడు) - గౌతమేశ్వరాలయము వెనుకవైపున

ఇచ్చటి వేద పండితులు తమ పాండితీ ప్రభల ఆంధ్ర దేశముననేగాక అఖిల భారతావనియందును వెలయింపజేసి జ్ఞానజ్యోతుల వెలిగించి తమ ప్రజ్ఞావిశేషముల దిగంతముల చాటి ఇచ్చోటున వైదికధర్మప్రతిష్ఠాపనాచార్యులైరి. దానంజేసి ఈ మంత్రకూట మొక వేదపీఠమై వెలసి జ్ఞాన పారావారమున నోలలాడినది.

దక్షిణగంగయని పేరువడసిన పవిత్ర గోదావరీ తీర స్థలమైన ఈ మంత్రకూటము మన్యులీర్థమనుపేర పురాణ (బ్రహ్మపురాణ) ప్రసిద్ధి గాంచినది. రాక్షసులు ఇంద్రాది దేవతలను పీడించగా వారందరును పారివచ్చి ఈ క్షేత్రమున వెలసిన గౌతమేశ్వరుని శరణు వేడిరట. అంత ఆ పరమశివుడు వారి మొర నాలకించి ప్రసన్నుడై సంకల్పమాత్రమున నిజలేజః ప్రభావశక్తి సంపన్నుడగు మన్యువును సృష్టించెనట. అంతట దేవతలు మహాతీక్ష్ణ తేజుడును సకల యుద్ధకళా విశారదుడును సాక్షాత్‌రుద్ర సమానుడును అయిన మన్యువును తేరిచూడలేక ప్రసన్నుడవు కమ్మని ప్రార్థించగా తన తీక్ష్ణస్వరూపము నుపసంహరించుకొని ప్రశాంత గంభీరుడై దేవతలు వెంట రాగా రాక్షససంహారము చేసెనట. మన్యువు జన్మించిన స్థలమగుటచే ఈ క్షేత్రము మన్యుపురము లేదా మనుపురము అనియు మంత్రవేత్తలగు మునుల కిది కూటమి యగుటచే మంత్రకూటము లేదా మంత్రపురియని పిలువబడి అదియే నేడు మంథెన యని పిలువబడుచున్నది.

స్కాందపురాణాంతర్గతమగు కాశేశ్వర ఖండమున గోదావరీ తీరమున గల ఈ మంత్రకూటము యొక్క ప్రశంస గలదు.

శ్లో. కుండస్య పశ్చిమే భాగే యోజనత్రితయాంతరే
మంత్రకూట ఇతి ఖ్యాతో మునీనా మాశ్రమో మహాన్
తపోధన నివాసత్వా త్సర్వర్తుభి రలంకృతః
తత్రోద్భవా ద్విజన్మానో భవేయు ర్వేదపారగాః
మునీనా మత్ర కూటత్వాత్ మంత్రకూట ఇతి శ్రుతః
(కాశేశ్వరఖండము-తృతీయాధ్యాయము)

[తా. యమకుండము (యమునిచే నియుక్తుడైన విశ్వకర్మ కాశేశ్వర క్షేత్రమున నిర్మించిన కుండము) నకు పశ్చిమమున మూడు యోజనముల దూరములో మంత్రకూటమను మున్యాశ్రమముగలదు. మంత్రవేత్తలగు మునుల కది నివాస మగుటచే మంత్రకూటమను పేర బరగినది. తపోధను లుండుటచే అన్నిఋతువు లచ్చట నుండును. అచ్చట జన్మించిన బ్రాహ్మణులు వేద పారగు లగుదురు.]

గౌతమమహర్షి ఆశ్రమము ఈ క్షేత్రమునసేయున్న దనియు కాశేశ్వరఖండములో గలదు.

"తత్రైవ గౌతమశ్రేష్ఠః శుచి ర్భార్గవ గోత్రజః
మంత్రకూటా శ్రమే...పర్ణశాలాం సమాశ్రితః"

గౌతమ మహర్షిచే ప్రతిష్ఠ చేయబడినందున ఇచ్చట శివుడు గౌతమేశ్వరుడని పిలువబడుచున్నాడు.

చారిత్రకముగ మంత్రకూటము లేదా మంథెన ప్రసిద్ధి గాంచినది. కాని క్రీ. శ. పదియవ శతాబ్దము వరకు మంత్రకూట చరిత్రకు సంబందించిన విషయములు ఇంతవరకు బయల్పడలేదు. క్రీ. శ. పదియవ శతాబ్ద ప్రాంతమున మంత్రకూట నగరము రాజధానిగా పశ్చిమ చాళుక్య చక్రవర్తియగు భూలోకమల్లుని ప్రతినిధి 'శ్రీమతు గుండరాజులు' పరిపాలించెను. ఈ గుండరాజును కాకతిప్రోలుడు అవమానించి అతనిని జంపినట్లు తెలియుచున్నది.

'క్రుద్ధేనోద్ధుర మంత్రకూట నగరీనాథోధయోనిస్త్రపో
గుండః ఖండిత ఏవ ముండితశిరః క్రోడాంకవక్షఃస్థలః
ఏడో ఢింబకవత్పలాయనపరో జాతో గతః స్వాంపురీ
మాహూతోఽపి నృపేశ్వరస్య పురతః ప్రోలేన
యుద్ధాయతత్
(కాకతిరుద్రదేవుని అనుమకొండ శాసనము)

ఈ గుండరాజు స్వయముగ వేయించిన శాసనమొకటి మంథెనకు దక్షిణముగ గ్రామము నానుకొని ప్రవహించు బొక్కల వాగులో లభించినది. రామప్ప గుడి శాసనములో కూడా గుండరాజు ప్రస్తావన గలదు.

ప్రోలరాజు గుండరాజును రాజ్యభ్రష్టుని చేసినది మొదలు ప్రతాపరుద్రుని వరకు మంత్రకూటముతో సహా గోదావరి దక్షిణ ప్రదేశమంతయు కాకతీయ సామ్రాజ్యాంతర్గతమై యుండెను


(రుద్రమదేవి దేవగిరి ప్రభువగు మహాదేవరాజును వెనుకకు తరుముచు సేనలతో మంత్రకూట సమీపమునసే గోదావరి నుత్తరించినట్లు తెలియుచున్నది. ఇప్పటికిని నదిలో 'రుద్రపాదాలు' అనుచోట గండశిలలపై యుద్ధ

వీరుల ప్రతిమలు, ఏనుగులు, గుఱ్ఱములు మొదలగు యుద్ధ చిహ్నములు చెక్కబడి కనుపించును.)

గోపాలస్వామియను బ్రాహ్మణునికి ప్రతాప రుద్రుడు మంత్రకూటమును పునః అగ్రహారముగా నొసంగెను. మంత్రకూట నివాసియగు మల్లిఖార్జునసూరి యను బ్రాహ్మణుడు ప్రతాపరుద్రుని గురువుగా నుండెను. ఈయన ప్రతాపరుద్రుని పక్షమున భార్యతో గయ కాశీ మున్నగు పుణ్యక్షేత్రములు దర్శించి ప్రతాపరుద్రుని తండ్రి శ్రాద్ధములను పెట్టెనని గయయందలి శిలా శాసనమువలన తెలియుచున్నది. (డా. డి. సి. సర్కారుచే ఈశాసనము పరిశోధింప బడినది.) గయయందలి ఈ శాసనమునకు సంబంధించిన శాసనము మంథెనయందలి తమ్మచెఱువు కట్టక్రిందగల ఆంజనేయస్వామి గుడి యందు కలదు. ఈ శాసనములు రెండింటియందును 'మంత్రకూట గోపీజన వల్లభాయ నమః' అని కలదు. దీనింబట్టి మంత్రకూటమున గోపాల కృష్ణుని మందిర ముండిన ట్లూహింప నగునని డా. బి. రామరాజుగారు వ్రాయ పడిరి.



మహిషాసురమర్దని



రామగిరిలో లభించిన అంబుములులలో కొన్ని రకములు—ఇవి దాదాపు 2½ నుండి 5½ వఱకు అంగుళాలు పొడవున్నాయి

మడికి సింగనామాత్య విరచితమగు పద్మపురాణోత్తర ఖండము వలన ఈ ప్రాంతమును రామగిరిపట్టణము రాజధానిగా ముప్ప భూపాలుడు పాలించినట్లు తెలియుచున్నది. ఈ ముప్ప భూపాలుని మంత్రియగు కందయామాత్యునికే మడికి సింగన తన పద్మ పురాణోత్తర ఖండమును కృతిగా నిచ్చెను.

కాకతీయుల అనంతరము ఈ ప్రాంతమును వెలమలు పాలించిరి.

తరువాత క్రీ. శ. 1498 లో కులీకుతుబుషా హిందూ రాజులనుండి ఈ ప్రాంతమును బహమనీ సామ్రాజ్యమున చేర్చెను. కుతుబుషాహీలకు సంబంధించిన శాసనమొకటి రామగిరి కోట రెండవ ద్వారముపై గలదు.

అబ్దుల్లా కుతుబుషా తన ద్వితీయ పుత్రికను ఔరంగజేబు కుమారుడగు ముఆజంకు ఇచ్చి రామగిరిపరగణాను వరశుల్కముగానిచ్చెను. అప్పటినుండి ఈ ప్రాంతము మొగలు సామ్రాజ్యమున నుండెను. క్రీ. శ. 1676 లో ఔరంగజేబు గోలకొండపై దండయాత్ర జరిపిన సందర్భమున రామగిరి కోటను కేంద్రముగా చేసికొనెను. అదేసమయమున ఆతడు మంథెనకు సమీపమున గల కూచిరాజుపల్లె (నేటి బోయినిపేట) అను గ్రామమునకు పోయి అక్కడ బెస్తలకు ఆ గ్రామమును జాగీరుగా నిచ్చెను. ఈ సందర్భమునఒక కథ చెప్పుదురు —

ఒకనాడు ఔరంగజేబు కొలది పరివారముతో మంథెన ప్రాంతమున పల్లకిలో ప్రయాణము చేయుచుండగా ఆతనికి విపరీతముగా ఆకలి వేసినదట. కాని ఆతని కా సమయమున భోజనము లభింపలేదు. ఆత డాకలికి తట్టుకొనలేక పల్లకీ మోయుచున్న బేస్తలను వారివద్దనున్న ఆహారమును తెమ్మనగా వారు సంశయించుచు తమవద్దనున్న చద్దిమూటలను విప్పి పాదుషాయెదుటపెట్టిరట. పాదుషా ఆత్రముతో ఆ అంబలిని కడుపార తృప్తిగా త్రాగి కృతజ్ఞతా సూచకముగ వారికి కూచిరాజుపల్లెను జాగీరుగ స్వహస్తములతో వ్రాసి ఇచ్చెనట. ఈ కథలో నిజమెంతో తెలియదుకాని ఈ జాగీరు సనదులు మంథెన బేస్తలవద్ద కలవు. క్రీ. శ. 1949లో ఈ జాగీరును హైదరాబాదు ప్రభుత్వము స్వాధీనము చేసికొనెను.

క్రీ. శ. 1798 లో మంత్రకూటనివాసియగు బ్రాహ్మణుడొకడు కర్దలా యుద్ధానంతరము నానాఫర్నవీసుచే పట్టుబడిన హైదరాబాదు మంత్రియగు అరస్తుజాను ఖైదునుండి విడిపించెను. అందుకుగాను అతనికి మానేరు ఒడ్డునగల అడవిసోమనపల్లె అన్న గ్రామము అరస్తుజాచే జాగీరుగ నీయబడెను.



అన్నపూర్ణాదేవి — (కాశీపేట దేవాలయములు)

తరువాత మంత్రకూట ప్రాంతము మిగిలిన ప్రాంతములతోబాటు వెలిగందలజిల్లా కేంద్రముగ హైద్రాబాదు నిజాం నవాబుల పరిపాలనలోనికి వచ్చెను.

సాలార్జంగు హయామున జిల్లాలు పునర్విభజన జరిగినప్పుడు జిల్లా కేంద్రము వెలిగందలనుండి కరీంనగరమునకు మార్చబడెను అప్పుడే తాలూకా కేంద్రము ఆరాంగీరు నుండి మహాదేవ పురమునకు మార్చబడెను. 1920 లో మరల మహాదేవ పురమునుండి తాలూకా కేంద్రము మంథెనకు మార్చబడెను.

కరీంనగరము జిల్లాలో గోదావరి తీరమునగల

We manufacture and supply Layflat Polythene Tubings, Bags and Sheetings in any gauge and size, Polythene bottles to specifications with attractive printing, at competitive prices.



For your requirements
Contact

R. K. INDUSTRIES

16, Stringers Street, Madras-1.

Phone : Care 23019
23526

Grams : 'ARTHENE'

MACHINE MADE PAPER BAGS
OF
ALL KINDS AND SIZES
WITH OR WITHOUT
PRINTING

Manufacturers :

BAGS & PRINTS

16, Stringers Street,
MADRAS-1.

Phone: Care 23526

Grams: 'PAPERBAG'

ఈ ప్రాంతమంతటను ప్రాచీన నగరములు, సంస్కృతులు, మతములు వెలసియుండినట్లు నిదర్శనము లనేకముగ కన్పట్టును. వైదికమతమునకు స్థానమైన ఈ ప్రదేశమందు ఒకానొకసమయమున జైనమతము ప్రబలముగ నున్నట్లు దృష్టాంతములు ఎన్నియో లభించును. మంథెన లోను తత్పరిసర గ్రామములలోను జైనుల గుహలు, జైన శిల్పములు, తత్సంబంధములగు చారిత్రక అవశేషములు అగుపించును. మంథెన గ్రామములోని బిక్షేశ్వర స్వామి ఆలయము వెలుపలివైపునగల జైన శిల్పము, 'బల్లేర హనుమంతుని' ఆలయ ప్రాంతమున గల జైనుల బావులు, గోదావరి తీర పరిసరారణ్యములో గల కొండపై నున్న 'లంజగుళ్లు' అనబడు జైన గుహాలయములును ఇందుల కుదాహరణములు.

జైనమతము, తదుపరి నిచ్చట బౌద్ధమతము వెలసినట్లు కొన్ని నిదర్శనము లున్నను అది అంతగా వ్యాపించినట్లు తగిన ఆధారములు లేవు.

శైవమతము ప్రాచీనకాలమునుండియు ఈ భూమియందు వెలసినను ఈ ప్రాంతము శైవులగు కాకతీయుల వశమైన తదుపరియే బాగుగా వ్యాప్తి నొందినది. కాకతీయులు ఇచ్చట అనేక శివాలయములను, శివలింగములను ప్రతిష్ఠ చేసిరి. వానిలో చంద్రవల్లి శివాలయములు, గోదావరి ఒడ్డున గల గౌతమేశ్వరాలయములు, గ్రామములో గణపతి దేవునిచే నిర్మింపబడిన శీలేశ్వర, సిద్ధేశ్వరాలయములు (ప్రస్తుతమివి జీర్ణోద్ధరణ గావింపబడినవి), భిక్షేశ్వరాలయము మొదలగునవి ఇందుల కుదాహరణములు. ఇవిగాకను మంథెనలో పలుచోట్ల శివలింగములు, నందులు కానుపించును. మంత్రకూటము అష్టదిశలయందు దష్టలింగములు గలిగి మయుని వాస్తుశాస్త్ర ప్రకారము పరమశాయికపథకముపై నిర్మింపబడిన శివక్షేత్రము.

ఈ ప్రాంతమున శైవమతము ప్రబలినచాలా కాలము తదుపరి వైష్ణవ మతము మిగతా తెలంగాణా ప్రాంతములలో వలెనే వ్యాపించినది. కాని దాని ప్రభావము శైవ మతముపై పడలేదు. క్రమ క్రమముగ ఈ ప్రాంతమున అనేక వైష్ణవాలయములు వెలసినను, ఈ ప్రాంత ప్రజలు ఈ రెండు మతములను సామరస్య దృష్టితో చూచిరి.

విద్యావిషయములో, మంత్రకూటము వేదకాలము నుండియు పీఠమై యుండినదని మొదటనే చెప్పబడినది. ఇచ్చటి పండితులు ఋగ్వేదాది చతుర్వేదములందు, జ్యోతిష్యము, తర్కశాస్త్రము, యోగశాస్త్రము, మంత్రశాస్త్రము, లౌకికవిద్యయగు పాకశాస్త్రము మున్నగు శాస్త్రములలోను, సంస్కృతము, ఆంధ్రము మొదలగు భాషలలోను ఉద్దండులుగ నుండిరి. క్రీ. శ. 1850 ప్రాంతమున ముద్దు బాలంభట్టు అను కవివర్యుడు 'శివపురాణము', 'మంథెన రామాయణము' అను రెండు యక్ష గానములను చక్కని శైలిలో రచించెను. మంథెన రామాయణమింకను ముద్రితము కాలేదు. ఈ కవి తాను వరకవి నని తన గ్రంథమున చెప్పుకొనినాడు.

చారిత్రక ప్రదేశములు

పైన సందర్భవశమున చెప్పబడిన చారిత్రక ప్రదేశములేగాక ఇంకను గ్రామములోను పరిసర ప్రాంతము లందును ఎన్నియో చారిత్రక ప్రదేశములును, చారిత్రకావశేషములును లెక్కకు మిక్కిలిగ కలవు. అందు రామగిరి, చంద్రవల్లి, కాశీపేట, నెనారుగుహాలయములు, బహుగుళ్ళు మొదలగు నవి ముఖ్యమైనవి.

రామగిరి

రామగిరి పట్టణము రాజధాని. ఈ ప్రాంతమును ముప్పభూపాలుడు పాలించినట్లు, ఆ పట్టణమందు విష్ణ్వాలయము ఉండినట్లు, మడికి సింగనామాత్యుని పద్మపురాణోత్తరఖండము వలన తెలియుచున్నది. ఇప్పటికిని ఈ కొండపై భాగమున ఆనాటి కట్టడములగు సప్త ప్రాకారములు, కోట బురుజులు, దుర్గ ద్వారములు శిథిలావస్థలో కనుపించును. ఇవియే గాక రామగిరిపై నొక పురాతన పట్టణమున్న చిహ్నములగు శిథిల గృహములు, కోనేరులు, సవాలక్షగాదె లనబడు విశాలమగు ఆగారములు, తటాకము మొదలగునవెన్నియో కలవు. ఇచ్చట పరిసర ప్రాంతములలోని రైతులు తాము దున్నుచుండగా శిథిల పాత్రలు — గాజు పూసలు — అప్పుడప్పుడు బంగారు నాణెములు సైతము లభించినట్లు చెప్పుదురు. నేనీ ప్రాంతమునకు పరిశీలనార్థమై వెళ్లినప్పుడు ఇచ్చట గల తోపుభాగాలో త్రవ్వించగా అంబుల ములుకులు దాదాపు రెండు వందల వరకు లభించినవి. దీనింబట్టి ఇచ్చట త్రవ్వకములు జరిపించినచో చరిత్రకు సంబంధించిన వస్తుసంచయ మేద్దైన బయల్పడ వచ్చునని తెలియుచున్నది.

మహాకవి కాళిదాస విరచితమగు మేఘసందేశములో వర్ణించబడిన రామగిరి ఇదియేనని ఒక వాదము గలదు. ప్రతి సంవత్సరము శ్రావణమాసములో ఈ కొండపై న గల రామ ప్రతిమలకు ఉత్సవము జరుగును. ఇచ్చట పాండవుల లొంక యని పాండవులు నివసించిరనబడు ప్రదేశమొకటి కలదు. రామగిరి చారిత్రకముగనే గాక వనమూలికలకు, విలువగల రాళ్లకు, నిధినిక్షేపములకు, విచిత్ర గాథలకు పేరు గాంచినది. రామగిరికి సమీపమున బెల్లం రాపయ్య మెట్టలు అను కొండలలో నొకచోట రెండు కొండ రాళ్ల మధ్య నొక గుహ కలదు. దీనియందు శ్రీరామ పట్టాభిషేకము చెక్కబడియున్నది. ఇంకను లోనికి వెళ్లి చూడగా ఒక చిన్న శివలింగము కూడా కనిపించినది. ఇచ్చట ఒక జలపాతము కూడ కలదు.

చంద్రవల్లి

మంథెన గ్రామమునకు దక్షిణదిశయందు సుమారు ఐదుక్రోశముల దూరములలో మానేటి ఒడ్డున రెండు శివాలయములు కనుపించును. ఇవి గణపతి దేవచక్రవర్తి దీక్షాగురువగు శ్రీ విశ్వేశ్వర దేశికులచే నిర్మింపబడినటు తెలియుచున్నది. ఇచ్చట లభించిన విశ్వేశ్వరదేశికులచే వేయించిన శిలాశాసనము వలనను, రుద్రమదేవి మల్కాపుర శాసనమువలనను ఈ క్రింది విషయములు తెలియుచున్నవి. ఇచట పూర్వము (కాకతీయుల రాజ్యకాలములో) చంద్రవల్లియను నొక గ్రామము ఉండినది. ఈ గ్రామమున 'శ్రీమతు రాజగురుదేవరైన శ్రీ విశ్వేశ్వర శివాచార్యులుగారు' విశ్వనాదదేవరకు ఆలయములను నిర్మింపజేసి స్వామి అంగరంగ భోగాలకు భూమిని దానము చేసెను. తదనంతరము ఈ చంద్రవల్లి గ్రామము గణపతిదేవచక్రవర్తి తల్లి యగు బయ్యలదేవి పేర బయ్యలచంద్రవల్లి యనబరగినది. ఇచ్చట లభించిన శాసనము డా! నేలటూరి వేంకటరమణయ్యగారిచే పరిశోధింపబడినది.

ప్రస్తుత మిచ్చట రెండు శివాలయములున్నను, క్రీ. శ. 1948కి ముందు ఐదు ఆలయములుండినట్లు స్థానికులగు పెద్దలు చెప్పుదురు. వాటి దిబ్బలుమాత్రము ఇప్పుడు మన కగుపించును. ఇప్పుడున్న ఆలయములు పూర్తిగ జీర్ణావస్థలో కనుపించినను, వాటి వెనుకటి వైభవస్థితి లీలామాత్రముగ మన ఊహాపథమున మెరయును. అందును పశ్చిమముస నున్న దేవాలయమున కాకతీయుల శిల్ప వాస్తుకళా ప్రాభవము పరిణతిచెంది ఈ దేవాలయ రూపమున రూపమెత్తి నదా యనిపించును. ఏ శిల్పులు ఈ కరకురాలను కళామూర్తులుగా మలచినారోగాని వారి ప్రతిభతో వారి కళాతపస్సులో ఈ రాళ్లు కరగి తమంత తామే వారి భావములకు ప్రతిరూపములైనట్లు తోచును. కాని ఇప్పటి ఆ దైన్యస్థితిగాంచిన, హృదయము బాధతో బరువెక్కును. తమ జీవితమును కళకే అర్పించి, కళా తపస్వులైన ఆ శిల్పులు ఎట్టి మహత్తర సందేశములను శిలా రూపమున చాట నెంచిరో గాని, వారి స్మృతిచిహ్నములనైన మనము కాపాడుకొనలేకపోతిమి. ఏ కఠిన శిలలను వారు తమ అకుంఠిత కళాదీక్షతో కళానిలయములుగ మార్చినారో ఆ శిలలే నేడు శిథిలములైనను, దైన్య స్థితియందున్నను, మన హృదయములు స్పందించవు. ఇక మనమేమి చేసినను గతజలసేతు బంధనమే. ఐనను చేయవలసినదే. ఇక నైనను ఆ సంపద కాపాడుకొనవలసినదే.

ఇట్టి దృశ్యములు చంద్రవల్లిలోనే గాక ఈ ప్రాంతమున పలుచోట్ల కనుపించును. సుందర శిల్ప కళాఖండములు భగ్నములై వికృత స్వరూపములతో కనుపించును. కళాహృదయుడగు వానికి ఈ హృదయవిదారక దృశ్యములను గాంచిన అతని హృదయము వ్యథ చెందక మానదు. ఐనను నేటి సాంఘిక, రాజకీయ పరిస్థితులలో వారి బాధలుగాని దీనారవములుగాని అరణ్య రోదనలే. వారి బాధలు బధిరులముందు శంఖారావములు.

కాశీపేట

మంథెనకు ఉత్తరదిశయందు సుమారు రెండు క్రోశముల దూరములో గోదావరి ఒడ్డున ఉప్పట్ల అను గ్రామము వద్ద కాశీపేట దేవాలయములు గలవు. పూర్వమీ ప్రాంతమున కాశీపేటయను గ్రామము ఉండవచ్చునని ఇచ్చట లభించిన కొన్ని చారిత్రక అవశేషముల బట్టి తెలియనగును. ఇచ్చట ప్రస్తుతము ఒకే ప్రాకారములో ఒక శివాలయము మరియు రామాలయము కలవు. ఇచ్చట తెలుగులో నొక శాసనము కూడా కలదు. భాషను బట్టి అది చాలా ఇటీవలిదని చెప్పవచ్చును.

ఇచ్చట రాజయ్య అను నాతనికి మొదటి సాతవాహనుని నాణె మొకటి లభించినది. ఇది గమనార్హమగు విషయము. ఎందుకన, సాతవాహనులు ఆంధ్రరాజులు కారను నొకవాదము కలదు. ఈ ప్రాంతమున త్రవ్వకములు జరిపించినచో సాతవాహనుల చరిత్రకు సంబంధించిన విషయము లేవైన బయల్పడినచో సాతవాహనులు

ఆంధ్ర రాజులేయని, మరియొక ప్రబల నిదర్శనము మనకు లభించును.

నైనాపు గుహాలయములు

మంథెనకు తూర్పున అడవి సోమనపల్లె అను గ్రామమునకు సమీపమున మానేటి ఒడ్డున గల కొండపై ఈ గుహలు గలవు. ఇందునొక గుహలో శివలింగము కలదు. అదేగుహలో వెలుపలి భాగమున అజంతాలో వలె కుడ్య చిత్రములు (మహాభారతయుద్ధము చిత్రింపబడినవి) ఉండుట విశేషము. వేరొక గుహయందు భగ్నమైయున్న మహిషాసురమర్దని విగ్రహమొకటి కలదు. ఇదే గుహ వెలుపలిభాగమున పురాతనపు తెలుగు లిపిలో శాసనము గలదు.

బహుగుళ్లు

రామగిరికి సమీపమున లక్కవరగ్రామ పరిసర ప్రాంతమున గల కొండలలో నీ బహుగుళ్లు గలవు. ఇచ్చట పూర్వము చాలా గుళ్లుండినందున ఈ ప్రదేశమునకా పేరు వచ్చినది. ప్రస్తుతము ఇచ్చట భగ్నములై పడియున్న దేవతా మూర్తులు, ఇటీవల అరలవలె కట్టబడిన గుళ్లు తప్ప పురాతన దేవాలయములున్న చిహ్నము లేవియు కాన్పింపవు. ఇచ్చటి మూర్తుల నొక సంగ్రహాలయమున భద్రపరచిన బాగుండును.

పైన వివరింపబడిన ప్రదేశములేగాక ఇంకను మంథెన వద్దనున్న కళింగదేవి (బహుశ కాకతి శక్తియైయుండ వచ్చును) యను నొక సుందర దేవతావిగ్రహమును, గ్రామములోని పెంజెరువులో లభించిన వరదరాజస్వామి, చెన్నకేశవ స్వామి విగ్రహములును, పరిసర ప్రాంతములలో సుందిళ్లలోని నరసింహస్వామి దేవాలయము, చింతకాని గ్రామ సమీపములోని ప్రతాపగిరికోట (ప్రతాపరుద్రునిచే నిర్మించబడినది) మొదలగు నవి కలవు. ఇంకను అజ్ఞాతముగా చారిత్రక అవశేషములు, శాసనములు మొదలగునవెన్నియో ఈ ప్రాచీన భూమియందు నిక్షిప్తమైయుండిన వనిన సత్యదూరము కానేరదు.

ఈవిధముగ పురాణ ప్రసిద్ధి, చరిత్ర ప్రాముఖ్యము గలిగి, విద్యాపీఠమైన మంథెన గ్రామము నేడు విస్మరింప బడుట విచారకరము. మరల నిచ్చట వైదికవిద్యను, శాస్త్రములను గరపుట ప్రారంభించిన మంథెన తన ప్రాచీన వైభవమును, విద్యాగరిమను సంతరించుకొని ఆంధ్ర దేశముననే గాక భారతదేశములోనే యొక ప్రముఖ విద్యాపీఠముగ వెలసి జ్ఞానజ్యోతుల వెలయించుచు జ్ఞానభూమియై, వైదిక కర్మాచరణమున కర్మభూమియై, ధర్మాచరణమున ధర్మభూమియై లోకులకు చతుర్విధ పురుషార్థములను సాధించుటలో మార్గదర్శియై తనరారగలదని నా దృఢవిశ్వాసము.

[ఈ వ్యాసమున శ్రీ బి వెంకట రామారావుగారి (మంత్రకూట చరిత్ర) అను వ్యాసమునుండి వారి అనుమతిలో కొన్ని విషయములు గ్రహించ నైనది. వారికి నా కృతజ్ఞతలు.]

—o—

పశ్చాద్భూమి

శ్రీ 'కొలకలూరి'

ఆ రోజు ప్రతిరోజు మాదిరిగానే తెల్లవారింది. ఎర్రడాలుగా తిరిగింది ఆకాశం అంతదాకా తెల్లతెల్లగా వుంది మసక మసకగా ఉన్న మంచుతెరలు విచ్చిపోయాయి. ఒడిఒడిగా చెమ్మ చెమ్మగా ఉన్న లోకం మీదికి వచ్చిన సూర్యుడు నేల వెన్నుమీద రసిక గారుతున్న పుండులాగా వున్నాడు.

రాత్రి జ్వరంతో వేగిపోయిన పిల్లాడు పాడుచేసిన బట్టలు బాత్‌రూంలో పడేసి వచ్చిన ఇల్లాలితో 'నీకెంత ఓర్పే' అన్నాడు భర్త. మంచంమీదే అన్నీ అవుతున్న భర్త దగ్గర బక్కెట్ లేవట్రీలో క్రుమ్మరించి, నీళ్ళు పోసి తొరిపి వచ్చింది భార్య. ఆమె వైపు నీళ్ళునిండిన కళ్ళతో చూశాడు నోటమాటలేనిరోగి. దొడ్డికిపోయి ఇసుకలో కూర్చుని పిచ్చిగీతలు చూపుడు వ్రేలితో గీస్తున్న తమ్ముణ్ణి కసురుకొని లాక్కువచ్చి నీళ్ళు కడిగి పట్టెంటిలో కుదేసింది అక్క. చావు బ్రతుకులమధ్య గొట్టుమిట్టాడుతున్న మామ వాంతులూ బేదులు చేసుకొంటే రాత్రి అంతా నిద్రను దూరంగావుంచి దగ్గరగా కూర్చున్న ఇంటి పెద్దకోడలు తెల్లవారిం తర్వాత కునుకుతూ వుంది. హాస్పటల్‌లో దిక్కులేని పక్షి ఎవరో అపస్మారకంగా వుంటే ఆమె బెడ్‌దగ్గరనుంచి బెడ్‌పేన్ తీసి లోటీకిచ్చింది నర్సు.

రాంకోటి గుంట లోతూ పొడుగూ వెడల్పూ చూశాడు. రెండు బారలుంది లోతు. బాగా పదిబార లుంటుంది పొడుగూ వెడల్పూ! నిలువెత్తున చుట్టూ పోగుబడ్డ ఎర్రకండమట్టి ముద్దలు ముద్దలుగా వుంది. పై ఇసుక క్రిందికయి, క్రిందిమట్టి పైకివచ్చి తెలుపు ఎరుపుల కలగలుపుగా వున్న మట్టికుప్ప ఎక్కి గుంటలోతు చూసి నగరంవైపు కళ్ళు త్రిప్పిచూశాడు.

రోడ్డు కనిపించింది ఏవో తిరుగుతూ వున్నాయి తను చూచేది కనిపించలేదు. నగరంవాటి మలుపు తిరిగితేతప్ప కనిపించదు లారీ! నగరం అంటూ పొగ కావురు గమ్మింది ఆ సమయంలో ప్రతియింటిలో పొయి రగులుకొంటూ వుంటుంది.

రాంకోటి భార్యకు వయస్సు పైబడినా వృద్ధాప్యం తొంగి చూడలేదు. చీరె రెండు కాళ్ళకూ అంటుకు పోయేట్లు కట్టుకొంది. పైట చెంగు నడుంచుట్టూ త్రిప్పి రొంటిలో దోపుకొంది. ముక్కు పుడకమీద క్షణకాలం నిలిచి జారిపడిన చెమట బొట్టు ఓష్ఠంమీగ చెమ్మగిలిపోతుంటే మోచేతితో తుడుచుకుంది. నగరంలో విశ్రాంతిగా విశాలంగావున్న పేటలో ఇళ్ళవెనుక భాగం లోంచి నెత్తిమీది పళ్లికలో రోడ్డుమీదికి వచ్చింది. మలుపులో ఉన్న తారు డబ్బాలో పళ్లిక కుమ్మరించి, నెత్తిమీది కుదురు సరిచేసుకొని, రెండు మోచేతులతో ముఖమంతా తుడుచుకొని ప్రక్కసందులోకి వెళ్ళింది.

కాలి చిటికెనవ్రేలికీ, బొటనవ్రేలు ప్రక్కవ్రేలికి ఉన్న మెట్టెలు, కాళ్ల కడియాలు నడుస్తుంటే మోగుతుండగా గొందిలోంచి తిరిగి, సందుదాటి వీధిలోకి వచ్చింది ఇరవైఏళ్ల రాంకోటి కోడలు ముక్కు చక్కగా ఉన్నా, ముఖం ముచ్చటగా ఉన్నా ఆమె కవేవీ తెలియవు. ముక్కు మూసుకొని, ముఖం చిట్లించి, చూచీ చూడకుండా చూచే ఇరుకుపేట ఇళ్లలోని యువకులకు ఆమె ఆకారం తెలుసు చంకలోఉన్న బుట్ట తారు డబ్బాలో దిమ్మరించి మళ్లీ గొందుల్లోకి వెళిపోయింది.

నగరంలో ప్రక్కప్రక్క రోడ్లమీద లారీ వస్తూవుంది. మిలిటరీ హోటల్లో పలావ్ వండిన పెద్దరాగిపాత్ర పొయిసెగకు పొగచూరిపోయినట్లుంది లారీ. వంకర్లుటింకర్లు తిరిగి, కాశీ మజిలీ కథల్లో రాక్షసుడులాగావుంది. అది రోడ్డుమీద ఆగి వుంటే ఫర్లాంగుదూరంలో మనుష్యుల ఆకారాలు కాదు, అలికిడి కూడా వుండదు. అది పాగిపోతుంటే ఎదురుగా వచ్చే మనుష్యులు ముక్కులు మూసుకొని కళ్ళు చికిలించి దిక్కులు చూస్తూ నిలబడుతారు. రిక్షాలు, సైకిళ్ళు ప్రక్కసందుల్లోకి వెళిపోతాయి. కార్లు తప్పనిసరయితే ఆగమేఘాలమీద దూసుకుపోతాయి.

పేటలో ఉన్న తారుడబ్బాలు ఎక్కించుకొని రెండు టైర్ల బండిని ఈడ్చుకువస్తున్న ఎద్దు పేడకడి వేసింది బండి వెళిపోయాక పక్కింటి ఇల్లాలు బుట్టలో పేడకడి వేసుకొని తీసుకుపోయి, ఇంటముందు కళ్లాపి కొట్టింది టైరుబండిమీద ఉన్న తారుడబ్బాలు చొట్టలుపడి, నొక్కులుపడి వంకర్లు తిరిగి, పురావస్తు పరిశోధనశాఖలో భద్రపరుపదగిన వస్తువుల్లాగా వున్నాయి.

టైరుబండి ఎదురైనచోట లారీ ఆగింది. లారీ డ్రైవర్ ప్రక్కన కూర్చున్న చిన్నరాంకోటి—రాంకోటి కొడుకు — పాతికేళ్ల వాడు, క్రిందికి దిగాడు తారుడబ్బాలు మెల్లగా లారీలోకి ఎక్కించుకొన్నాడు అతని చేతులు బలంగా వున్నాయి మడికట్టు లావుగావుంది తారుడబ్బా బలంగా పైకిలాగుతుంటే అతని దండ కడియం బిర్రబిగిసిపోయింది. మోకాళ్ళదాకా మడిచిన అతుకుల పేంట్ పూనికతో డబ్బా పైకి లాగుతున్నప్పుడు మోకాళ్ళదగ్గర బిర్రుగా బిగిసింది.

ఆ పాకకు నిట్టాడి లేదు. రెండుప్రక్కల కాళీగుంజలపైన అడ్డంగావేసిన లావుపాటి బొంగుమీంచి క్రిందికి జారిన వెదురు తుంచెలమీద వడేసిన తాటాకులు ఆ పాకకు ఆకారం ఇచ్చాయి. లోపల చినిగిన చాపతుంపుమీద బాచిపట్లువేసు క్కూర్చున్నాడు రాంకోటి.

మోకాళ్లదాకావున్న కాకీనిక్కరు ఉండవలసిందానికంటే వదులుగా వుంది. పైన ఉన్నది చొక్కా కాదు. కురుచచేతులు జబ్బలుదాకా కూడ రాలేదు ముతకబట్ట. బన్నీను కాదు. దాని కంటే పెద్దది. మిషన్‌మీద కుట్టించిందే! శ్లాక్‌లాగా లేదు కుదిమట్టసంగా నడుందాకా వుంది. నిక్కరుజేబులు కూడా మూయ లేదు, ఆ గుడ్డ బన్నీనువంటి చొక్కా!

ఎడంచేతిప్రక్క క్రిందిభాగంలో లోపలవైపువున్న జేబు లోంచి రాంకోటి పొగాకుకాడ తీశాడు. అంతా బారుగా చుట్టుకు పోయివున్న దాన్ని వెడల్పు చేశాడు. మొదట్లో పట్టుకొని, కొన నుంచి కాడవీకి వేరుచేశాడు. రెండుప్రక్కలఉన్న పాయల్లో ఒకటి పాపుచేసి చాపమీద పెట్టి మిగతా పొగాకు బారుగా సాగదీసి, తుంపులుతుంపులుగాచేసి, పాయలో పాదిచేసి పెట్టి చుట్టచుట్టాడు. ఆ జేబులోంచి అగ్గిపెట్టె తీసి పుల్లలాగి, వెలిగించి, రెండువేళ్ల మధ్య చుట్ట నోట్లో పెట్టుకొని బుగ్గలు చొట్టలు వడేట్టుగా, రెండుప్రక్కలనుంచి చెంపలు పట్టుకారుతో ఒత్తిపట్టినట్లు లోపలికిపోయేట్లు పొగ పీల్చి గవదలు ఉబ్బించి పొగ వదిలిపెట్టాడు రాంకోటి. పొగ తాపీగా వదులుతూ ఎదురుగా అల్లంత దూరంలో ఉన్న గుంటవైపు చూస్తున్నాడు.

కాళ్లు అరజాపి, మోకాటిచిప్పలు చేత్తో రుద్దుకొంటూ కులిదీరా చుట్ట కాల్చుకొంటున్నాడు. రాంకోటి పొట్టిగా గిడస బారి ఉన్నాడు. కళ్లు చిన్నవి. కనురెప్పలపై వెంట్రుకలున్న జాడలేదు బోణతలమీద వెంట్రుకలు అక్కడొకటి, ఇక్కడొకటి వున్నాయి. తల మున్నగా లేదు కాళీకాళీగా తెల్లవెంట్రుకలు చెదురు మదురుగా వున్నాయి. చెంపలు ఎండి ముడతలుపడి పెళుసుగా ఉన్న తమలపాకులు లాగున్నాయి. రెండు పెదవులు కలిసే రెండు చోట్ల రెండు రైళ్లుజన్ను ఢీకొంటే పెట్టెలు చెక్కలు వంకర్లు తిరిగిపోయినట్లు ముడుతలున్నాయి. ఆ ముడుతలపైన పదేసి వెంట్రుకలు బారుగా క్రిందికి చూస్తూ వెండిదారాలు అతికించి నట్లు మీసా లున్నాయి. పై పెదవిమీద, ముక్కుక్రింద పెదవి కొసదాకా వెంట్రుకలు లేవు అక్కడ నున్నగా వుంది నూనె రాసిన లేత తమలపాకు మెరిసినట్లుగా మెరుస్తూవుంది. ముక్కు రంధ్రాల లోపల వెంట్రుకలు లేవు. వెంట్రుకల పొదల ఉనికి కూడా లేదు. జోడుగుళ్ల తుపాకీ బేరల్స్ మెరిసినట్లు మెరు స్తున్నాయి ముక్కుగోళ్లు, లోపలిభాగాలు. చాపముందు విడిచిన అరిగి పీలికలయిన చెప్పులు ఉంగటాలు తెగి వికృతంగా వున్నాయి. చేతివ్రేళ్లు ఆకారానికి మించినంత బారుగా వున్నాయి.

మునసబు కొడుకు మునసబు, కరణం కొడుకు కరణం, వెట్టివాడి కొడుకు వెట్టివాడు అయినట్లు రాంకోటి కొడుకు రాంకోటి—తండ్రి తర్వాత పొలం పుట్రా నగానట్రా ఇల్లూవాకిలీ మళ్లూ మాన్యాలు కొడుకు సంరక్షించుకొన్నట్లు, అవ్వ ఆభర ణాలు తల్లికి, తల్లి సొమ్ములు కూతురుకు, కూతురు నగలు కూతురు కూతురుగా తరతరాలనుంచి సంక్రమించినట్లు, తద్దినాలు పెట్టే తండ్రి కొడుకు తద్దినాలు పెట్టినట్లు, వ్యాపారి కొడుకు వ్యాపారం నిలబెట్టుకొన్నట్లు వంశపారంపర్యంగా వస్తున్న ఆస్తినీ, హక్కునూ—నిలబెట్టుకొన్నాడు.

రాంకోటి వయస్సు అరవై దాటింది. అతనికి ముగ్గురు కొడుకులు. పెద్దవాళ్లిద్దరూ తండ్రి అంతటివాళ్ళు కాలేదు. ఏదో చదువు వెలగబెట్టారు. చాలీచాలని జీతాలతో చచ్చే చావు జస్తూ ఉద్యోగాలంటూ వెలగబెడుతున్నారు. వాళ్ళ సంసారాలు పిల్లా జెల్లా, ఏవో బాధలు పడుతున్నారు. చిన్నవాడికి చదువు అబ్బ లేదు అందుకే రాంకోటి అయ్యాడు. పెద్దరాంకోటి పలుకుబడి వల్ల చిన్నరాంకోటి కీపాటి ఉద్యోగం అయినా చిక్కిందిగాని లేక పోతే అందుకూ పనికిరాని ఆటకాయతనం ఉన్న రాలుగాయి! పెద్ద రాంకోటికి ఆడపిల్లలు లేరు ఇద్దరు కోడళ్ళు పెద్దవాళ్ళు కాప రానికి వచ్చినట్లేవచ్చి వెళిపోయారు భర్తల వెంట బాధ్యతలు మోసుకొంటూ. చిన్నకోడలు ఇంట్లోనే వుంది అత్తమామలను నమ్ముకొని. చిన్నకోడలే పెద్దరాంకోటికి కూతురులేని లోపం తీర్చింది. చిన్నరాంకోటికి ఇంకా పిల్లలు కలగలేదు.

కాలం ఎంత ముందుకు పోయినా, పోకపోయినా, పట్టణాని కొక రాంకోటి పదిలంగా ఉంటాడు. జబ్బుచేసిన నగరానికి, చీడ పట్టిన వీథులకు, ప్రతియింట వెలుపల తూగుతున్న జాతికి పరి చర్య చేసేందుకు బస్తీల్లో, పట్టణాలలో, నగరాలలో, అమ్మ లాగో, అక్కలాగో, అత్తలాగో, కోడలులాగో, భార్యలాగో నర్సు లాగో, అందరి ఏకరూపంలాగో, స్త్రీ కాని రాంకోటి స్త్రీ లాగా మారి వుంటాడు. రాజులు మారిపోయి, రాజ్యాలు మారిపోయి ప్రజలే రాజులయి, ప్రభుత్వాలే ప్రజలయినా కావచ్చు ఏది ఏమ యినా కావచ్చు కాని మానవజాతి మనుగడ వున్నంతవరకు రాంకోటి మారడు ఒక రాంకోటి కాకపోతే మరో రాంకోటి. ఇంకో రాంకోటి వేరో రాంకోటి! రాంకోటి శాశ్వతం! రాంకోటి నిరంతరం! రాంకోటి కలకాలం! రాంకోటి చిరంజీవి!

మొదటి లారీ వచ్చింది. ఆ పాటికి చుట సగం కాలి పోయింది నోట్లో ఉన్న కొసకొరికి, ఉమ్మివేసి, కాలుతున్నప్రక్క నుసిరాల్చి, వేలమీదరాసి, ఆరిపోయిం తర్వాత చెవిలో దోపు కొన్నాడు రాంకోటి. పెద్దరాంకోటి లారీతో వచ్చిన చిన్నరాంకోటిని చూశాడు వెలుపలికి వచ్చి. లారీ ఆగింది.

'ఏరా తెచ్చావా?'

'ఆఁ!'

Head Office:
4/7 A, WATERLOO STREET,
CALCUTTA-1.

Branches:
BOMBAY
DELHI

We Manufacture:

- ★ **Duplex Slitting and Rewinding Machine to Slit Cellophane, Polythene, "REELSTAR" Heavy duty Slitting and Rewinding Machine to Slit Paper, Thin Board and Laminated Materials Etc.**
- ★ **Polythene Bags making machine with three Colour Printing attachment.**
- ★ **Reel fed Two Colour Felexographic Printing Machine.**
- ★ **Rubber Sterio Making Machine.**
- ★ **Cross Cutting Machine (Sheeter)**

Sole Agents For India:

Hirundo Cylinder Machine — Wifag News Paper Rotaries — Rotogravure — Drust Labarator — Aurelia Offset Machines—Fischer & Kreche Paper Converting Machines and Printing Materials.

Please Contact:

Phone: 75563

THE PRINT & PAPER (SALES) P. LTD.

49/2, Royapettah High Road,
MADRAS-4.

చిన్న రాంకోటి గుడ్డమూట పాకలో పెట్టాడు లారీ సీటులోంచి తీసుకువచ్చి. లారీ గుంటదగ్గర నిలబడింది. ఇద్దరూ లారీ దగ్గరకు పోయారు. తారు డబ్బాలుదించి, గుంటలోకి కుమ్మరించి, బారు కర్రకు కట్టిన దువ్వెనవంటి ఇనుపకొక్కెల పరికరంతో తారు డబ్బాలుగీరి, మళ్ళీ డబ్బాలు లారీలోకి ఎక్కించారు. లారీ మళ్ళీ నగరం అభిముఖంగా నిలబడింది. డ్రైవర్ బీడీ ముట్టించుకొన్నాడు.

'రేయ్ రాముడూ?'

'ఏంది?'

చొక్కావంటి బనీను ఎడంప్రక్కఉన్న జేబులోంచి పర్సు తీశాడు పెద్దరాంకోటి. అది నరిగి, నలువైపుల అణిగి, గుండ్రంగా వుంది. పర్సు తెరిస్తేనే అది చదరంగా ఉందని తెలుస్తుంది. రెండు రూపాయిల నోటి వెలుపలికి లాగి, కొడుక్కు ఇచ్చాడు.

'పాయసం చెయ్యమంట న్నానవటాని జెప్పరా మీ యమ్మకీ!'

'సర్లే! అట్లాగే!'

'అల్లాటప్పాగుంటే ఈల్లేదని జెప్పు' ఫస్టుకలాస్‌గా వుండాలి. మాంచి ఆకలితో రెపరెపలాడతా వస్తానావటాని జెప్పు!'

చిన్న రాంకోటి రెండు రూపాయిల కాగితం పేంట్‌జేబులో పెట్టుకొని లారీ ఎక్కాడు. డ్రైవర్ బీడీ పీక అవతల గిరాటు వేసి, సీటెక్కాడు. లారీ బైలుదేరింది లారీ వస్తున్నప్పుడు బాడీలో వెనుక నిలబడ్డ వాళ్ళిప్పుడు కూర్చున్నారు.

ఆ ప్రదేశం ఏభై ఎకరాల విస్తీర్ణం వుంటుంది. రైతులు అవతలప్రక్కనుంచి ఎరువు బళ్ళల్లోకి ఎత్తుకొంటున్నారు. రెండెడ్లబళ్ళు, ఎడ్లు, జీతగాళ్ళు, పలుగులు, పారలు, జల్లలు, తట్టలు—అటువైపు హడావుడిగా వుంది. కరకర ప్రొద్దెక్కుతూ వుంది. రాంకోటికి ఆకలి అయింది.

రాంకోటి పాకలోకి వచ్చాడు. మట్టిబాన ఒకటి మూలవుంది. దానిమీద మూకుడు దీసి, ముంతతో నిండా నీళ్ళు తీసుకొని బానదగ్గర పెట్టుకొని, కొడుకు తెచ్చిన మూట విప్పి కొసలు సాపుచేసి, విస్తరి వంపులు తిన్నగా చేసుకొని చూశాడు. అంతా ఒకే ముద్దగా అతుక్కుపోయి ఉన్న పెరుగు కలిపిన చద్ది అన్నం, ప్రక్కనున్న నిమ్మకాయబద్ద నంజుకొంటూ తింటున్నాడు.

ఎగువనుంచి ఎవరో వస్తున్న అలికిడి అయింది. తలెత్తి వెదురుబద్దల గోడలోంచి చూశాడు. ఎవరో రైతు ఎడంచేయి బొటనవ్రేలు తర్జనితో ముక్కు మూసుకొని, కుడిచేతో కట్టుపంచె ముంజెంగులు ఎత్తిపట్టి, మునిగాళ్ళమీద ఎత్తిపట్టి ఎత్తిపట్టి అడుగులువేస్తూ వస్తున్నాడు రైతు.

చద్ది తినటం ముగించి, గుడ్డ బైట విదిలించి, ఎంగిలి విస్తరాకు తీసుకుపోయి గుంటలో పడేసి, ముంతలో నీళ్ళు చేతిమీద పోసుకుని కడుక్కొని, మూతి తుడుచుకొని, బన్నీనుతో అద్దుకొని చెవిలోఉన్న చుట్టతీసి ముట్టించుకొని పొగ వదులుతూ రైతువైపు చూశాడు.

'ఏం జేత్తన్నా?'

'ఏదీ—ఇది గిప్పుడే సద్దినీ.'

'ఇక్క డేంది, అటన్నా బోయి దినకపోయా!'

రాంకోటి రైతు ముఖంలోకి నిరుత్తరంగా రెణ్ణిమిషాలు చూచి ఏందొరా! ఏంది చెప్పు!'

'ఎరువు దోలుకుపోతా, జీతగాళ్ళొచ్చారు. బళ్ళాడిడిచేరు.'

'కాగితం తెచ్చా!'

'ఆఁ!'

రైతు జేబులోంచి కాగితం ఇచ్చాడు తీసి చూచుకొని 'ఎన్ని బళ్ళు?'

'ఆర్లే! మూడిప్పుడు దోలుకుపోతా, మళ్ళీ రేప్పొద్దున్నే మూడు!'

'అట్లాగే!'

కాగితం బన్నీను జేబులో పెట్టుకొన్నాడు రాంకోటి ఇద్దరూ ఎగువకు పోసాగారు ముందు రైతు. వెనుక రాంకోటి. వాళ్ళిద్దరికీ ఎప్పుడూ పదిగజాల దూరం! రాంకోటి రైతును కలుసుకోవాలని ఎంత తొందరగా నడిస్తే అంత తొందరగా రైతు ముందుకు వెళుతున్నాడు రాంకోటి కలుసుకోనూ లేదు. రైతు కలిసె అవకాశం ఇవ్వనూ లేదు. ఇద్దరూ ఎగువకు వచ్చాక రాంకోటి అన్నాడు

'బాగా పొద్దెక్కిందియాల. పెందలాడే బళ్ళు కట్టించుకు రాలేకపోయావా దొరా!'

'ఏదిరా ఈలేదీ? బళ్ళు బాడిక్కి దొరకటం ఎంత కష్టం ఏందీ?'

మిగతా రైతులు జీతగాళ్ళతో ఎరువు ఎత్తించుకొంటున్న తావుకు ఇద్దరూ చేరారు. ఇక్కడే ఎత్తుకోండి అన్నట్లుగా 'ఈడే!' అన్నాడు రాంకోటి జీతగాళ్ళు అక్కడికి వచ్చారు. ఎరువు ఎత్తుకోవటం మొదలయింది. రాంకోటి బండిమీదున్న జల్లలు చూచి—

'దొరా!'

రైతు తలెత్తి చూశాడు.

'ఏణ్ణుంచి దెచ్చా ఈ జల్లలు? ఈ ఎరువు దోలుకు పోగానికే ఇంత పెద్దజల్లలు మేదరోడికాడ జేయించావేంది? ఇంత పెద్దజల్లలు!'

'అబ్బే! అదేంలేదు రాంకోటీ! ఇయ్యి మావూరి జల్లలే! లచ్చే! ఏం పెద్దయ్యి!'

'ఏందోలే దొరా! కానీయండి!'

పోయినేడు లారీలు తోలిందీఏటికి ఎరువయింది. ఇప్పుడు తోలేది వచ్చేఏటికి ఎరువు! ఇప్పుడు పనికిరాని అసహ్యం వచ్చే ఏటికి పనికివచ్చే ఎరువు!

ఆ ఎరువుపై మొలిచిన గరిక పరకలు కొరుక్కుతింటూ వుందొక ఎద్దు! దూరదూరంగా కట్టేసిన ఎడ్లు కొన్ని పడుకొన్నాయి కొన్ని నిలబడే ఉన్నాయి కొన్ని నెమరువేస్తున్నాయి తోకలొ ఈగలు తోలుకొంటూ మొలకలు తింటున్న ఎద్దును చూచి, 'ఏం దొరా! ఈ ఎద్దుకి గడ్డేయటం లేదేంది?'

'ఎందుకేయుంరా అదో కరువుబొద్ది! ఏడ నాలుగు పరకలు గనబడ్తా ఎగబడుద్ది!'

మొత్తం నలిపై బళ్ళున్నాయి. ఎరువు బళ్ళలోకి ఎత్తుకొంటున్నారు వచ్చే బళ్ళు వస్తున్నాయి. పోయేవి పోతున్నాయి పోలుగర్ర ఎత్తి, కాడిక్రిందికి ఎద్దులాగి, మెడకు పట్టేళ్ళు తగిలించి చిరతలు దిగేసి, జీతగాళ్ళెక్కిన బళ్ళు బైలుదేరటానికి సిద్ధంగా ఆయి దున్నాయి.

'ఈ అయిదెవురియ్య' రాంకోటి అడిగాడు.

'నాయేరా?'

'మీకు నాలుగే గందా! అయిదేంది?'

రైతు నసిగాడు. 'ఏందో లేరా! పోనీయ్! జీతగాళ్ళకు తెలియదు'

రాంకోటి నవ్వాడు. నిజంగా జీతగాళ్ళకు ఏం తెలుస్తుంది. రైతుకే తెలియాలి. ఆయ నెన్ని బళ్ళు అంటే అన్నే తోలుకుపోతారు వాళ్ళు. వాళ్ళ తప్పేం వుంది?

'తీరా ఎరువెక్కించిన జల్లలు కుమ్మరిచ్చమంటే ఏస్నేయంగా వుంటదిగానీ ఆ డబ్బేందో ఈడ దగలేసిపోతే పోద్ది!'

రాంకోటి నిర్మొహమాటంగా అంటుంటే ఏం అనలేక రైతు జేబులోంచి డబ్బుతీసి ఇస్తూ 'అంతా లేదురా ఇదిగిదే వుంది. ఉంచు! మళ్ళీ ఇత్తాలే!'

రాంకోటి నవ్వాడు. 'పోయినేడూ ఇంతేగా దొరా! మళ్ళీ ఇచ్చా? ఎందుకొచ్చింది గానీ, ఎల్లండి.'

రైతు బళ్ళతోపాటు వెళ్ళిపోయాడు.

వరినారు మళ్ళలోఅప్పుడే బెత్తెడెత్తు పెరిగింది వానలు పడేలోగా చేలల్లో ఎరువు తోలాలి. కాలువలు వచ్చాక నీళ్ళు పెట్టుకొని పొలం పదను చేయాలి. వారంరోజుల్లో పెద్ద కాలువ వదులుతారని వినికిడి. రైతులు ఎరువు తోలుకుపోతున్నారు. తొలకరికి ముందే తంతంతా ముగిసిపోవాలి

రాంకోటి పాకముందు కుందుగూర్చున్నాడు. చుట్టచివరి కంటా కాలుకొచ్చింది. పెదాలమధ్యనుంచి చుట్టతీసి పాకకు దూరంగా పారేసి, కాండ్రించి ఉమ్మివేసి చతికిలబడ్డాడు. లారీలు వస్తున్నాయి. వెళుతున్నాయి. చిన్నరాంకోటి మళ్ళీ ఒకసారి లారీతో రావాలి. వాడితల్లి ఇంటికి వచ్చిందో రాలేదో, పాయసం సంగతి చెప్పాడో లేదో ఆలోచించుకొంటున్నాడు రాంకోటి.

ఏడాది క్రితం నాగరక నగరం, అనాగరకంగా తరిమిన లారీలు, ఇక్కడికివచ్చి, ఇంతలోనే నాగరిక నగరానికి నాగరకంగా పనికివచ్చే ఎరువు తయారు చేశాయి. భూమి తన చుట్టూ తాను తిరుగుతూ వుందో లేదో తెలియదుగానీ, సూర్యుడు చుట్టూ మాత్రం తిరగటం లేదు కడుపుచుట్టూ తిరుగుతూ వుంది.

పండుగ రోజుల్లో ఇంటినిండా రకరకాల వంటకాలు, భార్యా కోడలూ ఇద్దరూ అడుక్కు వస్తారు. 'అడె వుండు, ఈడకు రాబాక! ఏంది మరీ దగ్గరకొత్తా. బావి దగ్గరకు రాకే మొద్దు! చెప్పేది నీకే! వినబట్టంలా?' అంటూ తాము వేసుకొన్నవి కలవాళ్ళు పెడితే వాళ్ళు బుట్టలో వేయించుకొని, నెత్తినో చంకనో బెట్టుకు రావటం చూస్తే వాళ్ళు తారు డబ్బావైపు వెళుతున్నారో, ఇంటికి వెళుతున్నారో తెలియని వాళ్ళు పోల్చుకోలేరు.

ఎందుకో రాంకోటి పైపెదవి చివరి అంచుల్లోఉన్న తెల్ల వెంట్రుకలగుంపు క్రిందికి వాలి వున్నవి కొంచెంగా పైకి కదిలేట్టు నవ్వాడు ఆ నవ్వులో ఆడుకొంటూ పడి దుమ్ము కొట్టుకుపోయిన పిల్లవాడు లేచి నిలబడుతుంటే చూచి నవ్వే తల్లితీరు కనిపిస్తుంది. పట్నంవైపు చూశాడు. లారీ ఒకటి మలుపు తిరిగి వస్తూవుంది.

కొడుకు లిద్దరూ గుర్తుకు వచ్చారు. కులవృత్తి మానవద్దని అందరూ చెప్పారు పూర్వం. ఇప్పుడు మానతాం అంటూ అందరూ ఎదురు తిరుగుతున్నారు. ఏ విషయం ఎక్కువగా ప్రస్తావింపబడుతుందో ఆ విషయంమీద అనుమానం ఎక్కువవటం, లోకంలో సహజమే!

చెప్పులు కుట్టేవాడి కొడుకు చెప్పులు కుట్టననటం, చాపలల్లేవాడి కొడుకు అందుకు తిరస్కరించటం, గీసేవాడి కొడుకు ఎదురుతిరగటం, ఈ రోజుల్లో రివాజు అయిపోయింది. కులవృత్తిలో వచ్చే సంపాదనకంటే— రాబడికంటే ఎదురుతిరిగిన వాళ్ళు వేరే వృత్తిలో ఎక్కువ ఆర్జింపలేకపోవచ్చు. అయినా ఎదురుతిరుగుతారు.

ఈ ఎదురుతిరగటం ఎవడికీ ఎవడూ నేర్పలేదు. అంటే, ఏ ఒక్కడూ మరే ఒక్కడికీ బోధింపలేదు. ఈ శతాబ్ది జాతి జీవితంలో వచ్చిన మార్పే అది ఎక్కడెక్కడో వచ్చిన పరిణామాలు ఇక్కడ నాటుకుపోయి మొలకెత్తాయి.

తాను చేసేపని తప్పని ఎవరయినా అంటే తక్షణం మానుకొంటాడు మంచిమనిషి. తాను చేసేపని ఎగతాళి చేయబడితే, నిందింపబడితే, తిరస్కరింపబడితే, సమర్థుడయితే మనిషి ఎదురుతిరుగుతాడు. అసమర్థుడయితే తల వంచుకుపోతాడు.

అలా ఎదురుతిరిగినవాళ్ళు పెద్దవాళ్ళిద్దరు. వ్యవస్థలో అలా జరక్కుండా వుంటానికి ఎన్నో కట్టుదిట్టాలున్నాయి వాటిలో తెగ్గదెంపులు చేసుకొని వెలుపలికి రాగలవాళ్ళు కొద్దిమంది! ఆ కొద్దిమందిలో కొడుకు లిద్దరు. పెద్దవాడు రంగన్న తాలూకాఫీసులో కాపీయిస్టు! రెండోవాడు చింతయ్య కలెక్టరాఫీసులో యల్ డి సి. వాళ్ళకు పెద్దజీతాలు ఏమీరావు బ్రతుకుదెరువు కటకటలాడుతూ వుంటుంది.

నగరంలోంచి లారీ వచ్చింది హారన్ వినిపించింది రాంకోటి లేచి ముందుకు వచ్చాడు. ప్రొద్దు రెండు బార లెక్కింది. జూన్ నెల ఎండ ఉదయమే తీవ్రంగా వుంది లారీకి చోటు చూపించి మట్టిగుట్టమీద నిలుచున్నాడు. లారీతో వచ్చిన ఎవరో హడావుడిగా గుట్ట ఎక్కుతుంటే, 'ఇద్సుగో ఆ తొందరే వద్దన్నా!' అన్నాడు

'ఏం?'

'ఆదసలే పాతమట్టి, జవుకిస్తుంది ఏం దా దూకుడు? ఆగు! ఆగాగు, కాలుజారి బిళ్ళబీటుగా అందులోబడి కూరుకుపోయేవ్!'

ఎదుటి మనిషి ఆగిపోయాడు. అందరూ చెప్పిన మాట వినరు. పిల్లలిద్దరూ అంతే! కొందరు చెప్పుడు మాటలు వింటారు చెడిపోతారు.

లారీ వెళిపోయింది.

హాయిగా తాతముత్తాతలు తరతరాలనుంచి చేసిన పని ఎందుకు చేచేతులా వదులుకొంటారు అని అందరూ చెప్పినా ఆలించలేదు రంగన్న చింతయ్య. వాళ్ళంటే కోపమే!

తల్లి దండ్రుల్ని మించిన దేవతలూ దేవుళ్ళూ లేరు, నీ నాన్నను కనిపెట్టుకుండు బాగుపడి పోతావంటే ఆ మాటలు విని చెడిపోయిన రాముడు — చిన్నరాంకోటి — అన్నా దిగులే!

రంగన్న ఎప్పుడూ ఎందుకో బాధపడుతూ వుంటాడు. ఏదో పోగొట్టుకొన్న వాడిలాగా దిగాలుపడి వుంటాడు దేన్నీ సహించలేడు. ఎవడయినా ఏడుస్తుంటే వూరుకోడు ఎవ్వరున్నా చూడలేడు. పెద్దవాడి మనస్తత్వం బోధపడక బాధపడ్డాడు రాంకోటి, కొడుకును చూద్దామని వచ్చిన మొదటి రోజే!

వాడికొక అద్దె యిల్లు! నెలకు ఏడు రూపాయిలు తాటాకుల పాక! నలుగురు పిల్లలు. పెళ్ళాం ముక్కుతూ మూలుగుతూ చీదుతూ వుంటుందెప్పుడూ! కోడలు వరసేం నచ్చలేదు రాంకోటికి.

ఆ పెద్ద తాటాకుల పాకలో ఎనిమిది భాగాలు, ఎనిమిది సంసారాలు! అంతా వెరసి ఆ యింటిలో ఏభైమందైనా వుంటారు. ఇంత ఇంటికి ఒక్కటే లేవ్రెటి!

రెండో రోజు ఉదయం పాకీ మనిషి వచ్చేసరికి ఏభైమంది కంయ్‌మని లేచారు. ఆమె రెండు రోజుల్నుంచి రాలేదుట. భర్తకూ పిల్లలకు ఆరోగ్యం ఎత్తూ దించాల్లో వుందిట. ఆమె గోడు ఎవరూ ఆలించటం లేదు. రాంకోటి, రంగన్నలయినా ఏమన్నా మాట్లాడతాడేమోనని ఎదురు చూశాడు చుక్కెదురయింది.

పాకీ అంటే పవిత్రం అనే అర్థం వుందని చదువుకొన్న వాళ్ళెవళ్ళో చెబితే విన్నాడు రాంకోటి ఎప్పుడో! పాకీ దొడ్డి అంటే మనిషి పావిత్ర్యం పొందే తావు అన్న మాటనూ నమ్మాడు. అయితే పాకీ మనిషి అవస్థ చూచింతర్వాత పవిత్రతకు అర్థం లేదనిపించింది.

ఓర్పు అలవాటు చేసుకొన్న మనిషి ఎంత కష్టంఅయినా నవ్వుతూ సహించవచ్చు. భరించవచ్చు రాంకోటి కెప్పుడూ తను బాధపడుతున్నట్లు ఆలోచన కలగలేదు అయితే ఆ రోజు ఆమె దుస్థితి చూచి, కష్టం చూచి బాధపడ్డాడు

బాచినట్టు వేసుకొని అన్నంముందు కూర్చున్నప్పుడు రాంకోటి కొడుకు నడిగాడు.

'ఏందిరా నువ్వన్నా అగండాగండి, ఏం దీ గోలావటాని అద్దుబళ్ళేదేం పొద్దుని.'

'ఏంది? ఏందది?'

'పాకీ మనిషి రాలేదంట్రా పొద్దుని. అందరూ కంయ్ కుంయ్‌మని ఎగ్గిరే! అదే పొద్దున్నే!'

'మన కెందుకా రొంపి!?'

'ఇదేందిరా! నువ్వన్నా కలగజేసుకోకపోతే—ఆ దిక్కుమాలిం దెంతేడిసిపొయ్యేందిరా!'

'ఆఁ! ఇట్టాటియన్నీ బట్టిచ్చుకొంటే నేనీడ మిణికి నట్టే! గుట్టు కాస్తా రట్టవుద్ది.'

'ఏంది! గుట్టేంది, అది కాంతీ రట్టవటమేంది? ఏందిరా నువ్వనేది నా కర్థం గాటల్లే చెప్పు!'

'పెద్దగా అరవమాక! నేనెవుర్నో ఈ డెవుడికీ తెలియదు'

'ఏంది?' రాంకోటి ఆశ్చర్యపోయాడు.

'తెలిత్తే ఇంకేవయినా వుంది! బాయిలో నీళ్ళుకూడా తోడుకో నియ్యరు, పలకరించే దిక్కు సంగతి ఎక్కడిదెట్టు'

'ఎట్టెట్టా? నువ్వెప్పుడూ తెలీనీకుండా ఎట్టా గడుసుద్దిరా రడ?'

'ఈ డింగోలే! నువ్ గానీయ్'

భోజనం పూర్తయింది ఆ సాయంకాలంనుంచి తలనొప్పి పట్టుకొంది ఎడాపెడా వాయించింది అర్థరాత్రినుంచి జ్వరం తగలింది. తెల్లవారే సరికి బాగా భారకంగావుంది.

'ఏం దిది' అన్నాడు రంగన్న ప్రొద్దున్నే.

'ఏందో లేరా అదే బోద్ది!'

రంగన్న తండ్రిని హాస్పిటల్‌కు తీసుకుపోయాడు. పెద్ద డాక్టరుకు చూపించాడు. ఇంజక్షన్లు ఇప్పించాడు. మాత్రలు

తెచ్చాడు: మందుతెచ్చాడు. మరునాటి రోజుకు జ్వరం లేదు. తలనొప్పి లేదు.

'రాంకోటే!' ఎదురుగావున్న రైతు పిలిచాడు.

'ఏం దొరా!'

'నే నేడు బళ్ళు తోలుకుపోతన్నా!'

'అట్టాగే దొరా!'

రైతు రెండెడ్ల బళ్ళ వైపుగా నడుస్తున్నాడు రాంకోటి లేచి వెంటనడిచాడు

'ఈ సాయిగా రా దొరా! లాయీ రప్పా గుచ్చుకోనేనూ!' బళ్ళ దగ్గరకు చేరుకొన్నారు.

'ఏడు బళ్ళ పూర్తాయినట్టేనా ఏమాయి?'

'ఆఁ!'

రాంకోటి, ఒక బండిచక్రంమీద కాలుపెట్టి ఒసిక్ర పుచ్చుకొని పైకి ఎక్కి జల్లలో చెయిపెట్టి చూచి దిగివచ్చాడు

బండికి కట్టిన ఎద్దులు నడవసాగాయి. 'చొచ్చొచొ నీ ఎద్దుగాల!' అన్నాడు జీతగాడు బండి ఆగింది

'ఏం దొరా! తొక్కి తొక్కి ఎక్కించినట్టుండారే ఎరువు!'

'ఏందో లేరా!'

'సొద్దెక్కుద్ది పొండి!'

బళ్ళు లాక్కుపోతున్నాయి ఎద్దులు!

అప్పుడే రెండు రెండెడ్లబళ్ళు వచ్చాయి. గిత్తలు మంచి పూపులో ఉన్నాయి. చెంగనాలు తీస్తూవచ్చాయి ఒకబండిమీద జీతగాడు మరో బండిమీద రైతు ఎవరిదగ్గరా చెర్నాకోలలేదు వంటిమీద చేయివేస్తే ఆగమేఘాలమీద ఎగిరిపోయేట్టున్నాయి గిత్తలు ఈగ వాలితే జారిపోయేంత నున్నగా వున్నాయి వాటి వీపులు, మూపులు వాళ్లదగ్గర కాగితం తీసుకొని బర్నీను జేబులో వేసుకొని, అవి మోసుకుపోగలిగినంత వేసుకుపొండి అనుకొని చుట్ట చుట్టుకొంటూ పాకదగ్గరకు వచ్చాడు ఇంకా చిన్నరాంకోటి ఉన్న లారీ రాలేదు

తాటాకు పాక మొగదల రాతిబండమీద కూర్చుని కాళ్ళు నేలమీద తాటిస్తూ చుట్ట ముట్టించుకొని పొగలు వదులుతూ వున్నాడు రాంకోటి. పెదిమెలు పొగ పీల్చటంతో లోపలికి పోతే ప్రక్కగా పైనున్న మీసాలు క్రిందచూపులు మాని నిక్క బొడుచుకొని, పొగవదిలేటప్పుడు యథాప్రకారం క్రిందికి చూపులు మరల్చుకొంటున్నాయి. కులిదీరా చుట్ట కాల్చుకుంటుంటే పాయసం గుర్తుకు వచ్చింది.

నిలవ నీడలేని మనిషి తాటాకు పాకవుంటే చాలను కొంటాడు. పాకవున్నవాడు పూరికొంపవుంటే బాగుంటుందను కొంటాడు. అది వుంటే మిద్దె, మిద్దెవుంటే మేడ, మేడవుంటే బంగాళా. ఇలా ఒక దానికంటే మరొకటి గొప్పగా వుండాలని మానవుడి ఆశ! ప్రయత్నం! ఈ ప్రయత్నంనుంచి జీవితానికి నిర్వచనం పడుతుంది. రాంకోటికి చుట్టలేకపోతే చుట్టకోసం ప్రయత్నం చేసేవాడు. చుట్ట వుంది గనుక పాయసం మీదికి మనసు మళ్ళింది

భార్య ఇంటిదగ్గర ఈ పాటికి పాయసంచేసే ప్రయత్నంలో ఉంటుందనుకోవటంతో అతని ఆనందం మీసాల మీదుగా ప్రాకిపోయింది పొగానే రాగాలి అనే కోర్కె ఎక్కడ పుట్టిందోకానీ కడుపులో ఆకలి పుట్టింది.

మునుపొకసారి ఆశతో పాయసం చేయించుకొని, అప్పు రావురు మంటూ ఎవరికీ ఏమీ మిగల్చకుండా అటిపెడు తా నొక్కడే జుర్రుకొన్నాడు. అయితే హాయిగానే వుందిగానీ ఆ తర్వాత అకీర్ణం చేసింది. రెండు రోజులు విపరీతంగా కడుపునొప్పి! ఉమ్మలు చుట్టుకు పోయాడు.

ప్రయివేటు డాక్టరు దగ్గరకుపోయాడు. హాలులో రోగులు కూర్చున్నారు. వరండాలో రోగులున్నారు. ఇంటిముందు రోగులున్నారు

అన్నంలేని రోగం, అన్నం అరగని రోగం! అంతకంటే రోగా లేమున్నాయి లోకంలో. ఏభై ఏళ్ళు నన్ను కాపాడితే, మిగతా ఏభై ఏళ్ళు నిన్ను కాపాడుతానందట అదేదో దేశంలో, కడుపు మనిషితో

రాంకోటి హాలులోకి పోలేదు వరండాలోకి పోలేదు కాంపౌండుగేటుకూడా ఎక్కలేదు. ఇవతల నిలబడివున్నాడు రోగులంతా వెలిపోయింతర్వాత డాక్టరు తనను పరీక్షిస్తాడని ఆశించాడు. అనుకొన్నట్లుగా రోగులంతా వెళిపోయారు. డాక్టరు రాంకోటిని చూశాడు గుర్తించాడు లోపలికి రమ్మనలేదు తాను వెలుపలికి రాలేదు కాంపౌండరును పంపించాడు. అతనే రాంకోటి పాలిటి డాక్టరు! అయితేనేం రెండోరోజుకు కడుపునొప్పి తగ్గిపోయింది.

ఒక వారంరోజులు తర్వాత, ఆ డాక్టరు రోగిగా పెద్దాసుపత్రిలో చేరాడు చిన్నపేగు మెలిపడటంతో ఆపరేషన్ ఏదో అవసరమయిందని కాంపౌండర్లు చెప్పుకొంటున్నారు. డాక్టర్లు ముగ్గురు నలుగురు చుట్టూ మూగారు నలుగురు ముగ్గురు నర్సులు ప్రక్కనున్నారు.

రోజు సాయంకాలం నగరం నడిబొడ్డునమీద మెడపైకెత్తి నిలబడ్డ కళామందిరంలో కవులు కవిత్వం చదువుతున్నారు. రాగతాళమయంగా నవరసభరితంగా చదువుతున్నారు, పాటకజనుల బాధంగూర్చి-

'ప్రపంచం అంతా భవ్యంగా వుంది స్వర్గంలో దేవుడున్నాడు!'

ఒక కవి చదివిన ఆ అర్థం వచ్చే పద్యానికి పోటీగా సంగీతాత్మకంగా మరోకవి మునుంపెట్టాడు

'ప్రపంచం అంతా సవ్యంగా లేదు స్వర్గంలో దేవుడు లేడు.'

లౌడస్పీకర్లోంచి వినబడుతున్న కవిత్వం రోడ్డుమీద, చెట్టుక్రింద నిలబడి వింటున్న ఒక వ్యక్తి (కవి అనువుంగాడు. అక్కడికి—కవిత్వం చదివేందుకు—అవకాశంవచ్చి వుండదు) అంటూ పోతున్నాడు ప్రక్క వ్యక్తితో.

'అన్నీ ఎంగిలి కూతలు! ఎంగిలి తిళ్ళు! వాంతులూ బేదులూ! అంతా అజీర్ణరోగం! లోకంనిండా అజీర్ణం! రోగం రొచ్చురొండి! కవిత్వం నిండా గబ్బు! కళామందిరంలో కంపు! ఛీఛీ దుర్గంధం'

లారీవచ్చి ఆగింది. గుంటదగ్గరకు వచ్చింది. గుంట దాదాపు నిండిపోయింది. ఇంకొక్క లారీ మాత్రమే రావాలి! అందులో చిన్న రాంకోటి వస్తాడు.

రాంకోటి లేచాడు ఉంగిటాలు తెగిపోయిన చెప్పులు కాళ్ళకు వేసుకోబోతూ చూశాడు రెండూ పాదాల క్రింద అరిగిపోయాయి. అప్పటికే అవి అతుకులు పడ్డాయి. జివజివలాడుతున్నాయి. కాళ్ళకు తొడుక్కొని లారీ దగ్గరకు పోయాడు.

'నా కొడు కెగిరిపోయేవోడే!' లారీ డ్రైవర్ చెప్పాడు.

'ఎప్పుడూ?' రాంకోటి అడిగాడు.

'ఎపుడో కుర్రసన్నాసి! చేతు లొదిలేసి సైకిల్ తొక్కు తున్నాడు గందా! ఆడొత్తన్నాడని నేనేమన్నా జూసేనా, పెట్టేనా మలుపుదిరిగేసరికి కంటబడ్డాడు లారీ సడన్ బ్రేక్ ఏసేసరికి సైకిల్ పప్పుపప్పు అయ్యిందీ అ డెగిరి మురుక్కాలవలో పడ్డాడు వాయాలు! ఎమికలన్నీ సరిగ్గా వుండయ్‌లే!'

'ఆ ర్పాసం!'

'అందుకే గందా ఆలస్యెమయ్యింది ఏం పర్లేదులే! అడు బాగుండాడు బురద గొట్టుకొని పందిపిల్లల్లే!'

'పోన్లే!'

లారీ వెళిపోయింది.

చింతయ్యి గూడా అంతే! చేతులు వదిలి సైకిల్ తొక్కుతాడు. వర్ధిదుడుకుపిండం. ఏ క్షణాన ఏం తెచ్చుకొంటాడోనని రాంకోటికి ఎప్పుడు రెండోవాడంటే చెప్పలేని భయం.

చింతయ్య బొత్తిగా లెక్కా జమాలేని మనిషి తూలుతూ ప్రేలుతూవుండే బాపతు ఏనాటికయినా డిప్టీకలెక్టర్ అయితీరుతా నంటాడు. తను వ్రాసిన కాగితాలమీదతప్ప కలెక్టరు కళ్లు మూసుకొని సంతకం పెట్టడట. రాంకోటి చింతయ్య దగ్గరకు పోయినప్పుడు ఏమేమో చెప్పాడు. ఏ జీవో అయినా గడగడా, ఎండాకాలం చల్లని మంచినీళ్లు తాగినట్లు చెప్పేయగలడట. మరదేమన్నా గొప్ప ఏమిటో! చింతయ్య పేట్రోకి చొక్కా దిగేసుకొని చెప్పులేసుకొని రోడ్డుమీద వెళుతుంటే చూడాలి. అచ్చంగా దొరబిడ్డ వుండట్లుంటాడంటే నమ్మితీరాల్సిందే! తండ్రి ఆలోచనలు ఎప్పుడూ కొడుకుల్నిగూర్చి గొప్పగానే వుంటాయి.

చింతయ్యకు పిల్లాజెల్లాలేదు చీకూ చింతాలేని మనిషి! పెళ్ళాం తల్లో నాలుక! చెప్పినట్లు వింటుంది. చేయమన్నట్లు చేస్తుంది. ఇద్దరూ సాయంత్రం షికారుకంటూ బైలుదేరుతారు. జీతంకంటే పైరాబడి ఎక్కువగా వుంటుందట. ఆమె కవీ ఇవీ కొనిపెడుతుంటాడు. వాళ్ళిద్దరినీ చూస్తుంటే రాంకోటికి చాలా ముచ్చట కలిగింది.

రెండో రోజు ఉదయం ఎవరో ఆడమనిషివచ్చి నీళ్ళు తోడి కుండలనిండా పోసింది. వంటగదిలోకివచ్చి పాత్రలు తీసుకుపోయి కచికతో తోమి, శుభ్రంగా కడిగి యింట్లోకి తెచ్చింది. అన్నం పెట్టించుకొని వెనుక తట్టు వరండాలో కూర్చుని తిని లేచి వెళిపోయింది.

రాంకోటి ఉదయం ఆమెను చూశాడు పాకీపనిచేసే మనిషి! ఆమె యింట్లోకి రావటంగూర్చి అర్థం కాలేదు. మూడు గదులు! ముప్పయి రూపాయిలు అద్దె! ఇంట్లో రెండు మంచాలు పరుపులు! కూర్చునేందుకు కుర్చీలు! చింతయ్య పని మంచి వాటంగా వుంది

ఆ రోజు సాయంకాలం చింతయ్య తండ్రినీ, భార్యనీ సినీమాకు తీసుకుపోయాడు. ముగ్గురూ కుర్చీల్లో కూర్చున్నారు. రాంకోటికి సినీమా చాల వింతగా వుంది. అంతకంటే వింతగా తన కడుపున పుట్టిన కొడుకున్నాడు. కుర్చీలో కూర్చుంటే హంస తూలికా తల్పంమీద శయనించినంత ఆనందం కలిగింది. ఏది అనుభవించటానికి అయినా ఆ రాత వుండా లనుకొన్నాడు. రాత్రి యింటికి తిరిగి వచ్చేటప్పుడు అడిగాడు.

'ఏందిరా, పొద్దుని ఆ మనిషి ఇంటోకి వొచ్చి కుండలూ నట్టులూ లొడపెడతావుందీ?'

చింతయ్యకు ఆ మనిషి గుర్తుకొచ్చింది.

'ఏం ఏం తప్పుందీ?'

'అది గాదురా! అదేం బాగుంటదీ ఎవరన్నా నిన్నేమన్నా అనుకొంటే ఎట్టా?'

'అంటే ఏందీ నువ్వనేది?'

'ఆ మనిషి నీ యింటో దిరుగుతుంటే—ఏందీ—ఎవరన్నా ఈడు పలానోడు గొవోలు అనుకుంటే ఎట్టాగా అంట?'

'అందరికి తెలుసులే!'

'ఏందీ?'

'అవును—నాకేందే భయం!'

'ఆళ్లంతా నిన్ను సులకనగా జూత్తే!'

'అసలు ఎవడ్డీళ్లందర్నీ లెక్కజేసేది? ఎదవనాయాళ్ళు. ఒకడెవడో ఏందో అనుకొంటాడని పుటక దాచుకోటానికి నేనేమన్నా అడ్డదిడ్డంగా పుట్టినోణ్ణా ఏంటి—అట్టా వ్యవహారాలు నేనుగాదు ఉడకనిచ్చేది.'

చింతయ్య తెలియకుండా పెద్దకొడుకును తిడుతున్నట్లు అనిపించింది రాంకోటికి. వారం రోజులుండి భార్యమీద గాలి మళ్లి బైలుదేరాడు ఈ పక్షం రోజుల్లో ఇద్దరు కొడుకుల్ని బాగా అర్థం చేసుకొన్నాడు రాంకోటి. ఇద్దరిమీదా ప్రేమ వుంది ఇద్దరి మీదా కోపం వుంది. ఇద్దరి కుటుంబాలు నచ్చాయి. ఏదో ఒక కారణంవల్ల ఇద్దరిమీదా బాధ కలిగింది.

ఊరెళదామని బైలుదేరేరోజే ఉదయం కడుపులో నొప్పిగా వుంది. అయినా లెక్కచేయకుండా, పప్పులు కావాలన్న పిల్లవాడికి పప్పులు పెట్టిందాకా మారాం చేసినట్లు, వెళ్ళాలంటే వెళ్ళాలని

పట్టుబట్టుక్కూర్చుంటే ఏమీ చేయలేక చింతయ్య తండ్రిని రైలెక్కించాడు

రైలు బైలుదేరేటప్పుడు ఆ పెట్టెలో జనం లేదు ఒక మూల దుప్పటి పరిచి పడుకొన్నాడు రాంకోటి నాలుగు స్టేషన్లు దాటీ దాటకముందే రైలునిండా మనుష్యులైపోయారు. వీళ్ళంతా ఎక్కడికి పోతారో, ఇంతతొందరేమిటో అర్థం కాలేదు అర్థ రాత్రికి కడుపునొప్పి చాలా ఎక్కువయి పోయింది

చాలాసార్లు లేవెట్రీలోకి పోయి వచ్చాడు. శక్తి సన్నగిలి పోజొచ్చింది. విరేచనాలు అధికంగా అవుతున్నాయి. ఉన్నట్టుండి వాంతులు ప్రారంభమయ్యాయి తెల్లవారింతర్వాత పది గంటలు అయితేగానీ తన వూరు చేరుకోలేడు ఓపిక సన్నగిలిపోయింది. డీలా పడిపోయాడు

మనిషికి అపరిమిత ఆనందం కలిగితే, ఆ ఛాయలో భయం తొంగిచూచే అవకాశం వుంది అంతా దుఃఖం అయితే మనిషి మొండికెత్తి కూర్చుంటాడు. కాదంటే క్రుంగిపోతాడు ఆ క్షణంలో రాంకోటి క్రుంగిపోయాడు పక్షంరోజులు కొడుకులిద్దరి దగ్గర తను గడిపిన జీవితం ఆనందమయిందే! భార్యను చూడాలని ఆ క్షణంలో ఒక కోరిక ఆకస్మికంగా కలిగింది వెంటనే భయం ఆవరించింది.

ఊరు చేరుకోకుండానే మధ్యలో తను చనిపోతే? ఆ అభిప్రాయం కలిగేసరికి రాంకోటి సంచలించి పోయాడు ఊరు చేరిందాకా బ్రతికివుంటే ఆ పైన చనిపోవాలని తేల్చుకొన్నాడు. కాని వూరు చేరటమే సాధ్యమయ్యేలా లేదు కూర్చోలేక పోతున్నాడు పడుకొంటే బాగుండేది అయినా పడుకోనిచ్చే దెవరు? అందరూ కూర్చోవాలి! కూర్చునే హక్కు అందరికీ వుంది.

కడుపులో గుడబెడలాడుతుంటే లేవెట్రీకి వెళ్ళి, తిరిగి వచ్చేటప్పుడు అక్కడ రద్దీరద్దీగా కూర్చున్న అందరినీ దాటుకొంటూ ఆ మూలకుపోయి కూర్చోవటం కష్టమనిపించి, వాకిలి దగ్గరగా క్రింద కూర్చున్నాడు

ఎవరూ అతన్ని పట్టించుకోలేదు. చాలామంది అతని అవస్థ చూశారు. కొందరు కూర్చునే కునికిపాట్లు పడుతున్నారు. తీరా తలెత్తి చూస్తే మునుపు తను పడుకొన్న బల్లంతా మనుష్యులతో నిండిపోయింది అంతేకాదు కూర్చున్న కాళీ కాస్తా నిండిపోయింది. రాంకోటీ ఏమీ పట్టించుకోలేదు

తెల్లవారుజాము అయింది రైలు వేగంగానే వెళుతూ వుంది అయినా ఆలస్యంగా వెళుతున్నట్లనిపించింది. ఉన్నట్టుండి వాంతి అయింది నీళ్ళవాంతి! కడుపులో ఏమీలేదు బిక్కచచ్చిపోయాడు రాంకోటి ఏడుపు వస్తూవుంది ఎవరూ పలకరించటంలేదు దూరంగా తొలగిపోతున్నారు. మనిషి పెట్టెలోకి ఎక్కటానికి కాళీలేదని చెప్పగలవాళ్ళు నలుగురుకు తగినంత జాగా అతని కొక్కడికి వదిలిపెట్టారు.

ఆ పెట్టెలో లేవెట్రీ లేకపోతే ఎలా వుండేది? ప్రతి పెట్టెకొక లేవెట్రీ! లోకంనిండా జనం. జనం చుట్టూ అవసరాలు! ఇంటింటికీ వంటగది! దానికి దూరంగా మరో గది. దానికీ దీనికీ అంతస్వాతంత్ర్యం మనిషి! ప్రతి మనిషికి హక్కులున్నాయి. హక్కులు లెక్కాపత్రం లేకుండా వాడుకొంటున్నాడు మనిషి! హక్కులు అనుభవించి, బాధ్యతలు గమనించలేని మనుష్యులకు కూలీ రాంకోటి కూలీవాడి బాగోగులు ఎవడికి పట్టాయి? అతని కష్టం చూచేదెవరు, జాలి తలచేదెవరు?

అతని తీరు చూస్తుంటే కలరా రోగి అనిపించింది అందరికి. జీవితం అంతా శృంగారమయం అనుకొనే వయస్సులో ఉన్న యువకుడు జీవితం నగ్నత భరింపలేకపోయాడు

భార్యా ముగ్గురు పిల్లలతో రైలెక్కిన యువకు డింకొకడు తన బాధ్యతలు మరిచి పోకూడదనుకొంటున్నాడు. అతని వైపు ఆ యిద్దరూ చూడలేదు. మూలన కూర్చుని కనుపించని ప్రకృతి రామణీయకం తిలకిస్తున్న యువతి ముక్కు మూసుకోవటం ముఖం చిట్లించటం గమనించిన యువకుడు ఆమెకీ రోగి ఇక్కడుండటం ఇష్టంలేదనే తేల్చుకొన్నాడు.

ఆ యువకు లిద్దరూ రైలు ఆగిందాకా రాంకోటిని ఓర్చుకో దల్చుకొన్నారు ఎక్కువమంది నిద్రలో ఉన్నారు ఆరుగురేడుగురు కళ్ళు నలుంకొంటున్నారు. ఇద్దరు యువకులు నిద్రమాట అవతల వుంచారు వాళ్ళొకళ్ళతో ఇంకొకళ్ళు ఏమీ మాట్లాడుకోలేదు గానీ, రైలు ఆగగానే ఇద్దరూ రాంకోటి దగ్గరకు వచ్చారు

'దిగు!' అన్నారిద్దరూ. ఒకరి ముఖంలోకి మరొకరు చూశారు భావసామీప్యంవల్ల.

'ఏంది?'

'దిగు దిగు!'

'ఏం దిదీ నా దీవూరు గాదే!' రాంకోటి విచిత్రంగా చూశాడు దిగే ఓపిక లేదనిపించింది.

'దిగు దిగు!'

'నాకు టిక్కెట్టుంది!'

'సర్సర్లే! దిగు దిగు!

రాంకోటిని చేతో చేయిపట్టుకొని ఇద్దరు యువకులు దించి ప్లాటుఫారంమీద ఉన్న బెంచీ బల్లమీద పడుకోబెట్టారు. రైలెక్కారు పెట్టెలో పడుకొన్న భార్యనీ పిల్లల్నీ చూచుకొని తృప్తిపడ్డాడొక యువకుడు మూలనకూర్చున్న యువతి ముఖంలో నవ్వుకోసం — ఎడారిలో పువ్వుకోసంలాగా — వెతికి కనిపించక మూతి ముడుచుకొని ఎటోచూస్తూ నిలబడ్డాడింకొక యువకుడు.

కపెర కపెర తెల్లవారింది. ఆ స్టేషన్ చాలా చిన్నది. ఆ సమయంలో వచ్చేరైలు పోయేరైలు ఏమీ లేవు మనుష్యులే లేరు. స్టేషన్‌లో ఉన్న లేవెట్రీలోంచి చీపురుకట్టె, ఫినాయిల్‌డబ్బాతో తిరిగివస్తున్న పాకీవాడు రాంకోటిని చూశాడు ఎక్కడో నూతిలోంచి మాట్లాడినట్టున్న అతని గొంతు విన్నాడు ఇంటికి ఎత్తుకుపోయాడు రాంకోటిని.

రోడ్డుమూలమీద మలుపు తిరుగుతూ లారీ కనిపించింది. హారన్ వినిపించింది రాంకోటి లేచి చూశాడు లారీ వస్తూ వుంది. అందులో చిన్నరాంకోటి వస్తాడు ఇంటిదగ్గర వాళ్లమ్మతో పాయసం చేయమని చెప్పివుంటాడు ఈ పాటికి తయారవుతూ వుంటుంది సూర్యుడు నడినెత్తిమీదికి వచ్చాడు. రైతు లింకా ఎరువు జిల్లల్లో పోసుకొంటున్నారు.

అటు చూస్తుంటే ఒక రెండెడ్లబండి వెళుతూవుంది. రాంకోటికి ఎందుకో అనుమానం వచ్చింది 'ఇదుగో! ఎవురదీ! ఆపో! ఆపో బండిని! ఇదుగో నిన్నే' కేకలు పెట్టాడు కేక అందేంతదూరంలోనే ఉన్నారు రైతులు బండి ఆగలేదు రైతులూ జీతగాళ్లూ రాంకోటివైపు చూశారు

'చెప్పేది నీగ్గాదూ! ఆపమంటే ఏందావు! ఆపో! ఆపో!' రాంకోటి అదరాబాదరా కాళ్లకు చెప్పులేసుకొన్నాడు. పడుయా లేస్తున్నట్లు ముందుకు సాగాడు గుంటమీదగా దగ్గర, గబగబా వెళుతున్నాడు గుంటప్రక్క ఎత్తుగాపోసిన ఎర్రకండ మట్టిమీదికి ఎక్కాడు కుప్ప కవుకిదుస్తూవుంది. రాంకోటికి క్రిందికి చూడటంలేదు, 'ఆపో! ఆపో!' అంటూ ఎడ్లబండివైపు చూస్తున్నాడు

రాంకోటి మట్టికుప్పమీద మలుపు తిరిగాడు పెద్దమట్టి పెళ్లకొడదానికి చెప్పు కొట్టుకుంది. అప్పుడు 'ఆపో!!' అంటు న్నాడు రాంకోటి ఉంగటం తెగిన చెప్పు ఎదురు దెబ్బతో క్రిందికి వంగిపోయింది మధ్య అరిగి కన్నం పడ్డబోటుకు మడతపడింది 'ఆపో!' అంటున్నాడు రాంకోటి కాలుతీసి కాలు వేయబోయేసరికి మట్టిపెళ్ల తావు దప్పింది దొర్లింది కాలు నిలవలేదు పట్టు చిక్కలేదు మట్టికుప్పమీంచి జారిపోయాడు. నీళ్లనిటుగా పూర్తిగా నిండిపోయిన గుంటలో పడ్డాడు పడుతున్నప్పుడు ప్రమాదం తెలిసివచ్చింది 'ఆపో!' అనలేదు. 'దొరా!' అన్నాడు. 'గొరా! పెద్దగా అరిచాడు బోర్లా పడ్డాడు

ఎదురొమ్ము ఆనింది మోకాళ్లు ఆనాయి కాళ్లు గట్టునే ఉన్నాయి గట్టును పన్నిపట్టి పైకి లేవాలని చూస్తే మరింత లోపలికి పోయాడుగానీ గట్టెక్కలేకపోయాడు చేతులతో అదిమి పట్టి పైకి లేద్దామని ప్రయత్నించినకొద్దీ చేతులు లోపలకు పోతున్నాయిగానీ పీలుచిక్కటంలేదు ముఖం ఆనలేదు. మెడ పైకెత్తి వుంచాడు బలంగా గింజుకొన్నా ఫలితం లేకపోయింది. 'దొరా! దొరా!! దొరా!!!' ముమ్మారు కేక పెట్టాడు. అది ఏ దొరకూ ప్రత్యేకంగా పిలుపుకాదు. ఎవరయినా వింటే వచ్చి పైకి తీస్తారనే ఆశ!

ఎరువు జిల్లల్లో పోసుకొంటున్న రైతులూ, జీతగాళ్లూ రాంకోటి పడిపోవటం చూశారు. ఆ ఎడ్ల బండి వెళిపోయింది. పిలుపు విన్నారు పరుగుపరుగున వచ్చారు. కొట్టుకులాడుతున్న రాంకోటిని చూశారు. అందరివైపు చూశాడు రాంకోటి. నోటి వెంట మాటలేదు. నోరు వాలిపోయింది. ముక్కు మునుగుతూ వుంది. కళ్లమాత్రం అర్థంలేని నీడలు చూడగలుగుతున్నాయి.

'లాగండ్రా బైటికి!'

'కాళ్లు పట్టుగ్గుంజండ్రా!'

'లాడేసి లాగండెహె!'

మాటలు వింటున్నాయి రాంకోటి చెవులు. కనురెప్పలు అనుతున్నాయి. శరీరం పైభాగంలో తాడువేసిన స్పర్శకూడా లేదు.

రాంకోటికి ఏవో అర్థం కాసాగింది. వాళ్లు తనను పైకి తీయలేవేమోనని భయం కలిగింది. ఆ భయంలోనుంచి ఆశపుట్టింది.

లారి వచ్చేస్తే . ...

రాంకోటి ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నాడు. నోరు మునిగింది ముక్కు మునిగింది కళ్లు మునిగాయి నుదురు మునిగింది.

చెవులకుమాత్రం ఏవేవో శబ్దాలు వినబడుతూనేవున్నాయి. అక్కరలేని శబ్దాలు! అర్థంలేని మాటలు! అనవసరం ప్రసంగాలు! అవి విన్నా విన్నట్లు కాదు.

లారీ హారన్ వినిపించింది. రాంకోటి గుండె వేగంగా కొట్టుకొంటూవుంది గుండెపైన రాయిపెట్టినంత బరువు! ముక్కుదిబ్బిళ్లు పగుతూవుంది

గుంటదగ్గర లారీ ఆగింది. 'ఏమయ్యిందేమయ్యింది' శబ్దం వినిపించింది రాంకోటి చిన్నరాంకోటి గొంతు విన్నాడు ఎవరో లారీపైంచి దూకిన చప్పుడు 'నాన్నా!' గుంట దద్దరిల్లేట్టు కేక! 'నాన్నా!' శబ్దం చెవిదగ్గరగా వినిపించింది.

రాంకోటి హృదయంలో ఆశ పుష్పయింది కళ్లఎదుట కనుపించని కాంతి కనులతూవుంది శరీరం ఎక్కడికో కూరుకు పోతున్నట్లుంది ఆకాశం అందం కళ్లముందు నిలిచినట్లుయింది. గుండె చప్పుడు పెరిగింది. రాంకోటి శరీరం అంతా మొద్దుబారి పోయిన స్పర్శ!

కృషిక కవిత్వము

శ్రీ రామమోహనరాయ్

"భారతదేశము వ్యవసాయిక దేశము భారతజాతికి రైతు వెన్నెముక – రైతు కృషిచేసి ఫలసాయాన్ని అందించక పోతే జాతికి మనుగడలేదు జాతికి ప్రాణాధారమైన రైతును ప్రజలంతా కాపాడాలి కృతజ్ఞులై అతనికి తోడ్పడి, ఉత్తేజపరచి సమాజజీవనాన్ని శోభింపజేయాలి" ఇటువంటి మాటలు చాలకాలంగా వింటున్నాము. ఈ ఉపన్యాసాలు చేసే వారిలో అవకాశవాదులూ ఉన్నారు అభ్యుదయాన్ని అభిలషించే వారూ ఉన్నారు. భారతదేశములో ప్రాచీనకాలములో లలితకళలు కళకళకోసమే నన్నవాదాన్ని సమర్థిస్తున్నట్టుగా కనిపించవు. ఆనాటికళలు ప్రధానముగా జగద్ధితముకోసమూ, ధర్మంకోసమూ, భక్తిప్రపత్తుల కంకితంగానూ, ప్రజలకు మోదాన్ని ఆవేశాన్ని కలుగజేసేటందుకూ ఉద్దేశింపబడ్డాయి ఇవి ఆదిలో దైవసమ్మతాలూ, ధర్మసమ్మతాలూ లోకశ్రేయోదాయకాలున్నూ కాని తర్వాత తర్వాత ప్రభుసమ్మితాలుగా మారి, కళల లక్ష్యం పెడత్రోవ పట్టిందనడంకంటె, మార్గాంతరం అనుసరించిందనటం సరియనుకుంటాను ప్రభుభక్తి శక్తిసమ్మితాలైన కళలు కూడ రాజసభాగౌరవాన్ని సంతరించుకున్నాయి సత్సభాంతర సరసీజనాలు తలలూచి మెచ్చుకున్నవే ఉత్తమకళలుగా గణుతికెక్కాయి కళాకారుడికి 'ఇన్స్పిరేషన్' దైవమూ, ధర్మమూ అయితే ఆలంబనం మాత్రం ప్రభువే ఇందు కపవాదాలుగా పోతన, ధూర్జటివంటి కవులు లేకపోలేదు.

తెలుగు కవులలో ప్రజామోదాన్ని దృష్టిలో నుంచుకొని కవిత్వం వ్రాస్తున్నట్లుగా చెప్పుకొన్న మొదటికవి తిక్కన. ఆయన 'దేవబ్రాహ్మణ ప్రీత్యర్థం' కావ్యరచన చేయలేదు. మనుమసిద్ధిని మాత్రమే సంతోషింప జేయటానికీ వ్రాయలేదు 'ఆంధ్రావళి మోదముం బొరయగ' వ్రాస్తున్నట్లు కంఠోక్తిగా చెప్పుకున్నాడు అయినప్పటికీ ఆయన వ్రాసిన మహాభారతము, నిర్వచనోత్తర రామాయణము అనువాదాలు కావటంతో జనజీవితాన్ని ప్రతిబింబించటానికి కావ్యాలలోని పరిస్థితులు అనుకూలించలేదు ఇట్లే చాలమంది ప్రాచీనకవులు సమాజ జీవనాన్ని పూర్తిగా విస్మరించి ఊహామాత్రమైన కావ్యలోకంలో తిష్ఠవేసికొని కూర్చొనటం సాధ్యంకానిపని అందువలనే పూర్వ కావ్యాలలోనూ అక్కడక్కడ సమాజ పరిస్థితులు తొంగి చూస్తూనే ఉండేవి నన్నెచోడుడు, పార్వతీపరిణయాన్ని వర్ణించేటప్పుడు తననాటి ఆచార వ్యవహారాలను కుమారసంభవంలోకి ఎక్కించివేశాడు. పెద్దనామాత్యుడు చంద్రోపాలంభనలో తురకల దైవముగా చంద్రుణ్ణి ఉపాలంభించాడు.

'Poetry is the criticism of life' అనే ఆర్నాల్డు పండితుని సూక్తి ననుసరించి జీవిత విమర్శచేసేది, జీవితాన్ని దర్శింపజేసేది ఉత్తమ కవిత్వంగా భావించవచ్చు క్షేమేంద్రుని వంటి ఆలంకారికులు కూడా ఉత్తమ కవిత్వానికి లోకపరిశీలనం అత్యంతంగా ఉండాలన్నారు. ఉండాలనటమే కాదు, ఆయన తన కావ్యాలలో వివిధవృత్తులవారిని, ఉద్యోగులను, సచ్ఛీలురనూ, దుశ్శీలురనూ మోసకారులనూ కావ్యశిల్ప నైపుణ్యంతో వ్యంగ్య వైభవంతో స్మరించారు. కాళిదాస మహాకవి ఋతుసంహారంలోనే కాక తన కావ్యనాటకాలన్నింటా అవకాశం ఉన్నప్పుడల్లా మహాకవి సాధ్యమైన ప్రతిభతోనే సమాజాన్ని నిర్మలమైన కాసారంలో ప్రతిఫలించే వనంవలె ప్రతిబింబింపజేశారు. పోతే పూర్వ మహాకవులకు సమకాలిక సమస్యలను కావ్యవస్తువులుగా స్వీకరించటంలో ఒక గొప్ప చిక్కు ఎదురయ్యేది ఉదాత్తమైన శీలంగల వ్యక్తుల చరిత్రలనే ఆదర్శప్రాయంగా గైకొని కావ్యాలల్లటం పరిపాటి; సంప్రదాయం; ఆ సంప్రదాయాన్ని ఛేదించటానికి ఎవరూ ప్రయత్నించేవారుకారు! మనుష్యులలోని రాగద్వేషాలను కళాత్మకంగా చిత్రించి, వాళ్ల మంచిచెడ్డలను నిర్ణయించుకొనే అవకాశం పాఠకునికి, కావ్యాలనుండి జీవితసత్యాలను తనంతట తను గ్రహించగలిగే వేర్పునూ యిచ్చేవారుకారు కావ్యరచన కెన్నో సంప్రదాయాలున్నాయి మంగళంతో ఆరంభమై, మంగళంతోనే నిర్వహణ, మంగళంతోనే ముగింపు చేయవలసి వచ్చేది కావ్యప్రారంభానికి పురవర్ణనాది అష్టాదశ, లేక మరెన్నో వర్ణనలు శిష్టరక్షణ జరిగాక నాయకుడు లోకశ్రేయానికి కంకణం కట్టుకోవటమూ జరిగేది కవి ఫలశ్రుతికూడ పలుకుతాడు. పూర్వ కావ్యాల చదువరి తప్పక సహృదయుడు కావాలని లాక్షణికులు, కవులు నిర్ణయించారు. 'యేషాం కావ్యానుశీలన వశాత్, విశదీభూతే మనోముకురే, తన్మయీభావన యోగ్యతా తే హృదయ సంవాదభాజః సహృదయాః' అని అతడి అర్హతలకు కూడ ప్రమాణం నిర్ణయించారు. మరి జనానికి,

కవికీ మధ్య సాన్నిహిత్యం ఏవిధంగా ఉంటుంది, నూటికి తొంబైమంది నిరక్షరాస్యులున్న ప్రాచీన భారతదేశములో? అప్పటికీ ప్రాచీన కవులు కొందరు దేశ స్వరూపాన్ని, ప్రకృతి సౌందర్యాన్ని కావ్య మధ్యంలో ప్రసక్తానుప్రసక్తంగా, జన జీవిత వైవిధ్యాన్ని గుణగణాల సమ్మిశ్రిత మానవ స్వభావాన్ని వర్ణించారు. కాని అట్టికవులు లాక్షణికుల దృష్టిలో గౌరవం పొందటం మాటటుంచి, సానుభూతి నైనా నోచుకోలేక పోయేవారు.

క్రీడాభిరామము, భోజరాజీయము, సింహాసనద్వాత్రింశిక, వంటి కావ్యాలు వ్రాసిన కవులు శబ్దరత్నాకరకారుని వంటి నిఘంటుకారుని దృష్టిలో అవమానం పొంది, అధమ తరగతి కవుల జాబితాలో చేరిపోయారు. ఈవిధంగా కవిత్వంలో గుణాన్ని నిర్ణయించటం అక్రమమని తార్కికంగా, ఆయా కావ్యాలలోని అందచందాలను వెలికితీస్తూ తన జీవితకాలమంతా పరిశ్రమించి 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర' వ్రాశారు కీ. శే సురవరము ప్రతాపరెడ్డిగారు.

నవరస భరితమైన కావ్యాలలో ఆయారసాలను వర్ణించవలసిన సందర్భాలలో ప్రభువునూ, అతడి వ్యామోహించుకొన్న రాణులూ, అంతఃపుర కాంతలూ, వేశ్యలూ, అతడి పరివారమూ తప్ప అన్యవస్తు సముదాయాన్ని వాళ్ళు స్వీకరించేవారు కాదు అలంకార శాస్త్రాలలోని లక్ష్యాలన్నీ ప్రభువూ, పరివారమే! ప్రభువులను రంజింపజేసే శృంగారం వొక్కటే రసమైనట్లు వర్ణించేవారు. ప్రతాపరుద్రీయము; నరస భూపాలీయము వంటి గ్రంథాలు ఈ కోవలోనివే

సమకాలిక జీవితాన్ని ప్రతిబింబించేవి గ్రంథాలకు గ్రంథాలే లేకపోయినా కావ్యాలలో అక్కడక్కడా ప్రసక్తాలయ్యేవి సంస్కృత కావ్యాలలో కాళిదాస మహాకవి కావ్యాలూ, భారవి కిరాతార్జునీయము, క్షేమేంద్రుని కావ్యాలూ ఈ విషయాని కుదాహరణలుగా పేర్కొన దగినవి. ప్రాకృతంలో హాలుడిచే సంకలితమైన 'గాథాసప్తశతి' జనజీవితాన్ని, ప్రకృతిని, మానవ స్వభావాన్ని, యువతీయువకుల శృంగార ప్రవృత్తిన్ని ప్రతిబింబించిన ఉద్గ్రంథం. ప్రాచీన కావ్యాలలో మందులోనికి మాత్రమే కనిపించే సాంఘిక జీవనం గాథాసప్తశతిలో రమణీయంగా వర్ణింపబడినందున కొన్ని అందాలను చూద్దాము

ఊరి చెరువునకు దగ్గరలో ఒకచోట నాయికా నాయకులకు సంకేతము నియతమయినది కాని ప్రియుడు రావేలేదు తెల్లవారుఝామున యేర్పరచుకొన్న కారణంచేత, తెల్లవారి పోయిన పిదపగా వాండ్లొరులు యెదుట బడుట ఒరుగలేదు అప్రదును నాయిక నాయకునితో మాటాడరాదు కాని యుక్తి పరురాలైన నాయిక తన అత్తగారితో తెల్లవారుఝామున తాను చెరువు దగ్గర చూచిన వింతలను చెప్పుచున్నట్లుగా ఉపక్రమించి.

'తంలొదిగి తమ్మిపూవులు ఎరిగిపోవు
బొడి రాయంచ జంటలు నెగిరిపోవు
వేకువన నెవ్వడో యుంచె నూరి చెఱువు
నందు నత్తానితమ్ముగ నాకసమును.

[శ్రీ గట్టి లక్ష్మీనరసింహ శాస్త్రిగారి అనువాదము]

ఒకానొక జవరాలిని, ఆమె యింటిముందు సవిలాసముగా అటు నిటు తిరుగుచున్న హాలిక పుత్రుని చూపి, ఒక నాగరకుడు సహచరునితో—

చెవి నిడుకొని వేరేడాకు చివచివ నటు
నిటుఁ దిరుగు కర్షకాత్మజు నింటి యెదుర
సరసి యరకన్నులం జూచు శ్యామ వదన
శోభ, శ్యామమై కొమరారు చున్నదదిగొ?

[శ్రీ గట్టి లక్ష్మీనరసింహశాస్త్రిగారి అనువాదమే]

గాథలలోని జానపద వర్ణనములు అమోఘములు, అసమానములు, అనుపమరసనిర్భరములు

ఆంగ్ల వాఙ్మయంలో కూడ గ్రామిక జీవనం కావ్య వస్తువుగా స్వీకరింపటానికి కొంతకాలం పట్టింది. కాని సాహిత్యాభిమానుల రుచి కనుగుణంగనే ఆంగ్ల వాఙ్మయ యుగకర్తలలో నొకరైన 'స్పెన్సర్' వంటి కవులు గ్రామిక జీవనాన్ని కావ్య వస్తువుగా స్వీకరించారు. 'స్పెన్సర్' మహాకవి నాటికి ఆంగ్ల వాఙ్మయం బహుళోక్తిమయంగా వైవిధ్యంతో విలసిల్లలేదు. Pastorals అను పేర నొక విధమైన కావ్య రచనా రీతి ఆంగ్ల వాఙ్మయపు ఇంద్రధనుస్సులో అహ్లాదకరంగా విలసిల్లింది 'Sheppards Calender' లో గొర్రెల కాపరి జీవిత ఋతువులను రమణీయంగా గానంచేసి స్పెన్సర్ మహాకవి శిఖరంగా నిలిచి తర్వాత కవులకు మార్గదర్శకులయ్యారు. గ్రీకు, రోమను సంస్కృతుల నుండి, కవిత రీతులనుండి ఆంగ్ల వాఙ్మయం గ్రహించిన 'Pastorals' రీతులు స్పెన్సర్ మహాకవి వ్రాసిన చాలాకాలము తరువాత గూడ గొర్రెల కాపరుల జీవిత వర్ణనలకే పరిమితాలుగా రచింపబడేవి మహాకవి ప్రతిభ అటువంటిది. ఆ మహాకవి భావప్రాబల్యం తరువాత కవులను వివశుల్ని చేసి చాలా కాలం వరకు ఆ పరిధి నతిక్రమించి 'పాస్టొరల్' కవిత కొత్త పుంతలు త్రొక్కలేదు కాని 'పాస్టొరల్' కవిత్వం మరింత వైవిధ్యం గలదిగా 'ఎన్‌సైక్లొపీడియా అమెరికానా' ఈవిధంగా తెలియజేస్తున్నది:

"Nymphs, satyrs and other imaginary inhabitants of the woodlands and the streams march through Pastoral poetry as though of right they belong there, as infact they do if long prior possession counts foraught"

మా శుభాకాంక్షలతో



ఫోన్ నెం. 3782

శ్రీ కనకదుర్గ ఐరన్ & హార్డ్‌వేర్ స్టోర్స్

హార్డ్-వేర్ & పెయింట్స్ మర్చెంట్స్

బిసెంట్ రోడ్ :: గవర్నరుపేట

విజయవాడ-2.

★

స్టాకిస్టులు

మెసర్స్ గుడ్‌లాస్ నెరోలక్ పెయింట్స్ ప్రైవేట్ లి., బొంబాయి.

అఖిలాంధ్ర ప్రజానీకమునకు

తెలుగు నూతన సంవత్సర శుభాకాంక్షలు!

అందమునకు, మన్నికకు

మాచే తయారుచేయబడుచున్న

* సింథటిక్ ఎనామిల్సు

* రెడీ మిక్శ్చరు రంగులకు

వీనస్ పెయింట్సు,

విజయవాడ-1.

షేక్స్పియర్ మహాకవి ప్రతిభకు గొప్ప నిదర్శనాలలో నొకటిగా ఆయన చిత్రించిన పాత్రల మనస్తత్వ వైవిధ్యం ముఖ్యమైనదిగా పేర్కొనవచ్చు తన కాలమునాటి సమస్త ప్రజానీకమూ షేక్స్పియర్ మహాకవి రచనలలో చోటు చేసుకున్నదనటం అతిశయోక్తి కాదు గ్రామికజనుల జీవితపు లోతులను ఆయన ప్రదర్శించినంతగా మరే కవీ ప్రదర్శించలేదు అవును, ఆయన స్వతహాగా గ్రామికుడు; శ్రమశక్తి విలువ తెలిసినవాడు. Pastoral కవితా రచనలో నిగ్గుచూపించినవారు Cowper, Burns, Shelley, Landor, Thompson, Tennyson మొదలైన ముఖ్యులు మరికొందరున్నారు

ఆంధ్రజాతితో కృషికుల జీవనం విడదీయరానిది. సంస్కృతంలో ప్రఖ్యాతి వహించిన ఆంధ్రకవులు తమ కావ్యాలలో ఆంధ్రదేశపు ప్రకృతి సౌందర్యాన్ని ఆంధ్రుల జీవనాన్ని ప్రతిబింబించడం కనిపిస్తుంది కృషీవలుల జీవనాన్ని స్వల్పంగా వర్ణించినా స్వభావసిద్ధమైన అందంతో శ్రీ కృష్ణదేవరాయలవారు ఆముక్తమాల్యదలో వర్ణించారు:

కాలుని దున్న నందినయి గంటలు దున్నకమంటినా, మహా
కాలుని నంది దున్ననయి కర్దమ మగ్నతలేక యంటినా
హాలికు లెన్నడుండెగని యాకొదల చేలను జొక్కు మళ్ళనుం
గాలలి నేరు పొంగిరిలం గల్గు పసింగొని పేద మున్నగన్.

ఇల్లిల్లు దిరుగ నొక్కింతయ్యు శిఖి, యచ్చె
వేనింటిలోం బూరియిడి విసరక
రాంజదు, రాజిన రవులు కోల్వాపోలం
గాని కల్గదు; మఱి దానం గం గెం
వేని కూడగుట మందైనం బెప్పొగ సుఖ
భుక్తి సేకూర, దా భుక్తి కిడినం
బ్రాగ్వ్యక్తులకె తీఱు బహు జనాన్నము, దీఱ
నారుల కొదవుం బునః ప్రయత్న,
మాజ్యపట ముఖ్యలయ మెన్న; కాలయాంగ
దారులయ మెన్న రంతిక, కారజనిక
పచన నాంధో గృహిణి రామిబడుక మరుడు
పెడపెడనె యార్ప నొగిలి ర బ్బడిని గృహాలు.

ఇటువంటి స్వభావ సిద్ధమైన మనోజ్ఞ వర్ణనలు ఆముక్తమాల్యదలో అటనట కన్పిస్తాయి.

పల్నాటి జనుల కష్టాలనూ, రైతుల మొరటుదనాన్ని అవహేళన చేస్తూ శ్రీనాథ మహాకవి చాల చాటువుల్ని చెప్పటం ఆంధ్ర కవితాభిమానులకు విదితమే కృషీవలులనూ, గ్రామికులనూ అవహేళన చేసి సోమరులను కీర్తించటం కొంచెం బాధ కలిగించినా, కవితా కోణంనుండి చూసినప్పుడవి విశిష్టమైనవే.

ప్రాచీన కవిత్వంలోని Pastoral కవిత్వాని కుదాహరణలుగా శ్రీ కట్టమంచి రామలింగారెడ్డిగారు 'శ్రీకృష్ణుని బాల్యక్రీడలు, బృందావనజీవితము, గోపగోపికా సంచారములు ఎంతయు హృదయరంజకములు. భాగవతమునందలి దశమస్కంధమును, విశేషించి యెర్రాప్రగడ యొక్క హరివంశ పూర్వభాగమును దేశీయ వాక్ప్రపంచమున తమస్సు నడంచి చల్లని వెన్నెలను కురిపించి విజ్ఞానందము చేయు చంద్రబింబము వలెనున్నవి జయదేవ కృతమైన గీతగోవిందమును నిట్టిదియ' యని కొన్నింటిని పేర్కొన్నారు. ఈ మాత్రమైనా గ్రామాంతర వృత్తులవారి జీవిత వర్ణనలను తరువాత కవులు విస్మరించటాన్ని గూర్చి శ్రీ కట్టమంచివారు విచారం వెలిబుచ్చారు.

ఇంక నవ్యాంధ్ర కవిత్వములో కృషీవల జీవనము గురించి కొంత పరిశీలించి చూద్దాము. రాయప్రోలు వారి 'అభినవ కవిత'లో కృషీవల జీవితాని కత్యంత ప్రాధాన్యమే లభించింది. రాయప్రోలు వారి ప్రథమ కవిత్వావిర్భావం కూడ పూచిన కొత్తిమెర చేనును కన్నులార చూచి అప్రయత్నంగా గానంచేసినప్పుడేనట. గ్రామీణ యువతీయువకుల ప్రేమగాథలు గోవులూ గోవత్సములూ, పచ్చి బాలెంతరాండ్రు, సెనగచేలూ, పాడీ పంటా అన్నిగూడ రాయప్రోలు వారి కవితల్లో వినూతనమైన సొగసు దిద్దుకున్నాయి. శ్రీ విశ్వనాథ వారి కవితల్లోనూ, ముఖ్యంగా 'ఋతు సంహారము'లో గ్రామీణ జీవనమూ ప్రకృతిశోభా కనులకింపుగా రక్షణ పేయంగా కలిసిపోయాయి. ఉదాహరణకు శరదృతువర్ణనలో

'ప్రొద్దుటెంతల వాయువులు తావిమై మెల్ల
కొతిమెర చేలపై గొనరులాడె
చిఱుచేదు వలచెంగోసిన జొన్నచేనిలో
దొడిమదగ్గర పచ్చి దోసపండు
పండిపోయని మిరపలు పెండ్లికూతుంద్రు
వలె సకుంకుమ శోభ గులుకులాడె
పడిపెలలను తప్పనొడువు వేర్పెసుదల్లి
చిన్ని పిట్టకు మొక్క జొన్నచేం
జెలంగెం దలగిల్లిన పొగాకు సెనగజంప
టలును బంతిపూల్ మిరపతోటలకు మధ్య
శరదృతు సమస్తమును ప్రదర్శనము చేసెం
గూడి మెట్టపొలాల నికుంజ లక్ష్మి.

బురదత్రొక్కుడు కాపు బుడుతడు మహిషంబు
పై స్వారి పోవును బాలయమ్మడు
చింకి జుత్తునకు గైసేయు నంత్రటెంపలు
పసిమాల కన్నియ పట్టవిహిపి
పీడనూగగు మిన్నకాడ కాయులను మూల
జడదు దూడ నాజూకుపావ



శ్రమజీవనులు —శ్రీ ఎ. జీ. రెడ్డి

అంతంత మూన్నెల లరక కట్టని గిత్త
యాంబోంచు నంది దాయాదిగడు
అట్టివాన వెనుక పట్టిన యంతలో
నంత నంత నెమ్మి వారినంత
కాచి కాచి యెండ కాసిన యంతలో
నిపురు మెండు బుంత లెండినంత—

వంటి పద్యాలు ఉల్లాసాన్ని కలుగజేసి గ్రామీణ శోభను దర్శింపజేస్తాయి శిశిరబుతు వర్ణనలో పంటకాపు దంపతులు తమ పాడియావు ఈనగా ఆవుదూడ గిట్టలు గిల్లి చేటలో ప్రాలవడ్లుపోసి మేలబెట్టి, "మాయ" యెప్పుడు వేసి ఆవు తినేస్తుందోనని శంకతో కంటికి రెప్పలాగ కాపాడుతూ జాగారం చేసిన దృశ్యాన్ని రమణీయంగా వర్ణించారు. భావ కవులలో పలువురు భాషలో స్వతంత్రత నభిలషించినట్లే, గ్రామీణ జీవనం వారి కాదర్శ పాత్రమైంది నగర జీవితంతో విసిగి గ్రామీణ శోభ క్రొత్తలు జాచటం భావకవులు పలువురిలో కని పించే సామాన్యాంశము.

భావకవుల కాలంలోనే తమ స్వాతంత్ర్యాన్ని, వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకొంటూ కృషీవల జీవనము గురించి కవితలు వ్రాసిన వారిలో శ్రీయుతులు దువ్వూరి రామిరెడ్డి, తుమ్మల సీతారామ మూర్తి, ఏటుకూరి వేంకటనరసయ్య, పింగళి — కాటూరి ముఖ్యులుగా యెంచవచ్చు అంతకు పూర్వము తెలుగు కవితలో లోపించిన కృషీవల జీవన సౌందర్యమూ, దయనీయమైన రైతు జీవితాంశాలను కావ్యాలలో నికేపించారు

శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులుగారితో తెలుగు సాహిత్యం ప్రక్రియావైవిధ్యాన్ని తగినంతగా సంతరించు కున్నదని చెప్పవచ్చు. మొదటి ప్రపంచ యుద్ధానంతరం ఆంగ్ల సాహిత్య కాంతిపుంజాలు ఆంధ్ర దేశాన్ని మేల్కొలిపాయి. జన బాహుళ్యానికి దగ్గరైన కావ్య వస్తువును స్వీకరించటం పట్ల ఆంగ్ల వాఙ్మయం తెలుగు కవులకు అభిరుచిని కలిగించింది. దీనిని విదేశీ వాఙ్మయానుకరణ యని త్రోసి వేయటానికి వీలులేదు. ఈ విషయాన్ని సమర్థిస్తూ, కావ్యాలలో జనజీవితం ప్రతిబింబింపవలసిన ఆవశ్యకతను నొక్కి వక్కాణిస్తూ శ్రీ కట్టమంచివారు 'కవిత్వ తత్త్వ విచారము'లో "ఐరోపాలోని కవీశ్వరులు కొండలు కాయువారు, సైనికులు, మొదలైన తక్కువ వృత్తుల వారి బ్రతుకులను వర్ణనార్హములని భావించి యెంతో సుందరముగా గావ్యములలో వ్రాసియున్నారు. మన గ్రంథముల మాత్రము చదివి యీ పుణ్యక్షేత్రమైన కురుక్షేత్రముయొక్క స్థితిగతుల నరయజూచువారికి ఈ దేశమున బీదసాదులైన నున్నారా? యను సంశయము పుట్టినను తప్పువాదిది గాదు. శోకరసమును వరించ వలయునన్న ననుకూలమగు సందర్భ మెయ్యది? క్రొవ్వుగాతెడి నాయిహ వాయకుల యూహామాత్రము లైన కష్టములా? ప్రజలు దినదినము కన్నీరు కార్చుటకైన నవకాశములేక కుడుచుచుండు పరిపరివిధములైన — గోడులా?" యని ప్రశ్నించి యింకను "జనసామాన్యము యొక్క ప్రతిదిన వృత్తములలో నెంత భావము, రసము, గుణము నుపగతములై యున్నవో మన కవులకు తెలియవు గదా" యని వాపోయినారు. "రాజపుత్రులను రాజకన్యలను చాలనందుకు బ్రాహ్మణులను వేశ్యలను బట్టి ఝుంఝూటమాడుట దప్ప కవితకు మేలైన, యన్య కర్మములులేవా" యని యుపాసడించినారు. శ్రీ కట్టమంచివారి వాదములో తీవ్రతయున్నట్లే సత్యవాక్కు గూడ యిమిడియున్నది. ఆయన వ్రాసిన ముసలమ్మమరణము పంట కాపు జీవితేతివృత్తమే యయినా కట్టమంచివారు మాత్రము వర్ణనలలోనూ, పద్యముల యెత్తుగడలలోనూ—ప్రాచీనతా వాసన లను విడువలేక పోయినారు. కృషీవల జీవన మనిన మిక్కలి సానుభూతి గలిగిన కట్టమంచివారు శ్రీ దువ్వూరి రామిరెడ్డిగారి 'కృషీవలుడు' కావ్యానికి, పింగళి-కాటూరి కవుల 'తొలకరి' కి అభినందలతో పీఠికలు వ్రాసేరు

శ్రీ దువ్వూరి రామిరెడ్డిగారి "కృషీవలుడు" అను కావ్యము కృషికకవితకు మంచి యుదాహరణ కృషీవల జీవన సౌందర్యమును కృషీవలుడు చూడలేడు. కవి యిచ్చిన భావ లోచన మెరవుగా గైకొని చూచినచో పల్లెల జీవిత మెంతయో శోభాస్పదము; త్యాగమయము; కష్టభరితము; భారత జ్యాతి లాత్మ గౌరవ పవిత్రము. కృషీవల జీవితాన్ని వర్ణించగానే తనను రైతు పక్షపాతిగా పండితు లేసడిస్తారని శంకిస్తూనే, యెవరేమి యనుకొన్నా, పంజర నిబద్ధ కీరము స్వాతంత్ర్యము నాశించినట్లు తాను స్వతంత్రించి "కాలమసంతము. ఇల విశా లము" గావున హృదయమును వెలిపుచ్చి కృషీవల జీవనమునే కీర్తించినాడు. రైతుకు పల్లెయే సర్వ ప్రపంచసీమ; ఉండి తిన్నా లేకపస్తులున్నా నీరుల కష్టార్జితము వారసజేయడు; ఫలములను భుజించి ఆ చెట్టు పేరైనా తలంచని కృతఘ్నుల వలెనే యీ లోకము రైతు శ్రమఫలము ననుభవించి రైతును విస్మరించుచున్నది. ఈ రైతుకు కవిత్వలోచనమిచ్చి సైరు అందము నాస్వాదింపజేసి అతడి ధన్యజీవనమును నుతించినాడు. అంతటితో ఆగిపోక రైతుకున్న కష్టములను ముఖ్యముగా ఋణబాధను

తల తాకటులువెట్టి ధనికుల దగ్గఱ
వన్నుకై గొన్న రూపాయలప్పు
కూలికి నాలికిం గూటికిం జాలక
వాముగా గొన్న ధాన్యంపు టప్పు

విల్లర మల్లర చేబదులుగఁ దెచ్చి
యక్క అ గడిపిన యట్టియప్పు
పండుగ పర్వాల బంధుల విందుకై
సామాను గొన్న బజారు టప్పు
వాయిదా ముంచవచ్చిన వడ్డియప్పు
ఎడఁతి సొమ్ముల కుదువకుఁ బడ్డయప్పు''

అను వివరించి అవి తీర్చనిదే సుఖము లేదుగదా యని జాలిని చూపారు. రైతుల కష్టసుఖాలు తెలిసిన యీ కవి సానుభూతితో రైతు భుజముతట్టి పల్కరిస్తున్నట్లు గానే కావ్యమంతా కొనసాగించారు. 'వనకుమారి'; 'నలజారమ్మ అగ్ని ప్రవేశము' మొదలైన కావ్యాలలోగూడ పల్లీయుల జీవనాన్ని ప్రతిభావంతంగా దర్శింపజేశారు.

శ్రీ తుమ్మల సీతారామమూర్తి అచ్చపు రైతు. అందుచేత రైతు జీవన విధానాలను శ్రమపడి ఆయన ఆకళింపుకో నక్కరలేక పోయింది. ఆంధ్రజాతి, ఆంధ్ర సంస్కృతి, ఆంధ్ర దేశమనినవే ఆయన యొడలెంత పులకరించునో, రైతుగా శ్రమపడి జీవించుటన్ననూ అంతే రైతు నెవరేమియన్నా ఆయన సైరింపలేడు. రైతుగా శ్రమపడి పొలందున్ని, గడ్డిమోపులు మోసి, కాలువలకు గూడలువేసి ఒకటేమిటి అన్ని వ్యవసాయపు పనులూ చేసి, విద్య నార్జించి క్రమశిక్షణతో మెలగినట్లు ఛందస్సు విషయంలో కడు జాగరూకుడై 'పరిగపంట' మొదలైన కావ్యాలు వ్రాశాడు. జీవితాన్ని త్యాగంతో వెలిగించి 'తెలుగు లెంక'గా నిలిచాడు. రైతునుగూర్చి చెప్పే ప్రతిచోటా ఆయన కవిగా గాక రైతే కవికంఠంతో పలికినంత స్వచ్ఛంద సుందరంగా పలికాడు. నిసర్గ మధురమైన ఆయనశైలి కవితాభిమానులెల్లరూ కన్నుల కద్దుకో దగినది. సంక్రాంతిశోభను మరే తెలుగుకవీ శ్రీ తుమ్మలవారంత మధురంగా వర్ణించలేదని పరిగపంట చదివాక తప్పకుండా తోస్తుంది. పంట కల్లంలో

''తట్టలు తట్టలే త్రవ్వి సుంకులు వోసెఁ
బొలికేకలో నాడల్ పులకరింప
పొలికట్టె నందియ మొలకనవ్వుల నిండు
కళ్ళమిచ్చెను జీతగాని కొఱకు
వెలసూచి చిఱుదిండి విలిచెనా కెడ్వర
చిప్పకే చేటలు చేటలొసగె
గాజాలకని కోరగా గంప కెల్తించి
పాలేరుసతికి సంబరముగూర్చె
కుంటికిన్ గ్రుడ్డికివి వేడుకొన్న వాని
కెల్లవానికి భాగంబు లేర్పరించి
లేము లెఱుఁగని సంక్రాంతి లేమకపుడు
మంగుఁ దోడయ్యె గుప్పలు మార్చురైతు''

ఈ విధంగా చెప్పటానికి రైతు జీవితాన్ని ఎంత సాన్నిహిత్యంగా పరిశీలించాలి!

''ఈ కోడిపండెము లేమి తెల్పెడినయ్యా''? అని ప్రశ్నించి "ఆంధ్ర జాతీయ శౌర్యాభిలిప్స'' అని ఉప్పొంగిపోలారు! ఎంత కష్టించినా రైతు కష్టాలు తీరకపోవటాన్ని గూర్చి రైతు ఆశలు అడుగంటి పోవటాన్ని గూర్చి

కూలిపోయిన కొంప కుదుటఁ బెట్టగలేక
యున్నురు మనుచుండె నొక్కరాపు
ఎలనాగ కూఁతు పెండిలి సేయలేక శీ
ర్షము వంచుకొనియెఁ గర్షకుడొకండు
పసిబిడ్డకై బుడ్డిపాలు తేలేక చీ
కాకులో బడె నొక్క కమ్మటీడు
కొడుకుఁ గుఱ్ఱను మంచి బడికిఁబంపగలేక
గోళ్ళు గిల్లెడి నొక్క గొప్పరైతు
హెచ్చు కట్నాలు వైద్యుల కీయలేక
చిక్కి సగమయ్యె నొండొక్క సేద్యగాడు
పశువు బరువున బ్రదికిన పంటదొరకుఁ
గటకటా! నేటి కెట్టి యిక్కట్లు వచ్చె''

నని వాపోయారు.

రైతు కెప్పుడైనా అధికారి, సాహుకారు వ్యాపారి చుట్టాలు కారనీ, నిజమైన చుట్టమూ ఆత్మబంధువూ పాలేరేనని ఉద్బోధిస్తారు. రైతుల కష్టసుఖాలను వర్ణించే టప్పుడు బాగా లోతులకు వెళ్ళి సహృదయుల మనస్సులలో మరవురాని ముద్రవేశారు.

కవిబ్రహ్మ ఏటుకూరి వేంకటనరసయ్య 'క్షేత్రలక్ష్మి' తెలుగు సాహిత్య క్షేత్రాంలో పండించిన మేలిరకపు పంట. కావ్యానందాన్ని పుష్కలంగా సమకూర్చటంలో యీ కావ్యం ఏ మహాకావ్యానికీ తీసిపోదు ప్రాచీన కవితా మర్యాదలను వంట పట్టించుకొన్న, నరాల్లో జీర్ణించుకొన్న పండితులను, సహృదయులను మేల్కొల్పుతూ కవి కుమారులను—

''అలయక రాజుతోడ మధురాసవ మానెడు దివ్యకాంతలన్
మలిచిన సిద్ధహస్తమున మంచెకుఁ జేరువనున్న కాపుకో
డలి నయగారిపల్కుల మిటారము నా నడతీరు కన్నులం
జిలుకు నమాయికత్వము రచింపుము నీవన గాననయ్యెడిన్'

అని సవాలు విసిరారు మేడిపై చేయునుంచి, భారముమోపి చేజారిన పగ్గమూని, కోడె దల్చి కష్టించు కాపువానికంటె కవితా వస్తువు రమణీయమైన దేదీ దొరకుతుందని కవి మందలించారు.

మాటి మాటికి యీ విధంగా కవిని హెచ్చరించటం, యీ నాటికావ్యం చదివేవారికి ఎబ్బెట్టుగా కన్పించవచ్చు గాని, కవి కావ్యం

వ్రాసినా ఒదిగి అవుసరమే కావ్యవస్తువుకు కొఱత యేర్పడి నట్లు నిర్దిష్టులైన కవులు అనుకరణ జాడ్యానికి లోనైనప్పుడు శ్రీ ఏటుకూరి పాటికవి ప్రపంచంలో ఈ విషయంలో విప్లవంతెచ్చి, విప్లవ యోధులలో వొకరైనారు. పొలములో పంటకాపు తన భార్యతో నాడు ముచ్చటలు, వారిద్దరు కలిసి కష్టపడు దృశ్యము కనులార చూడదగినది లేదా క్షేత్రలక్ష్మి కావ్యమున ననుభవింప దగినది రైతుబిడ్డల రక్తమోడ్చి త్రావి, చాలనట్లు రైతు నీసడించు పరాన్నభుక్కులను కవి ఆవేశంతో అట్టివారి "మొండికట్టె పీనుంగును కుక్కలైన ముట్టుకొనవు తుదకు" అని శపించారు. పరాయి ప్రాంతమునుండి వచ్చిన హాలికుని సాదరంగా ఆహ్వానించి కూరుచుండబెట్టి కుశలమడిగిన పల్లెటూరిపడుచు మర్యాద శృంగార నైషధములోని దమయంతి వాక్చాతుర్యమును దలపిస్తుంది. అవును మరి కవి ప్రాచీన కావ్య మర్యాద తెలియనివాడా యేమి!

> "కాళ్ళ తడబడంగ గండలు నడియంగ
> నడుము వంగి పొట్ట ముడుత పడఁగ
> బండ్ల బిగువుగూరి పరువెత్తుచున్నాఁడు
> జాలిగొలుపు ముసలి కూలిబాబు"

అనే పదచిత్రం వ్రాయటంలో కవిబ్రహ్మ సృష్టి చాతుర్యాన్ని చూపించారు. మాగాణి భూముల సేద్యపు తీరు తెన్నులను వివరిస్తూ సూక్తులవలె కలకాలం నిలిచే చిన్నపద్యాలు రెండు మరువరానివి అవి యివి:

> "నీటి పంటగాన నిస్సార మెక్కుడు
> ఒరుపు గింజకున్న కలుకులేదు
> మంట లోలుకబోయు మఱధాన్య మేతెంచి
> ఉడుకుఁ దిత్తులయ్యె నొడళు లెల్ల.

> "సేద్య మొరులపాలు జీవమ్ము మఱపాలు
> స్వాస్థ్య మంతొ యింతొ చదువుపాలు
> కష్టమొట్లపాలు, కల్మి డంబముపాలు
> మా చరిత్ర తుదకు మచ్చపాలు"

మాగాణిభూముల ఆదాయం చూచుకొని విఱవీగుతూ మెట్ట వారు అనాగరకులనటం అవివేకమనీ, వారిది నిజమైన సంస్కృతి యనీ యెలుగెత్తి చాటారు శ్రీ యేటుకూరి. జాతీయతా జీవనమంటే అభిమానము గల్గించుటలోగూడ ఈ కావ్యము బాగా తోడ్పడినది. రైతు కాలిలో దుంప దిగినదని కవి అనగానే పరుని మనస్సుకూడ కలుక్కుమనును కవి అకాలంగా రాలి పయినా క్షేత్రలక్ష్మి కావ్యం రసభరితమూ, మఱపురాని హొయలు కలిగించేదిన్నీ.

పింగళి—కాటూరి కవుల 'తొలకరి' కావ్యం వారి తొలి ప్రయత్నమేగాక కృషీవల జీవనాన్ని వర్ణించే కావ్యాలలో తొలి తరానికి చెందినది తొలకరి వర్షాలతోనే పంటలకు నీరు సరిపోనట్లు, వీరి కావ్యంలో వర్ణింపబడిన రైతు జీవితం సమగ్రమైనది కాకపోతే పోయింది, లోతైన జీవిత చిత్రణ, ప్రకృతి వర్ణనలలోనూ కవితా ప్రౌఢిమ లేదు. జొన్న చేను అనే ఖండికలో

> "దారిఁబోయెడు వారలఁ బారఁజూచి
> విసరుమా! సుంత వడిసెల—వెనుక నదిగొ
> కంకి తినుచున్నయది గోరువంక—ఇంత
> యాలసించిన నిలుచునా.?"

అనేమాటలలో గోరువంకలు కంకులు తినటం అసహజం కాదుగాని పైరు గూర్చి తెలిసిన కవి మాత్రం పరిగ పిట్టలు తింటున్నట్లు వర్ణిస్తారు కాని సుసన్నమైన పద్య రచనారీతి మాత్రం యింపు గొలుపుతుంది 'కవితా సామగ్రి' అనే ఖండికలో సామగ్రి అంతా పూర్వకవి ఉపయుక్తమైనదే అవే సార్వకాలింగా ఈ కవులు కూడ భావిస్తున్నట్లు తోస్తుంది. భావనలో క్రొత్తదనం చాల స్వల్పంగనే తొంగి చూచింది. 'సంక్రాంతి' ని గూర్చిన వీరి కైతలోనూ కవికంఠం తప్ప రైతు గొంతు వినిపించదు పింగళి—కాటూరి కవుల తరువాత కావ్యాలలోనూ హాలికజీవనం తొంగి చూడలేదు

తెలుపు ఆయింట్‌మెంట్
బి-టెక్స్
తామర, దురద, కురుపులు, గజ్జి, మొటిమలు, పుండ్లు, చలితో చెయ్యి కాలు పగుళ్లు, దేహముమీద గాయములకు వాడినచో తప్పక నయమగును

వీరేగాక యింకా కవికొండల వెంకటరావు, కొనకళ్ళ మొదలైన వారి కవితలలోనూ కృషిక జీవితం రూపు దిద్దుకొన్నది కవికొండల రైతు జీవితంతో అగిపోదు. కూలియన్నం కుటుంబాన్ని కన్నులార చూపిస్తాడు. పంట కాలువలు, బోదెలు కూలి పడుచుల కొంటె మాటలు, జానపదుల మనో నైర్మల్యమూ అన్నీ చక్కగా కవికొండల కవితల్లో కనిపిస్తాయి. కొనకళ్ల 'ముక్కుజొప్ప తోటలో!' 'లాగరా హైలెస్స' రెండు పాటలే చాలును ఆయన కవితా మాధుర్యాన్ని తెలుగు వాళ్ళు కలకాలం జ్ఞాపక ముంచుకోటానికి! బంగారిమామ పాటల లోనూ జానపద ప్రణయం ప్రబంధాలలోని ప్రణయ సన్ని వేశాలకంటె మిన్నగా ఉన్నది

శ్రామిక జనుల కష్టసుఖాలు కావ్య వస్తువుగా స్వీకరించ దగినదేనని యింకా యీనాడెవరూ సమర్థించ నక్కరలేదు. అభ్యుదయ కవిత్వోద్యమం ఆ పనిని సమర్థవంతంగా నిర్వహిం చింది అన్ని రకాల కార్మికులూ, శ్రామికులూ సాహిత్యంలో చోటు చేసుకొన్నారు.

ఈ కాలపు కవులు కవిత్వానికి ప్రయోజనం ఉండి తీరాలని గుర్తించటమే గాక, తమ కవిత్వ ధ్యేయాన్ని వివరించ వలసిన వారయ్యారు. చలంగా రన్నట్లు "కొద్దిరోజుల్లో వేదు విర్ర వీగే కవులు ప్రతివొక్కరూ శ్రీ శ్రీ సిద్ధాంతం కింద నించొని తమ ఉనికిని సమర్థించుకోవలసిన గతివొస్తుంది." ఈ స్థితి కొంత వరకు వచ్చిందని గుర్తించటానికి అభిమానం అడ్డురా నక్కర లేదు. కష్టజీవుల జీవితాన్ని వర్ణించటానికి కవులు కమ్యూ నిస్టులు కానక్కరలేదు. Pastoral కవిత్వాన్ని యిముడ్చుకో గలిగింది "Proletarian literature వాక్యటిమాత్రమే కాదు. Proletarian literature usually has a suggestion of pastoral, a puzzling form which looks proletarian but is not." విజయవంతమైన సామ్యవాద వ్యవస్థలో శ్రామిక వర్గపు కవిత్వం అంత రసవంతంగా ఉండదని William Empson అనే విమర్శకుడు అభిప్రాయ పడుతున్నాడు. 'డాస్టో వస్కీ' వంటి రచయితలు దిగాపడిన చుమ్మళ్ళా, దీనులూ, హీనులగురించి జాలిపుట్టేటట్లు వ్రాయగలరు. కాని ఒక రాచ రికపు వ్యవస్థను నిర్మూలించటానికి ఏ పద్ధతులనైతే కమ్యూ నిస్టు రచయితలు వాడతారో, వాడుతున్నారో, ఆ రచనలే వారి వ్యవస్థ నెదిరించటానికి గూడ సాధనాలుగా ఉపయోగపడే ప్రమాద మున్నది.

కవి తన ఊహా నిర్మిత శిఖరంపై కూర్చుండి తన ఆత్మానందం కోసమే వ్రాసుకొంటాను, 'దిగిరాను, దిగిరాను' అనటాని కివి రోజులుకావు. ప్రతికవీ తన కవితలు జనజాతి జనులు పాడుకొనే మంత్రంగా మ్రోగాలని కోరుకునే వాడే. ఐనప్పుడు కాలాన్ని శాసించ గలిగిన కవి, కావ్య వస్తువును స్వీకరించటంలో నేడు విడిచిన సాము చెయ్యకూడదు జాతి జీవితాన్ని ఏ విధంగానూ ప్రతిబింబించని రచన చేయటం లక్ష్యాయమే కాగలదు తెలుసుకునే ఉండి కవి సమాజాన్ని నడిపించాలి, ఉద్బోధించ నక్కరలేదు.

హవాయ్ చెప్పుల ప్రమాదగీతం

నిఖిలేశ్వర్

మృత్యువు ఇన్ని జీవితాల మధ్య
భీకర కరాళ కర్కశ సత్యం
ముఖానికి చల్లగా స్నోపూసే ఎగరమే
రోజా చిందిస్తుంది
వీధుల్లో లావణ్యంపై రక్తం.

ఒక పెరుగుతున్న అందమైన ప్లస్
చేయి విదలించుకొని
రోడ్డుకు అడ్డంగా పరిగెత్తినపుడు
బ్రేకులు పడని బస్సు మైనస్ చక్రాల కింద
నెత్తురు చిమ్మి నిర్జీవంగా మిగిలిన ఆకారం
గిరాటుపడిన చిన్ని హవాయ్ చెప్పులు
పైకీ కిందికి పడి రోదిస్తున్న రంగులు —

"ఎంతైనా మనమంతా
మైనస్— ప్లస్
మైనస్ ఇన్ని ప్లస్‌ల మధ్య
కరుణలేని మైనసే........!"

హవాయ్ చెప్పుల అడుగు
తెల్లటి తాబేలు కడుపు
నూగారు తైలవర్ణపు వెలుగు
కామాన్ని తలకెక్కించే మాంసపుకాంతి,

ఆడది — మగాడు
సార్థకత — నిరర్థకతల మేళవింపు
హవాయ్ చెప్పుల
సవాయ్ గీతంలోని ప్రమాద రాగాలు
రాగ — విరాగాల మధ్య
కాళ్లకింద ఎంత మెత్తగా—నున్నగా

భయంకరమైన ముగింపు ఊహించని నడక
ఈ భయంకర విహ్వలతలో
చెప్పులు ధరిస్తున్న విభిన్న రూపాలు
కాళ్ళు నడుస్తున్న అనేక దారులు
కళ్ళు చూడలేవు
గుండె భరించలేదు.

ఈ చెప్పులు వానలో
షరాయిపై బురద మరకలతో
యథార్థం కుచ్చే ముళ్ళతో
ప్రాసలేని రబ్బరు ముద్రలతో –?

ఇప్పుడు ప్రశ్నలేదు – పాదులేదు
యథార్థ చిహ్నాలతో
మానసిక వ్యభిచారం
ప్రవాదాల ప్రమోదాల క్షణిక పాంపెన్‌లు.

క్షణాలు ఎవడికి వాడివి
గొప్పవి – క్షుద్రమైనవి
తెగిపోయిన స్ట్రాప్‌లు
అరిగి పోయిన
చెప్పుల మడమలు.

———

స్నుషావిజయము

సంస్కృత మూలం : శ్రీ ఇళత్తూరు సుందరరాజకవి

అనువాదం : శ్రీ వింజమూరి శేషఫణిశర్మ

[“స్నుషా విజయము” అను సంస్కృత నాటిక వ్రాతప్రతి యొకటి మా యింట లభించినది. అది సలక్షణమై సహజమృదూక్తులతో సహృదయరంజకమైనది. దాని రచయిత ఇళత్తూరు (అగ్రహారము) నివాసియగు వరదరాజునందనుఁడగు సుందరరాజని అందలి ప్రస్తావనవలన విశదమగుచున్నది. చివరి పద్యమున కేరళ భూమండలేంద్రుని ప్రస్తావించుటవలన ఇళత్తూరు కేరళ మండలాంతర్గతము కావచ్చును. కవికాలాదులు నాకు తెలియలేదు. —విం. శే.]

ఇందలి పాత్రలు

సుశీలుఁడు	...	తండ్రి
సుగుణుఁడు	...	కుమారుఁడు
దురాశ	...	తల్లి
చారువృత్త	...	దురాశ సఖి
సచ్చరిత్ర	...	స్నుష (కోడలు)
దుర్లలిత	...	కుమార్తె

(నాంది)

శ్రీలి నొసఁగుత స్వ స్నుషాశ్రిత సుధీ ము
ఖాబ్జమందు వసించుచు నత్తలకు స్ను
షాహితద్వేష జావయశంబు మాన్పు
నబ్జభవు తల్లి, యబ్జాలయామతల్లి.

(నాంద్యంతమున)

సూత్రధారుఁడు : (ప్రవేశించి) స్యానందూరపురమునమున్న యనంత శయనుఁడగు విహంగేశయానుని కుశేశయ మహోత్సవ సేవాసక్తులగు పండితుల బృంద మిదిగో! మహానుభావుఁడగు భరతమునిచే నిర్దేశింపఁబడిన విద్యవే నీ సభ నలరించెదఁ గాక! (తెరవైపుఁ జూచి) మిత్రమా! ఇటు రమ్ము.

పారిపార్శ్వకుఁడు : (ప్రవేశించి) ఇదె వచ్చితిని.

సూత్ర : మిత్రమా! శ్రీమంతంబగు ‘నిళత్తూ’రను నగ్రహారము నందలి వరదరాజనందనుఁడగు సుందరరాజుచే రచింపఁబడిన ‘స్నుషావిజయ’మను రూపకమును గొలఁదికాలము క్రిందటనే యభ్యసించితిమి గదా! దానిచే సారాసార వివేకచతురంబగు నివ్విద్వన్నికరము నారాధింపఁ దలంచుచున్నాను. వేడ్క—

మాతయగు భూమి, నిజసుతుఁ
జూతపలాశిన్ వసంతశోభాసంగిన్
బ్రీతిఁ గనుంగొని మిక్కిలి
చేతంబున యందు ముదముఁ జెందెను గాదే!

పారి : మిత్రమా! తన తనూభవుండగు చూతశాఖికి వసంతశోభ యను కళత్రముతో సంగమము గలుగ భూమి సంతోషించెననుట మిక్కిలి యాశ్చర్యజనకము.

సూత్ర : మిత్రమా! ఇం దాశ్చర్యకర మేమి?

మతగుణయుతయగుఁ దొయ్యలి
సుతునకు యోజింపఁబడఁగ జూచి దురాత్మల్
మతినోర్వరు కొందఱు; కుల
సతు లటుగా దెప్పుడైన సద్గుణ పాత్రల్.

పారి: నిక్కము వక్కాణించితివి! దుర్మార్గమువలన దురాశా కారణముననే సచ్చరిత్రయగు గోడలిని ద్వేషించుట.

(నే ప థ్య ము న)

ఓరోరీ దురాత్ముడా! నా దుర్మార్గమువలనఁ గోడలియందు ద్వేషమని యేల యుద్ఘోషించుచున్నావు?

సూత్ర: మిత్రమా! నీ మాటలలోని దురాశా శబ్దమును దన నామధేయమునుగా నాశంకించి 'దురాశ'యను పేరుగల యత్త కోపించినదయి యిటే వచ్చుచున్నది. కావున మన మారంభించిన కార్యమును నిర్వహింతము రమ్ము!

(నిష్క్రమింతురు)

(ఇ ది ప్ర స్తా వ న)

(దు రా శ ప్రవే శిం చు ను)

దురా: దుశ్చేష్టురాలగు కోడలి మూలముననే గదా నాకీ యపవాదము.

(నే ప థ్య ము న)

ఓసీ ముండా! నీ దుశ్చేష్టత్వము నెఱుగలేక, దానిని గోడలియం దేల యారోపింతువు?

దురా: (ఎదుటఁ జూచి) నా మాట విని కోపించిన పతి యిటే వచ్చుచున్నాఁడు.

(అంత సుశీలుఁడను పతి ప్రవేశించును)

సుశీ: మూఢురాలా! ఇఁకముందు నీవు కోడలికి వశవర్తినివై యుండవలయును.

దురా: ఆర్యపుత్ర! మీకే వశవర్తినినిగాని నేను ఎవతెకో వశవర్తిని నెట్లగుదును?

సుశీ: ఏమి వదరుచున్నావు?

వేదవాఙ్మయంబు నాదు వశంబయ్యె
శాస్త్రషట్కమును వశంబు నాకు
రాజపరిష దంతరంబు వశంబయ్యె
నీవు నాకు వశ్య వెట్టులఁ గావు?

దురా: ఆర్యపుత్ర! ఎట్లో మీకు వశ్యురాలనగుదుఁగాని యెప్పుడును బర గృహమునుండివచ్చిన యెవతెకో వశ్యురాలఁ గాఁజాలను.

సుశీ: అయ్యో! మూఢురాలా! వినుము.

సుతుఁడు సమర్థుఁడయి యతని
సతియుఁ గుటుంబభర భరణ శక్తయె కాఁగాఁ
గత యౌవనులగుఁ బితరులు
సతతము వారిద్దఱికి వశంబగు టరుదే?

దురా: హుఁ! ఎచ్చటినుండియో వచ్చిన యొకానొకతెకు మీరు వశంవదులైన నగుదురుగాక! ఎన్నియో దినములనుండి గృహాధికారిణి నయియుండి కొలఁదికాలముక్రిందఁ దేఁబడిన దానికి వశ్యురాల నెట్లగుదును?

సుశీ: బాలు, మలిమింతు, నవిముక్త పాశాలు

నీ తనూజు, ననూఢ పత్నికుఁ జూచి
పార్శ్వగ్రహబాలు, నున్ముక్త బ్రహ్మచర్యుఁ
గాంచి, 'కోడలు గావలె'నంచు నన్ను
నీవు పెట్టని బాధలు నిజము లేవు!

మఱియుఁ బహుర్యామిట్లంటివి గదా:—"ఎంతకాలము బాలుని సమాప్త బ్రహ్మచర్యునిగఁ జూడకుందును. మఱియు—

చూడు మన వీధియందలి
చేడియలం బ్రక్కయిండ్ల చెలులను వారల్
వేడుకగాఁ గొడుకులతోఁ
గోడలి యూరికిఁ జనుదురు కోరిక మీరన్.

అచ్చట బాలుఁడగు నల్లునితోఁబాటు, వచ్చిన వియ్యపురాలిని గాంచి, ససంభ్రమముగా నెదురువచ్చి మందిరాంతరంబును బ్రవేశింపఁజేసి, వందనపూర్వకముగఁ జందనమును హిమాంశు శీతలములగు మల్లెపూదండలును, తాంబూలమును సమర్పించి, గౌరవింతురు.

పుట్టినింటినుండి మెట్టినింటికి వచ్చి
లజ్జతోడఁ బదములకు నమస్క
రించు వధువుఁ గౌఁగిలించి వడిఁ జేర్చి
పుణ్యవతులె సుఖము పొందఁగలరు."

అని

దురా: నాథా! అదియంతయు నిక్కమే!

ఆ దినములలో నా మది
తాదృశ సుఖభావనములఁ దనరెను; నేఁడో
యే దురదృష్టమొ! కోడలు
నాదు మదికి విషముగ పరిణామముఁ జెందెన్.

సుశీ: (తనలో) ఆహా! కాలవశమున నమృతము సైతము విషమగును గదా!

ఎవతె—కన్నకొడుకు కులహేతువయి న
తిల నివాప జల సహితాంజలి యొసంగి
పితరులకు గతాసువులకుం బ్రీతిఁ గూర్పు
నట్టి కోడలి నిది విష మట్లు చూచు.

ఈ నీచురాలనునయింపఁబడియు, నా మాట నెప్పుడు ననుసరింపదు.

భార్య వశమైన—వధువు కేన్వైరి వోదు
దాన, సుతుఁడుకూడ విముఖత్వంబు నొందు
పోని, కోడలిఁ దయఁ జూతునేని, భార్య
యెట్టి యపవాదు నామీఁదఁ బెట్టునొక్కొ!

కనుక నేనెట్లో తటస్థుఁడగ నుండెదఁగాక! (ఎదుటఁ జూచి) ఇదిగో! నాచేత నింతకుమున్నే నా భార్య బుద్ధిని జక్కపఱచు

టకై ప్రేరేపింపఁబడిన దీని స్నేహితురాలొకతె యిటు వచ్చు చున్నది. కనుక నే నిటనుండి తొలఁగెదను

(నిష్క్రమించును)

(అంత 'చారువృత్త' యనుపేరుగల దురాశ స్నేహితురాలు ప్రవేశించును.)

దురా - సఖీ! చారువృత్తా! ఆత్మవ్యథను నివేదించుకొనుటకై నీ కొఱకుఁ జాలకాలమునుండి యెదురు సూచుచున్నాను.

చారు. సఖీ! నీకేమి బాధ?

దురా: సకల సురలకు భక్తితో సలిపి పూజ
తనయు కారణములగు వ్రతములఁజేసి
చాల కాలాన కావన్న సత్వనగుచు
నిట్టి పుత్తుని గంటి నే నేమనందు?

చారు: సఖీ! పుణ్య విశేషమే లేకున్న నిట్టి పుత్త్రుఁడెట్లు లభించును?

దురా: పుత్త్రుఁడు సుగుణుఁడనుటలో సందియము లేదు.

చారు: (స్వగతము) ఈ దుష్టురాలు కోడలిపై దోష మారోపింపఁ జూచుచున్నది (ప్రకాశముగ) మఱి యింకెవ్వఁడు దుర్గుణుఁడని నీ బాధ?

దురా. 'మఱి యింకెవ్వతె?' యని యడుగవలయును.

చారు: నీ కూతురి దౌర్గుణ్యమువలన బాధపడుచున్నావా?

దురా: ఏమి? ఏ మనుచున్నావు? నా కూతురి సౌజన్యము నీ వెఱుఁగవా? అవధరింపుము—

సుతున కోడఁగూర్చ సద్గుణశోభితాంగిఁ
బ్రతి పురంబునకును, బ్రతి బంధుగేహ
మునకుఁ జని పరిశ్రాంతిని బొంది రోసితేఁ
దెచ్చితి నదే నా మనమును బ్రచ్చెనేఁడు.

చారు: ఆమె యేమి చేయుచున్నది?

దురా: గుప్తముగా నాచే ని
క్షిప్తంబగు నానెతేఁ గేశము లెట్లో
లిప్తంబులఁ జేసి యిదొక
లిప్తనె నను మోసఁగించి లీలం బోవున్.

మఱియు,

సద్యోవికసిత మల్లీ
విద్యోతి నితంబిఁబింబి వేణిక యగుచున్
విద్యుల్లేఖికయోయన
హృద్యయగుచు నాదు సుతుని యెదుటఁ జరించున్.

చారు: దీన నీకుఁ గల్గిన నష్టమేమి?

దురా: ఆఁ, ఏమనుచున్నావు? ఈమె ఈ ప్రయత్నమంతయు భర్తృవశీకరణార్థము గాదా?

చారు: వశీకరింపకొనునుగాక! దీనమాత్రము నీకేమి కష్టము వాటిల్లినది?

దురా: దినములు సెల్లె నెన్నియో! మ
దీయ తనూజ స్వభర్తృగేహమున్
జని యది స్వీయచారుగుణ
జాలముచేఁ బతివశ్యుఁ జేయఁ బో
వ నతఁడు తల్లి కక్కకును
వశ్యుడుగానయి దానిఁ జూడఁ డో
వనిత! యిఁకెట్లు నా సుతుని
భార్యవశంవదుగాఁ దలంచెదన్.

చారు: (స్వగతము) పాతకురాండ్రకెల్ల నిట్లే నిష్కారణముగఁ గోడలియందు వైరము (ప్రకాశముగా) ఆఁ, తరువాత?

దురా: ఇంకొక్కటి యాకర్ణింపుము.

చిర సమాగత జామాతృ చిత్తప్రీతి
కొఱకుఁ దెచ్చిన చిక్కని పెఱుగు నిది త
దీయ పతికిని వడ్డన చేయుచుండు
నేను జెప్పని పెత్తన మేలఁ దనకు?

చారు: నీ మాటలలోని 'పతికిని' అను సముచ్చయార్థకముచే నల్లునకు వడ్డించినపిదప మిగిలిన పెఱుగు ని [illegible]నకు వేసినదనియే యవగతమగుచున్నది. ఇందుఁగల దోషమేమి?

దురా: నీవు సరిగా నవధరించుటలేదు. చెప్పితిని గదా. 'యేను జెప్పని పెత్తనమేల?' యని.

చారు: ఆఁ, తరువాత—

దురా: మఱియొక్కటి యాకర్ణింపుము.

హృద్యము, గవాక్షసంచరన్మృదుపవన మ
నోహరంబగు గది నా తనూజ కొఱకు
నాయితము సేయఁ దాన మున్నధివసించి,
భర్తతోఁగూడి రాత్రులఁ బవ్వళించు.

చారు - అది నీ తనయునకు నియతముగ నేర్పఱుపఁబడిన శయనాగార మేమో!

దురా: అగుఁగాక! మాననీయుఁడగు నల్లుఁడేతెంచినవాఁడు వీఁడు బయట నెచ్చటనో యొకచోటఁ బరుండు టుచితము గదా! ఐనను వాని యందేమి దోషము గలదు? ఈ దుష్టురాలు నన్నతో సితని నాహ్వానించి యటకేఁగును.

చారు మఱియొక సుందరశయనీయ మున్నది గదా!

దురా పోఁ జాలు. దానినే గద నా కూతునకు శయనీయముగ నిర్దేశించితిని

చారు: వయస్యా! కోపగింపనిచో నొక్క మాటఁ జెప్పెదను.

దురా: ఆఁ, చెప్పుము.

చారు: వధువు సుందర గృహమందు భర్తతోడ
మించు తృప్తిని రతుల సుఖించునేని
పౌత్రుఁ డుదయించు, సద్గుణ వంతుఁ డతఁడ
తలఁపఁగాఁ దమ యన్వయోద్ధర్తగాఁడె!

దురా: (కోపముతో) ఏమి వదరుచున్నావు?

పుత్రిక కింకను లేరఁట
పుత్రులు కోడలు గనంగఁ బుత్రుల వెటు నా
నేత్రంబులతోఁ జూతు వి
చిత్రములగు మాటలను వచించెద వేలా?

చారు: అందుకే పుత్రుని ధర్మ్యమగు భార్యాసంగమమునుండి వేరు చేయుచున్నావా యేమి?

దురా: అందులకుఁ గాదు.

అవిరత దార సంగతి మ
హోరుజ నొందును బూరుషుండుఁ దా
న విగత లజ్జయై సతి య
నంత మదాన్విత యౌచుఁ దా
పవమతిఁ జూచు నెల్లపుడు
నత్తను మామను సైత మంచు నే
మ విఘటనం బొనర్తును ద
మాభవు దారసమాగమంబుఁన్.

చారు: నీ జామాతకు సైతము సంతతాంగనాసంగమమువలన మహోరుజ ప్రాప్తింపవచ్చును. అట్లుండ నీ యట్టిస్త్రీ జామాతృ దారసంగమం బెట్లభిలషించును?

దురా ఏల నప్రస్తుత ప్రసంగ మారంభింతువు?

చారు: (చిఱునగవుతో) ఆఁ, తరువాత!

దురా: మఱియు,

తండ్రియో, సోదరుఁడో రాఁగఁ దత్పరయయి
సరభసంబుగ భక్ష్యభోజ్యములఁ జేసి
యంచిత మృదువాక్కులాడి వడ్డించునపుడు
ముఖము వికసించు, వారేగ ముకుళితమగు.

చారు: ఈయది కులసతులకెల్లఁ బ్రకృతి సహజము గాదా?

దురా: నా కూతురట్లు గాదు.

చారు: అంతకంటె రెండాకు లెక్కువే యనుము. తరువాత?

దురా: సఖీ! వినుము నాకుఁగల యొక బాధాకారణము.

ఓం: తత్: సత్:

స్సుఖ జీవిత సేవ

"సిద్ధ ఔషధ మహిమ"

సిద్ధుల సాటిలేని మహిమకు ఒక తార్కాణము



కే. టి. కృష్ణమూర్తి ఆచ్చారిగారి

"మేల్ మాయిల్ మందు"

(Regd.)

దీర్ఘకాల చర్మరోగములకు చక్కని నివారిణి

వెల్లరంగు, ఎఱ్ఱరంగు పొడలు, దద్దులు, పొట్లు, గజ్జి, (చర్మసంబంధము) పొడలుగల చోట్లలో తిమ్మిర్లు, సూదితో పొడిచినప్పుడు నొప్పి లేకుండుట, నిప్పువడి బొబ్బలు గలిగిన తెలియకుండుట, దుర్నీరు సర్వ అవయవములందు వ్యాపించి, రక్తములో కలిసి మత్తు కలుగజేయుట, (నరముల సంబంధము) వేళ్ళ్ళు ముడుచుకొనుట, బొబ్బలు లేచుట, ముక్కు బంధనములు, పాదమునందు వల్లవుపుండ్లు ఏర్పడుట, కాలు చేతులు వ్రేళ్ళు తగ్గుట, ముక్కు పొట్టపడుట, చూచుటకు వినుగు పుట్టించు రణములు (అస్థి సంబంధము) వీటికి ఉత్తమ నివారిణి.

1 మండలం (40 రోజులు) నూనె, లేహ్యము · రు. 11/— తపాల ఖర్చు రు 2-50

8 ఔన్సుల శ్రీ పరమాత్మ తైలం రు. 5/— తపాల ఖర్చు రు. 2/—

పూర్తి వివరములకు వ్రాయండి:

సిద్ధ డాక్టర్ K. T. కృష్ణమూర్తి ఆచ్చారి & సన్స్,

5/22, మేల్‌మాయిల్ P. O. (N. A. Dt.)

అహరహము న్భజించు నుగు
ణాన్విత మత్సుత నెల్లవేళలన్
బ్రహరణసేయఁ దత్పతి స్వ
మాతృ దురుక్తుల నాలకించి, ప్ర
త్యహమును దోడికోడలు దు
రాశయయై, స్వననాంద్రయుక్తయై
సహనములేక దూరునఁట
చాలదె నా కిది బాధఁ గూర్పఁగన్.

చారు : తోడికోడలు దురాశయ యైనచో ననాంద దాని వశమగు టెట్లు?

కోడండ్రకు భువిలోఁ దమ
యాడపడుచులకును వైర మనుటయు మఱియా
చేడియల తల్లులకునుం
గూడ విరోధమనుట తమకుం దెలియనిదా?

కనుక కోడండ్రపై వారి యాడపడుచులకుఁ బ్రేమ గలుగుట వారి సద్గుణములపైనే యాధారపడియుండును అట్లే వారియందు వీరికిని.

దురా : యుక్తముగాఁ బల్కితివి. నా కోడలు దుర్గుణురాలగుట చేతనే గదా నా కూతునకు దానియందుఁ బ్రేమ జనించుటలేదు.

చారు. తద్విపరీతముగఁ గూడఁ జెప్పవచ్చును.

దురా. ఏమనుచున్నావు?—దాని దుర్గుణముల నాలకింపుము.

పతి గృహంబునుండివచ్చిన నా సుతన్
ఆనతంబుఁజేసి మ్లానముఖము
క్షేమ మడిగి యన్యకృత్యవిరతవలె
వేఁగ గృహములోని కేగు నిద్ది.

చారు· మంచిది కనుకనే నీ కూతు క్షేమ మడిగినది అమె యగుచో భర్తృగృహమునుండి యేతెంచిన యాడపడుచును జూచి, నేను రజస్వల నయితినని తక్షణమే బయలఁ జేరును.

దురా : ఇట్లని నీ వెటు తెలియఁగుదువు?

చారు : నీ గర్భమున జనించుటవలన!

దురా : ఏమీ? నే నట్టిదాననా?

చారు : ఇట్టిదానవుగాకున్న నట్టి వధువు
నేల ద్వేషింతు కరుణావిహీన వగుచు
రూపకులశీలములయందు లోప మామె
యందు వెదకిన మందునకైనఁ గలదె?

దురా అబ్బ! నీకు దానియం దెంత పక్షపాతము! ఇంకను వినుము.

గుణయుతుండగు నా చిన్న కొడుకు నీవు
నైత మెఱుఁగుదు గాదె! యో చారువృత్త!
యిట్టి మఱఁదివిఁజూడ దదెట్టి పాతి
వ్రత్య మనవలె? దాని గర్వంబ గాక!

చారు : అనవరతము తన్నుఁ నిందించునట్టి యా మఱఁదిని—నోర్మిఁ గలది గాన మందిరమునుండి బయటకు గెంటించుట లేదు. అతఁడు—

దుర్ణయుండుపేరు; దుర్గుణంబుల కిక్క;
యిందు లే దొకింత సందియంబు;
వాని దృష్టి గురువు భార్యయందును దుష్ట
మనుటె వాని చెడ్డ తనముఁ దెలుపు.

వాని కోర్కె కనుకూలము గానందున ననంగబాణపరతంత్రుఁడయి, సాధ్వియగు నా తొయ్యలిని నిందానర్హను నిందించును.

పాపకృత్యయైన భ్రాతృ జాయను గాంచి
వారణంబు సేయ వలయు మఱఁది
తానె మదనపీడ్యమానుఁడై వదినెఁ గాం
క్షించునేని యముని పంచ కరుగు.

దురా నీవు దాని దుర్గుణంబులనెల్ల సుగుణంబులుగా నుగ్గడింపుచు, బుద్ధిశూన్యవై వదరుచున్నావు.

చారు : నీ యొక్క దుష్టగుణ సము
దాయంబు సమస్తగ్రామతలివ్యాపింపన్
ఏ యమ్మ యెఱుంగదు కై
కేయి గుణము లట్టి నీదు కృతకగుణంబుల్.

దురా : అయ్యో! ఓసీ దుష్టురాలా! స్నుషావ్యాజమునఁ దలపోరిన విద్వేషిణీ! నీ కారణముగ నా ప్రియసఖిచేతఁ గైకేయివంటి దాన వని యనిపించుకొనవలసెఁ గదా!
(అని తొమ్ముబాదుకుని విలపించును.)

చారు : ఎందులకు విలపింతువు?

భజియింపుము సద్గుణములఁ
ద్యజియింపుము నీదు దుర్గుణౌఘములఁ ద్వదా
త్మజనమ్మి యింక మీఁదట
భుజియించుట దక్క వేఱు పూనిక విడుమీ!

దురా : ఓసీ! దుష్టురాలా! ఏమీ నన్ను దాపి దానివలె నేవతెయో వేసిన పడుపుకూడుఁ దిని జీవింపు మందువా? నే నింత కాలము గృహాధికారిణినై, గృహభారము నెల్లమోసి, యిపుడు దాసీత్వము నవలంబింతునా? చూడు నా చాతుర్యము!

కొలఁది దినంబులలోననె
యిలు నే వెడలంగఁజేసి, యా దుష్టాత్మన్
విలసద్గుణవతి నొక కో
మలిఁ గూర్తు మదీయ తనయ మానసచోరన్.

చారు· పిదప వచ్చినది మొదటి కోడలినే సాధూకరించును. ప్రౌఢయగు నీ తరుణిని వదలి మఱియొకదానిని జూచినచోఁ దరుణుఁడగు నీ తనయుఁడు దానికిఁ దారుణ్యము గల్గునంతవఱకు బ్రహ్మచర్యక్లేశము ననుభవింపవలసియుండును.

దురా. నేను వాని కట్నిక్ష్యముఁ గల్గుట సహింతునా? వెల వెలంది వాకదాని గతనికి గొనితెంతును

చారు: (తనలో) అహా! దురాత్ములగు నత్తలు అధర్మ్యమగు వెలవెలంది పొందును స్త్రైతము కుమారున కంగీకరింతురుగాని, ధర్మ్యమగు వాలుపొందు నంగీకరింపరు గదా! (ప్రకాశముగా) ఇన్నిమాటలతో నేమి? నా మాటల నంగీకరింపనిచో నీ కుమారునకు స్త్రైతము నీ యందు వైముఖ్యము జనించును. కీర్తితోనో, యపకీర్తితోనో వరించుము. (నిష్క్రమించును)

దురా (ఎదుటఁ జూచి) ఇదిగో నా తనయుఁడు వచ్చుచున్నాఁడు. ఇపుడు దొంగయేడు పేడ్వవలెను. (అని విలపించును)

(అంత 'సుగుణుఁ'డను పుత్రుఁడు ప్రవేశించును)

సుగు: అమ్మా! ఏల యేడ్చుచున్నావు?

దురా: నాయనా! యేఁదుల కడిగెదవు? నీ భార్య దౌష్ట్యంగినచో నీ యం దది వైముఖ్యము వహించును.

సుగు: చెప్పుము చెప్పుము.

దురా:
మిపుల యత్నంబుసేసి నే నెంతె నీకుఁ
గూర్చితిని దెచ్చి యెటనుండొ గుణవతియని
అట్టి దీనాఁడు నను లక్ష్యపెట్ట కెప్పు డ
వజ్ఞ యొనరించు గేహాధిపత్యకాంక్ష.

సుగు: అమ్మా! 'తల్లు లందఱును కుమారునకయి యెట నుండియో యొకానొక కన్యకను దెచ్చి కూర్తు' రనునది చాలకాలమునుండి, యంద తెలిసిన మార్గమే! ఆ విధముగాఁ గొనిరాఁబడిన యది క్రమముగా గేహాధికారిణి యగుటయు సకల లోక విదితమే!

దురా: ఓరీ మూర్ఖుఁడా! నేను జీవించియుండఁగా దాని కాధిపత్య మెటు లబ్బునురా?

సుగు. అమ్మా!.

మతిమంతులైన మాతా
పితరులు వార్ధకమునందు విశ్రాన్త్యర్థం
బతి శీఘ్రముగా భారము
సుతస్నుషల తలల నుంచి చూడఁగ వలయున్.

దురా: హాఁ! అమాయకుఁడా! గృహాధిపత్యమును నీ భార్యకుఁ గట్టఁ బెట్టి దానిచే సమస్తమును నీ బావమఱఁదులపాలుఁ జేయింపఁదలఁచుచున్నావా? వినుము.

నీ వొసంగిన చనువున నమ్మించి యామె
ప్రతిదిన మనేక పాత్రముల్ పగులఁ గొట్టు.
ధనము దొంగిలించి తనదు తండ్రి యూరుఁ
జేర్చుచుండును నన్ను లక్షింప దెపుడు.

సుగు. అమ్మా! గృహ నిర్వహణ భారమంతయును దాని తలపైవే యుంచినచో నిట్టి నెక్కానికిఁగూడ నివ్వదని నా విశ్వాసము.

దురా. అయ్యో! మందబుద్ధీ! దాని మంత్ర తంత్రములచే మోహితుఁడవై దాని వశవర్తివైతివి.

సుగు: అమ్మా!

సతియె సుగుణయైనఁ బతిదాని వశమౌను
దలఁప మంత్ర తంత్ర తతి యదేల?
ఇట్లు కానియెడల వేల నా భగినీ వ
శంబుగాఁడు నాదు స్యాలకుండు?

దురా: ఓరీ మూర్ఖుఁడా! ఏమి వాగుచున్నావు? నీ భార్యవలె నా కూతురు స్త్రైతము మంత్ర తంత్ర ప్రయోగము భర్తపైఁ జేసినచో వశుఁడగునేమో! కాని యది యనుచితమని తలంచి, పాప మది స్వీయగుణ సముదాయము చేతనే యాతని నారాధించుచున్నది. అతఁడు మాత్రము దాని కనుకూలుఁ డగుట లేదు. నీవలె నతఁడును, భార్యావశంవదుఁ డగుచో, నిశ్చింతచిత్తనై యెవ్వరితోను మాటనైనఁ బలుకకుండెడి దానను.

సుగు. అమ్మా!

జామాత నీ తనూజను
ప్రేమంబునఁ జూడఁడని యపేతకరుణవై
యేమియు నెఱుఁగని కోడలి
పై మిక్కిలి ద్వేషమూన ఫల మేమమ్మా!

దురా: ఓరోరీ! యేదో చెప్పి నా మాటను గప్పివేయఁ జూచుచున్నావా? వినుము.

ఆమె పిత దుష్టుఁడని జగత్ఖ్యాతిఁ గాంచెఁ
దల్లి దుర్మతియని లోకమెల్ల నెఱుఁగు
నన్న విటుఁడు, భగిని లంజ, యట్టి నీదు
భార్య కుల మెఱుంగవుర యర్భకుండవౌట.

సుగు: అమ్మా! నీ కుమార్తె యత్తకూడ కోపించినచో దాని నిట్లే గర్హించుచుండనోపు. అయినను సర్వము పర్యాలోచించి నీవే స్వయముగా నా కొఱకుఁ దెచ్చిన దీనిని నీ వట్లనఁదగదు

దురా: ఇందు నేఁ జేసినదేమి? భార్యావృత్తము పురుష భాగ్యాయత్తము.

సుగు: (తనలో) ఎట్లైనను బెద్దలు సమారాధనీయులుగాన నా తల్లి నోదార్చెదను. (ప్రకాశముగా)

సుగుణయో, దుర్గుణయుతయో యగునుగాక!
కట్టుకున్నట్టి కోడలిం గాదనుదుమె?
కానఁ దప్పుల క్షమియించి, దీని నీదు
సుతను బోలెఁ బ్రేమంబునఁ జూడు మమ్మ!

(అని పాదములకు నమస్కరించును)

దురా. ఛీ, మూర్ఖుఁడా! లెమ్ము, లెమ్ము!! కడుపునఁ బుట్టిన నా కుమార్తెతో సమానమగు స్థానము నెక్కడినుండియో

With the best compliments of




GANGES PRINTING INK FACTORY LIMITED

Calcutta * Bombay * Madras * Delhi



We have pleasure in announcing that this entire UGADI ANNUAL NUMBER was printed with GANGES INKS.

వచ్చిన దుర్మార్గురాలగు నీ భార్య యెట్లు పొందగలదు?

సుగు: అమ్మా! అయినచో నెప్పటినుండియో వచ్చిన యల్లుని యందుఁ గడుపునఁ బుట్టిన వాకంటె వెక్కుడు ప్రేమ నెట్లు ప్రదర్శించుచున్నావు?

దురా: నా యల్లుఁడేమి తప్పొనరించెను?

సుగు: అమ్మా! మున్నొకనాఁడు వేఁ జాటుననుండి వినుచుండ నాకస్మికముగా నీ కూతుపైఁ గోపించిన యల్లుఁడు—'ఓసీ! దాసీ పుత్రికా! వెంటనే నా వెంట బయలుదేరు'మనఁగా విని, చిఱునవ్వు నవ్వుకొంటిని.

దురా: అబద్ధము, 'నేను జాటుననుండి వినుచుండ'నను మాట వట్టి యబద్ధము. భార్య చెప్పినమాటలు నమ్మి మాటలాడుచున్నాను.

సుగు. (తనలో)

ఆత్మ తనయా ప్రణయ పాత్రుఁ డగుట కతన
సజ్జన విగీత మార్గాను సారియైన
యల్లుఁడాడెడు దుర్భాష లెల్ల స్తుతు ల
టంచు నిటువంటి యత్త దలంచుచుండు.

పుత్రి రమణుఁడనుటయె వి
చిత్రపు రాగాంజనంబు ప్రీతి నలదఁ జకున్
నేత్రముఁ జేరి యది జా
మా త్రగుణంబులను సుగుణమతిఁ గనఁజేయున్.

(ప్రకాశముగా) అమ్మా! నీ యల్లుఁడు మంచివాఁడు, కోడలు చెడ్డదే యగుఁగాక! ఇందు నే నేమి చేయవలయునో యాదేశింపుము.

దురా: నీ రమణి నొక చిన్న కుటీరమందు
నుంచి నూట బత్తెంబుల నొసఁగ వలయు
ననుదినంబును నా చేతనైన, నాదు
తనయచే నైన, నంతియే దానికింక.

సుగు: (తనలో) అహహ! ఈమెపై నాకుఁగల్గు కోపమును మాతృభక్తి యడ్డగించుచున్నది (ప్రకాశముగా) ఊఁ, తరువాత!

దురా: ఏ యెడ నది నివసించునో
యాయెడ కీవైన నెవ్వరైనను గాసీ
నా యనుమతిఁ బొందరయే
పోయిన, నా ప్రాణములను బోయినయట్లే!

సుగు. అమ్మా! యిటు లొనర్చుటచే నీ కేమి ప్రయోజనము?

దురా. వల్లభ సహితయై నీదు భగిని యిటకు
వచ్చి నివసించు నెల్లప్పుడు; వార్ధకమున
నున్న మాకు శుశ్రూషఁ జేయును ద్వితీయ
పితకు నీవు, నాకు నదియుఁ బ్రియులు గారె!

సుగు. అమ్మా! కోడలు నీ కూతుఁన కే మప్రియము గావించినది?

దురా. నీ భార్య దుశ్చేష్టితమును నీ వెఱుంగవు!

నవభూషణ తతిచేతఁ ద
మను భూషించుకొను—మత్తనుజఁ గని యీర్ష్యా వ
శ వగుచు నది తిను భక్ష్యము
ల విచిత్రముగాఁ గనుఁ గుటిల భ్రూకుటియై.

సుగు: అమ్మా! అట్లే చేయుటకుఁ బ్రయత్నింతును. అది యంగీకరింపనిచో నేనేమి చేయఁగలను?

దురా: పది నెలలు గర్భమందునఁ
బదిలముగా నిన్ను మోపి ప్రసవించితి నా
మదిలోని కోర్కెల న్నీ
వొదవింపనియెడల విషమె యాహారట యొసఁగన్.

సుగు. తండ్రి యాజ్ఞానుసార మాచరింతును.

దురా: ఆ ముదుసలి స్నుషావంచితుఁడగుట నా ప్రాణములను నైత మపేక్షించుటలేదు ఇక నేను నీ యెదుట నుండను. (అని నిష్క్రమించును)

సుగు (ఎదుటఁ జూచి) ఇదిగో నా ప్రియురా లిటే వచ్చుచున్నది. ఈమె—

శ్వశ్రూదురుక్తుల నితాం
తశ్రాంత మనస్కయగుచు నా వాక్సుధలన్
విశ్రాంతి నొందును దదీ
యశ్రమ నాకుం దెలుపుటకై వెదకుఁ దఱిన్.

(అంత 'సచ్చరిత్ర'యను పేరుగల 'కోడలు' ప్రవేశించును)

సచ్చ: (తనలో)

మాతృభాషణ నిర్బధ్యమానహృదయుఁ
డై మదీయప్రియుండు నాకై తపించు!
నొకట మాతృభక్తియును నింకొకట దార
రాగ మాతని నిఱువంక లాగుచుండు.

సుగు: ప్రియురాలా! ఏమి యిటు వచ్చితివి?

సచ్చ. నాథ! ఏదో చెప్పఁదలఁచియుఁ గొంకుచున్నాను.

సుగు: నిజముఁ జెప్పుటకుఁ గొంకేల? చెప్పుము

సచ్చ: ఎంతకాలము మన మిట్లు గురుజనుల నిర్బంధమువలన రహస్యముగాఁ గలియవలెను.

మీరు భుజియించి, శయ్యకుఁ జేరఁ జనిన
వెంటనే మీదు జనని యా యింటి గడప
పై శిరమునుంచి యడ్డము పండుకొనును.
ఇంక నేను సమీపించు టెట్లు మిమ్ము?

మఱియు,

అనుదిన మాచరింపఁ దగు
నట్టి యొకానొక కార్యమున్ రయం
బున నొనరింపఁ బూను నను
బూవి వివాదణఁ జేసి, మీరు భో

జన మొనరించి, శయ్యగల
సద్మములోనికిఁ జేర, నప్పు 'డీ
పని యొనరింపు' మంచు నను
బంపుచునుండు దయావిహీనయై.

సుగు : (తనలో)
పౌత్రోత్పత్తి యభీప్సిత
మా త్రిజగద్యోషలకు నసాధ్యము వారల్
చిత్రము! సహింప నోపరు
పుత్రులతోడ వధువులకుఁ బొందు పొసంగన్

సురతము లేకయె గర్భము
ధరింపవలెఁ గోడలంచుఁ దలంచెద రత్తల్
పెరుగవలెఁ దిండిలేకయె
శరీర పుష్టి యనునట్టి సామెత గాదే!

ఎవతె యారోగ్యము నిజాత్మ భవుని సుఖము
కోరకో, యద్దాని సుఖమును గోర దెపుడు
పరుని సుఖములకెల్ల నాస్పదమగు సుత
తనువుఁ బోషించు మాయమ్మ తత్పరయయి.

(ప్రకాశముగ) సుమంగళీ! నా జననిపై దోషము నారోపించుచున్నావు!

సచ్చ ఆర్యపుత్ర! దోషము నారోపించుట లేదు. నాయం దత్తగారు చూపు వైముఖ్యమునంతయుఁ జెప్పఁ గొంకుచున్నాను.

అల్లుఁడేగుదెంచు టన్న మా యత్తకు
నొక్క గొప్పనైన యుత్సవంబు
అదియుఁ బెక్కుమారులగుఁ గాక నాకుఁ ద్వ
త్సంగ భంగములను సల్పుకున్న.

మఱియును,

జామాత్రాగమనంబులో ధవళ వ
స్త్రంబుల్ మహార్హంబులున్
స్వామీ! శయ్యకమర్ప యోగ్యములు,
మేజా చెక్కలే యింధనా
ల్గా మాఱున్ మఱి పీఁగడల్ పెఱుఁగు లే
క్కాపక్క లేకుండు, నా
జ్యామోదం బఖిలాశల న్విరివిగా
వ్యాపించు చుండుం గదా!

సుగు : అనాయకురాలా! నీవును అల్లుఁడను దుష్టగ్రహ మావేశింప నట్లే యగుదువు.

సచ్చ : నిర్హేతుకముగ శ్వశ్రూ
గర్హణమును బొందకుండఁ గల్గిన నీ ఖ
ర్చర్హ మనర్హమనక ధన
నిర్హరణంబయినఁ జింత నేఁ జేయఁ జువా!

సుగు : ఓసీ! మందబుద్ధీ! ఏ మనుచున్నావు? వ్యర్థముగ నీకై నా తల్లిని ద్వేషింపఁజాలను.

సచ్చ : నాథ! నేను మీ తల్లిని ద్వేషింపుఁడని మిమ్ముఁ గోరుట లేదు. తనయులకు తల్లి ప్రథమ దైవము గదా!

గురుజనుల వలని బాధల
భరియింపఁగ రానివయిన, భరియించెద; నే
భరియింపఁజాల మీరును
దరిజేరక మాతృవాక్య తత్పరు లగుచో!

సుగు : (తనలో) సచ్చరిత్రయను దీని నామధేయము సార్థకము.

అలు దుర్గుణురాలైన యత్తవలని
బాధ యించుక గల్గినఁ బతినిఁ జేరి
'విషముఁ ద్రావుదు నేను బావినిఁ బడుదును
జనని నీవు వదలకున్న'నని వచించు.

(ప్రకాశముగా) భద్రా! నీకు నాపైఁ బ్రేమానుబంధమున్నచో నన్నియు నోర్చుకొనవలయును.

సచ్చ అన్నియు నోర్చుకొందును. నాకు మీ ప్రేమయే కావలసినది.

సుగు : (దూరమునఁ జూచి) నాయనగారిటు వచ్చుచున్నారు. కానీ నీ వింకఁ బొమ్ము.

సచ్చ : అట్లే! (అని నిష్క్రమించి, మరలఁ బ్రవేశించి యొకచోఁ గనఁబడకుండ నిలుచును)

(అంతలో సుశీలుఁడు ప్రవేశించును)

సుశీ : (తనలో) అయ్యో! బుద్ధిహీనురాలగు నా భార్య యెల్లవేళల నిష్కారణముగఁ గోడలిని ద్వేషించుచుండునే యను విచారము న న్ననవరతము వ్యాకులపఱచుచున్నది.

సుగు : (సమీపించి, నమస్కరించి) తండ్రీ! ఏమి. మ్లానవదనుఁడవై చింతించుచున్నావు?

సుశీ : వత్స!

అర్ధాంగియెగాక సుతుని
యర్ధాత్మయునైన కోడ లనఁబడు దానిన్
స్పర్ధించు నత్తలకు నది
వార్ధకమున సేవఁజేయ వాంఛించునొకో!

సుగు : కోడలి శీలము మంచిదైనచో దానియందుఁ గూతునందువలెఁ బ్రేమఁ జూపఁదగును. కాని యది దుశ్శీలయగుచో —

సుశీ : భాగ్యానుసారమే యోగ్యతా యోగ్యతల్
కోడండ్రలోన నగునని తెలిపి
యత్తమామలచేతఁ గ్రొత్త కోడండ్రు ని
జౌరసాత్మజవలె నరయఁ దగును
గాని యీ దుష్టాత్మ దాని నీర్ష్యాళునై
పీడించి మిక్కిలి పిప్పిఁ జేయు

దుహితృభర్తారు సుతునికంటె నెక్కుడు
గాఁ జూచు వాము మత్కాంత యెపుడుఁ

తే॥ దనుజ కొసఁగిన భూషణ తతికి నెల్ల
నల్లుఁడే యధికారియౌ, నామె భ్రాత
తల్లి దండ్రియు గారు, తద్వ్యయము దీని
కెంతొ సంతోష మొదవించు వింతగాదె!

సచ్చ॥ ఇట్టి తత్వవేదియగు మామగారు నా యదృష్టమువలన లభించిరి.

సుగు : తండ్రీ! స్త్రీ యల్లుండ్రపైఁ దప్పక యిట్టి దృఢ సౌహృదముఁ గలవారుగా నుండవలయును. అతఁడేగదా ప్రాణమునకుఁ బ్రాణమైన కూతురి మంగళసూత్రము

సుశీ . వత్స! కోడలు కుమారుని గార్హస్థ్యమునకుఁ బ్రాణముగాదా?

సుగు : అచ్చటఁ గొంత విశేషము గాన్పించుచున్నది కోడలు గతించినచోఁ గుమారుని గార్హస్థ్యము హతప్రాయమైనను స్నుషాంతర సంపాదనమువే దానినిఁ బునరుజ్జీవింపఁజేయ వీలగును. కాని యల్లుఁడు గతించినచోఁ గూతు మంగళ సూత్రమును మరల సాధింప వలనుపడదు

సుశీ : వత్స!

దార విరహ సంతప్త హృదయుని సుతుని
నూత్న వధువుతోఁ గూర్చి, సంతోష మొంద
నోపుదురె దానిచేత మాతాపితరులు
గత వయస్క భర్త్రాప్తి దుఃఖిత గద యిది.

సుగు : తండ్రీ! వచ్చినది సాధ్వియగుచో వయసుచే ననురూపుఁడగు పతియందు మందానురాగయయ్యు, వృద్ధులగు నత్తమామల సెవింపకుండునా?

సుశీ : వత్స!

అనురూప పత్యనురక్తయౌ పతి
యెంత సాధ్వియైన నెల్లవేళ
లందు మిగులఁ దన్ను నిందించు నత్తమా
మలకు సేవఁజేయఁ దలఁచు టెట్లు?

సుగు : తండ్రీ! పెక్కుమాట లేల? ప్రస్తుత కర్తవ్య మాదేశింపుము.

సుశీ :

గృహమున నెప్పుడయినను గ
లహంబు లొదవఁగఁ గుటుంబ లాభాపేక్షన్
గృహపతి యా కలహపరుల
గృహభేదముఁ జేసియుంచుటే యుచితముగన్.

సుగు : వివాకఁ దోఁచినట్లొనరింపుడు. అట్లయినఁ జాలకాలము నుండి నివసించుచున్న యీ సుందరమందిరమున మా యమ్మయే నివసించుఁగాక!

సుశీ :

భోగంబుల నెల్లను నవ
భోగించియు, వృద్ధయయ్యు బుద్ధిరహిత యౌ
నా గుణహీనకుఁ బాడటు
నాగారమెగాక యందమగు గృహమేలా?

సచ్చ . (తనలో) ఆహా! సుశీలుఁడను మామపే రన్వర్థముఁ కాని యీతని మాట నంగీకరించి నా భర్త తన తల్లి నిలువెడలించినచో భార్యావశుఁడయి తల్లికి ద్రోహ మొనరించుచున్నాఁడని లోకమున గొప్ప యపప్రథ గలుగునేమో!

సుగు : (ఎదుటఁ జూచి) నాయనా! నా చెల్లెలు త్వరితముగా నిట కేతెంచుచున్నది.

సుశీ . ఈమె దుర్గుణములతోఁ దన తల్లిని సైతము మించినది. (అంత దుర్లలిత యను పేరుగల కూతురు వచ్చుచున్నది)

దుర్ల : (ప్రవేశించి, రుద్ధకంఠముతో) తండ్రీ! అన్నా! మీ రిరువురును నా తల్లి నేల యుపేక్షఁ జేయుచున్నారు? ఆమెకు మీరే గదా గతి!

సుగు : అమ్మాయీ! రేమి యిట్లనుచున్నావు?

దుర్ల

కోడలి దౌష్ట్యము నోర్వఁగ
నోడుచు నశ్రువులు కనుల నురుల నెపుడుఁ దా
నేడుచుటవలన నాయువు
యేడాదియు బ్రదుకజాల దీకనని తోఁచున్.

(అని కన్నీరు నించును)

సుశీ . నీ విచటి కేతెంచుటచేతనే నీ తల్లి కిట్టి గతి.

దుర్ల : తండ్రీ! నీకు శుశ్రూషఁ జేయుటకుఁ గోడ లున్నదనియే నీ కీ గర్వము దైవమా! నానింక దిక్కేది?

సుశీ . నీకు నీ పతిమాతయే దిక్కు!

దుర్ల : ఆమెయా? ఆమె నాయందు లేనిపోని దోషముల నారోపించి, నన్ను ద్వేషించుచు, దయావిహీనయై, కొడుకుతో నన్ను వెడలఁ గొట్టించినది అదియు నా తల్లి మనసు నొకవంక బాధించుచున్నది.

సుశీ ఇట్లే తాను గోడలిని బెట్టు బాధలన్నియు నామె తల్లి మనంబునకు బాధ కలిగించునని నీ తల్లికేలఁ దెలియుట లేదు?

దుర్ల కోడలు చెప్పినమాటలు విన్నిట్లు మాటలాడించుచున్నవి. అయినను నీ వామె మాటలు విని తీరవలసినదే! ఏలన,

ఎవతె శరీరం బంతయు
సువర్ణ రత్నాభరణ సుశోభితము మహా
ర్ఘ వసనశోభి, యది పలుక
నెవరైనను వినక తప్పునే యిద్ధరణిన్.

సుశీ . నీ శరీరమును రాళ్లతో నలంకరించితివా? లేక చినిగిన వస్త్రములతోనా? ఆహా! స్త్రీల కైశ్వర్యములం దెంత యత్నాప్తి!

ధనమిది వసనములకు, భా
జనముల కిది, యాభరణ విషయమై యిది: నా
కని దుహితలెల్లఁ బైతృక
ధనమును గొనుచుండ్రు పతి పదనముం జేర్పన్.

మేరువు నొసంగినఁ దత్పు
త్త్రీకారార్థంబుగఁ గొంత తప్పదు సుతకున్
వారత్యంతాతృప్తి వి
చారింప రనుజుల కష్ట సౌఖ్యము లెపుడున్.

అది యట్లుండ నిది మిక్కిలి కష్టము.

మామ ధన మెల్లఁగొని తమ
సామీప్యముఁ జేరవచ్చు సతులంగని యా
జామాత నింద సేయును
'ఏమిచ్చెను నీదుతండ్రి? యిదియా!' యనచున్.

సచ్చ : (తనలో) మామగా రనుభవ పూర్వకముగఁ జెప్పుచున్నారు.

దుర్గ : అన్నా! నాయనగా రన్నది వట్టి యబద్ధమే! నీ వెన్నఁడును వదిన నట్లు కోపింపలేదే!

సుగు . (చిరునగవుతోఁ దూష్ణీంభావము వహించును)

సుశీ : బిడ్డా! దుర్మార్గులగు బిడ్డ యల్లుండ్ర సంగతి నిప్పుడు ప్రస్తావించితిని.

సుత సుగుణయైనచోఁ దన
పిత యొసఁగిన దానితోడఁ బ్రీతిం జెందున్
పతి సుగుణుఁడైనచోఁ దన
సతి పితరులఁ దృప్తితోడ సన్మానించున్.

సుగు : అమ్మాయీ! ఇన్నిమాటలతో నేమి? అమ్మ ఏమనుచున్నది?

దుర్గ : 'ఈ కోడలితోఁబాటు నే నుండలేను' అని.

సచ్చ. (తనలో) దైవవశమున నా కోర్కె ననుసరించియే మా యత్త మాటలాడుచున్నది. ఎట్లన—

పూరి గుడిసెనైనఁ గారడవులనైన
నుండవచ్చు; గంజి యుప్పులేక
త్రాగవచ్చు; సౌధమేల సుభోజనం
బేల గొప్పకలహ మింటనుండ?

సుగు : సోదరీ! మీ వదినె నేదే నొక యితర గృహమందు నివసింపఁజేయుదము.

దుర్గ. అమ్మ యభిలాషయు నదియే.

సుశీ : (క్రోధముతో) దురాశ యభిలషించిన ట్లెప్పుడును జేయను. మఱియు నది,

అశనమునకుఁ దగినయన్ని ధాన్యము లిత్తు
నెలకు నొక్కమాటు నేన కొలిచి
వానిఁగొనుచు నుదర భరణంబు సేయుచు
నింక నుండుగాక యొచటనైన.

దుర్గ : ఇఁకవిూఁద నా రాకగాని, నేను దల్లితోఁగూడి నివసించుట గాని నీ కిష్టము లేదని స్పష్టమగుచున్నది. ఆమె యుదర పోషణ పర్యాప్తమగు ధాన్యమును మాత్ర మిచ్చెదనంటివి గదా!

సుశీ : పతి గృహవాస శ్రాన్తి నొందుచున్న నీవు పలుమార్లిచటికేతెంచి మీ యన్నతోఁబాటు నివసించుచుఁ దత్పరిహారము నొందుచుండుము.

దుర్గ : ఆఁ! దుష్టాత్మురాలా! నాకుఁ గల్గిన యట్టి బాధ కిది

పరిహారక మెట్లగును? తల్లిలేని యీ యింట నెవతెయైనా వండి పడవేసిన కూడు గతుకవలసినదే గదా!

సుశీ : నీ వట్లు భావించినచో వచ్చినపుడెల్లఁ దల్లితోఁబాటే యొచ్చోటనైన నుండుము ఆ దినములలో నీకై కొంచెమెక్కువ ధాన్యమొసఁగెదను.

దుర్గ ఏమీ? నేనేమి దాసీదాన ననుకొనుచున్నావా?

సుగు . సోదరీ!

ఎంత యర్థమ్ము నొసఁగ మీ యిరువురకును
జీవితాంతము దిన సరిపోవు నంత
యర్థ మొసఁగుదు మీఁక దాని వ్యర్థపరుప
కిరువురును యథేచ్ఛగ వసియింపవచ్చు

దుర్గ : (తనలో) ఇది నాకుఁ గొంత మేలు కల్గింపవచ్చును. ఎట్లన, నాకే మారిచ్చిన ధనమును గొలఁదిగా ఖర్చు పెట్టుచు మిగిలిన ధనముతో నమ్మ నాకు భూషణములు చేయింపఁగలదు (ప్రకాశముగ) ఆర్య! నీ మాటమీఁద నాదరమునుంచి యట్లే తల్లి నొప్పింపఁ బ్రయత్నింతును.

సుగు. సోదరీ! యామె మనసును నొప్పింపవలదు. గురుజనుల కిష్టమైన విధముగనే యాచరింపఁ దలఁచితిని

(దుర్గలిత సత్వరముగఁ బోయి మరలఁ దల్లితోఁ బాటు ప్రవేశించి, యపవారించి—)

దుర్గ : అమ్మా! నా మాటఁ గాదనకు. ఈ యేర్పాటంతయును మన కనుకూలమయినదే!

దురా . (అపవారించి) అమ్మాయీ! మొదట నీ యేర్పాటు నంగీకరింపని దానివలె నటించెదను నీకై కొంత ధనమును సంపాదించుట కిదియే సమయము.

సుశీ . (తలను వంచుకొని యుండును)

సుగు : అమ్మా!

దురా. ఛీ! మూర్ఖుఁడా! నన్నిఁక 'అమ్మ' అనవలదు.

ఉదయము మొదలుగ నీ సతి
త్వదంతికమునం దనవరతము నేమంత్రం
బు దవిలి జపించె నదియును
నిదిగో ఫలియించె మీకుఁ దృప్తి జనింపన్.

సుగు : అమ్మా! నాపైఁ గినియకుము. ఈ యేర్పాటంతయు నాయనగా రొనరించినదే.

సచ్చ : (తనలో) దైవమా! నా భర్తను మాతృశాప పాత్రునిగాఁ జేయకుము.

దురా : అయ్యో! ఈ దుష్టురాలు చాతుర్యముతో నా పతిని గూడ వశము చేసుకొన్నదే!

సుశీ . ఓసీ! ముండా! ఆమె సద్గుణము లేసజ్జనునైన వశము చేసుకొనఁజాలును.

దురా : ముది మది దప్పిన జనకుఁడు
పదరిన సంబంధహీనవాక్యము లెల్లన్

ఎదురాడక నేడలం దా
ల్చెద నను వాం దెలిసె నీదు చెట్టతనంబున్.

సుశీ: పోయిన ప్రాయమును మరల
మాయలతోం బొంది నీవు మతిమతి వౌటన్
మాయం వెఱుంగని స్నుషపయి న
నూయ విలువెడలుదు దొంగ శోకంబుంతోన్.

దురా. జరగుండా! నీవు బయటకు వెడలుము. నే వెడలుదానంగాను.

దుర్మ: (ఆలకించి) అమ్మా! మరచితివా? నాకై యేదేని యడుగుట కిదే సమయము.

దురా: ఓరీ! దురాత్ముండా! సచ్చరిత్రాదాస! తల్లి నిల్లు వెడలించుటవలనసగు నవశేయంబునకు భాజనము గమ్ము. వెడలిపోయెదను. నీ పత్నీమనోరథము సఫలమగుగాక!

కంటివలెం బెంచినట్టి పూవంటి బిడ్డ
కంటికింపైన సొమ్ములం గానదీమె
కాన సౌవర్ణమైన మేఖలయు మణి మ
యాంగదములం జేయించి యొసంగవలయు.

సుగు అమ్మా! నీ మాటం జవదాటను.

సుశీ: పాపిష్ఠిదాన! ధనమంతయుం గూతున కిప్పించి కొడుకును దరిద్రునిగం జేయంగోరుచున్నావు

దురా. జరగుండా! బిడ్డ యానందము నేల చూడలేకున్నావు?
ఇంతింత భూషణంబుల
వింత సొగసు లొలుక మేను, వికసిత ముఖియై
చెంతం జేరంగం గూతురు
సంతోషము నందుచారె సత్పురుషు లిలన్.

సుశీ: కూతురనుపేరి మూషిక మాతృవక్త్ర
మనెడు భయహారి బిలమార్గ మమరకున్న
పుట్టినింటినుండి యెటుల మెట్టినింటి
కించుకించుక ధనము హరించు నకట!

సచ్చ: (దూరమున నవలోకించి, తనలో) అత్తగారి స్నేహితురాలు వచ్చుచున్నది పాప మీమెసె నాపై దయగలది.

చారు: (ప్రవేశించి) సఖీ! ఏమి యాలోచించుచున్నారు?

దురా. ఆలోచింపవలసిన దేమున్నది?
శిశుత మొదలుగ నా చేతం జేయి సేర్చి
చెలిమితోడం బ్రియంబుగా మెలంగునట్టి
నిన్ను సైతము నా స్నుష సేర్పున వశ
మొనరుచుటెగాక నాపై నపోహం గొలిపె.

నీ కామెపై నంత స్నేహము గల్గుటకుం గారణము నూహింపలేకున్నాను.

చారు: ఆమె సద్గుణములే కారణముగాని వేఱుగాదు. 'విశుద్ధాత్మన్ద్ధానాం ధ్రువ మనభిసంధి ప్రణయినీః' అని గదా నానుడి!

దురా: నన్ను నిందించుచు దానిని స్తుతించుచున్నావు, గాన నీవు సైత మచిరకాలమునే నావలెం గోడలిచే వెడల నడపం బడుదువుగాక! (అని మెటికలు విఱుచును)

మశీ. ఓసీ! చండికా! కోడలిచే వెడలింపం బడితి నన్నచో దండముతోం బ్రహరింతును. 'నా దుర్గుణములే నన్నింత పని చేసిన' వనుము.

దురా. జరగుడా! స్నుషావంచితుండవై ఏమి వదరుచున్నావు?

సుశీ: (దండమును దీసికొనును.)

సుగు (తండ్రిని వారించును.)

దురా ఓరీ! దుర్మార్గుండా! నా కూతురి భూషణముల విషయమున నేమి సమాధానము?

సుగు: అయాభరణములకుం దగిన ధనము నిప్పుడే యొసంగెదను.
(అని పాదములపైం బడును)

చారు· (స్తంభము చాటుననున్న సచ్చరిత్రను రమ్మని సంజ్ఞ చేయును.)

సచ్చ· (సమీపించును.)

చారు అమ్మా మీ అత్తగారికి నమస్కరింపుము.

సచ్చ· (అట్లొనర్చును.)

దురా (ముఖము ప్రక్కకుం ద్రిప్పికొనును.)

చారు. సఖీ! అచిరకాలమున గుణవినయ సంపన్నుండగు తనయుని బొందుమని నమస్కరించుచున్న కోడలి నాశీర్వదింపుము.

దురా· (స్వగతము) ఎట్లైన నేమి కూతున కాభరణంబులు చేయించుటకుం జాల ధనము వెంటనే లభించును. (ప్రకాశముగ) అమ్మాయీ! పోదము పద. (అని కూతుతోంబాటు నిష్క్రమించును)

చారు: అమ్మాయీ! యింకను నీకేమి ప్రియ మొనరింతును?.

సచ్చ: దైవవశమున మాయత్త దీవనలకు
బదులుగా శపియింపక వదలి నన్ను
సరిగెనో యమ్మ నీ యుపాయంబు కతన
వింతకంటె నపేక్షితం బేమి గలుగు?
అయిన నిట్లగుగాక!

(భరత వాక్యము)

పద్మనాభ పాద జలజ భక్తి ప్రజల
హృదయములలోనం బుట్టి యాపదలం ద్రోచి
సంతతము సంపదలంగూర్చి సంతసంబు
నొనరం జేయుత మాచంద్ర దినకరముగ.
మఱియును,
ఈ కేరళ భూమండల
నాక పలికి విప్రభక్తి నశియింపమియున్
లోకేశ్వర పదభక్తియు
నేకాలము నుండుగాత మీశ్వరు కరుణన్.

(ఎల్లరు నిష్క్రమింతురు)

గద్య

ఇది పవన తనయ ప్రసాద వివర్ధమానలగు శ్రీ నగరాజనందన సుందరరాజ కృతులలో స్నుషావిజయంబను దృశ్య ప్రబంధము సమాప్తము.

మహాశంఖారవము

శ్రీ మోటూరి వేంకటరావు

ఎన్నియో మానవాకృతు లిట్టె చిదిగి
రాలిపోవంగ ధూళి, భస్మాలయముగ
ఊరి కొసనున్న మసనంపు దారివెంట
మసలుచుంటి నే నొక మునిమాపువేళ.

దూరతీరాల ఒక మబ్బుతునక దోఁచి
అలసగతి నింగిపైఁ దేలియాడు చెడఁద
సెగలు రగుల సోలుచు మునిచీఁకటులను
చాయగాఁ వ్రాలుచును మటుమాయమయ్యె.

సొరగిపోవు పలుచని వెల్గుతెరల వెనుక వెఱపు గలిగించు తెఱఁగున వెల్విరిసి
ఇరులు నర్తించె నిశ్శబ్ద సరణి, ధరణి అదరి బెదర రహఃకంపనాంకురముల.

బ్రతుకు వెంబడిఁ జావుగాఁ బగలు వెనుకఁ
గ్రమ్ముకొనివచ్చు సందెచీఁకటిఁ గలంగి
తలఁపు లెవియొ యెడందలో అలలు గాఁగ
ఉగ్రరుద్రస్థలి గమించుచుంటి, నంత.

నా నడతెంచు త్రోవఁ గఠినమ్ముగ అంఘ్రితలమ్ము సోఁకి యే
దో నగి లట్టులయ్యె; నిబిడోచ్ఛ్రయసితమ్ములు వాఱి నేల ధూ
ళీనిచయమ్ముఁ జూచితి; మలీమస సాంద్ర పరాగశయ్యపైఁ
గానఁబడెం గనుంగవకుఁ గశ్మల శుష్కకపాల మొండటన్

చివికి జీర్ణిల్లియున్న నీరవ కపాల
మట్లు నా దృక్కులను దాఁకినంతఁ ద్రుళ్ళి
పడియె నాలోని మానవత్వము కరాళ
మానవాస్థి సంస్పర్శనమ్మైన కతన.

చెల్లిపోయిన ఒక నిండు జీవితంపు
స్మృతి శకలమౌచు బుగ్గిలో మృత్యు విలయ
దంష్ట్రికలనుండి గతమును ద్రవ్వుకొనుచుఁ
బోదిసేసెడు లీల ఆ పుఱియ గ్రాలె.

శ్రీకళాకాంతు లింకిన శిథిల శల్య గుహలు — కనుగూఁడ్లు — ఈనాఁడు గూడ విరిసి
విశ్వగర్భిత వేదనా విచలితోర్మి యొకటి తళ్కున నా చూపు లొరసి యురలె.

* * *

అధర సుషమ, రదనదీప్తి ఆరిపోవ,
వదన మస్థి శూన్య కుహర వాటియయ్యె

యుగ యుగాల భవచరిత్ర దీర్చుకొంచు
వగ వెలార్చు నగవు చిల్కు పల్కు నిట్లు.

"పగిలిన మృత్తికా మధుర పాత్రిక ముక్కలు గాఁగఁ దుండమై
తెగి యిటు సుప్త పాంసు వితతిన్ సతతాంధతమో నివాసినై
జగతికి నిత్య సత్య మొక చావె యటంచుఁ దరాలనుండి నె
వ్వగి చిగిరించు చిర్నగవు వల్లరులన్ విరచింతు నే నిటన్.

నా వదనంపు గహ్వరమునన్ వెదచిందు విషాదవహ్ని రే
ఖా విలస ద్దరస్మితముఁ గాంచి, మదీయ విశీర్ణ శల్య రూ
పావిల ధూళిధూసర మయాకృతియుం దిలకించి, అంత భీ
తావహ ముద్ర నీ కనులయం దిడి చూచెద వేల అధ్వగా?

నీవలె దేహినై బ్రతుకనేర్చి యొకానొకనాటి స్వప్న తీ
రావధిలోఁ బ్రపంచమనునట్టి యనిత్య విచిత్ర నృత్తశా
లా విషయానుభోగ తరళమ్మగు భూమిక సొంతమై చనన్
జా పనునట్కె నిర్గమన సంధ్య బయల్పడు సత్యమైతి నేన్.

నాఁడు త్వగంచితమ్మయిన నా ముఖబింబములో మధూలికా
పీడము గోచరించి నలినీ రుచు లీనఁగఁ దోటి మానవుల్
మూడ సహించి, రా కవచ శోభఁ దొఱంగిన యాస్య మస్థిగా
నేఁడు రజస్సమేత ధరణిం గన భీతిలుఁ బ్రాణికోటియే!

నా యందున్ గనలేవు నీ దయిన ప్రాణ జ్యోతి రంతశ్శిఖా
చ్ఛాయాచ్ఛాదితమౌ తనుద్యుతి; విశిష్టం బైన సత్యమ్ముగా
నీయందున్ గనవచ్చు నా దగు రహోహా నిత్యాపరా లౌకికా
ధేయమ్మౌ జడశల్య పంజరము త్వ ద్దేహాంగ నిక్షేపమై,

జగమను ప్రమ్మిదన్ జమురు చాడ్పు రహింపఁగ జీవనమ్ము, హోం
జిగి వెలుఁగొంచు ఆత్మ వికసింపఁ బ్రకాశిలు దివ్వె వీవు —రు
క్పృగతపు వర్తివోలె వసివాడి మహీస్థలి రేణుసంచయ
స్థగితముగాఁగఁ ద్రెళ్లిన యధాయద మానవ శల్య గాథ నేన్.

బ్రతుకు తటిల్లతా క్షణికభంగురమై క్షితి బ్రుంగ, లేశ మి
వ్వితమున శల్య శేషముగ వ్రీలి నిశా లయకారి భేరిపై
వృతినినదమ్ముతో హిమ తమిస్రమునం దణగారి అంధజా
గృతి శ్రుతి గొల్పు నన్నుఁ బరికింప నరుల్ పిఱుదీయుచుందురే!

ప్రాణములేని అస్థి కుహరమ్ము గదా యని యీ శ్మశాన ని
ద్రాణ కపాల ఖండికఁ దిరస్కృతిఁ దన్నకు మోయి ప్రాణి ! వి
జ్ఞానపు ఠీవి భావ కలనా కన దుజ్జ్వల శేముషీ బృహ
త్త్రాణముతో ఒకప్పుడు ధరాతలి మానవ శీర్షమే సుమీ!

ఈ శిర మద్భుతోహలకు నిల్లయి, ముగ్ధరసైక కల్పనా
రాశికి రంగవల్లియయి, త్రాస విషాద విమోహలోభ హే
లా శతకోటి చిత్తగతులన్ గని సోఁకిన తల్లియై, నిది
గ్ధాశల వెల్లియౌచు లయమయ్యెను మృణ్మయ శూన్యవాటికన్.

నా కత క్రొత్తగాదు ; భువనమ్మున సృష్ట్యనుసార మానవా
నీకము సర్వమున్ వెలుఁగు నీడలుగాఁ బ్రభవించి నేల పా
లై కడ కీ యవస్థ లరితాస్థి దళమ్ముగఁ గాటిబూదిలోఁ
జీఁకటి చాలుతోఁ జెలిమి సేసెడు —జీవిత లక్ష్య మింతివే!

నా నలువైపులన్ జిఱు కణాలుగ దూళిని నూలుకొన్న యీ
న్యాన పురాచితాస్థికల యున్కిఁ గనుంగొనుమోయి పాంథ! కా
లానుగుణమ్ముగాఁ దర తరాంతర భూతలసృష్టి శల్య రా
శీ నిభృతమ్ముగా ఇటుఁ గృశించుచు నేల నశించు గాథలే.

ఇటు ఒక రేణువున్ దొలుచు దేని యుగాంతర సుప్రభాతముల్
స్ఫుటముగ విచ్చు ; ఇయ్యెడ సుషుప్త్యణు సంతతిఁ బెల్లగించినన్
దటుకున మృత్యులేఖిని లనంతము లేచి యనాది నుండి వ్ర
త్పుటలి విలీనమైన చరితల్ సికతా తతిపై లిఖించెడిన్.

నీవును రాలిపోయి అవనీరజమం దొక అస్థిమాత్రమై
నా వలె భస్మవేదిక ననారత మృత్యు నిగూహనాప్త ని
ర్జీవ తమస్సమాధి నిదురించెడువేళ అనంత కాల వీ
చీవరణమ్ముపై అరుగు జీవపరంపరఁ గూర్చి నవ్వవే?"

అని తోడ్తో మౌనముగొని,
తనలోఁ జైతన్య మణఁగ, ధాత్రీతల ధూ
ళిని శైథిల్యస్థితి ఆ
పునుక భయదముగను బొరిలెఁ బురికొను ఇరులన్.

* * *

ఆ రజనీ ముఖాంగణము నం దటు ప్రేతవనస్థ భస్మ వీ
థీ రసితాస్థిగాథ వినఁ దీఱఁగ నా మనుజత్వమొక్క ని
ట్టూర్పు వుచ్చి సాగె మరుదుచ్చలితాంబుద లీల, లోన ఏ
వో రవళుల్ చితాగ్ని శిఖలూని ప్రతిధ్వను లీనుచుండగన్.

వెరపో—తత్వ విజ్ఞతయొ— నే నెఱుఁగనట్టి
ఒక్క యనుభూతితో హృది యులికిపడఁగ
అరుగుచుంటి, నా యస్థిపంజరము వికృత
ముగ మహాశంఖ మొత్తుచు ముందు నడువ.

———

నాలుగు - స్వీయచరిత్రలు

శ్రీమతి పుల్లూరి ఉమ

ఆంధ్ర వాఙ్మయ చరిత్రను సూక్ష్మముగ పర్యవేక్షణ చేసినచో స్వీయ చరిత్ర రచనలు 18 వ శతాబ్దము వరకు నుద్భవింప లేదనుట నిర్వివాదాంశము ఇయ్యది ఆధునిక సాహిత్యారామమున క్రొత్తగ పుష్పించిన కుసుమ గుచ్ఛము శ్రీ వీరేశలింగం పంతులుగారు వ్రాసిన స్వీయ చరిత్రయే ఆంధ్ర సాహిత్యమున మొట్టమొదట వెలసిన ఆత్మకథ.

స్వీయ చరిత్ర సమగ్ర సిద్ధమగు కళాత్మక సాహిత్య ప్రక్రియ యనిపించుట కెట్టి కళాధర్మము లుండవలెనో, తత్కర్త కెట్టి కళాత్మక దృష్టి యుండవలెనో పరిశీలింతము.

సంస్కృతమున నలంకార శాస్త్రములందు గద్య కావ్య భేదములలో ఆఖ్యానము ఉపాఖ్యాన మనెడి భేదము లేర్పరచి "స్వయం దృష్టార్థ కథనమ్ ప్రాహు రాఖ్యానకమ్ బుధాః" అని తెలిపియున్నారు. "వృత్త మాఖ్యాయతే యస్యాం నాయకేన స్వచేష్టితమ్" అనునదియే యిందలి యితివృత్తము "సత్యార్థాఖ్యాయికా మతా" అనుచు నది యథార్థముగ నుండవలెనని నియమించిరి. వీని నాధారముగ గొని తద్వ్యాఖ్యాన కర్తలు 'ఇవియే నేటి ఆత్మకథల వంటివి' యని తెలిపిరి కాని గ్రంథములను పేర్కొనలేదు కావున ప్రస్తుతాంశమునకు పూర్వపక్షము చేసిన విలువజాలని వాద మిది.

ప్రతి వ్యక్తికి తన జీవితమును గురించి వ్రాసికొనవలెనని ఆకాంక్ష కలుగుట సహజము. "Every man's life should be best written by himself" అని డా జాన్సన్ అనెను స్వీయచరిత్ర రచయితల కవసరమగు కొన్ని కళాత్మక ధర్మము లున్నవి. చిత్తమున గల సకల భావావేశములను ప్రక్షాళనము చేసికొని నిర్మలాత్మతను పొందిన వానికే స్వీయ చరిత్ర రచన సాధ్యమగును. అట్టి ప్రశాంతస్థితి ప్రథమము. తమ జీవితపు సంఘటనల నితరుల జీవితపు సంఘటనలుగ నెంచి తమ స్వభావాదుల నితరుల స్వభావాదులుగ నెంచి వ్రాసెడి నిర్లిప్త స్వభావము ద్వితీయము పాఠకుల కభిరుచిని కలిగించు విధానముగ కళాత్మక రచన చేయగలిగెడి శక్తి తృతీయము. గ్రంథము నే భాషలో వ్రాసినను తత్కర్తకాభాషా పరిజ్ఞానము సమగ్రముగ నుండుట చతుర్థగుణమని చెప్పనొప్పును.

కావున స్వార్థ చింతనలేని సమాహిత చిత్తుడు, విశ్వైక భావమును విశదపరచుకొనినవాడు, సాహిత్య రచనా ప్రవేశము కలవాడు మాత్రమే సమగ్ర సుందరమగు "స్వీయచరిత్ర" శిల్పమును నిర్మింపగలడు

స్వీయచరిత్ర కర్తలు తమ విషయములను నిష్పక్షపాత బుద్ధితో విమర్శింపవలెను.

Dr. Johnson— "He that speaks of himself has no motive to falsehood or partiality" అని వచించి యున్నాడు Waldo H Dunn అనునాతడు "Autobiography is a truthful picture of life, of life's tangled skien good and ill together." అనెను తాను సంఘమున నే స్థానము నాక్రమించి యున్నాడను విషయమును తెలుపుటకు తత్సంబంధమగు సంఘమును మితముగ వర్ణింపవలెనే గాని సంఘమునే వర్ణించుచు తన విషయమును మరువరాదు. "It is not the business of a self memorialist merely to give the charecter of others which he has had an opportunity of observing" అని Egerton Brydges స్వీయచరిత్ర విషయమును స్పష్టపరచి యున్నాడు. Sir Samuel Romilly.— "Autobiography is for himself, alone" అని పై భావమునే తెలియజేసి యున్నాడు

తన కుటుంబమును, సంఘమును తెలుపవలసినను తానందానికి కేంద్ర స్థానమున నుండునట్లు చేసి వ్రాయుటయే యుచితముగ నుండును Dr Johnson ఈ విషయమునే "He that is most elevated above the crowd by the importance of his genius, feels himself affected by fame or business but as they influence his domestic life" అని విశదీకరించియున్నాడు. కావున స్వీయ చరిత్ర రచనాకర్త తన ఆంతరంగిక జీవితమున కెక్కువ ప్రాధాన్యమిచ్చి వ్రాసినచో నయ్యది పాఠకుల కుత్సాహమును కలిగించును అనౌచిత్యము లగు విషయములను పైపై అర్థవ భావముతో గోప్యము చేయక వ్రాయవలెను. Mr Jaffery అనునతడు "Autobiography will be written with great simplicity and loveliness" అని యున్నాడు ఇయ్యది కళాత్మకముగ నుండవలెను. Egerton Brydges స్వీయచరిత్ర యనగా "to apply a mirror to his own heart is the first business." అని నిర్దేశించెను.

తాను తెలియజేసెడి సంఘటనలను వ్రాయునెడ పది భవి జీవిత మార్గమును సరిదిద్దుకొనుట కెట్లు దోహదకారియై నదో ఆ విషయమును స్పష్టపరచవలెను. "Autobiography is consciously designed as an ethical guide of life" అని పాశ్చాత్యుల అభిప్రాయము.

కావున నే రచనయైనప్పటికి సాహిత్య కళాశాఖకు చెంద వలెనన్న నద్దానికి త్రిగుణము లుండవలెను విశ్వైక భావమును తెలుపుట, సౌందర్య రచన గావించుట, రచనాక్రమమునందు సమ గ్రతను పాటించుట — ఇవి స్వీయ చరిత్రలో నుండునట్లుగ వ్రాయవలెను.

స్వీయ చరిత్ర రచనలోని జననము మరణము శైశవము ఇత్యాది విషయములను తెలిపెడి సమస్యలు కలవు. ఈవిషయమునే "a study sharply defined by two definite events, birth and death thus a biography is complete - but a true autobiography however is but a torso, it cannot be complete" అని పాశ్చాత్యులు చెప్పియున్నారు. Andre Maurois అన్న ఫ్రెంచి రచయిత "—so an autobiography of childhood is nearly always common place and untrue even when the author himself is sincere" అన్నాడు.

తన స్వవిషయము లలని కెంత ప్రీతిపాత్రమవు లైనప్పటి కిని తన గ్రంథము లోకముకొరకేర్పడినది కావున పాఠకుల అభిరుచిని గుర్తెరింగి మితముగ వ్రాయుటయే మేలు John Galt అను ఆయన "Autobiographer must not forget that however important the incidents of his life may be to himself, the general body of readers will regard his memory but as a common book and never trouble themselves in pursuit of pastime to ascertain whether what they read consists of fact or fiction" అని తెలిపెను.

పాఠకునకు కుతూహలమును కలిగించుటకై నవలా రచయిం దుత్తమపురుష సర్వనామమును వాడుచుందురు. దినసంభవ గ్రంథము (Diary) పేరిట ప్రతిదిన సంఘటనములను వ్రాయుచుం దురు. అట్టి గ్రంథములను స్వీయచరిత్రలని భ్రమపడరాదు Herbert Spencer అనునతడు "Autobiographer is obliged to omit from his narrative the common place of daily life and to limit himself almost exclusively to salient events, action and traits" అని వివరించెను. కావున కళాత్మకమగు సాహిత్య దృక్పథము కలిగినవారు మాత్రమే సమగ్రమగు స్వీయరచన చేయగలరు "Biographers seem to be born rather than made" అని Waldo H. Dunn అను విమర్శకుడు అనెను.

వీరేశలింగంపంతులుగారి స్వీయచరిత్ర

శ్రీ వీరేశలింగం పంతులుగారి స్వీయచరిత్రయే తెలుగు వాఙ్మయమున మొట్టమొదట వెలసిన ఆత్మకథ. ఈయన సాహిత్యాపేక్ష, సంఘసేవాశక్తి బాల్యదశయందే విదితమగుచున్నవి.

వసుచరిత్ర పుస్తకము కొనుటకై పంతులుగారు పాఠశాల కిచ్చిన ఎనిమిదణాలు చేర్చిపెట్టి పాఠశాలకు పోవుటను మానివేసి తత్కారణముగ తండ్రిగారి కోపమునకు గురియైన సన్నివేశము లను సహజసిద్ధముగ వర్ణించియున్నారు. భూతమాంత్రికాదుల పట్ల నిర్భయులయి, సద్దానిని చూడవలయునని పంతులుగారు చేసిన ప్రయత్నములను పాఠకునిలో నుత్కంఠను పుట్టింపక మానవు. తాను తన స్నేహితులతో హిమాలయ పర్వతములకు తపశ్చర్యకై వెడలనుంకించుట మొదలగు వర్ణనలు కడుంగడు ప్రశంసార్హములు. ఈ సంఘటనలవలన పంతులుగారు స్వీయ చరిత్ర రచనాకర్తగ మంచిచెడులను చెప్పుటయందు నిష్పక్షపాత బుద్ధిని కొంతవరకవలంబించియున్నారని చెప్పవచ్చును. కాని యెడనెడ తన వంశాదుల ప్రశంసల విషయమున గ్రంథమునకుగాని తనకుగాని సంబంధములేని సంఘటనలను రచించియుండుటచే గ్రంథము విస్తరించినది.

తన విద్యాభ్యాసములగురించి తెలుపు సందర్భములందు తన బుద్ధివైశిష్ట్యమును ప్రత్యక్షపద్ధతిలో వెల్లడిచేసి యుండుట కొంత గ్రంథ సమగ్రతను పరిపూర్ణము చేయలేక పోయినది. 'నా ప్రతిభావిశేషమే నా క్షశ్రద్ధను సోమరితనమును వెప్పినది' 'ఏకసందా ద్విసందా గ్రాహులకుండు బుద్ధివిశేషమే కొంత కలవాడను' అనునవి సంఘటనలను తెలిపి పాఠకలోకము నిర్ణయించుటకు విడిచిపెట్టి యుండవచ్చును. ఇట్టివి అక్కడక్కడ కనిపించుచున్నను పెక్కుగుణము లుండుటవలన నీ దోషములను క్షీరనీరన్యాయముగ వదలిపెట్టుకొనుట కవకాశ మున్నది. పంతులుగారు చిన్ననాడే అష్టావధానములుచేసి పలువురిని ఆశ్చర్యచకితులను గావించెడివారట. కాని అయ్యది 'ముగిసినతర్వాత తలనొప్పి వచ్చి ఆ రాత్రి వేనెంతో బాధపడితిని — కావున మేధస్సునకు వేదనాకరములైన అష్టావధానము లను చేయమానితిని' అనియు, 'ప్రకృతిచేతనే నేను కోపస్వభావము కలవాడను.' అని తన దుర్గుణములను స్పష్టపరచి యున్నారు. పంతులుగారు బాల్యమున కొన్ని దురభ్యాసములకు లోనయ్యిరట. 'విద్యాగంధములేని దుర్వ్యాపారులతో కలిసి నేను పెక్కుమారులు డబ్బుపెట్టి జూదమాడితిని. ఒక భోగముదాని ఇంటికి నన్ను లీసికొనిపోయిరి.' ఎట్టకేలకు దైవానుగ్రహమున పంతులుగా రట్టి దుర్మార్గపు జీవితపథమున కాలిడరేదు.

క్రీ. శ. 1874 వ సంవత్సరము తన భావముల నన్నింటిని లోకమునకు వ్యక్తముచేయుటకు 'వివేకవర్ధని' అను ఒక మాసపత్రికను తెలుగున ఆయన ప్రకటింపనారంభించిరి. దీని ముఖ్యోద్దేశము భాషాభివృద్ధియు, దేశాభివృద్ధియు. స్త్రీవిద్య స్త్రీ పునర్వివాహ సంస్కార ప్రయత్నములో పంతులుగారు పడిన

పొట్లన్నియు సవిస్తరముగ వివరింపఁబడియున్నవి. మిత్రుల బృందములోనిదే అంతఃకలహములు. స్త్రీ పునర్వివాహము పది మందిలో వేదికమీద వక్కాణించుటకు ప్రయోజనపడినదే కాని తీరా అయ్యది తమ కుటుంబవిషయమునకు వచ్చుతరి మిత్రులు ఎవరికి వారు బృందమును వదలి వెడలిపోయిరి. అట్టిదశయందు పంతులుగారు ఏకాగ్రతతో తన కార్యసాధనయందు దీక్ష వహించి సాధించుట ప్రశంసింపదగిన అంశము. వితంతు స్త్రీల సమూహము నందును అంతఃకలహములు. వివాహము తప్ప వారి మనస్సున మరొకదానికి స్థానములేదు. ఈ విషయమున పంతులుగారిని పోరు పెట్టెడివారట. ఇన్ని చిక్కులయందును పంతులుగారి సాహసము సహనము కార్యదీక్ష ఆత్మవిశ్వాసము పరోపకారము గణింపదగిన విషయములు. ఆనాటి సంఘ పరిస్థితిని కన్నులముందుంచినారు పంతులుగారు. Mrs. Burr అనువారు "Just as the iron filings rise and cluster above a magnet so do men's individualities rise to expression under the influence of a current of thought" అని సంఘమును వదలిపెట్టి స్వీయ చరిత్ర వ్రాయుట దుస్సాధ్యమని తెలియుబరచియున్నారు. ఇక పంతులుగారి సాహిత్య కృషి అద్వితీయమైనది. Egerton Brydges-"A man of real talent and love of literature may live a long life with a longing desire to do something great" అనుటను పంతులుగారి విషయమున సమన్వయింపవచ్చును.

'వివేకవర్ధని' 'హితకారిణీ సమాజము' ఇత్యాదుల విషయమున ప్రతిపక్షులు తన కార్యములకెట్లు ఆటంకములను కలిగించుచు వచ్చిరను విషయమున రచయిత పత్రికలలోని విషయమును మరల తన స్వీయరచనయందు ముద్రించియున్నారు. తనకు తన మిత్రులకు జరిగెడి ఉత్తర ప్రత్యుత్తరముల నట్లే మరల గ్రంథమున వ్రాయుటయు, గొప్పవారినుండి వచ్చిన ప్రశంసా వాక్యములను మొదటినుంచి చివరవరకు మరల వ్రాయుటయు, ఇంగ్లీషు ఉత్తరమైనచో దానికి తెనుగు అనువాదమునుకూడ వ్రాయుటయు, స్త్రీ విద్యాసంస్కార హేతువులగు పితృపూజ, మాతృపూజ, స్త్రీ నీతిదీపిక యిత్యాదులగు సదాచార ప్రతిష్ఠాపనమున పంచరత్నములు మొదలగువానిని గ్రంథమున మరల ముద్రించి యుండుటవలన స్వీయకథావస్తువునకు కనుసంధానత కుదురలేదు. పైపెచ్చు పాఠకుని విసుగున కియ్యది గురికాక తప్పదు. స్వీయచరిత్ర కిట్టివి అనావశ్యకములు. కావున పంతులుగారి స్వీయజీవిత రచనయందు గ్రంథరచన క్షేమార్థము ప్రయోజనములేని ఉత్తర ప్రత్యుత్తరముల ముద్రణలను పరిహరించి సంఘసంస్కరణ విషయమున తన స్వభావమును తనకృషిని మాత్రమే కేంద్రస్థానముగ నుంచుకొని వ్రాసియుండిన నియ్యది కొంతవఱకు సమగ్రతను పొందియుండెడిది.

శ్రీ చిలకమర్తివారి స్వీయచరిత్ర

శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహముగారి స్వీయచరిత్ర ఇరువదియొక్క ప్రకరణములతో కూడిన రెండవ గ్రంథము.

'బాల్యదశ' యనెడి శీర్షికలో గ్రంథకర్త వివరించిన వంశాదుల వర్ణనలు కొంత గ్రంథవిషయమునకు సుదూరముగ నున్నవి. తన తోబుట్టువుల మరణములను వర్ణించుటయందు కొంత సహజముగ వర్ణించి యుండిన గ్రంథకర్త భావస్వభావములను తెలిసికొని యుండెడివారము. 'నా అంధత్వము మిక్కిలి చిన్నతనమం దెట్లుండెనో నే నెరుగనుగాని, నాకు జ్ఞానము వచ్చినతరువాత రాత్రులు స్వయముగ నడచుటకుగాని చదువుటకుగాని వీలులేకపోయినదని యెరుగుదును.'

ఈయన నలుబది నాల్గవయేట కన్నులు పూర్తిగ నంధమైనట్లు వ్రాసినారు. ఈ విషయముల నిచ్చటనే తెలిపి యుండుట పాఠకుని కుతూహలమునకు దోహదకారిగ నున్నది.

'నా స్వభావము చిన్ననాటనుండియు గంభీరమైనదని చెప్పుట యాత్మస్తుతి కాదు' అని వాచ్యముగ తన స్వభావమును తెలుపుకొనియున్నను దానికి తగిన సంఘటనలను ప్రదర్శించినారు.

కన్నులు రాత్రులయందు స్పష్టముగ కనిపించకపోవుటచే క్రొవ్వొత్తి దీపములను వెలిగించుకొని దీపముముందిర తలపంచుకొని చదువుటకు ప్రయత్నించెడివారట! తలను దీపమునకు

ఉత్తమ చికిత్స



ఏ కారణాల చేతనైనా ధాతునష్టం చెంది, దాంపత్య సౌఖ్యం అనుభవించ లేనివారు వెంటనే 15 పైసల స్టాంపుతో సంప్రదించండి:

డా॥ A. పూర్ణచంద్రరావు
N.D.F.N.F.U. (Ceylon)., R.A.M.P.
సెక్స్ స్పెషలిస్టు,
మ్యూజియం రోడ్, (P.W.D. క్వార్టర్సుదగ్గర)
గవర్నరుపేట, విజయవాడ-2.

చాల సమీపమున నుంచుటవలన వేడితగిలి తలవెంట్రుకలు శిరోజములు కాలిపోవుచుండెడివట! ఇట్టి సంఘటనలను కర్త ప్రయత్నించియున్నచో నింకను హృదయవిదారకముగ రచించి యుండవచ్చును.

విద్యాభ్యాసానంతరము నాటకసమాజమువారీయనను నాటక రచనకు పురికొల్పుటయు తత్ఫలితముగ అనేక నాటక రచనలు చేయుటయు వర్ణింపబడియున్నది. రచనలయందీయన పట్టుదల కలవారు 'నల' నాటకమున వేదో కారణముచేత పద్యముల ప్రవేశమవసరము లేదని నాటకసమాజ సభ్యుడొకడు కోరగ చిలకమర్తి వారికి పట్టరాని ఆవేశము కలిగి అంతవరకు వ్రాసియున్న నాటకమును నిలువుగ చింపివేసిరట. చిలకమర్తివారి స్వతంత్ర స్వభావ మెట్టిదో దీనిచే స్పష్టమగుచున్నది. ఈయన ఉపవాసదానము లనేకములను చేసెడివారట. ఈయన యింటిప్రక్క గల నియోగి బాల వితంతువుదగ్గర రుక్మిణీ కళ్యాణము, భజన కీర్తనలను పాడించుకొని నేర్చుకొనెడివారట. మంగలి కుఱ్ఱవానికీయన గాయత్రీ మంత్రము చెప్పించి తాత్కాలికముగ పెద్దల కోపమునకు కారకులైరి ఈయన బాల్యదశయందే మరొక ఘట్టము—"ఒకానొక రోజు స్నేహితులతో కలిసి వస్త్రములు విసర్జించి నాటిని గట్టువిూదపెట్టి చెరువులో జలక్రీడ లారంభించితిమి మేమా గోడవలో నుండగా వస్త్రము లెవ్వడో దొంగిలించుకొనిపోయెను—పెద్దలచే దిట్టముగ జీవాట్లు దింటిమి. మూడవతరగతిలో లెక్కలు రానికారణముచేత 'రెండుచేతులవిూద యిరువది దెబ్బల కంటె నెక్కువగ దెబ్బలు తింటిమి.'"

తన తల్లి కోడరికపు బాధ లనేకములను పడినదట తండ్రియు నామెయెడ మిక్కిలి కఠినముగ ప్రవర్తించెడివారట 'అప్పుడప్పుడు మాయమ్మను మా తండ్రి కొట్టుట చూచి నే నేడ్చెడివాడను' అని కొన్ని సన్నివేశములను కర్త నిష్పక్షపాత బుద్ధితో సమగ్రముగ తెలిపియుండుట స్వీయజీవిత రచనా లక్షణముల కనుగుణములుగ నున్నది

"As wandering memorials of my own life and casual experiences" అను Thomas De Quincy ఆత్మకథ వాక్యమును ఈయన స్వీయచరిత్ర కన్వయింపవచ్చును.

ఈ విధముగ జీవిత సమస్యల నన్నింటిని క్రమానుగతముగ మితిమీరక వ్రాసినప్పటికిని పత్రికలయందును తదితర సందర్భములయందును తాను వ్రాసిన పద్యముల నన్నింటికిని స్వీయచరిత్రలో స్థానమిచ్చి యుండుటవలన గ్రంథము నందలి కథావస్తువున కైక్యము కుంటుపడినది. పైపెచ్చు నాటక సమాజముల గురించియు తదితర విషయముల గురించియు ఎక్కువగ వ్రాసి యుండుటచే గ్రంథ మనవసరముగ విస్తృతిని పొందియున్నది.

ఈయన 'వివేకవర్ధని' ముద్రాక్షరశాలయందొక గ్రంథము ముద్రించకముందే తద్గ్రంథములోని పద్యములను తప్పక రించి కంఠస్థము చేయుటయు వీరేశలింగము పంతులు గారి యెదుట తనకా పద్యము లంతకు పూర్వమే తెలియునని బొంకుటయు మున్నగు విషయముల నిష్పక్షపాత దృష్టితో వ్యక్తపరచుకొని యుండుట మెచ్చదగిన అంశములు. షష్టిపూర్తితోపాటు భార్యా వియోగమును వ్రాసి గ్రంథమును పూర్తి చేసియున్నారు.

గ్రంథమున విషాద ఘట్టములను ఇంకను స్పష్టముగ వ్యక్తపరచి యుండవచ్చును కుటుంబ విషయములకు కొంత నెక్కుడు ప్రాధాన్య మిచ్చియుండినచో ఇయ్యది సమగ్రమై యుండెడిది.

నా జీవితయాత్ర

టంగుటూరి ప్రకాశంగారు 'నా జీవిత యాత్ర' అని స్వీయచరిత్ర వ్రాసియున్నారు ఈ గ్రంథమును చదివిన పిమ్మట ప్లీడర్లు, వకీళ్ళు, కేసులు ఇత్యాదులు బోధపడుచున్నవే కాని ప్రకాశంగారి స్వభావాదులేవియు మచ్చునకైనను కానవచ్చుటలేదు. తన బాల్యమును గురించి వ్రాసికొనెడు సందర్భములందును తాను చాలా అల్లరివాడైనప్పటికి చదువునందు శ్రద్ధ కలవాడనియు నెవరైన తనకు కీడు చేసిన క్షణమే దానికి ప్రతీకారము చేసెడివాడనియు చెప్పదే అనేక సంఘటనల నట్టివే ప్రదర్శించి యుండుట చదువరుల కించుక విసుగును కలిగించుచున్నది తన లేబ్రాయమునందే తండ్రిని కోలుపోవుటయు, సంసారము దిక్కుమాలిన దగుటయు, పేదరికము కాపురము చేయుటయు నిత్యాది విషాద సంఘటనలు చవిచూచియుండియు నవ్వాని విషయములు కొంతమాత్రమే తెలిపి నాటక సమాజముల గురించియు రాజకీయముల గురించియు తెలుపుటచే నిది చదువరులలో ఉత్కంఠను కొంత తగ్గించుచున్నది "Autobiographies are psychological documents of the greatest importance" అను సూక్తికి గ్రంథ మేమాత్రము సరితూగజాలదు

గ్రంథమున సంఘటనల కూర్పునందుకూడా క్రమపద్ధతి కొంతవరకు పాటింపలేదు గుమాస్తా పని చేయుచున్న విషయముల వ్రాయుచు 'నేను మెట్రిక్యులేషను మొదటి సంవత్సరం చదువుతూ వుండగా' అని మరల కథను వెనుకకు త్రిప్పుట అంత ప్రోత్సాహకరముగ లేదు.

'ఇన్ని సంవత్సరాలైన తర్వాత ఈ విషయాలు జ్ఞాపకం చేసికొని వ్రాయడానికి నేను గర్వపడుతున్నాను' అనెడి అనవసర ప్రశంసలకు స్వీయజీవితరచనయందు స్థానము లేదు

ప్రకాశం గారి 'నా జీవిత యాత్ర'లో ఆత్మీయతకును కుటుంబ విషయములకును మరి కొంత ప్రాధాన్యమిచ్చి వ్రాసి యుండినచో గ్రంథము కొంతవరకు సమగ్రతను పొందియుండెడిది. Mr Brydges తన విమర్శనములో "in an autobiography if inward workings are not frankly disclosed nothing

is done" అని తెలియబరచెను. కేవలము రాజకీయ సాంఘిక విషయములు మాత్రమే ఇందున్నవి. గ్రంథము సంక్షిప్తమైనది, అసమగ్రమయినది.

శ్రీ కాళేశ్వరరావు జీవితచరిత్ర

'నా జీవిత కథ – నవ్యాంధ్రము' అను పేరిట అయ్యదేవర కాళేశ్వరరావు గారు స్వీయ చరిత్ర వ్రాసియున్నారు. Mrs Oliphants అన్న "Self biographers are driven into a fashion of self explanation which belonged to that time" వాక్య మీయన స్వీయ చరిత్రకు సమగ్రముగ వర్తించును. ఈ గ్రంథమును స్వీయచరిత్ర అనుటకన్నను భారతదేశ స్వాతంత్ర్య సందర్భమున వెలువడిన రాజకీయ గ్రంథమనుట సమంజసముగ నుండును. ఇట్టి విషయమునే Waldo H. Dunn చెప్పుచు "we are naturally dissappointed if the autobiographer says that he lived much with illustrious statesmen or heros' అన్నారు.

గ్రంథ పఠనానంతరము మీ కర్త భారతదేశ సేవకై పాటుపడుచున్న దేశభక్తుడుగను, ముఖ్యముగ స్వాతంత్ర్య పోరాటమున గాంధీజీ అడుగుజాడలలో నడచినవారుగను కనిపింతురు.

'చేతితో వడకిన నూలుతో చేమగ్గాలమీద నేసిన శుద్ధ ఖద్దరు వస్త్రాలే ధరించెడివాడను' అని సగర్వముగ వ్రాసికొనెను. ఈయన కాధ్యాత్మ చింతనయందును నభిలాష యున్నట్లు కొన్ని సందర్భములయందు స్పష్టపరచిరి. 'ఏడవ ఫారము చదువుకొనుచున్నప్పుడే బ్రహ్మసమాజమున చేరి, ఈశ్వర ప్రార్థనలు, కీర్తనలు నేర్చుకొని'రట.

ఈయన ఆచార్యత్వమున విద్యార్థు లీయన యెడ చాల చనువుతో నుండెడివా రనియు, వేయే విద్యార్థుల నెట్లు దండింపవలెనో తనకు బాగుగ తెలియుననియు కొన్ని సంఘటనల నుదాహరించి యున్నారు. ఈయనకు సాహిత్య రంగమునను ప్రవేశమున్నట్లు తెలియుచున్నది.

ఆంధ్ర వాఙ్మయమున స్వీయచరిత్రలు శ్రీపాద వారి 'అనుభవాలు–జ్ఞాపకాలు' మొదలయినవి లనేకములు కలవు.

వీటన్నింటిని నాధారముగ గొనిన, స్వీయ చరిత్ర రచన లనగా Mr. Theodore Watts Dunton ప్రశ్నించినట్లు "Is it the mere record of the incidents of a man's life? or is it a picture of the man himself – his charector, his soul?" అను సంశయము కలుగక మానదు. "The question is not yet settled" అని Waldo H Dunn ఇచ్చిన ప్రత్యుత్తరమే దీనికి సమాధానమగును.

స్వీయ జీవిత రచన గావించు టత్యంత దుర్లభము. Egerton Brydges అన్నట్లు "that almost all men wish to appear to whole world in a charecter which does not belong to him and that by their own pens they will most probably portray themselves in that charecter" అనుట సత్యదూరము కానేరదు.

మానవుడు తన్ను తానెప్పుడును నిష్పక్షపాతముగ పరీక్షించుకొనలేడు. "It has frequently been said that an autobiography must be an untrue representation of its subject as no man can judge himself correctly" అనెడు సూక్తిలోని భావము సమంజసమే యగును.

కావున సమగ్ర స్వీయజీవిత రచన చేయు టత్యంతకష్టతరమగు కార్యమనుటలో సందేహములేదు. మానవుడు తన హృదయగత భావములను స్వయముగ అర్థము చేసికొనలేడు.

Frances Ridly Havergal ఇట్లు వ్రాయుచున్నారు.—

"AUTOBIOGRAPHY! So you say
So do I not believe!
. . . . —
Ever would dare to leave
In faintest pencil or boldest ink
All they truely and really think
. . . .
AUTOBIOGRAPHY? No!
It never was written yet, I trow ...
. . . .
They cut little pieces out of their lives
And join them together,
Making them up as a readable book
And call it an autobiography,
. . . .
But in a cipher none can read
Except the author
. . . .
The Secrets of our lives are ours and
God's alone"

దీనిలో యథార్థ మెంతేనియు కలదు. కాని కష్టసాధ్యమగు ఈ సాహిత్యప్రక్రియయు సమగ్రతను పొందగలదని విశ్వసించెదము. మానవుని మేధాశక్తి యిట్టి కళాత్మకసృష్టియును చేయగలదనుటను సాహిత్యాపేక్షకులు నిరూపింతురని ఆశింతము.

ఆలస్యం

శ్రీ వేగుంట మోహన ప్రసాద్

ఇంతే
చివరికి
పొగలు గక్కిన మేఘంలోంచీ
కోళ్ళు అరిచిన మంచులోంచీ
ఏవీ మిగలక
ధ్యానంలో
ఆనంద క్షణాల్ని గుర్తు తెచ్చుకుని
ఓ మూల చిర్నవ్వూ
ఓ కొసన దుఃఖంతో కంపించి
పక్కనించి కిందికి వొంగిన పెదవిపై బడ్డ కన్నీటి తుపరని తుడుచుకుని
మనస్సు నరాల ప్రకంపనల్లోంచి ఏడుస్తూ
ఇంతే చివరికి
రే భగవాన్!
ఇంతే
చివరికి!!

నా కోసం మంచు రాల్చిన ఆకాశమా
చివరికి నువ్వే రూక్ష వీక్షణాల్తో నను శిక్షిస్తే
నికొలస్ రోరిక్ వేసిన
'సోర్స్ ఆఫ్ గాంజెస్'
హిమాలయ చిత్రాల మంచుసోనల నీడల్లో దాక్కుంటాను.
అక్కడొక చోటే మనిషి
జ్ఞాన నేత్రం తెరుచుకుంటుంది.
మాటిమాటికీ
బ్రతుకు దుఃఖాలకి ఆడపిల్లలా కన్నీళ్ళు నింపుకునే నగ్ననేత్రం
చీకిపోయి
నీళ్ళోడి
చివరికి అక్కడొక చోటే జ్ఞానదీపం వేడిగా కాల్తుంది.
కోళ్ళ అరుపులు పొగమంచుని చీల్చుకొని నాదాకా రావు.
రాత్రిలోంచి ఆబగా లాక్కున్న చీకటిని
ఉదయపు మేఘమేదీ నా మీదికి విసిరెయ్యదు.

నాకోసం దుఃఖాలు నా నించి దుఃఖాలు
ఇంకా యితర విభక్తి ప్రత్యయాల దుఃఖాలు
ఏవీ నన్నంటవు కాల్చవు ఎవరికీ జవాబుదారి కాను.
*హిమాలయాల్లోని రాత్రి ఊదామంటలూ నన్నంటవు
నా తపస్సుని మాత్రమే కాల్చుతయ్.
అగ్ని కీలలతో బాటూ బూడిద పైకెగిరి పోతుంది.

కాని ఇక్కడున్నంతవరకూ నిట్టూర్పులే.
నన్నక్కడికి తీసికెళ్లే రైలుబండి
ఇపుడిపుడే కూస్తోంది
బ్రతుకంతా నిరీక్షించి
ఇపుడా రైలుకోసం నిరీక్షించి
ఇపుడా నీ రాక
ఎంత
దుః
ఖం!

ఈ గడ్డని వొదలలేక
ఒక జీవితమంతా ఆలస్యం
వేకువలో నీ రాక రాత్రంతా వృధా!
పగలంతా ఈ అనాచ్ఛాదిక నగ్నజగత్తుని చూడలేక బాధ
ఇదంతా ఒకటే బాధ
గతంలోంచి భవిష్యత్తులోకి పాకిన రజ్జుసర్ప భ్రాంతి.
ఇక వెళ్లలేను ఈ ఇసుకలోనే నన్ను కప్పి
నా ఇసుక గుట్టమీద కాషాయ వస్త్రాన్ని కప్పు చివరికి ఈ కృష్ణ ఒడ్డునే.
ఎగరబోతూ ఎగరబోతూ నేలకూలిన గాలిపటం
విషాదంలోంచి దుఃఖంలోకి
దుఃఖంలోంచి శోకంలోకి
సంశయ విస్మయంలోంచి పక్కనెవరిదో రోదన వింటూ
విషాద స్మరణలోకి
ఇంతేరా
చివరికి !

---

* అల్ట్రా సోనిక్ కిరణాలు.

కర్ణుడు

శ్రీ ఆర్. ఎస్. సుదర్శనం

చ. 'వినుము నరేంద్ర! విప్రు డలి
వెన్, జమదగ్ని సుతుండు శాప మి
చ్చె, నమరభర్త వంచనము
సేసె, వరంబని కోరి కుంతి మా
న్పె నలుక, భీష్ము డర్ధరథు
జేసి యడంచె, గలంచె మద్రరా
జనుచిత మాడి, శౌరి విధి
యయ్యె, నరుం డని జంపె గర్ణునిన్.'

[శాంతిపర్వము: ప్ర—ఆ: 35]

కర్ణుడు అర్జునునిచేత చావటానికి అర్జునుని ప్రతిభ, వీరత్వము కారణంకాదు, కర్ణుని వక్రించిన అదృష్టమే కారణమని ధ్వనిస్తూ నారదుడు ధర్మజునితో పలికిన పై పద్యంలో కర్ణుని చరిత్ర చక్కగా సంగ్రహింపబడింది. ఒకవిధంగా చూస్తే కర్ణునికి జరిగినవన్నీ 'అన్యాయాలే'! అన్నిటికంటె పెద్ద 'అన్యాయం', పై పద్యంలో ప్రసక్తం కానట్టిదీ—కర్ణుడు పుట్టీపుట్టగానే కన్నతల్లి అతనికి చేసిన 'అన్యాయం'. కన్నతల్లిచే ప్రత్యాఖ్యానము పొందిన కర్ణుడు జీవితంలో ఆత్మధర్మంనుంచి ప్రత్యాఖ్యాతుడు కావడమే కర్ణుని చరిత్రలోని విశిష్టత.

భారత కథను సమగ్రదృష్టితో చూచేవారికి కర్ణునికి జరిగిన 'అన్యాయాలు' పెద్దవిగా కనిపించకపోవచ్చు. అందుకు కారణం భారత కథలో కేంద్రస్థానం పాండవులది కావడం; అంటే భారత కథను రచించిన వ్యాసమహర్షి ఆ స్థానంలో వాళ్లను ఉంచి కావ్యాన్ని రూపొందించడమే! మరొక విశేషం కూడా వుంది. భారతం చివరకు, 'ఆశ్రమవాసపర్వా'నికి, మనం వచ్చేటప్పటికి భారతంలో ఎవరికి జరిగిన 'అన్యాయాలూ' అన్యాయాలుగా, ఎవళ్లుపడ్డ కష్టాలూ కష్టాలుగా కనిపించవు! ఈ బృహత్కావ్యంలోఉన్న గొప్పదనం ఈ రకమైన దృష్టి మార్పు. మానవసహజమైన కష్టసుఖాలతో తాదాత్మ్యం చెంది, పాండవుల మంచితనానికీ కౌరవుల దౌష్ట్యానికీ పరితపించిన మనస్సుని, 'జరిగిందంతా ఒక కల, చివరకు ఏమీ జరగలేదు' అనేవిధంగా శాంతపరిచే చిత్రమైన, గంభీరమైన ముగింపు ఈ కావ్యంలో ఉన్నది. 'ఆశ్రమవాసపర్వం'లో వ్యాసుడు కుంతికీ, ధృతరాష్ట్రుడికూ, భారత కథలోని 'పాత్రధారులను', భగవంతుని లీలా విశేషమైన ఒక రూపకంలోని పాత్రధారుల్లాగా, పరిచయం చేస్తాడు:

సీ. "ధృతరాష్ట్రుడనగ వర్తిల్లెడు మేటి గం
ధర్వు డీ ధృతరాష్ట్ర ధరణివిభుడు
తన్వి! పాండుడు మరుద్గణమయుజని, ధర్మ
దేవత నూవె యుధిష్ఠిరుండు
పవనుండు భీముడై ప్రభవించె, నరుడను
ముని యర్జునుండయి జనన మొందె
నారాయణుడు కృష్ణనాముడై జనియించె,
గనుగొను కవల నాశ్వినులు గాగ
ద్వాపరంబుగ నెరుగు గాంధారరాజా
గలి సుయోధను డయ్యె రాక్షసులు పుట్టి
రతని యనుజులై, కర్ణుని నరుణ కిరణు,
గాగ నభిమన్యు జంద్రునిగాగ గనుము."

[ఆశ్రమ: ద్వి—ఆ: 111]

కర్ణునికి తానుచేసిన 'అన్యాయానికి' యింకా ఆవేదన చెందుతూనే ఉన్న కుంతీదేవి నుద్దేశించి వ్యాసుడు పై వివరణ అంతా చెప్పి, అందరికీ భారత రణ మృతులను ఒక 'దివ్యదర్శనం'లో చూపించి, వారి వారి మనస్సుల్లోని బాధనూ, విషాదాన్నీ నివారిస్తాడు. వ్యాసుడు చిట్టచివర ప్రసాదించే ఈ 'దివ్యదర్శనం' తిలకించే పాఠకునికికూడా 'ఎవరు మంచి వాళ్లు? ఎవరు చెడ్డ వాళ్లు? అసలు మంచీ చెడ్డా ఏమిటి? ఎవరి పాత్రపోషణ వాళ్లు చేశారు, ఎవరి ఆత్మధర్మం ప్రకారం వాళ్లు భాసించారు. వీళ్లందరి విభిన్న ధర్మాలూ, వాటి కలయికా లేకపోతే కథే లేదు! ...నిజానికి సృష్టే లేదు!' అనిపిస్తుంది. ఈ రకం తాత్త్విక దృష్టితో చూచినా కర్ణుడు నిర్వహించిన పాత్రకూ, మిగతా వాళ్లు నిర్వహించిన పాత్రలకూ ఒక ముఖ్యభేదం గోచరిస్తుంది. యుధిష్ఠిరుడు ధర్మదేవత అయితే ధర్మదేవతగానే భాసించాడు. దుర్యోధనుడు కలి అయితే ఆ గుణాలే అతనిలో విస్తరిల్లాయి; అందుకు కథ అనుకూలించింది. అలాగే మిగతా వాళ్లు తమ నిసర్గగుణాలతో, స్వధర్మయుక్తంగా కనిపించే సులువూ కథలో వున్నది. పోతే ఆ సులువు ఒక్క కర్ణునికే లేదు! కర్ణుడు నిర్వహించవలసిన పాత్రలో ఆత్మధర్మము ప్రకాశించకుండా అతని నైసర్గిక గుణాలు ఎక్కడికక్కడ ప్రతిహతము కావలసిన పరిస్థితి, కథనుబట్టి ఏర్పడింది. అట్లా ఆత్మధర్మ ప్రత్యాఖ్యానము (Self-alienation) పొందిన వ్యక్తి కావడమే భారతంలో కర్ణుని విశిష్టత.

కర్ణునిలోని సంఘర్షణను, అతని ఆత్మధర్మాన్వేషణను అవగాహన చేసుకునే ప్రయత్నం జరిగినప్పుడు కర్ణుని పాత్రలోని గంభీరమైన విషాదం విదితవౌతుంది.

తొడలు విరిగిపడిన దుర్యోధనుడు శ్రీ కృష్ణునితో పలికే చివరి పలుకుల్లో ఎంతో ఆత్మతృప్తి ధ్వనిస్తుంది:

చ. "చదివితి నెల్ల వేదములు,
 జన్నము లొప్పగ జేసితిన్, రమా
 స్పదమగు వృత్తి బొల్చి పర
 పాలకులెల్లను గొల్వగంటి, దు
 ర్మదరిపు గాఢ గర్వ పరి
 మర్దనకేళి యొనర్చితిం, దగం
 దుది నని మిత్ర బాంధవుల
 తో ద్రిదివంబున కేగు టొప్పదే!

వ. నీకుం జూడ నెట్టివాడనైనను నాకేమి? మీరింక బశ్చాత్తాప దుఃఖితులగుచు నుందురుగాక! యనియె నప్పు డత నిపై బుష్పవర్షంబులు గురిసె......"

(శల్యపర్వము: ద్వి—ఆ: 329, 330)

"మీకు నే నెట్లా కనిపిస్తే నాకేం? మీరే పశ్చాత్తాప పడతారు!' అనడంలో స్వధర్మయుక్తంగా తనపాత్ర తాను నిర్వహించిన తృప్తీ, ఆత్మ విశ్వాసమూ దుర్యోధనునిలో కనిపిస్తుంది. అతనిలో బలీయమైనది రాజ్యకాంక్ష. జీవితంలో అది నెరవేరింది. మృత్యువునుగూర్చి దిగులు లేదు. గడచిన దానికి పశ్చాత్తాపమూ లేదు. అందుకే 'పుష్పవర్షంబులు గురిసె, దేవదుందుభులు మొరసె, దిశలు దెలివొందె, మృదుసమీరణంబు సుగంధియై వీతెంచె.' ఇదంతా చూచిన పాండవులకు నిజంగానే పశ్చాత్తాపం కలిగింది: 'ధర్మంబు దొరంగి గాంగేయ ద్రోణ కర్ణ శల్య దుర్యోధనాదుల వధించుట యత్తెరి గ్రొత్తయై తోచిన చిత్తంబుల వగయు లజ్జయు మిగుల బొడమె...' దాన్ని శ్రీ కృష్ణుడు సర్దుబాటు చేస్తాడు: 'వారి విధి యివ్విధంబున జావగజేసె, దైవఘటనలు దప్పింప మీ వశంబె' అంటూ 'మీరు చేసినదానికి కర్తలు మీరు కారు. ఈ నాటకంలో మీరు పాత్రధారులు మాత్రమే' అనే సత్యాన్ని వాళ్ల గుర్తుకు తెస్తాడు. దుర్యోధనుడే లేకపోతే ధర్మజుని మంచితనమూ, ధర్మదీక్షా—అతనిలో బలీయమైన ఆ ప్రవృత్తి ఎలా భాసిస్తుంది? ధర్మజుని వ్యక్తిత్వం సంపూర్ణంగా, ఆత్మధర్మయుక్తంగా ప్రకాశించింది కథలో. అలాగే అర్జునుని యోధత్వమూ. కర్ణునికి ఆ అదృష్టం లేదు. యుద్ధంలో మంచి పట్టున కర్ణుడు విజృంభిస్తూ ఉండగా అతని రథము 'మున్ను కొండొక క్రుంగిన చక్రంబు కుండ మునుంగం దిగబడి' పోతుంది. అది బ్రాహ్మణశాపము. కర్ణు డప్పుడు 'అప్రతీకారంబులగు రోషవిషాదంబుల గన్నీరొలుక రథంబు డిగ్గి అర్జునునితో కొంతసేపు బాణాలు వెయ్యవద్దనీ, అది రణధర్మం కాదనీ చెబుతాడు. ఈ విధంగా 'కన్నీరు నించిన' యోధుడు భారతంలో మరొక్కడు లేడు! భీష్ముడు, ద్రోణుడు దుర్యోధనుడు రణధర్మానికి వ్యతిరేకమైనవిధంగానే చంపబడ్డారు. కాని వాళ్లెవరూ కన్నీరు నించలేదు! కర్ణుని 'కన్నీటి'కి కారణం: ఎవరికీ కలుగని ఆత్మధర్మప్రత్యాఖ్యానము అతనికి కల్గడమే! ఆ కన్నీటిని అర్థంచేసుకుంటే కర్ణుని కథ అర్థమయినట్లే!

కురు కుమారుల అస్త్రవిద్యాప్రదర్శనం జరుగుతున్న సమయంలో అర్జునునితో పోటీ చెయ్యడానికి ఉత్సాహంతో ప్రవేశిస్తాడు కర్ణుడు. అతని సామర్థ్యం కొంత చూచినతర్వాత, అతని కుల మేమిటో, తల్లిదండ్రు లెవరో చెప్పితేగాని అర్జునునితో పోటీచెయ్యడానికి వీల్లేదంటారు పెద్దలు! ప్రతిభ ఉన్నప్పటికీ అది ప్రకాశించేందుకు వీలులేని పరిస్థితిలో ఉన్నాడు కర్ణుడు. సూత కులానికి చెందడమే పెద్ద అవరోధం. అతని ప్రతిభను గుర్తించి దానికి అవకాశం కల్పించినవాడు దుర్యోధనుడు: వెంటనే అంగరాజ్య పట్టాభిషిక్తుంచేసి కర్ణునికి సంఘంలో అర్హత, గౌరవం కలిగిస్తాడు. ప్రతిఫలంగా 'నాతో జెలిమి మహీనుతముగ జేయు మిదియ యిష్టము నాకున్' అంటాడు. నిజంగానే వారి స్నేహం 'మహీనుతమే' అవుతుంది. ఈ పట్టున భీముడు కర్ణుని గురించి అన్నమాటలు: 'నీదు కులమునకు దగగ బ్రతోదము గొని రథము గడప దొడగుము... అంగరాజ్యంబు నీ కర్హమగునె? మంత్రపూతమై గురు యజమాన భక్ష్యమగు పురోడాశ మది కుక్క కర్హమగునె?' ఈ నీచమైన అవహేళనకు 'కర్ణుడు వెల్లనయి యెద్దియుం జేయునది నేరక దీర్ఘోష్ణనిశ్వాస వ్యాకులిత వదనుండయి యాకాశంబువలన నున్న యాదిత్యుం జూచుచు మిన్నకుండె నంత నంతర్జ్వలితుండైన యక్కర్ణుడు...' భీముని మాటలకే కాదు, తన కులాన్నిగూర్చి, తన సేవక వృత్తినిగూర్చి నీచంగా ఎత్తిపొడిచే వారికి ఎక్కడా ఎప్పుడూ కర్ణుడేమీ సమాధానం చెప్పలేక పోవడమే కర్ణుని మనస్తత్వంలో ఒక ముఖ్యమైన అంశం. అందులో విధి వంచితుడైన విషాదమూర్తి మనకు దర్శనమిస్తాడు. ఒకవైపు శక్తి సామర్థ్యాలూ, వీరోచిత తేజమూ, కవచ కుండలాలూ తనలో ఆత్మవిశ్వాసాన్ని పురికొల్పుతూ ఉండగా, మరొకవైపు లోకంలో తనకు గౌరవస్థానం లేకపోవడం అతణ్ని 'అంతర్జ్వలితుణ్ని' చేస్తుంది. నిరుత్తరుడవుతాడు. "ఈ విపర్యయానికి కారణమేమిటి? నా శక్తి సామర్థ్యాలతో నేను సాధించవలసిన ప్రయోజనం ఏమిటి?" ఈ ప్రశ్నలు మొదటి సారిగా అతణ్ణి ఎదుర్కొన్నది, కురుకుమారుల అస్త్రవిద్యా ప్రదర్శన సందర్భంలో. ఆ పరిస్థితిలో సూర్యునివైపు చూస్తూ 'వ్యాకులితవదను'డైనాడు కర్ణుడు. అప్పటి కింకా అతనికి తను సూర్యుని పుత్రుడనని తెలీదు! అజ్ఞాతమైన ప్రేరణతో తనకు జన్మ ప్రసాదించిన వాడి వైపు చూస్తూ కర్ణుడు నిల్చుండి పోవడంలో చక్కని ఔచిత్యం ఉన్నది.

62 Years

of yeoman service to our National Print Industry

Manufacturers of

PRINTING TYPES IN 15 LANGUAGES & ELECTRO BLOCKS

PIONEERS IN THE PRODUCTION OF

'ARUMUGAM' NEW TELUGU SERIES
'GANAPATHI' NEW TAMIL SERIES
'SWADESI' NEW MALAYALAM SERIES
'MANI' NEW KANNADA SERIES

SWADESI TYPE FOUNDRY

HEAD OFFICE:

CHINTADRIPET : : MADRAS-2.

Phone, 84469 Post Box ; 2433 Cable ; "BHUVANA"

BRANCHES:

13-B. Industrial Estate, Sanatnagar, HYDERABAD-18.

B-6, Industrial Estate, Rajajinagar, BANGALORE-10.

XIV/8310-A, Kariyil Road, ERNAKULAM-8 (Kerala)

Approved Contractors to the Government of India

కర్ణునిలోని సంఘర్షణకు ఇది నాంది. తన ప్రతిభకూ, వ్యక్తిత్వానికీ అభ్యుదయం కోరుకున్న కర్ణునికి దుర్యోధనుని స్నేహం పట్టుగొమ్మ అయింది. అంతేకాదు అతనికి అర్జునుడు ప్రతిద్వంద్వి కావడముకూడా ఆ లక్ష్యసాధనకు ఎంతో అవసరమే! అస్త్రవిద్యా ప్రదర్శన సందర్భంలో భీముడు చూపిన ఈసడింపు వరవడిలోనే పాండవులందరూ కర్ణుని చూస్తూ వచ్చారు. ఈ విధంగా కర్ణుని స్థానం దుర్యోధనుని పక్షాన స్థిరమైపోయి, ఆ పరిస్థితికి అతను కట్టుబడిపోయాడు. కర్ణుడు లేకపోతే భారత యుద్ధమే ఉండేది కాదు అనే సామాన్యమైన అభిప్రాయానికి ఎంతో విలువ ఉన్నది. కర్ణుడు పాండవపక్షాన ఉండినప్పటికీ అతని ప్రతిభకూ వ్యక్తిత్వానికీ సార్థకత ఉండి ఉండకపోదు. కారణం భీష్మ ద్రోణ అశ్వత్థామలు ప్రతిపక్షాన ఎలాగూ ఉన్నారు గనుక. కాని భీష్మద్రోణాదులకున్న గురుస్థానం దృష్ట్యా యుద్ధానికి వాళ్ళు తెలిపే విముఖత కారణంగా ఆ పరిస్థితిలో దుర్యోధనుడు మాత్రం యుద్ధానికి తలపడి ఉండడు అనేది నిశ్చయమే! కర్ణుడు దుర్యోధనునికి కృతజ్ఞతా బద్ధుడూ, స్వీయ ప్రతిభా ప్రకాశానికి మార్గాంతరము లేనివాడూ కావడంచేత, అతనిమీదే దుర్యోధనుడు ఆధారపడటం జరిగింది; యుద్ధంలో తనకు విజయం కర్ణునిద్వారా చేకూరుతుందనే దుర్యోధనుడు ఆశించాడు. ఈ విధంగా కర్ణుని పాత్ర భారత యుద్ధానికి కీలకం అయింది. ఈ దృష్టితో చూస్తే ద్రౌపదిని సభలో పరాభవించే సందర్భంలో కాని, సంధి ప్రయత్నాలు జరిగే సందర్భంలో కాని కర్ణుని ప్రవర్తన ప్రత్యేకంగా దుష్టమని నిర్ణయించడానికి వీలులేదు. భీష్మద్రోణాదులకున్న పెద్దరికంగాని, స్వాతంత్ర్య ప్రతిపత్తిగాని కర్ణునికి లేనప్పుడు వాళ్ళు నివారించలేని పరిణామాలను కర్ణుడు నివారించలేకపోయాడని తప్పుపట్టడంలో సామంజస్యమూ గోచరించదు. కర్ణుని ధర్మము తన స్వామియైన దుర్యోధనుని మనసా, వాచా సమర్థించడమే! కాని యిది అతని పరిస్థితిద్వారా ఏర్పడిన ధర్మము: లౌకిక ధర్మము; దీనికి అతని ఆత్మధర్మముతో సమన్వయము లేదు! ఇంద్రుడు కర్ణుని కవచకుండలాల్ని హరించేందుకు వస్తాడని హెచ్చరించేందుకు వచ్చిన సూర్యునితో కర్ణుడిలా అంటాడు:

క. 'జగముల నెల్లను నిండిన
పొగడిత గదు వెలితిసేసి పొల్లయొడలికై
తగవే జన్మవ్రతమిటు,
దిగవిడువగ నేడు నాకు త్రిభువన దీపా!

మ. మతి గుంతీసుత పక్షపాతి యగుచున్
మాయా స్వరూపంబుతో
జిత ధైర్యుండు శత్రకతుండు నను భి
క్షింపంగ వేతెంచున
ట్టి తెరంగైన దదీయ కీర్తియ చుమీ
డిందుం, ద్రిలోకి సము
న్నతమై యొప్పు మదీయ కీర్తి, యిది నా
వా పుణ్యా మెబ్బంగులన్'

(అరణ్య—291-292.)

కవచ కుండలాల్ని యిచ్చెయ్యడంవల్ల తను అర్జునుని గెలిచే శక్తి తగ్గుతుందనీ, ఆ విధంగా స్వామియైన దుర్యోధనుని కార్యానికి లోపం వాటిల్లుతుందనీ, కర్ణుడు ఆలోచించడు! స్వామి కార్య నిర్వహణమే అతని ధర్మమైతే కర్ణుడు దానవీరమువల్ల వచ్చేకీర్తిని గూర్చి యింతగా వ్యామోహ పడరాదు. తను యుద్ధవీరుడా? దానవీరుడా? ఆత్మధర్మం ఏమిటి? ఆత్మధర్మంనుంచి ప్రత్యాఖ్యాతుడైన కర్ణుని కల్లోలమనఃస్థితికి యిది నిదర్శనము! ఈ మనఃస్థితిని చూచి నగచి సూర్యుడు మందలిస్తాడు కూడా:

క. 'కడు నెయ్యురు హితముగ జె
ప్పెడు పలుకులు వినవు గరము బేలవు, నీవె
క్కడ బుద్ధి తెరువు లెక్కడ,
చెడక వినుము నీకు దెలియ జెప్పెద గర్ణా!

క. తనకు దనయులకు సతులకు,
జననీ జనకులకు బంధుజనులకు గీడొం
దని తెరువున గీర్తి గొనం
జనుగా కందరును జెడు యశం బేమిటికిన్''

కాని కర్ణుడు ఈ ధర్మ సూక్ష్మాన్ని గ్రహించే స్థితిలో లేడు. కవచ కుండలాలు లేకపోయినా అర్జునుణ్ణి గెలవడం సాధ్యమేనని ఆత్మజ్ఞానశూన్యుడై అంటాడు. పరిస్థితుల ప్రాభవానికి లొంగి కర్ణుడు ఆత్మధర్మంతో పొసగని సంబంధంలేని లౌకిక ధర్మాన్ని ఆశ్రయించాడు. కేవలం కీర్తికోసం ప్రాకులాడటం కూడా లౌకిక ధర్మాన్ని ఆశ్రయించటమే అవుతుంది!

కర్ణునికి తను నిర్వహిస్తున్న, నిర్వహించవలసిన క్లిష్టమైన పాత్రనుగూర్చిన అవగాహన ఒకానొక తరుణంలో లభిస్తుంది. అది శ్రీ కృష్ణుడు పెట్టిన భిక్ష. ధృతరాష్ట్రునికి దివ్యలోచనములు ప్రసాదించినట్లే, కృష్ణరాయబార సందర్భంలో కర్ణునికి శ్రీ కృష్ణుడు ఆత్మజ్ఞానం కలిగిస్తాడు. కాని ధృతరాష్ట్రుని మళ్లీ మాయ కప్పివేసినట్లే, కర్ణునికూడా మాయ కప్పివేయడంద్వారా, ఆ పైన జరుగవలసిన కథకు సౌలభ్యం ఏర్పడుతుంది. రాయబారము ముగించుకొని వెళ్లిపోతూ శ్రీ కృష్ణుడు కర్ణుని "నన్ననిచి వత్తుగాని రమ్మని కరంబు సాచి చెయివట్టి తన యరదం బెక్కించుకొని" రహస్యంగా అతనితో అంటాడు—నువ్వు కుంతి పెద్ద కొడుకువి. ఈ తరుణంలో పాండవుల పక్షము చేరితే సామ్రాజ్యము నీదే అవుతుంది. ఏమంటావు? ఈ సందర్భంలో సూత కులమువారితో దుర్యోధనాదులతో ఏర్పడిన ప్రేమ, కృతజ్ఞత



అమూర్తం —శ్రీమతి వి. కరుణారావు.

అనే బంధాలు (లౌకికధర్మం) త్రెంచివెయ్యడం కర్తవ్యం కాదనే భావం ఒకవైపు కలిగినా, కర్ణుని దృష్టికి ప్రధానముగా కని పించినది అనుల్లంఘనీయమైన భవితవ్యం, అది రూపొందడంలో తను నిర్వహిస్తున్న పాత్ర:

తే. "ధర్మతనయుండు దాను వా తమ్ముడగుట
యెరిగెనేనియు సామ్రాజ్యమేల పూను
నట్టి ధార్మికు డాధిపత్యంబు జేయ
వలవదే శాశ్వతంబుగ వసుధకెల్ల.

క. అనుజులు బుధుతీజులుగ నీ
వని యిటు సేయుమని నీ వుపదిష్టపగా
విను కురుకుమారపశువిశ
సనమున రణయజ్ఞ మతడు సమ్మతి జేయున్.

వ. దానం బుణ్యభూమి యగు కురుక్షేత్రంబున మము
బోంట్లెల్లను సద్గతి వడయుదురుగాక...'

(ఉద్యోగపర్వము : చ—ఆ: 44, 45, 46)

కర్ణుడు పైజెప్పిన వాక్యాలలో, కురుక్షేత్ర యుద్ధం ఒక యజ్ఞంగా, ఆ యజ్ఞంలో సద్గతి పొందడానికి తను ఎదురు చూస్తున్నట్లుగా కర్ణునికి ఈ సందర్భంలో కలిగిన ఆత్మజ్ఞానం మనకు స్పష్టమౌతున్నది. కర్ణుడు కృష్ణునితో చివరిమాటగా: 'ఈ సమర సముద్రంబు దరియ సీది నిన్నుం గసియెద, గాదేని మార్త్యలోకంబునం గాంచెద, నీవింక నేమియుం బలుకకుము, వని నిలియెద'నవి కౌగిలించుకొనిన 'సట్లకాక పొమ్మని విష్ణుండు వీడు కొలిపె...'నట. తన పాత్ర నిర్వహించడానికి వెనుకాడక పోవడమే కర్ణుని గొప్పదనం. ఈ దివ్యదృష్టి తాత్కాలికము. కాని దీని ప్రభావమువల్లే, అర్జునుణ్ణితప్ప మరెవ్వరినీ యుద్ధంలో చంపననే వాగ్దానం చేస్తాడు కుంతీదేవికి ఇది లౌకిక ధర్మానికీ, ఆత్మధర్మానికీ అతడు చేయ్యప్రయత్నించిన సమన్వయం.

ఆ. "సవ్యసాచిచేత జచ్చుటయును గిరి,
కరమ యతడు లోనుగాగ నేవు
రేను లోనుగాగ నేవురుగావి నీ
కొడుకు లార్వురమట విడువు మింక."

(ఉ. ప: చ ఆ : 69)

కర్ణుని మాటల్లో ధీరత్వానికీ, సౌజన్యానికీ కుంతి హృదయం ద్రవిస్తుంది.

చ. "అనుటయు నంత గొంతి హృద
యంబున శోకము విప్పటెల్ల ని
ట్లను నిది దైవసంఘటన
మక్కట యెట్లును దప్పనేర్చునే..."

(ఉ. ప: చ. ఆ : 70)

కర్ణుడు నిర్వహించవలసిన క్లిష్టమయిన పాత్ర, అతని 'జన్మంబు పరమరహస్యంబు' కావటంతో ప్రారంభమై, ఆత్మ ధర్మానికీ, లౌకిక ధర్మానికీ సంఘర్షణగా సాగి, ఆత్మధర్మ ప్రత్యాఖ్యానముగా భాసిస్తుంది. అది దైవనిర్ణయము.

శల్యసారథ్యము కర్ణుడు వరించిందే! "కడింది పగఱకు హృదయ శల్యంబగుట...శల్యుండని ఆభిధానమయ్యె"నట. శల్యుడు నిజంగానే కర్ణునికి హృదయశల్యమైనాడు. "వినుల కుం బలుకులు సేదైనను జెప్పుదు హితంబులగు కార్యంబుల్ దానికి నోర్వగ వలయుం గాని యలుకవలదు..." అంటూ శల్యుడు మొదట్లోనే మాట చేసుకున్నాడు. "తగువార లొరులు దెగడుట, పొగడుట యగు పలుకు పొంత బోవరు, హితకార్యగతుల సెప్పగ దగు, బొగడగు నెదురొర్వవలయు బుద్ధిం గలిగినన్" అని హెచ్చరించాడు శల్యుడు. శల్యుడు నిర్వహించిన పాత్ర నిజంగా గొప్పది. లౌకిక ధర్మానికి కట్టువడి భారత కథలో అంతదాక తన పాత్ర నిర్వ హిస్తూవచ్చిన కర్ణుని అంతరమైన సంఘర్షణను చివరి ఘట్టంలో బహిర్గత మొనర్చి శల్యుడు రెండు విధాలుగా సారథ్యం నెరపినాడు. కర్ణుడు తన అహంభావాన్ని జయించి ఆత్మజ్ఞానం పొందేటట్లు చేయడం ఒకటి, కర్ణుడు రణరంగంలో నిహతుడుకావడానికి అతణ్ణి సిద్ధంచేయడం మరొకటి! అర్జునుని గొప్పదనాన్ని పొగడుతూ కర్ణు తడనికి సాటిరాడని శల్యుడుచేసే ప్రసంగం సహించలేక "ఊరక తేరు పొనిమ్మ"ని అంటే "హితము సెప్పదగనె...ఉన్న రూపు సెప్పకుండ నగునె?" అంటూ శల్యుడు తన ధోరణి మానడు. శల్యుడు చెప్పిన కాకి హంసముల కథతో కర్ణుని అహంభావము క్షతమైపోతుంది; మనసు చలించి, పూర్వస్మృతులు అతణ్ణి ముంచెత్తుతవి. "అలంచిన నెదకు సంతాపంబు సేయంగ జాలెడునట్టివి జామదగ్న్య కోపంబు బ్రాహ్మణ శాపంబు గాక..." అంటూ నిర్వేదంతో ప్రారంభిస్తాడు కర్ణుడు. కాకితో పోల్చి హేయంగా అవహేళన చేసినందుకు కోపం యినుమడించడంపోయి, కర్ణునిలో విషాదం రేకెత్తుతుంది. పరశురాముడు, బ్రాహ్మణుడు తన కిచ్చిన శాపాల్ని గూర్చి 'అచ్చటి మహీపతులు విన' శల్యునితో ముచ్చ టించడంలో కర్ణుడు ఎంతగా ఆ క్షణంలో బాహ్యపరిస్థితుల్ని విస్మరించి అంతర్ముఖుడైనాడో గ్రాహ్యం. తన బలహీనతల్ని గూర్చి తోడి రాజులతో ప్రసంగించడం సర్వసేనాధిపత్యం వహిస్తూ యుద్ధం నడిపించబోతున్న సమయంలో కర్ణుడు చేయదగిన కార్యమేనా? ఇక్కడ లౌకికమైన యింగితజ్ఞానం నశించి, అంతః కరణం ముందుకు, సత్యం ఎదుట, అది అప్రియమే అయినా దాన్ని ఎదుర్కోవడానికి, సిద్ధమై నిలిచాడు కర్ణుడు. పరశురాముడు కర్ణుని తొడమీద తలపెట్టి నిద్రిస్తూ ఉండగా ఒకానొక కీటకము ఆ తొడ క్రింద తొలిచింది; గురువునకు నిద్రాభంగము కాగూడదని బాధ కోర్చి కదలకుండా ఉన్న కర్ణుని జూచి పరశు

రాముడు "నీవు బ్రాహ్మణుడవు కావు. నీ కుల మేమిటి ?" అని ప్రశ్నించాడు. తన సంగతి ఆ విధంగా బయట పడినందుకు విచారిస్తూ, అందుకు కారణమైన ఆ కీటకాన్ని ఆలోకిస్తే "అది అదృష్టపూర్వ వికృతాకారంబై" యుండెనట ! (వక్రించిన కర్ణుని అదృష్టమే ఆ కీటకంగా దర్శనమిచ్చిన ధ్వని ఈ పద బంధములో ఉండడము తిక్కన కవిత్వంలోని సొగసు.) పరశు రాముడు శాప మిచ్చినాడు. అలాగే బ్రాహ్మణు డిచ్చిన శాపాన్ని గూర్చిన ఉదంతము కూడా వక్రించిన అదృష్టానికే తార్కాణ. "బ్రాహ్మణుం డధిక కోపంబున నిది హోమధేనువత్సం బిట్లు దీని శల్య నిహతంబు జేసితి నీవు నా వచన శల్యంబున నిహతుండ వగుము..." అన్నాడట. (ఈ వాక్యములో శల్యుడు నిర్వహిస్తున్న పాత్ర యొక్క అంతరార్థము తిక్కన ధ్వని పూర్వకంగా సూచించి ఉన్నాడు.) కర్ణుడు బ్రాహ్మణుని కోపము తీర్చేందుకు 'నాకు గల సొమ్ము లెల్లను నీకిచ్చెద, నను బ్రసాద నిరత కటాక్షాలోకితు జేయు' మని ప్రార్థించాడట. ఆత్మ ధర్మానికి వెలియై లౌకిక ధర్మాన్ని ఆశ్రయించవలసి వచ్చిన కర్ణుని దౌర్భాగ్యము యొక్క పోలికే కర్ణుడు బ్రాహ్మణునికి సంపదను దానముచేసి శాపాన్ని పరిహరించుకో జూడటంలో కూడా స్ఫురిస్తుంది. ఈ రెండు ఉదంతాల్ని చెప్పి ముగింపుగా కర్ణుడు అంటాడు : "ఆ జామదగ్న్య బ్రాహ్మణ శాపంబులకు వెరతు, సత్యంబ పలికితి, నీ యున్న రాజులును నాతోడి సుఖదుఃఖంబులకుం గలవారగుట జేసి..." అక్కడ ఉన్న రాజుల్ని తనతోడి సుఖ దుఃఖంబులకుం గలవారని అనుకొనుటలోనే కర్ణుని బేలతనము కనిపిస్తుంది ! పోతే, 'సత్యంబ పలికితి' అనడంలో కర్ణుడు పై శాపోదంతాల్ని దుర్యోధనునికి చెప్పక దాచడమూ, శల్యుని సూటి పోటి మాటలద్వారా యిప్పుడు ఆ సత్యాన్ని బహిర్గతము చేయడమూ తెలుస్తుంది. కర్ణుని ధోరణి చూచిన శల్యుడు తనలో యిలా అనుకుంటాడు : "వీని యంతరంబు కలంగ దా నర్జునుచేతం జచ్చుట నిర్ణయించె..." శల్యుని సారథ్యము నెరవేరినట్లే. ఈ విధంగా కర్ణుడు కొంతసేపు అంతర్ముఖుడైనప్పటికీ, ఆ మనఃస్థితి త్వరలోనే మారుతుంది. దుర్యోధనుని మైత్రి, తను అతనికై నిర్వహించవలసిన ధర్మమూ జ్ఞాపకం వస్తాయి. "జను లెట్టిది మిత్రవిధంబని చెప్పెదు రట్టి చంద మఖిలము దుర్యోధనునందు గలదు నా యెడ, మన మూరడియుండు నా కమంద ప్రీతిన్" అనుకొని మనస్సునకు ఊరట కలిగించుకుంటాడు కర్ణుడు. శల్యుని మాటలకు క్రొత్తగా కోపం తెచ్చుకుని శల్యుని దేశాన్నీ, అక్కడి ప్రజల్నీ తూలనాడతాడు. అందుకు శల్యుని సమాధానం : "ఒక దేశంబు దా గీడయగుట కలుగునే యట్లుంగాక సదాచార దురాచారంబులు దైవం బెరింగెడు, నీ వనాత్మజ్ఞుండ వూరకుండు" మని. 'నీ వనాత్మజ్ఞుడవు' అన్నమాట కర్ణునికి సూటిగా తగులుతుంది.

పాండవ జ్యేష్ఠుడైన కర్ణుడు సూత కులములో పెరిగి దుర్యోధనుని చెప్పుచేతలలో మెలగి, కౌరవుల పక్షమున యుద్ధము చేసి నిహతుడు కావడానికి ప్రథమ కారణము తల్లియైన కుంతీదేవి. ధర్మము తల్లివంటిది, అని వానుడి. కన్నతల్లికి వెలియై పెంపుడుతల్లియొద్ద పెరిగి తత్ఫలితంగా లోకంలో స్థానచ్యుతిని పొందడానికీ, ఆత్మధర్మానికి వెలియై లౌకికధర్మాన్ని ఆశ్రయించి తత్ఫలితంగా వ్యక్తిగతమైన ప్రతిభ విఫలం కావడానికీ గల చక్కని సామ్యం కర్ణుని చరిత్రలో మనకు గోచరిస్తుంది. ఇది భావనాత్మకమైన సామ్యం (Imaginative parallel) మాత్రమే కాదు; తాత్త్వికరహస్యంకూడా. కుంతీదేవి, పాండవులు కర్ణునికి జరిగిన 'అన్యాయానికి' ఫలితం అనుభవించకపోలేదు. యుద్ధానంతరం కర్ణుడెవరో తెలిసిన ధర్మజుడు తల్లితో అంటాడు :

తే. "మమ్ము నందర నెవ్వని మహితశక్తి
యెక్కుడై సంగరంబున జిక్కుపరిచె
నట్టి కర్ణుని గొంగున నగ్ని డాచి
నట్లు లెమ్మోయి డాచితో యమ్మ చెపుమ.

తే. కర్ణు దొలు చూలుగా నేల కంటి తల్లి,
నీదు మంత్రంబు పరమ విషాదకారి
యయ్యె మాకెల్ల నట్టి మహాబలైక
గణ్యు బ్రుంగుడు పరచుట కారణమున"

(స్త్రీ పర్వము: ద్వి—ఆ:179, 181)

ధర్మజుని పై వాక్యములలో ప్రతి అక్షరమూ బరువైన సత్యాన్నే సూచిస్తుంది. కొంగున డాచిన అగ్ని క్రమంగా దహిస్తూనే ఉంటుంది. దాచిపెట్టిన కర్ణుని జన్మవృత్తాంతమూ అలాగే చేసింది. దాని మూలంగానే కర్ణుడు శత్రుపక్షమున చేరి యుద్ధానికి కారణమై, యుద్ధంలో ఒకానొక ఘట్టంలో పాండవులను నశింపజేసేదాకా వచ్చాడు. కర్ణునిచేత ఓడిపోయి అవమానితుడైన ధర్మజుడు అర్జునుణి తిట్టిపోయడమూ, అర్జునుడు కోపావేశుడై ధర్మజుని చంప బూనటమూ, తర్వాత పశ్చాత్తప్తుడై ఆత్మహత్య కుపక్రమించటమూ చూస్తే ఆ సన్నివేశంలో శ్రీకృష్ణుని జోక్యం లేకపోతే పాండవుల సర్వనాశం సంభవించేది అని తోస్తుంది. అంతా అయిన తర్వాత ధర్మజుడు "దమ్మునిం గౌగలించుకొని మూర్ధాఘ్రాణంబు సేసి చిరునవ్వుతో మనల నంతవరచునే కర్ణుండని" అంటాడు ఆశ్చర్యంతో. (కర్ణపర్వము : తృ—ఆ 109). పోతే, 'మహాబలైక గణ్యుడైన' కర్ణుడు 'బ్రుంగుడు పడుట' విధివైచిత్రి. నైసర్గిక గుణాలైన

దానశీలత, గురుభక్తి, ధీరత్వము, మాతృభక్తి, కృతజ్ఞతాభావము ఇతరులలో ప్రతిభను ఇనుమడింపజేసి, విజయహేతువులు కాగా, కర్ణుని విషయంలో అతని ప్రతిభను 'భంగుడు పరచేందుకు' అతనికి అపజయం కలిగించేందుకు కారణా లయ్యాయి. దానశీలత కవచకుండలాలను పోగొట్టింది. గురువునకు నిద్రాభంగము కాగూడదని భక్తితో, ధీరతతో దేహం క్షతవౌతున్నా ఓర్చుకొని ఉండటం పరశురాముని శాపం లభింపచేసింది. మాతృభక్తి ప్రతిపక్షము వారైన పాండవులలో నలుగురికి అభయ ప్రదానం చేయించింది. కృతజ్ఞతా భావము దుర్యోధనుని కార్యాలను సమర్థించి, కర్ణుడు దుష్టచతుష్టయములో ఒక్కడనే దుష్కీర్తి కలిగించింది. మహాబలశైకగణ్యుడే కాదు, సచ్ఛీలికూడా యైన కర్ణుడు 'భంగుడు పడటం'లోని వైచిత్రి యిది.

శల్య సారథ్యాన్ని చక్కగా అవగాహన చేసుకొన్నప్పుడు కర్ణునికి కలిగిన ఆత్మజ్ఞానము, అతడు పొందిన సుగతి మనకు స్పష్టవౌతుంది. ఆత్మజ్ఞానోన్ముఖమైన వ్యక్తి చైతన్యము దాటవలసిన మూడు దశల్ని ఒకానొక సాధనమార్గం* పేర్కొంటూ అందులో రెండవ దశలో వ్యక్తిలోని ద్వైధీభావమును 'కీలక' లేక 'శల్య' అనే పేరుతో వ్యవహరిస్తున్నట్లు తెలుస్తున్నది. కర్ణునిలోని ద్వైధీభావాన్నీ, అతడు పొందిన ఆధ్యాత్మిక విజయాన్నీ శల్యసారథ్య ఘట్టంలో మనం చూస్తాము.

యుద్ధంలో రథచక్రము భూమిలో క్రుంగిపోయింది. ఇది బ్రాహ్మణ శాపమనీ, అనివార్యమనీ కర్ణునికి తెలుసు. తెలిసినప్పటికీ కర్ణుడు వెనుకాడలేదు. "అరదంబు పిరిది కొమ్ము క్రిందికి మూపు సానిపి లావున నెత్తిన, రథ చక్రంబు విడువక భూమి గులపర్వత కానన సముద్ర సహితం బారంగుళంబు లెగసె, నట్లు కర్ణుండు రథంబు నిలిపి మీదికింజని యొప్పటి బాణంబు సంధింప, వెండియు జక్రంబు క్రుంగిన గ్రమ్మర రథంబు డిగ్గ యెత్త నమరె..." ఇది కర్ణుడు, అర్జునునితో కాదు, విధితో చేసిన పోరాటము! ఈ చివరి దృశ్యము కర్ణుని జీవితానికి చక్కని స్పృహణీయమైన ప్రతీక.

విధి నిర్ణయించిన పాత్రే అయినా, విధితో పోరాడే మానవ శక్తి, దాని ఉదాత్తత, వైచిత్రి, విషాద గాంభీర్యము గ్రీకు నాటకాల్లో, షేక్స్పియర్ విషాదాంత నాటకాల్లో కావ్యవస్తువు. భారతకథనుంచీ ఎన్నో నాటకాలూ, కావ్యాలూ మనకు వచ్చాయి. కర్ణుని నాయకునిగా స్వీకరించిన కావ్యం ఒకటైనా లేకపోవడం కొరతే! దానికి కారణం అతడు సూతపుత్రుడు కావటమేనా?

---

* '...In the realization of Self everyone is to cross over the three distinct obstacles in his mental self which are respectively the 'Argala' (Surge) of the Ocean of Desire (Kama-Sagara), the duality in the self which is a great impediment (Kilaka) in the salvation of the soul (mukti-pasa), and the unsteadiness in the reliance on the self signified by Devi Kavacha...(Page 166 'Aryan Path' April 1967.) 'Another Sanskrit word for Kilaka is Salya, which is also found to be used in this significant sence in the Mahabarata..." (Page 169. Ibid)

మనిషి : రెండు

శ్రీ వాకాటి పాండురంగరావ్

ఢిల్లీ అనే చరిత్రనుండి మధుర అనే పురాణం వైపు పరుగెత్తే రోడ్డు చాల పొడుగాటి రోడ్డు. చాల ముఖ్యమైన రోడ్డు. కొన్ని చోట్ల చాల ముచ్చటైన రోడ్డు కూడాను.

ఆ రోడ్డు మీదే 'పురానా ఖిల్లా' అనబడే పాత కోట వుంది. 'జూ' వున్నదీ ఆ రోడ్డుమీదనే. ఒకశం నుండి చూస్తే త్రాసులా కనుపించే భవనంలో కాపురం చేసే సుప్రీంకోర్టు కాక పదకొండంతస్తుల సర్రికొత్త హోటలు ఉన్నది ఈ ఢిల్లీ మధురా రోడ్డుమీదే.

రకరకాల చెట్లు ఇరువైపులా బారులు తీరిచి నిలిచి జోహారు చెప్తుండగా - నల్లగా, నంభై యడుగుల నడుముగల నీగ్రో సుందరిలా పరుగెత్తే మధుర రోడ్డు మరి గర్వపడుతుందంటే పడదూ!

పదకొండంతస్తుల హోటలు దాటిన తర్వాత మధుర రోడ్డు కడ్డంగా ఒక ఆకుపచ్చటి ద్వీపం వున్నది.

అక్కడ – 'తినగ తినగ తియ్యన'వుతుం దంటారే ఆ బాపతు వేపచెట్లూ, వేసవి మాసాలలో దేవత లెవరో పెళ్ళిపీటంపై కూచుని బంగారు ముత్యాలను తలంబ్రాలు పోసుకుంటున్నట్లు గుత్తులు గుత్తులుగా పసుప్పచ్చటి పువ్వులను వర్షించే 'సోనా'ల చెట్లూ కలిసి కంటిక కమ్మగా విందు చేస్తాయి.

ఆ ద్వీపం మధ్యగా – చరిత్రకు సాక్ష్యులుగా ఢిల్లీయంతటా నిలిచివుండే శతకోటి సమాధులలో ఒక్కటి – నెత్తిమీద గుండ్రటి టోపీ పెట్టుకున్నది, తుప్పు పట్టిన దానిలా వున్నా అక్కడక్కడ పచ్చగా నీలంగా మెరుస్తున్నది – వున్నది.

ఆ ద్వీపం నిలిచి వున్నచోట మధురారోడ్డునుండి ఎడమవైపుకు ఒక్క మట్టిబాట బయలుదేరుతుంది. ఆ బాట ఓ అర ఫర్లాంగు దూరం వెళ్ళి హుమాయూన్ సమాధి దగ్గర ఆగిపోతుంది. నిత్యమూ పొద్దునపూట యాత్రికుల బస్సు వచ్చి వెళ్ళేచోటు అది. మిగతా వేళల జనసంచారం అంతగా వుండనిచోటు అది.

మధురారోడ్డునుండి ఆ మట్టి బాట పుట్టే చోట మధురా రోడ్‌కు ఎడమవైపుగా, మట్టిబాటకు కుడివైపుగా ఒక పెట్రోలు బంక్ వుంది.

ఎనిమిదేళ్ళనాడు, ఇంకా ఆ ప్రాంతం ఒక మోస్తరు అరణ్యంగా వున్ననాడు, ఆ మట్టి బాటకు ఎడమవైపుగా వున్న చెట్ల మధ్యగా వెళ్ళి కూచున్నాడు ముకుందం.

అతడు కూచున్న చోటినుండి ఎదుటికి చూస్తే నంభై యడుగుల దూరాన మట్టిబాట, దాని కవతల పెట్రోలు బంక్ వున్నాయి, ప్రక్కకు చూస్తే దాదాపు పది గజాల దూరాన చెట్ల సందులోనుంచి మధురా రోడ్డు మీద అపుడపుడు దూసుకు పోతున్నకార్లు కనపడుతున్నాయి.

అపుడు సాయంకాలం ఆరుంబావు అవుతూంది. సూర్యుడు అస్తమించవలసిన సమయమే కాని అది జూలై మాసం అవడంచేత ఇంకా సూర్యుడు, ఔరంగజేబులా వెలుగుతూ వున్నాడు.

ఆ వెలుగులో కూచున్నాడు ముకుందం.

ముకుందం చాల, విచిత్రమైన మనిషి. బుద్ధుడికీ మార్క్సుకూ గల సామ్యాన్ని చర్చించడం అతగాడి హాబీ. అతడు చాలాకాలం సోషలిస్టు, కొంతకాలం కమ్యూనిస్టు, ప్రస్తుతం ఉద్యోగాన్వేషనిస్టు. మరీ ఏకటాకీన ఏ మూడు నాలుగు రోజులో పస్తుండిపోవలసివచ్చిన సందర్భాలలో ముకుందం గేయాలూ గ్రటూ రాయడమూ కద్దు.

అతడి మిత్రుడు శశిధర్ నాట్యాచార్యుడు. సంపద ఎంతోవుండి, సంస్కృతిని కొనడానికని తిరుగుతుండే ఆడవారొకరిద్దరు శశిధర్‌కు తెలుసు. ఆ స్నేహాల ధర్మమా అని శశిధర్ కళ విహరించడానికి కొత్త రంగం దొరికింది. అతడు సంగీత రూపకాలను ప్రదర్శించడం మొదలు పెట్టాడు. ముకుందానికి ఏదో నాలుగు డబ్బులు ముట్టజెపుదామన్న ఉద్దేశంతో తాను తయారుచేసిన ''శివలీల'' అన్న సంగీత రూపకానికి బలవంతాన ముకుందం చేత నాలుగు పాటలు రాయించాడు. ఆ పాటలు ప్రజలను

విపరీతంగా ఆకర్షించడం చూచి అందరికన్నా ఎక్కువగా ఆశ్చర్యపడిన వ్యక్తి ముకుందమే!

అరెరె, ఇదేదో మనకే తెలియకుండా మనలోపల ఓ శక్తి వున్నట్టుందే—అని ఆశ్చర్యపోయాడు ముకుందం.

ఆ మరు సంవత్సరం శశిధర్ నెహ్రూ రాసిన 'డిస్కవరీ ఆఫ్ ఇండియా' సంగీత రూపకంగా ప్రదర్శించ సంకల్పించాడు. దానికి పాటలు రాయమని ముకుందానికి చెప్పాడు.

అంతకు ముందుసారయితే శశిధర్ రాయమని అడగగానే రాసిచ్చేశాడు ముకుందం. కాని ఈ సారి తాను కొంత పేరు పొందిన కవి గనుక అంత సులభంగా రాసేయ కూడదనుకున్నాడు ముకుందం. ఏవో కొన్ని ఉన్నత ప్రమాణాలు నిర్ణయించుకుందాం --అనుకున్నాడు. మూడ్ కావాలన్నాడు. ఇన్స్పిరేషన్ రావాలన్నాడు అలంకారాలు అమరడం లేదన్నాడు ధ్వనిలో లోపం వినపడుతూంది అన్నాడు. మొత్తంమీద అయిదింట మూడు పాటలు రాయడానికి నెలకు పైగా టైము తీసుకున్నాడు ముకుందం.

ఆ వేళ శశిధర్ వాళ్ల నటీనట వర్గమంతా హుమాయూన్ సమాధి కివతల ఓ అరమైలు దూరంలో ఒక ఇంట్లో రిహార్సల్‌కని మధ్యాహ్నమే వచ్చారు. వాళ్ల రిహార్సల్స్‌ని చూస్తూ, అక్కడొక్కటి ఇక్కడొక్కటిగా వాళ్ల ఉచ్చారణనూ, నటననూ దిద్దుతూ - వాళ్లు తన పాటలు పాడుతున్నప్పుడు ప్రత్యేకంగా కనుబొమలు ముడిచి చూస్తూ —వాళ్ల సంగీతానికి మెరుగులు దిద్దుతూ వున్న ముకుందానికి లోలోపల నవ్వు వచ్చింది

'ఏమోయ్ ముకుందం, ఏవి టీ నాటకం అంతా? ఆఁ? ఆ అమ్మాయి ఆ పంక్తిని ఇట్లా పాడితేనేం, అట్లా పాడిలేనేం —ఏదో సూపర్‌ఫైన్ డిఫరెన్స్ లఘోరించినట్లూ, అదేదో నీ కళా హృదయానికే తెలిసినట్లుగా దిద్దుతున్నావే! ....కట్టిపెట్టవోయ్ మిడతంబొట్లూ—' అని లోలోపల నుండి పరిహాసం విన్పిస్తే విసీ విననట్లూరుకున్నాడు ముకుందం

ఒక సోగకన్నుల చిన్నది, విష్ణుప్రియ అన్నది, తన పాత్రను అభినయించి చూపి 'డైరెక్టర్ సాబ్' అంటూ శశిధర్ అభిప్రాయంకోసం చూడగా, శశి ముకుందాన్ని చూశాడు. ముకుందం విష్ణుప్రియ వైపు చూచి — 'అబ్బే, బొత్తిగా లాభం లేదు' అన్నట్లు పెదవి విరిచాడు.

'ఏదో మహా తెలిసి ఏడిచినట్లుగా పెదవి విరిచేస్తూన్నావుగాని ఒరేయ్, ఆ మాత్రం భావాన్ని నువ్వు తెప్పించు నీ పిడక మొహంమీద —' అంటున్న తనలోని ప్రతిధ్వని ఇంకెవరికీ వినపడలేదుకద అని కలయజూశాడు ముకుందం.

అయిదు పాటింది రిహార్సల్ జోరుగా సాగుతూంది. ముకుందం అనుకున్నాడు – ఇట్లాగే, ఈ మొహాలకు రంగులు పూసుకునే కుర్రసంత ఎదుట అస్తమానం కూలబడి పోతే సుప్రసిద్ధ వాగ్గేయ కారకుడయిన బి జి ముకుందం మానవుడిలా కన్పించేస్తాడేమో— కవి అన్నవాడు కాని, రచయిత అన్నవాడు కాని ఇతరులకన్న భిన్నంగా వుండాలి.

భిన్నంగా అంటే ఎట్లాగా?

జుత్తు దువ్వకపోవడం —

చొక్కాకు బొత్తాలు పెట్టుకోకపోవడం —

డబ్బులున్నా బీడీలు కాల్చడం —

చెప్పులు లేకుండా తిరగడం —

ఎప్పుడూ దూరంగా దేనివైపో చూస్తూండడం .....

.... అబ్బబ్బ, ఇట్లాటివి చేయడం నాకు నచ్చదు అని అంతకు ముందెన్నోసార్లు అనుకున్న ముకుందం— ఆ వేళ ముకుందం— ది – గ్రేట్‌రైటర్ పాత్ర నభినయించా లనుకున్నాడు రిహార్సల్ మాంచి, రసవత్తరమైన ఘట్టంలో వుండగా దానిని తదేకంగా తిలకిస్తున్న శశిధర్ దగ్గరకు వెళ్లి "శశీ... బుర్రలో ఏవో అయిడియాలు కదులుతున్నాయి.... నేనలా వెళ్తా" నన్నాడు.

తల ఊచాడు శశి.

నడిచాడు ముకుందం. నడిచి నడిచి హుమాయూన్ సమాధి దగ్గరకు వెళ్లి మట్టిబాటకు ప్రక్కగా, ఆ బాటకు దూరంగా, పొదల ఒడిలో కూలబడ్డాడు. కోటు జేబు లోంచి దినపత్రిక చుట్టిన పొట్లం తీశాడు. ఆ పత్రికను విప్పి, దానిమధ్య వున్న బీర్ బాటిల్‌ను తీసి అందులో మిగిలి వున్న కొద్ది 'బీరు'నూ 'ముకుందార్పణం' అంటూ గొంతులో పోసుకున్నాడు.

ఆ బాటిల్‌ని చేత్తో పట్టుకున్నాడు.

నవ్వొచ్చింది ముకుందానికి.

నవ్వాడు పెద్దగా.

బాటిల్‌ని మెడ దగ్గర, భామామణిని నడుం దగ్గర పట్టుకో— అన్నాడు ఎవడో ఒక ఇంగ్లీషువాడు.

మరి ఆ భామామణి తను కాపురం వుంటున్న ఇల్లుగలాయన యొక్క ఇల్లాలయిన సర్దారిణిలా వుంటే ·

నదరు నడుముకు చాంతాడు చుట్టీకదా లాగవలె! ... పూర్ ఇంగ్లీష్‌మాన్! సామెతలు పలికే ముందుగా సర్దారిణుల గాంచుము; లోకజ్ఞానము బడయుము — అనుకున్నాడు ముకుందం.

అందుకనే నవ్వుకున్నాడు.

ఇంకా వెలుతురుంది కాని ఎక్కడో కుయ్యోమని తోడేలు అరుపులాటిసె వినిపించింది ముకుందానికి. బలం కొద్దీ ఆ బీర్ బాటిల్‌ని విసిరేశాడు. దూరంగా వెళ్లి 'ఢడ్' మన్న చప్పుడుతో పడింది ఆ బాటిల్. ఆ చప్పుడుకు బెదరిన పావురాల జంట రెపరెపమంటూ లేచింది. బౌలర్ ముకుందం ప్రావీణ్యం చూసి కవి ముకుందానికి ముచ్చ టేసింది.

గడ్డిమీద రుమాలు పరచి వెల్లకిలా పడుకున్నాడు ముకుందం.

ఆకాశం — అతడిని వంగి ముద్దుపెట్టుకోవడానికి యత్నిస్తున్న తల్లిలా కన్పించింది.

ఓరి వెర్రివాగన్నా — నువ్వేదో కళ అని, ఆరాధన అని, కవిత్వం అని, విజ్ఞానం అనీ బొంకుతుంటావే — చూడు — ఇటు చూడవోయ్ — బాగా చూడు — నీ కళ్లు అంటుంటావే, అవి చాలేమో చూడు! చూచి చెప్పు ఏమం టావో దీన్ని — అందం అంటావా — ఆనందం అంటావా — అనుభూతి అంటావా — ఛందస్సంటావా — బ్లాంక్ వెర్సంటావా — నీవంటి గడ్డిపోచల మెదడులకు అందరేని మహావిచిత్రం అంటావా — ఏమంటావురా అబ్బీ — అని నిలవేసి అడుగుతున్నట్లుంది ఆకాశం. తల విదిలించు కుంటూ లేచిన ముకుందానికి హఠాత్తుగా — తానున్న చోటికీ — తనకు నలభై అడుగుల దూరంలోవున్న మట్టె బాటకు మధ్య, కాస్త ఎడంవైపుగా ఆ చెట్లవరుసమధ్యగా ఇద్దరు నిల్చున్నట్లు కనుపించారు.

ముకుందంలోని పత్తేదారు వెయ్యికళ్లతో పరి కించసాగాడు.

వాళ్ళిద్దరూ మళ్లీ కూచున్నారు. కష్టపడి చూశాడు ముకుందం. ఒక్క రున్నట్లే కనుపించింది.

అదేమిటి, ఇందాక తాను స్పష్టంగా ఇద్దరినిచూస్తే .. మరి కాసేపు తర్వాత వాళ్లు లేచి నిలబడ్డారు.

ఆ... నే చెప్పలేదూ ... ఒక్కరు కాదయ్యా మహా నుభావా, ఇద్దరూ — ఒకటి ప్లస్ ఒకటి — అని చెప్ప లేమూ — అని లోపల తాను చెప్పుకుంటున్న ముకుం దానికి, ఆ ఇద్దరూ ఒక్కరు కావడం కనుపించింది.

ఓరి నీ ఉస్సాదియ్యా — అవేమీ దెయ్యాలూ భూతాలూ కావయ్యా స్వామీ. .... వాళ్లిద్దరూ ఆడా మగా, ఆడం అండ్ ఈవ్, ప్రకృతీ పురుషుడూ, పుష్పమూ, భ్రమరమూ...వగైరా వగైరావోయ్ వాటుకవీ—అని చెప్పాడు అంతర్ముకుందుడు.

ఐస్సీ! ఐస్సీ! అనుకుని చూడకూడదనుకుంటూనె చాల జాగ్రత్తగా చూశాడు ముకుందం.

ఆ అబ్బాయీ అమ్మాయీ గాఢంగా మళ్లీ ఒక్క సారి కౌగలించుకుని ముద్దుపెట్టుకున్నారు.

ముకుందం పెదవులను ఆరడి నాలుక ముద్దు పెట్టుకొంది

చీకటి పడుతూంది. వాళ్లిదరూ నెమ్మదిగా అడు గులు వేశారు. మట్టి బాటను సమీపించారు.

కాని అరెరె . .. ...

ఏమిటిది .... వాళ్లు మళ్లీ వస్తున్నారే .... ఇటే వస్తున్నా రేమిటి . కొంపదీసి దారి దోపిడి దొంగల జంట కాదుకద . అయితే బాబోయ్, తన్ను చితకపొడిచేయ గలరు... కేకవేసినా పలకడానికి ఎవరూ లేరు. ఆ రిహా ర్సలు కూడా ఈ పాటికి అయ్యిపోయుంటుంది.

అయినా ముకుందం! నీకు నువ్వంత ప్రాధాన్యం ఎందు కిచ్చుకుంటావోయ్ .. . నువ్వేమన్నా పెద్ద సినిమా స్టారునా లేక కోటీశ్వరుడి ఒక్కగా నొక్క కొడుకువా, నిన్ను దొంగలు ఎత్తుకుపోయి ఏ యాభై వేలో ఇస్తేగాని వదలి పెట్టము — అని ప్రకటించడానికి! లేపోతే నీమీద ఏమన్నా నవరత్నఖచితమైన పతకాలా, దగాలా వెలిగి పోతున్నాయా వాళ్లు దోచుకోవడానికి అందువలన ఓ ముకుందమా, భయపడకుమా—

వగైరా డైలాగుని తనలోంచే వింటున్న ముకుం దానికి ఆ మసక చీకటి వెలుతురులో, వాళ్లిద్దరూ ఒకే చోట నిలబడ్డారు కాస్సేపుండి అటూఇటూ తచ్చాడ సాగారు.

ఒప్పే! ఇదేదో క్షురకరు ప్రణయంలాగుందిస్మీ! ... ఆ ఆడకూతురు 'పద మధూ పద' అంటూంది కాబోలు, 'నిలు సుధా నిలు' అంటున్నాడు కాబోలు హీరో క్షురవాడు. విడవలేక, విడవలేక మథనపడుతూ, బాధపడుతూ ఆ ప్రేమికులిద్దరూ—

తలనొప్పి
ఎక్కువగా ఉన్నా
తలకేగా!

అమృతాంజనం

వాడి శీఘ్రంగా నివారణ పొందండి

స్థానికంగా ఉండే బాధను నివారించుకోడానికి ఊరికే మందులు ఎందుకు పుచ్చుకుంటారు? నొప్పిఉన్న చోటుమీద అమృతాంజన్ రాసి అమోఘంగా శీఘ్రంగా నివారణను పొందండి. ఏ అపాయం లేకుండా కండరాల నొప్పులకు, తల నొప్పికి, బెణుకులకు ఇంకా కీళ్ల నొప్పులకు అమోఘంగా గుణమిచ్చే అమృంతాంజన్ 10 రకాల ఔషదాలు చేరిన మందు. అమృతాంజన్ గుండెజలుబుకే కాక సాధారణ జలుబులకు కూడా మంచి మందు కొంచెంకొంచెమే ఉపయోగించవలసి ఉంటుంది కాబట్టి ఒక సీసా మీ కుటుంబాని కంతాకలిపి నెలల తర .డి వస్తుంది

అవసరానికి ఎప్పుడూ అమృతాంజన్ ఉంచుకోండి అమృతాంజన్ 70 ఏళ్ల ప్రసిద్ధిసిపొందిన నమ్మకమైన గృహఔషధం.

అమృతాంజన్ నొప్పులు జలుబుల నివారణకు 10 రకాల ఔషధాలు చేరిన మందు



అమృతాంజన్ లిమిటెడ్,
మద్రాసు - బొంబాయి - కలకత్తా - ఢిల్లీ

ఒరేయ్ ముకుందం! వెధవతినెధవా! వాళ్ళ గొడవేదో వాళ్ళు పడతారుగాని నువ్వలా ఒళ్ళెరగా పాడూ లేకుండా అటుచూడ్డం ఏమిటోయ్ ... తప్పు కదూ ... మళ్ళీ నలుగురి మధ్య వున్నప్పుడు — బుద్ధుడు అరవిందుడు — అంటూ కవితె కట్టలు విప్పుతానే — ఒంటరిపాటున ఈ తుంటరి బుద్ధులేల — అని లోపలి ముకుందం ఘోషిస్తుండగా —

—ఆ మట్టి బాటకు అవతలవున్న పెట్రోలు బంకు తాలూకు నాలుగు రెట్లు ఎనిమిది ఫ్లోరసెంట్ దీపాలు వెండిపళ్ళల్లా వెరిగిపోతూ పంచి పెడుతూన్న నకిలీ వెన్నెల కడ్డంగా ఆ ప్రకృతి పురుషుల శాల్తీలు సిల్హౌటులై కనుపించాయి ముకుందానికి.

—కాళ్ళు కాలిన పిల్లుల వలె

—బెల్లం కొట్టిన రాళ్ళవలె

—తేలు కుట్టిన దొంగల వలె

వాళ్ళిద్దరూ అక్కడే నిలబడుతున్నారు, అక్కడే అటూ ఇటూ తిరుగుతున్నారు.

ఎందుకు?

ఎందు కెందు కెందు కెందుకూ?

ముకుందం నెత్తిమీద ఎవరో చరిచినట్లయింది.

ఆరి చవటా! ఆరి శుంఠా! ఓరి జడుడా! హోరి మూఢా! .... వాళ్ళేదో వెతుకుతున్నారోయ్.. వెతుక్కుంటున్నారు.. .. మరే, అన్వేషించుచున్నారు .. .. గవేషించుచు ..... నీ పిండాకూడింపుచు......

వెళ్ళవోయ్ వెళ్ళు! వెళ్ళి, పాపం, ఆ మసక వెలుతురులో ఆ కుర్రకుంక లిద్దరూ ఏం వెతుక్కుంటున్నారో కనుక్కొని వాళ్ళకు కాస్త సాయంచేయి, ఫో!... !.

సాయంకాలపు ఆనందామృతంలోని విషపు బొట్టు లాంటి ఈ వెతుకులాటను అంతంచేసి, వాళ్ళు పోగొట్టుకున్న దేమిటో చూసిపెడితివా నీ జవ్వాళ్టి బ్రతుక్కి ఓ సంజాయిషీ దొరుకుతుంది . ఫో ఫో.. .. ఫో... అని తరిమాడు ముకుందంలోని ముకుందం.

భయంభయంగా, అయినా అభయ ఉభయంగా — 'అబ్బా, నా కేమిటి గురూ, నేను వాళ్ళ నుద్ధరించడానికి వస్తున్న సిద్ధపురుషుణ్ణి' అనుకుంటూ —నెమ్మదిగా, నిబ్బరంగా నడిచి వచ్చి వారికో పదడుగుల దూరాన వుండగా — మర్యాదకూ మరియూ తనరాకకూ సూచనగా ఓ దగ్గు దగ్గాడు ముకుందం.

ఆ దగ్గు తన పనిని నెరవేర్చింది.

వాళ్ళిద్దరూ అదిరిపడి ఇటు చూశారు. అతడిని చూసి వెర్రి మొహాలు వేశారు. ఆ మొహాలను చూచిన ముకుందం – బలి చక్రవర్తి నెత్తిమీదకు పాదమెత్తిన వామనుడిలా ఫీలయ్యాడు.

"మీ రేదో వెతుకుతున్నట్లున్నారు?" అన్నాడు — అది ప్రశ్న కాదన్నట్లు, అది ఏమయితేనేం నాకేమిటన్నట్లు అదేదో నాకు చెబితే నా బుజ్జి నాయనలారా నే చూసి పెడతాగా అని వారిని బుజ్జగిస్తున్నట్లు.

అదిరా ముకుందం.. వారెవా! నీ స్వరంలో ఎంత గ్రేస్ వుందోయ్ నవాబుల జీవితంలో లాగా, ఉర్దూ పొయిట్రీలో లాగా – మోనాలిసా నవ్వులో లాగా —అంటూ ఏదో వాగుతున్నాడు ముకుందం లోపలి వ్యక్తి.

"అబ్బే! ఏమీ లేదండీ .. మా ఆవిడదీ చెవి దుద్దు పడిపోయిందండీ ..." అని విధిలేక చెబుతున్నట్లుగా చెప్పాడు ఆ కుర్రవాడు.

సర్వజ్ఞుడివలె తల పంకించాడు ముకుందుడు.

ఇంకాస్త తికమకపడి, తబ్బిబ్బుపడి, ఎంగిలిమింగి దగ్గి చెప్పాడు ... "కాస్సేపు ఇక్కడ కూచున్నాము... లేచి, అదిగో, ఆ బంక్ దాక వెళ్ళేసరికి ఈమె కనుక్కుంది కుడిచెవి దుద్దు పడిపోయినట్లు..... అప్పటినుండీ వెతుకుతున్నాం కానీ......" ఆ యువకుడి స్వరంలో జీర వినిపించింది.

"అది ఆయన నాకు పుట్టిన రోజుకు కొనిపెట్టారండీ . నా ప్రాణంతో సమానంగా చూచుకుంటున్నా..." అంది ఆ యువతి, ఆ మామూలు మాటలలోకి తన బాధనంతా పిండడానికి యత్నిస్తున్నట్లు.

"క్షణక్షణానికీ తగ్గిపోతున్న ఈ వెలుతురులో ఎట్లా కనపడుతుందీ ... " అన్న ఆ మగాడి గొంతులో ఏడుపే విన్పించింది

ఆమె కళ్ళను చూద్దామని ప్రయత్నించిన ముకుందానికి – తన కోటు జేబులో ఎప్పుడూ వుండే పెన్సిలు టార్చి గుర్తుకొచ్చింది.

"ఆ ... మరే... ఇదిగోనండోయ్... నా దగ్గర టార్చి వుంది..." అని దానిని జేబునుండి తీసి అతడి చేతికిచ్చిన ముకుందం కొంత పెరిగాడు. టార్చి వెలుతురులో ఆమె కళ్ళు వంద టార్చిలవలె వెలగడం చూచిన ముకుందం మరి కాస్త పెరిగాడు.

చాల దాంకుండి!'' అని అతడు టార్చి నిటూ అటూ త్రిప్పుతూ వెతకసాగాడు, అతడి వెంటనే ఆమె కూడా తిరగసాగింది.

చెప్పవోయ్ చెప్పు, ఇందాక వాళ్లిద్దరూ గాఢంగా కౌగలించుకున్నపుడు నువ్వు చూడలేదూ. . . . ఇదిగో ఎడమ వైపు ఈ పొద పక్కనేగా — అపుడా అబ్బాయి ఒడిలోకి ఈ అమ్మాయి వాలిపోతే అతడామెను ముద్దుపెట్టుకోవ డాన్కి కళ్లు పొంచిప్పిల్లా చేసుకు చూడలేదూ? ఆ జవ్వని లేవబోతే ఆమె బుగ్గలను రెండు చేతుల మధ్య పట్టు కుని ఆ అబ్బాయి ఆమెను తనవైపు లాక్కోవడాన్ని ఒళ్లంతా బైనాకులర్స్‌గా చేసుకుని చూడలేదూ ••• మరయితే అప్పుడా, అదిగో ఆ కానుగ చెట్టుందే దాని కివతల, ఇదిగో ఈ పొద దగ్గరే ఎక్కడో పడివుండాలి ఆ అమ్మాయి దుద్దు ఆ చోటు విడిచి లేచి వెళ్లిన వాళ్లు, తాము కూర్చున్న చోటును గుర్తించలేక ఇటు ప్రక్కగా వెతుకు తున్నారు ఇటుకాదు అటు, అని చెప్పు. . . . లేకపోతే నువ్వు చూడు. ...

తన లోపలి వాడితో 'సైలెన్స్ ప్లీజ్' అని చెపు తున్నట్లుగా ముకుందం ఓ పిగ్గు దగ్గి, —''ఆ టార్చి నిటు తెండి, నాకంటి కేమైనా కనపడుతుందేమో చూద్దాం'' —అని, మరి కాస్త పెరిగినవాడై, టార్చిధరుడై రంగం లోకి దిగాడు ముకుందం. వెనువెంటనే ఆ పొద ప్రక్కగా లైటువేసి ఆ దుద్దుని కనిపెడితే, వాళ్లిద్దరి ఏకాంతాన్ని చాటుగా పొంచి చూసిన తన దొంగతనం బయటపడు తుందేమోనని, కాసేపు కావాలని కీలకస్థానాన్ని ఇటూ అటూ టార్చి వెలుతురుని ప్రసరింపచేసి — 'చాల్లేవోయ్ నాటకం... రెండు నిముషాల నుంది, చాల్లే' అని లోపలి డైరెక్టరువారు ఆదేశించగానే — హఠాత్తుగా ఆ పొద ప్రక్కగా గడ్డిలేకుండావున్న చోటుని తన చేతి దీపపు వెలుతురుకు ఎరగా చేస్తూ — ఆ వెలుతురులో, తాను ఎదురు చూసినట్లు మిలమిలమని మెరిసిన ఆ చిన్నరాయి లాటి దానిని తదేకంగా సాక్షాత్తూ భగవంతుడిలా చూస్తూ —''అదిగో, మీ దుద్దు -'' అన్నాడు.

బం.రా బాలగోపాలా భళీ! — అన్నాడు అసలు ముకుందం.

ఒక్క ఊపులో గద్దలా ఎగిరివెళ్ళి, వంగి, ఆ రవ్వల దుద్దుని చేత్తో తీసుకున్నాడు ఆ యువకుడు.

''ఏ నిజం — గామండీ — మీరావి రుట్మా... ఏమీ మండీరు ..'' అంటూ వాళ్లిద్దరూ కలిసి ఒక్క సారిగా ఆనందంతో నిండిపోయి తనకు కృతజ్ఞతలు చెపుతుండడం కలగాపులగంగా వినపడుతుండగా — నిష్కామ యోగిలా తల ఆడిస్తూ ఆ నలభై అడుగులను దాటి వచ్చాడు ముకుందం అతడి వెంట జంటకవుల్లా కృతజ్ఞతల కవితలు గానం చేస్తూ వచ్చా రాదంపతులు...

అటు మధురా రోడ్‌మీది దీపాల వెలుగు, ఇటు పెట్రోలుబంక్ బాపతు వెన్నెల కాక ఏదో, మరేదో దివ్య తేజంతో మెరిసిపోతున్న ముకుందపు వదనాన్ని చూచి ఆ అమ్మాయీ అబ్బాయీ ఓ నిముషం అలా నిలబడి పొయ్యారు.

''మాకింత ఎనలేని సాయంచేసిన మీరెవరో మాకు చెప్పరూ —'' అని అడిగా డా యువకుడు.

ఒక వైపు ... అబ్బే, లదెందుకులెండి అన్నట్లు మొహంపెడుతూనే ..... ''నాపేరు బి. జి. ముకుందం — అండీ'' అని చెప్పుకున్నాడు బాలగోపాల ముకుందం.

నాటకాలపక్షి అయిన ఆపడుచు నొసలుముడుచుకుంది ఒక క్షణం; మరుక్షణం ఉన్నట్లుండి అరిచినంత పని చేసింది — ''ఏమన్నారూ, బి. జి. ముకుందమా.... అంటే బాలగోపాల ముకుందం కాదుకద, లాస్టియర్ 'శివలీల' లోని ఆ అద్భుతమైన పాటల్ని రాసిన ముకుందం కాదు గద ... ..''

అవునమ్మా — వాడే పీడు — పాంచకడీ దేవుడు —ముకుందాంతర్గత ముకుందుడు — అన్నట్లుగా మిలి యన్ డాలర్ల దరహాసాన్ని మొహంమీద వెల్గించి, తల ఊచిన ముకుందం ఇంకా ఇంకా పెరిగి మేఘాలను దాటాడు.

కలయో — వైష్ణవమాయయో — ఫిలిమ్స్ట్రిప్ ఫొటోగ్రఫియో —!! ఏకంగా — సజీవంగా — ప్రత్యక్షంగా ఒకానొక రచయితను కలుసుకోవడమే!! అందులోనూ ఆ అతిలోక పురుషుడు, తనకు ప్రియాల్ప్రియమైన రవ్వల దుద్దుని వెతికి ఇచ్చి నాలుగడుగుల దూరాన నిల్చుని వుండ డమే!! .... ఏమి తన అదృష్టం! ఆ అమ్మాయి ఉల్లాసం పట్టలేక ముకుందం దగ్గరగా వచ్చి నిల్చుని అతడి కోటుమీద చెయ్యి వేసింది.

జాలిగా, లీలగా, హేలగా, ఒరిజనల్ ముకుందు డీలా — తన కానుకుని నిల్చునివున్న ఆ తన్వేని చూచిన ముకుందం చూపు అరక్షణంలో బెదరి, చెదరి, అడుగు దూరాన నిలబడివున్న ఆ అబ్బాయిపైకి, అతడి జబ్బ పైకి జరిగింది.

'పొడవు ఆరడుగులు

జబ్బ పరిధి కనీసం పదహారంగుళాలు' అన్నాడు మెదడులోని టెయిలర్.

చటుక్కున ఆ అమ్మాయికి దూరంగా తొలిగాడు ముకుందం.

కాని ఆమె కళ్లల్లోని ఆశ్చర్యమూ, ఆరాధనా భావమూ ఆవంతయినా తగ్గలేదు

అతడు ఏదో తతవుతపడి జేబులలోకి చేతులు పోనిచ్చి, వాటిని బయటకు తీసి, దోసిలినిండా పదులూ పదులుగా ఏవేవో రూపాయల నోట్లను తీసుకుని "అయ్యా — ఇదేమి అసభ్యత అని ఏవగించుకోకండి ." మీరు నిజంగా మా కెంతటి సాయం చేశారో చెప్పలేము మేము..... మీ ఋణాన్ని ఎట్లా తీర్చుకోవాలో తెలియడం లేదు..... మీరిందులో మీ ఇష్టం వచ్చినన్ని తీసుకుంటే మా మనసుకు తృప్తి -" అంటూ పరమేశ్వరుడి ఎదార విందాల వద్ద పత్రమూ తోయమూ వుంచిన భక్తుడిలా నిలబడ్డాడు.

ఆ భక్తుడితో — "అబ్బే, డబ్బెందుకండీ నాకు! ఇట్సాల్‌రైట్!" అన్న ముకుందం ఇంతగా, ఇంతింతగా పెరగగా అతడి తలతో నక్షత్రాలు ఆడుకున్నాయి.

ఆ విరాట్పురుషుడి ఎదుట చిన్న పురుగుల్లా ఫీల యిన ఆ దంపతు లిద్దరూ మళ్లీ కాస్సేపు కృతజ్ఞతలు చెప్పి, చెప్పి, మళ్లీ ఓసారి చెప్పి, ఆఖరుసారి చెప్పి— చివ రకు —అతడినుండి సెలవు తీసుకుని నెమ్మదిగా నడిచి మదురా రోడ్డు మీదకు వెళ్ళిపోయారు.

తన శరీరమూ, మనసూ భరించలేనంత ఉదాత్త భావాన్ని, సాకారమ్తా లోక కల్యాణానికై అవతరించిన భగవానుడు తానన్న నిండుదనాన్ని, అణిచి పెట్టుకోలేని ముకుందం నడవలేక నడిచి, గడ్డిలోకి నడిచి కూచున్నాడు.

వాళ్లిద్దరూ అదిగో, ఫూర్ కీచర్స్, నిలబడివున్నారు. టాక్సీని కాబోలు పిలుస్తున్నట్లున్నారు ..

అయిదారు నిముషాలు గడిచాయి.

అంత ఉదాత్తభావమూ కర్పూరంలా వెలిగి, ఆరి పోగా, అంతటి నిండుదనమూ నిలకడలేక ఒలికిపోగా .. ముకుందం అనే మనిషికి దహం వేస్తున్నట్లు అన్పిం చింది

జేబులు తడుముకుంటే, బీర్ బాటిలు ఇందాకే పారేసిన విషయం గుర్తొచ్చింది. జేబులన్నీ వెతకగా వెతకగా వెరసి అర్థరూపాయ కూడా పోగవలేదు.

ఓరి జడ్డి వెధవా! ఇందాక అట్లా పోజులకు పోకుండా, ఇంచక్కా ఓ అయిదు రూపాయలనోటు పుచ్చు కుని వుంటే ఓ బాటిలు బీర్‌కు పనికి వచ్చేది కదరా —" అని లోపలి వాడన్న మాటకు తల వూచిన ముకుందం

— ఠామ్మున తరిగి

—నక్షత్రాలనుండి విరిగి

—మట్టి మీద కూరిగి

వంకరగా, టింకరగా, అసహ్యంగా ప్రాకసాగాడు నత్తగుల్లలా.

—

"సర్వేగుణాః కాంచన మాశ్రయంతి"

శ్రీ వి. సి. బాలకృష్ణశర్మ

[శ్రీ వి. సి. బాలకృష్ణశర్మగారి ఈ వ్యాసము మాకు చేరిన అనంతరం బంగారం వ్యవహారానికి సంబంధించి కొన్ని మార్పులు జరిగాయి. అమెరికాలో డాలరుకు బంగారం మదుపు తొలగించారు. 1968 మార్చి 16, 17 తేదీలలో అమెరికా, బ్రిటన్, పశ్చిమజర్మనీ, హాలండు, బెల్జియం, ఇటలీ, స్విట్జర్లాండుల కేంద్ర బ్యాంకుల అధిపతులు వాషింగ్టన్‌లో సమావేశమై కొన్ని ముఖ్యమైన నిర్ణయాలు చేశారు. ఆ నిర్ణయాల ప్రకారం బంగారానికి రెండు రకాల ధరలు, రెండురకాల మార్కెట్లు ఏర్పడుతున్నాయి అధికారికంగా బంగారం ధర ఔన్సు ఒకటికి 35 డాలర్లుగానే వుంటుంది. కాని విడిమార్కెట్టులో సరఫరా గిరాకీలనుబట్టే బంగారం ధర బంగారానికి నిర్ణయం అవుతూవుంటుంది. అమెరికా వారు తమ బంగారాన్ని ప్రైవేటు మార్కెట్లకు వదలరు. ప్రైవేటు మార్కెట్టులో బంగారం కొనరు. పోతే విదేశీద్రవ్యాధికారసంస్థలకు బంగారాన్ని అమ్ముతారు. వారి దగ్గర కొంటారు. ఈ బేరాలు ఔన్సు 1కి 35 డాలర్ల ధరచొప్పున సాగుతాయి అంతర్జాతీయ వ్యాపారపు లావాదేవీలపరిష్కార సందర్భంగాను, ఇతర ఆర్థిక వ్యవహార పరిష్కార సందర్భంగాను ఇది జరుగుతుంది. శ్రీ శర్మగారి వ్యాసం ఈ నిర్ణయాలు జరక్కముందు వ్రాసింది. ఈ నిర్ణయాలు, వీనియొక్క పరిణామాలు ఈ వ్యాసంలో లేవు అయినా, బంగారము, దానికి సంబంధించిన వివిధసమస్యలు, ఈ నిర్ణయాలు జరగడానికి ముందు వున్నవరకు ఈ వ్యాసంలో కుణ్ణంగా చర్చించబడినాయి పాఠకులు తెలుసుకోదగిన విషయాలు అనేకం ఈ వ్యాసంలోవున్నాయి. కనుక ఈ వ్యాసాన్ని యథాతథంగా ప్రకటిస్తున్నాము. --సం.]

పోయిన డిసెంబరు నెల ఆరో తేదీన వచ్చిన ఒక వార్త.

అనాడు సూర్యోదయానికిపూర్వం, చెక్కు చెదరని చీకట్లో, భారతీయ కస్టమ్స్ అధికార్లు ఒక నౌకను వెంటబట్టి, అరేబియాసముద్రంలో చివరకు పట్టుకొని, దానిలో పారిపోతూన్న పదిమంది నావికుల్నీ నౌకలో వున్న సుమారు రు 40 లక్షల విలువగల దొంగరవాణా సరుకునూ స్వాధీనం చేసుకున్నారట! ఆ సరుకులో సుమారు రు 29 లక్షల విలువగల 16,000 తులాల బంగారంకూడా ఉందట! ఈరకం జనానికి ప్రాణాలకంటెకూడా బంగారమే తీపి ఇట్లా దొంగతనంగా ఎంత బంగారం రవాణా అవుతూన్నదీ ఎవ్వరూ నిర్దిష్టంగా చెప్పలేరు. కాని అప్పుడప్పుడు పట్టుబడుతూన్న బంగారాన్నిమాత్రం లెక్కవేసి ఆర్థికమంత్రి పార్లమెంటులో ఎప్పుడైనా వివరించడం కద్దు. గత ఆర్థిక సంవత్సరంలో సుమారు 2000 కిలోగ్రాములకు పైగా దొంగబంగారం స్వాధీనం చేసుకున్నారని అట్లాంటి ఒక సమాధానంవల్ల తెలుస్తూంది సుమారు పదేళ్ళక్రిందట ఫార్వర్డ్ మార్కెట్స్ సంస్థవారు ఒక అంచనా వేసి, ఏడాదికి రు. 30, 40 కోట్ల విలువగల బంగారం దొంగతనంగా రవాణా అవుతూందని తెల్పారు. ఆ అంచనా ఆనాటి ధరలప్రకారం వేసినది.

ఇటీవల ఈ స్వర్ణతృష్ణ మరీ ఎక్కువైనట్లు కనబడుతుంది చీకటి బజార్లలో ఏదో వస్తువులకూ, దొంగరవాణా బంగారానికీ ఎక్కువ పోషణ లభించడానికి కారణాలు చాలా ఉన్నాయి. ముఖ్యమైన దేమిటంటే, కొందరి దగ్గర లెక్కలు చూపడానికి వీలులేని ధనం పేరుకొని ఉండిపోవడమే. ఆ ధనాన్ని ప్రకటించడానికి వీలులేక, దాచడానికి అవకాశంలేక, ఎప్పుడు పట్టుబడతామోనని దిన దినగండంగా బ్రతకడంకంటే, ఏదో ఒక ఖరీదైన వస్తువునో, అసలు బంగారాన్నో కొనెయ్యడం కోసం ఆ గుప్తధనికులు తంటాలు పడుతూ ఉంటారు. బంగారంపట్ల భారతీయుల భావాలు వివరించవలసిన పనిలేదు. బంగారపు కంట్రోలు ఎంతవరకు విజయవంతమైనదీ అందరికీ తెలిసినదే బంగారపు బాండ్లు ప్రవేశపెట్టినప్పుడు యావద్భారతదేశం కలిసి సుమారు రు 12 కోట్ల విలువగల బాండ్లకంటే ఎక్కువ కొనడానికి సాహసించలేదు, ఈనాటి ధరల ప్రకారం చూస్తే, ఒక్క ఏడాదిలోనే సుమారు రు 50 కోట్ల విలువగల బంగారం దొంగతనంగా వస్తూన్నట్లు కనబడుతుంది. దేశంలో ఎంత బంగారంవున్నా, దేశానికి అవసరమైన పనులకు పనికిరాకుండా పోవడం ఈ దేశానికి పట్టిన దౌర్భాగ్యాల్లో ఒకటి.

నగల పిచ్చిలో పడిన స్త్రీలకు స్వర్ణదాహం తీరకపోవడం సహజమే. అట్లాగే లోకంలో కొందరు శ్రీమంతులుకూడా సిద్ధం కావడం క్షంతవ్యం. వ్యక్తులకున్న స్వర్ణదాహం వంటిదే దేశాలకుకూడా పట్టడం ఈనాడు చాలా విపరీతంగా కనబడుతుంది. ఈ సువర్ణదాహం ఈనాటిది కాదు. చరిత్రలో కూడా పాతుకుపోయిన అంశం. ఇప్పుడు ప్రపంచంలో మహాసంపన్నాలుగా ఉన్న దేశాలు చాలావరకూ ఆ విధంగా బలాన్ని పుంజుకున్నవే. ఒకదాన్ని ఒకటి నిందించుకుంటూ అన్నిదేశాలూ దొడ్డిదారిని బంగారాన్ని చేరవేసుకున్నవే. ఆ కార్యక్రమం నిర్విరామంగా ఐదారేళ్లపాటు సాగిన తరవాతనే స్వర్ణప్రమాణానికి తిలోదకాలివ్వడం జరిగింది. ఆ రోజుల్లో దొరికినంత బంగారాన్ని జాగ్రత్తగా నొక్కిపట్టి, పట్టినదాన్ని బయటకుపోకుండా కట్టుదిట్టాలు చేసుకొని కూర్చున్న దేశాలే ఈనాడు సర్వవిధాలా ఉత్కృష్టంగా ఉన్నాయి.

'సర్వేగుణాః కాంచనమాశ్రయంతి' అన్నారు ఏనాడో భారతదేశంలో. కాని ఆ వాక్యంలో కాంచన శబ్దానికి కేవలం బంగారమే అని అర్థం చెప్పకూడదు. కాంచనమంటే ధన మన్న మాట. ఆమాట పుట్టిననాడు చెలామణీ అవుతూన్న ధనం బంగారమే. అందుచేత ఆనాడు కాంచనశబ్దాన్ని ఏవిధంగా వివరించినా ఫరవాలేకపోయింది. కాని యిప్పుడు పరిస్థితులు వేరు. బంగారం కరువైపోయిన కారణంవల్ల సర్వసామగ్రినీ తత్తుల్యంగా చూసుకోవలసిన గతి పట్టింది. శేరు బియ్యం, కిలో కందిపప్పు, తులం పంచదార, చివరకు సీసా కిరసనాయిలు కూడా బంగారం కంటె భద్రంగా దాచుకోవలసిన రోజులు ధనానికి ఉదాత్తమైన సహజమైన విలువ (Intrinsic Value) అవసరం లేదని గ్రహించిన నాగరిక ప్రపంచంలో మనం నివసిస్తున్నాం. ఇది మానవ జాతి వేస్తుకున్న పాఠాల్లో ఉత్తమశ్రేణికి చెందినది. ధనాన్ని సృష్టించడం భగవంతుని ఏకైక అధికారం కాదని గుర్తించి, మనిషి తనకు కావలసిన విధంగా ధనాన్ని రూపొందిస్తున్నాడు. ప్రభుత్వం సుస్థిరమై నమ్మదగినదిగా ఉంటే ఆ ప్రభుత్వామోదం పొందిన ద్రవ్యం కూడా నమ్మతగినదే అని తెలుసుకున్నాం. కాగితపుముక్కకైనా, అల్యూమినియం ముక్కకైనా ప్రభుత్వంవారు ధననామం దిద్దగానే, దానికి బంగారాన్ని కూడా కొనగలిగిన శక్తి వస్తుంది.

ఒక వ్యక్తి బంగారాన్ని మూటగట్టుకుని కూర్చుంటే అతణ్నిగూర్చి వింతగా చెప్పుకుని అపహాస్యం చేస్తూ ఉంటారు. ఈనాడైతే, అల్లాంటివాడు ఏదో కొంత దేశద్రోహం కూడా చేస్తున్నట్టు అతగాడి పరోక్షంలో భావించడంకూడాకద్దు. కాని అతని సమక్షంలో జనం అతనికి అమిత గౌరవ మివ్వడం, అతడు కళ్లెఱ్ఱజేస్తే గడగడ లాడడం కూడా మామూలే. వ్యక్తికి సంబంధించినంతవరకూ బంగారం కేవలం మోజు తీర్చేదే. కాకపోతే అవసరానికి అందుబాటుగా ఉండే ధనఖండం కూడా కావచ్చు. కాని ఒక దేశం బంగారాన్ని మస్తుగా నిలవచేసి కుప్ప వేసుకుని కూర్చుంటే, దానికి ఇతర దేశాలు వంగివంగి సలాములు చెయ్యవలసి ఉంటుంది. ఈనాడు అమెరికాకు ప్రపంచంలో ఉన్న దేశాలన్నీ ఆచరిస్తూన్న సాష్టాంగ దండప్రణామాలు కొంతవరకూ ఆ బాపతువే అని చెప్పవచ్చు. ఆ గౌరవం ఫ్రాన్సు దేశానికి కంటకంగా ఉండి, ఎలాగైనా అమెరికన్ డాలరుకు లభిస్తున్న పెద్దరికాన్ని తగ్గించాలని యత్నం చేస్తూంది. ఏనాటికైనా ఇది గడ్డుసమస్యగా తేలి పెద్ద రాద్ధాంతం కావలసిందేనేమో! సువర్ణభక్తుల పైచెయ్యి స్థిరపడితే బంగారం లేని దేశాలు కేవలం పనికిమాలిన దేశాలుగా పరిగణించబడే ముప్పు తప్పదు.

ఒకానొకనాడు ప్రపంచ ద్రవ్య చరిత్రలో బంగారం ఏకచ్ఛత్రాధిపత్యం కలిగి ఉండేది. అదే స్వర్ణప్రమాణం (Gold Standard) అమల్లో ఉన్నకాలం. కొన్నాళ్ళు ప్రముఖ దేశాలన్నింటిలోనూ బంగారనాణేలే చెలామణీ అయేవి. దాని పందొమ్మిది వందల ముప్ఫయో సంవత్సరం ప్రాంతంలో సుమారు అన్నిదేశాలూ ఒకదాని తరవాత ఒకటిగా స్వర్ణప్రమాణానికి ఒక నమస్కారంచేసి విడిచిపెట్టవలసి వచ్చింది. ఏదేశానికి ఆదేశం తన అంతరంగిక ఆర్థిక విధానంచేత స్వర్ణప్రమాణానికి దాస్యం చేయించలేక పోవడమే దానికి కారణం. కాని మళ్లీ ఈనాడు ఫ్రాన్సు స్వర్ణప్రమాణం తిరిగి ప్రవేశపెట్టాలని ఏకాగ్రతతో కృషి చేస్తూంది.

ఇప్పుడు ప్రపంచంలో స్వర్ణప్రమాణ పద్ధతి లేకపోయినా, బంగారమే నిజమైన అంతర్జాతీయ ద్రవ్యం. ఏదేశంలో ఎట్లాంటి కాగితపు ముక్కలు ద్రవ్యరూపంగా ఉన్నా, విదేశ వ్యవహారాల్లో ఒక్క బంగారమే నిరాఘాటంగా చెలామణీ అవుతుంది. అంతర్జాతీయ ఋణాలు కట్టుకడునప్పుడు బంగారంతనే తీరాలి. ఏదేశమైనా బంగారానికి బదులుగా ఇతర పదార్థాలను స్వీకరించడానికి అంగీకరిస్తే మంచిదే; లేదా కొన్నాళ్ళ గడువిచ్చి, తీర్చవలసిన బాకీని అప్పుగా మంజూరుచేస్తే ఫరవాలేదు. కాని ఏవిధమైన ఇతర ఏర్పాట్లూ లేకపోతే, విధిగా బంగారాన్నే కక్కవలసి ఉంటుంది. ఈ చిక్కులవల్లనే బడుగుదేశాలు బాకీలుపడి, భవిష్యత్తుమీద భారం వేసుకుని బతుకుతున్నాయి. బంగారానికి అత్యున్నతస్థాయి ఉండవలెనా లేదా అనేది సమస్య కాదు. ఆ విషయంలో నిర్ణయం చెయ్యగల సమర్థత ఎవ్వరికీ లేదు. దాన్ని చర్చించి లాభంలేదు. బంగారానికి ఆ స్థానం అనాది నుంచీ ఉన్నదే. పొమ్మంటే పోయేదికాదు. కాని ఆ స్థాయి మీదనే ప్రపంచ వ్యాపారమంతా ఆధారపడాలా లేదా అనేది వివాదించదగిన విషయం. బంగారం కాకపోతే ఇంకేదైనా పదార్థం ఈ వ్యవహారాలకు ఆధారంగా ఉండాలిగద! తత్తుల్యమైన దర్జా ఏ ఇతర ద్రవ్యానికైనా రావాలంటే, దానికి బంగారపు నడికట్టు కావాలి—అంటే ఆ ద్రవ్యంతో బంగారాన్ని ఎంత కావలిస్తే అంత కొనడానికి తగిన అవకాశం ఉండాలి. అట్లాంటి ద్రవ్యాన్ని చెలామణీ చేసేదేశం నిరాఘాటంగా బంగారాన్ని తనద్రవ్యానికి అమ్ముతూ ఉండాలి. తన ద్రవ్యానికీ బంగారానికీ తేడా ఏమీ లేదని నిరూపిస్తూ వుండాలి. అట్లా చెయ్యగల దేశం ప్రస్తుతం ప్రపంచంలో ఒక్క అమెరికా మాత్రమే. ఎవరైనా డాలర్లు

జాగ్రత్త చేసుకుంటేచాలు: వాళ్ళకు బంగారం నిధి ఉన్నట్లే. ఎంతబంగారాన్నైనాసరే, ఒకఔన్సు కల్తీలేని బంగారం 35 డాలర్ల రేటున ఎవరైనా కొనవచ్చు; అమ్మవచ్చు ఇది 1934 సంవత్సరంలో అధ్యక్షుడు రూజువెల్టు ప్రవేశపెట్టిన రేటు దీన్నే నేటికికూడా అమెరికా నిలబెట్టి నిర్వహిస్తూంది ఈ రేటున బంగారాన్ని విక్రయించలేనిస్థితి అమెరికాలో ఏర్పడితే అమెరికన్ డాలరు కాళ్ళు చాచవలసి వస్తుందన్నమాట. అవాదు డాలరు విలువ తగ్గించవలసి వస్తుంది ఇంకా ప్రమాదం హెచ్చితే, బంగారం అమ్మడానికే స్వస్తి చెప్పవలసి వస్తుంది ఆ ముహూర్తంకోసం చెయ్యవలసిన సన్నాహాలన్నింటినీ ఫ్రాన్సు నిర్విరామంగా కొనసాగిస్తూంది డాలరుకు చేదోడు వాదోడుగా ఉన్న బ్రిటిష్ పౌండు గత 1967 నవంబరు 19 వ తేదీన ప్రపంచ ద్రవ్యంగా నిలబడలేక, విలువ తగ్గించుకుంది అంతే ఫ్రాన్సు తన చేతికందిన ప్రతి డాలరునూ ప్రతి పౌండునూ బంగారంలోకి మార్చుకునే కార్యక్రమంలో ఉంది. ఈ స్థితిలో బ్రిటిష్ పౌండు విలువ తగ్గేసరికి అన్నిదేశాలూ బంగారాన్ని కొనడం ఎక్కువ చేశాయి ఎప్పుడు హఠాత్తుగా ఏ ద్రవ్యానికి అధికారికంగా విలువ పడిపోతుందో అనే అలజడి కలిగింది ఆయా విదేశ ద్రవ్యాలకు బదులు అసలు బంగారమే ఉంటే లాభం కదా. అనే అభిప్రాయం ప్రబలింది ఒకేఒక్క రోజున, గత నవంబరు 22 వ తేదీన, 105 బిలియనుల డాలర్ల బంగారం చేతులుమారిందట. ఒకబిలియను అంటే వెయ్యి మిలియనులు కేవలం లండన్‌లోనే 30 టన్నుల బంగారం స్వామ్య విపర్యయం పొందిందట !

ఎన్నిజరిగినా, ఈ పోటీలో అమెరికా ఓడిపోయే అవకాశం కనబడదు. ప్రెసిడెంట్ జాన్సన్ పదేపదే ఈ విషయాన్ని గూర్చి, వెనుకటి అధ్యక్షుడు కెనడీ అడుగుజాడల్లోనే, ప్రస్తావిస్తూ, డాలరు విలువను నిలబెట్టి తీరుతామని ప్రకటించడం జరిగింది అన్నిరంగాల్లోలాగే స్వర్ణరంగంలో కూడా అమెరికాదే అగ్రస్థానం 1949 లో 2477 బిలియన్ల డాలర్ల విలువగల బంగారం అమెరికాలో నిలువలో ఉండేది క్రమేపీ ఈ సువర్ణనిధి క్షీణించడం మొదలైంది పశ్చిమ యూరప్ దేశాల చర్యలూ, అమెరికా అవలంబించిన అంతర్జాతీయ విధానాలూ, అన్నీ కలిసి 1960 సంవత్సరానికి సుమారు 18 50 బిలియన్ల డాలర్లవరకూ ఆ నిధి దిగజారిపోయింది వెంటనే అమెరికా ప్రభుత్వం కొంతవరకూ కంగారుపడి, ప్రతినెలా ఈ నిధి ఎంత వరకూ దిగిపోతూందో గమనిస్తూ ఆ తగ్గుదలను అరికట్టే విధానాలను రూపొందించడం మొదలు పెట్టింది. కాని తరువాత మరి నాలుగేళ్ళలోనే అమెరికన్ బంగారపు విలువ 15 10 బిలియను డాలర్లకు వచ్చింది. 1967 ప్రారంభంలో 13 బిలియన్ల మేరకు పడిపోయింది సంవత్సరాంతానికి 12 బిలియన్లపైనా నిశ్చయంగా వచ్చి ఉంటుంది అయినప్పటికీ ఇది ప్రపంచ స్వర్ణనిధుల్లో ఇంకా మహత్తరమైనదే అని అంటారు.

అమెరికాలో బంగారాన్ని మూడు విధాలుగా భద్రపరుస్తారు.

1 టంకశాలనిధి – దేశంలో వ్యాప్తం చెయ్యబడే ద్రవ్యానికి అండగా 25 శాతం వరకూ బంగారం ఉండాలి. చట్టప్రకారం కరెన్సీలో నాలుగోవంతు విలువగల బంగారం సరిపోయి నప్పటికీ, ఎప్పుడు చూచినా అంతకంటె ఎక్కువగానే ఆధారనిధిని అమర్చి ఉంచడం పరిపాటి 1965 లో ఆనిధి సుమారు 38 6 శాతం వరకూ ఉంది. ఇట్లా అధికంగా ఉంచడానికి కారణం కూడా ఉంది ప్రతిసంవత్సరం చెలామణీలో అదనంగా ప్రవేశపెట్టే ద్రవ్యం సుమారు 250 మిలియన్ల డాలర్లుంటుంది తదనుకూలంగా స్వర్ణనిధి పెరగవలసి వుంటుంది కాని దేశంలో అదనంగా బంగారం ప్రవేశించడం కంటె దేశాన్ని విడిచివెళ్ళడమే ఎక్కువగా ఉంది 1945 వరకూ కరెన్సీకి ఆధారంగా ఉంచవలసిన స్వర్ణనిధి 40 శాతం ఉండాలని ఒకనిబంధన ఉండేది అప్పుడు అమెరికన్ కాంగ్రెసు ఒకక్రొత్త శాసనంచేస్తూ ఆ నిధి 25 శాతం వరకూ ఉంటే చాలునని నిర్ణయం చేసింది. ఇప్పుడు కూడా అవసరమైతే కొన్నాళ్ళ తాత్కాలికంగా ఈ ఆధారనిధి 25% కంటె తక్కువగా ఉంచడానికి కాంగ్రెసుకు అధికారం ఉంది. అసలు పూర్తిగా తొలగించమని ఇటీవల జనవరి 18 వ తేదీన ప్రెసిడెంట్ జాన్సన్ కాంగ్రెసును కోరినట్లు వార్త. మన దేశానికి ఇట్లాంటి గొడవలేదు ఎంత ద్రవ్యాన్ని చెలామణీలో ప్రవేశపెట్టినా, మొత్తం రు 115 కోట్ల విలువగల బంగారం వుంటే సరిపోతుంది అమెరికాలో మాత్రం కరెన్సీకీ స్వర్ణనిధికీ ఒక సంబంధం ఏర్పాటు చేయబడి ఉంది సుమారు 40, 50 వేల మిలియను డాలర్ల కరెన్సీ చెలామణీలో ఉంది గనక 10, 12 వేల మిలియను డాలర్ల విలువగల బంగారం నిలువలో ఉండాలి అవసరమైతే ఆ నిధిని డాలరు విలువను నిలబెట్టడానికి ఉపయోగించే అవకాశ ఉన్నా, అంతకంటే ఎక్కువ విలువగల బంగారాన్ని నిలువలో ఉంచడమే ఆచరణలో ఉండేది కాని భవిష్యత్తులో ఈ పద్ధతి సాగదు

2 విదేశ వ్యవహారనిధి :– ఇది నిత్యావసరాలకు కావాలి గనక న్యూయార్కులో ఫెడరల్ రిజర్వ్‌బ్యాంకులో ఉంటుంది

3 మూలనిధి.—ఇది సామాన్యంగా బయటకు తెలియదు. దీన్ని చాలా కట్టుదిట్టంగా నాక్సుకోట (Fort Knox) లో భద్రంగా వుంచుతారు అది ఎంత రహస్యంగా వుంటుందంటే అక్కడ ఏది ఎక్కడ ఉంటుందో తెలిసిన వాళ్ళెవరో, ఆ భోగట్టా కూడా తెలిసినవాళ్ళు బయటపడరు. నాక్సుకోట (Fort Knox) కెంటకీలో ఆలిఘనీ పర్వత పంక్తుల పాదచ్ఛాయల్లో బ్రహ్మాండమయిన ఏర్పాట్లతో కట్టించారట బాంబులు బ్రద్దలు చెయ్యలేని గోడల మధ్య ఆ కోట అహోరాత్రం విద్యుత్కాంతి ప్రవాహంలో మునిగి తేలుతూ ఉంటుంది యమభటులవంటి సైనికులు హమేషా కావలా కాస్తూ ఉంటారు. సుమారు ఏది అడుగుల ఎత్తు ప్రహారీగోడ దానికి విద్యు

ద్భక్తి కూడా ఎక్కించారట లోపలికు వెళ్ళడానికి ఒక వంతెన వుంటుంది కాని అది ఎప్పుడూ రహస్య స్థలంలో ఉంటుంది. దాన్ని ఉపయోగపడే స్థితిలో పెట్టాలంటే కోట లోపల ఉన్న వాళ్ళకే సాధ్యమవుతుంది. ఎవరయినా సమీపిస్తే తనంతట తానే హెచ్చరిక ఇచ్చే (ఆటోమేటిక్) సిగ్నల్ విధానం అమర్చబడిఉంది. బయటి గోడలు రెండడుగుల మందంతో గ్రానైట్‌తో తయారు చెయ్యబడ్డాయి వాటి మధ్య బాగా గట్టి పరచబడ్డ ఉక్కు వంటి కవచ సదృశమైన కాంక్రీట్ అమర్చబడి ఉంది. వాని మధ్య 18 అంగుళాల గాలి గదులు. అవసరమైతే ఆ గదుల్లో విషవాయువును ప్రవేశపెట్టే అవకాశం కూడా ఉందట. ఇన్ని ఆటంకాలు దాటి ఎవడయినా లోపలికి ప్రవేశించే మూర్ఖుడు బయలుదేరితే, అతడికి కనబడే బంగారం ఎట్లా వుంటుంది? ఒక్కొక్క బంగారపు పలక సుమారు 25 పౌనులు! అనధికారంగా ఎవడయినా తాకగానే ఆ బంగారపు పలకలున్న గదిలో 10 అడుగుల ఎత్తున ఉన్న పైకప్పు వరకూ ఒక ప్రవాహం నిండిపోతుంది.

ఇక కోటకు అంతర్భాగంలో అమర్చబడిన తలుపులు 40 టన్నుల బరువు గల రెండు తాళపు చెవులు ఒకేసారి ఉంటేగాని తెరిచే అవకాశం లేదు ఆరుగురు ఉన్నతాధికారులు చేతేగాని తాళాలు తెరవడానికే వీలులేదు ఎవరివద్దనైనా సరే, ఒక్క తాళపుచెవి మాత్రమే ఉంటుంది.

అమెరికాతో అన్ని రంగాల్లోనూ పోటీ పడుతూన్న రష్యాలో కూడా బంగారం విశేషంగానే ఉందట అక్కడి విషయా లన్నింటిలో బాటు ఈ స్వర్ణనిధుల వివరాలను కూడ పరమ నిగూఢంగా వుంచుతారు 1964 సం॥రంలో పాశ్చాత్య దేశాలకు రష్యా విక్రయించిన బంగారం విలువ 40, 50 కోట్ల డాలర్లు. అంతకు ముందు 1963 లో కూడా సుమారు 40 కోట్ల డాలర్లు. అదివరకు కూడా ఏడదికి సుమారు 22½ కోట్ల డాలర్లు. విప్లవానంతరము రష్యాలో బంగారపు గనుల్లో పని కొన్నాళ్ళు ఆపు చేశారట. కాని బ్రెట్ హార్టే వ్రాసిన కాలిఫోర్నియా బంగారు గనుల కథలు చదివిన తరువాత స్టాలిన్ మళ్ళీ 1927 లో ఆ గనుల్లో పని ప్రారంభం చేయించాడట. ఏడాదికి ఎంత బంగారం త్రవ్వుతున్నారో, అందులో ఎంత నిలువ చేస్తున్నారో ఎవ్వరికీ తెలియనియ్యరు ముఖ్యమయిన గనులు మధ్య సైబీరియాలో బొడాయ్‌బో, తూర్పు తీరంలో మగడాన్, బేరింగ్ జలసంధి వద్ద చుకోట్‌స్కీ ప్రాంతాల్లో ఉన్నాయి ఇవి కాక ఇటీవల కజక్‌స్థాన్, ట్రాన్స్‌కకేషియాల్లో కూడా కొంత బంగారం తీస్తున్నారట. పాశ్చాత్యుల అంచనా ప్రకారం ఏడాదికి సుమారు 50, 60 కోట్ల డాలర్ల బంగారం త్రవ్వుతున్నారనీ, ఇప్పుడున్న నిలువలు సుమారు 800 కోట్ల డాలర్ల విలువ గలవనీ తెలుస్తూంది ఏడదికి 12 మిలియను ఔన్సుల బంగారం తీస్తున్నట్లు ఇంకో అంచనా.

కమ్యూనిస్టు దేశాలు కాక మిగిలిన ప్రపంచంలో ప్రస్తుతము నాలుగు దేశాలు బంగారం త్రవ్వడంలో అగ్రగాములు. అందులో మొదటిది దక్షిణ ఆఫ్రికా తరువాత కెనడా, అమెరికా, ఆస్ట్రేలియా దేశాలు. కమ్యూనిస్టేతర దేశాలన్నింటిలోనూ సంవత్సరానికి 46 మిలియను ఔన్సుల బంగారం బయట పడుతూందని లెక్కకు వస్తూంది. అందులో ఒక్క దక్షిణాఫ్రికా లోనే 29 మిలియను ఔన్సులు లభిస్తుంది ప్రపంచంలో ఉత్పత్తికాబడే బంగారం రెండవ ప్రపంచయుద్ధం తరువాత 10 ఏళ్లలో సుమారు 60% పెరిగింది ఇది 1964 లో న్యూయార్కు ప్రథమ నేషనల్ సిటీ బ్యాంకు సేకరించిన వివరం ఆ ఉత్పత్తిలో కొంత భాగం పారిశ్రామిక రంగంలో, మరి కొంత ఇతర రంగాల్లో ప్రవేశించి, తక్కిన భాగం మాత్రమే ద్రవ్యరూపాన్ని పొందుతూంది సంవత్సరంలో 1500 మిలియను డాలర్ల విలువ గల బంగారం ఉత్పత్తి ఐతే, సరాసరిని సాలుకు 400 మిలియను డాలర్ల విలువగలదిమాత్రమే 1960–62 లో ద్రవ్యరూపం పొందింది కాని 1958–60 లో 700 మిలియను డాలర్ల బంగారం ద్రవ్యంగా రూపొందినట్లు కనబడుతుంది అసలు స్వర్ణోత్పత్తికీ, ఉత్పత్తికాబడ్డ బంగారం ద్రవ్యం కావడానికీ మధ్య చాలా ఆటంకాలు కలుగుతున్నాయి.

ఇక భారతదేశానికి ఇతర దేశాలకీ ముఖ్యమైన భేదమేమిటంటే—ఇక్కడ ప్రజల్లో బంగారంమీద ఉన్నంత మోజు ఇతర దేశాల్లో ఉండదు సంప్రదాయసిద్ధంగా వస్తున్న అలవాట్లూ, ఆచారాలూ, జాతి మత వర్ణాశ్రమ ధర్మాల్లో చాలావరకు అంతర్ధానమైనాయి కాని బంగారం విషయంలో యథాతథంగా ఉండిపోయాయి ఇతర దేశాల్లో కూడా బంగారం మీద వ్యామోహం లేదని కాదు దేశం మొత్తంమీద మన ప్రజలకు వృద్ధి పొందిన మోజు అత్యధికం ఎంత చిన్నతరహా వివాహమైనా సరే, ఎంతో కొంత బంగారం కొనక తప్పదు. ధనం నిలువ చెయ్యడమంటే బంగారం కొనడమే అని నేటికి కూడా చాలామంది భావిస్తారు. అందుచేత ప్రభుత్వ స్వర్ణ నిధులకంటే ప్రజల చేతుల్లో ఉండే బంగారం చాలా ఎక్కువ. 1958 సం॥ రం లో రిజర్వు బ్యాంకు ఒక సమీక్ష చేసి ప్రకటించిన వివరాలను బట్టి, భారతదేశం నుండి పాకిస్తాన్ విడిపోయిన నాటికి భారతదేశంలో ప్రజల దగ్గర 93 మిలియను ఔన్సుల బంగారం ఉన్నట్టు తెలిసింది ఆ తరవాత దొంగ బంగారం రవాణా మరికొంత ఎక్కువయింది 1958 వరకూ అంచనా వేస్తే సుమారు 105 మిలియను ఔన్సుల బంగారం ఉన్నట్లు తేలింది ఇది అప్పటి మార్కెట్ ధరల ప్రకారం కొంచెం ఇంచుమించుగా 3000 కోట్ల రూపాయల మేరకు ఉంది కాని ఆ తరవాత ఉత్పత్తికాబడిన బంగారం మాత్రం ప్రభుత్వవశమే లవుతూ వచ్చింది అందుచేత ప్రజలదగ్గర ఉన్న బంగారం దొంగరవాణా ద్వారానే వృద్ధి పొందుతూంది అది ఎంత పెరిగినా, దేశానికి కలిగే లాభం చాలా తక్కువ పైగా దొంగ రవాణావల్ల కలిగే నష్టాలు మిక్కుటంగా వుంటాయి. అందువల్ల ప్రభుత్వం

అనధికార స్వర్ణవ్యాపారాన్ని శాయశక్తులా అరికట్టాలి. ఇది చాలా కష్టసాధ్యమైన పని అంతర్జాతీయ ముఠాలు అతి చాకచక్యంతో నిర్వహిస్తున్న ఈ వ్యాపారాన్ని తుదముట్టించడం కల్ల కాకపోతే కొంత తగ్గించడం సంభవం దానికైనా, ఆరితేరిన సిబ్బంది కావాలి దొంగలకంటె దొంగల్లాగే తరిఫీదును పొందాలి ఆధునిక యంత్ర సామగ్రి కావాలి. బందోబస్తు కావాలి ప్రభుత్వం మరికొంత ఖర్చుపెట్టి విధ్వంసక నౌకలూ, స్టీమ్‌లాంచీలూ, ఆయుధాలూ సమకూర్చాలి

దేశంలో వ్యక్తుల దగ్గర పేరుకుపోయిన బంగారపు నిలవలు ప్రభుత్వం చేతికి రావాలి. ఈ ఉద్దేశంతోనే 1962లో బంగారపు బాండ్ల విధానం ప్రవేశపెట్టారు. ఈ విధానంలో బజారు ధరకంటె చాల తక్కువ ధరకు బంగారాన్ని ప్రభుత్వం వారు తీసుకొని బాండ్లు ఇచ్చారు కొన్ని సంవత్సరాల తరవాత అంగీకృతమైన పద్ధతితో సహా, భారత ప్రభుత్వం ఆమోదించిన అంతర్జాతీయ ధర మేరకు బంగారానికి బదులు రూపాయలు చెల్లిస్తారు. ఈ పద్ధతిలో ఏర్పాటు చేసిన బంగారు బాండ్లు ప్రజలకు ఆకర్షణీయంగా లేవు బజారులో చాలా ఎక్కువధరకు కొన్న బంగారాన్ని ఈవిధంగా తక్కువ ధరకు అమ్మడం నష్టదాయకమే. కాని దొంగతనంగా తెచ్చిన బంగారాన్ని దాచడం కష్టం గనుక ఇది కొందరికి మంచి అవకాశన్నే కలిగించింది వారికి కూడా దేశభక్తిని ప్రకటించే అవకాశం కలిగింది కాని ఈ విధానం వల్ల ప్రభుత్వం ఎక్కువ బంగారం సేకరించలేక పోయింది.

ఎన్ని విధానాలు అవలంబించినా, భారతదేశంలో ప్రభుత్వ స్వర్ణ నిధి వృద్ధి పొందే అవకాశం చాలా తక్కువ. ఏదయినా విప్లవాత్మక చర్య ద్వారా కొంత సాధించవచ్చునేమో గాని అటువంటి చర్యలు ప్రస్తుత వాతావరణంలో దురూహ్యములు. ఒకప్పుడు భారతదేశంలో బంగారం వీధుల్లో దొర్లుతూ ఉండేదని మనకు పాత కథలు తెలుసు. కాని వాస్తవంగా ఈనాటి పరిస్థితి వేరు. దేశంలో ఉన్న బంగారపు గనుల్లో హట్టి, కోలారు గనులు మాత్రమే చెప్పుకోతగినవి సుమారు నూరు సంవత్సరాల క్రిందట ప్రారంభించి, 70, 80 ఏళ్ళనుంచి విపరీతంగా త్రవ్వగా, త్రవ్వగా, ఇప్పుడు భూగర్భంలో సుమారు పదివేల అడుగుల కంటె లోతున కొంచెం బంగారం చిక్కుతూంది. ఇక కొద్ది సంవత్సరాల్లో బంగారం త్రవ్వడం ఆర్థికంగా అసలు ప్రయోజనకరంగా ఉండకపోవచ్చు. అంత లోతున ఉన్న బంగారాన్ని బయటికి తేవడం ఇప్పుడే చాలా వ్యయ ప్రయాసలతో కూడిన పనిగా వుంది భూగర్భంలో పోను పోను ఉష్ణోగ్రత హెచ్చుగా ఉంటుంది సుమారు 150 డిగ్రీల ఉష్ణోగ్రత గల ప్రదేశం నుంచి నేడు బంగారం తేవలసి వస్తూంది ఈ కార్యం సాధించడానికి ఎన్నో ఆధునిక పరికరాలు కావాలి. ముందు ముందు ఖర్చు మరీ ఎక్కువ చెయ్యవలసి వస్తుంది ఒక తులం బంగారం తియ్యడానికి అయ్యే ఖర్చు కంటె అంతర్జాతీయంగా భారతదేశం అంగీకరించిన ధర తక్కువగా ఉంటుంది. అందుచేత బంగారం త్రవ్వడం అంత లాభసాటిగా ఉండదు పోనీ బంగారపు ధర ఎక్కువ చెయ్యాలనుకుంటే, ఇంకా రూపాయి విలువ తగ్గించవలసి ఉంటుంది. ఇప్పటికే రూపాయి విలువ తగ్గింపువల్ల అనేక కష్టాలు కలిగాయి. అందుచేత అది సాధ్యంకాని పని.

ప్రపంచంలో ఈ బంగారం విషయంలో అనేక భేదాభిప్రాయాలున్నాయి స్వర లోపం వల్లనైతేనేమి, ఉన్న బంగారానికి విలువలు నిర్ణీతం చెయ్యడంలో నైతేనేమి, చాలా తర్జన భర్జనలు జరుగుతున్నాయి ఎన్ని దేశాలు తమ కరెన్సీకి విలువ తగ్గించినా, అమెరికా మాత్రం ఆ పని చెయ్యబోదని ఖండితంగా ప్రకటిస్తున్నారు దక్షిణాఫ్రికా దృష్టిలో బంగారానికి ప్రస్తుతపు ధర చాలా తక్కువ ఆ దేశం ప్రపంచంలో అందరికంటె ఎక్కువ స్వర్ణోత్పత్తి చేస్తూంది అందుచేత ధర ఎక్కువ చెయ్యాలని అనునిత్యం ఆందోళన చేస్తూంది కాని ఆ మాట వినిపించుకునే వాళ్ళు లేరు ఫ్రాన్సు మాత్రం కేవలం బంగారం ధర మీద కాకుండా, అసలు డాలరుకు గల శక్తి సామర్థ్యాల మీద దెబ్బతీస్తూంది. వాటిని ఉడ్చిపెట్టడం మీద దృష్టి కేంద్రీకరించింది కనబడ్డ ప్రతి డాలరునూ బంగారంగా మార్చి పెట్టుకుంటూంది. తన అనుచరులను కూడా ఆ కార్యక్రమంలో పురికొలుపుతూంది. ఇక మేము ఈ రేటున డాలర్లకు బంగారం చెల్లించలేమని అమెరికాచేత అనిపించాలని ప్రయత్నం. ఈ చర్యలవల్ల బ్రిటిష్ పౌండుకు నిలబడే శక్తి పడిపోయింది. ఇక డాలరు వంతు మిగిలింది. ఈ చర్యలో మూలసిద్ధాంతమేమిటంటే, ఏదేశపు ద్రవ్యానికైనా ఎక్కువ ఘరానా, అధికారం ఉండకూడదు అది రాజకీయంగా గాని ఆర్థికంగా గాని క్షేమం కాదు అసలు అంతర్జాతీయ ద్రవ్యం అనే పేరున పిలువబడే యోగ్యత బంగారానికే గాని ఇతర కాగితపు కరెన్సీలకు ఉండనే కూడదు ప్రపంచంలో బంగారానికున్నంత ప్రాధాన్యం ఏ కరెన్సీకైనా రాకూడదు ఒక దేశపు ముద్ర వేసుకున్న కాగితాన్ని అందలం ఎక్కించి ఏకచ్ఛత్రాధిపత్యాన్ని అప్పగించడమంటే సర్వథా అవాంఛనీయం. ఈ భావాలు 1960 నుండీ ఫ్రాన్సు అధ్యక్షుడు అప్పుడప్పుడు నొక్కి వక్కాణించినవే దీని సారాంశమేమిటంటే, ప్రపంచంలో బంగారమే అంతర్జాతీయ ద్రవ్యం కావాలి. అనగా స్వర్ణ ప్రమాణాన్ని (Gold Standard) తిరిగి ప్రవేశపెట్టాలి.

కొన్నాళ్ళు బ్రహ్మాండంగా సామ్రాజ్యం సాగించిన స్వర్ణ ప్రమాణం కొన్ని మార్పులుపొంది, చివరకు ఏరూపంలో ఉన్నా సరే భయావహంగా తయారై, 1930-31 లో పూర్తిగా పదవీచ్యుతి పొందింది. బంగారపు ప్రమాణం ప్రపంచానికి మొయ్యలేని బంగారపు శిలువగా పరిగణించబడింది. దాన్ని భూస్థాపితంచేసి, గౌరవసూచకంగా ఒక కన్నీటిబొట్టువదలి, ఆ పద్ధతిని మరచిపోయి ఏదోకాలం గడుపుతూన్న ప్రపంచానికి

ఫ్రాన్సు అధ్యక్షుడు మళ్ళీ స్వర్ణ ప్రమాణాన్ని ఆచరింపచెయ్యడం వింటగానే ఉంటుంది అంతేకాదు, పెద్ద ఒత్తిడి కలిగించి ఇతర విధానాలు సానుకూలంగా నడవనియ్యకుండ చెయ్యడం చాల ఆశ్చర్యం కలిగిస్తుంది దానికోసం అచంచలమైన కృషికి పూనకోడం చూస్తే ముందు వచ్చేకాలంలో చాలా గడ్డురోజులున్నట్లు కనబడుతుంది స్వర్ణ ప్రమాణాన్ని అమలుచేస్తే డాలరు విలువ తగ్గిపోతుంది. ఇప్పుడు అమెరికా విదేశాల్లో చేస్తున్న ఖర్చులకు బంగారమే చెల్లించవలసివస్తుంది. ఇప్పటికే తగ్గుముఖం పట్టిన స్వర్ణ నిధులు ఇంకా సన్నగిల్లేకాలం వస్తుంది నాక్సు కోటనుండి బయటకు దొర్లే ఖజానాపెట్టెల కలవరం హెచ్చవుతుంది అమెరికాలో వేషన్న బంగారంచూస్తే యూరప్‌సమష్టివిపణి (Common Market) లో ఉన్న ఆరు యూరప్‌దేశాలకంటె కాస్త తక్కువగా ఉంటుందేమో! కాని స్వర్ణప్రమాణం తిరిగి నెలకొల్పబడితే, ఈనాటివలె నిరంకుశంగా ప్రపంచ ద్రవ్యవిధానాన్ని - తన చిత్తం వచ్చినట్లు రూపొందించగల స్థితిలో ఉండదు. దక్షిణాఫ్రికా రష్యా దేశాలకు తలవని తలంపుగా అధికారం వచ్చిపడుతుంది అనుకోని కొత్తరాజకీయ ఆర్థిక ప్రమాదాలు తటస్థపడతాయి డాలరు విలువ సుమారు మూడోవంతుకు దిగిపోతుంది. బంగారానికి బదులు డాలర్లు నిలువచేసుకుంటూన్న ముఖ్యమైన దేశాలు కెనడా, జర్మనీ, ముఖ్యంగా జపానువంటివి అపారనష్టానికి గురికావచ్చు. నిజంగా స్వర్ణ ప్రమాణం తిరిగి రాకపోయినా, డిగాల్ అనుసరిస్తున్న విధానంవల్ల, పౌండూ, డాలరూ, కూడ సకల అవస్థలూ పడి, చివరకు ఊతాకిడికి ఒక్క డాలరుమాత్రం నిలబడి కాళ్ళూచేతులూ కొట్టుకుంటూ కొన ఊపిరితో నిర్విరామంగా పోట్లాట సాగించవలసిన అవస్థవచ్చింది. బహుశా ఫ్రెంచి ఆశయం ఇదేనేమో! సమష్టివిపణిలో ఉన్న ఇతరదేశాలు స్వర్ణ ప్రమాణ పునరాగమనాన్ని తిరస్కరించినట్లే కనబడుతుంది కాని ఫ్రాన్సు ఏకాకిగానైనా సరే ఈ విధానాన్ని అమలు జరుపుతుందని 1965 లో ప్రకటించింది. విదేశాలకు చెల్లించవలసిన ధనాన్ని బంగారంలో చెల్లిస్తామని హామీ చేసింది చివరకు చెల్లించవలసిన మిగులులేకుండా వ్యవహారం సాగిస్తోంది. అందుచేత ఫ్రాన్సు ఏమాటవచ్చినా అందంగానే ఉంటుంది బంగారానికిగల విలువ తగ్గకుండా డాలరును సమర్థించే రహస్యసమితి ఒకటి లండన్‌లో పనిచేస్తోంది అదే గోల్డ్‌పూల్. స్వర్ణ సమితి బెల్జియం, బ్రిటన్, ఇటలీ, నెదర్లాండ్సు, స్విట్జర్‌లాండ్, పశ్చిమజర్మనీ, అమెరికా, ఫ్రాన్సు— ఈ కూటమిలో సభ్యత్వంగలవి. గత నవంబరు నెలాఖరున ఫ్రాన్సు ఈ సమితినుంచి తప్పుకున్నట్లు వార్త. కాని తదితర సమష్టి విపణిదేశాలు ఇంకా డాలరుకు కాపలాకాస్తున్నట్టే లెక్క పెట్టవచ్చు డాలరును పొదుపుచెయ్యడానికి అధ్యక్షుడు జాన్సన్ ఇటీవల ప్రకటించిన విధానం కేవలం గోల్డ్ పూల్ సభ్యుల హృదయపూర్వక సహకారంకోసమే అనికూడా నమ్మవచ్చును. అమెరికా తన డాలరును విదేశాల్లో విచ్చలవిడిగా సంచారం చెయ్యనిస్తే దసగొయ్యి తాను త్రవ్వుకున్నట్టే అందుచేత 1968లో విదేశాలకు చెయ్యవలసిన చెల్లింపులలో సుమారు 3000 మిలియను డాలర్లవరకూ తగ్గించాలని జాన్సన్ నిర్ణయం. ఈ మొత్తంలో 1950 మిలియను డాలర్లు విదేశాల్లోని పెట్టుబడులలోనూ, 500 మి. రక్షణ ఖర్చులలోనూ, 500 మి. ద్రవ్యసహాయ కార్యక్రమాలలోనూ, 500 మి. యాత్రికుల ఖర్చులలోనూ తగ్గుతుందని ఆశ. ఈ చర్యలన్నీ లక్షణాలా అమలు జరిగితే ఫ్రాన్సుకూడా కొంచెం కటకట పడుతుందేమో! దాదాపు ప్రపంచంలోని దేశాలన్నింటి ఆర్థిక పరిస్థితులలోనూ కలవరం తప్పదు

అభివృద్ధి పొందిన దేశాలెన్ని అంతర్నాటకాలాడినా, పోటీలుపడినా, తుట్టతుదకు జయాపజయాలెట్లా ఉన్నా, కొన్నాళ్ళు ధాటీగా నిలబడగల స్తోమతగలవి బడుగుదేశాలు బంగారం పేరు చెబితేనే హడలిపోయేస్థితిలో ఉన్నాయి డాలరును అదుపులో పెట్టే యత్నంలో అమెరికా విదేశ వ్యయాన్ని తగ్గిస్తూ ఉంటే, సకాలానికి సరియైన సహాయం సిద్ధించక, వర్ధమాన దేశాలు అర్థశూన్యంగా వ్యవహరిస్తున్నాయి కొన్నాళ్ళలో ఆర్థిక విధానాలన్నీ నిరర్థకంగా తయారయ్యే ప్రమాదం కూడా సంభవిస్తుంది ఈ బలాబలాల ప్రదర్శనలో చాలా అగచాట్లకు గురికాబోతాయి. ఈ సందర్భంలో అంతర్జాతీయ ద్రవ్యనిధి

ఫోన్. 3335
నివాసం PP 5145

హృదయపూర్వక శుభాకాంక్షలతో:

నవీన పేపర్ స్టోర్స్
గాంధీనగర్ :: విజయవాడ-3.

అన్ని రకములైన కాగితములు, అట్టలు మరియు ప్రింటింగ్ సిరాలు విక్రయించువారు.
[ఆఫ్‌సెట్ & లెటర్ ప్రెస్]

★

రోటాక్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, డాల్మియానగర్
మరియు
జే. బి. ఏ. ప్రింటింగ్ ఇంక్స్ ప్రైవేట్ లిమిటెడ్, బొంబాయి, వారికి
డిస్ట్రిబ్యూటర్లు.





ఆటబొమ్మలు — కీర్తిశేషులు శ్రీ మొక్కపాటి కృష్ణమూర్తి.

ఆంధ్రపత్రిక—కీలక సంవత్సరాది సంచిక

అధ్వర్యం క్రింద ఒక కాగితపు బంగారాన్ని (Paper Gold) సృష్టించే నిర్ణయం స్మరణీయం. ఫ్రాన్సు చూపిస్తున్న దూకుడూ, డాలరు కురిపిస్తున్న చమత్కారాలూ అలాగే ఉండగా ఈ కాగితపు బంగారం అస్సలు పొందుతుందేమోనని ప్రపంచం ఆశిస్తూంది.

అంతర్జాతీయ ద్రవ్యనిధిలో సభ్యత్వగల దేశాలకు ఇదివరకే అత్యవసర పరిస్థితుల్లో కావలసిన విదేశమారక ద్రవ్యం ఋణ రూపంలో అందుతూంది కాని అది చాలినంత దొరకడంలేదు. ఇతర దేశాలకు చెల్లించవలసిన ద్రవ్యం పూర్తిగా డాలర్లలో గాని బంగారంలో గాని చెల్లించడానికి వీలు కలగడంలేదు. అందుచేత అన్ని దేశాలకూ ఆమోదకరంగా ఉండే ద్రవ్యాన్ని అంతర్జాతీయ నిధి సృష్టించ తలచింది. దీనికి ప్రముఖదేశాల అంగీకారం ముఖ్యంగా అవసరం. ఆ పది దేశాలు — అమెరికా, కెనడా, ఇంగ్లాండు, స్వీడన్, ఫ్రాన్సు, బెల్జియం, నెదర్లాండ్సు, ఇటలీ, పశ్చిమ జర్మనీ, జపాన్.

గత సెప్టెంబరులో 107 మంది సభ్యులు గల అంతర్జాతీయ నిధి సమావేశంలో ఫ్రాన్సు జర్మనీలు కొంత విముఖత చూపినా, చివరకు కొన్ని నిబంధనలను సూచిస్తూ ఈ విధానాన్ని అంగీకరించాయి. ఇక నూతన అంతర్జాతీయ ద్రవ్యం ఉత్పన్నం కావడానికి ఆట్టే ఇబ్బందులు లేవు. అట్లా సృష్టించబడబోయే ద్రవ్యం స్వర్ణ సమానంగా సర్వత్రా విదేశ వ్యవహారాల్లో ఆమోదనీయం. ఆ ద్రవ్యాన్ని ఉపయోగించుకునే హక్కు నిర్ణీతంగా ప్రతి దేశానికీ ఉంటుంది. అదే ప్రత్యేక ద్రవ్య వినియోగాధికారం (Special Drawing Right).

ప్రత్యేక ద్రవ్య వినియోగాధికారాలు కలిగించవలసిన పరిస్థితులు సుస్పష్టంగానే ఉన్నాయి. ప్రతి దేశంలోనూ ఆంతరంగిక వ్యాపారం విపరీతంగా పెరిగిపోతూంది. తదనుగుణంగా ద్రవ్య సంచాలనం కూడా వ్యాకోచం చెందింది. కాని ప్రపంచ వ్యాపారం నూటికి నూరుగా పెరిగినా ప్రపంచాంగీకృతి పొందిన ద్రవ్యం నూటికి 20 వంతులుమాత్రం పెరిగింది. దీని ఫలితంగా చేతులు మారవలసిన ద్రవ్యం చాలక నానా ఇబ్బందులూ పడవలసి వస్తూంది. అందువల్ల ప్రత్యేకమైన ఏర్పాట్లు కావలసివచ్చాయి. ఇవి ఎంత తొందరగా జరిగితే అంత తొందరగా అభివృద్ధి పొందుతూన్న దేశాలకు సావకాశం చిక్కుతుంది. బంగారం లేని బాధ తీరుతుంది. కాని అంతటితో అంతర్జాతీయ ద్రవ్య సమస్యలన్నీ తీరిపోతాయనుకుంటే అది పెద్ద పొరపాటు. ఈ కాగితపు బంగారం అంతర్జాతీయ ద్రవ్యంగా తాత్కాలికంగా పరిగణించబడుతుంది కాని అది అంతర్జాతీయ ద్రవ్యం కాబోదు. ఒక విధంగా 'ఉప ద్రవ్యం' అనవచ్చు. అసలు ద్రవ్యం బంగారమే. స్వర్ణ ప్రమాణానికి పునఃప్రతిష్ఠ జరగవలెనా? లేక ప్రస్తుత స్వర్ణ వినిమయ ప్రమాణం (Gold Exchange Standard) డాలరు మీద కేంద్రీకృతంగా సాగనియ్యవలెనా? అనే సమస్య అట్లాగే ఉంటుంది కాని, దాన్ని పరిష్కరించవలసిన తొందర ఉండదు. అందుకే కాగితపు బంగారం మీద నిర్ణయమూ, అంతర్జాతీయ ద్రవ్యవిధాన సూత్రీకరణమూ ముడిపెట్టి వాగ్వాదం సాగిస్తూన్న ఫ్రెంచి దృక్పథం సమంజసంగానే ఉంది. కాని ఆ వాదం వర్ధమానదేశాల ఆర్థిక ప్రయోజనాలకు ప్రాప్యం. డాలరు మీది ఒత్తిడి సమస్యలన్నింటినీ చాలా క్లిష్టతరం చేస్తుందని చెప్పవచ్చు. బంగారపు రాసులమీద నిలబడి వున్నట్లుండే దేశాలకు డాలరు విలువ తగ్గడం వాంఛనీయం కావచ్చు. కాని ఇతరులకు వెంటనే లాభదాయకం కాదు. ఈ ఒత్తిడివల్ల తక్షణావసరాలకు కావలసిన సదుపాయం సకాలంలో చాలినంత సమకూడకపోవడంవల్ల, అభివృద్ధి కుంటుపడుతుంది. కాని డాలరు విలువ తగ్గితే ఋణ భారం తేలికపడుతుంది. ఇది అంతర్జాతీయ ద్రవ్య విధాన పరిణామ చరిత్రలో జాగ్రత్తగా పరిశీలించవలసిన తరుణం.

—

రేపటి మజిలీ

శ్రీ పరిగి రాధాకృష్ణ

అద్దంలో ఆకృతి చూసుకుని
అగుపించిన ఆత్మవికారానికి కలవరపడి
అర్థవంతమైన చిరునవ్వుకోసం చుట్టూ చూసి
ఆశాభంగాన్ని చవి చూసి
అన్ని వేపులా సమస్యలు చుట్టుముట్టుతుంటే
అన్నిరీతులా అసహాయత మిన్నుముట్టుతుంటే
నవ్వలేక నవ్వురాక పువ్వులా బతికే వీలులేక
నెప్పమని చేకవేసి సొమ్మసిల్లిన మానవుడు
[illegible]కొనే శుభసమయంకోసం
కొండంత ఆశతో ఎదురు చూస్తున్నాను.

బ్రతుకును ఓర్చి నిశ్చితాభిప్రాయం కరువై
[illegible] తున్నా బలమైన లక్ష్యం కరువై
అస్థిరత్వంలో అవిశ్వాసంలో మనుగడ బరువై
చీకటిని చీల్చి చూసే శక్తి లేక
ఆకలి దప్పులను మించి ఆలోచించలేక
తప్పుదారి పడదనుకునే తెలివిలేనితనం
పల్లవించాల్సిన ఆత్మ నదిమిపెట్టే జనం
పచ్చని ఆలోచనలో ప్రపంచాన్ని వీక్షించే
పవిత్ర సమయంకోసం పడిగాపులు కాస్తున్నా.

ప్రసన్నతకు బదులు ప్రచ్ఛన్నతత్వం పెరిగి
నమ్రభావానికి బదులు నహుష ప్రవృత్తి ప్రబలి
గతి తప్పిన గానంలా
గురి తప్పిన బాణంలా
క్రమబద్ధం కాక బ్రతుకు కల్లోలం పాలైతే
'అణువు'లో దాగిన మృత్యువు కన్నా
మనిషిలో దాగిన నరకం భయంకరంగా తోస్తే
పదాలు పరిష్కరించలేని ప్రమాదాల బాటలో
పయనమై పోతున్న మానవుడు
గండాలు గడచి ప్రశాంతమైన
మజిలీ చేరుకోవాలని ఆశిస్తున్నాను.
గుండెలనిండా గాలి పీల్చుకునే
అవకాశం కోసం చూస్తున్నాను.

చేజిక్కిన అవకాశం జారవిడుచుకోక
చేదెక్కిన జీవితాన్ని చూసి విసుక్కోక
కనిపించిన దాన్నరంచేసుకోవాలని
కాంతికిరణాలను పోగు చేసుకోవాలని
వికసించిన హృదయంలో
విరచించిన విశ్వాసం
చేపట్టిన మానవునిలో
రూపొందే రేపటి మనిషిని
అభినందించే అవకాశం కోసం ఆతురపడుతున్నా.

పలుప్రాంతాలలో సుమేరు సంస్కృతి

శ్రీ జి ఆర్. వర్మ

సాంకేతికశాస్త్ర విజ్ఞానం కల్పించిన సౌకర్యాలు, జనజీవన పురోగతి—అభ్యుదయమార్గం ఐతే ప్రాంతీయ, శీతోష్ణ కారణ శరీరవర్ణభేదం, భాషాభేదం నిత్యజీవితాల్లో రాజకీయాలకు బానిసలు కాగానే ఎవరికివారు వారు వేరు, మీరు వేరు, మేమూ అంతే అని ఎవరికివారు 'కాంక్రీటు' గోడలు కట్టేస్తున్నారు. మేము గొప్పంటే మేము గొప్పని చెప్పుకోడంలో రాజకీయ జీవితాల కలవడిపోయినవారు గత చరిత్ర—పురాణేతిహాసాల మటం కిస్తున్నారు.

మా దేశం, జాతి, భాష, నాగరికత వెరసి సంస్కృతి ఇతరులకన్నా సుప్రసిద్ధం, పురాతనం, పవిత్రం, శిరోధార్యం అనుకోవేవానికి.. ...

* * *

ఆ జను లెక్కడివారో తెలీదు కాని తూర్పునుండి—వేదు ఈరాన్ (ఆర్యావన) అనబడే ప్రాంతంమీదుగా ఆరువేలయేండ్ల పూర్వం వలసవచ్చినారట. వారి సంస్కృతి, మతం, భాష, ఆచార వ్యవహారాలు వివిధదేశాల్లో వారి నాగరికత మతాలపై చెరగని ముద్ర వేసినది. వారు నేడు బస్రా—బాగ్దాద్ అనబడే పట్టణాల మధ్యప్రాంతంలో క్రీ పూ 4000–3000 సంవత్సరాలనాడు పాలించినారు కాని క్రీ. పూ 2000 నాటికి వారేమైనదీ తెలిసే చారిత్రకాధారాల్లేవు—అంటే ప్రత్యేకత పోయి ఇతర జనాంగాల్లో లీనమైపోయుండాలి

భారతీయులు గణితంలో 'సున్న'చేర్చి ప్రపంచానికి జ్ఞాన భిక్ష పెట్టినట్లే ఆ పురాతన జనాంగం నేటి లౌకికవ్యవహారాలే గాదు, ప్రపంచానికి అక్షరజ్ఞానం ఇచ్చిపోయారు.

మా పవిత్రసాహిత్యం, అపౌరుషేయం, ఋషిప్రోక్తం, అతిపవిత్రం అనుకునేవా రనేకు లున్నారు.

పారసీకుల 'అవెస్తా', భారతీయుల 'ఋగ్వేదం', హీబ్రూల 'బైబుల్', గ్రీకుల 'ఇలియడ్ అండ్ ఒడెస్సీ'లకన్న, ఐగుప్తీలకన్న బహుపురాతన సాహిత్యం నిప్పూరు, ఉరు వగైరా ప్రాంతాల్లో పురావస్తుశాఖ వారు త్రవ్వితీశారు.

* * *

పరిశోధకులు ఉమ్మడిగా బాబిలోనియా అన్నారు. చారిత్రకంగా ప్రప్రథమంగా పాలించినవారు, ఉర్ (ఉరు) రాజధానిగాను, నిప్పూరు, ఎరిచే, ఎరిడు వగైరా పుణ్యక్షేత్రాలుగా గలవారు సుమేరులు. నిప్పూర్ వీరి మహాదేవుడు, వాయుదేవుడైన 'ఎన్లిల్' క్షేత్రం. ఉర్ వారి చంద్రదేవుడు 'నన్నా' క్షేత్రం. ఏరిడు వారి జలపతి విద్యాపతి, మనువును పోలిన 'ఎన్కి' క్షేత్రం.

సుమేరులు మావారే అని రాజకీయాల్లో తమిళులు చెప్పుకోడానికెంత అవకాశముందో మిగతా వారికీ అంతే ఉంది. ద్రావిడ సంస్కృతి అనేది నేటి తమిళుల ఒక్కరి సొత్తు మాత్రం కాదు.

సుమేరులు 'ఇండో—యూరోపియన్'లు కారట. 'సెమైట్సు' కారట, 'హామైట్స్' కారట—ఇదంతా భాషా వాచకం.

'బైబుల్' కథల ప్రకారం జలప్రళయానంతరం మిగిలిన 'నోవా' (నావికున)కు ముగ్గురు కొడుకులు (ప్రజాపతులు) సంతానం.—శేము వంశీయులు—హీబ్రూ (యూదు)లు, అరాబాయులు, ఎధియోపియనులు, అరబులు, అస్సీరు (అసుర)లు, సిరియా (సురి) వారు. హాము వంశీయులు—పురాతన ఐగుప్తీయులు—అదే కామితదేశం, ఆఫ్రికా నీగ్రోలు, బెర్బర, గబ్లా జనులు. జాఫ్ వంశీయులు ఇండో—యూరోపియనులు (ఆర్యులు).

ఎవరీ సుమేరులు—'టెల్ అమర్నా' శిధిలాల్లో వీరు శంకరులు. యూదులు 'బైబుల్'లో ప్రస్తావించిన శినారులు వారే శుంగిరులు. సుమేరు అంటే అర్థం దక్షిణం—దాక్షిణాత్యులు అటు దక్షిణ పారసీకం గావచ్చు దక్షిణ భారతం గావచ్చును. శిధిలాల పోలికల్లో వారిది సింధునదీ నాగరికతా గావచ్చును. సైంధవ సంస్కృతి మనదేశమధ్యం వరకూ వ్యాపించినదే ఆంధ్ర కరాట మహారాష్ట్ర, తమిళ, గుజరాతీలు గావచ్చును, తెలంగాణా గోండులూ కావచ్చును. కుర్దులూ, శబరులూ గావచ్చును మన పురాణాల్లో చెప్పిన తుర్వసులూ కావచ్చును అగులని నా నమ్మకం.

నేటి ఈరాక్‌దేశం సుమారుగా అటు టర్కీ, ఇటు ఈరాన్, మరోవైపు సిరియా ప్రాంతాలకు వ్యాపించిన నాటి బాబిలోనియా రాజ్యం (మెసపొటామియా) పాలించిన చారిత్రకంగా ప్రప్రథము లీ సుమేరులు. వీరి నోడించి పాలించినది శేము వంశీయులు—అనగా మన పౌరాణిక ద్రుహ్యులు వారి నాటరాజు, అక్కాది ప్రభువు శార్గన్ (శర్గన్—శరారి). కతిపయకాలపు రాజధానులు బాబిలన్, నినెవే—కతిపయకాలపు రాజవంశీయులు గుదియ/గుతియం (గాధి), అమెరీ, హిత్తీలు (అమర, పురు, కాత్య, క్షత్రియ), కాశ్శీలు (కాశీ, కాశ్య, కూశ), అస్సీరియను (అసుర)లు అక్కాది,

అక్కడి ప్రజలే బహుశా పూర్వపు 'మెలుచ్ఛ (మ్లేచ్ఛులు). సుమేరులనాటి సిరియే నేటి సిరియా.

*   *   *

మన భూమి వయస్సు కోటానుకోట్ల సంవత్సరాలు, మానవుడు తదితర చరాచరజీవుల పుట్టుక వయస్సు కొన్నిలక్షల సంవత్సరాలుగా ఆధునిక శాస్త్రాధారం ఉన్నందున సృష్టి గూర్చిన వివిధదేశాల్లో గాథలు సత్యదూరంగా ఉండక తప్పదు. కాగా సృష్టి క్షణాల్లో, రోజుల్లో, నెలల్లో పూర్తయిందంటే సద్యోగర్భాలు నమ్మగల్గినవారుకూడా నమ్మరు.

మన బ్రహ్మాండ, మార్తాండ (సూర్యుడు), కాశ్యపి పోలిన కథలు ఇతరదేశాల్లోనూ ఉన్నాయి జగమొక అండం—దాన్ని చుట్టియుండే దో కొండచిలువ-అదే మన అనంత(సర్పం)—శింబుమారగాథ—పోలికలు బాబిలోనియా శిధిలాల్లోనూ ఉన్నాయి.

ఆదిలో అంతా శూన్యం, అంభ (ఈథర్) వాయువు-అగాధాబ్ధి (జలం)నుండి భూమి-భూమ్యాకాశాలు కలిసియుండగా—అండం పగిలి పై పెంకు ఆకాశం—క్రిందిపెంకు భూమి,—జీవి పంచభూతాత్మకం—సూర్యుడు పుట్టాకనే భూమిపై ఇంత జీవ సృష్టి, భూమి, నీరు, గాలి, సూర్యకాంతి కారణంగా జర్గింది దంటే ఆధునికు లంగీకరించక తప్పదు 'టెస్ట్ ట్యూబ్'లో జీవం సృష్టించ యత్నిస్తున్న శాస్త్రజ్ఞులూ జీవసృష్టికి భూమి, నీరు, గాలి, వేడి అప్రధానం అనలేరు.

అనేకదేశాల్లో బహుపురాతనకాలాన మతమే శాస్త్రం, ధర్మం, సంఘం, ఆర్థికం అనే అనేక అవసరాలుగా శిరోధార్యం అయింది

భూమిపై ఇంత సృష్టి, మానవుని సృష్టి అయిన తర్వాతనే దేవతలు సృష్టింపబడినారనే కొన్నిదేశాలవారి నమ్మకంలో నరుడే దేవతల సృష్టికర్త అనిపిస్తుంది.

సుమేరు విశ్వాసాల్లో దేవతలే ముందు పుట్టారట వారు తమ అవసరాలు తీర్చడానికి—నైవేద్యం వగైరా పెట్టడానికిగ్గాను మానవులను సృష్టించారట మానవులవలె దేవతలకూడా అవసరా లుంటాయనేనాటి నమ్మకా లివి.

సుమేరుల సాహిత్యంలో, ఇతర దేశాల్లో పురాణేతిహాస వీరు లున్నట్లే 'ఎన్మెర్కార్, లుగల్బందా, గిల్గమేశ' వీరులు ముగ్గురు. మొదటివీరుడు 'ఎరిక్' రాజధానిగా పాలించిన కాలాన భాషాభేదా ల్లేవట. కతిపయ కాలపు యూదు సాహిత్యంలో దేవునికి కోపం వచ్చి నరుల విరోధాలు హెచ్చడానికి భాషలు సృష్టించినట్లుంది.

సుమేరుల భాష ఛాయలు కతిపయకాలపు వివిధ దేశభాషల్లో ఉన్నాయి సుమేరుల తర్వాత పాలించిన వారంతా సుమేరు భాషనే ఆదరించిన చరిత్ర ఉన్నది. సుమేరులిపి చిత్రాక్షరలిపి, పాంతీతిక భాష ఈ చిత్రాక్షరలిపి కనాన్ (పాలస్తీనా, కాణ్వ) కామిత (ఈజిప్టు) దేశాల్లో పూర్వలిపి.

మనం బహుపురాతనం అనడానికి 'ఇక్ష్వాకుల నాటిది' అంటాము. ఇక్ష్వాకులు మనకు పౌరాణికేతిహాసాల్లో, చారిత్రకంగా గొప్పరాజవంశంవారు, సూర్యవంశీయులు చారిత్రకంగా ఆంధ్రేక్ష్వాకులు కృషి వాణిజ్యాలు పోషించారు. రాజ భూస్వామి అందరికీ పెద్ద భూస్వామి ఈ ఇక్ష్వాకు శబ్దం క్రైస్తవుల్లో—యూదుల కథ—ఇసాకు అయింది. అతడు కృషీవలుడు—యూదులు వగైరా లవేయు దేశ దిమ్మరులయిన పశుపాలకులు గ్రీకుల 'అకాయన' హి(కి)స్టీల 'ఖీయవ' ఈజిప్టు 'అకైవశ' ఈరాన్, 'అఖామెన', జర్మన్ 'ఇగోవెన' బౌద్ధుల 'ఒక్కాక'—అంతా ఇక్ష్వాకులే—సుమేరుల్లో 'ఇషక్కు' అర్థం రాజ భూస్వామి.

*   *   *

ఇంగ్లీషును ద్వేషించడంలో ప్రాంతీయ దురభిమాన ద్వేషాలు, రాజకీయాలున్న వేమో! ఇంగ్లీషువారి అలవాట్లు అన్నీ ఆదరిస్తూ ఆ భాష వద్దంటారు వీరు. మరి ఆదివారం సెలవు ఎందుకు కొనసాగించాలి? ఆదివారం సెలవులో క్రైస్తవం ఉందే?

మనకు శనివారం అమావాస్య, పౌర్ణమి గతంలో సెలవు దినాలు 'బైబిల్'లో ఆచార వ్యవహారాలు కేవలం హిబ్రూ (యూదుల)లవి కావు వెనోషే కథనాటికే వారు ఈజిప్టు (గోషెన్) నారవడి చేసుకొన్నట్లుంది పోతే వారిది ప్రవాస జీవనం—బాబిలోనియాలో బందీలు. బాబిలోనియాలో పూర్వం మాసంలో నాల్గయిదు దినాలు అశుభదాయకం అనే నమ్మకంలో నాడు ఏ పనీచేసే వారు కారు ఆ భయం ధార్మిక (బానిస) జీవనాల్లో సెలవు, మతంలో విశ్రాంతి దినం క్రైస్తవుల 'సబ్బాత్' దినం మాతృక బాబిలోనియాది. బాబిలోనియా పూర్వనామం 'ఎడిన్'. అదే 'బైబుల్'లో 'ఏడెన్'

ఆదిలో అంతా అగాధమైన అబ్ధి అని అనేకదేశాల్లో అనుకున్నట్లే సుమేరులకు జగం ఆదిలో 'అబ్జు' (అబ్ధి)—సముద్రం. అందుండి ఆదిపర్వతం అనే భూమ్యాకాశాలు కలసియున్న విశ్వం. సుమేరు భూ(స్త్రీ)మ్యాకాశా (పురుష)ల అధిష్ఠాన దేవతలు 'కి—అను' అను రారాజు వారి పురాతన ప్రభువు 'ఎన్మాస్ కుశ్ అను' 'ఇణ్ణిని' అనుదేవుని భార్య.

'కి' భూమాత, దేవమాత (అదితి), జగదంబ, పార్వతి, జీవదాత, వగైరా. ఆమె ఇతర పేర్లు (అవతారాలు) 'నిన్తు' నిన్‌హర్సగ్', 'నిన్మహ్'.

ఈపురాణ దంపతులు—మిథునం పేరు 'అన్కి' (అను+కి) వీరిద్దరూ సోదరీ సోదరులు. తల్లి 'నమ్ము' (ఆది జలధి). ఐతే 'నమ్ము' కుమారుడైన 'అను'కూడా భార్య

సృష్టి కథనంలో తల్లీ కొడుకు, తండ్రీ కూతురు,

ఏకోదరులు కలసి సృష్టిచేయడం మన పవిత్రగ్రంథాల్లోనే గాదు ఇతర దేశాల్లో అంతకన్నా వింతైన గాథ లున్నాయి. కాగా స్త్రీ-పురుష-సంబంధంగా వేటి వావివరుసలు బహుపురాతనం కావు.

'కి-అణు'ల పుత్రుడు సుమేరు సమ్రాట్, వాయుదేవుడు, సృష్టికర్తల్లో ఒకరైన 'ఎన్లిల్'. కలసియున్న భూమ్యాకాశాల (పరిష్వంగంలోవున్న కి-అణు) విడదీసెనట. రెండు వస్తువుల విడలీతమధ్య గాలిప్రభావం ఉండనే ఉన్నది.

'ఎన్లిల్' ఈ వేరుపరచేటప్పుడు తల్లియైన భూమి(కి,) స్పర్శకు కారణంగా పుట్టినదట 'నినమ్మహా' మహారాణి.

భూమ్యాకాశాల విడితీత గాథ పురాతన ఈజిప్టు గాథల్లో పోలికఉంది. వైదికార్యుల రుద్ర-మరుత్తుల కథలు వాయు మాహాత్మ్యం గూర్చి వరనీయం.

'ఎన్లిల్' భార్య 'నిన్లిల్' వీరిద్దరి కొడుకు 'నన్న' చంద్రుడు. మనవలె, మరికొందరికివలె సుమేరులకు సూర్య చంద్రులు పురుషులు. ఈ 'నన్న'లో నాన్న (తండ్రి) అర్థం ఉంటే ఉండవచ్చు కాని మన పవిత్రగ్రంథాల్లో దేవతల్లో 'నన' పేరు సుమేరులదైయ్యుండునా?

ఆధునిక దృష్టిని భూమ్యాకాశాలమధ్య యున్న దీ గాలి, అంత. సుమేరు వాయుదేవుడు వారి సృష్టికర్త (ప్రజాపతు)ల్లో ఒకడు.

వారి మనువు, ప్రజాపతుల్లో—ఈ భూమిపై జీవసృష్టి చేసినవారిలో 'ఎన్లిల్' అంత ముఖ్యుడూ 'ఎన్కి'. 'ఎన్కి' తల్లి 'నమ్ము' (అబ్ధి) కాబట్టి 'అణుకి'లకు ఇతడు సోదరుడు. 'ఎన్కి' వరుణదేవుడు, జలాధిపతి, విద్యాపతి, మనువు వగైరా.

ఆధునికంగా వివిధ దేశాల్లో జాతీయ పానీయాలుండే-ఆచారం బహుపురాతనం మానవులకుండే అవసరాలు దేవతలకూ ఉంటాయనే నమ్మకాల్లో వచ్చిన వీ కథలు.

మన వైదికార్యులు సోమపీథులు. ఆ పానీయాలనేకం ఆయుర్వేదంలో ఆసవారిష్టాల జాబితాకు వస్తాయి.

సుమేరుల జాతీయ పానీయం 'గిస్టిన్'. వారి దేవతలు కూడా, ఇతర దేశాల్లో వలెనే, త్రాగేవారుగా కథ లున్నవి.

'నిన్మహ' (కి, నిన్హర్సాగ్, భూమాత) త్రాగియున్న మైకంలో నరుల పుట్టించెనట. ఆ పుట్టిన వారిలో వంధ్యలే గాము (పిల్లలు కనలేనివారు), అటు స్త్రీకి ఇటు పురుషునికి రెండిటికీ చెందని (వంశాభి వృద్ధి చేయలేనివారు) వారున్నారట.

భూమాత, జగన్మాత భావాల్లో ఈ నాటికీ వివిధ దేశాల్లో సాకారం—విగ్రహా లున్నాయి. ఈ విగ్రహాలు శరీర భాగాలనుండి

మానవుని బాధ ...

కుష్ఠు రోగము

కుష్ఠము భయంకరమైన వ్యాధి యని చాలాకాలముగా ప్రపంచ మెరిగినది విశేష సంబంధ అనుభవమువల్లనే అంటువ్యాధి అనవచ్చును అది మెల్లిగా ప్రబలుచున్నది మంచి యోచనలో చక్కని ఔషధముల వల్ల వాటిని ఖండించవచ్చును.

ఈ వ్యాధియొక్క మొదటి ఆనవాలు దేహమందు, ముఖ్యముగా చెవులపై ఏర్పడును. చిన్న చిన్న కురుపుల లేక పొడలు, ఇవి ముక్కు నందును, మోచేతియందును తొడలలోను ఏర్పడును పిదప దేహ మంతయు నల్లుకొనును కురుపులు పెద్ద పుండుగా మారును కుష్ఠము నరములను కూడా పీడించును అందువల్ల నరములు ఆ వ్యాధికి లోనై తన శక్తిని పోగొట్టుకొనును పొడుపు బాధ కూడ ఏర్పడవచ్చును

చర్మ సంబంధము —దేహముపై ఎర్రని వర్ణముగల పొడలు, దద్దులు ఏర్పడుట, పొడుపు, బాధ, గజ్జి మొదలైనవి నరముల సంబంధము — పొడలుగల చోట్లలో తిమురు కలుగుట, దురద, సర్వ అవయవములందు వ్యాపించి రక్తమునందు కలిపి మత్తు కలుగజేయును సూదితో పొడిచినను బాధ కనబడకుండుట, చేతివ్రేలు ముడుచుకొనుట, ముక్కు బంధనములు మొదలైనవి అస్థి సంబంధము — పాదమునందు పల్లపుపుండు ఏర్పడుట, కాళ్ళు, చేతులు, వ్రేళ్ళు తిగ్గుట, చూచు వారికి విసుగుజెందునట్లు మరికొన్ని బాధలు యుండును.

కుష్ఠమునకు అనేక ఔషధములు తయారు చేయడమైనది ఇంకను తయారు చేయుటకు ప్రయాస పడుచున్నాము. పూర్వమునసే హిందూదేశమున మాత్రము సిద్ధ ఆయుర్వేద భాగమున కుష్ఠరోగమునకు ఔషధము కనిపెట్టబడి జయము పొందుచు వచ్చుచున్నది వీట్లలో మా యొక్క "మేల్ మాయిల్ మందు" మిక్కిలి శ్రేష్ఠమైన మూలికల వగైరాలతో సిద్ధ ఆయుర్వేద భాగము ననుసరించి మా యొక్క 'మేల్ మాయిల్ మందు' తయారు చేయబడుచున్నది ఈ కఠిన వ్యాధివల్ల బాధపడు మానవులు మా 'మేల్మాయిల్ మందు' ను సేవించి బాగుపడి భగవత్ కృపకు పాత్రులగుదురుగాక

సిద్ధ డాక్టర్ కే. టి కృష్ణమూర్తిఆచారిగారి

మేల్ మాయిల్ మందు

ప్రపంచంలో ప్రఖ్యాతిగాంచిన మహా, కుష్ఠరోగనివారిణి

——— వివరములకు వ్రాయండి. ———

కే టి కృష్ణమూర్తి ఆచారి అండ్ సన్స్,

5/22, మేల్ మాయిల్ (వయా) కాట్పాడి (N A Dt.)

చెట్లు చేమలు మొలకెత్తుతున్నట్లు శిశు ప్రసవమవుతున్నట్లు. ఈ మూర్తుల కాదిమూర్తి 'నిన్మహ' యే నేమో.

అలానే 'నిన్‌హర్సగ్' (పార్వతి) రూపం తలమాత్రమే. ఈ పోలికలూ శిల్పంలో వివిధ దేశాల్లో ఉన్నది.

'ఎన్కి'కూడా 'నిన్మహ'ను సంప్రదించి నరుల పుట్టించె నట. ఐతే ఈ పుట్టిన వారు మట్టిబొమ్మల రకంగా—మూగ (భాషలేదా?), తినలేరు (తినుట తెలియదు) లేవలేరు, కదల లేరు (స్థావరం), శవాకృతి—అచేతనం.

ఈ నరుల సృష్టినిగూర్చిన ఇతర దేశాల కథలూ మూడ దగినవే.

అప్రయోజక సృష్టి చేసినందుకు 'ఎన్కి'ని 'నిన్మహ' శపించెనట, 'ఎన్కి' మరణోన్ముఖుడుగా నుండగా దేవతలు ధూళి ధూసరితులైనారట.

ఇది మతిభ్రమణం—దుఃఖంలో ఉన్మాదనస్థ. 'బైబిల్' కథల్లో బట్టలు చింపుకొనుట, ధూళిలో పొర్లుట, శరీరంపై ధూళిపోసుకొనే ఆచారం పోలిక చూడండి 'బైబిల్' కథల్లో ఆ హెబ్రూల ఆదివంశ కర్త అబ్రహాం, అబ్రాం (అభిరామ, బ్రహ్మ?) సుమేరుల తర్వాత కాలపు ఉరు పౌరుడే.

పరిస్థితి విషమిస్తున్నందున 'నిన్నిక నా జీవ దృష్టితో చూడను' అని కోపించి వెళ్ళిపోయిన 'నిన్మహ' భూదేవిని స్వర్గానికి వెళ్ళి తీసుక వచ్చినదట ఆమె జరిగిన దానికి పశ్చాత్తప్తయై వివిధ దేవీ (వ్యాధి చికిత్సాధిష్ఠాన) దేవతలను ప్రసవించెనట 'ఎన్కి' కోలుకొన్నది.

సుమేరులు ఆదిమ శైవులూ, శాక్తేయులూ అనిపిస్తుంది. వారి భూమాత, పార్వతి, ఆదిశక్తి('అమ') వగైరా దేవి జగజ్జనని, జీవదాతయేగాదు లయకారిణికూడా.

ఈ విశ్వాసాల పోలికలు అనేకదేశాల దేవమాతల కథల్లో ఉన్నాయి. పోతే సుమేరుల అమ్మవారి స్వర్గాల సంబంధం మన అమ్మవార్లకూ విగ్రహాల్లో కన్పిస్తూనే ఉంది.

* * *

ఇతర దేశాల్లో పురాతన గాథల్లో—నరులు వారి దైవాలు—లైంగికాచారాలు సుమేరువారి ఆచారాలు విభిన్నంగా కాన్పించవు దేవుడు రక్షకుడు, పశువుల కాపరివలె మానవులకు కాపరి, తండ్రి—సృష్టికర్త అనే భావాల్లో ఏర్పడినవే—పసివాళ్ల మనోగతుల ప్రతిబింబించే విశ్వాసాలు.

సుమేరు సాహిత్యంలో వారి జనం చుంబనాలు, రతి, వివాహం, ప్రసవం తెలిసినదిగానే ఉంది పశ్వాదక్వాహారులూ ఉన్నారు. పెండ్లి సందర్భంలో విందు వినోదాలున్నాయి కతిపయకాలపు మత విశ్వాసాల్లో, ప్రాంతీయాచార వ్యవహారాల్లో ఇతరదేశ శిల్పంలో వున్నంతగా సుమేరు శిల్పంలో అశ్లీలత, అసభ్యతా కాన్పించవు. అతిపురాతన మనిషిచేసిని రెండు రకాల రతిబంధనాలు, ధేనుకా—తిర్యగ్బంధ నాలవంటివి కాన్పించవు కాని వీరి శిల్పంలో వున్నది రెండవ రకం—స్త్రీపై పురుషుడు. ఆ సుమేరువారి ఆర్థికవ్యవస్థ పశుపాలకత్వంగాక స్థిరమైన కృషీవలత్వం.

వారి దేవతల గాథలబట్టి సుమేరులకూడా స్త్రీ జన్మ ప్రయోజనం, పరమార్థం, ధ్యేయం మాతృత్వమనే ద్యోతక మవుతుంది

'నిన్లిల్'కు దాంపత్యధర్మాలు తల్లి బోధిస్తుంది. నేడూ అనేకదేశాల్లో అంతే. 'నిన్లిల్' శుచియై 'ఎన్లిల్' వెంటబడుటలో స్త్రీ రత్యర్థం భర్తను వెంబడించే ఆచారంగా కాన్పిస్తుంది. వారి దేవుళ్లు ఇంద్రునివలె 'రోడ్‌సైడ్ రోమియో'లు, చీకటి వేట—జారుకాళ్లు — కన్యాశీలభంగం జేసేవారుగా కాన్పించరు. ఇదంతా కాల్పనికం.

సంతానార్థం 'ఎన్లిల్'ను మూడుసార్లు 'నిన్లిల్'ను వెంబడించెను. నేటికీ కాన్పించే పురుషభావం రత్యనంతరం స్త్రీ లంపటం (తాత్కాలికం అయినా) వదలించుకోడం 'ఎన్లిల్'లో కాన్పిస్తుంది మారువేషాల్లో ఉన్నా పసికట్టిన 'నిన్లిల్'కు—ఆ గ్రామ్యధర్మ నిర్వర్తనాల్లో పుట్టినవారు ముగ్గురు పుత్రులు. జ్యేష్ఠుడు 'నన్నా' చంద్రుడు. మధ్యముడు అధోలోకేశ్వరుడు 'నెర్గెల్'—మకరరాశి సంబంధగాథ, కపర్దీకర—రుద్ర, కాలపురుష, ప్రేతలోకనాథుడు. కనిష్ఠుడు మరో లోకేశ్వరుడైన 'నినజు'. కపర్దికర్ల పోలికలు కతిపయకాలపు దృహ్యుల 'మర్దుక్', 'అసుర్' యుద్ధదేవతలలో ఉన్నాయి.

'నిన్ హర్సగ్' (భూమి, పార్వతి) ఆకాశదేవు(అను)ని భార్యయేగాని ఆమెకు 'ఎన్కి' (జలపతి, మనువు) వలన (భూమి నీరు కలయిక) 'నిన్సార్' కలిగెను తల్లి ప్రోత్సాహమున 'నిన్సార్' తండ్రినిగూడి ('ఎన్కి') 'నిన్కుర' ను కనెను. ఆమె అమ్మమ్మ ప్రోత్సాహమున తాతను కూడి శాకంబరివంటి వృక్షదేవి 'ఉత్తు'ను కనెను 'ఉత్తు' ముత్తవ్వ ప్రోత్సాహమున ముత్తాతనుకూడి అష్టవిధ ఓషధీ వృక్షాల గనెను ఈ స్త్రీ పురుష బాంధవ్యంలో నీటివలన పుట్టిన అనే అర్థం చేసుకోవచ్చును. ఈ అమ్మవార్లంతా భూమి సంబంధం అనుకోవాలి.

ఈ లాంటి సంబంధాలు మన పవిత్ర గ్రంథాల్లోనే గాదు ఇతర దేశాల్లోనూ ఉన్నాయి. 'బైబిల్' చూస్తే తండ్రిని మద్య

పాన మత్తునిచేసి కూతుళ్ళు—తండ్రియైన 'లోతు'ను కూడిన కథ ఉన్నదే. ఉషస్సూర్య, రుద్రాంబికలే గాదు గ్రీకుల మహా దేవుడు ద్యుయస్ కథలు చూడండి, అంతా అంతే.

'ఎన్కి' సృష్టియైన ఎనిమిది రకాల వనౌషధుల్ని తినివేసిన(ముంచివేసెనా?) కథ పోలిక గ్రీకుల ద్యుయస్ తండ్రి పుట్టిన శిశువుల మ్రింగివేయడం. ఈ తండ్రి 'క్రోనాస్'కు కాలంగూర్చిన నమ్మకా ల్లేకపోలేదు. కంసుడు దేవకీ తనయుల వధించడం, క్రైస్తవంలో హీరోదు శిశుహత్యలు, గంగా శంతనుల సంతానం గంగపాలు కావడం—ఇదంతా నరబలికాదు పూర్వం కొందరిలో కుటుంబ నియంత్రణంగా శిశుహత్యలూ ఉన్న మాటా నిజమే. కుటుంబ నియంత్రణా కాదీ కథ. కాంతి—కాలం కొలమానం నమ్మకాల్లో వచ్చిన కథఅయి వుంటుంది

గంధక పాదరాల్ని మనలో కొందరు పార్వతీ పరమేశ్వరుల రజోవీర్యాలంటారు. ఈ రెండు పదార్థాలవల్ల ప్రయోజనాలు అశేషం. అలాగే పూర్వం వర్షం దేవుని వీర్యపతనం—బీజం. భూమి స్త్రీ మర్మాంగం—సస్యవృక్షాదులు. అంత అశ్లీలంగా కున్నా నేటికీ భూమిపై నీటి వనరులతో పోలుస్తూ రైతాంగం వర్షం సస్యానికీ, తోటలకూ తల్లిపాలువంటి దంటారు.

పురుష బీజం, శుక్లం, వీర్యం వగైరాగా చెప్పేది ద్రవం. గ్రామీణ జనుల్లో నేటికీ వాడేమాట పశువులు వగైరాలకేగాదు మనుష్యులకూ—గర్భిణీత్వాన్ని సూచిందేది—'పాలు కుడిచిందా, పాలుపోసుకుందా, నీరు పోసుకుందా' వగైరా. అలాగే 'ఉదకాలాడిందా' అంటే పురుడైందా అని అర్థం. సుమేరు సాహిత్యంలో ఈ శుక్లం—వీర్యం దేవతల సందర్భంలో కాన్పించదు. 'ఎన్కి' 'ఎన్లిల్' కథల్లో ఆయా స్త్రీలు ఈ దేవుళ్ల 'హృదయజలం' వలన తల్లులైనట్టున్నది. పురుషుని వీర్యం వారి 'హృదయజలం'.

సుమేరు దేవతల కథల్లో జీవదృష్టి, జీవాహారం, జీవ జలం ఉన్నాయి—ప్రాణవాయువు వలె.

* * *

చంద్ర సూర్య గ్రహ గమనం—పూర్వం వారూ ప్రయాణికులేననే నమ్మకంలో—ప్రయాణసాధనమునికూడా కథల్లో ఉంది. సూర్యుడు రాత్రి మరో లోకంలో (మరణం) ఉంటాడనీ, అరుణోదయంలో మరో సూర్యుడు పుట్టుననీ, సూర్యుడు రాత్రిలో మానవునివలె నిద్రించుననీ వగైరా నమ్మకాలు సర్వవ్యాప్తంగా ఉండేవి.

అలాగే జీవి—శరీరం, ఆత్మ—ప్రేతం—గూర్చిన నమ్మకాలు అనేకం. స్వర్గంపైనా నరకం దిగువా—మరో లోకభావన—ఆ అధో (మరో) లోకంగూర్చిన జిజ్ఞాస సుమేరు సాహిత్యంలో చారిత్రకంగా ప్రప్రథమంగా కాన్పిస్తుంది.

'ఇనన్నా'కు అక్కయైన 'ఎరిశ్కిగల్' అదిలో స్వర్గరాణి. ఆమెను 'కుర్' ఎత్తుకపోయెనట. 'ఎరిశ్కిగల్' అధోలోకరాణి. ఆమె భర్త ప్రేతలోకాధిపతి 'నుగలన్నా'.

గ్రీకు గాథల్లో దీమాతర్ (దేవమాత) భూదేవి. ఆమె కూతురు—అవతారం 'కోరె' (కన్య) మరోపేరు 'పెర్సిఫోని'. ఆమెను 'హేడ్స్' (అధోలోకం)కు ఎత్తుకుపోడం కథ. ఆ అధోలోకేశ్వరుని కర్ధాంగియైన 'పెర్సిఫోని'ని తల్లివెదకడం—సంవత్సరంలో కొంతకాలం అధోలోకంలోనూ, కొంతకాలం భూమిపైనా ఉండేట్లు దేవతల మంతనాలు—ఇందులో కొంత పోలిక మన నమ్మకాల్లో పాతాళాన్నుండి బలిచక్రవర్తి సంవత్సరాని కొకసారి భూమిపైకి రావడం లేకపోలేదు. గ్రీకు కథలలో చాలావరకు వృక్షసస్యాలు, కందమూలాదులు కొంతకాలం భూమిలోనుండి మొలకెత్తడం, మళ్లీ విత్తులు—కథ వుంది.

సుమేరు గాథల్లో అధోలోకయానం—ఈ విత్తనాల కథే గాక మృతలోకగాథా—ఉంది.

సుమేరుభాషలో 'కర్' అర్థం అధోలోకం ఒకటే గాదు. పర్యంకం, క్రూరసత్వం, మహాసర్పం, పర్వతం, శత్రువు, అగాధజలం—వివిధంగా ఉంది.

సుమేరు దేవతలు 'కుర్'పై చేసిన దండయాత్రలు అనేక దేశాల కథల్లో దేవాసుర యుద్ధాలుగా ఉన్నాయి.

అవన్నీ కాంతి, కాలం, ప్రకృతిని గూర్చిన విశ్వాసాల్లో ఏర్పడిన కథలు కావచ్చును.

'కుర్'పై మొదట దాడిచేసినది 'ఎన్కి.' రెండవ దండయాత్ర సుమేరు యుద్ధదేవుడు 'నినుర్త'—కతిపయకాలపు 'మర్దుక్' అస్సీరియన్ రణదేవుడైన 'అసుర్'. పై రెండు దండయాత్రల్లో జలాధారాల—నీటిని—వినియోగించుకునే ఏర్పాట్లు, 'ఇర్రిగేషన్' పాన వ్యవసాయార్థం నీటి పారుదల ఏర్పాటు అయ్యుండే సూచనలున్నాయి ఆ 'కుర్' మహాసర్పం. సర్పం పురాతన విశ్వాసాల్లో సృష్టికాధారమైన నీరు, పురుష వీర్యాలకు సాంకేతిక రూపంగా ఉంది.

సుమేరుల ప్రేమ, సౌందర్య, జీవ, కాంతుల (శుక్రగ్రహమా?) అధిష్ఠాన దేవత, వారి విజయలక్ష్మివంటి దేవి 'ఇనన్నా' ఆమె అవతారాలే—పోలికలే వివిధ దేశాల్లో కతిపయ కాలపు అమ్మవార్లు 'ఇష్తార్' ఈశిశ, అస్తారెత్, దుర్గ వగైరా.

'ఇనన్నా' దండయాత్రలో 'కుర్' పార్వతీయ శత్రుజనులై యుందురా?

సుమేరుల పై దేవాసుర యుద్ధం—'ఎరిశ్కిగర్' అపహరణ పోలికలు అనేక పురాతన జాతుల గాథల్లో ఉన్నాయి—యూదుల

'లెవియాథన్', గ్రీకుల 'టైఫన్', అస్సీరియన్ల 'బెల్' తియ వుత్—వృత్రుడూ, రావణుడు, నరకాసురుడు వగైరా రావణుని సీతాపహరణ గాథ గ్రీకుల 'కోరి' కథ వంటిదే.

*　　　　*　　　　*

ప్రపంచ పురాతన జాతుల్లో ఆది నాగరికుల వృత్తులు ప్రాంతీయతబట్టి పశుపాలకత్వం, కృషీవలత్వం. మొదటివారు దేశద్రిమ్మరులు కాగా రెండవవారికన్నా అనాగరికులు, క్రూరమతులు ముష్కరులుగా కన్పిస్తారు.

ఈ రెండు వృత్తుల్లో వారికి నాడూ, నేడూ విరోధాలున్నాయి మేము గొప్పంటే మేము గొప్ప—తెలంగాణా గోండుల అన్నరాణి, అన్నసిరారు కథలు చూడండి.

'బైబిల్'లో యూదుల కథ 'కెయిన్-ఏబెల్' అదే విరోధం. ఈ కథకు మాతృక పురాతన ఈజిప్టు కథ అంటారు.

సుమేరు సాహిత్యంలో 'లాహర్—ఎంటెన్' పశుపాలకాధిష్ఠాన దేవతలు. వారి పొష్య లేక సస్యలక్ష్మి 'అశ్నాన్', క్షేత్రపతి 'ఎమెశ్'.

ఏకోదరులమధ్య ప్రాగిన మైకంలో నేను గొప్పంటే నేను గొప్ప అనే విరోధం వారి మహాదేవుడు చీవాట్లు వేయగా సమసిపోయిందిగాని 'కెయిన్—ఆబెల్' కథలా విషాదాంతం కాలేదు.

ప్రపంచజాతుల్లో—వారివారి రణదేవి, జగన్మాత, భూమాత, జీవదాత, ఆదిశక్తి వగైరా పోలిన అమ్మవార్ల సోదరులో, ప్రియులో, భర్తతో గాలి, వాన, సృష్టిలయకార గుణప్రధానులుగా, పశుపతులుగా ఉన్నారు. అలాంటి కథే మన ఆది(పురాణ) దంపతులు.

సుమేరుల 'ఇనన్నా'కు సోదరుడు సూర్యుడు 'ఉతు' (ఉరు, కతిపయకాలపు 'బర్బర్' 'శమాశ్') వరాన్వేషణచేస్తాడు కృషిపాలకుడైన 'ఎన్కెమ్డు', పశుపాలకుడైన 'దుముజి' (ధూర్జటి?) ఇద్దరూ ఆమెనే కోరుతారు. చివరికి లౌక్యంగా కృషిపాలకుని మంచి జేసుకొని పోటీలేకుండా 'దుముజి' పశుపతి దుర్గవంటి 'ఇనన్నా'ను పెండ్లాడుతాడు.

'ఇనన్నా' శిల్పంలో మనం ప్రభావళి, కాంతిపుంజం అనేట్లు దుర్గకువలె జ్వాలాకిరణా లున్నాయి. చక్రపాణికాదు కాని చేత కడియంవంటి దున్నది. ఆ కడియం బహుశా స్త్రీత్వం, అధికారం, జీవదానాల సాంకేతిక చిహ్నం కావచ్చును. అదే రకం వస్తువు—వర్తులంగా, త్రికోణంగా ఇతర పురాతనజాతుల కతిపయకాలపు అమ్మవార్ల చేతుల్లో ఉండటం—చివరికి సృష్టి—జీవం సూచించే పద్మం (ఉత్పలం)గా శిల్పంలో మారింది.

ఈమె సోదరుడు సూర్యుడు ('ఉతు') చేతిలో కిరణాలు సూచించే రంపపుపళ్ళవంటి ఆయుధం (కతిపయకాలపు చక్రాయుధం?) ఉంది ఈ దేవుని పాదాల క్రింద పరాభూతు డున్నాడు. అదీ కాలంగూర్చిన కథే గావచ్చును 'ఇష్టార్' మహిషమర్దనివలె ఆలీఢపాదభంగిమం గలది

సుమేరులు 'శుంగిరు' లనబడిన కారణం తెలియదు. కాని శిల్పంలో వారి దేవతల తలలపై కుళ్ళాయివంటి శిరోవేష్టాలు (కిరీటాలు), వాటికి పార్శ్వాల్లో కొమ్ములు కొమ్ములుగా కొమ్ముల వంటివి వున్నాయి.

*　　　　*

అనేకదేశాల్లో పురాతన గాథల్లో దేవాసుర యుద్ధాలున్నవి. వీని మాతృక సుమేరులదని తేలినది అలానే వివిధదేశాల్లో గల జలప్రళయగాథ మాతృక కూడా సుమేరులదే.

భూమి, భూమిపై స్థావరజంగమాలగూర్చి తెలిసినవారు ఆ జలప్రళయం, కల్పాంత (యుగాంత) నాశనం, పునస్సృష్టి కథ నమ్మలేరు. కాని ఏదో వాక్ప్రాంతంలో విడవకుండా సాగిన తుఫాన్ స్మృతి అయితే కావచ్చును. అలాంటి అధికవృష్టి నేటి ఆధునిక వార్తాప్రయాణ సౌకర్యాల్లేని నాడే కాదు, మధ్యయుగంలో కూడ ప్రాంతీయంగా జలప్రళయమే.

మన మత్స్యావతార గాథ—సోమకాసురుని వేదాల తస్కరణ, ఒకానొక మనువు లేక ఒకానొక ద్రావిడరాజు సప్తర్షులు వగైరా నౌకాయానం, జలప్రళయంలో విష్ణువు (సూర్యుడు) మత్స్యరూపాన వారికిచ్చిన రక్షణగాథ.

'బైబిల్' యూదుల సృష్టి, జలప్రళయ గాథలు సత్యదూరం, వాస్తవంగాదనే క్రైస్తవ పరిశోధక నిర్ధారణ జరిగింది. ఈజిప్టు నీల (నైల్) నది వరద వారి కథకాదు, సుమేరులగాథే.

క్రైస్తవ పవిత్ర సాహిత్యంలో (యూదులనాడు) దేవతలు కోపించి నరుల విభేదానికి బహుభాషలు సృష్టించారన్నట్లే నరులపై కోపంవలన జలప్రళయం కల్పించారట. 'నోవా' (నావికుడు) మళ్ళీ సృష్టి నిమిత్తం రక్షానికొక విత్తనం—ప్రాణి గ్రుడ్డువగైరా సేకరించి, నౌకలో సురక్షితంగా వుండి, జలప్రళయానంతరం ఆయా స్థావర జంగమ జీవాలుండేట్లు జేసెనట. ఈ నావికుని ముగ్గురు కుమారుల వంశీయులే (బహుశా యూదులు ఎరిగిన) వివిధ భాషాజాతి వర్గాల వారైన 'సెమైట్స్ హేమైట్స్, జాఫైట్స్'

నాటి సుమేరుల రాజ్యంలో నేడు 'టైగ్రిస్ యూఫ్రెటిస్' అనబడే నదుల వరదల కథ అయ్యుండ దీ జలప్రళయం.

పూర్వం మతాధిపతులు, ఋషులు వంటివారే

'సైంటిస్టులు'. మానవ మేధా వికాస ప్రగతి చరిత్రమాస్తే బహుపురాతన కాలంనుండీ ఈ సృష్టి, 'విశ్వం', ఆకారం — ఆ కాంతి పుంజాలు జిజ్ఞాస–తెలుసుకోవాలనే పరిశీలనలో వచ్చిన కథలూ, కల్పనా మూర్తులూ కొల్లలు.

అలాంటిదే సూర్యగ్రహగమన పరిశీలన–కాలపరిగణన — మాసాలు ఋతువులు–ఆకాశాన–భూమిపైన మార్పులు గమనించడం. సంవత్సరంలో సూర్యుని ద్వాదశరాశి గమనమే మన విషు వ్యాపకత్వం. ఆయనే వైదికార్యులనాటి మిత్రావరుణ భగ ఇంద్రులు. ఆ కల్పనా గాథలూ, మూర్తులే 'బైబిల్', 'రామాయణం' వగైరా పవిత్ర గ్రంథాల్లో గాథలు.

మనకు అసురదానవాదులు దుష్టులు, క్రూరులు, హింసా యుతులు కాని అనేక దేశాల్లో సురలు, దేవతలు ఈర్ష్యాళువులు, దుష్టులు కాగా మన సురులే మరో దేశంలో (ఇరాన్) పూర్వం అసురులు.

దేవతల్లో కొందరు మంచివారు, కొందరు చెడ్డవారు— మనుష్యులతో పోలిక సుమేరు దేవతలు కొందరు మర్త్యులపై కోపావేశాన జలప్రళయం కల్పించినట్లు సుమేరు సాహిత్యంలో ఉంది

వారి మనువు, ప్రజాపతుల్లో ఒకడైన 'ఎన్కి' —జలాధిపతి వలన తన సృష్టిని సర్వనాశనం గాకుండా రక్షింప నిశ్చయించెనట 'జియుశుద్ర' ('హసిశుద్ర యుష్మద్') అనే రాజును ఏకాంతంలో హెచ్చరించెనట. ఆ రాజా నౌకను సిద్ధంచేసుకొని–ఏడహోరాత్రాలు జలప్రళయంనుండి రక్షించుకోగలిగెనట. ఆ ప్రళయానంతరం 'ఉతు' (సూర్య) దర్శనం కలిగెనట.

సుమేరు వీరుల్లో 'గిల్గమేరు'ని గాథ కతిపయకాలాన అనేక దేశాల్లో వివిధనామాల (గ్రీకుల హెర్క్యులెస్ – హెరకిల్సు— హరశూలి, హరికులేశ) వీరగాథగా మారింది. ఈ వీరుని గాథలు సుమేరుల కతిపయకాలపు దృహ్యులనాడే బహుళ వ్యాప్తికి వచ్చింది. ఆతని వీరగాథల్లో వీరునికి దోడ్పడిన 'జియుశుద్ర' నావికుడు. వారి మత్స్యావతారం 'ఈయ' అనే అర్ధవిహీన మానవుడు. 'ఈయ' నాగరికతకు చిహ్నం కూడాను.

'గిల్గమేశ' కథలో సూర్యుని వివిధరాశి సంక్రమణగాథలు లేకపోలేదు క్రీస్తు పరివారం12 గురి కథా అలాంటిదే కావచ్చును.

'ఎన్కిడు' ఒక వీరుడు. మొదట ఏదో గుహలో తాపసివలె వున్నవానిని స్త్రీలు అలరించి, ఆకర్షించి రాజధానికి తీసుకు రావడం, 'గిల్గమేశు'ని మిత్రుడు కావడం కథలో ఋష్యశృంగుని కథ పోలికల్లేక పోలేదు 'ఎన్కిడు'— గిల్గమేశ'–సూర్యుని వృషభ, మిధున సంక్రమణం–వీరిద్దరూ చేరిన అరణ్యం—ఆ వనాధిపతి

ముచ్చటైన ముద్రణ, ముద్దులొలికే నూతన
శిల్పసంపద – అవును అందుకు అనుభవం,
అపురూప నైపుణ్యం కారణం – ఉన్నత
ప్రమాణాలకు, ఉత్తమ ముద్రణకు
పర్యాయపదం!



స్వతంత్ర ఆర్టు ప్రింటర్సు,
విజయవాడ - 4. ఫోన్. P.B.X. 5301
5302

'కుంభభ' నోడించుట కర్కాట సంక్రాంతి.

ద్రవిడ్యాల 'ఇష్టార్' 'గిల్గమేశు'ని కామించిన కథ కన్యా సంక్రమణం అని ఆ కథలో వివరాలు సూచిస్తున్నాయి. మనకు సూర్యుడు వృద్ధభానుడు కావడం, కన్యాసంక్రమణంనాటినుండి సూర్యుని ఎండ తగ్గి, రాత్రికాలం హెచ్చడం, మన పరిగణనలో మహాలయ ప్రారంభం. పురుషుడు స్త్రీలోలతలో తన కాలము, బలము మొదలగు శక్తి యుడుగుట సూర్యుని కన్యాసంక్రమణం గూర్చిన కథ. కాగా తర్వాతి రోజుల్లో నేటివలె వసతి, వేడి సౌకర్యాలులేని పూర్వకాలంలో చలికి, చీకటికి జనాభా తగ్గేది. ద్రవిడ్యాల 'తమ్ముజ్' 'గిల్గమేశు'-'హెరకిల్సు', గిల్గమేశు'ని పోలిన ఇతర వీరులు సింహాల వెదుక్కొనడు సింహ సంక్రమణం. సుమేరు వీరుడు వృశ్చిక మానవులను జూచుట వృశ్చిక సంక్రాంతి. 'ఉత్నావిష్ట' నావికుడు, అనుభవశాలి మృత్యుజలాన్నుండి గిల్గమేశుని తరించి తోడ్పడుట ధనూరాశి చీకటి, చలి నుండి బైటపడిన—మృత్యులోకం చూచివచ్చిన సుమేరు వీరుని గాథలో జలప్రళయం కుంభ సంక్రాంతి. మత్స్యావతారంవంటి మీన మానవుడు 'ఈయా' సహకారం మీనసంక్రమణం.

'గిల్గమేశు'డు సౌరవీరుడు, సూర్యుని అవతారం, సూర్యుడు యువకుడైన (వసంత) ఈతడు 'ఎరిక్' ప్రభువు. ఈ వీరుని గాథల్లో మన ఇతర దేశాల్లో నక్షత్రమండలంలో 'ఆరియన్' (వరుణ, కృత్తివాస, ప్రజాపతి, రుద్ర, మృగవ్యాధ, ధనుర్ధారి వృషభరాశి, మృగశీర్ష-(శిరా) కల్పనా గాథల పోలికలూ ఉన్నాయి.

సుమేరులు సింహాన్నెరుగరు. పెద్ద కుక్క అనుకున్నారు. గుర్రాన్నెరుగరు. దాన్ని పార్వతేయ గార్దభం అనుకున్నారు కాని పురావస్తుశాఖ వారికి లభించిన సుమేరు శిల్పశిథిలాల్లో దైవాల వద్ద సింహం ఉంది

సుమేరుల మూలస్థానము సింహాలులేని, గాడిదలున్న ప్రాంతం ఏది? సింహాలు మనదేశంలో పురాతన కాలంనుండీ లేవు—గుర్రాలు అంతే మనకు వ్యాఘ్రం దేశీయం.

సుమేరు శిల్పంలో బహుబాహులు వగైరా లేరు. కాని ద్విముఖు డున్నాడు. 'ఇసీముద్' దేవదూత ద్విముఖుడు. ఈ పోలిక సహస్రాబాల తర్వాత రోమన్‌లు యుద్ధకాలంలో పూజించిన 'జానస్' (గణపతి)లో వున్నది.

సూర్యదేవుడైన 'ఉతు'కున్న ట్లే ఆతని సోదరి, 'ఇనన్నా'కూ జ్వాలాకిరణా లున్నాయి ఆమెవద్ద కూడా సింహం ఉంది. ఆమెకు పక్షిరెక్కలూ ఉన్నాయి. కతిపయ కాలపు ద్రవిడ్యాల 'ఇష్టార్' అంతే. ఆకారంపై నక్షత్రగణాలు దిద్దిన (ఉలూక, హంస వగైరా) కల్పనా మూర్తులు కావచ్చును. అదే వివిధ దేశాల్లో దేవతలవద్ద కాకి, గ్రుడ్లగూబ, హంస, నెమలి, గుర్రం, ఎద్దు, పొట్టేలు, పాము, లేడి వగైరా మృగాలున్న గాథ.

ద్రవిడ్యాలైన కాల్డీయులకన్నా, గ్రీసు, ఈజిప్టు, వైదికార్యులు వగైరా ప్రజలకన్నా పూర్వమే చారిత్రకంగా జ్యోతిర్వేద పరిశోధన సుమేరుల్లో ఉందనక తప్పదు.

మనోగతము

శ్రీ చిటిప్రోలు కృష్ణమూర్తి

నేను జన్మించియుండిన
బ్రహ్మానాయని కాలమున......

చెన్నకేశవాలయ నిర్మాణమునకు
ఏరి యేరి దూర ప్రాంతములనుండి
కోరికోరి తీసికొని వచ్చియుందును
శ్రేష్ఠమైన శిలాసముత్కారమును.

నిగూఢముగ అక్షిగోచరము గాక
శిలాంతరములలో నుండిన
భువన మోహన మధుర మూర్తులను
దర్శించి పరామర్శింతును.

ఉరి ముఖమున పిల్చిన నా పిలుపులు మన్నించి
నా నిరంతర కళాతపః ఫలాకృతులుగా
రసాకృతులతో అభయముద్రలతో
సాక్షాత్కరింతురు దివ్యమూర్తులు.

మానసమున పరిమళించు భక్తిభావమున
మననము చేసి చేసి, కూర్చిన నుతిగీతికలు
పారవశ్యమున భక్తసమాజ మనుసరింపగా
ఆలయమున గళమెత్తి ఆలపింతును.

మురిసిన బ్రహ్మన్న హృదయకోశమున
మెరసిన చెన్నకేశవప్రభుని నయనకోణముల
వెల్లివిరిసెడివి తనివిరేకలు
జల్లులై కురిసెడివి మేలిదీవెనలు.

నరుల నడుమ నరమరలు చెతిపి
అచ్చమైన సామరస్య సౌమనస్యములు వింపెడి

బ్రహ్మన్న ప్రకృష్ట సమతా సిద్ధాంత సారము
ఆదరణీయ కవితా సామగ్రి యయ్యెడిది నాకు.

కులమత విభేద విషాగ్నిజ్వాల లారి
విశ్వమానవ సోదరప్రేమరసాన్నము విస్తరించెడి
చాపకూటిపబ్బమున పంక్తులై కూర్చున్న సుజనసంఘమున
కడబంతిలో కడనైన తీరి కూర్చుండియుందును.

వసుధైక కుటుంబ సభ్యమూర్తులుగా
అసమాన మానవతామూర్తులుగా వెలసిన
అనపోతరాజాది సోదర సప్తరత్నములలో
అవతరించి యుందును అష్టమరత్నముగ.

సద్గుణసోన్నుడు సత్యపరాక్రముడు
కన్నమదాస వీరభద్రమూర్తిని గాంచి
అభినందింతును పులకితాంతరంగుడనై
అభివందింతును అవనతోత్తమాంగుడనై.

మానవోత్తముని మనసువలె విరిసిన వెన్నెలలో
చెన్నకేశవస్వామి మందిర ప్రాంగణములో
బ్రహ్మ జ్ఞాన సంపన్నుడు బ్రహ్మాన తత్త్వోపదేశములు
సావధానముగా నాలింతును జిజ్ఞాసువులతో గూడి.

అనర్గళముగ ధారావాహినిగా సాగెడి
బ్రహ్మనాయుని సరసవచోవిభూతి ననుకరించుచు
ముందుకు సాగిపోయెడిది చంద్రభాగాతరంగిణి
క్రొందళుక్కులు కందళించెడివి సరసలోచనాంచలముల.

ఏ మొగమున దైన్యరేఖ పొడచూపిన
జలమయము లయ్యెడివి నేత్రగోళములు
ఏ మొగమున దర్పరేఖ పొడకట్టిన
కనులలో మండెడివి మార్తాండ మండలములు.

దురాక్రమణ పరాయణ దుష్ట బుద్ధులు
పాములై పడగలెత్తిన మరుక్షణమున
అంతరాంతరముల నిద్రించెడి చైతన్యము
రెక్కలార్చి పేర్చెడిది గరుత్మన్మహోద్ధతితో.

వాడవాడల సాగెడిది ధర్మవీర ప్రబోధము
వీధివీధిని వెడలెడిది కర్మవీర ప్రకాండము
అగ్రశ్రేణిలో అగ్రేసరుడనై నిల్తును
ధర్మదీక్షితుడనై ధన్యజీవినై పొల్తును

ఆత్మ స్థైర్య సంపన్నమైన చిట్రిపొట్రి ఖురాఘాతములకు
మొక్కపోపుటయె కాదు సొట్టపడి పోయెడివి
నిక్కి నిల్చిన కొండల దండి గుండెలు
"శిలోచ్చయము ముందు ఎంత బలవంతమైన తగరైన తానెంత"
అనుమాట అర్థసత్యమని ఎలుగెత్తి చాటియుందును.

అధర్మ ప్రతాప ముడిసి లోకమును
ధర్మ సస్య శోభితము జేయ
నిలు వెల్లను ధారవోసియుందును
త్యాగైక శీలమూర్తినై
గ్రీష్మ మహోష్మమును బాపి భూతలమున
పైరు సౌరు లొలికింపగా
నిలువున నీరై ధారలై కురియ నేర్తును
మేఘమూర్తి ఉత్తేజితుడై,

నేను జన్మించియుండిన
బ్రహ్మనాయని కాలమున.

శ్రీనాథ సోమయాజి

శ్రీ వేకుమళ్ల కామేశ్వరరావు

శ్రీనాథ మహాకవి యెన్నియో తెలుగు ప్రబంధములను వ్రాసినాడు. వానిలో కొన్నియే మనకు లభించినవి. అతని చాటువు లున్నవి. అతనికాలపు శాసనములు ప్రకటింపఁబడినవి. వాటి సహాయమున నా మహాకవి జీవిత చరిత్రను నిర్మించుటకు కవి చరిత్ర రచయితలు శక్తివంచన లేకుండ పాటుపడిరి. కొన్ని విషయములలోఁ గొందఱకు ప్రాజ్ఞ్నిర్ణయములు (ప్రిజుడిసెస్) ఉండుట మొత్తముమీద నవేక సిద్ధాంతములు, నభిప్రాయములు నేర్పడినవి. అవి యొక్కొక్కప్పుడు సత్యదూరముగా నున్నవి. కాబట్టి యా మహాకవి చరిత్ర పునఃపరిశీలనను గోరుచున్నది.

శ్రీనాథ కవిరాజుయొక్క యింటిపేరు మనకు తెలియదు. ఆనాడు మనకాలమందు వలె ఇంటిపేళ్లు లేవనియె చెప్పవచ్చును. ఇంటిపేళ్ల వంటివి కొందఱకున్నమాట నిజము. అప్పటివారి కింకను ఇంటిపేళ్లు యేర్పడకపోవుటచేతనే, వారు తరుచుగా తమ తండ్రి పేరును చేర్చి వ్రాసుకొనుచుండిరి. శ్రీనాథుని విషయము నంతియే.

శ్రీనాథుని స్వగ్రామము [1] సింహపల్లి (కాల్పట్టణము) అది తూర్పుగోదావరి జిల్లా సముద్రతీరమున కోరంగి రేవునకు సమీపముగా నున్నది.

శ్రీనాథుని తాత పేరు కమలనాభుఁడు. అతఁడు 'కాల్పట్టణాధీశ్వరుఁడు' — అనగా, సింహపల్లి రేవు పట్టణము పాలకుఁడు. అంతే కాని పట్టె గ్రామకరణము కాదు. పిమ్మట 'వినమత్సకల సార్వభౌముఁడు'—అనగా, కాకతీయ చక్రవర్తియైన రెండవ ప్రతాపరుద్రుని (క్రీ. శ 1295–1326) చేత మన్ననలు పొందినవాఁడు ఎట్లన్న అతఁడు 'అమాత్య చూడామణి'— ఆ చక్రవర్తి యొక్క మంత్రిమండలిలోనివాఁడు అట్లు కమలనాభుని పేరు తెలుగుదేశమంతటను తెలిసినది. ఆనాఁడు అతని మిత్రులు వెలమ, రెడ్డి నాయకులు, మామిడి సింగన మంత్రి పూర్వులు, కొండవూడి కుటుంబము మొదలైనవారు. అట్లు వారందఱును పరిచితులగుటచేతనె ఉత్తరోత్తరా శ్రీనాథ కవికి లాభము కలిగినది.

కమలనాభుఁడు కవితా విద్యాధరుఁడు పద్మపురాణ సంగ్రహ ప్రబంధ కర్త. క్రీ. శ. 1326 లో కాకతీయ సామ్రాజ్యము కూలిపోయినది కదా! అప్పటికి అతని వయస్సు నలుబది యనవచ్చును; జననము 1286 అగును. అతనికి వెందఱు బిడ్డలో తెలియదు. అతని కొడుకు మారయ్య క్రీ. శ. 1325లో జన్మించియుండును. కమలనాభుడు ఎంతకాలము జీవించెనో తెలియదు. డెబ్బదియైదు సంవత్సరములు బ్రతికియుండెనని చెప్పవచ్చును. కాకతీయ సామ్రాజ్యము చితికిపోయినపిమ్మట నతని యుద్యోగాదులను గుఱించి యెఱుగము. అతఁడు సింహపల్లి గ్రామమును చేరుకొనియుండవచ్చును.

కమలనాభుని కుమారుఁడు మారయ్య విద్యలకు బ్రహ్మ. అతఁడు మామిడి కుటుంబమువారిని యెఱిఁగియున్నాఁడు. వారు కొండవీటి రెడ్డిరాజ్యములో మంత్రులు. మారయ్య కొండవీటి సీమను జేరి; పెదకోమటివేమారెడ్డి మంత్రుల సహాయమున తానుకూడ చిన్న యమాత్యపదవిని సాధించినాడు అని చెప్పవచ్చును. అతని భార్య భీమాంబ. వారి సంతాన మెందఱో తెలియదు. అతని పుత్రుఁడు శ్రీనాథుఁడు. తండ్రికి నలుబది యైదవయేట, అనగా క్రీ: శ. 1370 లో జన్మించియుండును. 1286 లో జన్మించిన కమలనాభయ్య, మనుమని జననము నాఁటికును జీవించియుండెననుమాట నమ్మదగినది కాదు. కాబట్టి శ్రీనాథుఁడు తన తాతను కన్నారి చూడలేదు.

శ్రీనాథుని జననమును కొందఱు విమర్శకులు 1360 ప్రాంతమనియు, మఱికొందఱు 1380 ప్రాంతమనియు చెప్పుచున్నారు.[2] 1360 చాల పూర్వమనియు, 1380 చాల వెనుకయనియు తోఁచుచున్నది. శ్రీనాథ మహాకవి శృంగారనైషధ ప్రబంధమును వ్రాసి మామిడి సింగన మంత్రికి సంకితమిచ్చినాడు. ఆ ప్రబంధముయొక్క రచనాకాలమును నిర్ణయించిన పిమ్మట, నందున్న మామిడి సింగన వంశవృక్షమును పరిశీలించి

---

1. ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక సం. 55 సం. 1–4 పుట 105.

2 వేటూరి వెంకటరమణయ్యగారు శ్రీనాథుని జీవితము 1370 నుండి 1450 అని భావించుచున్నారు.

నను పైన జెప్పిన 1370 యే సమంజసమని తోచును. అంతేకాక హరవిలాస, భీమేశ్వర పురాణ ప్రబంధములబట్టి చూచినను అది ధ్రువపడును. వాటిని ఆ యా స్థానములలో చూచెదము.

శ్రీనాథుఁడు తన తండ్రియొడిలో గూర్చుండి వేదములు, ఆగములు, పురాణములు, కావ్యశాస్త్రాదుల నభ్యసించినాడు. లేత వయసున గట్టి పండితుఁడైనాడు. మారయమంత్రి కవిత్వమును చేపట్టలేదు. శ్రీనాథుఁడు మాత్రము తాతగారివలె కవిత్వపుపంథాలోకి దిగినాడు. పదునాలుగేండ్ల వయస్సులో మరుత్తరాట్చరిత్రను మాటలలో చిత్రించినాడు.

పెదకోమటి వేమారెడ్డి యాస్థానములోని యొకమంత్రి యైన పెద్దన్నకు (సింగనమంత్రికి అన్నగారు) శ్రీనాథుఁడు పదునేడేండ్ల చుట్టుపట్ల పండితారాధ్య చరిత్రాదులను వ్రాసి యంకిత మిచ్చినాడు. శాలివాహన సప్తశతిని పద్యకావ్యముగా వ్రాసినాడు. కాని ఆ కృతులేవియు నేడు కానరావు. అని యాతని కవిత్వపు గరిడిలోని సాధనలని చెప్పవచ్చును. అట్టి కృషి చేసి ప్రౌఢగ్రంథమైన శృంగారనైషధమునకు బూనికొన్నాడు. మొదట పెదకోమటి వేమారెడ్డిని గూర్చి తెలుసుకొనెదము.

కొండవీడు ముఖ్యపట్టణముగా కుమారగిరిరెడ్డి (1385–1403) రెడ్డిరాజ్యము నేలినాడు. అతని బంధువులు, ఇతరులు రాజ్యములోని వివిధ ప్రాంతములను పాలించుచున్నారు. కుమారగిరిరెడ్డి పిమ్మట పెదకోమటి వేమారెడ్డి కొండవీటికి ప్రభువైనాడు. కాని అంతకుపూర్వము అతఁడు రాజ్యపాలనలేకుండ కూర్చున్నవాడుకాడు. అతని తాతయైన మాచారెడ్డి చందవోలుప్రభువు. అతని తర్వాత మాచారెడ్డియొక్క కుమారుఁడైన పెదకోమటి పరిపాలించినాడు. అతనికి పిమ్మటని అతని కుమారుఁడైన వేమారెడ్డి. అనగా పెదకోమటి వేమారెడ్డి రాజ్యమునకు వచ్చినాడు. అట్లు పెదకోమటి వేమారెడ్డి చందవోలు ముఖ్యపట్టణముగా చందవోలుసీమను పాలించినాడు. అదంతయు క్రీ. శ. 1403 కి పూర్వపు కథ.

పెదకోమటి వేమారెడ్డి మహాశూరుఁడు. కొండవీటి రాజ్యముయొక్క దక్షిణపుటెల్లను రక్షించుటయందు నిపుణుఁడై 'పండరాయ గజకేసరి' యను బిరుదు నార్జించినాడు. చందవోలులో పెదకోమటి వేమారెడ్డి ప్రభువుయొక్క యాస్థాన మంత్రులు, దండనాయకులను మామిడి కుటుంబమువారు. మామిడి ప్రెగడన్న శ్రీనాథునినుండి గ్రంథముల నంకితము పొందిన విషయమును జూచితిమి. మామిడి సింగన మంత్రికి శ్రీనాథుఁడు శృంగారనైషధ ప్రబంధమును కృతినిచ్చెను. శృంగార నైషధములో యవతారికావదానములనుండి సింగనమంత్రి సామ్రాజ్యముయొక్క మంత్రియని తెలియుచున్నది. అసలు రెడ్డి రాజ్యమేకాని సామ్రాజ్యముకాదు. అట్టి సందర్భములో సామ్రాజ్యమను మాటకు పెద్ద యర్థము లొసగి, దాని ముఖ్యపట్టణము కొండవీడనియు, పెదకోమటి వేమారెడ్డి యప్పటికె కొండవీటి ప్రభువనియు చెప్పరాదు. మన మహాకవులు గ్రామకరణమును వేల నాలుగు చెరగుల నేలిన ప్రభువని వర్ణించినవారు కాదా! కాబట్టి యట్టి పొగడికలు కవియొక్క యతిశయోక్తులు మాత్రమే. అట్లు గ్రహింపకున్న నిజము మరుగునఁ బడిపోవును.

కాబట్టి పెదకోమటి వేముడు చందవోలు సీమకు మాత్రమే ప్రభువు. అతని ముఖ్యపట్టణము చందవోలు. అతని ప్రధానమంత్రి మామిడి సింగన. అతనికి శ్రీనాథ మహాకవి శృంగార నైషధమును సమర్పించినాడు. అయితే ఆ కాలమేది? శ్రీనాథుఁడు తాను ఆ గ్రంథమును—

సంతరించితి నిండు జవ్వనంబునయందు
హర్ష నైషధ కావ్య మాంధ్రభాష

యని చెప్పుకొన్నాడు. నిండు జవ్వన మనగా ఇరువదియైదు ముప్పదియేండ్లమధ్య ప్రాయమని విమర్శకులు చెప్పుచున్నారు. కాబట్టి శృంగార నైషధము శ్రీనాథుని ఇరువదియైదవయేట అనగా క్రీ. శ. 1395 లో నిర్మింపఁబడియుండను. అది సుప్రసిద్ధ రచనకాగా శ్రీనాథుఁడు కవిసార్వభౌమ బిరుదును సంపాదించుకొన్నాడు. ఆ బిరుదును అతఁడు స్వయముగా ధరించినాడా లేక ఎవరైననిచ్చినారా యను చర్చ యనవసరము. అతఁడు ఆ బిరుదుకు తగియున్నాడను విషయ మెల్లరెఱిగినదే. మన కాలము నాటి స్థితిగతులను గమనించండి. కవి సార్వభౌములు అరడజనుమంది యున్నారు. కాబట్టి కవిసార్వభౌమ బిరుదును గురించి రగడ యనవసరము.

శ్రీనాథభట్టు స్వేచ్ఛగా నున్నాడు. 1396 లోనాక చిన్న దేశాటనమును దలపెట్టినాడు. పలనాటిమీదుగా శ్రీశైలమును జేరదలచినాడు. శివరాత్రి నాటికి శ్రీశైలములో నుండిలేరవలెను. తాను వ్రాసి సిద్ధము చేసుకొన్న శివరాత్రిమాహాత్మ్యమునకు వినియోగ మక్కడ.

అతఁడు పల్నాటిని కన్నులార చూచినాడు. చందవోలు, కొండవీడు పట్టణములలోని నాజూకు జీవితమునకును, నాగరికతకును

---

3. వేమభూపాల చరితములో చందవోలును గురించి చెప్పుచు "కోమటేంద్ర ఇతి రాజనికరావదాతచరిత్రో రాజరాజ ప్రభావో రాజా" అని చెప్పఁబడినది. (చూడు. రెడ్డి సంచిక 1947, పుట 86.)

అక్కడి స్థితిగతులకును పోలిక కనబడలేదు చాటువులను గూర్చినాడు. అచ్చటి చిల్లరరాజుల విషయమును దెలుసుకొన్నాడు. చిల్లర కవులు అతనిని తగరు నగమునువలె ఢీకొని తలలు బొప్పికట్టించుకొన్నారు అచ్చటి పెద్దలు ఆ మహాకవిని పల్నాటి వీరభారతమును వ్రాయమని ప్రార్థించినారు. బాలచంద్రుని యుద్ధఘట్టము బాగున్నదని ఎంచి యతడు పల్నాటి వీరచరిత్రయని పేరుపెట్టి మంజరిలో కూర్చినాడు వేయియామడ వెళ్లియైనను వీరకథను వినవలెనను సామెత పుట్టినది అప్పటి గొల్లవారు (యాదవులు) ఊరుకొనలేదు[4] కాటమరాజు కథను వ్రాయమని కోరినారు. వారి కోరికను తిరస్కరించక వ్రాసినాడు. ఆ రెండు గ్రంథముల పుట్టుకయు 1396 మాత్రమే వారిచ్చిన తృణమో, పణమో మూట కట్టినాడు.

శివరాత్రి మాహాత్మ్యము ప్రతి చంకనే యున్నది. శ్రీశైలమును చేరుకొనుటకు నతడు తొందరపడినాడు. కృష్ణానదిమీద పడవ ప్రయాణము. జొన్నరొట్టెలు దారిబత్తెము. పడవలో పడుటకు ముందుగా 'రసికుడు పోవడు పల్నాడు' అని గొణుగుకొన్నాడు.

శ్రీనాథ మహాకవి వ్రాసిన ప్రబంధములలోని గద్యలిట్లున్నవి—

1. సకలవిద్యానాథ శ్రీనాథభట్టు—శృంగారనైషధము.

2. సకలవిద్యానాథ శ్రీనాథ నామధేయ — శివరాత్రి మాహాత్మ్యము.

3 వినయవిధేయ శ్రీనాథ నామధేయ—హరవిలాసము.

4. సుకవిజనవిధేయ శ్రీనాథ నామధేయ — భీమేశ్వర పురాణము.

5 సుకవిజనవిధేయ, కవిసార్వభౌమ శ్రీనాథ నామధేయ—కాశీఖండము.

అవి ముఖ్యముగా రెండు గుంపు లగుచున్నవి. పాండిత్య ప్రకర్షను జూపునవి శృంగారనైషధ, శివరాత్రి మాహాత్మ్యములు. వినయవిధేయతను గనబఱచునవి రెండవ గుంపు నైషధ రచన తర్వాతిదే శివరాత్రి మాహాత్మ్యము నైషధములో లేని 'సత్కవిసార్వభౌముడ' బిరుదము శివరాత్రి మాహాత్మ్యము అవతారికలో చేరినది ఆ బిరుదును జూచి మనము సిద్ధాంతములను తారుమారు చేసుకొననక్కరలేదు సర్వజ్ఞ బిరుద మెంత సామాన్యమై పోయినదో మన మెఱుగుదుముకదా!

శ్రీనాథ భట్టారకుడు శ్రీశైలమును జేరుకొన్నాడు భిక్షావృత్తుల మఠములో బైరాయించినాడు.

ఆనాడు శ్రీశైలముమీద మల్లికార్జున పట్టణ ముండినది. శ్రీశైలసీమ కది ముఖ్యపట్టణము కాబట్టి అక్కడ పాలకుడును (గవర్నరు), సైన్యము నుండెను పౌరులును, తీర్థయాత్రికులును గలసి కొన్నివేలమంది యుండెడివారు. ఆ వైభవమంతయును తళ్ళికోట యుద్ధముతో గతించినది మరల నిప్పుడు ఇరువదియవ శతాబ్దములో ప్రాచీనవైభవమును గొనితెచ్చెడి ప్రయత్నములు జరుగుచున్నవి.

శ్రీశైలసీమ పాలకునకు వాస్థాన మున్నట్లే, భిక్షావృత్తి మఠమునకుగూడ నుండెడిదని తెలియుచున్నది. మంత్రులు, కార్యనిర్వాహకులు, కవులు, పండితులు మొదలైనవారితో నదొక సంస్థానము. రాజ్యపరిపాలకుడు ఐహికరాజ్యపాలకుడుకాగా, భిక్షావృత్తి ఆధ్యాత్మిక రాజ్యపాలకుడు.

శ్రీనాథ పండిత శిఖామణి భాషణను చూచి యచ్చటి పండితులు దిగ్భ్రమ చెందినారు. శాంతభిక్షావృత్తి తన యాశ్రమ ధర్మముల ననుసరించి వేరుగా కృతిని అంకితము పొందరాదు.

4. శృంగార శ్రీనాథము (వేటూరి ప్రభాకరశాస్త్రి కృతము) 1923, పుట 255.

5. శివరాత్రి మాహాత్మ్యము అవతారిక.

Tel Add 'VANIJYA' Phone Office, 5539 / Resi 3873

Channagiri Suryanarayana, Ghantasala Venkata Satyanarayana & Co.,

Main Bazar, VIJAYAWADA-1.

APGST No 643, CST No 474/30-4 59

చన్నగిరి సూర్యనారాయణ,
ఘంటసాల వెంకట
సత్యనారాయణ అండ్ కంపెనీ,

పంచులు, వురి, వైయర్ రోప్, టర్పాలియన్లు,
లినోలియమ్సు మెన్యూర్స్, మెటెక్ పెయింట్సు &
మెజర్స్ డీలర్స్.

మెయిన్ బజారు, విజయవాడ-1.



అనుక్రమం —శ్రీ సయీద్‌బిన్ మొహమ్మద్.

కొలఁటిపేటి కార్యకర్తయైన పవలపు శాంతయను కృతిని గైకొనుమని ప్రార్థించినాడు. శివరాత్రినాడు శివరాత్రి మాహాత్మ్య పుణ్య కథను వినుట శ్రేయస్కరమని తెలిపి, శ్రీనాథుఁడు తన దస్తరములోని యా పేరుగల గ్రంథమును పైకెత్తినాడు గంభీరముగా పఠించినాడు. పండితులు భేష్, భేష్ అన్నారు. దానినే కృతిగొనుట మేలు అను మాటలు సభలో వినఁబడినవి. అంతట శ్రీనాథుఁడు కృత్యాదిని 'ఉపన్యసించి' నాడు. (ఆ 1 ప 13). అట్లు త్వరత్వరగాఁ జెప్పుటచేతనే కృత్యాది పద్యములలో జిగిబిగులు తగ్గినవి. అంతేకాని శ్రీనాథుఁడు మరణించినపిమ్మట దాని నెవఁడో కవి వ్రాసెను మొదలైన యూహలు అనవసరము.

కృతికిఁ దగిన బహుమానమును కావ్యభర్తయైన శాంతయ్య శ్రీనాథునకు సమర్పించినాడు. అట్లు శివరాత్రి మాహాత్మ్యము 1396 నాటి గ్రంథము.

శ్రీనాథుఁడు స్వస్థలమునకు మొరస రాజ్యము (కర్నూలు జిల్లా ప్రాంతము)మీదుగా బయలుదేరినాడు చాటువులను జెప్పినాడు. నాటఁడారిని వినుకొండ చేరుకొన్నాడు.

వల్లభరాయకవియొక్క తండ్రియైన తిప్పన వినుకొండ దుర్గములో నున్నాడు. అతఁడు రెండవ హరిహరరాయల (1377—1404) రత్నభాండాగారాధిపతి. అతని కుమారుఁడు వల్లభరాయుఁడను యువకుఁడు తండ్రి సంపాదించి పెట్టుచుండగా, కొడుకు పుస్తకములలో మునిగి తేలుచున్నాడు. వల్లభరాయుఁడును, శ్రీనాథుఁడును సమవయస్కులు, విలాసపురుషులు.

శ్రీనాథుని దర్శనము కాగానే వల్లభరాయుఁడు వెతకుచున్న తీగె కాలికి తగినట్లుగా సంతోషించినాడు. తాను అనువదించిన క్రీడాభిరామ ప్రబంధమును శ్రీనాథుని ముందు పడవేసినాడు, దయచేసి చిత్తగించుమన్నాడు. శ్రీనాథుఁడు దానిని తన కవిత్వపు మూసలో పోసినాడు. అది మంచి పాకమునఁ బడినదని వల్లభరాయుఁడు పరమానంద భరితుఁడైనాఁడు. క్రీడాభిరామ కృతి నిర్మాణము 1397 లో జరిగినది.

వల్లభరాయకవి యిచ్చిన బహుమానమును శ్రీనాథుఁడు మూట కట్టుకొన్నాడు. చందవోలు దారిబట్టినాడు. అతఁడు ధనముకంటె కీర్తిధనమును, దేశానుభవము నార్జించుకొన్నాడు. అట్లు పడమటియాత్ర ముగిసినది. ఇంక దక్షిణయాత్ర కావలసి యున్నది.

మారయామాత్యుఁ డింకను జీవించియున్నాడు. డెబ్బది దాటినది. కొడుకునకు ఇరువది యేడేండ్లు. వానికి వివాహమును తలపెట్టినాడు. తెనాలి తాలూకాలోని దగ్గుబల్లిలో పిల్లయున్నదని తెలిసినది. దగ్గుబల్లి తిప్పనార్యుఁడు భార్య పెద్దమ వారి బిడ్డ పన్నెండేండ్లది. వివాహ నిశ్చయము చేసుకొన్నాడు. అట్లు శ్రీనాథుని వివాహము 1397 లో జరిగిన దనవచ్చును. అప్పటికింకను దగ్గుబల్లి దుగ్గన, యనగా, శ్రీనాథుని 'కూరిమి సేయుమ అది' జన్మించలేదు. అతని జన్మ క్రీ శ 1410 కావచ్చును. యజ్ఞకర్తృత్వమునకుఁ దగినట్లుగా శ్రీనాథుఁడు గృహస్థుడైనాడు.

పూర్వము మహాపురుషులును, మహాకవులును యజ్ఞయాగాదులను జేసినారు. శ్రీనాథుఁడు వేదములను బసితనమందే యేకరువెట్టి, మహాపండితుడైన ఫలమేమి? అతని మహాముఖ ప్రజ్ఞను లోకమెఱుఁగునుగాక! యజ్ఞదీక్షను వహించినాడు, నిర్వహించినాడు. అట్లు 1390 లో అధ్వర్యుఁడై సోమయాజియైనాడు.

శ్రీనాథ మహాకవి దక్షిణయాత్రకు తలపెట్టినాడు. అవచి తిప్పయసెట్టి తండ్రియైన దేవయసెట్టి ప్రోలయ వేమారెడ్డి రాజునకు సమకాలికుఁడు.

క. శ్రీ పర్వత సోపాన
స్థాపకుఁడగు రెడ్డి వేమ ధరణీ పతికిన్
బ్రాపైన యవచి దేవయ-

అంటేవాక తిప్పయసెట్టికూడ తండ్రికి సహాయపడుచు, ప్రోలయ వేమారెడ్డికి సమకాలికునిగా నుండెను—

క. శ్రీపర్వత సోపాన
స్థాపన వేమ క్షితీశ సామ్రాజ్య శ్రీ
వ్యాపారి ముఖ్య! యన్వయ
దీపక! యలకాధిరాజ! దేవయతిప్పా!

ప్రోలయ వేమారెడ్డి 1320–1350 ల మధ్య రెడ్డి రాజ్యమునుఁ బాలించినాడు. కావున్ యదే కాలమున వ్యాపారము చేయుచున్న తిప్పయసెట్టి వయస్సు 1350 నాటికి పాతికయైన నుండవలెను కదా! అప్పటికి నతని జన్మ క్రీ శ. 1325 యగును. శ్రీనాథుని తండ్రి జన్మించిన సంవత్సరము కూడ నదే!

కుమారగిరిరెడ్డి వసంతోత్సవ ప్రియుడు. ఆ కార్యమున కవసరమైన పరిమళ పదార్థములను తిప్పయసెట్టి సరఫరా చేసెడివాడు. కుమారగిరిరెడ్డి రాజ్యకాలము 1385 నుండి 1403 వఱకును. సెట్టిగారు ఆ రాజునకేకాక రెండవ హరిహర రాయలు (1377–1404), ఫిరోజిషా (1397–1422), గజపతికికూడ వస్తుసామగ్రిని సరఫరా చేయుచుండెడివాడు. ఆనాడు గజపతి యున్నాడా లేదా అను సందేహము కొందఱకు కల్గు. కాని యది యనవసరము. అనపర్తి శాసనములో (క్రీ. శ .1390)

అతని పేరున్నది. గజపతి (నాల్గవ వీరనరసింహదేవుఁడు) రెడ్డి రాజ్యమువిూదదాడి వెడలి యోడిపోయి కొంతకాలమువఱకు నటు కన్నెత్తి చూడలేదు. హరవిలాసకృతి సమర్పణ మెప్పుడు జరిగినది? రెండవ హరిహరరాయల పరిపాలన 1404 కి ముగిసినది. అంతకు పూర్వమే 1403 లో కుమారగిరిరెడ్డి పరిపాలన తుదముట్టినది. వాటికి పూర్వమే గ్రంథ స్వీకరణ జరిగియుండవలెను. సెట్టిగారికి డెబ్బదియైదు నిండినవి మూడుకాళ్ల ముసలి. ఇతర దగారస్థలములకు ప్రయాణముచేసెడి వయస్సు కాదు. సెట్టిగారికి శ్రీనాథుఁడు 'బాలసఖుఁడు'. శ్రీనాథుఁడు పసితనమందు కుమారగిరిరెడ్డి జరుపుచుండిన వసంతోత్సవములకు కొండవీటికి బోవుచుండెడివాడు. అచ్చట ప్రఖ్యాతి గణించిన సెట్టిగారిని చూచి పలుకరించుచుండెడివాడు అట్లు పరిచయమైనది శ్రీనాథుఁడు 'బాలసఖుఁ'డైనాడు. వారిద్దఱకును మధ్య నలుబదియైదు సంవత్సరముల యెడమున్నది.

సెట్టిగాడు చిన్నతనమును నెల్లూరిలో గడపినాడు. పిమ్మట వ్యాపారకేంద్రముగా కంచిని యేర్పాటు చేసుకొన్నాడు. సెట్టిగారికి ముసలితనము వచ్చుటచేత కొడుకులే వ్యాపారమును జూచుచున్నారు అయన కంచిలో విశ్రాంతిని తీసుకొనుచున్నాడు. శ్రీనాథుఁడా విషయమంతయు దెలుసుకొన్నాడు కంచికి పోవలెను సెట్టిగారిని చూడవలెను. పని పూర్తి చేసుకొని రావలెను

అతఁడు వోటుపల్లికి వెళ్లి సెట్టిగారి యోడ నెక్కినాడు మహాబలిపురము రేవులో దిగి, సెట్టిగారి బండిమీద కంచిని చేరుకొన్నాడు, సెట్టిగారు చాలా సంతోషించినాడు.

శ్రీనాథుఁడు కంచిలోనుండియె హరవిలాస గ్రంథమును మొదలు పెట్టినాడు సెట్టిగారికి నర్థమగునట్లుగా వీరైనంత సులభశైలిలో గ్రంథమును రచించినాడు.

శ్రీనాథుడు వేదములు, ఆగమములు మొదలైనవి పఠించినాడు. అతఁడు 'కవితా మహారాజ్య భద్రాసనారూఢుడు'—అనగా, కవి సార్వభౌముడు. అంతేకాదు. 'అధ్వర్యువని' కూడ సెట్టిగారు పలికినారు.

సీ. కమలనాభుని పౌత్రుఁ, గవితా మహారాజ్య
భద్రాసనారూఢుఁ, బరమపుణ్యు,
....
నఖిల పురాణ విద్యాప్రవీణు,
నధ్వర్యు, వేదశాఖాధీతి, నిష్ణాతు,
నంధ్రభాషా నైషదాబ్జ భవుని,

గీ. ....
బాలసఖు గారవించి

శ్రీనాథుడు అధ్వర్యుఁవు అనగా[7] యజ్ఞకర్త. యజ్ఞయాగాదులను జేసినవాడై శ్రీనాథ సోమయాజి యనిపించుకొన్నాడుకదా!

శ్రీనాథభట్టు నిండుజవ్వనములో శృంగార నైషధమును నాంతరించినాడని యెఱుగుదుము. ఆ గ్రంథప్రశంస హరవిలాసములోని పై పద్యములో చూచినాము. హరవిలాస రచన క్రీ. శ. 1400 అవని తిప్పయ్య వయస్సునుబట్టి చూచినను శ్రీనాథుని జన్మ 1370 అని చెప్పవచ్చును

తిప్పయసెట్టి యిచ్చిన కానుకలను రొంటిని బెట్టుకొని కవిరాజు క్రమముగా చందవోలుకి తిరిగి వచ్చినాడు

శ్రీనాథుడు గోళ్లు గిల్లుకొనుచు కూర్చుండు వ్యక్తి కాదు వల్లభాభ్యుదయ ప్రబంధమును రచించినాడు. అంతకు మించి ఆ పుస్తకమును గుఱించి తెలియదు.

పెదకోమటి వేమారెడ్డికి పిల్ల నిచ్చిన యతఁడు దంతులూరి గన్నభూపాలుఁడు. అతఁడు ధాన్యకటకపురాధీశ్వర బిరుదధారి. అతనిని దర్శించి శ్రీనాథకవి ధనంజయ విజయ ప్రబంధము నంకితము చేసినాడు, ఆ పుస్తకముగూడ లభ్యమగుటలేదు.

మారయామాత్యుని కోరికలలో నొకటి మాత్రమే ఫలించినది కుమారుడు గృహస్థుడైనాడు కాని తండ్రిమాటను వినని పుత్రుఁడు శ్రీనాథుఁడు ఆత్మగౌరవమును చంపుకొనలేడు. 'కున్నపతి స్తోత్రమును' హద్దుమీరి చేయలేడు. మంత్రిత్వము వైపు కన్నెత్తి చూడడు కష్టమైన తెలుగు కవిమార్గమును చేబట్టినాడు. దానిలోనైన నే యాస్థానమునందును ఇప్పటివఱకు కుదురుకొనలేదు సంస్కృత కవిత్వపు ప్రీతి కొండవీటి రెడ్లకున్నది తెలుగు కవిత్వపు మోజు శ్రీనాథునిది. వారిద్దఱకును సమమైన స్థలము కుదురవలెను. అతని ముందుగతి యెట్లున్నదోయని తండ్రియొక్క మనోవ్యథ.


మారయమంత్రికి డెబ్బదియైదేండ్లు నిండినవి. చూపు ఊర్ధ్వలోకమువైపు పరుగిడుచున్నది. అతడు కుమారుని మాపిడి

---

6. ఎస్. ఐ. ఐ. సం. VI నెం. 1 (రెడ్డి నంచిక, పుట 79)

7. యజకర్త యనగానే యజ్ఞము చేయించెడివాఁడెకాని యజ్ఞమును చేయువాడుకాడని భావించ నవసరములేదు. అనంతామాత్యకవి భోజరాజీయ ప్రబంధములోని యవతారికలో తిక్కన సోమయాజిని గుఱించి 'క్షితిన్ గతుకర్త నా వినుతి చేకొని'అని తెలిపినాడు.

8. దంతులూరి బాపిరాజకవియొక్క మూర్తిత్రయోపాఖ్యానములో నున్నది.



మీకు తెలుసా ఎందుకో?

చాలా మంది ఈనాడు ఆర్వోకలర్ ఫిల్ములనే ఉపయోగిస్తున్నారు అది పండుగనాటి సంబరం కానివ్వండి తాజా పువ్వు కానివ్వండి, చక్కని చిరునవ్వు కానివ్వండి అతి సుళువుగా ఆర్వోకలర్ ఫిల్ము అలాంటి మధుర క్షణాన్ని యిట్టే వశపరచుకొంటుంది

ఇంకా అంతే కాదు, ORWO మీకు సకాలానికి ప్రాసెసింగు చేసియిస్తుంది.

డిస్ట్రిబ్యూటర్లు ఆర్వో ఫిల్ముల ఈస్ట్రన్ యూనిట్, మద్రాసు & కలకత్తా.
ఆర్వో ప్రైవేట్ లిమిటెడ్, బొంబాయి & ఢిల్లీ


Manufactured by: VEB FILMFABRIK WOLFEN, THE GERMAN DEMOCRATIC REPUBLIC

NAS b 25cA

కుటుంబము మంత్రుల చేత నెట్టినాడు. 1401 లో శివుని సన్నిధికి వెడలినాడు. తనను పెంచి పెద్దవానినిచేసి, తన సౌఖ్యమే యాతని సౌఖ్యముగా భావించుకొన్న తండ్రి యికలేడు. శ్రీనాథుని దుఃఖమునకు హద్దులేదు దేవుడే దిక్కు.

కొండవీటిలోని రాజకీయ పరిస్థితులు తృప్తికరముగా లేవు. అనవేమారెడ్డి రాజ్యమును దక్షతతో బరిపాలించినాడు. అతఁడు వసంతోత్సవములనుగూడ చేయుచుండెను. అతనికి పిమ్మట వచ్చిన కుమారగిరిరెడ్డి (1385–1403) రాజకార్యములందు నిపుణుడుగాడు. వసంతోత్సవములలో మునిగిపోవు వాడు. అతని అక్కగారి (ఆమె పేరు దొడ్డాంబిక కావచ్చును) భర్త కాటయ వేమారెడ్డి. అతఁడు ఘన సైన్యాధ్యక్షుఁడు. కళింగ ప్రాంతములను సింహాచలము వఱకు జయించి రెడ్డిరాజ్యమునకుఁ గలిపినాడు. అంతే కాని అది అతని సొంతముకాదు. అది కొండవీటి సింహాసనముది స్వాత్తమే. అయితే కాటయవేమునికి కుమారగిరిరెడ్డివిూద పలుకుబడి విశేషముగా నున్నది

పెదకోమటి వేమారెడ్డి చంద్రవోలులో నున్నాడు. అతఁడు మహాశూరుడైనను రాజకీయవేత్త. రాజ్యము యొక్క దక్షిణపు హద్దును గాపాడుచున్నాడు.

కుమారగిరిరెడ్డి యొక్క పుత్రుని పేరు కుమారవీరాన్న పోతరెడ్డి. అతఁడు రాజమహేంద్రవరము ముఖ్యపట్టణముగా కొండవీటి రాజ్యములోని యుత్తరభాగమునకు రాజప్రతినిధిగా నుండెను. అతని మంత్రి, సేనాని అల్లాడరెడ్డి. పాపము! వీరాన్న పోతరెడ్డి క్రీ. శ. 1402 లో ఏదో యుద్ధములో వీరస్వర్గమును చూరగొనెను.

కడుపున బుట్టినవాని మరణముతో కుమారగిరిరెడ్డి క్రుంగిపోయినాడు. రాచకార్యములనుండి విముఖుఁడైనాడు. రాజ్యమునకు వారసుఁడైన పెదకోమటి వేమారెడ్డి రాజ్యపాలనలో జోక్యమును గలిగించుకొన్నాడు. కాని కాటయవేముని మాటలు మాత్రమే కుమారగిరిరెడ్డికి పథ్యము. రాజమహేంద్రవర రాజ్యమును వేఱుచేసి కాటయవేమారెడ్డి తాను పరిపాలింపదలచుకొన్నాడు. అందులకు కుమారగిరిరెడ్డి యంగీకరించినాడు. దానికి కోమటివేముని ఒప్పుదల లేదు. కాని ఏమిచేయగలడు? కొండవీటి రాజ్య మింకను తన చేతిలోకి రాలేదు. కుమారగిరిరెడ్డి 1403 లో శాశ్వతముగాఁ గన్నుమూసినాడు. అంతట కోమటివేముడు కొండవీటి గద్దె నెక్కుటయు, రాజమహేంద్రవర రాజ్యము కాటయవేమునికి దక్కుటయు జరిగినవి. రెండు రాజ్యములకు మధ్య స్పర్ధలు అనివార్యమైనవి. అట్లు రెడ్డి రాజ్యము బలహీనమై నాశనోన్ముఖముగా నడచినది. కొంతకాలమునకు అంతరించక తప్పదు.

పెదకోమటి వేమారెడ్డి కొండవీటి సింహాసన మెక్కెను కదా! అతఁడు మామిడి కుటుంబములోని మంత్రులు కొందఱను కొండవీటికి తీసుకొని వెళ్లినాడు. శ్రీనాథునియొక్క కవిత్వమునకుగాక, పాండిత్యమునకు అతఁడు మురిసిపోయినాడు. ఆ పండితుని సహాయము తనకువాల అవసరము. కావున అతనిని విద్యాధికారిగా నియమించినాడు.

రాచకొండ రాజ్యమును బాలించుచున్న రేచర్ల సింగమనాయనికిని, కోమటి వేమారెడ్డికిని అనేక విధములుగా పోటీగా నున్నది. ఒకరి రాజ్యము నొకరు గెల్చుకొనవలెను. ఆ వైరము ఆ రాజ్యములు పుట్టినప్పటినుండియు నున్నది: నశించునంతవఱకు నుండును. సింగన సర్వజ్ఞ బిరుదాంచితుఁడు, పండితుఁడు. కొండవీటి పాలకుడైన పెదకోమటి రెడ్డికూడ[9] సర్వజ్ఞుఁడు కావలెను, సంస్కృత గ్రంథములను రచింపవలెను. కాబట్టి యట్టి యుద్యమములో మహాపండితుఁడైన శ్రీనాథుని తోడ్పాటు పూర్తిగా నవసరము. సింగమనాయఁడు తెలుగునంతగా నాదరించినట్లు తోచదు. కాబట్టి తానుకూడ దాని విషయమై శ్రద్ధవహింప నవసరము లేదు.

శ్రీనాథ సోమయాజి విద్యాధికారియైనాడు కదా! అతని విధులు—పండితులను పరీక్షించుట, శాసన కావ్యములను వ్రాయుట, రెడ్డిరాజునకు పురాణాదులను చదివి చెప్పుట, అతఁడు రచింపదలచు కొన్న గ్రంథావళిలో సాయము చేయుట.

కొండవీటిలో కవుల హడావుడి విస్తారముగా నున్నది. అది హద్దుల నెఱుగకపోవుటచేత 'కొండవీటిలో గాడిద! నీవును కవివి గావుకదా యనుమాన మయ్యెడిన్' అని సంబోధింపవలసి వచ్చుచున్నది,

పెదకోమటి వేముఁడు కుటుంబముతోఁగూడ [10]కాశీయాత్రను 1408 లో చేసినాడు. శ్రీనాథ మహాకవికూడ తోడుగా వెళ్ళినాడవచ్చును.

శ్రీనాథ మహాకవి యదివఱకే అఖిలాంధ్ర దిగ్విజయమును దలపెట్టినాడు. కాని సాగలేదు. దానికి పరిస్థితు లిప్పుడు అనుకూలముగా నున్నవి. అతని యాలోచనను దెలుసుకొన్న పెదకోమటి వేముడు, శ్రీనాథుని జయముచేత తన గౌరవ మినుమడించునని

---

9. పెదకోమటి వేముడు క్రమముగా సర్వజ్ఞ బిరుదును ధరించినాడు. క్రీ. శ. 1413 ఆఁపాటి శాసనములో 'సర్వజ్ఞ చక్రవర్తి! పెదకోమటి వేమభూపతి ర్జయతి' యని యున్నది.

10. క్రీ. శ. 1400 ఫిరంగిపుర శాసనమునుండి వారి యాత్ర యూహింపబడుచున్నది.

యోగినదై దానిని ప్రోత్సహించినాడు. మంచి ముహూర్తమున శ్రీనాథుడు కొండవీటినుండి త్రోవ నెక్కినాడు. అతఁడు తుంగభద్రనుదాటి ప్రయాణించి, హంపి విజయనగరమును చేరుకొన్నాడు

ఆ నాటి రాజు[11] ప్రౌఢ దేవరాయలు. అతఁడే మొదటి దేవరాయలు (క్రీ. శ 1406-1422). అతని దర్శనము కోసము శ్రీనాథుడు వేచియున్నాడు. సాటి కవియైన ముమ్మకవిని ప్రార్థించి, 'సర్వజ్ఞ సార్వభౌముఁడ'నని బోధపరిచినాడు ఎట్టకేలకు రాజదర్శనమైనది అప్పట ఆ స్థానములోనున్న అరుణగిరినాథ డిండిమ భట్టారకుడుకూడ కవి సార్వభౌముఁడే ఇద్దరు కవిసార్వభౌములకును వాగ్యుద్ధము తప్పదు దానికి మధ్యవర్తి దేవరాయలకు గురువైన చంద్రభూషణ క్రియాశక్తి రాయలు[12] ఆ రాయల శాసనము క్రీ. శ 1400-1414 వరకును మాత్రమే గనబడుచున్నవి కాబట్టి కవిసార్వభౌముల ద్వంద్వయుద్ధము ఆ మధ్యకాలములో జరిగినదని నిశ్చయమగుచున్నది కదా! అంతేకాని అది రెండవ దేవరాయల (1423-1446) నాటిదికాదు

ఆ యుద్ధములో అపరసరస్వతియైన శ్రీనాథ మహాకవి జయించినాడు. డిండిమభట్టుయొక్క ప్రతాపమును ప్రకటించుచున్న కంచుఢక్క ముక్కలు చెక్కలయినది శ్రీనాథునకు కవిసార్వభౌమ పదము క్రొత్తగా రాలేదు అదివఱకున్నదానిని 'పాదుకొల్పినాఁడ'—అనగా, దిట్టపఱచుకొన్నాడు. తనకు కనకాభిషేకము చేయుమని దేవరాయలను గోరినాడు ఆ సన్మానమును పొంది దేవరాయలు జీవితమును ధన్యము చేసుకొన్నాడు అదంతయు క్రీ శ 1410 లో జరిగినది దేవరాయ లిచ్చిన రత్నములను, దివ్యాంబరములను కవిరాజురాజా మూట గట్టుకొన్నాడు. రాచకొండ వైపు ప్రయాణము సాగించినాడు.

రాచకొండ ప్రభువు రేచెర్ల సింగమనాయఁడు (1345-1412) ముసలితనములో నున్నాడు వట్టిదాంభికముగాక నిజముగా పండితుఁడు. సర్వజ్ఞబిరుదధారి. అతనికి సర్వజ్ఞ బిరుదున్నదా లేదా అని సందేహింప నవసరములేదు[13] వెలుగోటివారి వంశావళిలో అతని మొదటి సర్వజ్ఞుడని, అతని తర్వాత వచ్చిన సింగమనాయనిని రెండవ సర్వజ్ఞుఁడనియు స్పష్టముగాఁ జెప్పబడినది.

అతని యాస్థానములోనున్న సంస్కృత కవిపేరు[14] విశ్వేశ్వరుడు. ముమ్మకవివలె విశ్వేశ్వరకవి రాజదర్శనము చేయించుటలో బాధ్యతవహించెను. శ్రీనాథుఁడు సర్వజ్ఞ సింగనను మెప్పించినాడు. బహుమానము లందుకొన్నాడు. 1410 లో తిరిగి కొండవీటిని చేరుకొన్నాడు.

అతఁడు కొండవీటికి చేరుకొనునప్పటికి స్తోత్రపాఠకులు ఆ రెడ్డిరాజునకిచ్చిన యొక ధర్మసూక్ష్మమును (లాపాయింటు) లేవదీసిరి. ఒక్క కొండవీటి ప్రభువే సర్వజ్ఞబిరుదమునకుఁ దగినవాడు. అట్లయియుండగా శ్రీనాథుఁడు సింగమనాయనిని సర్వజ్ఞుడని యెట్లు చెప్ప సాహసించినాడు? రాజమార్గములేకాక దొడ్డిదోవలనుగూడ చక్కగా నెఱిగిన శ్రీనాథుడు—

క. సర్వజ్ఞ నామధేయము
శర్వునకే, రావుసింగ జనపాలునకే
యుర్విం జెల్లును, దక్కొరు
సర్వజ్ఞుండనుట కుక్క సామజ మనుటే!

అను పద్యమునకు అర్థము - శర్వుడొక్కడే సర్వజ్ఞ నామమునకు దగినవాడని పైకి తోచినది. స్తోత్రపాఠకులు మెచ్చుకొన్నారు అంతేకాని సింగమనాయనిని గూడ అందులో చేర్చి యున్నదను విషయము వారు గ్రహింపలేదు ముఖస్తుతి పాఠకుల నుండి బుజామార్గ వర్తనమువలన బాధలు తప్పవుకదా!

విభజనానంతరము రెడ్డిరాజ్యము బలహీనమై పోయినది దానికితోడు రెడ్డిరాజులు బహమనీ సుల్తానుల సహాయమును గోరుచుండిరి కాబట్టి విజయనగర రాజులు క్రమముగా రెడ్డిరాజ్యముయొక్క పడమటి, దక్షిణపు టంచులను ఆక్రమించుకొనిరి. అట్లు తెలుగు రాయడు, మైలారురెడ్డియొక్క సంస్థానములు విజయనగర రాజ్యములో కలిసిపోయినవి పైనఁ జెప్పబడిన రెండు సంస్థానాధిపతులును శ్రీనాథునకు మొదటినుండియు తెలిసినవారె రాచకొండ వెలమలకు బహమని సుల్తానులు శత్రువులు అట్టివారితో రెడ్లు చేరుచుండుటచేత, రెడ్డిరాజ్యము మీదికి వెలమల దాడులు ముమ్మరమైనవి దేశములో నశాంతి చెలరేగినది కాని పెదకోమటి వేమారెడ్డి కార్యశూరుఁడు గాన పరిస్థితులకు సులభముగా లొంగిపోలేదు

రేచర్ల వెలమ కుటుంబములోని పెన వేదగిరి నాయని తమ్ముఁడైన లింగమనేడు పన్నెండేండ్ల బాలుడు మాత్రమె అతనిది

---

11. మొదటి దేవరాయలకు ప్రౌఢ, వీర, ప్రతాప శబ్దము లుపయోగించిన శాసనము లున్నవి—నెల్లూరి శా. సం. పుట 12 ఆ. 8 1926 నెం 399 (ఆంధ్ర కవితరంగిణి సం 5 పుట 147.)

12. నేలటూరి వెంకటరమణయ్యగారి వ్యాసము, భారతి అక్టోబరు 1955 (సమగ్రాంధ్రసాహిత్యము సం 4 పుట 193).

13. శృంగార శ్రీనాథము, పుట 209

14 శ్రీనాథుని ఆస్థానములో పేర్కొన్న విశ్వేశ్వరుఁ డితడేనా? (ఆంధ్రకవితరంగిణి సం 5 పుట 30)

దేవరకొండ సంస్థానము. అతఁడు పెద్దసైన్యముతో 1420 లోఁ పెదకోమటి వేముని మీదకు దండెత్తి, అతనిని తుదముట్టించి, పందికంత పోతరాజు అను పేరుగల ఖడ్గమును గొనిపోయినాడు. ఆ దాడిని కొందఱు చరిత్రకారులు నమ్ముటలేదు. బాలుడెట్లు సైన్యము నడిపించినాడని వారి సందేహము. మన దేశచరిత్రను, సంస్కృతిచరిత్రను క్షుణ్ణముగా నెఱిగినచో నట్టి సందేహము కలుగదు. బాలుఁడట్లు శత్రురాజులను గెల్చుట సర్వసామాన్యము కాదను విషయమును నొక్కి చెప్పనవసరములేదు. కాని మన దేశ చరిత్ర పుట్టినప్పటినుండియు రాజకుమారుల యాదర్శము, పసితనమున ఘనకార్యముల చేయవలెననునదియే. దానికి మూల మేమనగా—పన్నెండేండ్ల బాలుడైన కుమారస్వామి తారకాసురుని సంహరించి దేశమును రక్షించినాడు అదియె ఆనాటికిని నేటికిని బాలరాజుల కాదర్శమైనది అట్టి ఘటనలు తూర్పు, పడమటి చాళుక్య వంశములలోనేకాక అన్నిరాజవంశములలో నక్కృత్తుగా గనఁబడుచున్నవి. మన జానపదకథల నిండ నట్టి వీరులు కోకొల్లలుగా నున్నారు. వారి పేర్లు సాధారణముగా బాల, కుమార ఇత్యాది పదములతో ప్రారంభించును బాలవద్దిరాజు, బాలచంద్రుఁడు, కుమారరాముఁడు మొదలైనవి ఇంతకును మహాసైన్య మొనర్చిన దియమే మహాసాహసియగు నా బాలునికి నారోపింపఁబడుచున్నది.

పై యుద్ధకాలమునకు పెదకోమటివేమునికి డెబ్బది యేండ్లుండును. పన్నెండేండ్ల లింగమనీడు అతని మనుమని వయస్సు వాడనదగును అంగరి నమకారిత యట్టిది మాత్రమే యని గ్రహింపవచ్చును.

పెదకోమటివేముని మరణానంతర మాతని కుమారుడైన రాచవేమారెడ్డి రాజ్యమునకు వచ్చినాడు పందికత పోతరాజు ఖడ్గమును నష్టపోవుట రెడ్డి కుటుంబమున కొక పెద్దయవమానము గాను, కీడుగాను భావింపఁబడినది కాఁబట్టి వారు దానిని తిరిగి సంపాదింపదలచుకొన్నారు. యుద్ధముచేయుట మార్గము కాదు శ్రీనాథ సోమయాజిని నియోగింపఁ దలచిరి శ్రీనాథుఁడు ఎదురు చూడనట్టి పని తగిలినది అతఁడు దేవరకొండకు 1421 లో ప్రయాణము కట్టినాడు, చేరినాడు ఆస్థానమందలి సంరంభము మన మెఱుగము. వీరులతో శౌరిత్వము, కవులలో సరసత్వము నెఱిగిన వెలమ ప్రభువులు శ్రీనాథుని కోర్కెను మన్నించి, ఖడ్గమును తిరిగి యిచ్చివేసినారు రాచవేముఁడు చాల సంతోషపడినాడు. కాని యాతని పరిపాలన విజయవంతముగా లేదు. 1423 లో హత్యగావించఁబడినాడు. కొండవీటిరాజ్యమును విజయనగరాధిపతులు ఆక్రమించుకొన్నారు. 1424 లో పిల్లలమఱ్ఱి గన్న సైన్యాధ్యక్షుని కొండవీటి పాలకునిగా నియమించిరని చెప్పవచ్చును. అతఁ డంతకుముందు ఉదయగిరి దురాధిపతిగా నుండెనేమో! అతని కుమారుఁడే విస్సనమంత్రి విస్సన్న కవి పండిత పక్షపాతి.

అతఁడు శ్రీనాథునికి కవితావు బంధువు తన లాసిన దశయుఁడు శ్రీనాథుఁడు తలపెట్టిన విస్సనమంత్రి యతఁడె.

> స్వర్గస్థుఁడయ్యె విస్సన మంత్రి మఱి హేమ
> పాత్రాన్న మెవ్వని పంక్తిఁ గలదు?

విస్సన్న మంత్రిని గుఱించి యధిక చర్చ చేయుటకిది తావుకాదు.

చిన్నప్రభువుల యాదరణ తాత్కాలికము మాత్రమె. శ్రీనాథుఁడు మరల నేదో పెద్ద కొలువులో చేరవలెను. పిలువనిదె యతఁడు దూరస్థలములకుఁ బోవడు. ఆస్థానముల నాశ్రయించుకొన్నవారు పలువు రుందురు క్రొత్తవారిని చేరనీయరు. పచ్చగానున్న రాజమహేంద్రవర రెడ్డి రాజ్యమె తనకు రక్షణ. కాని కొండవీటి ప్రభువులను ఆశ్రయించుకొన్న శ్రీనాథుని వారు అంత త్వరగా తమ కొలువులోనికి తీసుకొనరు. సీమల నెఱుగని కవిత్వ సామ్రాజ్యము శ్రీనాథునిది. కాబట్టి కొంత యాలస్యమైనను రాజమహేంద్రవరపు కొలువును సాధింపవచ్చును అచ్చటి మంత్రి మండలితో మంతనములను జరిపి, రెడ్లయెదుట పడవలసి యున్నది.

శ్రీనాథునికి యేబదియైదు దాటినది దూరస్థలములకుఁబో నిచ్చగింపడు. దూరప్రయాణమును శరీరము ఓర్చుకొనలేదు. నపదాకు కావ్యములను వ్రాసెడి కాలము గతించినది ఇప్పుడు స్థిరమైన జీవనము ప్రధానము. అట్టిది యేర్పడు వఱకును గంటమునకు విశ్రాంతి. కాలక్షేపమునకుగాను పరిసరములలో నున్న తెలుగు రాయడు మైలారు రెడ్డి వంటివారిని దర్శించుచున్నాడు. వారియునికి యెట్టిది?

రెండవ ప్రతాపరుద్రుని కాలములో కాకతీయ రాజ్యమును డెబ్బది యిద్దఱు నాయకులు పాలించుచుండిరి. వారిలో[15] అభంగ రాయ రాహుత్తుఁడను వాడొకడున్నాడు అతని వంశము వారె కాబోలు నెల్లూరుజిల్లా పాదిలిసీమ, కర్నూలుజిల్లాలోని కొంత భాగమును కరారి సాళువయను వంశ నామములోను, రాయ రాహుత్తుఁడను బిరుదుతోను పాలించుచున్నారు. శంబువరాయ అను వాని శాసన మొకటి క్రీ. శ. 1426 నాటిది యున్నది. అతఁడే పద్యములలో సాంపరాయలని పిలువబడుచున్నాఁడనవచ్చును. అతని కుమారులలో నొకని పేరు తెలుగురాయఁడు. వాని శాసనము 1428 నాటిది సింహాచలముమీద నున్నది. అతఁడప్పుడు సింహాచలమునకు యుద్ధయాత్రమీద నెట్లు పోయియుండును? రాజమహేంద్రవర రెడ్లు భాస్కరునివలె ప్రకాశించుచుండిరి. కాఁబట్టి యతఁడు తీర్థయాత్రకు

---

15 రెడ్డి సంచికలోని జాబితా, పుట 6.

బోయియుండును. అతని శాసనములు మఱికొన్ని యున్నవి. అతని [16]కుమారునియొక్క శాసనమునుబట్టి యతని (తెలుగు రాయల) మరణము క్రీ. శ 1442 అని భావింపఁబడు చున్నది. శ్రీనాథుఁడు అవసానదశలో చెప్పిన—

రంభ గూడె దెనుంగు రాయరాహుత్తుండు
కస్తూరి కేరాజు ప్రస్తుతింతు?

చరణమునుబట్టి తెలుగురాయఁడేదో యుద్ధములో మరణించె ననవచ్చును అది గజపతులతో జరిగిన యుద్ధముగావచ్చును.

నెల్లూరిజిల్లాలో [17]పెదడిపాడు ముఖ్యపట్టణముగా మైలారు రెడ్డి పాలించుచుండినట్లు క్రీ శ 1424, 1429 నాటి శాసనములనుండి విదితమగుచున్నది. శ్రీనాథుని కడపటి ఘడియల లోని పద్యములో—

కైలాసగిరి బండె మైలారువిభుఁ డేగి
దినవెచ్చ మేరాజు దీర్చుచుండు?

అను వాక్యమునుబట్టి మైలారురెడ్డికూడ స్వర్గస్థుడైనాడు కాలము సరిగా తెలియదు.

రాజమహేంద్రవర రాజ్యమును బాలించుచుండిన కాటయ వేముని కుమారుఁడైన కొమరగిరిరెడ్డి 1406 లోనే దేహ మును త్యజించినాడు. తండ్రియైన కాటయవేముఁడు ముసలివాడై 1415 లో కీర్తిశేషుడైనాడు అతని వియ్యంకుడు అనగా, కూతురికి మామగారైన లల్లాడరెడ్డి 1416–నుండి 1426 వఱకును రాజ్యము చేసినాడు. పిమ్మట కాటయవేముని యల్లుఁడును, అనితల్లి భర్తయునైన వీరభద్రారెడ్డి తన సోదరులతోఁగూడి పరిపాలనభారమును వహించినాడు. అతని మంత్రులు బెండపూడి కుటుంబమువారు. వారు శ్రీనాథునికి వెనుకటినుండియు పరిచితులే.

శ్రీనాథభట్టుకు ఆశాభంగ మైనది. అతఁడు రాజమహేంద్ర వరమును 1428 లో చేరుకొన్నాడు బెండపూడి మంత్రుల పరిచయమును దిరుగవేసి, రెడ్డిరాజుల దర్శనమును జేసుకొన్నాడు. అంతయు లాంఛనప్రాయముగా జరిగినది మనస్సులోని గాయ ములు క్రమముగా మానును.

కొండవీటిలోవలెనె రాజమహేంద్రవరములోఁగూడ టుంవిూ రవుల సంరంభము జాస్తి. ఎక్కడనైనవారు అంతే!

శ్రీనాథుఁడు ఆ రెడ్డి సంస్థానములో విద్యాధికారిగాగాని, శాసనకర్తగాగాని లేడు. కేవలము ఆస్థానకవి.

శ్రీనాథుని తాతవలెనే బెండపూడి అన్నయమంత్రి తాత కూడ రెండవ ప్రతాపరుద్రుని కొలువులో మద్యోగి–గజ సైన్యా ధ్యక్షుఁడు. కాబట్టి అన్నయమంత్రికూడ శ్రీనాథుని వయస్సు వాడైయుండును.

శ్రీనాథ సోమయాజి బెండపూడి అన్నయమంత్రికి భీమేశ్వర పురాణ ప్రబంధమును సమర్పింపదలుచుకొన్నాడు. ఆ గ్రంథము యొక్క యవతారికలో అన్నయమంత్రి 1428 లో ద్రాక్షారామా లయములో గట్టించిన మండపము ప్రశంస యున్నది. ఇంకను దానిలో అహమ్మదుషా వల్లియను బహమనిసుల్తాను అహమ్మద్‌సేన్ అను పేరున పేర్కొనఁబడినాడు అతఁడు 1422 నుండి 1435 వఱకును రాజ్యము చేసినవాడు. కాఁబట్టి భీమేశ్వర పురాణము 1428–35 మధ్యకాలమున 1430 లో రచింపఁబడియుండును. శ్రీనాథుని స్వగ్రామము భీమమండలిలోని సిలంపల్లికదా! కాబట్టి యా గ్రంథములో స్థానిక చరిత్ర, స్థానిక భూగోళము విశేషముగా వగఁబడుచున్నది.

శ్రీనాథ మహాకవి పూర్వమొకసారి పెదకోమటి వేమునితో కాశీయాత్రచేసి యుండవచ్చుననుకొంటిమి. రాజమహేంద్రవర రెడ్డి రాజైన అల్లయ వేమారెడ్డి 'కాశీ శ్రీగిరి పంచారామా దుల ..శాసనాక్షర పంక్తుల్' వ్రాయించెనని చెప్పుటచేత, అతఁడు కాశీవెళ్లినప్పుడు శ్రీనాథుఁడుకూడ అనుసరించెనేమో!

వీరభద్రారెడ్డి శ్రీనాథ భట్టారకునినుండి కాశీఖండ ప్రబం ధమును స్వీకరింపఁ గోరినాడు ఆ గ్రంథము అవతారికలో ఆ మహాకవి వీరభద్రారెడ్డియొక్క ముగ్గురి సోదరులనుగూడ స్తుతించినాడు. వారిలో కడగొట్టువాడైన అన్నయరెడ్డి 1434 కి మరణించి యుండుటచేత కాశీఖండ రచన 1433 అని చెప్పవచ్చును.

రెడ్డి రాజ్యము ఒరిస్సాలోని చిలుక సరస్సువఱకును వ్యాపించినది కాని వృద్ధికి వచ్చుటలేదు చుట్టును ప్రబల శత్రువులు చేరినారు గజపతులు సరేసరి! మన్నెపురాజైన చోడ భక్తీశ్వరుని యన్నయ వేముఁడును, వాని కుమారుఁడు వీరభద్రుఁడును ప్రక్కలో బల్లెమైరి. రెడ్డిరాజ్యమును గజ పతులు గబళించుటకు విజయనగరాధిపులు ఒప్పకొనలేదు. అల్ల కల్లోలము తప్పనిసరి

వీరభద్రారెడ్డియొక్క శాసనములు క్రీ. శ. 1438 దాటి కనఁబడుటలేదు. అతని రాజ్యము 1438 నాటికి ధ్వంసమై యుండును అది గజపతుల పనే కావచ్చును వారు 1443 లో [18] రాజమహేంద్రవర పాలకులుగా నున్నారు విజయనగిరరాజులు డపి

16 ఆంధ్రకవితరంగిణి సం. 5 పుట 201—203.

17 ఆంధ్రకవితరంగిణి సం 5 పుట 199

18 విజ్ఞానసర్వస్వము (తెలుగుభాషా సమితి) సం. 3 పుట 366.

చే[19] 1444 లో మల్లభూపాలుని రాజమహేంద్రవర పురాధీశునిగా నియమించిరి[20] 1446 లో గజపతులు రాజమహేంద్రవరమునేకాక కర్ణాటకములోని కొంత ప్రదేశమును గూడ న్నాక్రమించుకొనిరి అట్లు రెడ్డిరాజ్యము పూర్తిగా పోయినది

శ్రీనాథుని గతి తెలుసుకొందాము రాజమహేంద్రవరములోని యలజడి చూచి యతడు ఆ పట్టణమును విడిచినాడు. పిలంపల్లికి పోలేము, తన వాసము అది దగ్గుబల్లిలో నున్నాడు కదా. తన భార్య పలహామీద నరుడు దుగ్గనవద్దకు బోయి యుండును. అయితే యొకరి చేతిక్రిందనుండు నలవాటు లేదు అతడు దగ్గుబల్లికి సమీపములో నున్నదని చెప్పదగిన బొడ్డుపల్లిలో బాపన వ్యవసాయము పెట్టినాడు ఆనాడు కృష్ణ నదికి పోతగట్లులేదు. కాబట్టి వెల్లువలు పరిసరప్రదేశములను ముంచివేయుచుండును అతడు కృషీవలుడైనది 1440 ఆవచ్చును

శ్రీనాథుడు పూర్తిగా ముసలివాడైనాడు కాయకష్టమును చేయలేడు గ్రంథ రచన కావలసినవారు కొనబడరు. అతని జీవితములోని యాఖరు సంవత్సరమేదో తెలుసుకొనెదము.

ఆ మహాకవి ఇహలోకమును వీడిపోవుటకు ముందుగా జెప్పిన సీసపద్యములో ఐదుగురి పేర్లను స్మరించినాడు. వారు వీరభద్రారెడ్డి, తెలుగురాయుడు, సిస్నమంత్రి, మైలారురెడ్డి భాస్కరుడు. వీరందరును గతించిన పిమ్మటనే యీతడు గతించినాడు వీరభద్రారెడ్డి 1338 కి శిష్యాలో యెక్కడమేను. తెలుగురాయని శాసనములు[21] 1442 దాక కనబడుచున్నవి. అంతకుముందె మరణించియుండును సిస్నమంత్రి భాస్కరుల శాసనములు లేవు మైలారురెడ్డి శాసనము 1429 తర్వాత లభించుట లేదు పై వారిలో దీర్ఘకాలమున్నవాడు తెలుగురాయడు మాత్రమె 1440 నుండి తూర్పు తీరమునందల్లకల్లోలము ముమ్మరముగా నున్నది.

శ్రీనాథుని వ్యవసాయము వృద్ధికి రాలేదు కట్టవలసిన జామీనన్నును కట్టలేక పోయినాడు. రాజకీయోద్యోగులు నానా బాధలను బెట్టినారు అతడు 1445 లో ఐహిక రాజ్యమును విడిచి స్వర్గరాజ్యములో శాంతిని బొందినాడు రెడ్డి రాజ్యమునకు వచ్చిన ఒడుదుడుకులే అతని జీవితమునకుగూడ వచ్చినవి ఆంధ్ర వాఙ్మయ మున్నంతకాలము అతని కీర్తి శరీరము మాత్రము జీవించియుండును

---

19 దాక్షారామ శాసనములు (ఆంధ్రకవితరంగిణి సం 5 పుట 102)

20 దాక్షారామ శాసనములు (ఆంధ్రకవితరంగిణి సం. 5 పుట 102)

21. ఎ. ఆర్. 473-1915.

Edited, Printed and Published by S. Radhakrishna at the Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Chief Editor, S Sambhu Prasad.

శ్రీరస్తు - శ్రీ త్రిపురసుందరీ పరశివాభ్యాం నమః

శ్రీ కీలక సంవత్సర పూర్ణశాస్త్రీయ (ఆంధ్రపత్రికా) పంచాంగమ్

బ్రహ్మశ్రీ శ్రీమత్పిడపర్తి చినపూర్ణాచార్యసిద్ధాన్తినః ద్వితీయ పుత్రేణ సుబ్రహ్మణ్యశాస్త్రిణా ప్రణీతమ్

సహకారయుతాభ్యాం, తత్తనయాభ్యాం చినకృష్ణమూర్తిశాస్త్రి, సుబ్రహ్మణ్యశాస్త్రిభ్యాం చ

విఘ్నేశ విధిమార్తండ చంద్రేంద్రోపేంద్ర వందిత। నమో గణపతే తుభ్యం బ్రహ్మణాం బ్రహ్మణస్పతే.

వేదమయీం నాదమయీం పరపదోద్యద్బిందుమయీం

మంత్రమయీం తంత్రమయీం ప్రకృతిమయీం నౌమి విశ్వవికృతిమయీం.

గమనిక

ఈ సంవత్సరమున రాజు శుక్రుడు మంత్రి శని సర్వోత్తమము దాయా... నమకలో ... ఫలింపను శ్రీకృష్ణుడు పరిపాలకుడు దక్షిణదేశమున యమునా ద్వారండి బయటకు తోలువాడు శ్రీకృష్ణుడు కావున మధ్యమధ్య వ్యాధులు సంభవించ నను నివారణ... పశువృద్ధి భూవృద్ధి క్షీరవృద్ధి కలుగును నాలుగు కుంభములు వర్షము దివార్ధ భాద్రపద బ ౩౦ శ, ఆదివారం మాడపాటి నాయక గ్రస్తాస్తమయార్ధనిక గ్రహ సూర్యగ్రహణం ఆశ్వయుజ ... ఆదివారమున మధ్యాహ్నోదయ కృష్ణపక్ష చంద్రగ్రహణం (12–10–1968) తా। కృష్ణానది పుష్కర ప్రవేశము రాష్ట్రపు సామ్య సం॥రము. ... మాస ... గును

మౌఢ్యములు

వైశాఖ శుద్ధ ... (17 మేయి 1968) మొదలుకొని ఆషాఢ ... (17 జూలై 1968) వరకు శుక్రమౌఢ్యము శ్రావణ బ ౩౦ బుధ (23 ఆగష్టు 1968) మొదలుకొని ఆశ్వయుజ శు ... (23 సెప్టెంబరు 1968) వరకు గురుమౌఢ్యము ... ఆశ్వయుజ బ ... శనివారం (12–10–1968) వరకు సింహ గురు ... లోపల ముహూర్తములకు వివాహ ... గ్రహించవలెను

కల్యాద్యబ్దాః	౫౦౭౦
శాలివాహనశకః	౧౮౯౦
ఫసలీ	౧౩౭౭,౭౮
హిజిరీ	౧౩౮౭,౮౮
క్రీస్తుశకము	1968-69
భారత స్వాతంత్ర్యశకము	19 -20

ఆంధ్రపత్రికా కార్యాలయము, మద్రాసు-1.

పంచాంగ పద్ధతి వివరణము

ఇందు కాలమానము యథాప్రకారముగ విజయవాడ, గుంటూరు, ఏలూరు మొదలగు ఆంధ్ర ప్రదేశ మధ్యభాగమునకు చూపబడినవి. తిథి, నక్షత్రములు ఘటికలను, గంటలలోను కూడ చూపబడినవి. శుభ ముహూర్తములు—దుర్ముహూర్తములు—వర్జ్యములు—మహాపాతములు గంటలలో మాత్రం చూపబడినవి. యోగ కరణ, అమృత, గ్రహ ప్రవేశములు ఘటికలలో మాత్రం చూపబడినవి. భారత ప్రభుత్వముచే నియమింపబడిన కాలెండరు రిఫారం కమిటీవారి నిర్ణయము ననుసరించి ప్రకటింపబడిన ఇండియన్ ఎఫెమెరిస్ అండ్ నాటికల్ అల్మనాక్కునందు ననుసరించి చూపబడిన ... యందు కనుగొనబడిన భూకేంద్రమునందు సాయన ... రవి మొదలగువారి సాధింపబడిన ... గ్రహసంచారము ఇందు ప్రధానముగ చూపబడినవి. ఈ విధముగ గ్రహ సంచారములతో సంబంధించిన ... వ్యయమున ... కొనుటకు ... గుర్తింప గణితమునకు పూర్వపద్ధతి పంచాంగముకూడ ఇందు సంగ్రహముగా చూపబడినది. ఇందు చూపబడిన పూర్ణ శాస్త్రీయ పద్ధతినే శాస్త్రీయమని గ్రహింపవలెనని మా నిశ్చితాభిప్రాయము. ఇందు తిథ్యాది, ఘటికలు, ... ముహూర్తములు, విజయవాడ, గుంటూరు, ఏలూరు ప్రాంతములకు చూపబడినవి. ... అక్షాంశముల నిరయణ గ్రహస్ఫుటములను చూపబడినవి. దేశాంతర ... ములను చూపబడినవి. ఇందు వేదాంగ జ్యోతిషమున సూచింపబడిన ... గ్రహించి ఈ పంచాంగ రచన చేయుచున్నాము—కావున వైదికము సనాతనముగూడ యగుచున్నది. 10 అక్షాంశ మొదలుకొని 30 అక్షాంశ వరకు ... ప్రమాణములు ... శాస్త్రమునకు ప్రత్యక్షమునకు ... ఈ పంచాంగమును గ్రహించి శ్రౌత స్మార్త కర్మలు ఆచరింప గోరుచున్నాము

మధ్యాహ్నమునందు దేశాంతర చక్రము

	చైత్ర మేష	వైశాఖ వృషభ	జ్యేష్ఠ మిథున	ఆషాఢ కర్కాటక	శ్రావణ సింహ	భాద్ర కన్యా	ఆశ్వీన తులా	కార్తిక వృశ్చిక	అగ్రహా ధను	పౌష మకర	మాఘ కుంభ	ఫాల్గుణ మీన
మైసూరు	—	—౪౯	—౫౬	—౫౯	—౫౬	—౪౯	—౩౯	—౩౦	—౨౩	—౨౦	—౨౩	—౩౦
బెంగుళూరు	— ౦	—౩౭	—౪౪	—౪౮	—౪౪	—౩౭	—౩౦	—౨౬	—౧౬	—౧౪	—౧౬	—౨౬
అనంతపురం	—౩౦	—౩౪	—౩౮	—౩౯	—౩౮	—౩౪	—౩౦	—౨౬	—౨౩	—౨౧	—౨౩	—౨౬
బళ్లారి	—౩౮	—౪౦	—౪౩	—౪౪	—౪౩	—౪౦	—౩౮	—౩౪	—౩౨	—౩౧	—౩౨	—౩౪
కర్నూలు	—౨౬	—౨౮	—౨౭	—౨౯	—౨౭	—౨౮	౨౬	—౨౪	—౨౩	—౨౨	—౨౩	—౨౪
హైదరాబాదు	—౨౧	—౨౦	—౧౭	—౧౭	—౧౭	—౨౦	౨౧	—౨౩	—౨౫	—౨౫	—౨౫	—౨౩
వరంగల్లు	—౧౦	— ౮	— ౪	— ౩	— ౪	— ౮	—౧౦	—౧౩	—౧౬	—౧౮	—౧౬	—౧౩
తిరుపతి	—౧౩	—౧౯	—౨౪	—౨౮	—౨౪	—౧౯	—౧౩	— ౮	— ౨	+ ౦	— ౨	— ౮
నెల్లూరు	— ౬	—౧౧	—౧౪	—౧౬	—౧౪	—౧౧	— ౬	— ౨	+ ౨	+ ౪	+ ౨	— ౨
కుంభకోణం	—౧౨	—౨౪	—౩౪	—౩౭	—౩౪	—౨౪	—౧౨	— ౦	+ ౯	+౧౩	+ ౯	— ౦
కాంచీపురం	— ౯	—౧౮	—౨౪	—౨౬	—౨౪	—౧౮	— ౯	— ౧	+ ౬	+ ౭	+ ౬	— ౧
మద్రాస్	— ౪	—౧౧	—౧౮	—౨౦	—౧౮	—౧౧	— ౪	+ ౪	+౧౦	+౧౨	+౧౦	+ ౪
భద్రాచలం	+ ౩	+ ౫	+ ౮	+ ౭	+ ౮	+ ౫	+ ౩	+ ౦	— ౨	— ౩	— ౨	+ ౦
బందరు	+ ౫	+ ౫	+ ౪	+ ౪	+ ౪	+ ౫	+ ౫	+ ౬	+ ౮	+ ౮	+ ౮	+ ౬
రాజమండ్రి	+౧౧	+౧౩	+౧౩	+౧౪	+౧౩	+౧౩	+౧౧	+౧౦	+ ౯	+ ౯	+ ౯	+౧౦
విజయనగరం	+౨౭	+౩౨	+౩౪	+౩౬	+౩౪	+౩౨	+౨౭	+౨౪	+౨౧	+౨౦	+౨౧	+౨౪
బరహంపురం	+౪౨	+౪౭	+౫౨	+౫౫	+౫౩	+౪౭	+౪౨	+౩౬	+౩౧	+౨౯	+౩౧	+౩౬

సూచన

విజయవాడనుండి భారత ప్రభుత్వము వారిచే నిర్ణయింపబడిన చైత్రాది మాసారంభము (అనగా మేషాది సాయన మాసారంభము)న కుండు కలుగు దేశాంతర విఘటికలు యీ పై చక్రమునందు చూపబడినవి. స్వగ్రామమునకు సమీపమందున్న పట్టణమునకు అభీష్ట మాసాదియందు కల విఘటికలను యీ చక్రమునను సరించి విజయవాడకు పశ్చిమదేశములయందుండువారు యీ పంచాంగమందలి తిథ్యాదులలో తీసివేయగాను ప్రాగ్దేశములవారు కలుపగాను స్వస్థానమునకు సూర్యోదయాది తిథ్యాదికాలము లగుచున్నవి. యీ విజయవాడ యామ్యోత్తర రేఖకు సమీపమందుండు దక్షిణోత్తర దేశములవారు ఇందు ఉదాహరణముగా చూపిన +,— గుర్తుల చిహ్నాలను గురించి సంస్కరించుకొన వలయును. ఇందు చూపిన విఘటికలు మాసాదియందు చూపబడినవి. నా నమూన్యయందు త్రైరాశికముచే దేశాంతరమును గ్రహించి సంస్కరించినచో సూర్యోదయాది స్పష్టతిథ్యాది కాలములును. ఇష్టగ్రామమునకు సూర్యోదయ గంటలు ఈ ప్రకారము దేశాంతర విఘటికల కగు నిమిషములను ఈ విజయవాడకు సూర్యోదయ గంటలలో ధన ఋణ చిహ్నాలకు వ్యత్యస్తముగా (అనగా విజయవాడకు పశ్చిమదేశమందుండువారు కలుపగను, ప్రాగ్దేశవాసులు తీసివేయగను) సంస్కరించినయెడల స్టాండర్డ్ టైము ననుసరించి ఇష్టగ్రామమునకు సూర్యోదయ గంటలగును; ఈ ప్రకారము సూర్యాస్తమయ కాలమును చేయవచ్చును.

లగ్నాంత కాలములయందు దేశాంతర చక్రము

	మీన	మేష	వృష	మిథు	కర్క	సింహ	కన్య	తుల	వృశ్చి	ధను	మక	కుంభ
మైసూరు	+19	+22	+24	+23	+20	+17	+13	+10	+ 8	+ 9	+11	+15
బెంగుళూరు	+14	+17	+19	+18	+16	+13	+10	+ 7	+ 5	+ 6	+ 8	+11
అనంతపురం	+15	+15	+15	+15	+14	+12	+11	+ 9	+ 9	+ 9	+10	+21
బళ్లారి	+16	+17	+17	+17	+16	+15	+14	+13	+12	+13	+13	+15
కర్నూలు	+11	+11	+12	+11	+11	+10	+10	+ 9	+ 9	+ 9	+10	+10
హైదరాబాదు	+ 8	+ 7	+ 7	+ 7	+ 8	+ 8	+ 9	+10	+10	+10	+ 9	+ 9
వరంగల్లు	+ 3	+ 2	+ 1	+ 1	+ 2	+ 4	+ 5	+ 6	+ 7	+ 6	+ 5	+ 4
తిరుపతి	+ 7	+ 9	+11	+10	+ 8	+ 6	+ 3	+ 1	— 0	+ 0	+ 2	+ 5
నెల్లూరు	+ 4	+ 5	+ 6	+ 6	+ 5	+ 3	+ 1	— 1	— 1	— 1	+ 0	+ 2
మద్రాస్	+ 4	+ 6	+ 8	+ 7	+ 5	+ 2	— 1	— 4	— 5	— 4	— 2	+ 1
కుంభకోణం	+ 9	+13	+15	+14	+11	+ 6	+ 1	— 3	— 5	— 4	— 1	+ 4
కాంచీపురం	+ 6	+ 9	+10	+10	+ 7	+ 4	+ 1	— 2	— 3	— 3	— 0	+ 3
భద్రాచలం	— 2	— 3	— 3	— 3	— 2	— 1	— 0	+ 1	+ 1	+ 1	+ 0	— 1
బందరు	— 2	— 2	— 2	— 2	— 2	— 2	— 2	— 3	— 3	— 3	— 3	— 2
రాజమండ్రి	— 5	— 5	— 5	— 5	— 5	— 5	— 4	— 4	— 4	— 4	— 4	— 4
విజయనగరం	—12	—14	—14	—14	—13	—12	—10	— 9	— 8	— 8	— 9	—11
బరహంపురం	—19	—21	—22	—22	—20	—17	—15	—13	—11	—12	—14	—16

ఇందు చూపబడిన లగ్నాంతకాలములు స్టాండర్డు టైము ననుసరించి విజయవాడకు లగ్నాంతకాలము లగుచున్నవి. ఇతరదేశములవారు ఈ చూపబడిన దేశాంతర చక్రము ననుసరించి, ఆయాలగ్నాంత కాలములకు చూపబడిన నిమిషములను, విజయవాడకు పశ్చిమదేశమున నుండు వారలు ఆయా కాలములలో కలుపగాను, ప్రాగ్దేశములయం దుండువారు తీసివేయగను, స్టాండరు టైముననుసరించి ఇష్టమగు వారి నగరములకు లగ్నాంత కాలము లగును. తిథులలో ప్రతిమాసము దినమును ప్రతిరోజున లగ్నాంతకాలములు చూపబడినవి.

భారతదేశమున ఆ యా అక్షాంశ ప్రదేశములకు మేషాది నిరయణ రాశి ప్రమాణములు — ఘటికలు-విఘటికలు-పరలు.

అక్షాంశ	మేషము	వృషభము	మిథునము	కర్కాటకము	సింహము	కన్య	తుల	వృశ్చికం	ధనుస్సు	మకరం	కుంభం	మీనం
	ఘ విఘ పర.	ఘ.విఘ.పర.	ఘ విఘ.పర	ఘ.విఘ.పర.	ఘ విఘ.పర.	ఘ.విఘ.పర.	ఘ విఘ పర.	ఘ విఘ పర.	ఘ విఘ.పర.	ఘ.విఘ పర.	ఘ విఘ పర	ఘ విఘ పర.
10	౪-౩౫-౧౬	౫- ౮-౧౦	౫- ౮-౧౧	౫-౨౦- ౧	౫- ౨-౧౯	౪-౫౭-౫౧	౫-౧౧-౧౩	౫-౨౭-౨౧	౫-౨౦-౫౧	౪-౫౦-౧౬	౪-౨౨-౧౭	౪-౧౬-౧౪
11	౪-౩౩-౨౬	౫- ౭-౧౦	౫-౨౮-౩౫	౫-౨౧-౩౨	౫- ౪-౨౨	౪-౫౯-౫౯	౫-౧౩- ౪	౫-౨౮ ౨౦	౫-౨౦-౨౮	౪-౪౮ ౪౪	౪-౨౦-౧౪	౪-౧౪- ౬
12	౪-౩౧-౩౪	౫- ౬-౧౧	౫-౨౮-౫౭	౫-౨౩- ౫	౫- ౬-౨౬	౫- ౨- ౮	౫-౧౪ ౫౫	౫-౨౯-౨౦	౫-౨౦- ౫	౪-౪౭-౧౨	౪-౧౮-౧౦	౪-౧౧-౫౭
13	౪-౨౯-౪౧	౫- ౫-౧౧	౫-౨౯-౨౦	౫-౨౪-౩౮	౫- ౮-౩౧	౫- ౪-౧౮	౫-౧౬ ౪౭	౫-౩౦-౨౧	౫-౧౯ ౪౭	౪-౪౫ ౩౮	౪-౧౬ ౫	౪- ౯-౪౮
14	౪-౨౭-౪౮	౫- ౪- ౯	౫-౨౯-౪౪	౫-౨౬-౧౨	౫-౧౦-౩౮	౫- ౬-౨౮	౫-౧౮-౪౧	౫-౩౧-౨౧	౫-౧౯-౧౯	౪-౪౪- ౪	౪-౧౩-౫౯	౪- ౭-౩౭
15	౪-౨౫-౫౩	౫- ౩- ౯	౫-౩౦- ౭	౫-౨౭-౪౭	౫-౧౨-౪౫	౫- ౮-౩౯	౫-౨౦-౩౬	౫-౩౨-౨౩	౫-౧౮-౫౫	౪-౪౨-౨౯	౪-౧౧-౫౨	౪- ౫-౨౫
16	౪-౨౩-౫౮	౫- ౨- ౭	౫-౩౦-౩౦	౫-౨౯-౨౩	౫-౧౪-౫౩	౫-౧౦-౫౩	౫-౨౨-౩౧	౫-౩౩-౨౫	౫-౧౮-౩౧	౪-౪౦-౫౩	౪ ౯ ౪౩	౪- ౩-౧౨
17	౪-౨౨ ౧	౫- ౧- ౩	౫-౩౦-౫౫	౫-౩౧- ౧	౫-౧౭- ౨	౫-౧౩- ౮	౫-౨౪ ౨౮	౫-౩౪-౨౮	౫-౧౮ ౭	౪-౩౯-౧౬	౪ ౭-౩౪	౪- ౦-౫౭
18	౪-౨౦- ౩	౪-౫౯-౫౯	౫-౩౧-౨౦	౫-౩౨-౩౯	౫-౧౯-౧౩	౫-౧౫-౨౪	౫-౨౬-౨౭	౫-౩౫-౩౨	౫-౧౭ ౪౨	౪-౩౭ ౩౭	౪- ౫-౨౩	౩-౫౮ ౪౧
19	౪-౧౮ ౩	౪-౫౮-౫౪	౫-౩౧-౪౫	౫-౩౪-౧౯	౫-౨౧-౨౬	౫-౧౭ ౪౧	౫-౨౮ ౨౭	౫-౩౬-౩౭	౫-౧౭ ౧౭	౪ ౩౫-౫౮	౪- ౩- ౯	౩-౫౬-౨౪
20	౪-౧౬- ౧	౪-౫౭-౪౮	౫-౩౨-౧౦	౫-౩౬ ౦	౫-౨౩-౪౧	౫-౨౦- ౧	౫-౩౦-౨౮	౫-౩౭ ౪౦	౫-౧౬-౫౩	౪-౩౪ ౧౬	౪- ౦-౫౫	౩-౫౪ ౫
21	౪-౧౩ ౫౮	౪-౫౬-౪౧	౫-౩౨-౩౬	౫-౩౭-౪౩	౫-౨౫-౫౭	౫-౨౨-౨౨	౫-౩౨-౩౧	౫-౩౮-౪౯	౫-౧౬-౨౭	౪-౩౨-౩౩	౩-౫౮ ౩౯	౩-౫౧-౪౪
22	౪-౧౧-౫౨	౪-౫౫-౩౪	౫-౩౩- ౨	౫-౩౯-౨౭	౫-౨౮-౧౫	౫-౨౪-౪౫	౫-౩౪ ౩౬	౫-౩౯-౫౨	౫-౧౬- ౧	౪ ౩౦ ౪౯	౩-౫౬-౨౧	౩-౪౯ ౨౧
23	౪- ౯-౪౫	౪-౫౪-౨౫	౫-౩౩-౨౮	౫-౪౧-౧౪	౫-౩౦-౩౫	౫-౨౭-౧౦	౫-౩౬-౪౩	౫-౪౧- ౭	౫-౧౫-౩౩	౪-౨౯- ౩	౩ ౫౪- ౧	౩-౪౬-౫౬
24	౪- ౭-౩౭	౪-౫౩-౧౪	౫-౩౩-౫౫	౫-౪౩- ౨	౫-౩౨-౫౮	౫-౨౯-౩౭	౫-౩౮-౫౩	౫-౪౨-౧౭	౫-౧౫- ౬	౪-౨౭-౧౫	౩-౫౧-౩౯	౩-౪౪-౨౮
25	౪- ౫-౨౫	౪-౫౨- ౨	౫-౩౪-౨౩	౫-౪౪-౫౨	౫-౩౫-౨౨	౫-౩౨- ౬	౫-౪౧- ౩	౫-౪౩-౨౯	౫-౧౪-౩౯	౪-౨౫-౨౫	౩-౪౯-౧౪	౩-౪౧-౫౯
26	౪- ౩-౧౧	౪-౫౦-౪౮	౫-౩౪-౫౧	౫-౪౬-౪౪	౫-౩౭-౫౦	౫-౩౪-౩౮	౫-౪౩-౧౭	౫-౪౪-౪౩	౫-౧౪-౧౧	౪-౨౩ ౩౨	౩-౪౬-౪౭	౩-౩౯-౨౭
27	౪- ౦-౫౪	౪-౪౯-౩౪	౫-౩౫-౨౦	౫-౪౮-౩౯	౫-౪౦-౧౯	౫-౩౭-౧౩	౫-౪౫ ౩౪	౫-౪౫-౫౮	౫-౧౩ ౪౧	౪-౨౧-౩౮	౩ ౪౪-౧౭	౩-౩౬-౫౩
28	౩-౫౮-౩౫	౪-౪౮ ౧౭	౫-౩౫-౫౧	౫-౫౦-౩౫	౫-౪౨-౫౨	౫-౩౯-౫౦	౫-౪౭-౫౩	౫ ౪౭-౧౪	౫-౧౩-౧౨	౪-౧౯ ౪౧	౩-౪౧-౪౪	౩-౩౪-౧౫
29	౩-౫౬-౧౪	౪-౪౬-౫౮	౫-౩౬-౨౧	౫-౫౨-౩౫	౫-౪౫-౨౭	౫-౪౨-౩౧	౫-౫౦-౧౫	౫-౪౮-౩౩	౫-౧౨-౪౧	౪-౧౭ ౪౧	౩-౩౯- ౯	౩-౩౧-౩౪
30	౩-౫౩-౪౮	౪-౪౫-౩౮	౫-౩౬-౫౨	౫-౫౪-౩౮	౫-౪౮- ౬	౫-౪౫-౧౪	౫-౫౨ ౪౦	౫-౪౯-౫౪	౫-౧౨-౧౦	౪-౧౫-౩౯	౩-౩౬-౨౯	౩-౨౮ ౫౧

N. B. పది అక్షాంశ ప్రదేశముల కల పూర్తి ప్రాంతముల మొదలు ముప్పై అక్షాంశ ప్రదేశముల కల తెలుగు ప్రాంతములకు ఈ తొలుత నిరయణ లగ్న ప్రమాణములను గ్రహించవచ్చును. భారతదేశమున కాలాంతరము తక్కువ ఈ లగ్న ప్రమాణములను గాని సవరించుకొనవచ్చును.

విజయవాడ ప్రాంతములకు
మేషాది నిరయణ లగ్న ప్రమాణములు—పుష్కరలు

లగ్న ప్రమాణములు			పుష్కర ప్రమాణములు		
మేషము	౪-౨౩	గం 1-45	మేషము	౩- ౪	గం 1-14
వృషభము	౫- ౨	గం 2- 1	వృషభము	౨-౨౦	గం 0-56
మిథునము	౫-౩౦	గం 2-12	మిథునము	౪-౨౪	గం 1-46
కర్కాటకము	౫-౩౧	గం 2-12	కర్కాటకము	౧-౧౭	గం 0-31
సింహము	౫-౧౬	గం 2- 6	సింహము	౩-౪౧	గం 1-28
కన్య	౫-౧౨	గం 2- 5	కన్య	౨-౨౬	గం 0-58
తుల	౫-౨౪	గం 2-10	తుల	౪-౧౯	గం 1-44
వృశ్చికం	౫-౩౪	గం 2-14	వృశ్చికం	౧-౧౮	గం 0-31
ధనుస్సు	౫-౧౮	గం 2- 7	ధనుస్సు	౩-౪౩	గం 1-29
మకరం	౪-౪౦	గం 1-52	మకరము	౨-౧౧	గం 0-52
కుంభము	౪- ౮	గం 1-39	కుంభము	౩-౧౮	గం 1-19
మీనము	౪- ౨	గం 1-37	మీనము	౦-౫౬	గం 0-22

గత లగ్నాంతకాలముతో ముహూర్త లగ్న సంబంధమైన పుష్కర గంటలను కలిపిన శుభ ముహూర్త లగ్నమునకు పుష్కర సమయము వచ్చును

రాజమండ్రి ప్రాంతములకు
మేషాది నిరయణ రాశి ప్రమాణములు

మేషస్య	౪-౨౨	తులాయాః	౫-౨౪
వృషభస్య	౫- ౧	వృశ్చికస్య	౫-౩౫
మిథునస్య	౫-౩౧	ధనుషః	౫-౧౮
కర్కాటకస్య	౫-౩౧	మకరస్య	౪-౩౯
సింహస్య	౫-౧౭	కుంభస్య	౪- ౮
కన్యాయాః	౫-౧౩	మీనస్య	౪- ౧

విజయనగర ప్రాంతములకు
మేషాది నిరయణ రాశి ప్రమాణములు

మేషస్య	౪-౨౦	తులాయాః	౫-౨౭
వృషభస్య	౫- ౦	వృశ్చికస్య	౫-౩౬
మిథునస్య	౫-౩౧	ధనుషః	౫-౧౭
కర్కాటకస్య	౫-౩౩	మకరస్య	౪-౩౮
సింహస్య	౫-౧౯	కుంభస్య	౪- ౫
కన్యాయాః	౫-౧౬	మీనస్య	౩-౫౮

అయనాంశలు { నూతన సంస్కార సంస్కృత చైత్ర పక్షయనాంశలు
సంవత్సరాదికి 23° 24'-42" వార్షికాయనగతి 50'—26

మి	వృ	మే	మీ
		శు	ర. చం శ. రా
	వర్ష లగ్న కుండలి		ల బు. శు
గు			
కే			

మి	వృ	మే	మీ
		ర. శు	బు. శు శ. రా
ల	జగల్లగ్న కుండలి		
గు			
కే	చం		

వర్ష లగ్నాపేక్షయా వాహనభాగ్యాధిపతియగు శుక్రునకు పంచమాష్టమాధిపతియగు బుధునకు లగ్నస్థితి. ఈ బుధ శుక్రులను ధనలాభాధిపతియగు గురుడు సప్తమమందుండి చూచుచుండెను. తృతీయ రాజ్యాధిపతియగు కుజునకు తృతీయస్థితి. లగ్నవ్యయాధిపతియగు శనికి షష్ఠ సప్తమాధిపతులగు రవిచంద్రుల తోను, రాహువుతోను ద్వితీయస్థితి. కేతు దృష్టి. విమర్శచేయగా లోటి రాష్ట్ర ప్రభుత్వములలో ఉత్తమ ముగ పరిగణించబడును. ఆంధ్రదేశమునందు అభివృద్ధి కార్యక్రమములు ఫలవంతములగును. శని ప్రాగ్ద్వార నక్షత్రములయందు సంచరించుటచే ఇంకను ధరలు అదుపులోనికి వచ్చుట కష్టము. వాహనవ్యయాధిపతు లకు సంబంధమువలన బుధ శుక్రులకు గురుదృష్టి వలన తృతీయ కుజునివలన ఆంధ్రదేశమునందు సస్యవృద్ధి కలిగి సుభిక్షముగనున్నను అవసరపు వస్తువులకు కంట్రోలు తప్పదనిపించుచున్నది. ఈ వత్సరము రాష్ట్ర ప్రభుత్వము ప్రజల ఆదరాభిమానములను చూరగొనును. జగల్లగ్నాపేక్షయా లగ్నాధిపతియగు చంద్రునకు సహస్థితి. ఇంకను పంచమ రాజ్యాధిపతియగు కుజునితోను, ధనాధిపతియగు రవితోను సంబంధము వష్ఠ భాగ్యాధిపతియగు గురునకు ధనస్థితి. తృతీయ వ్యయాధిపతియగు బుధునకు వాహనలాభాధిపతియగు శుక్రు నకు, సప్తమాష్టమాధిపతియగు శనికి రాహువుతోకలసి భాగ్యస్థితి. తృతీయమున కేతువు. విచారణచేయగ సర్వవిధముల భారత ప్రభుత్వము అభివృద్ధిని పొందును. మరియు అధినేతలయందు అభిప్రాయభేదములు వచ్చినను అవి అన్నియు సమసిపోయి ఐక్యత సంభవించును. భారత ప్రభుత్వము మహాదిబ్బలహానుసగల ప్రభు త్వములలో ఉత్తమముగ నుండును. సరిహద్దు ప్రభుత్వములలో మధ్య మధ్య సంఘర్షణలు అనుభవించు చున్నది. జగల్లగ్నవర్షలగ్నములకు అన్యోన్యము పరస్పరకములగుటచే రాష్ట్ర ప్రభుత్వ, కేంద్రప్రభుత్వము లకు లన్యోన్య సంప్రదాయములు తృప్తికరముగ నుండుట లరుదుగ నుండును. అయినను రాష్ట్రప్రభుత్వము లన వాదవ్యమును ప్రదర్శించి ప్రజా సురంజకముగ పాలించును.

సంవత్సర ఫల సారాంశము

ఈ సంవత్సరమున రాజు శుక్రుడు. మంత్రి శని. సేనాధిపతి శుక్రుడు. సస్యాధిపతి కుజుడు. ధాన్యాధి పతి రవి. అర్ఘాధిపతి శుక్రుడు. మేఘాధిపతి శుక్రుడు. రసాధిపతి బుధుడు. నీరసాధిపతి చంద్రుడు— ఇట్లు ఆధిపత్యములవలన విచారణ చేయగ సర్వసస్యసమృద్ధియగును 16 వీసములలో 8 వీసముల పంట ఫలించును. పశుపాలకుడు గోప్త బహుపద్మర్త యము శ్రీకృష్ణుడు. గోప్రాపకుడు యముడు. గన మధ్యమధ్య వ్యాధులు సంభవించినను నివారణలయి పశువులకు తృణసమృద్ధి కలిగి క్షీరసమృద్ధి కలుగును. 4 కుంచముల వర్షము వర్షారంభమాయుతు జ్యేష్ఠ బ 2 సోమవారవర్జ్యం॥ పూర్వాభాద్ర హస్తమున లది లగాయతు అశ్వయుజ బ 2 శనివారం బాలగోపవస్తమున, ఆది లగాయతు ఫాల్గున బ 3 శుక్రవారం పూర్వాభాద్ర హస్తమున తదా రభ్యవత్సరం బాలగోపహస్తమున కుంచముండును. విచారణచేయగ నదీమాతృక భూములు, దేవమాతృక భూములు స్వల్పభేదముతో సమానముగ ఫలించును. దేశారిష్టయోగములను విచారణచేయగ సరిహద్దులయందు మధ్యమధ్య అలజడులు చెలరేగుచుండును. ఇంకను శని ఈ ప్రాగ్ద్వార నక్షత్రములయందు వక్రించుటచేత ధరలు విశేషముగుటచే సామాన్యజనులు కటకటలాడుదురు. వైశాఖ బ ౬ శుక్రవారం (17—5—68) లగా॥ ఆషాఢ బహుళ (17—7—68) వరకు శుక్రమౌఢ్యము. శ్రావణ బ 30 శుక్ర॥ (23—8—68) లగా అశ్వ యుజ శు ౧ సో (23—9—68 వరకు) గురు మౌఢ్యము. చైత్ర శు ౧౫ శని (13—4—1968) లగా॥ వైశాఖ బ ౨ మం (14-5-1968) వరకు మేషమునందు రవి సంచరించుటవలన ఈ దినములయందు సింహ గురు దోషములేని సర్వగ్రంథములయందు చెప్పుటవలన సర్వశుభములు చేసుకొనవచ్చును. వత్సరాదిలగా యతు అశ్వయుజ బ ౬ శని (12—10—1968) వరకు సింహరాశియందు గురుసంచారము.

శ్రావణ బ ౫ శని (10—8—1968) లగా అశ్వయుజ బ ౬ శని (12—10—1968) వరకు గోదావరి దక్షిణతీరవాసులు అనగా పశ్చిమగోదావరిజిల్లా లగాయతు సర్వశుభములను చేసుకొనవచ్చును. గంగగోదావరీమధ్య దేశవాసులు మేషమాసమునందు ఎట్టి శుభములు చేసుకొనవచ్చును. కళింగ, గౌడ, ఘూర్జర దేశవాసుల సింహమునందు శుభములు చేయరాదుగాని మేషమునందు రవియున్నను శుభములు చెయ్యకూడదు. భాద్ర పద బ 30 స్థి॥ ఉదయముగ చూడామణి రాహుగ్రస్తాస్తమయార్ధాధిక (3/5) సూర్య గ్రహణము. అశ్వయుజ శు ౧౫ మా భానువాసరము ముద్యామానోదయ ఖగ్రాసచంద్రగ్రహణము కలుగును. అశ్వయుజ శు ౯ సో (30—9—1968) ప్రభృతి గోదావరినది అంత్యపుష్కర ప్రారంభము. అశ్వయుజ బ ౬ శని వారం (12—10—68) తారీఖున సింహ్రతీ కోటి సిద్ధసహిత కృష్ణానది పుష్కర ప్రారంభము.

సర్వేజనా స్సుఖినోభవన్తు.

శ్రీః శ్రీః శ్రీః

N. B:—భాద్రపద బ 30 స్థి: (22—9—1968) తారీఖున సంభవించు సూర్యగ్రహణము మద్రాసు కంచికామకోటి, నెల్లూరు ప్రాంతములకు స్వల్పముగను, మరియు సుమారు 48 విమిషములు దృశ్యమగును.

వర్ష ఫల సారాంశము

చైత్రమాసారంభమందు సామాన్య వర్షములు కలిగి క్రమేపియు ఎండలు తీవ్రమగును. వైశాఖమాస మున పూర్ణిమా ప్రాంతమువరకు ఎండలు తీవ్రముగనుండి బహుళములో గాలి దుమారములు చెలరేగును. కారువర్షములు పడును. అమా ప్రాంతమున సామాన్య వర్షములు పడును. జ్యేష్ఠమాసమునందు శుక్లములో పూర్ణిమ దాటినదిమొదలు తొలకరివానలు ప్రారంభమయి అన్ని ఆరంభములు చక్కగ అంటును. ఆషాఢ మాసమునందు మేఘాడంబర మధికముగనుండి సామాన్య వర్షములు కలుగును. శ్రావణమాసమున దేశమంతట మంచి వర్షములు కలిగి గోదావర్యాది నదులు సంపూర్ణముగ ప్రవహించును. భాద్రపదమాసమునందు సామాన వర్షములు కలిగినను, వర్షమునకై కొన్ని ప్రాంతములయందువారు మాత్రము నిరీక్షించవలసివచ్చును. పూర్ణిమా ప్రాంతమున కొన్నిదేశములయందు కొంత సువృష్టియనిపించును. అశ్వయుజ మాసమునందు పూర్ణిమా ప్రాంతమున అమావాస్య ప్రాంతమున కొన్ని ఖండములయందు గాలితోకూడిన వృష్టి కలుగును. కార్తీక మాసమున ఎన్నాళ్లిప్పుడు వర్షాలు కలిగినను, ఖండాంతరములయందు తుపానులు సంభవించును. మార్గశిరమాసమున మేఘాడంబర మధికమగును. వర్షము సామాన్యము. పుష్యమాసమున వాతావరణ ఉత్కళ సస్యములకు అనుకూలముగ నుండును. మాఘమాసమున ఉత్తరార్ధమున అందు శివరాత్రి ప్రాంతమందు మాఘపాలీ వర్షములు కలుగును. ఫాల్గున మాసమునందు పూర్ణిమా ప్రాంతమున, వత్సరాంతమునందు మన్య ప్రాంతములయందు తటాకములు నిండునట్లు వర్షించును.

కార్తులు - ఫలములు

వైశాఖ బ ౧౩ శుక్ర॥	24—5—1968	రోహిణీకార్తి	స్వల్పవృష్టి
జ్యేష్ఠ శు ౧౧ శుక్ర॥	7—6—1968	మృగశిరకార్తి	మధ్యమవృష్టి
జ్యేష్ఠ బ ౧౧ శుక్ర॥	21—6—1968	ఆర్ద్రకార్తి	సాధారణవృష్టి

ఆషాఢ శు ౧౦ శుక్ర॥	5 7 1968	పునర్వసుకార్తె	సామాన్యవృష్టి
ఆషాఢ బ ౯ శుక్ర॥	19-7-1968	పుష్యకార్తె	సువృష్టి అల్ప
శ్రావణ శు ౮ శుక్ర॥	2-8-1968	ఆశ్రేషకార్తె	కించిత్సువృష్టి
శ్రావణ బ ౮ శుక్ర॥	16-8-1968	మఘకార్తె	సువృష్టి
భాద్రపద శు ౭ శుక్ర॥	30-8-1968	పుబ్బకార్తె	మధ్యానధ్యానవృష్టి
భాద్రపద బ ౫ గురు॥	12-9-1968	ఉత్తరకార్తె	సస్యాభివృద్ధి వృష్టి
ఆశ్వయుజ శు ౪ గురు॥	26-9-1968	హస్తకార్తె	అధికవర్షములు
ఆశ్వయుజ బ 3 బు (గు)	9-10-1968	చిత్రకార్తె	సువాతవృష్టి
కార్తిక శు ౨ బు	23-10-1968	స్వాతికార్తె	సవాతపుష్పవృష్టి
కార్తిక శు ౧౫ సోం (బు)	5-11-1968	విశాఖకార్తె	వాతాధిక్యవృష్టి
కార్తిక బ ౧౪ సోం	19-11-1968	అనూరాధకార్తె	సాధారణవృష్టి

విశేషము

వర్షకార్తెలు 12 కార్తెలు శుభవారములగుటచేతను 7 కార్తెలు శుక్రవారములగుటచేతను బాగుగా పంట కలిగి ప్రజలు నృత్తగీతోత్సవములతో కూడ సుఖముల ననుభవింతురు.

ధరలఫలసారాంశము

1962 సం॥ ర౦॥ ఫిబ్రవరిలో వచ్చిన అష్టగ్రహకూట దోషముయొక్క ఫలము అనుభవించు కాలముగుటచేతను ఈ వత్సరముగూడ శని ప్రాగ్ద్వార నక్షత్రములయందు సంక్రమించుటచేతను సామాన్య ప్రజలకు నిత్యావసర వస్తువులు అందుబాటులో నుండుట వలన కష్టము మోక్షము ఈ సంవత్సరమంతా స్వల్ప భేదములతో అన్ని సరకులు ధరలు హెచ్చుగా నుండును 1970 వెళ్లిన తరువాతగాని ధరలు తగ్గవనిపించుచున్నది.

N.B. మావారీగ వర్షవిమర్శ ధరల వివరము తిథుల తర్వాతకూడ గమనించగలరు.

సూర్యగ్రహణము

తేది 22—9—1968 P.M.

విజయవాడకు

ఈ సంవత్సర భాద్రపద బ 30 స్థిరవారము ఉత్తరఫల్గుని నక్షత్ర కన్యారాశిలో చంద్రుడుండగా చూడమణి నామకముచ్చయా వాస్తవము. సూర్యగ్రహణం అర్ధాధిక (3/5) గ్రాసకేతుగ్రస్త కృష్ణవర్ణః ఉత్తరశోలం సవ్యగ్రహణం.

ఈశా | ఐశా | ఉ | ద | ప

I. S T.

సూర్యోదయాది స్పర్శకాలః	28-20 గం వి	5—6,5 P M.
మధ్యకాలః	30-24 గం వి	6—0 P.M.
సూర్యాస్తమయకాలః	30-33 గం వి	6—3 P.M.
సూర్యాస్తమయాది శుద్ధమోక్షకాలః	౧-౩౬ గం వి.	6—49,5 P.M.
అదృశ్యగ్రహణకాలః	౪-౧౭ గం వి	1—43

వాయవ్యోత్తర మధ్యే స్పర్శః ప్రాగాగ్నేయ మధ్యేమోక్షః

సూర్యగ్రహణ దివసే నిత్యభోజన ప్రత్యాబ్దికాది నిర్ణయం

కాలమాధవీయే "గ్రస్తావేవాస్తమానంతు రవీందూప్రాప్నుతోయది। తయోః పరేద్యురుదయే స్నాత్వాభ్యవహరేన్నరః ఇతి॥ నిర్ణయసింధౌ "సాయంసంధ్యాయాం సూర్యగ్రస్తాస్తే పూర్వేద్యు రాత్రౌచ నభోక్తవ్యమితి॥ తస్మాత్ భానువాసరే గ్రహణదివసే ఉపవాసంకృత్వా పరేద్యు సోమవాసరే సూర్యబింబం దృష్ట్వా స్నాత్వా నిత్యభోజనంకర్తవ్యమితి। కారికాప్యత్ర "గ్రస్తే సూర్యే ఽస్తంగతే చేత్తదానీం జ్యోతిశ్శాస్త్రోక్తస్య విజ్ఞాయ ముక్తిం। శ్రాద్ధం కార్యం తదానీం పరేద్యుర్వేద్యూపదిష్టం లోకేఽపి బ్రహ్మ స్వధోక్తమితి। ఏతాదృశ ప్రమాణ వచన బలాత్ ప్రత్యాబ్దిక మాసిక సంవత్సర విమోక శ్రాద్ధాదిషు రాత్రౌ గ్రహణానంతరమేవ కార్యాణి॥ దార్శికాలభ్యయోరపీతి కాలాదర్శోక్తేః దర్శశ్రాద్ధస్య గ్రహణ శ్రాద్ధేనైవ ప్రసంగ సిద్ధిర్భవతి తస్మాత్ దర్శ శ్రాద్ధం పృథక్త్వేన నకర్తవ్య మితి। యానిచ 'గ్రహోత్తు ద్యుతి పశ్చాచ్చోదయేత్తు పంచమే॥ తథా। గ్రస్తోదయే యదాచంద్రే ప్రత్యాబ్దం సముపస్థితం। తద్దినే చోపవాసస్స్యాత్ ప్రత్యాబ్దం తు పరేఽహని చంద్రసూర్యోపరాగే చేత్ తథా శ్రాద్ధం పరేఽహని (అన్వష్టకాది) తథా। గ్రస్తాస్తే యదివాసూర్యే శ్రాద్ధం కుర్యాత్పరేఽహని। తస్మిన్నేవ దినే కుర్యాద్గ్రస్తాస్తే నభోక్ష్యతి ఇత్యాదీని వచనాని మహానిబంధనేషు క్వచిదుపలభ్యమానాని నిర్ణయసింధ్వాది గ్రంథేషు ప్రత్యుత పూర్వోక్త నిబంధనేషు తద్దినమేవ శ్రాద్ధ ముక్తమిత్యేవమితి నిర్ణయసింధ్వాది సిద్ధాంతితమితి॥ తథాపి వచనానాం సమూలత్వే అంగీకృతేపి రజోదోషేతు పంచమేత్యాది వాక్యవత్ విధవాకర్తృక శ్రాద్ధ విషయ మిత్యేవ సామంజస్యంభవతి విధవాయా రాత్రౌ భోజన నిషేధ శ్రవణాత్ ఉపవాసవిధానాచ్చ తస్మాద్విధవా కర్తృక ప్రత్యాబ్దికం గ్రహణ దినే ఉపవాసంకృత్వాపరేద్యు నకర్తవ్యమితి॥ కింతు సువాసినీ స్త్రీ కర్తృక ప్రత్యాబ్దికం తాత్ సువాసిన్యాః రాత్రౌ భోజనాధికారాత్ గ్రహణ దివసే రాత్రౌ శాస్త్రోక్త ముక్త్యనంతరమేవ విధేయం సర్వం తే।

నిత్యభోజన ప్రత్యాబ్దిక నిర్ణయము

ఈ గ్రహణము గ్రస్తాస్తమయ గ్రహణముగాన ఆరోజున ఉపవాసముచేసి మరునాడు సూర్యబింబమును చూచి స్నానముచేసి నిత్యభోజనమును చెయ్యవలెను ప్రత్యాబ్దికము మాసికము సంవత్సర విమోకము రాత్రి గ్రహణానంతరమునందు మోక్షస్నానముచేసి అన్నశ్రాద్ధమును చెయ్యవలెను. దర్శశ్రాద్ధము సంక్రమణ శ్రాద్ధములకు గ్రహణ కాలమందలి శ్రాద్ధముచే ప్రసంగసిద్ధి యగుచున్నగాన వేరె పెట్ట నవసరంలేదు అమావాస్య ప్రత్యాబ్దికము మాసికము సంవత్సర విమోకశ్రాద్ధము ఆదివారం రాత్రియే నిర్వర్తించవలెను మరునాడువరకు ఉండకూడదని శాస్త్ర నిర్ణయము— భోక్తలు కర్త తప్పక రాత్రి భోజనము చెయ్య వచ్చును విధవా కర్తృక శ్రాద్ధము గ్రహణ దినమున ఉపవాసముచేసి పరదినమున చెయ్యవలెను రాత్రి భోజనాధికారములేదు గావునని శాస్త్ర నిర్ణయము

గ్రామం		స్పర్శ	మధ్య	సూ అస్తం.	గ్రాసం
		I. S. T.			
రాజమండ్రి	P. M.	5— 7	6— 0	5—58	.60
విజయనగరం		5—7,5	5—59	51—52	.61
హైదరాబాదు		5— 6	6— 3	6—12	.60
మద్రాసు		5—16	—	6— 5	స్వల్పం.
కంచికామకోటి		5—17	—	6— 7	స్వల్పం.
ఢిల్లీ		4—43	5—46	6—18	.81
బొంబాయి		5— 1	6— 0	6—35	.62
కలకత్తా		4—59	—	5—33	.స్వల్పం.
భువనేశ్వరం		5— 3	—	5—43	.స్వల్పం.
వారణాసి (కాశి)		4—52	5—51	5—55	.76
ఉజ్జయిని		4—53	5—54	6—23	.71

విజయవాడకు

చంద్రగ్రహణము

తేదీ 6 - 10—1968

శ్రీ సంవత్సర ఆశ్వయుజ శు ౧౫ ఆది (రేవతీనక్షత్ర మీనరాశిలో) వాసరములో వుత్పన్నమైన యుదళ్ళన్న చంద్రగ్రహణం. రాహుగ్రస్తం పింగళవర్ణం. ఉత్తరగోళం. సవ్యగ్రాహం

I. S. T.		
స్పర్శకాలః	సా ఘం.	3—25
నిమీలన కాలః	సా ఘం.	4—40
మధ్య కాలః	సా ఘం.	5—12
ఉన్మీలన కాలః	సా ఘం.	5—43
సూర్యాస్తమయః	సా ఘం.	5—52
చంద్రోదయ కాలః	సా ఘం.	5—44
శుద్ధ మోక్షకాలః	రా ఘం	6—59
ఆద్యన్త పుణ్యకాలః	ఘం.	3—34
బింబాదర్శనకాలః	ఘం.	1—12

ప్రాగీశాన్య మధ్యే స్పర్శః. పశ్చిమవాయవ్య మధ్యే నిమీలనం
ఉత్తర దక్షిణ్యే న్మీలనం దక్షిణ నైఋతి మధ్యే మోక్షః.

(నిత్య భోజన ప్రత్యాబ్దిక నిర్ణయము)

రాత్రి గ్రహణానంతరమున శుద్ధబింబమును మోక్షస్నానమైన పిమ్మట ఆచరించి పాకారంభ నిర్వర్తిం ప్రత్యాబ్దికమును పెట్టవలెను. నిత్యభోజనము గూడా రాత్రియే చేయవలెను. పగలు చేయకూడదని శాస్త్ర నిర్ణయము.

N.B.—గ్రహణము స్వనక్షత్ర స్వరాసులలో సంభవించినవారు శాస్త్రోక్తముగా శాంతిని చేసుకొనవలెను. గ్రహణమును చూడకూడదు. సూతకము మరియు గ్రహణగోచారములో అశుభులైనవారు కూడా శాంతిని చేసుకొనవలెను. గ్రహణగోచారము తిథుల తరువాయిని గోచారమునకు పూర్వపు పెండు కలదు గమనించవలెను చున్నాము.

(అఖండ దిగ్విజయము)

పంచాంగ సందర్భము — అయనాంశలు

(కృష్ణాపుష్కర నిర్ణయము)

శ్రీమాన్య మహాశయులారా!

మా కుటుంబమునందు జ్యోతిశ్శాస్త్ర అధ్యయనము పంచాంగ రచన సుమారు 4, 5 శతాబ్దములనుండి వచ్చుచున్నది. మా పూర్వులు జ్యోతిశ్శాస్త్ర ప్రతిపాదిత సిద్ధాంతముల ననుసరించి పంచాంగ రచన చేయుచుండెడివారు. అప్పటి సిద్ధాంతులు వారి గ్రహచారతో వివాదములు పడుట సభలు చేయుంచుట నేటికు జరుగుచు మాకే దక్కుడును జరుగుచున్న దేదాయము. మేము ఉత్కృష్టమును పొరకు చెప్పుకొనవలయునుగదు. మాకుటుంబ మూలపురుషుని తపశ్శక్తి వలన మా ప్రాచీనుల యొక్క తత్త్వదృష్టిమున్నదనిప్రభావము వలన ఇక్ష్వాకు వంశమున మధ్యమద్య. రఘువు, రామచంద్రమూర్తి మొదలగు ప్రతిభావంతులు పుట్టినట్లు మావంశమున కీ॥ శే॥ మా ముత్తాతగారు చలమయ్యశాస్త్రిగారు. కీ॥ శే॥ మా తండ్రిగారు శ్రీ చినపూర్ణయ్యసిద్ధాంతిగారు. మొదలగు పూర్వులు ప్రతిభావంతులు ఉదయించిరి వారి వారి సమయములయందు లెక్కించ నిర్ణయము చేయుచు వుండిరి. సుమారు 150 సంవత్సరములనుండి ఆంధ్రదేశమున ఉన్న జ్యోతిశ్శాస్త్ర సభలలో మేము చేయు పంచాంగము న్యాయమైనదని నిర్ణయము చేసినను మరొకపక్షము వారు అప్పుడు న్యాయము జరుగలేదు. సరిగ విమర్శించలేదు. అని ప్రచారణ చేసి లోకులను ప్రచారణ చేయుచూ గ్రామగ్రామమునకు వెళ్ళి మీరు సభ చేయుంచండి. నా ఆహూషా చూపిస్తాను. అని ప్రకటించి స్వస్థలములోనే చేయుంచిన సభలలో వారికి అపజయము అయిన సంఘటనలు అనేకములు గలవు. ఇట్లు పోవుచుండగా భగవంతుని దయ వలన భారతప్రభుత్వము విమర్శ చేసి తమకు శాస్త్రీయమైనదని ఒక మార్గమును వేసి అయనాంశను విమర్శ చేసి ఒకనిర్ణయమును అంగీకరించి పంచాంగ రచన చేయుచున్నది. ఆ పంచాంగరచన మేము నిర్ణయించి యొక్క పంచాంగము చేయుచున్నామో ఆ విధముగనే అంగీకరించుట తోడనే జరుగుచున్నది. మరొకపక్షమువారు అప్పుడునూ న్యాయము జరుగలేదని ప్రచారము ప్రారంభించినారు. ఇట్లుండగా శ్రీ కాంచి కామకోటి పీఠాధీశ్వరులు అగుమన్న వదన్ననందు జ్యోతిశ్శాస్త్రమును ఒకశాఖగా చెప్పి మద్రాసులోను, కాశీలోను, రాజమండ్రిలోను సభలను జరిపిరి. అందు మద్రాసు సభలో పంచాంగ రచనయందు యొక్క తేడా వచ్చుచున్నది తెలియకాని శ్రీ 1008 శ్రీ కాంచి కామకోటి పీఠాధిపతులు వారు స్వయముగా కృపచేసి శాస్త్రవిమర్శ చేసి కాశీపట్టణ సభకు వచ్చిన పండితుల వాదప్రతివాదములను విని ఉభయుల వాదములను పత్రికా ముఖాంతరమున స్వీకరించి శ్రీవారు వారి నిర్ణయమును మాకు శ్రీముఖము ద్వారా అనుగ్రహించినారు. శ్రీవారి నిర్ణయమును విమర్శ చేయక లోగడ కీ॥ శే॥ శ్రీమా నాయనగారు చినపూర్ణయ్య సిద్ధాంతిగారు మా సొంత పంచాంగము తరువాత మేము యొక్క చేయుచున్నామో అదే న్యాయమునట్లు ధర్మసమ్మతమైనట్లుయున్నది. ఆ పద్ధతిచే రచించబడిన పంచాంగములో దృక్కర్మ ల యందు గ్రహణములయు చైత్రపక్ష అయనాంశలే గ్రహించబడినవని స్పష్టముగు చున్నది. మరుసటి సంవత్సరమున రాజమండ్రి సభలో 1967 సెప్టెంబర్ 6వ తారీఖు ఉదయమున సమావేశములో వచ్చిన పండితులు సిద్ధాంతులు సర్వసమ్మతముగను తిర్గి ఆ అయనాంశ చర్చయే ప్రారంభము చేసిరి. ఆ విన్నపమును శ్రీ జయేంద్ర [సర] శ్రీ చరణులు సాయంకాలము 11 గం॥ల వరకు వినినారు. అంతలో స్పష్టమైన వాదము ఏది స్పష్టమైనది? అని ప్రశ్నలు మొదలుపెట్టి 1.30 గం॥ వరకు వాద ప్రతివాదములు వినినారు. అంత సభ చాలించినారు. మధ్యాహ్నము 3 గం॥లకు శ్రీ సన్నిధానంవారు రాజమహేంద్రవరమున సభకు వచ్చిన లోపల ప్రజానీక సమక్షమున మేము ఈ పరిశీలనను వాదోపవాదము అను సాయంకాలమును వినినాము. ఈ పండితులు కాశీపట్టణ సభలో యేమి చెప్పినారో ఇప్పుడును అదే చెప్పినారు. యేమియు నూతన విషయములను చెప్పలేదు. ఆ కారణమున మేము కాశీపట్టణ సభలో యేనిర్ణయము చేయబడిన పంచాంగకర్తలకు శ్రీముఖములను ఇచ్చినామో అదే న్యాయమని, ధర్మమని ఉద్ఘోషించి చెప్పి మరియు ఆ నిర్ణయమునకు తిరుగులేదని చెప్పి సభను పూర్తి చేసిరి. తరువాత శ్రీ పెద్ద శ్రీ చరణులు సభాసమాప్తిని చేస్తూ యావదాంధ్ర ప్రజానీకమునకు నారాయణ స్మరణ పూర్వకముగ ఆశీర్వాదమును చేసినారు. మరునాడు మరొకపక్షమువారు శ్రీ సన్నిధానంవారు వద్ద పునర్విమర్శ చేయుటకు సిద్ధపడినారు. అప్పుడు శ్రీ చరణులు వారికి భారతప్రభుత్వమునకు నివేదన చేసుకొనవలసినదిగా, ఉపదేశించినారు. ఇక మేము విమర్శ చేయవలసిన అవసరము లేదని ఈ మా విమర్శయమునకు మార్పు లేదని వారితో సెలవిచ్చినారు. రాజమండ్రి సభ సంతరమునందు మా కోరిన పంచాంగకర్తలకు శ్రీముఖముల ననుగ్రహించినారు. గావున శ్రీ ప్రభుత్వ నిర్ణయమును సుప్రీంకోర్టు తీర్పుగాను శ్రీవారి నిర్ణయమును భగవన్నిర్ణయముగాను భావించియు యేవరు అయనాంశల గురించి ఆక్షేపణ చేసి ప్రచురించిన మేము సమాధానమును ఇప్పటినుండి విరమించుచున్నాము. ఇంతటితో ఈ అయనాంశ చర్చ శుభాంతముగ ముగిసినందుకు శ్రీ భగవంతుని ప్రార్థించుచున్నాము. రాజమహేంద్రవరమునగల పెద్దలను కొందరు పౌరులు శ్రీవారిని కలుసుకొని తమరు సభలు చేయించినారు యేమి నిర్ణయములు చేయించినారు. గోదావరీ పుష్కరమెప్పుడు ప్రారంభమైనదని ప్రార్థించగా శ్రీవారు మేము తెలుసుకొనుటకును సత్యాన్వేషణ కొరకును సభ చేయించినారు. నాని ఒకరిని కాదనుటకు కొరకుకాదని ప్రత్యేక అవసరము లేదని స్పష్టముగ చెప్పినారు. అప్పుడు పౌరులు గోదావరీ పుష్కరము తాము యెప్పటి నుండి వచ్చుచున్నదని, నిర్ణయించుకొనవలెనో మా కొరకునా, ఆ నిర్ణయమే ఒప్పించవలసినదిగా ప్రార్థించగా శ్రీవారు 14 సెప్టెం. 1967 సం. తారీఖు దయచేసి గోదావరి

పుష్కర ప్రారంభమని అనుగ్రహించినారు దానిననుసరించి ఎల్ల ప్రజానీకము సెప్టెంబరు 14వ తేదీన పుష్కర ప్రారంభముగ ఆచరించిన సంగతి లోకవిదితమే. ఈ పై నిర్ణయములననుసరించి కృష్ణానది పుష్కరము 12-10-1968 తారీఖు ప్రారంభము అయినాయుతు 12 రోజులు కృష్ణానది యందు స్నానాదుల వాచరించి తరించగోరుచున్నాము. ఈ అఖండ దిగ్విజయమును పరిపూర్ణ ప్రదేశము మహా పంచాంగమును ఆదరించి అభిమానించు యావదాంధ్ర ప్రజానీకము యొక్క అఖండ దిగ్విజయమని యావదాంధ్ర ప్రజలయొక్క సహాయమున దినదినోత్తరాభివృద్ధియగుటకు ముకుళిత హస్తములతో సవినయముగ విన్నవించుకొనుచున్నాము. గురువరులచే అనుగ్రహింపబడిన శ్రీముఖమును ఇందు ప్రకటించుచున్నాము.

శ్లో॥ జయ జయ జగదంబ శివే, జయ జయ కామాక్షి జయ జయాద్రి సుతే।
జయ, జయ, మహేశ దయితే, జయ, జయ చిద్గగన కౌముదీధారా.

ఇట్లు,
భ. భజన విధేయుడు,
పంచాంగ కర్త.

శ్రీః
శ్రీ చంద్రమౌళీశ్వర సహిత శ్రీ లలితా
మహాత్రిపురసుందరీ పరదేవతాయై నమః.

శ్రీ 1008 శ్రీ కామకోటి పీఠాధీశ్వరులు అనుగ్రహించిన శ్రీముఖము

శ్రీ కామకోటిపీఠాధీశ్వరుల మొహరు

స్వస్తి శ్రీమ దఖిలభూమండలాలంకార త్రయస్త్రింశత్కోటి దేవతా సేవిత శ్రీ కామాక్షీ దేవీసనాథ శ్రీమదేకామ్రనాథ శ్రీ మహాదేవీసనాథ శ్రీ హస్తిగిరినాథసాక్షాత్కార పరమాధిష్ఠాన సత్యవ్రతనామాంకిత కాంచీదివ్యక్షేత్రే శారదామఠసుస్థితానాం అతులిత సుధారస మాధుర్య కమలాసనకామినీ ధమ్మిల్ల సంఫుల్ల మల్లికా మాలికా నిష్యన్దమకరన్ద ఝరీసౌవస్తిక వాఙ్నిగుంఫ విజృంభణానంద తుందిలతమనీషి మండలానాం, అనవరతాద్వైత విద్యావినోదరసికానామ్, నిరంతరాలంకృతీకృత శాంతిదాంతిభూమ్నాం, సకల భువన చక్ర ప్రతిష్ఠాపక శ్రీచక్ర ప్రతిష్ఠా విఖ్యాత యశోలంకృతానామ్ నిఖిలపాషండషండకంటకోద్ఘాటనేన విశదీకృత వేదవేదాంతమార్గ షణ్మత ప్రతిష్ఠాపకాచార్యాణామ్, శ్రీ మత్పరమహంస పరివ్రాజకాచార్యవర్య శ్రీ జగద్గురు శ్రీ మచ్ఛంకర భగవత్పాదాచార్యాణామ్ అధిష్ఠానే సింహాసనాభిషిక్త శ్రీ మన్మహాదేవేంద్ర సరస్వతీ సంయమీంద్రాణాం అంతేవాసివర్య శ్రీ మచ్చంద్రశేఖరేంద్ర సరస్వతీ శ్రీపాదాదేశానుసారేణ శ్రీ జయేంద్రసరస్వతీ శ్రీపాదైః క్రియతే నారాయణస్మృతి —

అస్మత్పూజ్యపరమేష్ఠి గురుభిః అష్టాశీతి (88) వత్సరేభ్యః పూర్వం ఈశ్వరనామసంవత్సరే అనుష్ఠేయపంచాంగవిషయే మధ్యస్థ పండిత నిర్ణయ పూర్వకం విచారం కృత్వా ఆస్తికానాం దేవపితృకార్యాణాం సాఫల్యార్థం కశ్చిన్నిర్ణయః కృతః। తద్యథా॥

జ్యోతిశ్శాస్త్రాన్తర్గత గణితవిషయే తిథ్యాదీనాం భగణ్యస్థ భూమధ్యదృక్సిద్ధం, ఉపరాగాదీనాం భూపృష్ఠ దృక్సిద్ధం గ్రాహ్యమితి శ్రీ వేంకటేశ్వరదీక్షిత సుందరేశ్వర శ్రౌతి ప్రభృతీనాం పక్షః।

భూమధ్యః అన్యః భూపృష్ఠసిద్ధః అన్యః తిథ్యాదీనాం భూమధ్యదృక్తుల్యత్వైవ గ్రాహ్యః ప్రత్యక్షతా ఊహ్యత్వాత్ ఇతి శ్రీకృష్ణ జ్యోతిషికాదీనాం పక్షః।

అత్ర శ్రీ అప్పశాస్త్రిణ అప్పుదీక్షితాః శ్రీనివాసార్యాః ఇత్యేతే మధ్యస్థా భూత్వా సువిచార్య శ్రీ వేంకటేశ్వర దీక్షిత సుందరేశ్వర శ్రౌతినాం పక్ష ఏవ శ్రేయాన్ ఇతి నిర్ణయానుసారేణ ఏతద్విషయపత్రికా దత్తా ఈశ్వరనామ కతిచిత్తారికా— నారాయణస్మృతి।

అయమేవ నిర్ణయః అస్మాభిర ప్యనుస్రియతే। సర్వైర ప్యాస్తికైః అనుసృత ఐహికాముష్మికశ్రేయసం ప్రాప్యతామిత్యాశాస్మహే।

అపి చ యంత్రశోధిత బీజసంస్కారాదిశుద్ధతిథిషు పూర్వోత్తరతిథ్యోః పరమనాడికా యాపా యౌ భాగౌ తయో రంతరం యత్ తత్ వృద్ధిప్రసక్తౌ పంచనాడీః॥ నాతిక్రామతి। క్షయప్రసక్తౌ షణ్నాడీశ్చ నాతిక్రమతి తస్మాత్ "బాణవృద్ధిరసక్షయ" శ్లోకానుసారిణ్య ఏవ అస్మత్పరమేష్ఠి గురునిర్ణయరీతి తిథయో భవన్తి।

అస్మిన్ వ్యాసపదసి (7—8 సెప్టెం 1966) నిజశ్రావణద్వావింశత్త్రయోవింశత్తారికా దినయోః. మూర్ధన్య కర్నాటక మహారాష్ట్ర వంగోత్కల ఆంధ్ర ద్రావిడ దేశీయాః జ్యోతిశ్శాస్త్రనిపుణాః పంచాంగగణక పండితాః న్యాయవేదాంత ధర్మశాస్త్ర పండితాశ్చ జ్యోతిశ్శాస్త్ర విచారార్థ సమ్మిళితాః ఆయనాంశవిషయే ప్రామాణికీం ఏకాం రీతిం నిర్ణేతుం విచారం కృత్వా లతిబాహుశ్చేన చిత్రానక్షత్రమేవ ఆదరవన్తః।

తస్మాదేతదనుసృత్య పంచాంగం ప్రవర్తయతాం శ్రీమతాం దైవజ్ఞభూషణ, గణక చక్రసార్వభౌమ పీడపర్తి సుబ్రహ్మణ్యశాస్త్రిణాం తత్పుత్రాణాం చ శ్రేయస్సంపరా భూయాదిత్యాశాస్మహే।

తస్మైవ ఆస్తికాః ఏతత్పంచాంగానుసారేణ స్వస్వధర్మకార్యాణి కృత్వా శ్రేయస ఎవంవిధాం ప్రాప్నుయురిత్యాశాస్మహే॥

నారాయణస్మృతిః
యాత్రాస్థానం శ్రీ కాళహస్తి క్షేత్రమ్.
పరాభవ సం॥ నిజ శ్రావణ బహుళైకాదశీ।

గరుత్మంతుని శకునము

ప్రయాణ సమయమందు గరుత్మంతుడు కట్టిన యెడల కష్టములు గలుగును. చుట్టినయెడల శుభ ఫలములు గలుగును. తిర్చిన యెడల ధనలాభము గలుగును. (కుడినుండి యెడమకు బోవుట తిర్చుట యనియు, యెడమనుండి కుడికి బోవుట కట్టుట యనియు తెలిసి కొనునది.) ఉదయ కాలమున కనులు తెరచుచుండగనే గరుడపక్షి యే ప్రథమమున గనబడునెడల మిక్కిలి శుభమును, ఆయుర్వృద్ధియును కలుగును.

భారతి –

మన సాహిత్యాన్నీ, సంస్కృతినీ ప్రతిబింబింపజేసే ఉత్తమ మాసపత్రిక వ్యాసాలూ, కవితలూ, కథలూ. ఏది ప్రచురించినా, అది ఒక మచ్చుతునక విశిష్టమైన ప్రమాణాలనుంచి ఏపరిస్థితుల లోనూ దిగజారని రచనల సంపుటి... భారతి ఒకసారి చదివితే మళ్ళీ మీరే చదువుతారు.

శ్రీరస్తు — శ్రీ మహాగణాధిపతయే నమః

శ్రీ మేధా దక్షిణామూర్తి సమేతాయై శ్రీ బాలా త్రిపురసుందర్యై నమః

శ్రీ కీలక నామ సంవత్సర పఞ్చాఙ్గ పీఠికా

అచిన్త్యావ్యక్త రూపాయ నిర్గుణాయ గుణాత్మనే । సమస్త జగదాధారమూర్తయే బ్రహ్మణే నమః ॥౧॥ యంబోదవాంఘ్రిద్వయ మంజుభృఙ్గ శ్రీ సర్వసౌభాగ్యసహా మర్త్యయామః యదర్చయా బ్రహ్మ ముఖామరేశా నిరన్త రాయం సఫలీ కృతార్థాః ॥౨॥ ప్రావృట్పురన్మేఘనిభా భుజంగశయ్యా విభూషా విహగేశ వాహనా । గోపాల మల్లేశ్వర దేవదేవౌ భటే ప్రియాదత్త హృదర్ధదేహా ॥౩॥ వేదమయీం నాదమయీం పరపదోద్య బిందు మయీం । మంత్రమయీం తంత్రమయీం నౌమి విశ్వ విశ్రుత మయీం ॥౪॥

గురు స్తుతిః

ఉచ్చైర్దుర్గహ నిగ్రహం ప్రవితత జ్యోతిః పదైకాశ్రయం విద్యా । గోవర మాహతోరుతమసం త్రయ్యాత్మకం నిస్సమం । శ్రీమన్నోరి కులాగ్రణీ మణి మిమం శ్రీసూర్యనారాయణం । విద్యానం తమిమేవయం శుభధియా నిర్విఘ్న మారాధ్నుమః ॥౫॥ శబ్దాలంకరణాది శాస్త్రచణ మస్మద్దేశికం జ్యోతిషాచార్యం శ్రీ మురళీ ధరాఖ్య సుమహోపాధ్యాయ విద్వద్వరం సిద్ధాన్తార్థ విశేష బోధననిధిం ప్రాజ్ఞోత్తమం సత్కృపం శిష్యేషు ప్రతిభా విశేషమహితం భక్త్యా సదారాధ్నుమః ॥౬॥ దర్భాన్వయాబ్ధి శశినం సత్సాహిత్యాస్మత్పదం జ్యైరాగి శాస్త్రిణం వందేస్మ ద్గురుం శ్రీశుకోపమ్ ॥౭॥ చిలుకూర్యన్వయాబ్ధీందుం శబ్దశాస్త్ర గురూత్తమం । ప్రక్రియా శేషమర్మజ్ఞం వందే కొండయ్యశాస్త్రిణం ॥౮॥

స్వీయ వంశ క్రమః

శ్రీ కౌండిన్యసగోత్రే పిడపర్త్యాఖ్యాన్వయే ప్రసిద్ధతమే । తిస్కంధశాస్త్ర కుశలినో భవన్తి శశ్వద్బహోః కాలాత్ ॥౯॥ చలమాఖ్య వేంకట చలాఖ్యస్తత్ర భవద్విబుధః । యోఽలున్నమాసవిషయక వాదేనా గణయదపిచ విశ్వపతిం ॥౧౦॥ తస్యసుత ప్రత్యర్థి శ్రేష్ఠచర దైవ విత్ప్రవరః జజ్ఞాతే తస్యసుతౌ పూర్ణౌ విద్యాసు పరిపూర్ణౌ ॥౧౧॥ తయోర్జ్యేష్ఠయోఽద్వితీయ ప్రతిభావాన్బుధోత్తమః । శ్రీపూర్ణార్య పుష్కరాది సంప్రాప్త జ్యౌతిర్యశాః ॥౧౨॥ తదనుగ్రహోత్థ విద్యః పంచనుతా న్తస్య కంధవక్త్రసమాః । శ్రీ సుబ్రహ్మణ్య శాస్త్ర్యాఖ్యయోఽహ మేషు మయా ॥౧౩॥ గురువర కరుణావశతః సిద్ధాన్తే కృత్యనిఖిల సంసత్పు స్వమతం తథాప్యక్రియతే పంచాంగం ధర్మకర్మార్హం ॥౧౪॥

వంవత్సరాది కృత్యం

అబ్దాదౌ మిత్ర సంయుక్తో మంగళస్నాన మాచరేత్ । అలంకృతో గణాధ్యక్షం వాణీదైవవిదం గ్రహాన్ ॥౧౫॥ గురూన్ విప్రాంశ్చ సంపూజ్య ముదితో బ్రహ్మజన్మతః । సంవత్సర ఫలం శ్రుత్వా సుస్వతానాం ఫలం లభేత్ ॥౧౬॥ యద్వర్షాదౌ నింబదళం శర్కరామ్ల ఘృతైర్యుతం । భక్షితం పూర్వయామేస్యా త్తద్వర్షం సౌఖ్యదాయకం ॥౧౭॥

బ్రహ్మాయుః ప్రమాణాదికం

బ్రహ్మణః స్వీరమానేన త్రుటికాల ప్రమాణం మా ౫ దిన ౫౭ ఘ ౫౯ విఘ ౪౦ అనకాల ప్రమాణం సం ౪౯ మా ౮ దిన ౫౭ ఘ ౫౯ విఘ ౪౦. నిమేషకాల ప్రమాణం సం ౧౯౮౯ మా ౫ దిన ౫౭ ఘ ౨౦ గుర్వక్షరో చ్చార కాల ప్రమా సం॥ ౪౦ సహస్రాణి॥ ప్రాణకాల ప్రమా సం॥ ౪ లక్షా, విఘటీ ప్రమాణం సం ౨౪ లక్షాః ఘటీ ప్రమాణం సం ౧౪ కోటిం లక్షాః దిన ప్రమాణం ౮౬౪ కో॥సం ఏకాహోరాత్ర ప్రమాణం సం ౭౬౮ కో॥ అనేన బ్రహ్మాయుః స్వీరాబ్దాః ౩౧౧౦౪౦౦౦ కోటయః॥ పర మాపవస్యాస్య బ్రహ్మణః పరాఖ్య స్యాయుషో పూర్వం గతం॥ ద్వితీయ పరార్ధే ప్రథమవర్షే ప్రథమమాసే గత ఘట్యాదయః ఘ ౧౩ విఘ ౨౨ ప్రాణ(౧) గుర్వక్షర ౩ నిమేష ౧౬ అను ౧౨ త్రుటయః ౧౪౮ న ప్రతిసంచ ష్షష్ఠితమే త్రుటికావి గత పర మాసాదయః మా ౧ ౭ ౧౯ ఘటి ౧౮ ఘ ౬ బ్రహ్మణ స్వీరమానేన ఏయోగత వత్సరాః ౧౯౫౫౮౮౫౦౮౭ కో॥ ౯౯ లక్ష ౭౯ సహ ౬౯ ఇదానీం తన శ్వేత వరాహ కల్పే సప్తమే వైవ స్వత మన్వంతరే సప్తవింశతి మహాయుగాని । ఏలాస ఏష్టవింశతి మనూనాం సిన్వమా సే వాయుర్వర్ష మేవ । తచ్చ క సప్తతి మహాయుగ ప్ర॥ సౌరాబ్దాః॥ ౩౦ కో ౬౦ లక్ష॥ ౨౦ సహ॥ తిర్యంపత్స్య ప్రమాణం ౩౦ ౬ ౬౭ సహ ౨౦౦ సం॥ అహోరాత్ర ప్రమాణం ౫౧౪౦ సం॥ అహః ప్రమాణం ౮౬ ౬ సం॥ ఘటీ ప్రమాణం ౧౪ సం॥ వర్తమాన స్యాస్య వైవస్వత మనోః పయోగత వత్సరాః ౧౨ కో ౦ ౬ ౩౬ సహ ౬౯ స్వీర్మాః ౧౭ కో ౬౧ ౬ ౭౬ సహ ౯౩౧ శ్రీ మన్మన్వంతర భగవత్సార పూర్వ్యావతారాబ్దాః ౫౦౮౦ కలిగతాబ్దాః ౫౦౬౯ శ్రీ శాలివాహన శకాబ్దాః ౧౮౯౦ విథవ దిగిలాబ్దాః ౯౧ స్వబ్దాః ౧౯.

వ్యవహార నిరూపణం

